# BANKING THEORY AND PRACTICE

## B.Com (Gen)., Semester-II (Telugu Medium)


### Lesson Writers

**Dr. D. Ramulu**
Reader in Commerce
S.V.K.C Degree College,
Markapuram, Prakasam

**Sri.S. Narahari Kumar**
Lecturer in Commerce
Sarada College,
Vijayawada

**Dr. T. Rosaiah**
Reader in Commerce
V.R.S & Y.R.N College
Chirala

**Dr. C.V. Brahamachari**
Reader in Commerce
B.S.S.B College
Tadikonda, Guntur

**Sri. M. Babu Rao**
Lecturer in Commerce
Hindu College
Guntur

### Editor

**Prof. K. Viyyana Rao,**
**M.Com., M.B.A.,Ph.D., M.I.M.A.,**
Dept. of Commerce and Business Administration
Acharya Nagarjuna University
Nagarjuna Nagar-522510

### Director

**Dr.Nagaraju Battu**
M.H.R.M., M.B.A., L.L.M., M.A. (Psy), M.A., (Soc), M.Ed., M.Phil., Ph.D.
Centre for Distance Education
Acharya Nagarjuna University
Nagarjuna Nagar-522510
Phone No.0863-2346208, 0863-2346222, Cell No.9848477441
0863-2346259 (Study Material)
Website: www.anucde.info
e-mail: anucdedirector@gmail.com

B.Com: Banking Theory and Practice

First Edition: 2021

No. of Copies

©Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of B.Com Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only

Published by

**Dr.Nagaraju Battu**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Printed at

## *FOREWORD*

***Since its establishment in 1976, Acharya Nagarjuna University has been forging ahead in the path of progress and dynamism, offering a variety of courses and research contributions. I am extremely happy that by gaining 'A' grade from the NAAC in the year 2016, Acharya Nagarjuna University is offering educational opportunities at the UG, PG levels apart from research degrees to students from over 443 affiliated colleges spread over the two districts of Guntur and Prakasam.***

***The University has also started the Centre for Distance Education in 2003-04 with the aim of taking higher education to the door step of all the sectors of the society. The centre will be a great help to those who cannot join in colleges, those who cannot afford the exorbitant fees as regular students, and even to housewives desirous of pursuing higher studies. Acharya Nagarjuna University has started offering B.A., and B.Com courses at the Degree level and M.A., M.Com., M.Sc., M.B.A., and L.L.M., courses at the PG level from the academic year 2003-2004 onwards.***

***To facilitate easier understanding by students studying through the distance mode, these self-instruction materials have been prepared by eminent and experienced teachers. The lessons have been drafted with great care and expertise in the stipulated time by these teachers. Constructive ideas and scholarly suggestions are welcome from students and teachers involved respectively. Such ideas will be incorporated for the greater efficacy of this distance mode of education. For clarification of doubts and feedback, weekly classes and contact classes will be arranged at the UG and PG levels respectively.***

***It is my aim that students getting higher education through the Centre for Distance Education should improve their qualification, have better employment opportunities and in turn be part of country's progress. It is my fond desire that in the years to come, the Centre for Distance Education will go from strength to strength in the form of new courses and by catering to larger number of people. My congratulations to all the Directors, Academic Coordinators, Editors and Lesson- writers of the Centre who have helped in these endeavours.***

***Prof. P. Raja Sekhar***
***Vice-Chancellor (FAC)***
***Acharya Nagarjuna University***

**I Year B Com (Gen)- Semester – II**
**Course 2C:Banking Theory and Practice**

Learning Outcomes:
At the end of the course, the student will able to;

- ✤ Understand the basic concepts of banks and functions of commercial banks.
- ✤ Demonstrate an awareness of law and practice in a banking context.
- ✤ Engage in critical analysis of the practice of banking law.
- ✤ Organize information as it relates to the regulation of banking products and services.
- ✤ Critically examine the current scenario of Indian Banking system.
- ✤ Formulate the procedure for better service to the customers from various banking innovations.

**Syllabus:**

Unit-I: Introduction:
Meaning & Definition of Bank – Functions of Commercial Banks – Credit Creation with Examples - Kinds of Banks – Central Banking Vs. Commercial Banking.

Unit-II: Banking Systems:
Unit Banking, Branch Banking, Investment Banking - Innovations in Banking-E banking-Online and Offshore Banking, Internet Banking - Anywhere Banking - ATMs – RTGSNEFT – Mobile Banking

Unit-III: Types of Banks:
Indigenous Banking - Cooperative Banks, Regional Rural Banks, SIDBI, NABARD – EXIM bank

Unit-IV: Banker and Customer:
Meaning and Definition of Banker and Customer – Types of Customers – General Relationship and Special Relationship between Banker and Customer - KYC Norms.

Unit-V: Collecting Banker and Paying Banker:
Concepts - Duties & Responsibilities of Collecting Banker – Holder for Value – Holder in Due Course – Statutory Protection to Collecting Banker - Responsibilities of Paying Banker - Payment Gateways.

**Books for Reference**:

1. Banking Theory: Law &Practice: K P M Sundram and V L Varsheney, Sultan Chand &Sons.
2. Banking Theory, Law and Practice : B. Santhanam; Margam Publications.
3. Banking Theory and Practice, Seven Hills International Publishers, Hyderabad.
4. Banking and Financial Systems: Aryasri, Tata McGraw-Hill Education India.
5. Introduction to Banking :VijayaRaghavan,Excel books.
6. Indian Financial System :M.Y.Khan, McGraw Hill Education.
7. Banking Theory and Practice, Jagroop Singh, Kalyani Publishers.

**Suggested Co-Curricular Activities**:

- Debates
- Student Seminars
- Quiz Programmes
- Visit to Bank premises
- Guest Lecture by Banking Official
- Prepare a statement on periodical declarations of RBI like SLR, REPO etc
- Collection, display and Practicing of filling of different forms used in banks
- Survey on customers satisfaction of Banking services
- Know about KYC norms
- Talk on latest trends in banking industry
- Online Banking
- Individual and group project reports
- Current Affairs of Banking Sector
- Examinations (Scheduled and surprise tests)
- Any similar activities with imaginative thinking beyond the prescribed syllabus

**B.Com (General) DEGREE EXAMINATION, NOVEMBER 2021**

Fist Year- Second Semester

Part-II Banking Theory and Practice

Paper II- BANKING THEORY AND PRACTICE

Tiem: Three hours — Maximum : 70 marks

SECTON A - (5X4 = 20)

Answer any FIVE of the following questions

1. Define Bank and Banking.
   బ్యాంకు మరియు బ్యాకింగ్‌లను నిర్వచింపుము.
2. Write a note on mobile banking.
   మొబైల్ బ్యాకింగ్ పై ఒక వ్యాఖ్య వ్రాయుము.
3. Write a short note on Indigenous banking.
   దేశీయ బ్యాకింగ్ పై ఒక లఘు వ్యాఖ్య వ్రాయుము.
4. Write about KYC.
   KYC గూర్చి వ్రాయుము.
5. Write the benefits of being a holder in due course.
   సరైన సమయంలో హోల్డర్‌గా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను వ్రాయుము.
6. Write a note on industrial banks.
   పారిశ్రామిక బ్యాంకులపై ఒక వ్యాఖ్య వ్రాయుము.
7. Write any five objectives of anywhere banking.
   ఎక్కడైనా బ్యాకింగ్ యొక్క ఏవేని ఐదు లక్ష్యాలను వ్రాయుము.
8. Write about SIDBI.
   SIDBI గూర్చి వ్రాయుము.

SECTION B - (5 X 10 = 50 marks)

Answer FIVE questions.

9. (a) Explain the functions of commercial bank.
   వాణిజ్య బ్యాంకుల యొక్క విధులను వివరింపుము.

   Or

   (b) Explain the process of credit creation with suitable examples.
   పరపతి సృష్టి ప్రక్రియను సహోదరణములతో వివరింపుము.
10. (a) Explain the recent innovations in banking.
   బ్యాకింగ్‌లో ఇటీవలి ఆవిష్కరణలను వివరింపుము.

   Or

   (b) Explain advantages and limitations of branch banking.
   బ్రాంచి బ్యాకింగ్ యొక్క ప్రయోజనాలు మరియు పరిమితులను వివరింపుము.
11. (a) Explain the role of NABARD in developing rural economy.
   గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో నాబార్డు యొక్క పాత్రను వివరింపుము.

   Or

   (b) Explain the importance of co-operative banks.
   సహకార బ్యాంకుల యొక్క ప్రాముఖ్యతను వివరింపుము.

12. (a) Explain the general relationship between banker and customer.

బ్యాంకరు మరియు ఖాతాదారు మధ్య గల సాధారణ సంబంధములను వివరింపుము.

Or

(b) Explain about various types of customers.

వివిధ రకాల ఖాతాదారుల గూర్చి వివరింపుము.

13. (a) Explain the responsibilities of collecting banker.

వసూలు బ్యాంకరు యొక్క బాధ్యతలను వివరింపుము.

Or

(b) Explain the statutory proction availble to paying banker.

చెల్లింపు బ్యాంకరుకు అందుబాటులో గల శాసనాత్మకమైన రక్షణను వివరింపుము.

# BANKING THEORY AND PRACTICE

## CONTENTS


| | Pg. No |
|---|---|
| Lesson 1 : Types of Banks | 1.1-1.13 |
| Lesson 2 : Banking Systems in India | 2.1-2.10 |
| Lesson 3 : Commercial Banking in India | 3.1-3.19 |
| Lesson 4 : Banking Sector Reforms | 4.1-4.20 |
| Lesson 5 : Indigenous Bankers | 5.1-5.6 |
| Lesson 6 : Reserve Bank of India | 6.1-6.16 |
| Lesson 7 : Co-operative Banks | 7.1-7.13 |
| Lesson 8 : Exchange Banks | 8.1-8.6 |
| Lesson 9 : Development of Financial Institutions | 9.1-9.12 |
| Lesson 10 : Indian Money Market | 10.1-10.11 |
| Lesson 11: Indian Capital Market | 11.1-11.17 |
| Lesson 12: Banker and Customer | 12.1-12.10 |
| Lesson 13: Special Accounts | 13.1-13.9 |
| Lesson 14: Negotiable Instruments Act-1881 | 14.1-14.17 |
| Lesson 15 : Liabilities of Banker | 15.1-15.8 |
| Lesson 16: Loans and Advances | 16.1-16.14 |
| Lesson 17: Advances Against Collateral Securities | 17.1-17.22 |

పాఠం - 1

# బ్యాంకింగ్ - విత్త వ్యవస్థలు

## Banking - Financial Systems

**లక్ష్యాలు (Objectives) :**

ఈ లెసన్‌లో బాంకింగ్ పుట్టు పూర్వోత్తరాలు, బాంకుల అభివృద్ధి తెలుసుకోవడం,

- బ్యాంకులలో రకాలు తెలుసుకోవడం
- వాణిజ్య బాంకుల విధులను తెలుసుకోవడం
- బాంకింగ్ స్వభావం, ధోరణులను అవగాహన చేసుకోవడం

**అంశాలు :**

**1.1 బ్యాంకింగ్ - పుట్టు పూర్వోత్తరాలు**
**1.2 బ్యాంకు నిర్వచనం**
**1.3 బ్యాంకుల అభివృద్ధి**
**1.4 బ్యాంకులలో రకాలు**
**1.5 వాణిజ్య బాంకులు విధులు**
**1.6 అభివృద్ధి బాంకులు - విధులు**
**1.7 సహకార బాంకుల రకాలు**
**1.8 బ్యాంకింగ్ ధోరణులు - స్వభావం**
**1.9 తెలుసుకోవలసిన ప్రశ్నలు**
**1.10 పదకోశం**

## 1.1 బ్యాంకింగ్ - పుట్టు పూర్వోత్తరాలు (Banking origin) :

బ్యాంకింగ్ వ్యాపారం ప్రపంచంలో ప్రాచీన కాలం నుండి యున్నది. అది ఒక విశిష్టమైన వ్యాపారమని చెప్పవచ్చును. ఉత్పాదక సంస్థలు వస్తు సామగ్రిని ఉత్పత్తి చేసి, వాటిని అమ్మి లాభాలను ఆర్జిస్తాయి. అయితే బాంకులు వ్యాపారం చేసే సరకు ద్రవ్యం లేదా డబ్బు పొదుపు చేసేవారి నుండి ద్రవ్యాన్ని స్వీకరించి ఆ ద్రవ్యాన్ని పెట్టుబడులు, రుణాల రూపేణా ప్రజలకు అందజేసి లాభాలను ఆర్జించే సంస్థలు బాంకులు. అందువల్లనే ఆర్.ఎస్. సేయర్సు బాంకులను ద్రవ్యంతో వ్యాపారం సాగించి లాభాలు పొందే సంస్థలతో పోల్చినాడు. ద్రవ్యాన్ని ఒకరినుండి మరొకరికి తరలించడం మాత్రమే బ్యాంకులపని అయితే వాటియెడ మనకు అంత ఆసక్తి ఉండేదికాదు - నిద్రాణంగా వున్న పొదుపులను సమీకరించి, ఉత్పాదక సంస్థలకు, వ్యక్తులకు రుణాలను మంజూరు చేసే ప్రక్రియను బాంకులు ద్రవ్యాన్ని సృష్టిస్తాయి. ద్రవ్యాన్ని సృష్టించే శక్తి యుండటం వల్ల బాంకులు ఉత్పత్తి, ధరల స్థాయిలను ప్రభావితం చేయగలవు.

ప్రపంచంలోని వివిధ దేశాలలో పూర్వకాలం నుండి బ్యాంకింగ్ విభిన్న రూపాలలో అమలులో ఉన్నట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. క్రీ.పూ. 2000 సం॥ముల క్రితమే బాబిలోనియాలో అభివృద్ధి చెందిన బాంకింగ్ వ్యవస్థ అమలులో ఉండేది. ప్రాచీన గ్రీకు, రోమ్ దేశాలలో విస్తృతమైన పరపతి సౌకర్యాలు అందుబాటులో యుండేవి. అక్కడ కొన్ని బ్యాంకులు వాటంతట అవే ఏర్పడగా మరికొన్ని బాంకులు పన్నులు వసూలు చేయడానికి ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడినవి. భారత దేశంలో కూడా వేదకాలం నుండి బాంకింగ్ వ్యవస్థ అమలులో యున్నట్లు “మను న్యాయశాస్త్రం” ద్వారా తెలియుచున్నది. మను తన పుస్తకంలో పరపతికి సంబంధించిన న్యాయ వ్యవహారాలు, బాంకింగ్

రుణాలపై వడ్డీ, వాణిజ్య పత్రాలు మొదలైన నిబంధనల గురించి విపులంగా పేర్కొన్నారు- అయితే వాస్తవానికి ఆ రోజుల్లో బాంకింగ్ అంటే అప్పు ఇవ్వడమేకాని, ప్రస్తుతం అమలులో ఉన్న క్లిష్టమైన బాంకింగ్ వ్యవస్థలేదు.

బాంకు అనే పదం మధ్యయుగంలో ఇటలీలో వెనిస్‌బాంక్ ప్రారంభించినపుడు మొదటి సారిగా వాడుకలోనికి వచ్చింది. క్రీ.శ. 1157లో బాంక్ ఆఫ్ వెన్నిస్ ప్రభుత్వ రంగ సంస్థగా రూపు దిద్దుకొంది. అప్పుడు ఇటలీలో ఎక్కువభాగం జర్మన్‌లదే ఆధిపత్యం. క్రీ.శ. 1174లో వెనిస్ ప్రభుత్వం యుద్ధంలో తలమునకలైనపుడు ద్రవ్యం అవసరమై ప్రజల నుండి వడ్డీకి అప్పు తీసుకొన్నది. ఈ ఉమ్మడి ద్రవ్యనిధికి ఇటలీ భాషలో 'మాంటి' (Monte) అని పేరు. దీనికి జర్మనీ భాషలో పర్యాయపదం 'బాంక్' (Bank), జర్మన్ల ఆధిపత్యం వల్ల ఈ పదం వాడుకలోనికి వచ్చింది. ఇటలీ భాషలో దీన్ని బాంకో (Banco) అంటారు. ఫ్రెంచి భాషలో ఇది బాంకి (Banke) అయింది. ఆంగ్లంలో బాంకి, బాంక్‌గా ఆవిర్భవించింది. ఆధునిక కాలంలో బాంకింగ్ వ్యాపారం మొదట 1349లో బార్సిలోనులో ప్రారంభమైనదని చెప్పవచ్చును. అక్కడ బాంకులు ప్రభుత్వ నియంత్రణకు లోబడి తమ కార్యకలాపాలు నిర్వహించేవి. దేశ విదేశ ద్రవ్య మార్పిడి, డిపాజిట్ల సేకరణ, హుండీల డిస్కౌంటు మొదలైన లావాదేవీలను అక్కడ బాంకులు నిర్వహించేవి. 1407లో "జనోవా బాంకు" ప్రారంభమయింది. 1609లో అమ్‌స్టర్ అను బాంక్ ప్రారంభింపబడింది. ఈ బాంకు అన్ని రకాల డిపాజిట్లను స్వీకరించేది.

క్రౌథర్ (Crowther) మహాశయుని అభిప్రాయంలో ఆధునిక బాంకుల ఆవిర్భావం మూడు కారణాలవల్ల జరిగిందని చెప్పవచ్చును.

**1) వర్తక బాంకర్లు** (Merchant Bankers) : వీరు ప్రాథమికంగా వర్తకులు. వీరు ఖాతాదార్లు తమ దగ్గర నమ్మకంగా భద్రపరచిన ద్రవ్యాన్ని స్వీకరించి వాటి విలువకు సమానమైన పత్రాలు ఇచ్చేవారు - ప్రజలు ఈ పత్రాలను ఆమోదించేవారు - ఖాతాదార్ల సొమ్మును వీరు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలించడంలో ఉపయోగపడేవారు - ఆధునిక బాంకింగ్ వ్యవస్థ రూపు దిద్దుకొనే సమయంలో వర్తక బాంకర్ల కృషి శ్లాఘనీయం.

**2) వడ్డీ వ్యాపారులు** (Money Lenders) : వీరు తమ వద్ద ఉన్న మిగులు ద్రవ్యాన్ని వడ్డీపై ఇతరులకు రుణాలిచ్చేవారు - స్వర్ణకార్లు, తమ ఖాతాదార్లు రోజూ తమ వద్ద డిపాజిట్ల రూపంలో దాచే సొమ్మును మరియు వారు విత్ డ్రా చేసే సొమ్ము పోల్చి చూడగా వారికి డిపాజిట్లకంటే విత్ డ్రా చేసే సొమ్ము ఎక్కువ కాదని తేలింది. దాంతో వారు కొద్దిపాటి కనిష్ఠ నిల్వతో వ్యాపారాన్ని నిర్వహించవచ్చని, ఆధునిక బాంకింగ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు.

**3) స్వర్ణకారులు** (Gold Smith) : వీరు తమ ఖాతా దార్లకు సంబంధించిన విలువైన బంగారు, వెండి ఆభరణాలను భద్రంగా దాచి వాటి విలువకు సమానమైన రసీదులు ఇచ్చేవారు - వీరు లండన్ బాంకింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆ రోజుల్లో ద్రవ్యం అంటే బంగారం, వెండి నాణేలు మాత్రమే. ఈ స్వర్ణకారులు జారీ చేసిన రశీదులతో ఖాతాదార్లు వర్తకం చేసేవారు - సరుకు కొనుగోలు మరియు అమ్మకం చేసే సందర్భాలలో స్వర్ణ కారుల పత్రాలను గిడ్డంగి రసీదులతో (Warehouse Receipts) మార్చుకొని వ్యాపార లావా దేవీలను నడిపేవారు.

ఇప్పటికి, ఆధునిక బాంకులలో కూడా పై మూడు లక్షణాలు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. నేటి బాంకర్లు వర్తకుల వలె ఖాతాదార్లకు రుణాలు ఇస్తాయి. వడ్డీ వ్యాపారం వలె వ్యాపారం చేస్తాయి. స్వర్ణకార్లవలె బంగారు ఆభరణాలు, సెక్యూరిటీలను తనఖాగా పెట్టుకొని రుణాలు ఇస్తున్నాయి. 1694లో స్థాపించిన ఇంగ్లండ్ బాంకు (Bank of England) ఆధునిక బాంకింగ్ వ్యవస్థకు అంకురార్పణగా చెప్పవచ్చును. బాంకింగ్ వ్యవస్థ అనాదిగా అమలులో ఉన్నప్పటికి, మారుతున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా బాంకింగ్ స్వరూప స్వభావాలు, లక్షణాలలో ఎన్నో మార్పులు వచ్చాయి.

## 1.3 బాంకు నిర్వచనం (Definition of Bank) :

బాంకులు ఆర్థిక సంస్థలు దేశ ఆర్థిక ప్రగతికి ఎంతో సహాయపడతాయి. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో వర్తక వాణిజ్య పరిశ్రమల అభివృద్ధికి ఇవి ఎంతో తోడ్పడుతున్నాయి. దేశ సౌభాగ్యానికి, ఆర్థిక పురోగతికి, సంక్షేమానికి బాంకులు పట్టుకొమ్మలు. అవి ఎన్నో రకాల విధులు, సేవలు అందిస్తాయి. మారుతున్న సామాజిక వ్యవస్థకు అనుగుణంగా బాంకింగ్ వ్యవస్థలో అనుక్షణం మార్పులు వస్తున్నాయి.

అందు చేత బాంకు, బాంకింగ్‌లను సమగ్రంగా నిర్వహించడం చాలా కష్టం. చాలా మంది శాస్త్రవేత్తలు అనేక నిర్వచనాలను ఇచ్చినారు. వాటిలో కొన్నింటిని క్రింద వివరించడం జరిగింది.

**1) డా॥ హెర్బర్ట్ ఎల్. హార్ట్** (Dr. Herbert L. Heart) ప్రకారం "సాధారణ వ్యాపార సరళిలో వ్యక్తులు జమకట్టే సొమ్మును వారి పేర కరెంటు ఖాతాలో జమకడుతూ ఆయా వ్యక్తులు తమ మీద జారీచేసిన, చెక్కులను ఆదరిస్తూ సొమ్ము చెల్లించేవానిని బాంకరు అనవచ్చును" ఈ నిర్వచనం ప్రకారం కరెంటు డిపాజిట్లను స్వీకరిస్తూ ఆయా డిపాజిట్లపై జారీ చేసిన చెక్కులను ఆదరించే సంస్థ బాంకింగ్ సంస్థ అవుతుంది.

**2) సర్ జాన్ పేజెట్** (Sir John Paget) ప్రకారం "రకరకాల డిపాజిట్లను స్వీకరించడం, వాటిమీద చెక్కులు చెల్లించడం క్రాస్ చేసిన లేదా క్రాస్ చేయని చెక్కులను ఖాతాదారుల తరపున వసూలు చేయడం బాంకరు విధిగా చేయవలసిన పనులు" ఈ వసూలును చేయనివారిని బాంకరు అని అనడానికి వీలులేదు.

3) ఆర్.ఎస్. సేయర్సు మహాశయుని ప్రకారం "ఏ సంస్థగల డిపాజిట్లను, తన ఖాతాదారులు రుణాల వసూళ్ళు మరియు చెల్లింపులకు ఉపయోగిస్తారో ఆ సంస్థనే బాంకు" అని అంటారు. బాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలోని సెక్షన్ 5 (బి) బాంకింగ్‌ను క్రింది విధంగా నిర్వచించినది. "ఖాతాదార్ల డిమాండుపై చెక్కు ద్వారాగాని, డ్రాఫ్టు ద్వారాకాని, మరేదైనా పత్రం ద్వారా గాని తిరిగి వారికి చెల్లించే షరతు మీద డిపాజిట్లు స్వీకరించి, ఆ సొమ్మును రుణాలు ఇవ్వడానికిగాని, పెట్టుబడి కోసం గాని ఉపయోగించడం బాంకింగ్ వ్యాపారం" అంటారు. స్థూలంగా చెప్పాలంటే బాంకు క్రింది లక్షణాలు కల్గి ఉంటుంది.

ఎ) ఇది ద్రవ్యాన్ని డిపాజిట్ల రూపంలోను అంగీకరించి, అవసరమైన వారికి రుణాల రూపేణా అందజేస్తుంది.

బి) ఇది పరపతిని సృష్టిస్తుంది. చెక్కుల పద్ధతిని ప్రవేశపెట్టి, డిపాజిట్లను నగదులోనికి, వ్యక్తుల మధ్య మార్పు చేస్తుంది.

సి) ఇది డిమాండు డిపాజిట్లను సృష్టించే చెల్లింపుల మార్పిడికి సహాయకారిగా వ్యవహరిస్తుంది. ఇది లాభాలను ఆర్జించుటకు వ్యాపార వ్యవహారాలు జరుపుతుంది.

## 1.4 బాంకుల అభివృద్ధి (Banks' Growth) :

బారతదేశంలో బాంకింగ్ వ్యాపారం అనాది నుండి ఉన్నది. వివిధ అప్పుల మీద ఎలా వడ్డీలు విధించాలో కౌటిల్యుని అర్థ శాస్త్రంలో వివరింపబడినది. దేశీయ బాంకర్లు ప్రజల నుండి డిపాజిట్లు అంగీకరించేవారు - హుండీల ద్వారా ఒకచోట నుండి మరొక చోటుకు ద్రవ్యాన్ని పంపే ఏర్పాటు చేసేవారు - పెద్ద పెద్ద మార్వాడీలు భారీ యెత్తున బాంకింగ్ వ్యాపారం చేసేవారు - వీరికి కొన్ని పట్టణాలలో కార్యాలయాలు ఉండేవి. బ్రిటీష్‌వారు మన దేశంలో ఒకే కరెన్సీ ప్రవేశపెట్టినారు. దీనివల్ల సరైన ఆధునిక పద్ధతులలో మన బాంకింగ్ వ్యవస్థ అభివృద్ధి చెందుటకు నాంది ఏర్పడింది. బ్రిటన్ దేశంలో వాణిజ్య బాంకులు తొలిసారిగా వెలిసాయి. ఈనాటికి బాంకింగ్ వ్యవస్థకు పుట్టినిల్లు బ్రిటన్. మన దేశంలో 1770లో మొట్టమొదట బాంకు "హిందూస్థాన్ బాంకు"ను స్థాపించారు. దీనికి సరియైన వ్యాపారం లేనందున 1832లో మూసివేశారు. 1860లో పరిమిత బాధ్యతతో బాంకులు స్థాపించుటకు చట్టం వీలు కలుగజేయడం వల్ల ఆనాటినుండి బాంకింగ్ వ్యవస్థ పురోగతి మొదలైందని చెప్పవచ్చును.

యూరోపియన్ వర్తకుల కోసం, బ్రిటీష్ ఏజెన్సీ హౌస్‌లు మన దేశంలో అంతకు ముందే కొన్ని బాంకులు స్థాపించారు. కలకత్తా, మద్రాసు, బొంబాయి నగరాలలో బాంకులు స్థాపించారు - వీటిని ప్రెసిడెన్సీ బాంకులు" అంటారు. ఈ బాంకులకు ఈస్ట్ ఇండియా కంపెనీ మద్దతు ఇచ్చింది. ఈ బాంకులు ఇతర దేశాలలో బ్రాంచీలు కూడా స్థాపించారు. ఈ మూడు ప్రెసిడెన్సీ బాంకులే 1920లో విలీనమై ఇంపీరియల్ బాంకు ఆఫ్ ఇండియాగా పొందింది. ఇదే బాంకు తర్వాత 1955లో స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియాగా మారింది. మన దేశంలో ఆ కాలంలో స్వదేశీ ఉద్యమం మొదలై ఎన్నో స్వదేశీ బాంకుల స్థాపనకు, అభివృద్ధికి కారణమైంది. అయితే 1913 నుండి 1939 మధ్య మన దేశంలో చాలా బాంకులు పతనమై మూతపడినాయి. తక్కువ మూలధనం, అనుభవంలేని యాజమాన్యం, దేశంలో కేంద్ర బాంకు లేకపోవడం మొదలైనవి ఈ పతనానికి కారణాలు.

రెండవ ప్రపంచ సంగ్రామం (1939-45) మన దేశంలో గల బాంకింగ్ అభివృద్ధిపై చాలా ప్రభావం కలిగించింది. బాంక్‌ల సంఖ్య, బ్రాంచీల సంఖ్య బాగా పెరిగాయి. యుద్ధావసరముల నిమిత్తం దేశంలో ఎక్కువ ద్రవ్యం చెలామణిలోకి వచ్చింది. బాంకులు కూడా ఎక్కువ ద్రవ్య సృష్టి చేయడం జరిగింది. బాంకుల డిపాజిట్లు పెరిగాయి. పెట్టుబడులు, రుణాలు పెరిగాయి. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, బాంకింగ్ పురోభివృద్ధిని సంఘటిత పరచడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగింది. 1935లో స్థాపింపబడ్డ రిజర్వు బాంకును 1949లో జాతీయం చేశారు. 1949లో భారత బాంకింగ్ కంపెనీల చట్టాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ చట్టం మన దేశంలో గల బాంకింగ్ వ్యాపారంలో ఒక నూతన పరిణామం తీసుకొచ్చింది. దీనివల్ల రిజర్వు బాంకుకు ఎక్కువ అధికారాలు యివ్వడం, ఇతర బాంకుల మీద అనేక ఆంక్షలు పెట్టడం జరిగింది.

భారత ప్రభుత్వం 1995లో ఇంపీరియల్ బాంకు (ఇతర అనుబంధ బాంకులను) జాతీయంచేసి స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేసింది. దీనివల్ల దేశంలోగల మూడవ వంతు వాణిజ్య బాంకు ప్రభుత్వ అజమాయిషీలోనికి వచ్చింది. 1956లో ఆర్.బి.ఐ. చట్టాన్ని సవరించడం, 1969లో 14వాణిజ్య బాంకులను, 1980లో 6 బాంకులను జాతీయం చేయడం వల్ల దేశంలో బాంకింగ్ వ్యవస్థలో వినూత్నమైన మార్పులు చోటుచేసుకొన్నాయి.

తద్వారా దేశంలోని 90% వనరులు ప్రభుత్వ బాంకులలోకి వచ్చాయి. ఆనాటినుండి బాంకు డిపాజిట్లు పెరగనారంభించాయి. బ్రాంచీల విస్తరణ పెద్ద ఎత్తున జరిగింది. పరిమాణంలోను, విస్తరణ, అభివృద్ధిలోను బాంకులు శ్లాఘనీయమైన పాత్రను పోషించుచున్నాయి.

**బాంకులలో రకాలు** (Types of Banks) : ప్రతి దేశంలోను అనేక రకాల బాంకులు పని చేస్తున్నాయి. ప్రతి రకానికి చెందిన బాంకులు ప్రత్యేకంగా కొన్ని విధులను నిర్వహిస్తాయి. బాంకులు నిర్వహించే విధులు ఆధారంగా అవి ఏ కోవకు చెందుతాయో నిర్ణయించడం జరుగుతుంది. అన్ని రంగాలలో ఉన్నట్లే, బాంకులలో కూడా ప్రత్యేకీకరణ ఉన్నది. అవి నిర్వహించే విధులను బట్టి బాంకులను క్రింది విధంగా వర్గీకరింపవచ్చును.

1) కేంద్ర బాంకులు (Central Banks)
2) వాణిజ్య బాంకులు (Commercial Banks)
3) అభివృద్ధి బాంకులు (Development Banks)
4) సహకార బాంకులు (Cooperative Banks)

**1) కేంద్ర బాంకులు :** దేశంలోని బాంకింగ్ వ్యవస్థను అదుపు ఆజ్ఞలలో పెట్టడానికి ఒక కేంద్ర బాంకు ఉంటుంది. ప్రతి దేశంలో ఒక కేంద్ర బాంకు ఉండును - ఇంగ్లండులో బాంక్ ఆఫ్ ఇంగ్లండు, ఫ్రాన్సులో బాంక్ ఆఫ్ ఫ్రాన్సు, మన దేశంలో రిజర్వు బాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర బాంకులు మొదటలో కేంద్ర బాంకులు ప్రయివేటు యాజమాన్యంలో ప్రారంభించినప్పటికి, రాను రాను చాలా దేశాలలోని కేంద్ర బాంకులు ప్రభుత్వ యాజమాన్యంలోనే నిర్వహింపబడుచున్నవి. దేశానికి తగిన కరెన్సీ పద్ధతిని నిర్వహిస్తూ దేశంలోని బాంకింగ్ స్వరూపాన్ని పెంపొందిస్తూ క్రమ బద్ధం చేసే ఆర్థిక సంస్థే కేంద్ర బాంకు. దేశ ఆర్థిక వ్యవస్థలోను, ద్రవ్య మార్కెట్‌లోను కేంద్ర బాంకు కీల స్థానాన్ని ఆక్రమించి ఉన్నది. బాంకింగ్ వ్యవస్థకు కేంద్ర బాంకు తలమానికం వంటిది. అందుచేతనే చాలా దేశాలలో కేంద్ర బాంకులు జాతీయం చేయబడ్డాయి. కేంద్ర బాంకులు వాణిజ్య బాంకులవలె లాభాపేక్షతో పనిచేయవు. దేశంలో ద్రవ్య, ఆర్థిక స్థిరత్వాన్ని కలుగజేసి దేశ సౌభాగ్యాన్ని పెంపొందించుటయే కేంద్ర బాంకు యొక్క లక్ష్యం. వివిధ దేశాల ఆర్థిక పురోగతిలోను, ఆర్థిక వ్యవస్థలోను ఉండే తేడాలను బట్టి, వివిధ దేశాల్లోని కేంద్ర బాంకులు నిర్వర్తించవలసిన విధుల్లోను, అవలంబించే విధానాల్లోను, అనుసరించే పద్ధతులలోను భేదాలుంటాయి. అయితే అన్ని కేంద్ర బాంకులు నిర్వహించు ముఖ్య విధులు మాత్రం ఒక్కటే.

**కేంద్ర బ్యాంకు విధులు:** ప్రతి దేశంలో కేంద్ర బాంకులను కొన్ని ప్రత్యేకమైన విధుల నిర్వహణ కోసం స్థాపించారు. సాధారణంగా వాణిజ్య బాంకులు నిర్వహించే విధులను కేంద్రబాంకులు నిర్వహించవు. కేంద్ర బాంకుల దేశపురోగతికి, ప్రజల శ్రేయస్సుకు అవసరమైన చర్యలు తీసుకొంటాయి. ఇటీవలి కాలంలో కేంద్ర బాంకింగ్ విధులలో అనేక మార్పులు వచ్చాయి. అదివరలో కేంద్రబాంకు ద్రవ్యసంబంధమైన

విధులను చేపట్టేవి. అయితే ప్రస్తుతం మారుతున్న లక్ష్యాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి కృషి చేయడం వాటి ప్రధాన విధిగా మారుతుంది. కేంద్రబాంకు నిర్వహించే విధులను క్రింద పేర్కొనడం జరిగింది.

1. కరెన్సీ నోట్లను జారీ చేయడం
2. ప్రభుత్వానికి బాంకరుగా, ఏజెంటుగా, సలహాదారునిగా పనిచేయడం
3. బాంకులకు బాంకుగా పనిచేయడం
4. బాంకులు సృష్టించే పరపతిని నియంత్రించడం.
5. దేశంలో ఉన్న లోహనిల్వలను, విదేశీ మారకపు నిల్వలను పరిరక్షించడం
6. అంతిమ రుణదాతగా వ్యవహరించడం
7. ప్రభుత్వ ద్రవ్య విధానాన్ని అమలు పరచుట

**2) వాణిజ్య బాంకులు:** బాంకులు, ఆర్థిక సంస్థలు దేశ ఆర్థిక ప్రగతికి పునాదిలాంటివి. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో బాంకులు ప్రముఖమైన పాత్రను పోషిస్తున్నాయి. దేశ సౌభాగ్యానికి, ఆర్థిక పురోగతికి ఇవి ఎంతగానో తోడ్పడుతున్నాయి. సేయర్స్ మహాశయుని ప్రకారం "ఏ సంస్థ వద్దగల డిపాజిట్లను తన ఖాతాదారులు రుణాల వసూళ్ళు మరియు చెల్లింపులకు ఉపయోగిస్తారో ఆ సంస్థనే బాంకు" అని అంటారు. బాంకింగ్ రెగ్యులేషన్ చట్టంప్రకారం "ఖాతాదార్ల డిమాండుపై చెక్కు ద్వారాగాని, డ్రాఫ్టుద్వారాగాని, మరేదైనా పత్రం ద్వారాగాని తిరిగి వారికి చెల్లించే షరతుమీద డిపాజిట్లు స్వీకరించి, ఆ సొమ్మును రుణాలు ఇవ్వడానికి గాని, పెట్టుబడికోసంగాని ఉపయోగించడం బాంకింగ్ వ్యాపారం" అంటారు.

స్థూలంగా చెప్పాలంటే బాంకుకు క్రింది లక్షణాలు ఉంటాయి.

1. ఇది ద్రవ్యాన్ని డిపాజిట్ల రూపంలో అంగీకరించి, అవసరమైన వారికి రుణాల రూపంలో అందజేస్తుంది.
2. ఇది పరపతిని సృష్టిస్తుంది. చెక్కుల పద్ధతిని ప్రవేశపెట్టి డిపాజిట్లను నగదులోనికి వ్యక్తుల మధ్య మార్పు చేస్తుంది.
3. ఇది లాభాలను ఆర్జించాలనే ధ్యేయంతో స్థాపితమైన వాణిజ్య సంస్థ.
4. ఇది డిమాండు డిపాజిట్లను సృష్టించి చెల్లింపుల మార్పిడికి సహాయకారిగ వ్యవహరిస్తుంది.

వాణిజ్య బాంకులు నిర్వహించే విధులను స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చును. అవి 1). ప్రాథమిక విధులు. 2). ఆనుషంగిక విధులు, సేవలు-

**1. ప్రాథమిక విధులు:** ప్రజలనుండి డిపాజిట్లను స్వీకరించడం అవసరమైన వారికి రుణాలు అందజేయడం, ద్రవ్యాన్ని సృష్టించడం బాంకుల యొక్క ప్రాథమిక విధులు, వీటిని క్రింద వివరించడమైనది.

**(ఎ) డిపాజిట్లను స్వీకరించడం:** బాంకులు ప్రజల వద్దనుండి, వర్తకులనుండి మిగులు డబ్బును డిపాజిట్ల రూపంలో అంగీకరించి తిరిగి, ఆ సొమ్మును పరపతిరూపములో ఎక్కువ వడ్డీకి అవసరమైన వ్యక్తులకు గాని, సంస్థలకుగాని అందజేసి లాభంపొందుతాయి. సంఘంలోని అన్ని వర్గాల వ్యక్తులనుండి వారి శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా డిపాజిట్లు సేకరించేందుకు బాంకులు వివిధ రకాల డిపాజిట్ ఖాతాలు నిర్వహిస్తాయి - వివిధ రకాల డిపాజిట్లు క్రింది విధంగా ఉంటాయి.

1. ఫిక్సెడ్ డిపాజిట్లు
2. కరెంటు డిపాజిట్లు

3. సేవింగ్స్ డిపాజిట్లు

4. రికరింగ్ డిపాజిట్లు

5. హోమ్ సేఫ్ డిపాజిట్లు

**(బి) రుణాలు మంజూరు చేయడం:** బాంకరు యొక్క ముఖ్యమైన విధులలో రెండవది అవసరమున్న వ్యక్తులకు లేదా సంస్థలకు రుణాలు లేక అడ్వాన్సులు అందజేయడం. ప్రతి బాంకు కనిష్ట రిజర్వు నిల్వను రిజర్వు బాంకువద్ద డిపాజిట్ చేసిన తర్వాత మిగిలిన మొత్తాన్ని రుణాల రూపంలో అందజేస్తుంది. బాంకులు అందజేసే వివిధ రుణాలు క్రింది విధాలుగా ఉంటాయి.

1. పిలుపు ద్రవ్యరుణం
2. క్యాష్ క్రెడిట్
3. ఓవర్ డ్రాఫ్టు
4. హుండీలను డిస్కౌంటు చేయుట
5. కాలపరిమితిగల రుణాలు

**2. అనుషంగిక విధులు, సేవలు :** బాంకులు అందజేసే ఈ సేవలను రెండు రకాలుగా విభజింపవచ్చును. 1. ఏజన్సీ విధులు, 2. సాధారణ ప్రజోప యోగ విధులు వీటిని క్రింద వివరించడం జరిగింది.

**1. ఏజన్సీ విధులు:** ఈ సేవలు బాంకుల ప్రాథమిక విధుల నిర్వహణ ఫలితంగా ఏర్పడతాయి. ఈ సేవలు నిర్వహించేటప్పుడు బాంకులు ఖతాదార్ల ప్రతినిధులుగా వ్యవహరిస్తాయి. ఏజన్సీ విధులు క్రింది విధంగా ఉంటాయి.

- ఖాతాదార్ల తరపున ఏజంట్లుగా, కరెస్పాండెంటులుగా ప్రతినిధులుగా బాంకులు వ్యవహరిస్తాయి.
- ఖాతాదారుల తరపున భీమా ప్రీమియంలు, క్లబ్ చందాలు, టెలిఫోన్ బిల్లులు, మొదలైన వాటిని నిర్ణీతకాలంలో చెల్లించవలసినదిగా బాంకులను ఆదేశిస్తే బాంకులు ఆ సమయాల్లో చెల్లిస్తాయి.
- సెక్యూరిటిలను కొనుగోలు, అమ్మకాలు చేయడం
- ఖాతాదార్లు జారీచేసిన ఉత్తర్వులను అమలు చేయడం
- తమ ఖాతాదార్లకు ఆదాయపు పన్ను ప్రణాళికలు తయారు చేయడం
- ఖాతాదార్ల తరపున పరపతి పత్రాలపై వసూలు చేయుట, చెల్లింపులు చేయుట.

**2. సాధారణ ప్రజోపయోగ విధులు:** వాణిజ్య బాంకులు ఏజన్సీ విధులతో పాటు ఈ క్రింది సాధారణ ఉపయోగిక విధులను కూడా తమ ఖాతాదారులకు నిర్వహిస్తాయి.

- విలువైన వస్తువులను, ఆభరణాలను మరియు పత్రాలను భద్రపరచుకొనుటకై సేఫ్ డిపాజిట్ లాకర్ల సౌకర్యం కల్పించుట
- దూర ప్రాంతాలకు ప్రయాణమై వెళ్ళినపుడు దొంగల భయం ఉండకుండా ప్రయాణీకుల చెక్కుల, డ్రాఫ్టు సౌకర్యం కల్గించుట
- విదేశీ వర్తకాభివృద్ధి పరపతి లేఖలను జారీచేయుట
- వ్యాపారాభివృద్ధికై బాంకులు రకరకాలుగా సుంకాలను సేకరించుట
- వివిధ కంపెనీలు జారీ చేసే సెక్యూరిటీలను బాంకులు చందాపూచీకై బాధ్యత తీసుకొనుట మొదలైనవి.

**అభివృద్ధి బాంకులు :** పరిశ్రమలకు దీర్ఘకాలిక ఆర్థిక సహాయాన్ని అందించే ఉద్దేశ్యంతో అభివృద్ధి బాంకులను స్థాపించడం జరిగింది. పరిశ్రమలకు స్థిరాస్థుల సేకరణ నిమిత్తం స్థిరమూలధనం, రోజువారి కార్యకలాపాల నిర్వహణకు చరమూలధనం అవసరమవుతాయి. సాధారణంగా వాణిజ్య బాంకుల స్వల్పకాలిక చరమూలధనాన్ని మాత్రమే సమకూరుస్తాయి. అభివృద్ధి బాంకులు పరిశ్రమలకు కావలసిన స్థిరమూలధనాన్ని దీర్ఘకాలిక ప్రాతిపదికపై మంజూరు చేస్తాయి. అంతేగాక ప్రాజెక్టు రిపోర్టుల తయారీ బాధ్యత స్వీకరించడం, సాంకేతిక సలహాలు, నిర్వహణ సేవలు అందించడం మొదలైన విధులు అభివృద్ధి బాంకులు నిర్వహిస్తాయి. ప్రధానంగా మధ్యకాలిక, దీర్ఘకాలిక పరపతిని ఇచ్చే ఆర్థిక సహాయ సంస్థను అభివృద్ధి బాంకు అంటారు.

ప్రొఫెసర్ విలియం డైమండ్ అభిప్రాయంలో “ఒక సంస్థ ముఖ్యంగా దీర్ఘకాల రుణమూలధనం సమకూర్చడంకోసం కృషి చేస్తే దాన్ని అభివృద్ధి బాంకు అంటారు. ఆర్థిక సహాయాన్ని, ఈక్విటి మూలధనాన్ని అందించడంతో పాటుగా ప్రత్యేకంగా కంపెనీల నిర్వహణ అభివృద్ధి విషయంలో కృషి చేసే సంస్థను అభివృద్ధి కార్పొరేషన్” అంటారు. ఆర్థికంగా అభివృద్ధి చెందని, చెందుతున్న దేశంలో పారిశ్రామికాభివృద్ధి కొరకు, ఆర్థిక, ఆర్థికేతర సౌకర్యాలను కల్పించడం కొరకు అభివృద్ధి బాంకులను ఏర్పాటు చేయడం జరిగింది.

**అభివృద్ధి బాంకుల విధులు :** పారిశ్రామిక అభివృద్ధి కొరకు అవసరమైన ఆర్థిక, ఆర్థికేతర సదుపాయాలను అందజేయడం అనే అభివృద్ధి బాంకుల ప్రధానలక్ష్యం. అభివృద్ధి బాంకులు పరిశ్రమలకు కావలసిన మధ్యకాలిక, దీర్ఘకాలిక, నిధులను సమకూర్చడంతో పాటు ఎన్నో విధులను అవి నిర్వహిస్తాయి. ఆ విధులను క్రింద వివరించడం జరిగింది.

1. పారిశ్రామిక సంస్థలకు మధ్య కాలిక, దీర్ఘకాలిక రుణాలను అందజేయడం
2. పారిశ్రామిక సంస్థల వాటాలు, డిబెంచర్లు, బాండ్ల జారీలకు చందాపూచీ కల్పించడం
3. అన్ని అభివృద్ధి బాంకులు పారిశ్రామిక సంస్థలకు వివిధ రకాలైన హామీలను అందజేయడం
4. చందాపూచీతోపాటు అభివృద్ధి బాంకులు పారిశ్రామిక సంస్థల వాటాలను, డిబెంచర్లను చందా కట్టుట ద్వారా, ప్రత్యక్ష పెట్టుబడి ద్వారా కొనుగోలు చేయుట
5. క్రొత్త పరిశ్రమలను ప్రోత్సహించడం, సాంకేతిక నిర్వహణ, పరిపాలన సలహాలు అందజేయుట
6 ఎగుమతి పరిశ్రమలను ప్రోత్సహించడం, భాయిలా పడ్డ పరిశ్రమలను పర్యవేక్షించి, అభివృద్ధి చేయడం

భారతదేశంలో ఆధునిక పద్ధతిపై అభివృద్ధి బాంకులను స్వాతంత్ర్యంవచ్చిన తర్వాత మాత్రమే స్థాపించడం జరిగింది. ఏర్పాటు చేయబడిన అభివృద్ధి బాంకులలో ముఖ్యమైనవి క్రింద పేర్కొనబడినవి

- భారత పారిశ్రామిక ఆర్థిక సహాయసంస్థ
- భారత పారిశ్రామిక పరపతి పెట్టుబడుల కార్పొరేషన్
- భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు
- రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలు
- భారత ఎగుమతి దిగుమతుల బాంకు
- యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా
- భారత జీవిత భీమా సంస్థ
- జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బాంకు
- చిన్న పరిశ్రమల అభివృద్ధి బాంకు

జాతీయ స్థాయిలోను, రాష్ట్రస్థాయిలోను పనిచేస్తున్న వివిధ అభివృద్ధి బాంకులు గత 50సం॥ లుగా దేశంలోని వివిధ పరిశ్రమలకు ఆర్థిక, ఆర్థికేతర సహాయాన్ని గణనీయంగా సమకూర్చడం జరిగింది.

**4 సహకార బాంకులు**: భారత దేశంలోని గ్రామీణులందరూ వ్యవసాయాన్ని ముఖ్యవృత్తిగా స్వీకరించడం జరిగింది. వ్యవసాయం ముఖ్యవృత్తిగా ఉన్నప్పటికి వ్యవసాయ దారులు పేదరికంలోనే జీవితాలను గడుపుతున్నారు. అందుకు కారణం రైతులకు తగినంత ఆర్థిక సహాయం లేకపోవడమే. వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ పనుల కోసం రైతులకు ధనం అవసరము - వారికి అవసరమైన ఆర్థిక సహాయం కొరకు వడ్డీ వ్యాపారస్థులను ఆశ్రయించవలసి వచ్చేది. వడ్డీ వ్యాపారస్థుల బారినుండి రైతులను తప్పించడానికి "సహకార పరపతి" అనే సాధనం ద్వారా రైతుల ఆర్థిక సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం పూనుకొన్నది. ప్రభుత్వం 1904లో సహకార పరపతి చట్టాన్ని అమలులోనికి తెచ్చింది. దీనివల్ల సహకారోద్యమం బలపడి, సహకార సంఘాలు, సహకార బాంకులు స్థాపించబడ్డాయి. "రైతులకు ధన సహాయం అందించడం, సహకార సిద్ధాంతాలను పాదుపును వ్యాపింప చేయడం ఈ సహకారోద్యమము యొక్క ముఖ్య లక్ష్యము" మరల కొన్ని మార్పులతో 1912లో మరొక చట్టం అమలు లోనికి వచ్చింది. 1919లో అమలులోనికి వచ్చిన నూతన చట్టం ద్వారా సహకార శాఖను, కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు బదిలీ చేసింది. గ్రామీణ పరపతి పరిశీలక సంఘం, అఖిలభారత గ్రామీణ బాంకింగ్ విచారణ సంఘం మొదలగు సంఘాలు సహకార సమస్యలను కూలంకషంగా పరిశీలించి అనేక సిఫార్యులను చేసాయి. వాటి ఫలితంగా ప్రాథమిక సహకార బాంకులు, కేంద్రీయ సహకార బాంకుల, రాష్ట్ర సహకార బాంకుల స్థాపింపబడ్డాయి.

**సహకార బాంకుల రకాలు:** భారత దేశంలోని సహకార బాంకులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చును. 1. ప్రాథమిక సహకార బాంకులు 2. జిల్లా కేంద్ర సహకార బాంకులు, 3. రాష్ట్ర సహకార బాంకులు.

**1. ప్రాథమిక సహకార బాంకులు :** గ్రామాలలోని రైతులకు వ్యవసాయ కార్యక్రమాలకు ధనం సహాయం చేయడానికి సహకార సూత్రాలతో ప్రాథమిక సహకార బాంకులను స్థాపించడమైనది. ప్రాథమిక సహకార బాంకులను ఒక గ్రామానికి లేదా ప్రాంతానికి చెందిన వ్యక్తులు కలిసి ఏర్పాటు చేసుకోవచ్చు. ఆ ప్రాంతంలోని వ్యక్తులు మాత్రమే ఈ బాంకులో సభ్యులుగా చేరడానికి అర్హులు. బాంకుసభ్యుల రుణబాధ్యత పరిమితంగా ఉంటుంది. కొన్ని ప్రాంతాలలో సభ్యులు వాటామూలధనాన్ని చెల్లిస్తారు- ఒక నియమిత సంఖ్యను దాటి ఏసభ్యుడు వాటాలు కొనకూడదు. సభ్యునికి ఎన్ని వాటాలు ఉన్నా ఓటు మాత్రము ఒకటే. వీరు వాటాలను ఇతరులకు బదిలీ చేయుటకు వీలులేదు. ప్రతి సంవత్సరం కార్యనిర్వాహక వర్గాన్ని సభ్యులు ఎన్నుకొంటారు. ఈ బాంకుకు నిధులు అనేక విధాలుగా సమకూరుతాయి. ప్రవేశరుసుము, వాటామూలధనం, డిపాజిట్లు, రుణాలు మొదలైన మార్గలద్వారా బాంకు తనకు కావలసిన నిధులను సేకరిస్తుంది. ప్రాథమిక సహకార బాంకులు తమ సభ్యులకు మాత్రమే రుణాలు ఇస్తాయి. సభ్యులు ఈ బాంకుల నుండి పొందే రుణాలకు ఒక పరిమితి ఉంటుంది. రిజర్వు నిధులను ఈ బాంకుల జిల్లా కేంద్రసహకార బాంకులలో నిల్వచేస్తాయి. తమ నిధులు చాలనప్పుడు కేంద్ర సహకారం బాంకునుండి ప్రభుత్వం నుండి ఈ బాంకులు రుణాలు తీసుకొంటారు ఈ బాంకులన్నీ కేంద్ర సహకార బాంకుకు అనుబంధాలుగా ఉంటాయి.

**2. జిల్లా కేంద్ర సహకార బాంకులు:** ప్రతిజిల్లాకు ఒక కేంద్ర సహకార బాంకు ఉంటుంది. జిల్లాలోని ప్రాథమిక సహకార బాంకులన్ని దీనికి అనుబంధాలుగా ఉంటాయి. ఈ బాంకులో ప్రాథమిక సహకార బాంకులు, ఇతర వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. సభ్యులవాటా మూలధనం, రిజర్వు నిధులు, డిపాజిట్లు, స్టేట్ బాంకునుండి వాణిజ్య బాంకుల నుండి చేసే రుణాలు మొదలైన మార్గాలద్వారా ఈ బాంకులు తమకు కావలసిన నిధులను సమీకరిస్తాయి. రాష్ట్ర సహకార బాంకు కూడా ఈ జిల్లా బాంకులకు ఆర్థిక సహాయం అందిస్తుంది. ప్రాథమిక సహకార బాంకులు, వాటి మిగులు నిధులను కేంద్ర సహకార బాంకులో డిపాజిట్ చేస్తాయి. ప్రాథమిక సహకార బాంకులకు ధన సహాయం చేయడం, అవి సక్రమ మార్గంలో నడవడానికి సలహాలను ఇవ్వడం, వాటి కార్యక్రమాలను సమన్వయపరచడం కేంద్ర సహకార బాంకుల ముఖ్య కర్తవ్యము. జిల్లా కేంద్ర సహకార బాంకుల మిగుల నిధులను ప్రభుత్వ సెక్యూరిటిలలో పెట్టుబడి పెడతాయి.

**3. రాష్ట్ర సహకార బాంకులు:** ప్రతి రాష్ట్రమునకు రాష్ట్ర సహకార బాంకు ఉంటుంది. కేంద్ర సహకార బాంకులన్నీ ఈ బాంకు యొక్క సభ్యులు. వ్యక్తులు కూడా సభ్యులుగా ఉండవచ్చును. రాష్ట్ర సహకార బాంకు యొక్క నిధులు, జిల్లా కేంద్ర సహకార బాంకుల నుండి వ్యక్తులనుండి, వాణిజ్య బాంకులనుండి, రిజర్వు బాంకునుండి రుణాల రూపేణా వస్తాయి. డిపాజిట్లద్వారా నిధులను ఈ బాంకు సమీకరిస్తుంది. రాష్ట్రసహకార బాంకు జిల్లా కేంద్ర సహకార బాంకులకు, తద్వారా ప్రాథమిక సహకార బాంకులకు ధన సహాయం చేస్తుంది. సాధారణ వ్యాపార సూత్రాలమీద సహకారోద్యమ స్ఫూర్తికి అనుగుణంగా రాష్ట్ర సహకార బాంకుల నిర్వహణ కొనసాగుతుంది.

భారత రాష్ట్ర సహకార బాంకుల సమాఖ్య రాష్ట్ర సహకార బాంకుల కార్యక్రమాలను సమన్వయ పరుస్తుంది. బాంకులకు అవసరమైన సమాచారాన్ని, ధనావసరములను అందజేస్తుంది. దేశంలో సహకార రుణపరపతి ఉద్యమం స్థిరపడింది. రైతులకు, తదితర ప్రజలకు అనేక విధాలుగా సహకరిస్తుంది. సహకార పరపతి బాంకుల అభివృద్ధి చాలా త్వరితంగా జరిగింది. ఈ బాంకులు గ్రామీణ పరిస్థితులను సమస్యలను అర్థం చేసుకోగలిగినాయి. రైతుల అవసరాలు కొంతవరకు తీర్చగలుగుతున్నాయి. స్వల్పవడ్డీ రేట్లమీద స్వల్పకాలిక, మధ్య కాలిక, రుణాలు లభించి సన్నకారు రైతులు వడ్డీ వ్యాపారస్థుల చెరనుండి తప్పించుకొన్నారు. గ్రామీణ పరపతి రంగంలో రిజర్వుబాంకు చూపిన ప్రత్యేక ఆసక్తితో సహకార బాంకులు అభివృద్ధి చెందినాయి.

భారతదేశంలో రాష్ట్ర సహకార బాంకులు 2000 సం॥ల నాటికి 29 పనిచేస్తూ షుమారు రు. 34,552 కోట్ల మేరకు రుణాలు అందించాయి. జిల్లా కేంద్ర సహకార బాంకులు 2000 సం॥లో నాటికి 367 బాంకులు పనిచేస్తూ సుమారు రు. 39,367 కోట్ల మేరకు రుణాలలు సమకూర్చినాయి. మార్చి 1999 నాటికి దేశంలో ప్రాథమిక సహకార బాంకుల సంఖ్య 92,450గా నమోదైంది. ఆ సం॥మునకు షుమారు రు. 16,081 కోట్లమేర పరపతి ఈ బాంకులు అందించినాయి. ఇవి 96% గ్రామీణ ప్రాంతాలలో విస్తరించి 10.16 కోట్ల సభ్యత్వం కల్గియున్నాయి. భారతదేశంలో గ్రామీణ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయుటలో సహకార బాంకులు ఎనలేని కృషిచేస్తాయి. రైతాంగానికి సహకార రంగం ఒక చక్కని అభివృద్ధి కారకంగా పేర్కొనవచ్చును. సహకార బాంకులవల్ల అనేక లాభాలు కలవు - చౌకగా గ్రామీణ పరపతిని పొందవచ్చును. ప్రత్యామ్నాయ పరపతిగా ఉత్పాదక రుణాలు రైతులు పొందుటకు సహకార బాంకులు కృషిచేస్తున్నాయి.

## బాంకింగ్ ధోరణులు - స్వభావం (Nature and trends in Banking) :

స్వాతంత్ర్యానంతరం మనదేశంలో ప్రణాళికా సంఘం ఏర్పాటు, వాణిజ్య బాంకులకు సరియైన మార్గాన్ని సూచించింది. భారత బాంకింగ్ వ్యవస్థలో ఎన్నో నిర్మాణాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. దేశ ఆర్థికవ్యవస్థకు బాంకులు మూల స్తంభాలు. దేశ రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులను బట్టి బాంకులు తమ విధానాలను రూపొందించుకోవలసి ఉంటుంది. బాంకుల దృక్పథంలో పద్ధతులలో విధానాలతో శ్లాఘనీయమైన ఆశ్చర్యకరమైన మార్పులు వచ్చినాయి. బాంకుల జాతీయకరణ తర్వాత భారతీయ బాంకింగ్ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. జాతీయ ప్రణాళికలకు అనుగుణంగా వ్యవసాయానికి పరిశ్రమలకు రుణాలు ఇచ్చి హామీలు అందజేసి, తెగువ చూపించి దేశ ఆర్థికాభివృద్ధికి బాంకులు తోడ్పడుతున్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో బాంకులు దేశంలోని గ్రామీణ ప్రజల ఆర్థిక సామాజిక ఉన్నతికి, జాతి సర్వతోముఖాభివృద్ధికై, అంతకుముందు అనుసరిస్తున్న పాత బాంకింగ్ విధానాలను విడనాడి నవకల్పనతో కూడిన నూతన బాంకింగ్ విధానాలను అమలుపరచుచున్నాయి.

ఒకప్పుడు బాంకులు పట్టణాలలో ఉండేవి. ఇప్పుడు అవి పల్లె ప్రాంతాలలోనికి కూడా విస్తరించాయి. ఒకప్పుడు బాంకులలో భూస్వాములు, పెద్ద పెద్ద వ్యాపారస్థులు, పారిశ్రామిక వేత్తలు వ్యవహారాలు నడిపేవారు. ఇప్పుడు నిరుపేదలైన రైతులు, చిన్నచిన్న వ్యాపారస్తులు, పలురకాలైన వృత్తులకు సంబంధించిన వారు బాంకులతో వ్యవహారాలు జరుపుతున్నారు. ప్రస్తుతం బాంకులే ప్రజల దగ్గరికి వస్తున్నాయి. అందువల్లనే భారతీయ బాంకింగ్ వ్యవస్థ వర్గబాంకింగ్ (Class Banking) వ్యవస్థనుండి ప్రజాబాంకింగ్ (Mass Banking) వ్యవస్థగా మార్పుచెందినట్లు పేర్కొనడం జరిగింది. సామాజిక ధ్యేయాలు సాధనకై మొత్తం బాంకింగ్ విధానాలను పునర్వ్యవస్థీకరించడం జరిగింది. ఈ మధ్య కాలంలో భారత బాంకింగ్ వ్యవస్థలో సంభవించిన నూతన పరిణామాల స్వభావాన్ని క్రింద వివరించడమైంది.

**1. బాంకు బ్రాంచీల సర్వో పెరుగుదల :** దేశంలో బాంకు శాఖల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 2000 నాటికి మొత్తం షెడ్యూల్డు బాంకుల సంఖ్య 299 గా ఉండగా వాటిశాఖలు 65,340గా నమోదైనాయి. గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచీల సంఖ్య 1969 తర్వాత గణనీయంగా పెరిగినాయి. దాదాపు 60% పైగా బ్రాంచీలు గ్రామప్రాంతాలలో నెలకొని ఉన్నాయి.

**2. డిపాజిట్ల పెరుగుదల :** ప్రజలవద్దనుండి బాంకులు డిపాజిట్ల రూపంగా ఎంతో సొమ్మును సేకరించాయి. 1994జూన్‌లో రు. 327686 కోట్ల డిపాజిట్లు ఉంటే అవి 2000 సం॥నకు రు. 8,10,070 కోట్లకు పెరిగినాయి. పట్టణ ప్రాంతాలలో కంటే డిపాజిట్లు గ్రామీణ ప్రాంతాలలోనే ఎక్కువగా లభ్యమయ్యాయి. ఆర్థికాభివృద్ధి లోటు ఫైనాన్సింగ్, విరివిగా లభ్యమయ్యే కరెన్సీ, మరియు బాంకింగ్ సౌకర్యాల పెరుగుదల ఇంతపెద్ద మొత్తంలో డిపాజిట్ల సేకరణకు కారణాలని చెప్పవచ్చు.

**3. పరపతి విస్తరణ :** బాంకులు అందించే పరపతి విస్తరణ ప్రతి సం॥లో పెరుగుతూనే ఉన్నది. 1969లో మొత్తం రుణాలు 3020 కోట్లు ఉండగా బాంకురుణాలు 2000 సం॥నకు రు 4,21,479 కోట్లకు పెరిగినాయి. విశేషించి వ్యవసాయమునకు, చిన్న తరహాపరిశ్రమలకు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు గణనీయంగా బాంకు రుణాలు అందజేయడం జరిగింది. ప్రాధాన్యతా రంగాలకు బాంకు రుణాలు 1969లో 12% ఉండగా ఈ రుణాలు 2000 సం॥మునకు 42%నకు పెరిగినాయి.

**4. పట్టణాలనుండి పల్లెసీమలవైపు మళ్ళింపు :** బాంకుల జాతీయకరణ తర్వాత బాంకు గ్రామీణ ప్రాంతాలలో పెద్దఎత్తున బ్రాంచీ విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాయి. బాంకులు ప్రవేశపెట్టిన లీడ్‌బాంక్ పథకం ద్వారా గ్రామీణ బ్రాంచీల సంఖ్య గణనీయంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాలలో 1969లో 1832 బ్రాంచీలు ఉండగా 2000 నాటికి ఈ శాఖల సంఖ్య 32,771 కి పెరిగింది. ఇదేకాలంలో పట్టణాలలో, నగరాలలో కూడ బ్రాంచీల సంఖ్య పెరిగినప్పటికి గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచీల పెరుగుదలతో పోలిస్తే చాలా తక్కువని చెప్పవచ్చును. జాతీయకరణ కాలంనాటికి బాంకింగ్ సౌకర్యాలు కొన్ని అభివృద్ధి చెందిన రాష్ట్రాలలోనే కేంద్రీకృతమై మిగతా రాష్ట్రాలలో చాలా తక్కువ స్థాయిలో ఉండేవి. అందువలన ప్రాంతీయ అసమానతలు ఎక్కువగా ఉండేవి. తర్వాత కాలంలో బ్రాంచీల విస్తరణలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ఇది శుభపరిణామము.

**5. పెద్ద ఖాతాదార్లనుండి చిన్న ఖాతాదార్లకు సేవలు:** ఒకప్పుడు బాంకులో ఖాతా తెరవడం ధనవంతులకు మాత్రమే ఒక ప్రత్యేక హక్కుగా, సదుపాయంగా ఉండేది. అధిక సంఖ్యాకులకు బాంకులో ఖాతా తెరవడం గురించికాని, తెరిచే అవకాశంకాని లేదు. కాని నేడు సామాన్య మానవుడు కూడా బాంకులో ఖాతా తెరిచేస్థాయికి వచ్చాడు. నేటి వాణిజ్య బాంకుల డిపాజిట్ దార్లలో దాదాపు 60 శాతం సేవింగ్స్ బాంకు ఖాతాదారులే. ఇందులో ఆఫీసు ప్యూన్ నుండి వ్యవసాయదారుడు, పెద్ద వ్యాపార వేత్తవరకు ఉన్నారు. గత 20సం॥ముల కాలంలో సేవింగ్సు బాంకు ఖాతాల విషయంలో ఎంతో అభివృద్ధి గోచరించినది. గ్రామీణ ప్రాంతాల ప్రజల పొదుపు శక్తిని బాంకులు గుర్తించాయి. తమ దృష్టిని చిన్న ఖాతాదార్ల వైపు బాంకులు మళ్ళించాయి ఇందులో భాగంగానే సేవింగ్స్ బాంకు షరతులను సులభతరం చేయడం జరిగింది. అంతేగాక, పారిశ్రామిక రంగంలో కూడా బాంకులు తమ దృష్టిని భారీ పరిశ్రమలనుండి, చిన్న తరహా, కుటీర పరిశ్రమలవైపు మళ్ళించాయి. దీనికనుగుణంగా చిన్న వ్యాపార వేత్తలకు ఉదారంగా తక్కువ వడ్డీరేటు వద్ద రుణాలను మంజూరు చేయడం జరుగుతోంది. ప్రస్తుతం పెద్దవ్యాపార వేత్తలకేకాక, నిరుపేదలు, చిన్న వ్యాపారస్థులు, ఉద్యోగులు, రైతులు, వృత్తికారులు, కళాకారులు స్వయం ఉపాధి కొరకు ప్రయత్నం చేసే యువకులకు విరివిగా రుణాలు బాంకులు అందజేస్తున్నాయి. ముఖ్యంగా 1972లో బలహీన వర్గాలకు భేదాత్మక వడ్డీరేట్లు పథకాన్ని బాంకులు ప్రవేశపెట్టాయి. దీని క్రింద అతి తక్కువ వడ్డీరేటు (4%) వద్ద రుణాలు అందజేయడం జరుగుతుంది.

**6. అభివృద్ధి బాంకింగ్:** గతంలో బాంకులు నూలు, వస్త్ర పరిశ్రమ, జనపనార మొదలైన పరిశ్రమలకు మాత్రమే స్వల్పకాలిక రుణాలు ఇచ్చేవి. కొత్త పరిశ్రమలకు, వాణిజ్య రంగాలకు రుణ సహాయాన్ని ఇవ్వడానికి అంగీకరించేవి కాదు - కాని ఇటీవలి కాలంలో, బాంకులు సనాతన పద్ధతులను విడనాడి కొత్త పుంతలు తొక్కుతున్నాయి. డిపాజిట్లను స్వీకరించడం, రుణాలివ్వడం ప్రాతిపదికగా ఉండే

పాత పద్ధతులనుండి అభివృద్ధి పథకాల మీదకు బాంకులు దృష్టి మళ్లించాయి. ప్రస్తుత కాలంలో బాంకులు పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు కావలసిన రుణ సహాయాన్ని పెద్ద మొత్తంలో అందించి ఆయా రంగాల అభివృద్ధికి దోహద బడుతున్నాయి. క్రమేణా అవి పరిశ్రమలకు, వ్యవసాయానికి అవసరమైన మధ్య కాలిక దీర్ఘకాలిక రుణాలను కూడా ఇస్తున్నాయి. అందుచేతనే వాణిజ్య బాంకులను అభివృద్ధి బాంకులుగా ఇటీవలి కాలంలో పిలుస్తున్నారు.

**7. బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్టత :** నానాటికి బాంకింగ్ వ్యవస్థ యొక్క బాధ్యతలు పెరుగుతున్నాయి. అందువలన, బాంకింగ్ వ్యవస్థను చట్టబద్ధం చేసి, అదుపులో ఉంచాల్సిన అవసరం కూడా ఏర్పడింది. 1949లో బాంకులకు ప్రత్యేకంగా "బాంకింగ్ క్రమబద్దీకరణ చట్టం" రూపొందించబడింది. ఈ చట్టం వివిధ బాంకుల అదుపు, పర్యవేక్షణ, నియంత్రణ మొదలైన వాటికి సంబంధించి రిజర్వు బాంకుకు విస్తృతమైన అధికారాలు ఇవ్వడం జరిగింది. నిర్భంధ విలీనీకరణ ద్వారా చిన్న బాంకులను మూసి వేయడానికి చర్యలు తీసుకోవడం జరిగింది. దీనివల్ల చిన్న బాంకులు పెద్ద బాంకులతో సంయోగంచెంది బాంకింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉండుటకు అవకాశం గలదు. మనదేశంలో జాతీయం చేయబడిన న్యూ బాంక్ ఆఫ్ ఇండియా పంజాబ్ నేషనల్ బాంకులో విలీనం అయినది. అదే విధంగా కొన్ని ప్రయివేటు బాంకులను ప్రభుత్వ బాంకులు తమలో విలీనం చేసుకోవడం జరుగుతుంది.

**8. ప్రాధాన్యతారంగాలపై శ్రద్ధ :** బాంకుల జాతీయకరణ తర్వాత బాంకుల పరపతి విధానంలో ప్రాధాన్యతారంగాలకు అందించే ద్రవ్యసహాయం విషయంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. వ్యవసాయం, చిన్న తరహా వ్యాపారం, ఎగుమతి వ్యాపారం మొదలగు రంగాలు ప్రాధాన్యతారంగాలుగా గుర్తింపుపొందాయి. కొత్తగా ప్రవేశపెట్టిన వివిధ పద్ధతుల ద్వారా తక్కువ మొత్తాలలో రుణాల తీసుకొనే వారికి బాంకు రుణాలు పొందే అవకాశం కల్గింది. ఆ రుణాలు అతిస్వల్ప వడ్డీరేటు వద్ద సమకూరుస్తున్నాయి. 1969లో మొత్తం ప్రాధాన్యతారంగాలకు బాంకుల అందించిన రుణ సహాయం రు. 504 కోట్లు ఉండగా 2000సం॥ నాటికి బాంకులు ఈ రంగాలకు షుమారు రు 1,35,923 కోట్లు అందజేసాయి. 1969లో మొత్తం రుణాలలో ప్రాధాన్యతారంగాలకు 12% రుణాలు ఇస్తే 2000 నాటికి 42 శాతానికి పెరిగింది. షెడ్యూల్డు కులాలు, తెగలు, ఇతర బలహీనవర్గాల ప్రజల ఇళ్ల నిర్మాణానికి కావలసిన ద్రవ్య సహాయాన్ని బాంకులు ఉదారంగా అందజేస్తున్నాయి.

**9. సమగ్రగ్రామీణాభివృద్ధి :** గత కొద్ది సంవత్సరాలుగా బాంకులు సామాజిక ధ్యేయాలను గుర్తించి గ్రామీణాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు బాంకుల విశేషమైన కృషి చేస్తున్నాయి. భారత ప్రభుత్వం పేదరిక నిర్మూలనకై 1978లో పెద్ద ఎత్తున ప్రవేశ పెట్టిన "సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం (IRDP) లో బాంకు తమవంతు పాత్రను చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమం క్రింద దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న గ్రామీణ కుటుంబాలకు సహాయం చేయుటకు ఎన్నో రకాల రుణ పథకాలను బాంకులు అమలు చేస్తున్నాయి. -గామీణాభివృద్ధి సమగ్రంగా ఉండాలనే ధ్యేయంతో బాంకులు ఎంతో కృషి చేస్తున్నాయి. ఇది ఎంతయో ముదావహము.

**10. నవకల్పన బాంకింగ్ :** నవకల్పనతో బాంకింగ్ విధానం ప్రస్తుతం నడుస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం కంప్యూటర్ల విజ్ఞానం విదేశీ బాంకులనుండి స్వీకరించిన ఆధునిక పద్ధతులు మనదేశంలో బాంకులు ప్రస్తుతం అమలు చేస్తున్నాయి. ఇవి డిపాజిట్ల సేకరణ, పరపతి పంపిణీ, నిర్వహణ విషయాలలో నాణ్యత కనుమరుగవుతుంది. నవీకరణ (Innovation) వల్ల ఖాతాదారులకు అందజేసే సేవలు త్వరితంగాను, కరెక్టుగాను తృప్తికరంగా ఉండుటకు అవకాశం గలదు ప్రజల నుండి డిపాజిట్ల పెద్ద మొత్తాలలో స్వీకరించడానికి, అదే విధంగా ఆధునిక పద్ధతుల ద్వారా వివిధ రంగాలకు రుణాలు అందజేయుటలో గాని, చక్కని సేవలు ఖాతాదారులకు అందజేయుటకు నవీకరణ బాంకులకు చాలా ఉపయోగపడుతున్నది. ముఖ్యంగా బాంకుల సిబ్బంది. మంచి సామర్ధ్యంతో, తెలివి తేటలతో వాటిని నిర్వహణలో పాలుపంచుకోవడం జరుగుతుంది. అదీగాక పోటీతత్వం బాంకుల మధ్య నెలకొని ఉండడంతో సేవలలో నాణ్యత (Quality) కు అధిక ప్రాధాన్యత బాంకులు ఇటీవలి కాలంలో ఇస్తున్నాయి.

**11. మర్చెంట్ బాంకింగ్ :** వాణిజ్య బాంకులు ఇటీవలి కాలంలో అధికంగా మొగ్గుచూపుతున్న కార్యకలాపం మర్చెంట్ బాంకింగ్. 1972 సం॥లోనే బాంకింగ్ కమిషన్ మర్చెంట్ బాంకింగ్ ఆవశ్యకతను నొక్కివక్కాణించింది. మధ్యతరగతి, చిన్న పెట్టుబడి దారులకు కావలసిన ధన సహాయం చేయడం వారికి క్రింద తెలియ జేసిన సేవలు మర్చెంట్ బాంకర్లు అందజేస్తున్నాయి. అవిలోన్ సిండికేషన్, విత్త నిర్వహణకు సంబంధించిన సలహాలు, ప్రాజెక్టు సలహాలు, పోర్టుఫోలియో నిర్వహణ, పునరావాస పథకాలను రూపొందించడం మరియు విదేశీ వ్యాపార రుణాలకై సలహాలు అందజేయడం మొదలైనవి. ఈ విధమైన సేవలు ప్రారంభించడంలో స్టేట్‌బాంక్ ఆఫ్ ఇండియా దేశంలోనే ప్రథమం. తర్వాత కాలంలో దాదాపు అన్ని వాణిజ్య బాంకులు పైన పేర్కొన్న సేవలను దేశంలో అందిస్తున్నాయి.

గత 20 సం॥ములలో భారతీయ బాంకింగ్ వ్యవస్థ గణనీయమైన పురోగతిని సాధించినది. ఎన్నో నూతన పద్ధతులను, పథకాలను ప్రవేశపెట్టింది. "ఉన్నత ఆశయం, ప్రయోజనాత్మకమైన పురోగతి" ఈనాటి మన వాణిజ్య బాంకుల లక్షణం అని చెప్పవచ్చును. పైన పేర్కొన్న అంశాలను బట్టి, బాంకులు ఇటీవలి కాలంలో విప్లవాత్మకమైన మార్పులను చేపట్టాయని వాటి ఫలితంగా బాంకుల పనితీరు పరిమాణాత్మకంగాను, మరియు నాణ్యతపరంగాను ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పవచ్చు.

## సెల్ఫ్ ఎసెస్ మెంటు ప్రశ్నలు (Self Assessment Questions)

1. బాంకింగ్ పుట్టు పూర్వోత్తరాలను వివరించండి.
2. బాంకును నిర్వచించి బాంకులు ఏ విధంగా అబివృద్ధి చెందాయో తెలియజేయండి
3. బాంకులలోని రకాలను విశదీకరింపుడు
4. వాణిజ్య బాంకుల విధులను సోదాహరణంగా వివరింపుము
5. సహకార బాంకుల వ్యవస్థను వివరించి, వాటి విధులను తెలియ జేయండి.
6. ఇటీవల కాలంలో బాంకింగ్ ధోరణుల గురించి వ్రాయండి.

## పదకోశం:

**1. బాంకు :** కోరిన వెంటనేగాని, ఇంకో సమయంలోగాని, చెక్కు డ్రాఫ్టు, ఆర్డరు ద్వారా గాని తిరిగి చెల్లించే షరతుమీద డిపాజిట్లను ప్రజలవద్ద నుండి స్వీకరించి, ఆ సొమ్మును రుణాలు రూపేణ అందజేయడంగాని, పెట్టుబడులకోసం ఉపయోగించే సంస్థను బాంకుగా పేర్కొనవచ్చును.

**2. కరెంటు డిపాజిట్ ఖాతా :** ఈ ఖాతాకు సాధారణంగా ప్రతిరోజు ఎన్నోసార్లు బాంకులో డబ్బును డిపాజిట్ చేసి, మరియు ఎన్నోసార్లు విత్‌డ్రా చేసే సౌలభ్యం ఉన్నది. ఈ ఖాతాలలోని నిల్వలపై సాధారణంగా బాంకులు వడ్డీ చెల్లించవు.

**3. పారిశ్రామిక బాంకులు :** పరిశ్రమలకు ద్రవ్యసహాయం అందజేసే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా స్థాపించబడ్డ బాంకుల్ని పారిశ్రామిక బాంకులు లేక పెట్టుబడి బాంకులు అంటారు. వీటినే అభివృద్ధి బాంకులంటారు. ఉదాహరణకు - భారత పారిశ్రామిక ద్రవ్యసహాయసంస్థ, భారత పారిశ్రామిక అభివృద్ధి బాంకు పారిశ్రామిక బాంకులుగా చెప్పవచ్చును.

**4. పొదుపు బాంకులు :** ప్రజల్లో పొదుపు పెంపొందించడం సేవింగ్స్ బాంకుల లక్ష్యం. వీటిని బాంకులు అనడం కంటే పొదుపు కేంద్రాలనడం సముచితం. బాంకులు లేని ప్రాంతాలలో పోస్టాఫీసులు సేవింగ్సు ఖాతాలను తెరిచి ప్రజలకు ఇతోధిక సేవలను అందిస్తున్నాయి. దేశంలోను పొదుపును ప్రోత్సహిస్తున్నాయి.

# పాఠం - 2

# బాంకింగ్ వ్యవస్థలు - Banking Systems

**లక్ష్యాలు** (Objectives)

- ఈ లెసన్‌లో ప్రపంచంలో ఉన్న బాంకింగ్ వ్యవస్థల రకాలను తెలుసుకోవడం.
- యూనిట్ బాంకింగ్, బ్రాంచి బాంకింగ్ లాభాలు, నష్టాలు తెలుసుకోవడం.
- ఇతర బాంకింగ్ వ్యవస్థలైన సామూహిక బాంకింగ్, కరస్పాండెంట్ బాంకింగ్, గొలుసు బాంకింగ్, మిశ్రమ బాంకింగ్‌లను అర్థం చేసుకోవడం.
- ఇటివలి కాలంలో వస్తున్న ధోరణులను అవగాహన చేసుకోవడం.

**అంశాలు** (Aspects)

**2.1 బాంకింగ్ వ్యవస్థలు**

**2.2 బ్రాంచి బాంకింగ్ - యూనిట్ బాంకింగ్**

**2.3 బ్రాంచి బాంకింగ్‌కు యూనిట్ బాంకింగ్‌కు బేధాలు**

**2.4 బ్రాంచి బాంకింగ్‌లోని ప్రయోజనాలు**

**2.5 బ్రాంచి బాంకింగ్‌లోని నష్టాలు**

**2.6 యూనిట్ బాంకింగ్ వల్ల ప్రయోజనాలు - నష్టాలు**

**2.7 భారతదేశానికి అనువైన వ్యవస్థ - బ్రాంచి బాంకింగ్**

**2.8 సామూహిక బాంకింగ్**

**2.9 కరస్పాండెంట్ బాంకింగ్**

**2.10 గొలుసు బాంకింగ్**

**2.11 మిశ్రమ బాంకింగ్**

**2.12 ఇటీవల ధోరణులు**

**2.13 సెల్ఫ్ ఎసెస్‌మెంట్ ప్రశ్నలు పదకోశం.**

**2.1 బాంకింగ్ వ్యవస్థలు** (Banking Systems) : అన్ని దేశాలలో బాంకింగ్ వ్యవస్థల స్వరూప స్వభావాలు ఒకే రీతిలో ఉండవు. బాంకింగ్ స్వరూప స్వభావాలు ప్రతి దేశానికి మారుతుంటాయనేది నిర్వివాదాంశము. దేశంలో ఉన్న ఆర్థిక పరిస్థితులు, రాజకీయ సంప్రదాయాలు, ప్రజల ఆచారవ్యవహారాల మీద ఆ దేశపు బాంకింగ్ వ్యవస్థా స్వరూపము ఆధారపడి యుంటుంది. వివిధ దేశాలలో అమలులో ఉన్న బాంకింగ్ వ్యవస్థలను వివిధ రకాలుగా వర్గీకరించవచ్చును. అవి ఏమనగా బ్రాంచి బాంకింగ్ (Branch Banking ) యూనిట్ బాంకింగ్ (Unit Banking ), గ్రూపు బాంకింగ్ (Group Banking ), కరస్పాండెంట్ బాంకింగ్ (Correspondent Banking), గొలుసు బాంకింగ్ (Chain Banking) మరియు మిశ్రమ బాంకింగ్ (Mixed Banking) అయితే పైన పేర్కొన్న బాంకింగ్ వ్యవస్థలలో బ్రాంచి బాంకింగ్, యూనిట్ బాంకింగ్‌లు ప్రముఖంగా అమలులో ఉన్నాయి.

**2.3. బ్రాంచి బాంకింగ్** (Branch Banking) **- యూనిట్ బాంకింగ్** (Unit Banking) **బ్రాంచి బాంకింగ్** : ఒక దేశంలో ఒక బాంకింగ్ సంస్థ అనేక ప్రాంతాలలో శాఖలు లేదా బ్రాంచీలు కలిగియుండి బాంకింగ్ వ్యాపారాన్ని చేస్తూ ఉంటే ఆ పద్ధతిని బ్రాంచి బాంకింగ్ అని అంటారు. ఈ పద్ధతిలో బాంక్‌కు ఒకచోట కేంద్ర కార్యాలయం ఉండి దేశ వ్యాప్తంగా గాని లేక రాష్ట్ర వ్యాప్తంగా గాని, లేదా విదేశాల్లో గాని అనేక శాఖలు ఉంటాయి. వీటన్నింటిని ఒకే యాజమాన్యం నిర్వహిస్తుంది. బ్రాంచీలన్నియు కేంద్ర కార్యాలయం యొక్క నియంత్రణలో పని చేస్తాయి. ఉదాహరణకు స్టేట్ బాంక్ ఆఫ్ ఇండియా దేశ వ్యాప్తంగా దాదాపు 9000 బ్రాంచీలు ఉన్నాయి. కేంద్ర కార్యాలయం ముంబాయిలో ఉన్నది.

బ్రాంచి బాంకింగ్‌కు ఇంగ్లండు ప్రసిద్దివహించినది. బ్రాంచిబాంకింగ్‌కు ఒకే డైరక్టర్ల బోర్డు ఉండి ఒక సమూహామునకు చెందిన వాటాదారులు గలిగి, న్యాయాత్మక వ్యక్తిత్వంలో, దేశమంతటా శాఖలు విస్తరింపచేసి బాంకింగ్ కార్య కలాపాలను జరపడం ఈ వ్యవస్థ ముఖ్యోద్దేశ్యం. బ్రాంచి బాంకింగ్ పద్ధతి ఇంగ్లండులో పుట్టి, కెనడా, ఆస్ట్రేలియా, ఇండియా మొదలైన దేశాలలో అభివృద్ధి చెందినది. ఇంగ్లండులోని మొత్తం వ్యాపారం కేవలం ఐదు పెద్ద బాంకుల చేతుల్లో కేంద్రీకృతమైనది. అవి: ది మిడ్‌లాండ్ బాంకు, ది లాయిడ్స్ బాంకు, ది బార్‌క్లేస్ బాంకు, ది వెస్ట్‌మినిస్టరు బాంకు మరియు ది నేషనల్ ప్రావిన్షియల్ బాంకు. ఈ వ్యవస్థలో ప్రతి బాంకుకు ఒక కేంద్రకార్యాలయం ఉండి, దేశ వ్యాప్తంగా బ్రాంచి ఆఫీసులు ఉంటాయి.

**యూనిట్ బాంకింగ్:** ఒక బాంకుకు శాఖలు లేకుండా ఒకేచోట బాంకింగ్ వ్యాపారం నిర్వహిస్తుంటే ఆ పద్ధతిని యూనిట్ బాంకింగ్ అంటారు. ఒక్కొక్క బాంకుకు ఒకే కార్యాలయం ఉంటుంది. ఆ బాంకుకు బ్రాంచీలుండవు. ఈ బాంకింగ్ వ్యవస్థ అమెరికాలో అమలులో ఉన్నది. ప్రతి బాంకుకు వాటాదారులు, నిర్వహణాధికారులు వేరుగా ఉంటారు. ప్రతి బాంకు వ్యాపారం ఒక నిర్ణీత ప్రాంతానికే పరిమితమైయుంటుంది. అమెరికాలో ఈ పద్ధతికి విశేష ప్రాధ్యాన్యతగలదు. ఆ దేశంలో చిన్న చిన్న బాంకులు పరిమిత ప్రాంతాలలో పని చేస్తున్నాయి. అమెరికా రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాంకింగ్ శాసనాలు చేయవచ్చును. కేంద్రశాసనం ప్రకారం స్థాపించబడిన బాంకులు జాతీయ బాంకులని, రాష్ట్ర శాసనం ప్రకారం స్థాపించబడిన బాంకులు రాష్ట్ర బాంకులని అంటారు. జాతీయ బాంకులకు బ్రాంచీలు ఉండటానికి వీలులేదు. కొన్ని రాష్ట్రాలు ఆ రాష్ట్రంలో బ్రాంచీలు తెరుచుటకు అనుమతిస్తాయి. అందుచేత కొన్ని రాష్ట్రాలలోని బాంకులకు బ్రాంచీలుంటాయి. అయితే అమెరికాలో బాంకులకు ఒకే కార్యాలయం ఉన్నప్పటికి, 'కరస్పాండెంటు పద్ధతి' ద్వారా ఒకదానితోనొకటి సన్నిహిత సంబంధం కల్గియుంటాయి.

షాపిరో, సాలమన్ మరియు విల్డ్ మహాశయుల ప్రకారం "ఒకే కార్యాలయంతో, ఒకే స్థలంలో ఇతర బాంకులతో సంబంధం లేకుండా మొత్తం నిర్వహణ మరియు నియంత్రణ ఒకే కార్పొరేషన్ ఆధీనంలో యుండి వ్యాపార వ్యవహారాలు నిర్వహించే బాంకు యూనిట్ బాంకు" అంటారు. అమెరికా ఆర్థికవ్యవస్థలో ప్రముఖమైంది ఏమనగా అక్కడ ఒకే కేంద్ర బాంకు కాకుండా 12 ఫెడరల్ రిజర్వు బాంకులు ఉన్నాయి. కరస్పాండెంట్ పద్ధతి ద్వారా దేశంలో ఉన్న బాంకులన్నిటికి న్యూయార్క్, షికాగో నగరాలలోని బాంకులతో సంబంధం ఉంటుంది. ఈ పద్ధతి వల్ల చెక్కుల వసూళ్లకు, ఒకచోటు నుండి మరొకచోటుకు సొమ్ముపంపడానికి సౌకర్యం ఉంటుంది.

**2.4. బ్రాంచి బాంకింగ్‌కు యూనిట్ బాంకింగ్‌కు బేధాలు:** బ్రాంచి బాంకింగ్‌ను పెద్ద తరహా సంస్థగాను, యూనిట్ బాంకును చిన్న తరహా సంస్థగాను చెప్పవలె. బ్రాంచి బాంక్‌కు అనేక బ్రాంచీలు దేశవ్యాప్తంగా ఉంటాయి. దీనికి ఎక్కువ మూలధనం ఉంటుంది. భారీ ఎత్తున వ్యాపారం సాధించి పెద్దతరహా సంస్థకు చేకూరే ఆదాలను పొందగలదు - యూనిట్ బాంక్‌కు సాధారణంగా ఒకే బ్రాంచి యుంటుంది. మూలధనం తక్కువ. అది చిన్న వ్యాపారసంస్థ. అందువల్ల బ్రాంచి బాంకింగ్, యూనిట్ బాంకింగ్‌కు ఉండే లాభనష్టాలు పెద్ద తరహా, చిన్న తరహా వ్యాపార సంస్థలకంటే లాభనష్టాలని 'సేయర్సు' చెప్పినారు.

**2.5 బ్రాంచి బాంకింగ్ వల్ల ప్రయోజనాలు:** బ్రాంచి బాంకింగ్ వ్యవస్థవల్ల క్రింద పేర్కొన్న ప్రయోజనాలు సమకూరుతాయి.

1. **నిధుల సేకరణ:** బ్రాంచి బాంకింగ్ వల్ల బాంకులు భారీ ఎత్తున నిధులు సేకరించుటకు అవకాశం గలదు. బ్రాంచీలు దేశ వ్యాప్తంగా ఉన్నందువల్ల ప్రజలలో పొదుపు అలవాటును పెంపొందించి పెద్ద ఎత్తున డిపాజిట్లను సేకరించే వీలు ఉన్నది. దీని వల్ల దేశంలో మూలధన కల్పన సులభతరమవుతుంది.

2. **శ్రమ విభజన:** బ్రాంచి బాంకింగ్ పెద్ద తరహా వ్యాపారంలాంటిది. బాంకులలో కార్యకలాపాలు విభజించుట వల్ల, హెచ్చు జీతాలు ఇచ్చి సుశిక్షితులైన ఉద్యోగులను నియమించుకొని శ్రమ విభజనను ప్రవేశపెట్టి లాభాలు పొందవచ్చును. నైపుణ్యం కలిగిన వ్యక్తులు పనులు నిర్వహించడం వల్ల ఫలితాలు త్వరితగతిన పూర్తి అవుతాయి. మరియు సామర్ధ్యం పెరుగుతుంది.

3. **నిధుల బదిలీ:** వ్యాపార వ్యవహారాలు చురుకుగా సాగుతున్నపుడు నగదును ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి పంపించవలసి యుంటుంది. బ్రాంచి బాంకింగ్ దేశవ్యాప్తంగా విస్తరించి యుండటంవల్ల పెద్ద పెద్ద మొత్తాలను తక్కువ వ్యయంతో సులభంగా దూర ప్రాంతాలకు పంపే వీలున్నది. బ్రాంచి బాంకింగ్ వల్ల వ్యయం తగ్గడంతో పాటు సమయం వృధా కాదు.

4. **నష్టాన్ని భరించే శక్తి:** బ్రాంచి బాంకింగ్‌వల్ల నష్టభయం తక్కువగా యుండి నష్టభయాన్ని భరించే సామర్థ్యం ఎక్కువవుతుంది. ఒక వేళ కొన్ని బ్రాంచీలలో నష్టాలు వస్తే మిగతా బ్రాంచీలలో వచ్చిన లాభంతో వాటిని సర్దుబాటు చేయవచ్చును. బ్రాంచి బాంకింగ్ పద్ధతిలో పొదుపు ఎక్కువగా యున్న ప్రాంతాల నుండి డిపాజిట్లు లభ్యమయితే, వీటిని రుణాలు అవసరమున్న ప్రాంతాలకు పరపతి రూపంలో మంజూరు చేయవచ్చును.

5. **నిధుల పొదుపు:** బ్రాంచి బాంకింగ్ పద్ధతిలో పెద్ద మొత్తంలో నగదు నిల్వలు లేకుండానే వ్యాపారం చేయవచ్చును. అవసరమైతే ఒక బ్రాంచిలోని నిల్వను ఇంకొక బ్రాంచికి తరలించవచ్చును - బ్రాంచీలలో అవసరమైనమేరకు రిజర్వులు ఉంచుకొని ఎక్కువ మొత్తాలు అప్పులుగా ఇచ్చుటకు అవకాశం గలదు.

6. **నిర్వహణ నైపుణ్యం:** బ్రాంచి బాంకులు నిర్వహణలో అధిక సామర్థ్యాన్ని సాధించే వీలున్నది. సమర్థులైనవారిని, నిపుణులైన అధికారులను నియమించుట వల్ల పనులు సమర్థవంతంగా జరగడం, త్వరితగతిన పూర్తి అవడం సాధ్యమవుతుంది ఈ నేపథ్యంలో సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

7. **సమకూరే ఆదాలు:** బ్రాంచి బాంకింగ్ వ్యవస్థలో బాంకులు వ్యాపారం భారీ ఎత్తున జరుపుతాయి. అందుచేత నిర్వహణా వ్యయాన్ని తగ్గించడం, ఖాతాదారులకు తక్కువ వ్యయంతో ఎక్కువ సేవలు అందించడానికి వీలు అవుతుంది. శాస్త్రీయ నిర్వహణ ద్వారా, పరిపాలన వ్యయాలను తగ్గించినందువల్ల ఆదాలు పెరుగుతాయి.

8. **పర్యవేక్షణ సౌలభ్యం:** దేశం మొత్తం మీద బ్రాంచీలు నెలకొని ఉన్నప్పటికి వీటి అజమాయిషి అంతా కేంద్ర కార్యాలయాల చేతిలో ఉంటుంది. కనుక కేంద్ర కార్యాలయాలను, కేంద్ర బాంకు అనగా రిజర్వుబాంకు పర్యవేక్షించి నియంత్రణ చేస్తే సరిపోతుంది. కేంద్ర బాంకుకు ఆయా బాంకులపై పూర్తి అజమాయిషి ఉంటుంది.

9. **స్థానిక ఒత్తిడులు లేకపోవడం:** బ్రాంచి బాంకులు స్థానిక వత్తిడులకు లోను కాకుండా తమ విధానాలను కొనసాగించవచ్చును. రుణం తీసుకొనే వ్యక్తి యొక్క రుణం, ఆర్థికపుష్టి, సామర్థ్యం అనే అంశాల ఆధారంగా అప్పులను మంజూరు చేయుటకు వీలు ఉన్నది.

10. **సిబ్బంది ప్రమోషన్సు:** బ్రాంచి బాంకింగ్‌లో చాలా శాఖలు ఉంటాయి. గనుక, సిబ్బందికి బదిలీలతో పాటు త్వరితగతిన ప్రమోషన్సు వచ్చే అవకాశంగలదు. దీనివల్ల నిర్వహణా సామర్థ్యం పెరుగుతుంది. పదోన్నతి పొందిన ఉద్యోగులు సంతృప్తిచెంది బాంకుల అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తాయి.

11. **గ్రామాల వికాసం:** ఈ పద్ధతి క్రింద బాంకు బ్రాంచీలను మారుమూల గ్రామాలలో, వెనుకబడిన ప్రాంతాలలో ఏర్పాటు చేయడం వల్ల ఆయా ప్రాంతాలు వికాసవంతమవుతాయి. గ్రామీణ ప్రాంతాలలో కూడా అనేక బాంకింగ్ సేవలు అందించుటకు వీలున్నది.

12. **వ్యవస్థపై విశ్వాసం:** బ్రాంచి బాంకింగ్ పద్ధతిలో బ్రాంచీలు దేశ వ్యాప్తంగా విస్తరించియుండటం వల్ల అధిక మొత్తంలో వ్యాపారం చేయడం జరుగుతుంది. కొన్ని శాఖలు నష్టంలో ఉన్నా, బాంకుపరపతికి నష్టం వాటిల్లదు. ప్రజలకు బాంకు మీద పూర్తివిశ్వాసం ఉంటుంది. ఈ విశ్వాసం మీదనే ప్రజలు బాంకులలో తమ సొమ్మును దాచుకొంటారు.

## 2.6 బ్రాంచి బాంకింగ్‌లోని నష్టాలు:

బ్రాంచి బాంకింగ్ వ్యవస్థలో క్రింద పేర్కొన్న లోపాలున్నాయి.

1. **బాంకింగ్ వ్యవహారాల్లో జాప్యం:** బ్రాంచి మేనేజరు అన్ని విషయాలలో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండదు. కొన్ని విషయాలలో కేంద్ర కార్యాలయాన్ని సంప్రదించి ఆమోదాన్ని పొందవలసియుంటుంది. ఈ ఆమోదాన్ని పొందడంలో ఆలస్యం జరగవచ్చును. అయితే టెలిఫోన్, టెలిగ్రాఫ్ సౌకర్యాలు విరివిగా ఉన్న ఈ రోజులలో ఈ లోపాన్ని సులభంగా నివారించవచ్చును.

2. **పర్యవేక్షణలోపం:** బ్రాంచీలు ఎక్కువగాయున్నందువల్ల బాంకు నిర్వహణ పర్యవేక్షణ కొంత కష్టంతో కూడుకొన్న పని. చాలా బ్రాంచీలు కేంద్ర కార్యాలయానికి దూరంగా ఉంటాయి. అందుచేత అజమాయిషి అంతబాగా జరుగక పోవచ్చును. బ్రాంచీ మేనేజరు నిధులు దుర్వినియోగపరచి అవినీతికి పాల్పడవచ్చును.

3 **వ్యయంతో కూడుకున్నది:** బ్రాంచి బాంకింగ్ వ్యవస్థ వ్యయంతో కూడుకొన్నది. బ్రాంచీలు ఏర్పాటు అవుతున్నకొద్దీ వాటికయ్యే స్థాపన ఖర్చు, సిబ్బంది, నిర్వహణ తదితర ఖర్చులు పెరుగుతూ ఉంటాయి. కొన్ని బ్రాంచీలు మేనేజర్లు చొరవ చూపకపోవడంవల్ల వచ్చే నష్టాలను ఇతర బ్రాంచీల లాభాలతో పూడ్చడం వల్ల చివరకు లాభం పెద్దగా రాదు.

4. **వ్యక్తిగత పరిచయాలు తక్కువ:** బ్రాంచి మేనేజర్లు తరచుగా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి బదిలీ అవుతూంటారు- అందుచేత స్థానిక ఖాతాదార్లతో ప్రత్యక్ష పరిచయం గాని, వారి గుణ గణాలు వ్యక్తిత్వాలను గూర్చి అధ్యయనం చేసే అవకాశంగాని ఉండదు. దీనివల్ల డిపాజిట్లు ఎక్కువస్థాయిలో సేకరించలేరు. అంతేగాక, స్థానికసమస్యల పట్ల అవగాహన గాని, అక్కడున్న పరిస్థితులలో ఏ రంగాలకు అప్పులు ఇస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందో అనే విషయంపై వారు అంత శ్రద్ధ చూపరు.

5. **తీవ్రమైన పోటీ పరిస్థితి:** ఒకే ప్రాంతములో వివిధ బాంకులు తమ బ్రాంచీలను ఏర్పాటు చేయవచ్చును. వాటిమధ్య తీవ్రమైన, అవాంఛనీయమైన పోటీ ఏర్పడవచ్చును. తీవ్రమైన పోటీ ఫలితంగా అప్పులపై వడ్డీరేట్లు తగ్గించడం, డిపాజిట్లపై ఎక్కువ వడ్డీ ఇవ్వడం వంటి అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడతాయి. దీని వల్ల ఏ కొద్దిమందికో లాభం కలిగినప్పటికి జాతి యావత్తు ఎక్కువ మూల్యం చెల్లించవలసి యుంటుంది.

6. **బ్రాంచీల మధ్య సమన్వయ సమస్య:** బాంకు యొక్క బ్రాంచీలు పెరుగుతున్న కొద్దీ వాటి మధ్య సమన్వయం సాధించడం కష్టమవుతుంది. బాంకు విధానాలు, పద్ధతులు, నియమ నిబంధనలు ఒకే రీతిలో వర్తింపచేయడం కష్టమవుతుంది. ఉదాహరణకు స్టేట్ బాంకు ఆఫ్ ఇండియా బ్రాంచీల మధ్య సమన్వయాన్ని సాధించడానికి, బాంకింగ్ విధానాల అమలుతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నది.

7. **బాంకుల దివాలా నష్టం:** యూనిట్ బాంకు దివాలా తీసినపుడు జరిగే నష్టం పరిమితంగా ఉంటుంది. కాని దేశంలోని వివిధ ప్రాంతాలలో బ్రాంచీలు గల బాంకుల దివాలా తీసినపుడు జరిగే నష్టం చాలా ఎక్కువ. ప్రజలు బాంకుల మీద విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదమున్నది. దీనివలన సమాజానికి, దేశానికి ఎంతో నష్టము మరియు గ్రామ ప్రాంతాలలో రుణాలు అందచేయడమే తప్ప డిపాజిట్ల సేకరణ సాధ్యంకాని బ్రాంచీలు బాంకుకు నష్టం చేకూరుస్తాయి.

8. **డిపాజిట్ల తరలింపు:** బాంకు బ్రాంచీలలో ఆ ప్రాంత ప్రజలుంచిన డిపాజిట్లు ఇతర ప్రాంతాలకు తరలించడం జరుగుతుంది. అందుచేత ఈ ప్రాంతపు అభివృద్ధికి ఆ ప్రాంతంలో వసూలు చేయబడిన వనరులు ఉపయోగింపబడకుండా పోతాయి.

ఉదాహరణకు, గ్రామీణ ప్రాంతాలలో సమీకరించిన నిధులను పట్టణాలకు తరలించి వినియోగించవచ్చును. దీని వలన నిధులు సమకూర్చిన ప్రాంతాలు వెనుక బడియుంటాయి.

9. **ఆర్థిక కేంద్రీకరణ:** బ్రాంచి బాంకింగ్ వల్ల దేశంలో ఆర్థిక శక్తి కేంద్రీకృతమవుతుంది. ఉదాహరణకు, ఇంగ్లండులో 75% ఆర్థిక వనరులు ఐదు పెద్ద బాంకుల ఆధీనంలో ఉంటాయి. ఈ విధమైన కేంద్రీకరణ దేశానికి మంచిది కాదు.

## 2.7 యూనిట్ బాంకింగ్ వల్ల ప్రయోజనాలు: యూనిట్ బాంకింగ్ వ్యవస్థలో క్రింద పేర్కొన్న లాభాలు ఉన్నాయి.

1. **ఖాతాదారులతో వ్యక్తిగత సంబంధాలు:** యూనిట్ బాంకు వ్యాపార పరిధి చాలా పరిమితం. అందుచేత ఖాతాదారులతో వ్యక్తి గత సంబంధాలు ఉంటాయి. వారియొక్క వ్యక్తిగత ఆర్థిక స్తోమత తెలుస్తుంది. పరపతి రుణ సహాయాన్ని అందించడం ద్వారా స్థానిక సమస్యలను సత్వరమే తీర్చవచ్చును.

2. **స్థానిక అవసరాలపై శ్రద్ధ:** యూనిట్ బాంకులు స్థానికంగా ఏర్పడి స్థానికాభివృద్ధికి తోడ్పడతాయి. స్థానిక అవసరాలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తాయి. స్థానిక వనరులు, అభివృద్ధి అవకాశాలు, సమస్యలను బట్టి నిధులను కేటాయించడంలో శ్రద్ధ వహించి ఆ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తాయి.

3. **నైపుణ్యంగల పరపతి:** బాంకు సిబ్బందికి ఆ ప్రాంత ప్రజలతో సన్నిహిత సంబంధాలుంటాయి. కాబట్టి ఖాతాదారుల పరపతి, స్తోమత అప్పు తిరిగి చెల్లించే సామర్థ్యం, వ్యక్తిగత సుగుణాలు వీరికి తెలుస్తాయి. సరియైన పరపతి విధానాన్ని అమలు చేసి వారి బాకీలను తగ్గించుకోవచ్చును.

4. **నిర్వహణా సామర్థ్యం:** యూనిట్ బాంకు యొక్క కార్య కలాపాలు తక్కువగా ఉంటాయి. అందుచేత బాంకు నిర్వాహకులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడానికి వీలవుతుంది. మోసాలు, అక్రమాలు, మొదలైన వాటిని అరికట్టి నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడానికి అవకాశం ఎక్కువ ఉంటుంది. పరిపాలన సామర్థ్యం చక్కగా ఉండును.

5. **నిధుల కేంద్రీకరణ లేకపోవడం:** యూనిట్ బాంకుకు బ్రాంచి బాంకువలె దేశ వ్యాప్తంగా శాఖలుండవు. కాబట్టి గుత్తాధిపత్యానికి అవకాశం ఉండదు. ప్రస్తుత ఆర్థికవిధానానికి అనువుగా ఈ బాంకింగ్ వ్యవస్థలో నిధుల కేంద్రీకరణకు అవకాశం లేదు.

## 2.8 యూనిట్ బాంకింగ్ నష్టాలు: యూనిట్ బాంకింగ్‌లో క్రింద పేర్కొన్న లోపాలున్నాయి.

1. **పరిమిత ఆర్థికవనరులు:** యూనిట్ బాంకులకు పరిమితమైన ఆర్థిక వనరులు ఉంటాయి. ఆర్థికమాంద్యాలకు అవి తట్టుకోలేవు. ఆ ప్రాంతంలో అప్పులు తీసుకొన్న పరిశ్రమలు దెబ్బతింటే, ఈ బాంకులు కూడా దెబ్బతింటాయి. 1931-1932 లో వచ్చిన ఆర్థికమాంద్యం వల్ల అమెరికాలో 5000 బాంకులు దెబ్బతిన్నాయి.

2. **ప్రత్యేకీకరణకు అవకాశం తక్కువ:** ఈ పద్ధతి బాంకింగ్‌లో అన్ని శాఖల నిర్వహణ బాధ్యత సాధారణంగా ఒక వ్యక్తి చూచుకొంటాడు. వ్యాపార స్థాయి తక్కువగా ఉండడం వల్ల నిపుణులను నియమించే అవకాశం తక్కువ. ఆధునిక బాంకింగ్ పద్ధతులను ప్రవేశ పెట్టుటకు వీలుండదు.

3. **స్థానిక ఒత్తిడులు:** రుణాలు ఇచ్చేటపుడు బాంకింగ్ సూత్రాలను పాటించకుండా స్థానిక పలుకుబడులకు, ఒత్తిడులను లెక్కలోనికి తీసుకొనవలసిరావచ్చును. దీని వల్ల బాంకింగ్ ప్రమాణాలకు భంగం వాటిల్లవచ్చును.

4. **అనారోగ్య పోటీ:** యూనిట్ బాంకులు వేరు వేరు మానేజ్‌మెంట్ల ద్వారా నిర్వహింపబడుటచే వీరి మధ్య తీవ్రపోటి ఉండి నష్టాలకు గురయ్యే అవకాశం గలదు. ఈ పోటివల్ల ప్రకటనలు, పబ్లిసిటి మొదలైన వాటిపై అనవసర ఖర్చు పెరగవచ్చును.

5. **నష్టాలను ఎదుర్కొనే శక్తి తక్కువ:** నష్టభయాన్ని ఇతర బ్రాంచీలకు విస్తరించి పంపిణీ చేసే అవకాశం లేదు. పెద్ద విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యం యూనిట్ బాంకులకు ఉండదు. కార్యకలాపాలు తక్కువగా యుండడం, వనరులు తక్కువగా ఉండడం, పెట్టుబడులలో వైవిధ్యం లేకపోవడంవల్ల యూనిట్ బాంకులు నష్టాలను తట్టుకొనలేవు.

6. **నియంత్రణ సమన్వయ లోపం:** అసంఖ్యాకమైన స్వతంత్ర ప్రతిపత్తిగల యూనిట్ బాంకుల కార్యకలాపాలను సమన్వయం చేయడం ప్రభుత్వానికి, కేంద్ర బాంకుకు కష్టమవుతుంది. అంతేగాక, దేశం యొక్క ద్రవ్య విధానానికి అనుగుణంగా వీటి కార్యకలాపాలను క్రమ బద్ధం చేయడం, నియంత్రించడం కష్టంతో కూడుకొన్నపని.

7. **నిధుల మళ్లింపులో అసౌలభ్యత:** ఒక ప్రాంతంలోని నిధులను ఇంకొక ప్రాంతానికి బదిలీ చేయడంలో అసౌకర్యాలుండటం వల్ల నిధులను సమర్థవంతంగా పంపిణీ చేయడం సాధ్యపడదు. అభివృద్ధి చెందిన ప్రాంత నిధులను తక్కువ అభివృద్ధి చెందిన ప్రాంతాలకు మళ్ళించడం కష్టం కాబట్టి, ప్రాంతీయాభివృద్ధిలో ఉన్న అసమానతలు తొలగించడం కష్టము.

పైన వివరించినట్లుగా బ్రాంచి బాంకింగ్ మరియు యూనిట్ బాంకింగ్ వ్యవస్థలలో లాభాలు, నష్టాలున్నప్పటికి, బ్రాంచి బాంకింగ్ వ్యవస్థ ఎక్కువ లాభదాయకమైనది. అభివృద్ధి చెందని మరియు అభివృద్ధి చెందుతున్న దేశాలకు బ్రాంచి బాంకింగ్ ఉపయోగకారి అయితే అభివృద్ధి చెందిన దేశాలకు యూనిట్ బాంకింగ్ పద్ధతి ఉపయోగకరం.

**2.9 భారతదేశానికి అనువైన వ్యవస్థ బ్రాంచి బాంకింగ్:** బ్రాంచి బాంకింగ్‌లో అనేక సదుపాయాలు, లాభాలు ఉన్నందువల్ల ప్రపంచంలో చాలా దేశాలు బ్రాంచి బాంకింగ్ వైపు మొగ్గు చూపాయి. భారతదేశం కూడా బ్రాంచి బాంకింగ్ విధానాన్నే అనుసరిస్తున్నది. దేశంలో ప్రజల వద్ద నిద్రాణంగా ఉన్న పొదుపు మొత్తాలను సమీకరించి ఉత్పాదక కార్యకలాపాలకు అందజేయవలసియున్నది. అందుచేత గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచి ఆఫీసులు ఉండనిదే ఈ కృషి ఫలించదు. మన వ్యవసాయరంగం పరపతి అవసరాలు తీర్చడానికి ఏ ఒక్క రకమైన ద్రవ్య సంస్థలు బహుళ సంస్థల విధానాన్ని - వాణిజ్య బాంకులు, సహకారబాంకులు, ప్రాంతీయ గ్రామీణ బాంకులు ఎంచుకొన్నాయి. దీనికి బ్రాంచి బాంకింగ్ పద్ధతి అనువైనది. గ్రామీణ ప్రాంతాలలో యూనిట్ బాంకులు పనిచేయడం కష్టం. ఆర్థికాభివృద్ధికి మన దేశంలో పంచవర్ష ప్రణాళికలు అమలు జరుపబడుచున్నాయి. ఆర్థిక వనరులు అధికస్థాయిలో కావలసియున్నది. బ్రాంచి బాంకింగ్ పద్ధతిలో వనరుల సేకరణ ఎక్కువ చేయవచ్చును.

బ్రాంచి బాంకులు పెద్ద బాంకులు, వాటి వనరులు, లాభాలు ఎక్కువగా ఉంటాయి. నష్టాలు భరించగలవు. దివాలా తీయడం అరుదు. యూనిట్ బాంకులు దివాలా తీసే అవకాశం ఎక్కువ. బ్రాంచి బాంకింగ్ ప్రజలలో విశ్వాసాన్ని పెంపొందించి పొదుపు సేకరణ శక్తివంతం చేస్తుంది. ముఖ్యంగా బలహీనవర్గాల అభ్యున్నతికి, స్వయం ఉపాధి, కల్పనకు బ్రాంచి బాంకింగ్ తోడ్పడుతుంది.1969 లో మన దేశంలో మొత్తం బాంకుల శాఖలు 8626 ఉండగా మార్చి2000 నాటికి 67,335 శాఖలకు పెరిగాయి. వీటిలో దాదాపు 50% ఆఫీసులు గ్రామీణ ప్రాంతాలలో స్థాపించబడ్డాయి.

పై కారణాల దృష్ట్యా, భారతదేశంలో బ్రాంచి బాంకింగ్ వ్యవస్థ పూర్తి అనుకూలముగా పనిచేయుచున్నది-దేశంలో బాంకుల అభివృద్ధి, ప్రజల అభివృద్ధికి ఈ వ్యవస్థ ఇతోధికంగా కృషి చేయుచున్నది.

**సామూహిక బాంకింగ్** (Group Banking) : ఒక కార్పొరేషన్ లేదా సంఘం లేదా ( ట్రస్టు ఆధ్వర్యంలో రెండు లేక అంతకంటే ఎక్కువ బాంకులు పని చేస్తే అట్టి బాంకింగ్ వ్యాపారాన్ని సామూహిక బాంకింగ్ అంటారు. రెండు లేక కొన్ని బాంకులు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఒక అసోషియేషన్ ట్రస్టు నియంత్రణలోనున్న యెడల దానిని సామూహిక బాంకింగ్ అంటారు. ఈ పద్ధతిలో బ్రాంచి బాంకింగ్ మరియు యూనిట్ బాంకింగ్‌లలో ఉండే లాభాలు రెండును కలసియుంటాయి. ఈ పద్ధతివల్ల క్రింది ప్రయోజనాలున్నాయి.

- గ్రూపులో సభ్యత్వం ఉన్న ప్రతి బాంకు స్వంత డైరక్టర్ల బోర్డును కలిగియుండి కేంద్రీకృతపాలనకు తావిస్తుంది.

- అధిక ద్రవ్యత్వత సృష్టించడం మరియు వనరుల సేకరణ, సులభతరం అవుతుంది.

- ప్రకటన ఖర్చులు అన్ని సభ్యబాంకులు భరిస్తాయి.

- సభ్యబాంకులు సమర్ధవంతంగా పనిచేయుటకు నిపుణుల సేవలను కూడా అందించడం జరుగుతుంది. - అన్ని సభ్యబాంకులలో ఒకే రకమైన అకౌంటింగ్ విధానం అమలుచేయడం వల్ల వ్యాపారాన్ని సమర్థవంతంగా నమోదుచేయవచ్చును.

## 2.10 సామూహిక బ్యాంకింగ్ వల్ల నష్టాలు

- అన్ని సభ్యబ్యాంకులపై కేంద్ర కార్యాలయం పూర్తి స్థాయిలో పర్యవేక్షణను చేయలేదు.
- కొన్ని సార్లు హోల్డింగ్ కంపెనీ (కేంద్రకార్యాలయం) చేసే తప్పులకు బాధ్యత సభ్యబ్యాంకులు వహిస్తాయి.
- ఒక సభ్యబ్యాంకు దివాలా తీస్తే దాని ప్రభావం ఇతర సభ్య బ్యాంకులపై ఉంటుంది.
- కొన్ని సార్లు కేంద్రహోల్డింగ్ కంపెనీ కొనుగోలు విభాగం వివిధ కొనుగోళ్ళను లంచగొండితనానికి తలొగ్గి చేయడం వల్ల దీనిని సభ్యబ్యాంకులు భరించాల్సియుంటుంది.

**కరస్పాండెంట్ బ్యాంకింగ్** (Correspondent Banking): కరస్పాండెంట్ బ్యాంకింగ్ వ్యవస్థ క్రింద ఒక గ్రామం లేదా పట్టణంలోని ఒక చిన్న బ్యాంకు ఒక నగరంలోని ఒక పెద్ద బ్యాంకుతో సంబంధం పెట్టుకొంటుంది. నగరంలోని పెద్ద బ్యాంకును కరస్పాండెంట్ బ్యాంకు అని, గ్రామం లేదా పట్టణంలోని చిన్న బ్యాంకును రెస్పాండెంట్ బ్యాంక్ (Respondent Bank) అని అంటారు. ఈ చిన్న బ్యాంకులు నగరంలోని కరస్పాండెంట్ బ్యాంకులో డిపాజిట్లు పెడతాయి. యూనిట్ బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న నిధులు బదిలీ సమస్య కరస్పాండెంట్ బ్యాంకింగ్ తొలగిస్తుంది. అమెరికా సంయుక్తరాష్ట్రంలో ఈ వ్యవస్థ ఉన్నది.

**గొలుసు బ్యాంకింగ్** (Chain Banking ): ఇది సామూహిక బ్యాంకింగ్‌కు మరోరూపంగా చెప్పవచ్చును. రెండు గాని అంతకుమించి గాని బ్యాంకులు ఒక వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం యొక్క నిర్వహణలో ఉన్న యెడల దానిని గొలుసు బ్యాంకింగ్ అంటారు. యూనిట్ బ్యాంకింగ్ లోపమును సవరించుటకు ఇది ఉపకరిస్తుంది. కేంద్ర కార్యాలయం లాంటి హోల్డింగ్ కంపెనీ ద్వారా కాకుండా వేరే పద్ధతిలో రెండు లేక అంతకంటే ఎక్కువ బ్యాంకులు ఒకే సూత్రం పై పనిచేస్తే ఆవ్యవస్థను గొలుసు బ్యాంకింగ్ అనవచ్చును. ఈ పద్ధతిలో హోల్డింగ్ కంపెనీగా ఒక వ్యక్తి గాని లేక వ్యక్తుల సమూహంగాని సభ్యబ్యాంకుల కార్యకలాపాలను నిర్దేశిస్తూ నియంత్రిస్తుంది. ఈ బ్యాంకింగ్ పద్ధతి అమెరికాలో 19వ శతాబ్దంలో పుట్టి 1929 లోని గ్రేట్ డిప్రెషన్ వరకు కొనసాగింది. ఈ వ్యవస్థ యొక్క లాభనష్టాలు దాదాపు గ్రూప్ బ్యాంకింగ్ పద్ధతి యొక్క లాభనష్టాలేనని చెప్పవచ్చును.

**మిశ్రమ బ్యాంకింగ్** (Fixed Banking) : పరిశ్రమలకు వ్యాపార సంస్థలకు అవసరమైన స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణ సౌకర్యాలను అందించే బ్యాంకింగ్ వ్యవస్థను మిశ్రమ బ్యాంకింగ్ పద్ధతి అంటారు. ఐరోపాలోని కొన్ని దేశాలలో ముఖ్యంగా జర్మనీ దేశంలో ఉండే బ్యాంకులు మిశ్రమ బ్యాంకింగ్ విధానాన్ని చేపట్టాయి. జర్మనీలోని బ్యాంకులు ఒక సిండికేటుగా ఏర్పడి పారిశ్రామిక సంస్థలను స్థాపించి వాటి వాటాలలోను, బాండ్లలోను పెట్టుబడి పెడతాయి. అవి ఆ వ్యాపార సంస్థల నిర్వహణను కూడా చేపడతాయి. కొంత కాలం అయిన తర్వాత పారిశ్రామిక సంస్థలు తమ స్వంత కాళ్ళమీద నిలువబడగలిగిన తర్వాత బ్యాంకులు తమ ఆధీనంలో ఉన్న వాటాలను, బాండ్లను అమ్మి వేస్తాయి. జర్మనీలో బ్యాంకులు ఎక్కువ మూలధనంతో స్థాపించుటవల్ల, దీర్ఘకాలికి డిపాజిట్లు సేకరించుకోవడం వల్ల రిజర్వులు అధికం చేసుకోవడం వల్ల పారిశ్రామిక సంస్థలకు దీర్ఘకాలిక రుణాలను ఇవ్వగలుగుతున్నాయి. స్వల్ప కాలిక డిపాజిట్లను స్వల్పకాలిక రుణాలిచ్చే నిమిత్తం ఉపయోగిస్తాయి. జర్మనీలో ఇంగ్లండ్‌లో వలె పారిశ్రామిక బ్యాంకులు లేనందువల్ల మిశ్రమ బ్యాంకింగ్‌ను అవలంబించవలసి వచ్చింది. ఆ దేశంలో బ్యాంకులు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలివ్వడమే కాక హుండీలను వ్రాయడం, డిస్కౌంటు చేయడం, కంపెనీ వాటాలను, బాండ్లను కొనుగోలుచేయడం, పరపతి లేఖలను ఇవ్వడం మొదలైన విధులు నిర్వహిస్తాయి. ఇంగ్లండులో వలె డిస్కౌంటుహౌస్‌లు, వాటా జారీ సంస్థలు, పారిశ్రామిక ద్రవ్య సహాయ సంస్థలు లేకపోవడం వల్ల జర్మనీలో వాణిజ్య బ్యాంకులే పరిశ్రమలకు విత్తం సమకూర్చవలసియున్నది.

## 2.11 మిశ్రమ బ్యాంకింగ్ ప్రయోజనాలు: 
మిశ్రమ బ్యాంకింగ్ వల్ల ప్రయోజనాలను క్రింద వివరించడమైనది.

1. పరిశ్రమలకు కావలసిన స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు ఒకే బ్యాంకు అందజేయవచ్చును. వివిధ రకాలైన రుణాలకు వివిధ బ్యాంకుల వద్దకు పోనవసరము లేదు. ప్రజలు తమ సొమ్ములో ఎక్కువ భాగాన్ని వాణిజ్య బ్యాంకులలో డిపాజిట్లుగా ఉంచుతారు.

కంపెనీ వాటాలు, డిబెంచర్లు ఎక్కువగా అమ్ముడుపోవు. కాబట్టి బాంకులు దీర్ఘకాలిక పెట్టుబడి కూడా పరిశ్రమలకు సమకూరిస్తే కంపెనీలు తగినంత ద్రవ్యవనరులను సమకూర్చుకొన వీలవుతుంది.

2. పారిశ్రామిక వాటాలకు పూచీ ఇవ్వడం మొదలగు కార్యకలాపాల వల్ల బాంకు పరపతి దీర్ఘకాలిక అవసరాలకు పరోక్షంగా అందుతూనేయున్నది. అటువంటప్పుడు బాంకులు ప్రత్యక్షంగానే దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టడమే మంచిది. దీర్ఘకాలిక రుణాలచ్చిన కంపెనీ డైరక్టర్ల బోర్డులో తన ప్రతినిధిని నియమించి దాని పరిస్థితులు ఎప్పటి కప్పుడు తెలుసుకొంటూ నష్టములు రాకుండా జాగ్రత్తపడుటకు వీలున్నది.

3. వాణిజ్య బాంకులు కంపెనీలలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టినపుడు ఆ కంపెనీలపై ప్రజలకు విశ్వాసమేర్పడుతుంది. వాటి వాటాలు, డిబెంచర్లు ప్రజలు నిస్సందేహంగా కొంటారు. కంపెనీలలో వనరులు సమకూర్చుకొనుట సులువవుతుంది. కంపెనీ నిర్వహణాధికారులకు ఇది ఎంతో ఉపయోగకారి.

4. పరిశ్రమలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు బాంకులు అందిస్తున్నందున పరిశ్రమల సమస్యలు బాంకులకు బాగా తెలిసియుంటాయి. దేశ వ్యాప్తంగా ఉన్న వాటి బ్రాంచీల ద్వారా పారిశ్రామిక వాతావరణాన్ని చక్కగా అంచనా వేయగలవు. దీని వల్ల పరిశ్రమలు పటిష్టంగా నిర్వహించుకొనుటకు అవకాశం గలదు.

5. జర్మనీ లాంటి దేశాలలో మిశ్రమ బాంకింగ్ పద్ధతి వలననే పారిశ్రామిక అభివృద్ధి అతిశీఘ్ర కాలంలో సాధించగలిగాయి. పారిశ్రామిక బాంకులు అభివృద్ధి చెందని దేశాలలో మిశ్రమ బాంకింగ్ ఎంతో లాభదాయకం. దేశాలలో ఇతర పెట్టుబడి మార్గాలు తగ్గిపోతున్నందున, పరిశ్రమలలో పెట్టుబడులకు నూతన అవకాశాలు కల్పించుటకు వీలుకలదు. చాలా దేశాలలో ఈ విషయం పై మార్పుగోచరించుచున్నది.

6. బాంకులు పరిశ్రమలకు దీర్ఘకాలిక పెట్టుబడులు రుణాలు అందజేయడం చేత, కంపెనీలకు వనరుల గురించి ఉండే అనిశ్చితత్వం, ఇతర ఆధారాల ద్వారా వనరులను సమీకరించే సమస్యలు ఉత్పన్నం కావు.

**2.12 మిశ్రమ బాంకింగ్ నష్టాలు:** మిశ్రమ బాంకింగ్ వల్ల క్రింద పేర్కొన్న నష్టాలు గలవు.

1. దీర్ఘకాలిక డిపాజిట్లతో పాటు స్వల్ప కాలిక డిపాజిట్లతో బాంకులు వ్యాపారం చేస్తుంటాయి. ఈ నిధులు దీర్ఘకాలిక రుణాలు ఇస్తే డిపాజిట్ దార్లు అడిగిన వెంటనే చెల్లించగలిగే శక్తి బాంకుకు ఉండదు. అప్పుడు బాంకుల మనుగడకే సమస్య వస్తుంది.

2. ఆర్థిక మాంద్య కాలంలో పరిశ్రమలకు నష్టాలు వస్తాయి. వాటాలు, డిబెంచరు పత్రాల విలువలు బాగా పడిపోతాయి. దీని వల్ల పరిశ్రమలలో పెట్టబడిన బాంకులు కూడా దెబ్బతింటాయి.

3. ఆర్థిక ద్రవ్యోల్బణం కాలంలో పరిశ్రమలకు బాగా లాభాలు సమకూరుతాయి. పరిశ్రమల వాటాల ధరలు పెరుగుతాయి. లాభాలచే ఆకర్షించబడి బాంకులు పారిశ్రామిక వాటాలను అధికంగా కొనవచ్చును. ఈ పరిస్థితి స్పెక్యులేషన్‌కు దారితీయవచ్చును. ఆకస్మికంగా కంపెనీల వాటాల ధరలు తగ్గితే బాంకులు నష్టపోతాయి.

4. కంపెనీలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టినపుడు ఆ కంపెనీకి కావలసిన స్వల్పకాలిక రుణాలు ఇవ్వవలసిన దాని కన్నా ఎక్కువ ఇవ్వవలసిరావచ్చును. బాంకు ఆ కంపెనీలో చేసిన విచక్షణారహిత పెట్టుబడుల నుండి బయటపడుటకు ఇంకా ఎక్కువ రుణాలు ఇవ్వవలసిన పరిస్థితి రావచ్చును.

అయితే, పైన పేర్కొన్న నష్టాలు అంత ప్రమాదం కలిగించేవి కాదని మిశ్రమ బాంకింగ్‌ను సమర్థించే వారు అభిప్రాయపడుతున్నారు. బాంకు యొక్క మూలధనం, రిజర్వులు తగినంత సమకూర్చుకొంటే మిశ్రమ బాంకింగ్ వ్యవస్థలో ప్రమాదం ఉండే అవకాశములేదు. పారిశ్రామికాభివృద్ధిలో వాణిజ్య బాంకులు కూడా ప్రధాన పాత్ర వహించాలనే అభిప్రాయం మిశ్రమ బాంకింగ్‌ను వ్యతిరేకించే ఇంగ్లండ్ వంటి దేశాలలో కూడా ప్రాముఖ్యతను సంతరించుకొంటున్నది.

**పాఠము-3**

# భారతదేశంలో వాణిజ్య బాంకింగ్
# (Commercial Banking in India)

**లక్ష్యాలు** (Objectives) :

- సంఘటిత, అసంఘటిత రంగాలంటే ఏమిటో తెలుసుకోవడం.
- సంఘటిత, అసంఘటిత రంగాలలో ఉన్న సంస్థలు, ఇతర ఏజెన్సీలను తెలుసుకోవడం.
- వాణిజ్య బ్యాంకుల జాతీయకరణ గురించి, జాతీయకరణకు కారణాలు తెలుసుకోవడం.
- బాంకుల జాతీయకరణ లక్ష్యాలు, జాతీయకరణ తర్వాత అవి సాధించిన ప్రగతి తెలుసుకోవడం.
- బాంకుల రుణాలు మంజూరు చేయునపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడం.
- బాంకులు ఇచ్చే రుణాలలో రకాలను తెలుసుకోవడం.

**అంశాలు** (Aspects)

3.1 సంఘటిత రంగాలు - అసంఘటిత రంగాలు.

3.2 ద్రవ్య మార్కెట్ - నిర్వచనం

3.3 సంఘటిత విభాగం

3.4 అసంఘటిత విభాగం

3.5 వాణిజ్య బాంకుల జాతీయకరణ ఆవశ్యకత

3.6 జాతీయకరణకు కారణాలు

3.7 జాతీయకరణ లక్ష్యాలు.

3.8 జాతీయకరణ తర్వాత బాంకులు సాధించిన ప్రగతి

3.9 రుణవిధానాలు - ఆచరణలు.

3.10 రుణాలలోని రకాలు

3.11 సెల్ఫ్ఎసెస్మెంట్ ప్రశ్నలు

3.12 పదకోశం

## 3.1 సంఘటిత రంగాలు మరియు అసంఘటిత రంగాలు (Organised and Unorganised Sectors)

**ద్రవ్యమార్కెట్ :** ఏ దేశంలోనైనా పారిశ్రామిక, వ్యవసాయ, సేవారంగాలకు పెద్ద ఎత్తున పెట్టుబడులు అవసరమవుతాయి. భారీ ఎత్తున పెట్టుబడులు ఈ రంగాలకు వినియోగిస్తేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. అందునిమిత్తం ప్రతిదేశంలో పొదుపు ఉద్యమాన్ని ప్రోత్సహించి, ప్రజల పొదుపుమొత్తాలను అధికంచేసి వాటిని పెట్టుబడులుగా మలచడానికి పటిష్టమైన ద్రవ్యవ్యవస్థ ఎంతైనా అవసరము. స్వల్పకాలిక, మధ్యకాలిక మరియు దీర్ఘకాలిక రుణాలను సమకూర్చేందుకు కావలసిన యంత్రాంగాన్ని ద్రవ్య వ్యవస్థ సమకూరుస్తుంది. ఈ ద్రవ్య వ్యవస్థలో అన్ని ఆర్థికసంస్థలు, వాణిజ్య బాంకులు, అభివృద్ధి బాంకులు, నాన్ బాంకింగ్ సంస్థలు, చిట్ఫండ్ కంపెనీలు, ఇతరపెట్టుబడి

సంస్థలు చేరియుంటాయి. ద్రవ్యనిధులను రుణాలుగా అందించే వారిని, పుచ్చుకొనే వారిని అనుసంధానపరచే మార్కెట్లను రెండు రకాలుగా విభజింపవచ్చును. అవి (1) ద్రవ్యమార్కెటు (Money Market) (2) మూలధన మార్కెటు (Capital Market). స్వల్పకాలిక అవసరాలకు ద్రవ్యవనరులను రుణదాతలనుండి రుణాలు కావలసిన వారికి అందజేసే మార్కెటును ద్రవ్యమార్కెట్ అంటారు. వాణిజ్య బ్యాంకులు, దేశీయ బ్యాంకులు మొదలైన సంస్థలు పారిశ్రామిక, వ్యవసాయక, సేవారంగాలకు స్వల్పకాలిక రుణాలను అందజేస్తాయి. దీర్ఘకాలిక రుణాలను, మధ్యకాలిక రుణాలను పెట్టుబడులను సమకూర్చే సంస్థలు ఉన్న మార్కెట్‌ను మూలధన మార్కెట్ అంటారు. మార్కెట్‌లో అభివృద్ధి బ్యాంకులు, పెట్టబడి సంస్థలు మొదలైనవి ఉంటాయి. వాటాలు, బాండ్ల జారీచేయడం ద్వారా ఇతర మార్గాల ద్వారా, పారిశ్రామిక, వ్యాపార సంస్థలు తమ మూలధనాన్ని సేకరించుకొంటాయి.

**ద్రవ్యమార్కెటు నిర్వచనం :** మాడెన్, నాడ్లర్ లు నిర్వచించినట్లు "స్వల్పకాలిక, రుణాల, వ్యవహారుల వల్ల ఒక దేశం లేదా ప్రపంచం లోని ఆర్థిక వ్యవహారాలు పరిష్కారమయ్యే ప్రదేశము ద్రవ్యమార్కెట్ " అనవచ్చును. ఆచార్య క్రేధర్ ప్రకారం "సమీప ద్రవ్యానికి సంబంధించిన వివిధ తరగతులతో వ్యవహరించే వివిధ సంస్థలకు ఇచ్చిన పేరే ద్రవ్యమార్కెట్". ద్రవ్య మార్కెట్‌లో వర్తకులు, స్పెక్యులేటర్లు, బ్రోకర్లు, పారిశ్రామికదారులు, ఉత్పత్తి సంస్థలు, ప్రభుత్వం, వాణిజ్య బాంకులు, ఆర్థిక సంస్థలు, భీమాకంపెనీలు, కేంద్ర బాంకు ఉంటాయి. ఈ మార్కెట్‌లో వర్తక హుండీలు, ప్రాంశరీ నోట్లు, ప్రభుత్వ సెక్యూరిటీస్, వాటాలు, బాండ్లు మొదలైన వాటిని కొనడం, అమ్మడం జరుగుతుంది. ఈ పత్రాలన్నిటిని సమీప ద్రవ్యంగా (Near Money) పరిగణిస్తారు. కేంద్రబాంకు ద్రవ్య మార్కెట్‌కు మూలవిరాట్టు.

**ద్రవ్యమార్కెటు విభజన:** భారతీయ ద్రవ్యమార్కెట్‌ను రెండు భాగాలుగా విభజించారు. అవి (1) సంఘటిత విభాగం (2) అసంఘటిత విభాగము. వీటిగూర్చి క్రింద వివరించడం జరిగింది.

**(1) సంఘటిత విభాగం** (Organised Sector) : రిజర్వు బాంకు, పబ్లిక్ ప్రయివేటు రంగంలోని వాణిజ్య బాంకులు, అభివృద్ధి బాంకులు, ప్రాంతీయ గ్రామీణ బాంకులు, విదేశీ బాంకులు మొదలైనవి సంఘటిత విభాగానికి చెందుతాయి. సహకార వ్యవస్థలోని రాష్ట్ర, కేంద్ర, ప్రాధమిక సహకార బాంకులు కూడా దీని క్రిందకే వస్తాయి.

i) **రిజర్వు బాంకు :** ఇది మనదేశంలో కేంద్రబ్యాంకు, కరెన్సీనోట్లను జారీచేయడం, ప్రభుత్వానికి, ఇతర వాణిజ్య బ్యాంకులకు బాంకుగా వ్యవహరించడం, పరపతినియంత్రించడం, అంతర్జాతీయ ద్రవ్య నిధులను పరిరక్షించడం, రిజర్వుబాంకు యొక్క ముఖ్య నిధులు. సంఘటిత మార్కెట్ విభాగంలోని సభ్యుల మధ్య సన్నిహిత సంబంధాన్ని నెలకొల్పడానికి రిజర్వుబాంకు ఎంతగానో కృషి చేస్తుంది. ద్రవ్య సుస్థిరత, సమాజ శ్రేయస్సు, ఆర్థిక పురోభివృద్ధి సాధించడానికి రిజర్వుబాంకు కృషి చేస్తుంది.

ii) **వాణిజ్య బాంకులు :** వాణిజ్య బాంకుల విభాగంలో స్టేట్‌బాంకు పెద్ద బాంకు. రిజర్వు బాంకు కార్యాలయాలు లేని చోట్ల స్టేట్ బాంకు బ్రాంచీలు రిజర్వు బాంకు ప్రతినిధిగా వ్యవహరిస్తాయి. మన దేశంలో ప్రభుత్వ బాంకులు 27, ప్రయివేట్ బాంకులు 31, ప్రాంతీయ గ్రామీణ బాంకులు 196, సంఘటిత రంగంలో వాటి శాఖలతో సహా పని చేయుచున్నాయి. ఇవన్నీ వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయక రంగాలకు ఆర్థిక వనరులను సమకూరుస్తున్నాయి. దాదాపు వాణిజ్య బాంకులు 65,000 శాఖలకుపైగా దేశంలో పని చేస్తున్నాయి.

iii) **విదేశీ బాంకులు :** మనదేశం విదేశీ బాంకులు 41 ఉన్నాయి. ఇవి ఇతర భారతీయ వాణిజ్య బాంకుల వలె అన్ని రకాల బాంకింగ్ వ్యాపారం చేస్తాయి. ముఖ్యంగా విదేశీ ద్రవ్య వ్యవహారాలు చూస్తు ఉంటాయి.

iv) **అభివృద్ధి బాంకులు :** దేశంలో పారిశ్రామికాభివృద్ధి కోసం పరిస్థితిని అనుకూల పరచడమే అభివృద్ధి బాంకుల ముఖ్య లక్ష్యం. సుమారు ప్రస్తుతము మనదేశంలో 20పైగా అభివృద్ధి బాంకులు సంఘటిత విభాగంలో పనిచేస్తున్నాయి. ఉదాహరణకు, భారత పారిశ్రామిక ఆర్థిక సహాయ కార్పోరేషన్ (VFCI) భారత పారిశ్రామికాభివృద్ధి బాంకు (IDBI) మొదలైనవి.

v) **సహకార బాంకులు :** ఇవి వ్యవసాయరంగానికి సహాయం చేస్తాయి. భూమి అభివృద్ధి బాంకులు ప్రత్యేకించి వ్యవసాయానికి

దీర్ఘకాలిక రుణాలనిస్తాయి. మన దేశంలో ప్రస్తుతం 29 రాష్ట్ర సహకార బాంకులు, 367 జిల్లా సహకార కేంద్ర బాంకులు, 95,000 ప్రాధమిక వ్యవసాయ పరపతి సహకార బాంకులు పని చేస్తున్నాయి.

**(2) అసంఘటిత విభాగం**(Non organised Sector) : అసంఘటిత రంగంలో దేశీయ బాంకర్లు, వడ్డీ వ్యాపారస్థులు, నాన్ బాంకింగ్ సంస్థలు, చిట్‌ఫండ్లు, పెట్టుబడి సంస్థలు పనిచేస్తు ఉంటాయి. వీరు దీర్ఘకాలిక రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు మాత్రం తేడా చూపరు. రిజర్వు బాంకుతో ఈ సంస్థలకు అభిలాషణీయమైన సంబంధం ఉండదు.

i) **దేశీయ బాంకర్లు** : ప్రజల నుండి డిపాజిట్లు స్వీకరించి తిరిగి వాటిని అవసరమున్న వ్యక్తులకు లేదా వ్యాపారస్థులకు గాని రుణం రూపంలో అందజేసే వ్యక్తిని లేదా సంస్థను దేశీయ బాంకర్లు అంటారు. భారతీయ ద్రవ్య మార్కెట్‌లో దేశీయ బాంకర్లు ఎంతో ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. ఇవి హుండీలను కూడా డిస్కౌంటు చేసుకుంటాయి. దేశీయ వర్తకం అభివృద్ధికై రుణాలు మంజూరు చేస్తాయి. అయితే వడ్డీ రేటు ఎక్కువ ఛార్జీ చేస్తాయి. వీటిపై (RBI) కి పూర్తి నియంత్రణలేదు.

ii) **వడ్డీ వ్యాపారులు** : భారతీయ ద్రవ్య మార్కెట్ లోని అసంఘటిత రంగంలో ప్రాతినిధ్యం వహించిన దేశీయ ఆర్థిక సంస్థల కోవకు చెందినవారే ఈ వడ్డీ వ్యాపారస్థులు. వడ్డీ వ్యాపారం చేయడమే వీరి ప్రధాన వ్యాపారం. వడ్డీ వ్యాపారులు పరిమిత ప్రాంతాలకు తమ కార్యకలాపాలను కేంద్రికరిస్తారు. సాధారణంగా వినియోగ రుణాలను అందిస్తారు. వీరు రుణాల వినియోగాన్ని గురించి పట్టించుకొనరు.

iii) **నాన్ బాంకింగ్ సంస్థలు** : బాంకులు కాని ద్రవ్య సంస్థలను నాన్ బాంకింగ్ (బాంకేతర) ద్రవ్య సహాయ సంస్థలుగా స్థూలంగా చెప్పవచ్చును. ఏస్కీమ్ ప్రకారం అయినా డిపాజిట్లను స్వీకరించి, ఏవిధానంలోనైనా రుణాలను మంజూరు చేసే సంస్థ నాన్ బాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ, నాన్ బాంకింగ్ ఫైనాన్స్ రంగంలో పని చేస్తున్న సంస్థలను రెండు రకాలుగా చెప్పవచ్చును. (1) నమోదు లేకుండా పని చేస్తున్న సంస్థలు బ్రాకార్పొరేట్ రంగానికి చెందిన సంస్థలు. ఇందులో కొన్ని కంపెనీల చట్టం ప్రకారం నమోదు అయినప్పటికి రిజర్వు బాంకు అనుమతి లేకుండా పనిచేస్తాయి. కొన్ని కంపెనీల చట్టం క్రింద నమోదై, రిజర్వు బాంకు అనుమతితో వ్యాపారం చేస్తాయి. నాన్ బాంకింగ్ కంపెనీలు క్రింది విధంగా ఉన్నాయి.

- అద్దె కొనుగోలు ఫైనాన్స్ ఎక్విప్‌మెంట్ లీజింగు కంపెనీలు
- పెట్టుబడి సంస్థలు
- రుణాలందించే సంస్థలు
- గృహ నిర్మాణ ఫైనాన్స్ కంపెనీలు
- చిట్ ఫండు కంపెనీలు
- నిధి రూపంలో నడుస్తున్న సంస్థలు.

2000 సం॥లలో మన దేశంలో నాన్ బాంకింగ్ కంపెనీలు దాదాపు 1547 పనిచేస్తూ, అవి సేకరించిన డిపాజిట్లు మొత్తం రు॥ 19,342 కోట్ల వరకు ఉన్నది. ఈ కంపెనీ మొత్తం వాణిజ్య బాంకుల డిపాజిట్లలో 2.2 % పొంది ఉన్నాయి. అనేక చిన్న చిన్న ద్రవ్య సంస్థలు పనిచేస్తున్న వాటిని గురించిన సమాచారం రిజర్వు బాంకు వద్ద అందుబాటులో లేదు.

భారతీయ ద్రవ్య మార్కెట్ అంతగా అభివృద్ధి చెందలేదు. దీనికి క్రింది లోపాలు కారణంగా గోచరిస్తున్నాయి.

- పరస్పర సంబంధం లేని విభాగాలు
- అసంఘటిత విభాగం ఉనికి
- వడ్డీ రేట్లలో తేడాలు

- బిల్లు మార్కెటు లేకపోవడం
- రుణ సంబంధమైన నిధుల కొరత
- నిధుల అవ్యాకోచత్వం
- దేశీయ బాంకర్ల ప్రాముఖ్యత
- విదేశీ మారకపు నిధులు ఆకర్షించలేకపోవుట.

పై లోపాలను సవరించుటకు రిజర్వు బాంకు అనేక చర్యలను చేపట్టినది. భిన్న కాలాలలో, భిన్న ప్రాంతాలలో ఉన్న వడ్డీ రేట్లలోని వ్యత్యాసాన్ని కొంతవరకు తగ్గించగలిగింది. ఓపెన్ మార్కెట్ వ్యవహారాలు, బిల్లు మార్కెట్ పథకాలచేత ద్రవ్య ఒత్తిడులలో చెప్పకోదగిన మార్పును తీసుకొని రాగలిగింది. అయితే రిజర్వు బాంకు ఇప్పటికి పరిష్కరించ లేకుండా ఉన్న లోపాలు చాలా ఉన్నాయి.

**జాతీయకరణ - సాధించిన ఫలితాలు. (Nationalisation-Achievements)**

వాణిజ్య బాంకుల జాతీయకరణ ఆవశ్యకత : భారత దేశంలో 1960 దశకంలో వాణిజ్య బాంకులు వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, ఎగుమతుల వంటి ప్రాధాన్యత రంగాలకు పరపతి చాలా తక్కువగా అంద జేసాయి. ఈ బాంకులు ఎక్కువగా పరిశ్రమలకు, పెద్దవాణిజ్య సంస్థలకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చేవి. ప్రణాళికాబద్ధమైన అర్థిక వ్యవస్థలో బాంకులు తమ రుణాలను అన్ని ఉత్పాదక రంగాలకు ప్రయోజనాత్మకంగా ఉండేటట్లు పంపిణీ చేయడం ఎంతైనా అవసరము. అలాగే బాంకుల అనుసరించే విధానాలు, ఏకస్వామ్యపు ధోరణులను పెంచే విధంగాను, ఆర్థిక స్తోమతను కేంద్రీకృతం చేసే విధంగాను వనరులను దుర్వినియోగం చేసే విధంగాను ఉండకూడదు. వాణిజ్య బాంకులకు సాంఘిక, ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించేవిగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం 1968 లో బాంకులపై సామాజిక నియంత్రణ (Social Control) విధించింది. సామాజిక నియంత్రణ ఆశించిన ఫలితాలను చేకూర్చలేదు. బాకులను జాతీయం చేయకుండా సామాజిక నియంత్రణ విధించడం అర్ధ రహితమని ప్రభుత్వం భావించడం వల్ల, 1969 జూలై 19వ తేదిన కేంద్ర ప్రభుత్వం 14 వాణిజ్య బాంకులను జాతీయం చేసింది. తర్వాత 1980 ఏప్రియల్ మరొక 6 వాణిజ్య బాంకులను జాతీయం చేయడం జరిగింది.

**జాతీయ కరణకు కారణాలు** : బాంకుల జాతీయకరణకు క్రింది కారణాలు పేర్కొనవచ్చును.

(1) **సంపద అధికారం కేంద్రీకరణ** : దేశంలో బాంకులు కొద్దిమంది పారిశ్రామిక వేత్తలచే వారి స్వలాభం కోసం నియంత్రించబడేవి. కొద్దిమంది ప్రయివేటు వ్యక్తుల స్వల్ప మూలధనంతో బాంకులను నెలకొల్పి అత్యధికంగా ప్రజలనుండి డిపాజిట్లను స్వీకరించడం వల్ల, ఆ నిధులను వారి స్వలాభానికి వినియోగించుకోవడం జరిగేది. దీనివల్ల ఆర్థిక శక్తి, సంపద కొద్దిమంది చేతులలో కేంద్రీకరింప బడేది. దీనికి పరిష్కారం జాతీయకరణ మాత్రమే.

(2) **కొద్దిమంది చేతుల్లో యాజమాన్యం, నియంత్రణ** : భారతీయ బాంకులు ఎక్కువ వాటాలు కల్గిన కొద్దిమంది చేతుల్లో ఉండి వారి కనుసన్నాలలో పనిచేసేవి. బాంకుల పరపతి కూడా అనుయాయులకు లభించేది. పెద్ద బాంకుల మూలధనం కొద్దిమంది పారిశ్రామిక వేత్తలలో ఉన్నట్టు పరిశీలనలో తేలింది. మూలధనాన్ని వికేంద్రీకరణ చేయాలని ప్రభుత్వం భావించింది.

(3) **స్పెక్యులేషన్ వ్యవహారాలు** : మనదేశంలోని బాంకులు ధనవంతులైన పారిశ్రామికవేత్తల అధీనంలో ఉండటం వల్ల వాటిని వారు స్వప్రయోజనాలకు ఉపయోగించేవారు. స్పెక్యులేషన్ వ్యాపారం చెయ్యడం, విదేశీ మారక ద్రవ్యాన్ని తమ పేరిట ఇతర దేశాలలో జమకట్టడం, జాయింట్ స్టాక్ కంపెనీల వాటాలను లాభాల దృష్టి తో కొని, కృత్రిమ కొరత కల్పించడం, హామి లేకుండా వారి ఆధీనంలో ఉన్న సంస్థలకు రుణాల మంజూరు చేయడం మొదలైన అక్రమ వ్యాపారాలకు యాజమాన్యాలు పాల్పడేవి.

(4) బ్రాంచీలు పట్టణాలకు పరిమితం: మనదేశంలో ప్రయివేటు బ్యాంకులు వాటి శాఖలను పట్టణాలలో మాత్రమే నెలకొల్పేవారు. గ్రామాలలో అసలు ఏర్పాటు చేసేవారు కాదు. మనది వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ. 70% పైగా ప్రజలు వ్యవసాయ రంగంలో,

గ్రామాలలో జీవిస్తున్నారు. వీరందరి పొదుపును సమీకరించి గ్రామీణాభివృద్ధికి తోడ్పడటానికి గ్రామాలలో బ్యాంకు శాఖలు ఏర్పాటు చేయడం అవసరమని ప్రభుత్వం గుర్తించింది.

(5) **డైరక్టర్లకు రుణాలు:** బ్యాంకుల డైరక్టర్లకు రుణాలు తక్కువ వడ్డీకి లభించేవి. తక్కువ వడ్డీకి రుణాలు తీసుకొని వీరు వారి బంధు మిత్రులకు ఇచ్చేవారు. 1969 లో20 పెద్ద బాంకులలో 188 మంది డైరక్టర్లుగా పనిచేస్తూ వారు మరల 1452 కంపెనీల్లో డైరక్టర్లుగా పనిచేసేవారు. అందువల్ల బ్యాంకుల నిధులు జాతీయభివృద్ధికి కాక డైరక్టర్ల స్వలాభానికి ఉపయోగపడేవి. వారు డైరక్టర్లుగా ఉన్న కంపెనీలకే రుణాలు అందేవి. సామాన్య ప్రజలకు, ఇతర రంగాలకు రుణాలు అందే అవకాశం ఉండేది కాదు. ముఖ్యంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, చిన్న పరిశ్రమలు, ఎగుమతి రంగాలకు పరపతిని సమకూర్చలేదు.

(6) **నల్ల ధనాన్ని వెలికి తీయడానికి :** నల్లధనం, దాచిఉంచిన ధనాన్ని వెలికి తీయడానికి ప్రయివేటు యాజమాన్యంలో ఉండే బ్యాంకులు అంతగా తోడ్పడం లేదు. ఈ సమస్యను ఎదుర్కోటానికి బ్యాంకుల జాతీయకరణ తప్పనిసరి అయింది.

(7) **సామ్యవాద సమాజ స్థాపన :** బాంకులు ప్రజల డబ్బుతో లాభార్జన చేయుచున్నాయి. ఈ లాభాలు కొద్ది మంది వ్యక్తులకే చేరుతున్నాయి. వాటిని జాతీయం చేస్తే ఈ లాభాలు ప్రభుత్వానికి చెందుతాయి. వీటిని ఉత్పాదక కార్యకలాపాల్లో వినియోగించడం ద్వారా ప్రభుత్వం ప్రజల ఆర్థిక స్థితిగతులను మెరుగు పర్చగలదు. అంటే సామ్యవాద రీతి సమాజ స్థాపనకు బాంకుల జాతీయకరణ తోడ్పడకలదు.

(8) చిన్న వ్యాపార సంస్థల నిర్లక్ష్యం: జాతీయకరణకు పూర్వం బ్యాకుల రుణాలు పెద్ద పరిశ్రమలకు మాత్రమే ప్రభలించేవి. చిన్న వ్యాపార సంస్థలు, కుటీర, గ్రామీణ పరిశ్రమలకు ఏవిధమైన పరపతి అందలేదు. జాతీయాకరణ తర్వాత ప్రాధమిక రంగాలకు ప్రాధాన్యత లభించింది.

(9) **పరపతి నియంత్రణ :** వాణిజ్య బాంకులు ద్రవ్యాన్ని సృష్టిస్తుంటాయి. దీనివల్ల ద్రవ్యం సప్లయి పెరిగి ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. ఈ పరిస్థితులను అరికట్టడానికి రిజర్వు బాంకు తీసుకొనే చర్యలను వాణిజ్య బ్యాకులు తు.చ తప్పకుండా అమలు చేయాలి. కాని మన వాణిజ్య బాంకులు RBI ఆదేశాలను అమలు జరుపుటలేదు. కనుక బాంకులను జాతీయం చేస్తే, వాటిపై రిజర్వు బాంకుకు పూర్తి నియంత్రణ సాధ్యమవుతుంది.

(10) **ఇతర లాభాలు**

- జాతీయాకరణ వల్ల దేశ ఆర్థిక ప్రణాళికలకు ప్రభుత్వానికి వనరులు అందుబాటులో ఉంటాయి.
- డిపాజిటర్లకు పూర్తి రక్షణ అందజేయడం.
- బాంకుల ఉద్యోగస్తుల స్థితిగతులను మెరుగుపర్చడం.
- బాంకుల మధ్య అనవసరమైన పోటీని నివారించుట
- కేంద్ర బాంకు, వాణిజ్య బాంకుల మధ్య సత్సంబంధాలను పెంపొందించుట.

**వాణిజ్య బాంకుల జాతీయాకరణ లక్ష్యాలు :** ప్రభుత్వం క్రింది లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని బాంకులను జాతీయం చేసింది.

(1) బాంకులపై కొద్దిమందికి గల ఆధిపత్యాన్ని తొలగించడం.

(2) వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, ఎగుమతి పరిశ్రమల రంగాల్లో వృద్ధి రేటును పెంచడం.

(3) వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి పరచడం.

(4) బాంకింగ్ సౌకర్యాల విషయంలో దేశంలో వివిధ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలను తొలగించడం.

(5) బాకుల నిర్వహణలో ప్రత్యేక శిక్షణ, నైపుణ్యంగల వ్యక్తులకు స్థానం కల్పించడం.

(6) బాంకుల సిబ్బందికి మంచి జీతభత్యాలు, శిక్షణా సౌకర్యాలు కల్పించుట.

**జాతీయీకరణ తర్వాత బాంకులు సాధించిన ప్రగతి:**

బాంకుల జాతీయీకరణ భారత బాంకింగ్ చరిత్రలో మరువరాని సంఘటన. బాంకులను జాతీయం చేయడంతో 90% బాంకు డిపాజిట్లు ప్రభుత్వ బాంకుల ఆధీనంలోనికి వచ్చాయి. వాణిజ్య బాంకుల దృక్పధాలలో, పనిచేసే పద్ధతులలో, ధ్యేయాలలో శ్లేషనీయమైన మార్పులు వచ్చాయి. పరపతి విధానంలో అభిలషణీయమైన మార్పులు చోటు చేసుకొన్నాయి. బాంకింగ్ వ్యవస్థ రూపు రేఖలు గణనీయంగా మార్పు చెందాయి. పరిమాణంలోను, విస్తరణలోను ప్రశంసనీయమైన పురోగతిని సాధించాయి. ఇప్పుడు బాంకులు ప్రభుత్వ విధానాల అమలుకు శక్తివంతమైన సాధనాలుగా రూపొందినాయి. ప్రభుత్వ ధ్యేయాలకు పరపతి విధానానికి అవినాభావ సంబంధం ఏర్పడింది. బాంకింగ్ విస్తరణలో ప్రాంతీయ వ్యత్యాసాలను తగ్గించి, దేశం మొత్తం మీద సంతులిత అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రాంతీయ ఆర్థిక అసమానతలను తొలగించడానికి, ఉద్యోగ అవకాశాలను సృష్టించడానికి, వ్యవస్థా నైపుణ్యాన్ని విస్తరించడానికి, వెనుకబడిన ప్రజల ఆర్థికాభ్యున్నతికి పెంపొందించడానికి వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధిని సాధించడానికి బాంకింగ్ రంగంలో తీవ్రమయిన మార్పులు ప్రవేశపెట్టడమైనది.

బాంకింగ్ విధానంలో వచ్చిన మార్పుల వల్ల గతంలో నిర్లక్ష్యం చేసిన కొన్ని రంగాలకు ఇప్పుడు పరపతి లభిస్తున్నది. చిన్న తరహా పరిశ్రమలు, వ్యవసాయం, చిన్నచిన్న వ్యాపారస్థులు, వృత్తి దారులు, బడుగు వర్గాలు మొదలైన రంగాలకు ప్రస్తుతం పరపతి విరివిగా లభిస్తున్నది. పరోక్ష సహాయక సదుపాయాలను రిజర్వు బాంకు కల్పించుట వల్ల, వాణిజ్య బాంకులు ఆయా రంగాలకు అధికంగా తోడ్పడగలుగుతున్నాయి. మన సాంఘిక లక్ష్యాలైన పేదరికపు నిర్మూలన కార్యక్రమాలకు బాంకులు ఇతోధికంగా సహాయాన్ని అందిస్తున్నాయి. జాతీయమైన వాణిజ్య బాంకులు సాధించిన ప్రగతి క్రింది అంశాల వివరణ ద్వారా తెలుసుకొనవచ్చును.

**(1) బ్రాంచీల విస్తరణ** (Branch Expansion) : త్వరితగతిన దేశ ఆర్థికాభివృద్ధికి బాంకుల వాటి శాఖల విస్తరణ ఎంతో అవసరము. బాంకులను జాతీయం చేయడంలోని ముఖ్య ఉద్దేశ్యం కూడా బాంకింగ్ సౌకర్యాలు లేని ప్రదేశాలలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో, బాంకు బ్రాంచిలను ఏర్పాటు చేయడం కొత్తగా ప్రవేశపెట్టిన 'లీడ్ బాంక్ పథకం' ద్వారా బ్యాంకు బ్రాంచీల విస్తరణ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో జరిగినది. బాంకుల జాతీయీకరణ సమయంలో పట్టణాలలోనే కేంద్రీకృతమైన బ్రాంచీల విస్తరణలో జాతీయీకరణ తరవాత గణనీయమైన మార్పులు వచ్చాయి. జాతీయీకరణ తర్వాత బాంకు బ్రాంచీల విస్తరణ ఈ క్రింది పట్టిక ద్వారా తెలుసుకొనవచ్చును.

**వాణిజ్య బ్యాంకుల ప్రగతి - 1969- 2002 పట్టిక - 1**

| అంశములు | జూన్ 1969 | జూన్ 1975 | జూన్ 1980 | జూన్ 1985 | మార్చి 1990 | మార్చి 1995 | జూన్ 2002 |
|---|---|---|---|---|---|---|---|
| 1. షెడ్యూలు బాంకుల సంఖ్య | 73 | 74 | 148 | 264 | 270 | 281 | 299 |
| 2. ప్రాంతీయ గ్రామీణ బాంకులు | | 73 | 183 | 196 | 196 | 196 | |
| 3. బాంకు ఆఫీసు | 8262 | 18730 | 32419 | 51385 | 59752 | 62367 | 66,967 |
| 4. ప్రభుత్వ రంగం | 6669 | 15064 | 25828 | 35629 | 41874 | 44764 | 46,118 |

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| బ్యాంకు ఆఫీసులు | | | | | | | |
| 5. బ్రాంచీ జనాభా | 64 | 32 | 21 | 15 | 14 | 15 | 15 |
| (వేలలో) | | | | | | | |
| 6. తలసరి | 88 | 208 | 494 | 1026 | 2098 | 4242 | 10500 |
| డిపాజిట్లు (రూ॥) | | | | | | | |

పట్టిక- ii

**వాణిజ్య బాంకుల బ్రాంచీల పెరుగుదల 1969 - 2002**

| ప్రాంత వివరణ | | జూన్ | జూన్ | జూన్ | జూన్ | జూన్ |
|---|---|---|---|---|---|---|
| | 1969 | 1975 | 1991 | 2000 | 2002 | |
| 1. గ్రామీణ ప్రాంతాలు | 1832 | 6806 | 35212 | 32,771 | 20413 | |
| | (22.4%) | (36.4%) | (58.2%) | (50.2%) | (39.6%) | |
| 2. చిన్న పట్టణాలు | | 3322 | 5570 | 11281 | 14329 | 12664 |
| | (40.1%) | (29.7%) | 18.7%) | (21.9%) | (24.5%) | |
| 3. పట్టణాలు | 14447 | 3266 | 7630 | 10051 | 10059 | |
| | (17.5%) | (17.4%) | (12.7%) | (15.4%) | (19.5%) | |
| 4. నగరాలు | 1661 | 3088 | 6128 | 8189 | 8358 | |
| రేవు పట్టణాలు | | (20%) | (16.5%) | (10.2%) | (12.5%) | (16.4%) |
| మొత్తం | | 8262 | 18730 | 60,251 | 65340 | 51494 |
| | (100%) | (100%) | (100%) | (100%) | (100%) | |

వాణిజ్య బాంకులు సాధించిన ప్రగతి జాతీయంచేసిన తర్వాత అమోఘంగా ఉన్నది. బాంకుల బ్రాంచీలు దేశవ్యాప్తంగా విస్తరింపబడ్డాయి. ఈ విషయాలను పట్టిక I లో చూపడమైనది. 1969 కి ముందు వాణిజ్య బాంకుల బ్రాంచీలు నగరాలకు, పట్టణాలకు మాత్రమే పరిమితమై ఉండేవి. గ్రామీణ ప్రాంత ప్రజలకు వాణిజ్య బ్యాంకుల రూపు తెలియదు. మన ఆర్థిక, సాంఘిక లక్ష్యాల సాధన కోసం గ్రామీణ ప్రాంతాలలో, చిన్న పట్టణాలలో బ్యాంకింగ్ సౌకర్యాలను పెంచాలని ప్రభుత్వం భావించినది. జూన్ 1969 లో దేశంలో షెడ్యూలు బాంకుల సంఖ్య 73 గా ఉండగా కాలక్రమేణా పెరిగి జూన్ 2002 కు 299 కు పెరిగినాయి. దీనిలో ప్రాంతీయ గ్రామీణ బాంకులు 196 చేరియున్నాయి. జూన్ 1969 లో మొత్తం బాంకు బ్రాంచీలు 8262 ఉండగా, అవి క్రమేణా పెరిగి జూన్ 2002 నాటికి 66,967 కు చేరినవి. ప్రభుత్వ రంగ బాంకుల బ్రాంచీలు జూన్ 1969 లో 6669 గా ఉండగా, ఈ సంఖ్య జూన్ 2002 కు 46,118 కు పెరిగింది. ఇది ఎంతో చెప్పుకోదగ్గ అభివృద్ధి. 1969 వ సం॥ములో ఒక బాంకు బ్రాంచి 64 వేల జనాభాకు సేవలు అందిస్తుండగా, జూన్ 2002 నాటికి ఈ సంఖ్య 15 వేల జనాభాకు ఒక బాంకు ఆఫీసు పనిచేస్తున్నట్లు నమోదైంది.

వాణిజ్య బాంకుల విస్తరణ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఏ విధంగా జరిగిందో పట్టిక (II) లో వివరించడమైనది. జూన్ 1969 లో గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచీలు 1832 ఉండగా జూన్ 1991 నాటికి ఈ సంఖ్య 35,212 కు పెరిగినాయి. అయితే తర్వాత కాలంలో గ్రామీణ బాంకు బ్రాంచీల సంఖ్య తగ్గు ముఖం పట్టింది. జూన్ 2002 నాటికి ఈ సంఖ్య 20,413 గా నమోదైంది. చిన్న పట్టణాలలో జూన్ 1969 లో 3322 బ్రాంచీలు ఉండగా జూన్ 2000 నాటికి ఈ సంఖ్య 14,329 కు పెరిగి మరల జూన్ 2002 నాటికి 12,664 బ్రాంచీలకు తగ్గినాయి. అయితే పట్టణాలలో, నగరాలలో బ్రాంచీల సంఖ్య జూన్ 1991 తర్వాత కొంత పెరుగుదల ఉన్నది. పట్టికను బట్టి తెలిసిందేమనగా, జూన్ 1991 లో మొత్తం బ్యాంకు బ్రాంచీలలో గ్రామీణ ప్రాంత బ్రాంచీలు 58.4% గా ఉండగా, తర్వాత కాలంలో జూన్ 2002 నాటికి 39.6% తగ్గినవి. దీనికి ముఖ్యకారణం గ్రామీణ బ్రాంచీలు నష్టాలలోనికి కూరుకుపోవడమే. ఫలితంగా చాల గ్రామీణ బ్రాంచీల పెరుగుదల కొంత మెరుగని చెప్పవచ్చును. జాతీయం చేసిన తర్వాత దేశాలలో బ్యాంకుల విస్తరణకు లీడ్ బ్యాంకు పథకం ప్రవేశపెట్టడంవల్ల బ్రాంచీల విస్తరణ భారీ ఎత్తున జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో బ్రాంచీల విస్తరణవల్ల గ్రామీణ ప్రజలనుండి పెద్ద మొత్తాలను డిపాజిట్ల రూపేణా సేకరించి, వ్యవసాయ రంగానికి ఇతోధికంగా పరపతిని అందించడానికి అవకాశాలు పెరిగినాయి. అంతేకాక, గ్రామాల్లో పాతుకుపోయిన అసంఘటిత ద్రవ్య సంస్థలు, వడ్డీ వ్యాపార స్థూల కార్యకలాపాలను అదుపు చేయడానికి వీలయింది.

**(2) డిపాజిట్ల సేకరణ :** బాంకుల జాతీయాకరణకు పూర్వం బాంకు బ్రాంచీలు పట్టణ ప్రాంతాలకే పరిమితం కావడంవల్ల దేశంలోని అన్ని ప్రాంతాలనుండి డిపాజిట్లను సేకరించడానికి వీలులేకపోయినది. కాని జాతీయాకరణ తర్వాత గ్రామీణ ప్రాంతాలలో కూడా అధిక సంఖ్యలో బ్రాంచీల స్థాపన వల్ల డిపాజిట్ల సేకరణ ఎంతో అభివృద్ధి చెందినది. జాతీయం చేసిన తర్వాత అని షెడ్యూల్డు బ్యాంకుల డిపాజిట్ల పెరుగుదలను క్రింద పట్టికలో చూడవచ్చును.

పట్టిక అన్ని షెడ్యూలు బాంకుల డిపాజిట్ల పెరుగుదల

| సం॥ము | డిపాజిట్లు (రూపాయిలు కోట్లలో) |
|---|---|
| 1969 జూన్ | 4646 |
| 1971 జూన్ | 5910. |
| 1991 జూన్ | 1,92,540. |
| 2000 జూన్ | 8,13,344 |
| 2002 మార్చి | 11,03,360. |

జాతీయ కారణ సమయంలో, జూన్ 1969 లో మొత్తం బాంకు డిపాజిట్లు రూ. 4646 కోట్లు ఉండగా, జూన్ 1991 నాటి ఈ మొత్తం రు. 1,92,540 కోట్లకు పెరిగినాయి. ఇవి గణనీయంగా పెరిగి మార్చి 2002 నాటికి రు. 11,03,360 కోట్లకు చేరినవి. బాంకుల జాతీయాకరణ తర్వాత బాంకు డిపాజిట్ల సేకరణలో దాదాపు 70 రెట్లు పెరుగుదల నమోదైంది. డిపాజిట్ల పరిమాణంలోనే కాక, నాణ్యతలో కూడా మార్పు వచ్చింది. ప్రస్తుత కాలంలో ఫిక్సెడ్ డిపాజిట్లే, డిమాండ్ డిపాజిట్ల కంటే ఎక్కువగా ఉన్నాయి. మార్చి 2002 లో మొత్తం బాంకు డిపాజిట్లు రు. 11,03,360 కోట్లు ఉండగా, వీటిలో ఫిక్సెడ్ డిపాజిట్లు రు. 9,50,312 కోట్లుగాను, డిమాండ్ డిపాజిట్లు రు. 1,53,043 కోట్లుగాను ఉన్నాయి. ఈ విషయాం ఎంతైనా అభిలషణీయమని చెప్పవచ్చును. దేశ ఆర్థికాభివృద్ధిరేటు పుంజుకోవడం, ప్రభుత్వ విధానాలవల్ల చలామణీలో ఉన్న ద్రవ్య సరఫరా పెరగడంవల్ల కూడా బ్యాంకు డిపాజిట్లు పెరిగినాయి. అయితే, ఈ మధ్య కాలంలో వాణిజ్య బాంకులు గృహనిర్మాణానికి పరపతిని యిచ్చే బాంకుల నుండి, లీజింగ్, పెట్టుబడి కంపెనీల నుండి, మ్యూచువల్ ఫండ్స్ నుండి తీవ్రమైన పోటీని ఎదుర్కోనాల్సివచ్చింది.

**3) పరపతి విస్తరణ :** బాంకుల జాతీయాకరణ తర్వాత బాంకులిచ్చే రుణాలలో కూడా ఎంతో పెరుగుదల ఉన్నది. ప్రభుత్వం తన ఆర్థిక, సామాజిక ధ్యేయాలను సాదించడానికి అనువుగా వాణిజ్య బాంకుల లీడ్ బాంక్, గ్రామ వికాస కేంద్రాలు మొదలైన ఎన్నో కొత్త

పథకాలను ప్రారంభించడం ద్వారా అడ్వాన్సులను విస్తరించాయి. పారిశ్రామిక వ్యవసాయ రంగాల అవసరాల పెరుగుదలతో పాటు, వాణిజ్య వ్యాపార అవసరాలకు, గ్రామీణాభివృద్ధి పథకాలకు అందజేయవలసిన బాధ్యతను బాంకులు స్వీకరించాయి.

పట్టిక అన్ని బాంకుల పరపతి వివరాలు

| సం॥ము | రుణాలు (రూ. కోట్లలో) |
|---|---|
| జూన్ 1951 | 580 |
| జూన్ 1969 | 3,599 |
| జూన్ 1971 | 4,690 |
| జూన్ 1991 | 1,16,300 |
| మార్చి 2000 | 4,35,958 |
| మార్చి 2002 | 5,89,723 |

అన్ని షెడ్యూల్డ్ బాంకు పరపతి అడ్వాన్సుల వివరాలు పై పట్టికలో ఇవ్వబడ్డాయి. జూన్ 1951 లో బాంకులు అందించిన రుణాలు రూ. 580 కోట్లుగా ఉండగా, జూన్ 1969 లో రు.3599 కోట్లుగా నమోదైంది. తర్వాత సంవత్సరాలలో పరపతి అనూహ్యంగా పెరిగింది. జూన్ 1991 నాటి మొత్తం బాంకు పరపతి రూ. 1,16,300 కోట్లకు పెరిగింది. మార్చి 2002 నాటి బాంకు రుణాలు మొత్తం రూ. 5,89,723 కోట్లకు గణనీయంగా పెరిగాయి. ఈ పెంపు గణనీయంగా ఉన్నది.

**4) ప్రాధ్యాన్యతా రంగాలకు పరపతి :** బాంకుల జాతీయీకరణకు ముందు వ్యవసాయ రంగానికి పరపతి సౌకర్యాలను అందించవలసిన బాధ్యత సహకార సంఘాలదని భావించడం జరిగింది. అందుచేత వాణిజ్య బాంకులు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశాయి. బాంకులు పెద్ద పారిశ్రామిక వేత్తల అధీనంలో ఉండడంవల్ల చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపార సంస్థలకు పరపతి అందజేయలేదు. జాతీయీకరణ తర్వాత కొన్ని రంగాలను ప్రభుత్వం ప్రాధాన్యత రంగాలుగా గుర్తించింది. అవి వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, వాహనాల చిన్న యజమానులు మరియు ఇతర ప్రాధాన్యత రంగాలు. తర్వాత కాలంలో చిల్లర వ్యాపారం, వృత్తుల వారిని, స్వయం ఉపాధి వారిని, విద్య, బలహీన వర్గాలకు గృహ నిర్మాణం, వినియోగ వ్యయం కోసం రుణాలను ప్రాధాన్యత రంగాలలో చేర్చడం జరిగింది. జాతీయోత్పత్తిలో చెప్పుకోతగ్గ భాగం ఈ రంగాలలో ఉత్పత్తి అయినా వాటికి బాంకులు అందించే సహాయం శూన్యంగా ఉండేది. ఈ ప్రాధాన్యత రంగాలకు రుణాలనివ్వాలనే ఉద్దేశ్యంతోనే బాంకులను జాతీయం చేసారు. 1969 తర్వాత ప్రభుత్వం బాంకులు ప్రాధాన్యతా రంగాలకు తగినంత ప్రాముఖ్యతను ఇచ్చాయి.

ప్రాధాన్యతా రంగాల పరపతి విస్తరణకు రిజర్వు బ్యాంకు క్రింద నిర్దేశించిన సూత్రాలను అమలు చేయాలని వాణిజ్య బాంకులను ఆదేశించింది.

(i) బాంకు పరపతి మొత్తంలో 40 శాతం ప్రాధాన్యతా రంగాలకు కేటాయించవలెను

(ii) ప్రాధాన్యతా రంగాలకు యిచ్చే మొత్తం రుణాలలో 40 శాతం వ్యవసాయ రంగానికి అందించవలెను.

(iii) వ్యవసాయం, అనుబంధ వృత్తులను అందించే ప్రత్యక్ష రుణాలలో 50% బడుగు వర్గాలకు చేరవలెను.

(iv) గ్రామీణ వృత్తువారికి, కుటీర పరిశ్రమలకు, చిన్న పరిశ్రమలకు ఇచ్చే పరపతిలో 12.5% అందించవలెను.

(v) బాంకు పరపత్తి 12% ఎగుమతిదార్లకు అందించవలెను

ప్రాధాన్యతా రంగాలకు బాంకులు ఇచ్చిన పరపతి వివరాలను క్రింది పట్టికలలో చూడవచ్చును. జూన్ 1969 లో బాంకులు

ప్రాధాన్యతా రంగాలకు కేవలం రు. 440 కోట్లు మాత్రము అందించాయి. జూన్ 1971 కి

పట్టిక బ్యాంకులు ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చిన పరపతి వివరాలు (రూ. కోట్లలో)

| ప్రాధాన్యతా రంగ అంశం | జూన్ 1969 | జూన్ 1971 | జూన్ 2000 | మార్చి 2002 | | |
|---|---|---|---|---|---|---|
| 1. వ్యవసాయం | 160 | 340 | 45,425 | 51,922 | | |
| 2. చిన్న తరహా పరిశ్రమలు. | | 260 | 440 | 52,899 | | 56,002 |
| 3. ఇతర ప్రాధాన్యతా రంగాలు | 20 | 130 | 37,609 | | 46,490 | |
| మొత్తం | 440 | 910 | 1,35,923 | | 1,54,414 | |

రూ 910 కోట్లకు పెరిగినాయి. తర్వాత కాలంలో ప్రాధాన్యతా రంగాలకు బాంకుల పరపతి గణనీయంగా పెరిగి మార్చి 2002 నాటి ఈ రంగాలకు మొత్తం పరపతి రు. 1,54,414 కోట్లకు చేరుకున్నది. ప్రాధాన్యతా రంగాలకు యిచ్చిన రుణాలు మొత్తం రుణాలలో 12 నుండి 42 శాతానికి పెరిగింది. వ్యవసాయ రంగానికి పరపతి జూన్ 1969 లో రు. 160 కోట్లు లభ్యమైతే ఇది అనూహ్యంగా పెరిగి మార్చి 2002 నాటికి రు.51,922 కోట్లకు చేరింది. చిన్నతరహా పరిశ్రమలకు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు కూడా భారీ ఎత్తున పరపతి సౌకర్యం పెరిగింది.

ప్రాధాన్యతా రంగాలకు, చిల్లర వ్యాపారస్థులు, స్వయం ఉపాధి వారికి, పేదరిక నిర్మూలనా కార్యక్రమాలకు యిచ్చిన రుణాలు సక్రమంగా తిరిగి బాంకులకు చెల్లించకపోవడం నరసింహం కమిటి తీవ్రంగా పరిగణించింది. ఫలితంగా ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చే పరపతి మొత్తం రుణాలలో దశల వారీగా 10% నికి పరిమితం చేయాలని నరసింహం కమిటీ సిఫార్సు చేసింది.

జాతీయీకరణ తర్వాత బాంకులు వ్యవసాయదారుల, గ్రామీణ ప్రాంతాల ఆర్థికావసరాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాయి. వ్యవసాయ బ్యాంకులకు అందించే రుణాలు పరిమాణం మాత్రమే గాక, ఆ రుణాల ప్రాతినిధ్యం కూడా పెరిగింది. 1969 లో 5.4% గా ఉన్న వ్యవసాయీకరణ శాతం జూన్ 2000 నాటికి 15.8 శాతానికి చేరుకున్నది. వ్యవసాయదారులకు మరింత పరపతి అందించే మార్గంగా జాతీయం చేసిన తర్వాత బ్యాంకులు తీసుకున్న చర్యలు క్రింద ఇవ్వడమైనది.

- చాలా బాంకులు ప్రత్యేకంగా వ్యవసాయ అభివృద్ధి బ్రాంచీలను నెలకొల్పుట.
- గ్రామీణ దత్తత పథకాలను అమలు చేయుట.
- గ్రామ వికాస కేంద్రాలను నెలకొల్పుట.
- జాతీయ వ్యవసాయాభివృద్ధి బాంకువారు ప్రాజెక్టులకు రీఫైనాన్సింగ్ సౌకర్యం ఇవ్వడం.
- ప్రాంతీయ గ్రామీణ బాంకుల స్థాపన.
- వ్యవసాయ దారులకు మెరుగైన సేవల నిమిత్తం వ్యవసాయ దారుల సేవా సంఘాలను ఏర్పాటు చేయుట.
- కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టుట.
- బాంకులు కొన్ని గ్రామాల సముదాయాలను ఎంపిక చేసుకొని ఆయా గ్రామాలలోని వ్యవసాయదారులకు అన్ని రకాల పరపతి అవసరాలను తీర్చుట.

షెడ్యూల్డు బాంకుల పెటుబడులు కూడా గణనీయంగా పెరిగినాయి. మార్చి 2000 లో మొత్తం పెట్టుబడులు రూ. 3,08,944

కోట్లు ఉండగా మార్చి 2002 నాటికి బ్యాంకు పెట్టుబడులు రూ. 4,38,269 కోట్లకు పెరిగినాయి. ఈ మొత్తం ప్రభుత్వం సెక్యూరిటీలు, ఇతర ఆథరైజ్డ్ సెక్యూరిటీలలో బాంకులు మదుపు పెట్టినాయి.

**(5) లీడ్ బ్యాంకింగ్ పథకం (Lead Bank Scheme) :** రిజర్వు బాంకు లీడ్ బాంకు పథకం 1969 డిశంబరులో ప్రవేశ పెట్టింది. బ్రాంచీ విస్తరణకు, బాంకింగ్ సౌకర్యాలను దేశ వ్యాప్తంగా పెంచడానికి ఈ పథకాన్ని అమలు చేశారు. ప్రభుత్వ బాంకులకు జిల్లాలను కేటాయించడం జరిగింది. ప్రతి లీడ్ బ్యాంకు తనకు కేటాయించిన జిల్లాల్లో పరపతి ఆవశ్యకతలు, బ్రాంచీలు ప్రారంభించడానికి, సర్వేచేయడానికి ప్రభుత్వ బ్యాంకులు ముందుకు వచ్చాయి. సామాజిక ఆర్థిక సమాచారం సేకరించడం, బ్రాంచీలు ఏర్పాటు చేయుటకు క్రొత్త కేంద్రాలను గుర్తించడం, కేటాయించిన జిల్లాలలో అభివృద్ధికి లీడ్ బ్యాంకు నాయకత్వ బాధ్యత తీసుకొంటుంది. వాణిజ్య బాంకులు, ప్రాంతీయ గ్రామీణ బాంకులు, ఇతర ద్రవ్య సహాయ సంస్థలను సమన్వయపరుస్తూ ప్రాధాన్య రంగాలకు పరపతిని విస్తరింపజేయడానికి లీడ్ బాంకులు కృషి చేస్తున్నాయి. ఈ పథకం క్రింద మార్చి 2002 నాటికి దేశంలో 580 జిల్లాలకు విస్తరింపబడి ఉన్నది.

**6) <u>చిన్నతరహా పరిశ్రమలకు బ్యాంకు పరపతి</u> :** చిన్న తరహా పరిశ్రమల రంగం ముఖ్యమైన ఉత్పాదక రంగం అని, ఆర్థిక సహాయం అందించే విషయాలలో వాణిజ్య బాంకులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించవలసిన అవసరముందని ప్రభుత్వం గుర్తించినది. జాతీయం చేసిన తర్వాత చిన్న తరహా పరిశ్రమలకు ఇతోధికంగా బాంకు ఆర్థిక సహాయం చేశాయి. జూన్ 1969 లో ఈ పరిశ్రమలకు రుణాలు రూ. 260 కోట్లు అందజేయగా మార్చి 2002 నాటికి చిన్న తరహా పరిశ్రమలకు బాంకుల రుణాలు రూ. 56,002 కోట్లకు చేరుకున్నాయి. దీనికి కారణం ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రాధాన్యతా రంగంలో చేర్చడమే అని చెప్పవచ్చును. ముఖ్యంగా చిన్న తరహా రంగాలనుండి రుణ సేకరణకు వచ్చే ఉద్యమ కారుల కోసం బాంకులు ప్రత్యేక శాఖలను నెలకొల్పినారు. పారిశ్రామిక వాడల నిర్మాణానికి బాంకులు ద్రవ్య సహాయాన్ని అందిస్తున్నాయి. IDBI, SIDBI బాంకులు చిన్న తరహా పరిశ్రమలకు రుణాలు అందజేసే బ్యాంకులకు రీ ఫైనాన్స్ చేస్తున్నాయి.

**7) <u>ఎగుమతుల అభివృద్ధి</u> :** భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో విదేశీ మారక ద్రవ్య అవసరాలను తీర్చుటకు, ఎగుమతులను అభివృద్ధి పరచి విదేశీ ద్రవ్యమును ఆర్జించవలసిన అవసరమున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అనేక చర్యల ద్వారా బ్యాంకులు ఎగుమతి వర్తకానికి తగిన పరపతిని సమకూర్చడం జరుగుతున్నది. జాతీయం చేసిన తర్వాత బాంకులు ఎగుమతుల రంగాన్ని ప్రాధాన్యతా రంగంగా గుర్తించాయి. మరియు రుణాలు రాయితీ వడ్డీలు మంజూరు చేయడం జరుగుతుంది. ఎగుమతి దిగుమతి బాంకు మొదలైన సంస్థలనుండి బాంకులకు రీ ఫైనాన్స్ పొందే సౌకర్యం కలదు.

**8) <u>సమగ్ర గ్రామీణాభివృద్ధి</u> :** జాతీయీకరణ తర్వాత బ్యాంకులు తమ సామాజిక ధ్యేయాలను గుర్తించి గ్రామీణాభివృద్ధికి, బలహీన వర్గాల అభ్యున్నతికి, పేదరిక నిర్మూలనకు బ్యాంకులు విశేషమైన కృషి చేస్తున్నాయి. భారత ప్రభుత్వం పేదరిక నిర్మూలనకై ప్రవేశ పెట్టిన సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం (IROP) లో బ్యాంకులు తమ వంతు పాత్రను చాలా చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమం క్రింద దరిద్ర రేఖకు దిగువన ఉన్న గ్రామీణ కుటుంబాలను దారిద్ర్య రేఖకు పైన తీసుకురావడానికి ఎన్నో రకాల రుణ సహాయాన్ని బాంకులు అందజేస్తున్నాయి.

బలహీన వర్గాలకు తక్కువ వడ్డీకి పరపతిని అందజేసే నిమిత్తం 1972 ఏప్రియల్ లో భేదాత్మక వడ్డీ రేటు (Differential Rate of Interest) పథకాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టినది. ఈ పథకం క్రింద ప్రభుత్వ బాంకులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న బలహీన వర్గాలకు 4% వడ్డీ రేటున రుణాలు అందిస్తున్నాయి. షెడ్యూలు కులాలు, తెగల ప్రజలకు ఈ పథకం క్రింద అందజేసిన పరపతి మొత్తం మార్చి 2000 నాటికి రు. 432 కోట్లుగా నమోదైంది. ఇది పబ్లిక్ సెక్టార్ బాంకుల మొత్తం పరపతిలో 7.22% ఉన్నది.

**(9) సామాజిక, సేవా బ్యాంకింగ్ :** పేదరికపు నిర్మూలనా కార్యక్రమాలకు, సమీకృత గ్రామీణాభివృద్ధి పథకాలకు, స్వయం ఉపాధి పథకాలకు ఇతోధికంగా సహాయం చేయుటద్వారా బాంకులు సామాజిక లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తున్నాయి. జాతీయం

చేయబడిన బ్యాంకులు ఇటీవలి కాలంలో సేవా కార్యక్రమాలను కూడా చేపట్టుతున్నాయి. అవి సేవా సంస్థలుగా మారినాయి. ఉదాహరణకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నది.

వాణిజ్య బాంకుల జాతీయీకరణ తర్వాత భారతీయ బాంకింగ్ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకొన్నాయి. జాతీయం చేయబడిన ప్రభుత్వ రంగ బాంకులు దేశంలోని గ్రామీణ ప్రజల ఆర్థిక, సామాజిక ఉన్నతికి, జాతి సర్వతోముఖాభివృద్ధికి నవ కల్పనతో కూడిన నూతన బాంకింగ్ విధానాలను అమలు చేస్తున్నాయి. సామాజిక ధ్యేయాల సాధనకై మొత్తం బాంకింగ్ విధానాలనే పునర్వ్యవస్థీకరించడం జరిగింది. అందుచేతనే భారతీయ బాంకింగ్ వ్యవస్థ "వర్గ బ్యాంకింగ్" (Class Banking) నుండి "ప్రజా బ్యాంకింగ్" (Mass Banking) గా మార్పు చెందినట్లు జరిగింది.

## రుణాల విధానాలు మరియు ఆచరణలు (Lending Uolicies of Cractices)

బాంకులు ద్రవ్య వ్యాపార సంస్థలు. బాంకుల వనరులలో 90% వరకు ప్రజలనుండి డిపాజిట్ల రూపంలో సేకరించినవే. సేకరించిన డిపాజిట్లను రుణాలుగా మంజూరు చేయడమే లేదా పెట్టుబడిగా పెట్టడమో చేస్తాయి. బాంకుల వనరులలోఎక్కువ భాగం రుణాలుగా వినియోగింపబడతాయి. బాంకు ఆస్తులలో ప్రధానమైనవి బాంకులు ఇచ్చే రుణాలు, అడ్వాన్సులు. ఈ రుణాలే బాంకుల లాభాలకు ముఖ్యాధారము. ఆస్తులు, సెక్యూరిటీలు, వ్యక్తిగత హామీపై బాంకులు రుణాలు అందజేస్తాయి. పారిశ్రామిక సంస్థలకు, వ్యాపార సంస్థలకు బిల్లులను డిస్కౌంట్‌కు కొనడం ద్వారా, రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్‌లు, క్యాష్ క్రెడిట్‌లు మంజూరు చేయడం ద్వారా బాంకులు ద్రవ్య సహాయం చేస్తాయి. అయితే ఈ రుణాలను త్వరితగతిని నగదులోనికి మార్చుకోవడం కష్టం. వీటిని ఇతరులకు బదిలీ చేసి సొమ్ము తెచ్చుకోవడం కూడా కష్టము. కనుక ఈ రుణాలకు లిక్విడిటి లక్షణం లేదు. వీటికి లాభదాయకత ఎక్కువ. కాని భద్రత కూడా తక్కువ. తమ ఆర్థిక వనరులను లాభదాయకమైన రీతిలో వినియోగించుకోవలెను.

బాంకులు రుణాలు మంజూరు చేయునపుడు క్రింది విషయాలను పరిగణనలోనికి తీసుకొనవలెను.

(1) **ద్రవ్యత్వత (Liquidity) :** బాంకు ముఖ్యంగా ఆచరించవలసిన సూత్రం ద్రవ్యత్వత. బాంకు యిచ్చిన రుణాలు సకాలంలో గాని, అవసరమైతే అడిగిన తక్షణం కాని తిరిగి వసూలయ్యేవిగా ఉండవలె. రుణాలకు భద్రత ఉన్నపటికి అవిస్వల్ప కాలంలో వసూలయ్యేవి కాకపోతే వాటిని మంజూరు చేయరాదు. బ్యాంకులు సులభంగా, నష్టం లేకుండా అమ్ముడయ్యే సెక్యూరిటీల హామీగా రుణాలు ఇవ్వవలెను.

(2) భద్రత (Safety) : రుణాలు మంజూరు చేసేటప్పుడు బాంకులు గమనించవలసిన విషయాలలో అన్నిటికంటే ముఖ్యమైనది భద్రత. యిచ్చిన రుణం తిరిగి వస్తుందనే నమ్మకం ఉన్నపుడే బాంకు రుణాన్ని మంజూరు చేయవలెను. బ్యాంకులు మంజూరు చేసే అన్ని రుణాలకు పూర్తి భద్రత ఉండాలి. భద్రత బాంకింగ్ వ్యాపారానికి కంతటికి పునాది వంటిది. సాధారణంగా బాంకు రుణాలకు వస్తు రూపంలో హామీ ఉంటుంది. హామీలేని సందర్భంలో రుణం తీసుకొన్న వ్యక్తి సకాలంలో రుణం చెల్లించగలడనే నమ్మం ఉండటం అవసరం. అందువల్ల నిజాయితీ లేని వ్యక్తులకు బాంకులు రుణాలు ఇవ్వకూడదు. సక్రమమైన ప్రయోజనాల నిమిత్తం ఇచ్చిన రుణాలకు తగినంత భద్రత ఉంటుందని బాంకు గమనించవలెను.

(3) **లాభదాయకత (Profitability) :** బాంకులు వ్యాపార సంస్థలు. కాబట్టి ఇతర వ్యాపార సంస్థల వలెనే లాభాలు సంపాదించడానికి బాంకులు ప్రయత్నిస్తాయి. డిపాజిట్ దార్లకు వడ్డీ చెల్లించడానికి, వాటాదారులకు డివిడెండ్ చెల్లించడానికి, నిర్వహణ ఖర్చులు భరించడానికి, బాంకుకు తగినంత లాభం గడించవలె. కనుక లాభాలు వచ్చే రుణాలను మంజూరు చేయవలెను.

(4) **రుణం దేనినిమిత్తం (Purpose of Loan) :** బాంకునుండి రుణం కోరేవ్యక్తి ఆ సొమ్మును ఏ ప్రయోజనం కోసం ఉపయోగించదలచుకొన్నాడో బాంకు గమనించవలెను. చట్ట వ్యాపారానికి, సరుకులను భారీ ఎత్తున నిల్వ ఉంచడానికి బ్యాంకు రుణాలు మంజూరు చేయకూడదు. అనుత్పాదక కార్యకలాపాలకు రుణాలు ఇవ్వకూడదు. అందుచేత ఉత్పాదక ప్రయోజనాల

నిమిత్తం మాత్రమే రుణాలు మంజూరు చేయవలసి యుంటుంది. ఇటీవలి కాలంలో బాంకు రుణాలు పొందే వ్యక్తులు ఇచ్చే హామీ కంటె బాంకు రుణం ఉపయోగించే ప్రయోజనం ముఖ్యమని గుర్తించవలెను.

(5) **రుణాలలో వైవిధ్యం (Diversity in Loans) :** బాంకులు రుణాలు అందజేసేటప్పుడు సాధ్యమైనంత వరకు ఎక్కువ మందికి తక్కువ మొత్తాలలో ఇవ్వవలెను. కొద్ది మందికి ఎక్కువ మొత్తాలలో ఇచ్చినట్లయితే అందులో ఏ ఒక వ్యక్తినుండి రుణం వసూలు కాకపోయినప్పటికి బాంకుకు విశేష నష్టం కల్గుతుంది. అదే విధంగా బ్యాంకు తన వద్ద ఉన్న వనరులన్నింటిని ఒకే రకమైన పరిశ్రమకు చెందిన వానికి ఇవ్వకూడదు. ఆ పరిశ్రమకు ఆర్థిక మాధ్యం ఏర్పడితే బాంకు నష్టపోయే ప్రమాదం కలదు. వివిధ పరిశ్రమలకు, విధ వ్యక్తులకు సరియైన హామీతో రుణాలు ఇవ్వవలసి యుంటుంది. "అన్ని గుడ్లను ఒకే బుట్టలో పెట్టరాదు" అనే సూత్రాన్ని బాంకులు అనుసరించవలెను.

(6) జాతీయ అభీష్టాలు: బాంకులు రుణాలను మంజూరు చేసేటపుడు జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనవలెను. దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడే పరిశ్రమలు, వ్యవసాయం, ఎగుమతి వ్యాపారం, కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకులు ఆర్థిక సహాయం చేయవలెను. బ్యాంకుల వనరులు వర్తక వాణిజ్యాలకే కాక బహుముఖమైన ఆర్థిక ప్రగతికి తోడ్పడవలెననే అభిప్రాయంతోనే బ్యాంకులను జాతీయం చేయడం జరిగింది.

(7) స్వల్పకాలిక రుణాలు : బాంకులు ప్రజల డిపాజిట్లతో వ్యాపారం చేస్తాయి. డిపాజిట్లను డిపాజిట్‌దార్లు అడిగిన తక్షణమే చెల్లించవలసి ఉంటుంది. అందుచేత బాంకు తన వనరులను దీర్ఘకాల రుణాలను ఇవ్వడానికి ఉపయోగించకూడదు. దీర్ఘకాలిక రుణాలకు ద్రవ్యత్వత ఉండదు. పారిశ్రామిక సంస్థలకు స్థిరాస్థుల సేకరణకు రుణాలు ఇవ్వకూడదు. హుండీలను డిస్కౌంట్ చేసుకొని ఇచ్చే రుణాలు స్వల్పకాలిక రుణాలు.

**రుణాలలోని రకాలు** (Types of Loans) : బాంకులు మంజూరు చేసే రుణాలు క్రింది రూపాలలో ఉంటాయి.

(1) సాధారణ రుణాలు (General Loans) : బ్యాంకులు ఈ రుణాలను హామీతో గాని, లేక హామీ లేకుండా గాని ఇస్తాయి. ఒక వ్యక్తికి కొంత సొమ్మును రుణంగా ఇచ్చినపుడు ఆ వ్యక్తి రుణం తాలుకు సొమ్మును రుణం తీసుకొన్న వ్యక్తి ఖాతాకు జమకట్టి, ఆ వ్యక్తి వ్రాసిన చెక్కులను చెల్లించడం జరుగుతుంది. అయినప్పటికి ఈ రుణంమీద వసూలు చేసే వడ్డీ పూర్తి రుణపు సొమ్ముమీద లెక్కకట్టడం జరుగుతుంది. రుణం తీసుకొన్న సొమ్ములో కొంత భాగాన్ని రుణం తీసుకొన్న వ్యక్తి బాంకుకు చెల్లించినచో, మిగతా భాగంమీద మాత్రమే వడ్డీ వసూలు చేస్తారు. సాధారణ రుణాలను ఖాతాదారులకే గాక, ఇతరులకు కూడ ఇవ్వడానికి వీలున్నది.

(2) ఓవర్ డ్రాఫ్టులు (over drafts) : బాంకులు వ్యాపారస్తులకు, పెట్టుబడిదారులకు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం కల్పించడం ద్వారా రుణాన్ని ఇస్తాయి. రుణాలు ఇవ్వడంలో ఓవర్ డ్రాఫ్ట్ ఏర్పాటు ఎక్కువ సౌకర్యవంతమైంది. ఓవర్ డ్రాఫ్ట్ అనగా, ఒక ఖాతాదారుడు తన ఖాతాలో ఉన్న నిల్వ సొమ్ముకంటె అధిక మొత్తాన్ని తీసుకొనే సౌకర్యం. ఈ పద్ధతులలో రుణాన్ని ముందుగా తీసుకోవలసిన అవసరం లేదు. అవసరం వచ్చినపుడే తీసుకోవచ్చును తీసుకొన్న కాలానికి, తీసుకొన్న మొత్తానికి వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది. ఓవర్ డ్రాఫ్ట్ పరపతిని వస్తువుల సెక్యూరిటీ మీదగాని, వ్యక్తిగత సెక్యూరిటీ మీదగాని బాంకులు మంజూరు చేస్తాయి. ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం కరెంటు ఖాతా ఉన్న ఖాతాదారుకు మాత్రమే ఇవ్వడం జరుగుతుంది.

(3) క్యాష్ క్రెడిట్లు (cash credits) : క్యాష్ క్రెడిట్ దాదాపు ఓవర్ డ్రాఫ్ట్ వలెనే ఉంటుంది. క్యాష్ క్రెడిట్ అనేది అప్పుదారు కోసం బ్యాంకు తెచిన ఒక రకమైన అమలులో ఉన్నఖాతా. బాంకు ఖాతాదారుని పేర ఒక కరెంటు ఖాతాను తెరచి, అందులోఅంగీకరించిన రుణ మొత్తాన్ని క్రెడిట్ చేస్తాడు. ఆ ఖాతామీద అప్పుదారు నిర్ణీతమైన మొత్తానికి సొమ్మును స్వీకరించవచ్చును. ఆ సొమ్మును ఒకే సారిగాని లేక అవసరం ఉన్నపుడు గాని తీసుకొనవచ్చును. వాస్తవంగా వాడుకొన్న సొమ్ముపై మాత్రమే బ్యాంకు వడ్డీ విధిస్తుంది. క్యాష్ క్రెడిట్ ఖాతా క్రింద ఎప్పుడైనా సొమ్ము తీసుకొనే సౌలభ్యం ఉంది. కాబట్టి నగదు మొత్తాలను వ్యాపారస్థులు

వృధాగా తమవద్ద ఉంచుకోరు. వ్యాపారస్తులు తమ దగ్గర ఉన్న అదనపు నగదును బాంకులోజమకట్టి తమ రుణ భారాన్ని తగ్గించుకోవచ్చు. క్యాష్ క్రెడిట్ పద్దతి అప్పుకు ఖాతాదార్లు బాండ్లు వ్రాయవలెను. హామీ కూడా చూపవలెను. మనదేశంలో క్యాష్ క్రెడిట్ ద్వారా తీసుకొనే రుణానికి ఎంతో ప్రాచుర్యం ఉంది. బాంకు రుణాలలో దాదాపు 70 శాతం వరకు ఈ రూపంలోనే ఉంటాయి. ఓవర్ డ్రాఫ్ట్ ఖాతాదారునియొక్క తాత్కాలిక అవసరాలను తీర్చే నిమిత్తం కలుగజేసే ప్రత్యేక సదుపాయం. కాని క్యాష్ క్రెడిట్ అంతకంటె ఎక్కువ కాలానికి చేసుకొన్న శాశ్వత ఏర్పాటు.

(4) బిల్లుల డిస్కౌంట్ (Discounting of Bills of Exchange) : వాణిజ్య బాంకులు హుండీలను, లేక వ్యాపార బిల్లులను డిస్కౌంట్‌కు కొని తద్వారా వ్యాపారస్తులకు రుణాలను మంజూరు చేస్తాయి. వ్యాపారస్తులు తమకు రావలసిన సొమ్ము తాలుకు హుండీలను లేదా బిల్లులను బాంకులకు అప్పగించి సొమ్మును ముందుగా తీసుకొనవచ్చును. ఇలాంటి బిల్లులపై బ్యాంకులు వడ్డీ క్రింద కొంత మొత్తాన్ని మినహాయించుకొని, మిగిలిన సొమ్ము వ్యాపారస్తులకు వెంటనే చెల్లిస్తాయి. మినహాయించుకొనిన మొత్తాన్ని డిస్కౌంట్ లేక వడ్డీ అంటారు. నిర్ణీత గడుపు తర్వాత బిల్లు తాలూకు సొమ్మును బాంకులు వసూలు చేసుకొంటాయి. ఈ రకమైన రుణాలు ఖాతాదార్ల వ్యక్తిగత హామిని ఆధారం చేసుకొని బాంకులు అందజేస్తాయి.

సెల్ఫ్ ఎసెస్‌మెంట్ ప్రశ్నలు (Self Assessment Questions) :

(1) సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న ఆర్థిక సంస్థలు, ఇతర ద్రవ్య ఏజెన్సీలను వివరింపుము.

(2) బాంకులను జాతీయం చేయడానికి గల కారణాలను తెలిపి, జాతీయీకరణ తర్వాత బాంకులు సాధించిన ప్రగతిని వివరింపుము.

(3) ప్రాధాన్యతా రంగాలకు పరపతిని కేటాయించడంలో బాంకులు ఏ మేరకు విజయవంతమైనవో తెలియజేయుడు.

(4) బాంకులు రుణాలను మంజూరు చేయునపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుపండి.

(5) వాణిజ్య బాంకులు అందజేసే రుణాలలోని రకాలను వివరించండి?

## పదకోశం (Key Words)

(1) ద్రవ్య మార్కెట్ : స్వల్పకాలిక అవసరాలకు ద్రవ్య వనరులను రుణదాతలనుండి రుణాలు కావలసిన వారికి అందజేసే మార్కెట్‌ను ద్రవ్య మార్కెట్ అంటారు.

(2) మూల ధన మార్కెట్ : దీర్ఘకాలిక, మధ్యకాలిక రుణాలను, పెట్టుబడులను సమకూర్చే సంస్థలు ఉన్న మార్కెట్‌ను మూలధన మార్కెట్‌లంటారు.

(3) నాన్ బ్యాంకింగ్ సంస్థ : అనేక స్కీమ్‌ల ద్వారా ప్రజలను డిపాజిట్లను సేకరించి, కొన్ని విధానాల ద్వారా రుణాలు మంజూరు చేసే సంస్థను నాన్ బాంకింగ్ సంస్థ అంటారు. కొన్ని రిజర్వు బాంకుకు లోబడిన కార్పొరేటు రంగ సంస్థలు, నమోదు కాబడని కొన్ని సంస్థలు మన దేశంలో ప్రస్తుతం పని చేస్తున్నాయి.

(4) ప్రాధాన్యతా రంగం : ప్రాధాన్యతా రంగంలో వ్యవసాయం, చిన్న తరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, వాహనాలు చిన్న యజమానులు, స్వయం ఉపాధి వృత్తుల వారు, బలహీన వర్గాల గృహనిర్మాణం, చిల్లర వ్యాపారాలు మొదలైనవి చేరియున్నాయి.

(5) ద్రవ్యత్వత : బాంకులు ఇచ్చిన రుణాలు సకాలంలో కాని అవసరమైతే అడిగిన తక్షణమే తిరిగి వసూలయ్యే విధంగా ఉండాలి. ఈ లక్షణం ఉన్న రుణాలకు ద్రవ్యత్వత ఉన్నదని అర్థము. రుణాలకు భద్రత ఉన్నప్పటికి అవి స్వల్ప కాలంలో వసూలు కాకపోతే వాటిని మంజూరు చేయరాదు.

(6) క్యాష్ క్రెడిట్ : ఖాతాదారుడు ఇచ్చిన హామీని పురస్కరించుకొని అతనికి తాత్కాలికంగా బాంకు మంజూరు చేసేరుణం. ఈ పద్ధతిలో అప్పుకు ఖాతాదారుడు బాండు వ్రాయవలెను. హామీ కూడా అందజేయవలెను.

(7) ఓవర్ డ్రాఫ్ట్ : ఖాతాదారునికి అవసరమైనపుడు చెక్కుద్వారా తన ఖాతాలోని నిల్వకంటె ఎక్కువ డ్రా చేయడానికి వీలు కల్పించే పద్ధతి. ఓవర్ డ్రాఫ్ట్ పరపతిని వస్తువుల సెక్యూరిటి మీదగాని, వ్యక్తిగత సెక్యూరిటి మీదగాని బాంకులు మంజూరు చేస్తాయి. ఈ సదుపాయం కరెంటు ఖాతాదారునకు మాత్రమే ఇవ్వడం జరుగుతుంది.

**పాఠం - 4**

# బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు
# (Banking Sector Reforms)


4.0 ఉద్దేశాలు

4.1. విషయ పరిచయము

పాఠ్యాంశ నిర్మాణము

4.2. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు

- 4.2.0 బ్యాంకింగ్ రంగం - పరిణామ దశలు
- 4.2.1 బ్యాంకింగ్ రంగం-సంస్కరణల ఆవశ్యకత
- 4.2.2 నరసింహం కమిటీ, 1991 ఏర్పాటు
- 4.2.3 కమిటీ నియామకం పూర్వస్థితి
- 4.2.4. నరసింహం కమిటీ - 1991 సూచనలు
- 4.2.5 నరసింహం కమిటీ సూచనల అమలు - బ్యాకింగ్ రంగంలో సంస్కరణలు (1992-1998)
- 4.2.6 బ్యాంకింగ్ రంగ సంస్కరణల అమలు తీరుపై ఏర్పాటుచేసిన నరసింహం కమిటీ - 1998
- 4.2.7. నరసింహం కమిటీ-1998 సూచనలు

4.3. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ (Electronic Banking)

4.4. ఆటోమేటిక్ టెల్లర్ మెషీన్లు (A.T.Ms.)

4.5. క్రెడిట్ కార్డులు (Credit Cards)

4.6. డెబిట్ కార్డులు (Debit cards)

4.7. పదకోశము

4.8. స్వయం మదింపు ప్రశ్నలు

4.9. సిఫారసు చేసిన పుస్తకాలు


## 4.0 ఉద్దేశాలు :

ఈ పాఠములో విద్యార్ధులకు బ్యాంకింగ్ రంగంలోని వివిధ పరిణామ దశలను గురించి వివరించటము జరిగినది. ఈ పాఠం అధ్యయనం పూర్తయ్యేసరికి విద్యార్ధులకు క్రింది విషయాలు అవగతమగును.

- ✤ బ్యాంకింగ్ రంగం యొక్క పూర్వచరిత్ర, పనితీరు; 1991 లో నరసింహం కమిటీ నియామకం ఆవశ్యకత, సూచనలు, సూచనల అమలు;
- ✤ 1998 లో నరసింహం కమిటీ నియామకం, సూచనలు, అమలు;
- ✤ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్, A.T.Ms, క్రెడిట్ కార్డ్స్, డెబిట్ కార్డ్స్ భావనలు;

## 4.1. విషయ పరిచయము :

ఏ దేశ ఆర్థిక వ్యవస్థలోనైనా ప్రభుత్వం తరువాత అత్యంత పెద్ద మొత్తంలో ద్రవ్య వ్యవహారాలను నిర్వహించేది బ్యాంకింగ్ రంగమే. చాలా సందర్భాలలో ప్రభుత్వము కూడా తమ ద్రవ్య కార్యకలాపాలను బ్యాంకుల ద్వారా నిర్వహించును. ఇంతేకాక బ్యాంకులు మిగులు ద్రవ్యమున్నవారికీ, ద్రవ్య అవసరాలున్నవారికీ మధ్య ఒక వారధిగా పనిచేయును. దేశ ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్ రంగము దోహదపడటమేకాక ఆర్థికాభివృద్ధికి సూచికగా కూడా ఉండును. ఈ కారణాల వలన బ్యాంకింగ్ రంగం పటిష్టంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. పరిణామ క్రమంలో సమాజంలో వస్తున్న ఆధునిక పోకడల దృష్ట్యా బ్యాంకింగ్ రంగంలో సంస్కరణల ఆవశ్యకత ఏర్పడినది. ఈ ఆవశ్యకత దృష్ట్యా బ్యాకింగ్ రంగం పనితీరును సమీక్షించి సంస్కరణలు చేయటానికవసరమైన సూచనలివ్వటానికి కొన్ని కమిటీలను నియమించటము జరిగినది. అందులో ప్రధానమైనది నరసింహం కమిటీ. ఈ కమిటీ సమీక్షా సూచనలే ఈ పాఠము యొక్క సారాంశము.

**పాఠ్యాంశ నిర్మాణము :-**

## 4.2. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు

**4.2.0 బ్యాంకింగ్ రంగం- పరిణామ దశలు :** బ్యాంకింగ్ రంగం పనిచేస్తున్న తీరు తెన్నులను పరిశీలించినపుడు బ్యాంకింగ్‌రంగ పరిణామ దశలను మూడు రకాలుగా వివరించవచ్చును. అవి :

1969 వ సంవత్సరం పూర్వ పనితీరు;

1969 వ సంవత్సరం తరువాత పనితీరు;

1991 తరువాత పనితీరు.

**4.2.1. బ్యాంకింగ్ రంగం - సంస్కరణల ఆవశ్యకత :** 1969 జూలై 19వ తేదీ నాటికి రూ. 50 కోట్లకు మించిన డిపాజిట్లను కలిగి ప్రయివేటు రంగంలో ఉన్న 14 బ్యాంకులను జాతీయం చేయటం జరిగినది. ఈ చర్యను బ్యాంకింగ్ రంగంలో ఒక విప్లవాత్మకమైన చర్యగా భావించటం జరిగినది. (వాస్తవానికి 1950-51 నాటికి భారతదేశంలో 430 వాణిజ్య బ్యాంకులుండేవి. అప్పట్లో RBI చేపట్టిన చర్యల ఫలితంగా ఈ సంఖ్య గణనీయంగా తగ్గినది. 1999-2000 నాటికి భారతదేశంలో మొత్తంమీద 299 షెడ్యూల్డు బ్యాంకులున్నవి) ఆ నాటికి బ్యాంకింగ్ కార్యకలాపాలలో ఖాతాదారుని ప్రాధాన్యత ఉండేదే కానీ ఖాతాదారుని యొక్క అవసరాలకు ప్రాధాన్యత ఉండేది కాదు. దీనివలన ధనవంతులు ఇంకా ధనవంతులుగాను, బీదవారు ఇంకా బీదవారుగాను మారటం జరిగినది. ఈ పరిస్థితిని మార్చటానికి 1969 లో బ్యాంకులను జాతీయీకరణ చేయటం జరిగింది. దీని ఫలితంగా వ్యవసాయరంగానికీ, ఇతర ప్రాధాన్యతా రంగాలకు ప్రాధాన్యత పెరిగినది. ఈ చర్యతో గ్రామీణ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలు ప్రాధాన్యతను పొందినవి. ఇంతేకాక బ్యాంకు బ్రాంచీల సంఖ్య, గ్రామీణ బ్రాంచీల సంఖ్య కూడా గణనీయంగా పెరిగి బ్యాంకులను ప్రజల వద్దకు చేర్చటం జరిగినది. ఈ పరిస్థితులు ఆశించిన విధంగా కాకుండా వక్రమార్గాన పయనించటం ఫలితంగా 1991 నాటికి బ్యాంకుల లాభదాయకత గణనీయంగా దెబ్బతిన్నది. పర్యవసానంగా బ్యాంకుల మనుగడే ప్రశ్నార్ధకంగా తయారైనది. ఈ పరిస్థితి నుండి బయటపడటానికి బ్యాంకింగ్ పనితీరులో సంస్కరణలను చేపట్టవలసిన ఆవశ్యకత ఏర్పడినది.

**4.2.2. నరసింహం కమిటీ, 1991 - ఏర్పాట్లు :** 1969 జాతీయం తరువాత బ్యాంకింగ్ రంగము భౌగోళికంగా, విధుల పరంగా తమ ఆర్థిక విధానాన్ని విస్తృతస్థాయిలో విస్తరింపజేసినది. పరిమాణాత్మకంగా పరపతి పంపిణీ ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ పరపతి పంపిణీ నియంత్రణలో అనేక అపశృతులు చోటుచేసుకొన్నవి. దీనితో బ్యాంకుల ఉత్పాదకత, సామర్థ్యము ఫలితంగా లాభదాయకత గణనీయంగా

దెబ్బతిన్నవి. ఈ పరిస్థితులలో బ్యాకింగ్ రంగం నిర్మాణము, నిర్వహణ, విధివిధానాలను సమీక్షించి తగు సూచనలు ఇవ్వటానికి, RBI గవర్నరుగా పనిచేసిన శ్రీ నరసింహం అధ్యక్షతన ఒక ఉన్నతస్థాయి కమిటీని 1991 లో నియమించటం జరిగినది.

**4.2.3. కమిటీ నియామకం పూర్వస్థితి :** నరసింహం కమిటీని నియమించకముందు బ్యాంకింగ్ రంగంలోని స్థితిగతులు క్రింది విధంగానున్నవి. ఈ అంశాలకు సంబంధించిన పురోగాభివృద్ధిని తమ నివేదికలోని ముందుమాటలో నరసింహం కమిటీ కూడా ఆమోదించినది.

i) బ్యాంకు బ్రాంచీల విస్తృతి ముఖ్యంగా గ్రామప్రాంతాలలో విస్తృత ప్రాతిపదిక మీద జరిగినది;

ii) డిపాజిట్ల పరిమాణము గణనీయంగా ఉన్నది; ప్రతి గృహవ్యవస్థలో ఉన్న మొత్తం ఆస్తులలో 2/5వ వంతు బ్యాంకు డిపాజిట్ల రూపంలో ఉన్నది;

iii) మొత్తం డిపాజిట్లలో గ్రామప్రాంతాల నుండి వచ్చిన డిపాజిట్ల స్థాయి 3 నుండి 15% నికి పెరిగినది;

iv) ప్రాధాన్యతా రంగాల పరపతి 1969-1991 మధ్యకాలంలో 14% నుండి 41% నికి పెరిగినది;

v) డిపాజిట్ ఖాతాలు, రుణ ఖాతాలు కూడా గణనీయంగా పెరిగినవి.

vi) గతంలో బ్యాంకింగ్ వ్యవస్థ చొరబడని ప్రాంతాలు, రాష్ట్రాలలో కూడా బ్యాంకింగ్ రంగాన్ని విస్తరించటము జరిగినది. దీనివలన ప్రాంతీయ అసమానతలు తొలగినవి.

**బ్యాంకింగ్ వ్యవస్థలోని సమస్యలు, ప్రతిబంధకాలు :**

పైన వివరించిన అంశాల దృష్ట్యా బ్యాంకింగ్ రంగంలో విస్తృతమైన అభివృద్ధి సాధించబడినప్పటికీ, కొన్ని ప్రతిబంధకాల ఫలితంగా బ్యాంకుల ఉత్పాదకత, సామర్థ్యము ఫలితంగా లాభదాయకత గణనీయంగా దెబ్బతిన్నవి. ఇందుకు ప్రధానంగా క్రింది కారణాలను పేర్కొనవచ్చును. అవి :

i) నిర్దేశిత పెట్టుబడులు;

ii) నిర్దేశిత పరపతి పథకాలు;

iii) రాజకీయ మరియు పరిపాలనా పరమైన జోక్యము;

iv) తక్కువ వడ్డీరేట్లు;

v) మితిమీరిన నిర్వహణా ఖర్చులు;

i) **నిర్దేశిత పెట్టుబడులు** : (Directed investments)

బ్యాంకులు తమ స్థిరత్వాన్ని, మనుగడను కాపాడుకొనటానికి చాలినంత స్థాయిలో తక్షణ ద్రవ్యత కలిగిన ఆస్తులను పొంది ఉండవలెను. ఈ కారణాన 1949 బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టము సెక్షన్ 24 లో ప్రతి బ్యాంకు తమ మొత్తం డిపాజిట్లలో 25% నికి తగ్గకుండా తక్షణ ద్రవ్యత కలిగిన ఆస్తులను కలిగి ఉండాలని ఉదహరించటము జరిగినది. ఇలా నిర్వహించవలసిన శాతాన్ని శాసనాత్మక ద్రవ్యతా నిష్పత్తి (Statutory Liquidity Ratio S.L.R) అని అంటారు. ఈ శాతాన్ని మార్పు చేసే అధికారము RBI కి ఉన్నది. ఈ అధికారమునుపయోగించుకొని SLR ను నవంబరు 1972 లో 25 నుండి 30% నికి, 1991 లో 38.5% నికీ పెంచినది. ఇలా SLR ను పెంచటానికి RBI రెండు ప్రధాన కారణాలను చూపింది. ఇందులో మొదటిది అధిక SLR వ్యాపార, పారిశ్రామిక రంగాలకు అధిక మొత్తంలో మంజూరు చేసే రుణాలను నియంత్రించుననీ; రెండవ కారణము అధిక SLR ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులను నెలకొల్పునని తెలియజేసింది.

ఇలా అధిక SLR ఉండటము, బ్యాంకుల లాభదాయకతను దెబ్బతీసినదని నరసింహం కమిటీ అభిప్రాయపడింది. వాస్తవానికి SLR ను ప్రభుత్వ అనుమతి పొందిన సెక్యూరిటీలలోను, నగదు, బంగారం రూపంలోను ఉంచవలసి యున్నది. వీటినుంచి వచ్చే వడ్డీరేట్లు మరియు ఆదాయము అతి తక్కువగా ఉండటము వలననే బ్యాంకుల లాభదాయకత తగ్గటానికి దోహదముచేయును. అతి తక్కువ వడ్డీ చెల్లిస్తూ ప్రభుత్వము ప్రజాధనాన్ని ఉపయోగించుకోవటమనగా ప్రజలను మోసగించినట్లేనని నరసింహం కమిటీ అభిప్రాయపడింది. ఇంతేకాక ప్రభుత్వము బ్యాంకులనుండి తీసుకొన్న నిధులను ఉత్పాదక కార్యకలాపాలకు ఉపయోగించకపోగా చాలా సందర్భాలలో ఉద్యోగుల జీతాల చెల్లింపుకు ఉపయోగించటము జరిగినది.

S.L.R తో పాటు ప్రతి వాణిజ్య బ్యాంకు కూడా తమ డిమాండు డిపాజిట్లలో 5% మరియు కాలపరిమిత డిపాజిట్లలో 2% మొత్తాన్ని నగదు రిజర్వు నిష్పత్తి (Cash Reserve Ratio C.R.R) గా ఉంచవలసి యున్నది. 1962 లో ఈ C.R.R ను 3% నుండి 15% వరకు ఉండేటట్లుగా చూసే అధికారాన్ని RBI కి ఇవ్వటము జరిగినది. ఈ అధికారమునుపయోగించుకొని RBI అనేకసార్లుగా C.R.R ను మార్చినది. 1991 లో దీనిని గరిష్టంగా 15% స్థాయిలో ఉంచినది.

S.L.R + C.R.R లను చట్టబద్ధంగా నిర్వహిస్తే 38.5 + 15 = 53.5% డిపాజిట్లను అతి తక్కువ వడ్డీరేట్లకు అందుబాటులో ఉంచవలసి ఉన్నది. అనగా రుణాలను మంజూరుచేయటానికి అందుబాటులో ఉండే మొత్తము డిపాజిట్లలో 46.5% మాత్రమేనని గమనించాలి. ఇంత తక్కువ శాతము నిధులను రుణాలుగా మంజూరు చేయటము వలన బ్యాంకుల లాభదాయకత గణనీయంగా క్షీణించినది.

### ii) **నిర్దేశిత పరపతి కార్యక్రమాలు :** (Directed Credit Programme)

1969 లో బ్యాంకులను జాతీయం చేయటంలోగల ఒక ప్రధానోద్దేశము ప్రాధాన్యతా రంగాలకు ముఖ్యంగా గ్రామప్రాంతాలకు పరపతి సౌకర్యాలను విస్తరించటము. అంతవరకు నిర్లక్ష్యము చేయబడిన రంగాలను ప్రాధాన్యతా రంగాలని అంటారు. ప్రారంభంలో ప్రాధాన్యతా రంగాల జాబితాలో గ్రామీణ, కుటీర పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలు, వెనుకబడిన తరగతులకు చెందినవారు, వ్యవసాయము, వ్యవసాయాధారిత పరిశ్రమలున్నప్పటికీ ప్రభుత్వము ఈ జాబితాలో క్రొత్త క్రొత్త రంగాలకు చెందిన వ్యాపకాలను చేర్చటము వలన ప్రాధాన్యతా రంగాల జాబితా పెరిగిపోయినది. ఇలా చేరినవాటిలో ముఖ్యమైనవి ఎగుమతులు, ఆహారపదార్థాల సేకరణ మొదలగువి కూడా ఉన్నవి. ఈ రంగాలన్నింటికీ పరపతి సౌకర్యాలను విస్తరించటము వాణిజ్య బ్యాంకులకు భారంగా పరిణమించినది. ఈ సందర్భంలో ఋణగ్రస్థుల అవసరాలను, ఉద్దేశ్యాలను మాత్రమే పరిగణనలోనికి తీసికోవాలి కానీ, ఋణగ్రస్థులిచ్చే సెక్యూరిటీని పరిశీలించవలసిన పనిలేదని బ్యాంకులను ఆదేశించటము జరిగినది.

నిర్దేశిత పరపతి కార్యక్రమాలు ఆశించిన స్థాయికన్నా ఎక్కువస్థాయిలో విజయవంతమైనట్లుగా ప్రభుత్వము పరిగణించినది. కానీ ఈ విజయము వెనుక క్రింది అంశాలున్నవి-

ఋణాల మంజూరు నాణ్యత తగ్గటమేకాక ఋణభారము నానాటికీ పెరిగి వసూళ్ళు తగ్గినవి. ఫలితంగా బ్యాంకుల లాభదాయకత గణనీయంగా దెబ్బతిన్నది.

సెక్యూరిటీ ప్రాధాన్యతనుంచి ఉద్దేశ ప్రాధాన్యతకు మారేటప్పుడు సాంకేతికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొనవలసినదిగా బ్యాంకులను కోరినప్పటికీ ఆచరణలో ఇది అమలు కాకపోగా ఋణాల, ఋణగ్రస్థుల సమీక్ష జరుగలేదు. ఫలితంగా వసూళ్ళు తగ్గి వసూలుకాని వడ్డీలు, నిరుపయోగ ఆస్తుల స్థాయి పెరిగినది.

### iii) **రాజకీయ మరియు పరిపాలనా పరమైన జోక్యము** (Political and Administrative interference) :-

నరసింహం కమిటీ దృష్టిలో ప్రభుత్వరంగ బ్యాంకులకు ఎక్కువ చెరుపుచేసిన అంశము రాజకీయ మరియు పరిపాలనా పరమైన జోక్యము. ఉదాహరణకు కాంగ్రెసు పార్టీ నాయకులు నిర్వహించిన ఋణమేళాలు బ్యాంకింగ్ నిబంధనలను విస్మరించి వారి కార్యకర్తలకు

ఋణాలను మంజూరు చేయటంలో దోహదపడినవి. సమాజాభివృద్ధి పథకాలుగా ప్రారంభించిన పరపతి ప్రక్రియలు బాధ్యతారహితమైన పరపతి పంపిణీ కార్యక్రమాలుగా మారినవి. ఇదే పరిస్థితి IRDP (Integrated Rural Develpment Programme) కార్యకలాపాలకు కూడా వర్తించును. ఇలాంటి పరిస్థితుల కారణంగా మొత్తం బ్యాంకు ఆస్తులలో 20% మించిన ఆస్తులు ఈ కోవకు చెందును.

రాజకీయ జోక్యము కేవలము ప్రాధాన్యతా రంగాల పరపతికి మాత్రమే పరిమితం కాకుండా బ్యాంకుల ఇతర విధులకు కూడా విస్తరించబడటము శోచనీయము. ఉదాహరణకు BIFR (Board for Industrial and Finance Reconstruction) ఖాయిలాపడిన (Sick) పరిశ్రమల విషయంలో ఇచ్చిన సలహాలను, ఈ సందర్భములో కోర్టులిచ్చిన ఆదేశాలను పాటించటం కారణంగా బ్యాంకు పరపతి విధానము గణనీయంగా దెబ్బతిన్నది. ఈ విధంగా సలహాలు, ఆదేశాలు, సూచనల కారణంగా బ్యాంకుల పరిస్థితి ఇంకా దిగజారినది.

### iv) **తక్కువ వడ్డీరేట్లు** (Low Rates of Interest) :-

SLR పథకం క్రింద ప్రభుత్వము బ్యాంకు నిధులను అతి తక్కువ వడ్డీరేట్లకు ఉపయోగించుకోవటమేకాక తక్కువ వడ్డీరేట్లకు ప్రాధాన్యతారంగాలకు మరియు IRDP కార్యకలాపాలకు అప్పులను ఇవ్వాలని ఆదేశించటము వలన వచ్చిన వడ్డీ నష్టాన్ని భర్తీ చేసుకొనటానికి వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అధిక వడ్డీలను ఛార్జిచేయటము ఆనవాయితీగా మారినది. సమాజాభివృద్ధికి ఉద్దేశించబడిన పరపతి సౌకర్యాలు తక్కువ వడ్డీరేట్లకివ్వాలన్న నిబంధన లేదని నరసింహం కమిటీ అభిప్రాయపడింది. వాస్తవానికి వడ్డీరేట్లను తగ్గించవలసిన అవసరము, ఆవశ్యకత కూడా ఏమీలేదని ఈ కమిటీ అభిప్రాయపడింది. బ్యాంకులకు గానీ, ప్రభుత్వ ఆర్థిక శాఖకు గానీ, ప్రజాధనాన్ని ఈ విధంగా ఉపయోగించటము సహేతుకము కాకపోగా అనైతికముకూడానని అభిప్రాయపడింది.

### v) **మితిమీరిన నిర్వహణా ఖర్చులు** (Mounting expenditure of Banks)

పైన వివరించిన కారణాల వలన బ్యాంకుల ఆదాయము ఏ విధంగా తగ్గినదో తెలుసుకొనవచ్చును. పబ్లిక్ రంగ బ్యాంకుల ఖర్చులను పరిశీలించినపుడు ఖర్చులు అనూహ్యంగా పెరిగి బ్యాంకుల లాభదాయకతను గణనీయంగా దెబ్బతీస్తున్నవి. ఇలా ఖర్చులు పెరగటానికి నరసింహం కమిటీ క్రింది కారణాలను పేర్కొన్నది-

i) ఆర్థిక వెసులుబాటు, అవసరము లేకపోయినా, పెరిగిన బ్రాంచీల సంఖ్య;

ii) లోపించిన కేంద్ర కార్యాలయము, పర్యవేక్షణ మరియు పెచ్చు పెరిగిన అంతర బ్రాంచీల వ్యవహారాలు మరియు సర్దుబాట్లు;

iii) అనూహ్యంగా పెరిగిన సిబ్బంది సంఖ్య మరియు పదోన్నతుల ఫలితంగా క్షీణించిన శ్రామికశక్తి మరియు అన్ని స్థాయిలలో అధికసంఖ్యలో ఉద్యోగులు ;

iv) కార్మిక సంఘాల బాధ్యతారహితమైన ప్రవర్తన, ఖాతాదారులకు చేసే సేవలలో సామర్ధ్యము తగ్గి శ్రామిక ఉత్పాదకత తగ్గుదలకు దోహదపడినవి.

v) విస్తృత పరచబడిన వ్యవసాయ మరియు చిన్నతరహా పరిశ్రమల పరపతి యొక్క నిర్వహణా ఖర్చు, దానిమీద వచ్చే ఆదాయం కన్నా అధికంగా ఉండటము.

ఈ విధంగా 1969 జాతీయం తరువాత భారతదేశంలోని వాణిజ్య బ్యాంకులు ముఖ్యంగా పబ్లిక్‌రంగ బ్యాంకులు పరిమాణాత్మక అభివృద్ధిని సాధించినవేకాని గుణాత్మక అభివృద్ధిని సాధించలేకపోయినవి. బలహీనపడ్డ ఆర్థిక పరిస్థితి, పోటీ వాతావరణం కల్పించిన సవాళ్ళను ఎదుర్కొనలేకపోయినవి.

**4.2.4. నరసింహం కమిటీ - 1991 సూచనలు** (Recommendations of the Narasimham Committee) :

కమిటీ ఏర్పాటు పూర్వస్థితిని క్షుణ్ణంగా సమీక్షించిన తరువాత నరసింహం కమిటీ తమ సూచనలను క్రింది మౌలిక భావనపై ఆధారపడి సూచించినది.

"బ్యాంకు సమీక్షించిన వనరులు సామాన్య ప్రజలనుంచి వచ్చినవి. బ్యాంకులు ఆ నిధులకు కేవలము ధర్మకర్తలు మాత్రమే. ఆ నిధులను డిపాజిట్‌దారులకు గరిష్ఠ ప్రయోజనం కలిగించే విధంగా వినియోగించవలసిన నైతిక బాధ్యత బ్యాంకులపై ఉంది. ఇదే నైతిక బాధ్యత ప్రభుత్వంమీద కూడా ఉందని గమనించాలి. ఈ కారణాన ప్రభుత్వాలు కూడా బ్యాంకుల సామర్థ్యాన్ని, ద్రవ్యతను, లాభదాయకతను దెబ్బతీయకూడదు. తమ దైనందికావసరాలకు ప్రభుత్వాలకు బ్యాంకుల నిధులను ఉపయోగించుకునే హక్కులేదు."

నరసింహం కమిటీ చేసిన సూచనలు క్రింది లక్ష్యాలను సాధించటానికి ఉద్దేశించబడినవి-

a) నిర్వహణాపరమైన సౌలభ్యాన్ని సాధించటము;

b) పబ్లిక్‌రంగ బ్యాంకులకు అంతర్గత సమస్యలపై నిర్ణయాలను తీసుకునే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనివ్వటము;

c) బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణలో వృత్తిపరమైన నైపుణ్యాన్ని నెలకొల్పటము;

**నరసింహం కమిటీ వివిధ రుగ్మతల పరిష్కారానికి వరుసగా క్రింది సూచనలు చేసినది-**

నిర్దేశిత పెట్టుబడులకు సంబంధించి ;

ప్రభుత్వము నిధుల సమీకరణ కొరకు SLR రేట్లలో అవసరమైన మార్పులను చేసే పద్ధతికి స్వస్తి చెప్పాలనీ,

ప్రస్తుతమున్న SLR రేటు 38.5% ను రాబోయే 5 సం॥ల కాలములో 25% నకు తీసికొని రావలయునని సూచించినది. ప్రభుత్వాలు తాము తీసుకున్న ఋణాలపై చెల్లించే వడ్డీరేటు మార్కెట్లో అమలులో ఉన్న రేట్లకు కనీసం దగ్గరగా ఉండాలని సూచించినది. ఇలా చేయటం వలన బ్యాంకుల ఆదాయంకూడా గణనీయంగా పెరిగే అవకాశమున్నది.

RBI ద్రవ్య మరియు పరపతి నియంత్రణా సాధనాలుగా CRR రేట్లలో తరచు మార్పులను చేపట్టేకన్నా ఓపెన్ మార్కెట్ వ్యవహారాలపై ఆధారపడాలని సూచించినది. CRR రేటు ప్రస్తుతమున్న 15% నుంచి 3 నుండి 5% స్థాయికి తీసికొనిరావాలని సూచించినది; కనీసస్థాయికి మించి తమవద్ద ఉంచుకొన్న డిపాజిట్లపై RBI కనీసము ఒక సంవత్సరము ఫిక్సెడ్ డిపాజిట్ల పై చెల్లించే వడ్డీరేటు చెల్లించాలని కమిటీ సూచించినది.

పై చర్యల ఫలితంగా బ్యాంకుల వద్ద, RBI వద్ద వృధాగా పడిఉండే నగదు నిల్వల స్థాయిని గణనీయంగా తగ్గించి బ్యాంకుల రాబడిని కూడా పెంచుకొనవచ్చును.

**నిర్దేశిత పరపతి కార్యక్రమాలకు సంబంధించి :**

నిర్దేశిత పరపతి కార్యక్రమాలను దశలవారీగా రూపుమాపాలని నరసింహం కమిటీ సూచించినది. వాస్తవానికి వ్యవసాయరంగం మరియు చిన్నతరహా పరిశ్రమల రంగము స్వయం పోషక స్థాయికి చేరినవని, ఇంకా ఆ రంగాలకు ప్రత్యేక సహాయాన్ని ఇవ్వవలసిన అవసరం లేదని నరసింహం కమిటీ అభిప్రాయపడింది. రాబోయే రెండు దశాబ్దాలవరకు వడ్డీ సబ్సిడీ సరిపోతుందని, తగ్గింపు వడ్డీరేట్ల విధానాన్ని నిర్మూలించవచ్చునని కమిటీ అభిప్రాయపడింది. అంతేకాక నిర్దేశిత పరపతి కార్యకలాపాలను శాశ్విత ప్రాతిపదికపై కాకుండా తాత్కాలిక ప్రాతిపదికపై నిర్వహించాలని కమిటీ సూచించినది. ప్రాధాన్యతా రంగాల భావనను పునఃపరిశీలన చేయవలెనని, ఇందులో అట్టడుగు వర్గాలకు చెందినవారిని మాత్రమే ప్రాధాన్యతారంగాలుగా గుర్తించాలని మొత్తం బ్యాంకు పరపతిలో వీరికిచ్చే పరపతి సౌకర్యాన్ని 10% స్థాయిలో మాత్రమే ఉంచాలని కమిటీ సూచించినది. దీనిని కూడా 3 సం॥ల తరువాత సమీక్ష చేసి ఈ కార్యక్రమాన్ని కొనసాగించటమా

లేక నిలుపుదల చేయటమా అనే విషయాన్ని నిర్ణయించాలని కమిటీ సూచించినది. బ్యాంకుల సామాజిక స్పృహ చిన్నతరహా పరిశ్రమలకు మాత్రమే పరిమితం చేయాలని కూడా నరసింహం కమిటీ సూచించినది. సామాజిక బ్యాంకింగ్ భావన క్రమబద్ధమైన బ్యాంకింగ్‌కు అవరోధంగా మారకూడదని కమిటీ అభిప్రాయపడింది.

**రాజకీయ మరియు పరిపాలనా పరమైన జోక్యము గురించి :**

బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణలో రాజకీయ మరియు పరిపాలనా పరమైన జోక్యాన్ని సాధ్యమైనంతవరకు తగ్గింటానికి ద్వంద్వ నియంత్రణా విధానాన్ని రూపుమాపాలని కమిటీ సూచించినది. బ్యాంకింగ్ విధానాన్ని ఒకవైపు నుంచి RBI మరోవైపు నుండి ఆర్థిక మంత్రిత్వశాఖలోని బ్యాంకింగ్ విభాగము నియంత్రించటము వలన బ్యాంకులు తరచు అయోమయస్థితిలో పడుచున్నవి. ఈ కారణాన బ్యాంకులకు సంపూర్ణ స్వేచ్ఛనిస్తూ RBI బ్యాంకుల పనితీరును తరచు సమీక్షించవలెనని కమిటీ సూచించినవి. బ్యాంకుల ముఖ్య కార్యనిర్వహణాధికారిని నియమించేటప్పుడు రాజకీయపరమైన ఒత్తిడులకు తల ఒగ్గకుండా నీతి, నిజాయితీలు, వృత్తిపరమైన సామర్థ్యము కల్గి ఉండటమే ప్రధానమైన అంశంగా భావించాలని కమిటీ సూచించినది. ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎంపిక కొరకు నిపుణుల సంఘాన్ని ఏర్పాటుచేయాలని కూడా కమిటీ సూచించినది.

**వడ్డీరేట్ల నిర్మాణానికి సంబంధించి :**

అన్నిరకాల వడ్డీరేట్లు, అన్ని స్థాయిలలోని వడ్డీరేట్లు మార్కెట్ శక్తులచేత నిర్ణయించబడాలని నరసింహం కమిటీ సూచించినది. వడ్డీరేట్లకు సంబంధించిన అన్ని నియంత్రణలు, నిబంధనలు తొలగించాలని, తగ్గింపు వడ్డీరేట్లు మరియు IRDP సబ్సిడీలను కూడా నిర్మూలించాలని కూడా కమిటీ అభిప్రాయ పడింది. వడ్డీరేట్ల నిర్ణయములో RBI ని మాత్రమే అత్యున్నత ఆధీకృత సంస్థగా గుర్తించాలని అన్ని వడ్డీరేట్లు బ్యాంకురేటుకనుబంధంగా ఉండాలని కమిటీ అభిప్రాయపడింది.

**బ్యాంకింగ్ రంగంలో నిర్మాణాత్మక పునఃవ్యవస్థీకరణకు సంబంధించి :**

బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణలో ఉన్నత సామర్థ్యాన్ని సాధించటానికి సంలీనము మరియు సంయోగములనే ప్రక్రియలద్వారా పబ్లిక్‌రంగ బ్యాంకుల సంఖ్యను తగ్గించాలని కమిటీ సూచించినది. బ్యాంకుల నిర్మాణ నిర్వహణకు సంబంధించి కమిటీ అభిప్రాయము క్రింది విధంగా ఉన్నది :

- భారతదేశం మొత్తంమీద SBI తో కలుపుకొని 3 లేక 4 పెద్ద బ్యాంకులుండాలని వీటి నిర్మాణ నిర్వహణ అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని;
- భారతదేశం మొత్తంమీద బ్రాంచీల నేర్పాటుచేస్తూ 8 నుంచి 10 జాతీయస్థాయి బ్యాంకులుండాలని;
- ప్రాంతీయ అవసరాలను తృప్తిపరచటానికి ప్రాంతీయ బ్యాంకులుండాలనీ;
- ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల కార్యకలాపాలు కేవలము గ్రామ ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండాలనీ; వీరు ప్రధానంగా వ్యవసాయ, వ్యవసాయాధారిత కార్యకలాపాలకు ద్రవ్యసహాయాన్నందించాలనీ;

1991 నాటికే గ్రామప్రాంతాలలోను, చిన్న పట్టణాలలోను చాలినన్ని బ్యాంకు బ్రాంచీలుండటము వలన బ్రాంచీల విస్తరణా కార్యక్రమాన్ని నిలుపుదల చేయవలెనని, కమిటీ సూచించినది. లాభదాయకత ప్రాతిపదికపై మాత్రమే బ్రాంచీలను ఏర్పాటుచేసే స్వేచ్ఛను ఆయా బ్యాంకులకివ్వాలని కూడా కమిటీ సూచించినది.

బ్యాంకులను జాతీయం చేసే ప్రక్రియను నిర్ద్వంద్వంగా నిలుపుదల చేయాలని, క్రొత్త బ్యాంకులను ప్రయివేటు రంగంలో మాత్రమే ప్రారంభించాలని కూడా కమిటీ సూచించినది. విదేశీ బ్యాంకులకు, భారతదేశములో బ్రాంచీలను కానీ, సబ్సిడరీలనుగానీ ఏర్పాటు చేసుకునే

అవకాశాన్నివ్వాలని కమిటీ సూచించినది.

**ఇతర సూచనలు :** వివిధ బ్యాంకులలో పేరుకొనిపోయిన నిరుపయోగ ఆస్తులను, సంశయాత్మక బాకీల భారాన్ని తగ్గించటానికి ఆస్తుల పునఃనిర్మాణ నిధిని (Assets Reconstruction Fund) ఏర్పాటు చేయాలని నరసింహం కమిటీ సూచించినది. జాతీయం చేయబడిన బ్యాంకులు మరియు ద్రవ్య సహాయసంస్థల రాని మరియు సంశయాత్మక బాకీలలో కొంత శాతాన్ని ఈ నిధికి బదలాయించాలని కూడా కమిటీ సూచించినది. ఈ విధానము వలన బ్యాంకులు తమ నిరుపయోగ ఆస్తుల భారాన్ని తగ్గించుకొని, ఈ సందర్భంలో వచ్చిన నిధులను ఉత్పాదక ప్రయోజాలకు ఉపయోగించే అవకాశ మేర్పడును.

నరసింహం కమిటీ ప్రధానంగా భారత ప్రభుత్వాన్ని, ఆర్థిక మంత్రిత్వశాఖను తమ సూచనలలో తప్పుబట్టినది. నరసింహం కమిటీ సూచనలు అనేక విధాలుగా విప్లవాత్మకమైనవిగా భావించవచ్చును. వీరి సూచనలను ప్రధానంగా బ్యాంకుల కార్మిక సంఘాలు మరియు మితవాద రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినవి.

**4.2.5. నరసింహం కమిటీ సూచనల అమలు :** బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు (1992-1998)

దేశములోని రాజకీయ పార్టీలనుంచి బ్యాంకు సిబ్బంది సంఘాలనుండి తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పటికీ భారత ప్రభుత్వము నరసింహం కమిటీ సిఫారసులను మొత్తంగా ఆమోదించి అమలుచేసే ప్రయత్నము చేసినది. ఈ సిఫారసుల ఫలితంగా 1991-92 మరియు 1997-98 మధ్యకాలములో క్రింది చర్యలను చేపట్టటము జరిగినది. ఈ చర్యలను ఈ కాలములో వచ్చిన సంస్కరణలుగా పరిగణించాలి.

నరసింహం కమిటీ చేసిన సూచనలలో ప్రధానాంశమైన శాసనాత్మక ద్రవ్యతానిష్పత్తి తగ్గింపుకు సంబంధించి దశలవారీగా ఈ నిష్పత్తిని అక్టోబరు 97 నాటికే 38.5% నుండి 25% తగ్గించటము జరిగినది;

నగదు రిజర్వు నిష్పత్తికి సంబంధించి కూడా దశలవారీగా 15% నుండి 1997 మార్చి నాటికి 10% నికీ, ఆ తరువాత మే 2001 నాటికి 7.5% నికీ, తగ్గించటమే కాక 2003 జూన్ నాటికి 4.5% నికీ తీసికొని రావటము జరిగినది; ఈ విధంగా SLR మరియు CRR రేట్లను తగ్గించటము ద్వారా బ్యాంకులవద్ద ఉండే నిధుల శాతము పెరిగి బ్యాంకులకు ఆదాయాన్ని తెచ్చిపెట్టే పరిశ్రమలకు పరపతి సౌకర్యాన్ని విస్తృతపరచే అవకాశమేర్పడినది.

వడ్డీరేట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి అంతవరకు ఉన్న 20 దశలను (slabs) 1994 - 95 నాటికి రెండు దశలకు తీసుకొని రావటము జరిగినది. 1991 - 92 నుండి వడ్డీరేట్లకు సంబంధించి క్రింది చర్యలను చేపట్టటము జరిగినది :

ఒక సంవత్సరానికి మించిన కాలపరిమితికి సంబంధించిన డిపాజిట్లపై వడ్డీరేట్లను అనియంత్రణ (decontrolled) చేయటము జరిగినది;

రెండు లక్షల రూపాయలకు మించి ఇచ్చే సాధారణ అడ్వాన్సులపై వర్తింపజేసే ప్రధాన పరపతి రేటు (prime lending rate) ను SBI తో సహా అన్ని బ్యాంకులు తగ్గించినవి. ఇంతేకాక ఈ వడ్డీరేట్లను కూడా అనియంత్రణా పరిధిలోనికి తీసికొనిరావటము జరిగినది. ఇలాంటి చర్యవలన బ్యాంకుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ నెలకొని బ్యాంకుల సామర్థ్యము పెరుగును;

సంస్కరణలలో భాగంగా RBI అనేక సలహాపూర్వక చర్యలను (Prudential Norms) చేపట్టినది. ఇలాంటి చర్యల ఫలితంగా బ్యాంకుల ఆస్థి అప్పుల స్థితిగతులను, ద్రవ్యస్థితిని వెల్లడించటంలో అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పే అవకాశమేర్పడును. RBI పర్యవేక్షణ కూడా సులభతరమగును. ఇలాంటి సలహాపూర్వక చర్యలలో ప్రధానమైనది బ్యాంకులవద్ద నిరుపయోగంగా పడిఉన్న ఆస్థులపై 100% నిధిని ఏర్పాటునుంచటము. ఇందుకొరకు 10,000 కోట్ల రూపాయలను అందుబాటులో నుంచటము జరిగినది. ఈ సందర్భములో బ్యాంకులు కూడా తమకు రాని, సంశయాత్మక బాకీల కొరకు 1992-93 లో 30% మొత్తాన్ని, 1993-94 లో 70% మొత్తాన్ని ఏర్పాటు చేయాలని కూడా కోరటమైనది. సంస్కరణలో భాగంగా RBI ఏప్రిల్ 1992 లో మూలధన సంవృద్ధిని (capital adequacy)

8% గా నిర్ణయించినారు. ఈ స్థితిని ప్రతి బ్యాంకు 3 సం॥లలో చేరవలెనని కూడా RBI ఆదేశించినది. 1996 మార్చి నాటికి దాదాపు అన్ని పబ్లిక్‌రంగ బ్యాంకులు ఈస్థితికి చేరినవి. ఇంతేకాక భారతదేశములోని షెడ్యూల్డు బ్యాంకులకు రెండుదశల మూలధన విధానాన్ని కూడా బాస్‌లె (Basle Committee) కమిటీ సూచనల మేరకు నిర్ధారించటము జరిగినది. ఈ రెండు దశలు క్రింది విధంగా ఉండును.

మొదటి దశ అత్యంత ప్రధానమైనది, శాశ్వతమైనది. అనుకోని విధంగా ఎదురయ్యే నష్టాలను తట్టుకొనగలిగినదిగా ఉండాలి. ఇందులో చెల్లించిన మూలధనము, శాసనాత్మక రిజర్వులు, వాటా ప్రీమియమ్ మరియు మూలధన రిజర్వులుండును.

రెండవదశ మూలధనంలో రహస్య రిజర్వులు, చెల్లించిన సంచిత నిరంతర ఆధిక్యపు వాటాలు, పునర్మూల్యాంకన రిజర్వులు, సాధారణ ఏర్పాట్లు నష్టాలకొరకు రిజర్వులు ఉండును; రెండవ దశ మూలధనము మొదటి దశ మూలధనంలో 100% నికి మించకూడదు. సంస్కరణలలో భాగంగా బ్యాంకింగ్ కంపెనీల చట్టాన్ని సవరించటము జరిగినది. ఈ సవరణల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం వాటా 51% నికి తగ్గకుండా ఉండేటట్లు చూచుకొంటూ ప్రజలనుండి మూలధన రూపములో అవసరమైన నిధులను సేకరించవచ్చును; ఇందులో భాగంగా SBI తో సహా అన్ని బ్యాంకులు ప్రజలనుండి వాటాలను విక్రయించటం ద్వారా తమ మూలధన స్థాయిని పెంచుకొన్నవి.

దేశములోని వాణిజ్య బ్యాంకులకు క్రొత్త బ్రాంచీలను ఏర్పాటు చేసే విషయంలోను, ఆర్థిక సౌలభ్యం లేని బ్యాంకులను మూసివేసే విషయంలోను, పరపతి విధానాలను రూపొందించే విషయంలోను సంపూర్ణ స్వేచ్ఛనివ్వటము జరిగినది. అయితే ఈ స్వేచ్ఛను ఉపయోగించుకునేటప్పుడు దేశీయ అంతర్జాతీయ అకౌంటింగ్ ప్రమాణాలను పాటించాలి.

నరసింహం కమిటీ చేసిన సూచనలలో భాగంగా ప్రయివేటు రంగంలో 10 బ్యాంకులు పనిచేయటాన్ని ప్రారంభించగా ప్రభుత్వం వద్ద మరో మూడు బ్యాంకుల స్థాపనకు దరఖాస్తులున్నవి. ఈ ప్రయివేటు బ్యాంకులు తమ మూలధన నిధుల కొరకు విదేశీ సంస్థాగత పెట్టుబడుదారులనుండి 20% వరకు, నివాసేతర భారతీయులనుండి 40% వరకు నిధులను పొందవచ్చు. గ్రామీణ ప్రాంతాలలోని పొదుపులను పెట్టుబడులుగా మార్చటానికి భారత ప్రభుత్వము 1996-97 బడ్జెట్‌లో స్థానిక ప్రాంత బ్యాంకుల ఏర్పాటుకు శ్రీకారము చుట్టినది. ఇలాంటి బ్యాంకులు అందుబాటులో ఉన్న కనీసం మూడు జిల్లాలకు సేవలను అందించును. ఇందులో భాగంగా మహారాష్ట్ర, కర్ణాటకలలో ఒక్కొక్క బ్యాంకును ప్రారంభించటము జరిగినది.

వాణిజ్య బ్యాంకుల పనితీరు పర్యవేక్షణకు కూడా పటిష్టమైన చర్యలను చేపట్టటము జరిగినది. ఇందుకొరకు RBI లో ప్రత్యేకమైన ఒక పర్యవేక్షణా విభాగాన్ని కూడా ఏర్పాటు చేయటమైనది.

బ్యాంకులకు రావలసిన వసూలు కొరకు 1993 లో ఒక ప్రత్యేక చట్టాన్ని కూడా రూపొందించటము జరిగినది. ఇందులో భాగంగా 6 ప్రత్యేక ట్రిబ్యునల్‌లను, ఒక అప్పీలు ట్రిబ్యునల్‌ను కూడా ఏర్పాటుచేసినారు.

పై చర్యల ఫలితంగా దేశములోని వాణిజ్య బ్యాంకులు తమ పనితీరును క్రమక్రమంగా మెరుగుపరచుకొంటున్నవి.

**4.2.6. బ్యాంకింగ్ సంస్కరణల అమలు తీరుపై ఏర్పాటుచేసిన నరసింహం కమిటీ - 1998 :** భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ మరోసారి మాజీగవర్నరు నరసింహం అధ్యక్షతన 1998 లో మరోకమిటీని ఏర్పాటు చేసినది. ఈసారి ఈ కమిటీ బ్యాంకింగ్ రంగంలో చేపట్టిన సంస్కరణల పనితీరును పరిశీలించవలిసి ఉన్నది. ఈ కారణాన ఈ కమిటీని బ్యాంకింగ్ రంగ సంస్కరణల కమిటీగా వ్యవహరించటము జరిగినది. కమిటీ నియమాకము తేదీవరకు బ్యాంకింగ్ రంగములో చేపట్టిన సంస్కరణల పనితీరును సమీక్షించి ఆర్థిక రంగములో ఇంకా చేపట్టవలసిన సంస్కరణలను సూచించవలసినదిగా ప్రభుత్వము ఈ కమిటీని కోరినది. వీరిచ్చే సూచనలు ఆర్థిక రంగములో ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో అంతర్జాతీయ రంగంలో నెలకొనియున్న పోటీని తట్టుకునే విధంగా భారతీయ వాణిజ్య బ్యాంకులను తీర్చిదిద్దటానికి అనువుగా ఉండాలి. నరసింహం కమిటీ తమ సమగ్ర నివేదికను 1999 ఏప్రిల్‌లో సమర్పించినారు. ఇందులో దాదాపు అన్ని అంశాలను పరిగణనలోనికి తీసికొనటము జరిగినది. ఈ నివేదికలోని అంశాలు క్రిందివిధంగా ఉన్నాయి:

### 4.2.7. నరసింహం కమిటీ 1998 సూచనలు :

**పటిష్టమైన బ్యాంకింగ్ ఆవశ్యకత :** అంతర్జాతీయంగా వస్తున్న మార్పుల కారణంగా ముఖ్యంగా WTO (World Trade Organisation) ఏర్పాటు పర్యవసానంగా సంపూర్ణ స్థాయిలో మూలధన ఖాతాల బదిలీ విధానాన్ని (capital account convertibility) ప్రతిదేశము అమలుచేయటము జరుగుతుంది. దీని ఫలితంగా విదేశీ ద్రవ్యమారకం రేటు, దేశీయ ద్రవ్యతను పరిరక్షించటములో అనేక ఇబ్బందులు తలయెత్తును. వీటిని తట్టుకొనటానికి పటిష్టమైన బ్యాంకులను, బ్యాంకింగ్ విధానాన్ని రూపొందించవలసి ఉన్నది. ఇందుకొరకు పెద్ద పెద్ద బ్యాంకులను సంలీన ప్రక్రియ ద్వారా పటిష్టంగా రూపొందించవలసినదిగా నరసింహం కమిటీ సూచించినది. ఇలా చేసేటపుడు రెండు బలమైన బ్యాంకులను ఒకటిగా చేయాలేకానీ, ఒక బలహీనమైన బ్యాంకును మరో బలమైన బ్యాంకులో విలీనం చేయటం వలన బలమైన బ్యాంకు కూడా బలహీనంగా మారుతుందని కమిటీ అభిప్రాయపడింది;

**సంకుచిత బ్యాంకింగ్ భావనా ప్రయోగము :** (Experiment of the Concept of Narrow Banking)

అవాంఛనీయ స్థాయిలో (20% నికి మించి) నిరుపయోగ ఆస్తులను కల్గియున్న బ్యాంకుల పునరావాసం కొరకు ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఆచరించాలని కమిటీ పేర్కొన్నది. ఈ ప్రయోగంలో బలహీనమైన బ్యాంకులు తమ నిధులను స్వల్పకాల, రిస్కులేని సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టాలనీ, ఆ విధంగా బ్యాంకులు తమ డిమాండు డిపాజిట్లకవసరమైన రక్షణ కల్పించాలని కమిటీ సూచించినది. ఈ ప్రయోగం విఫలమైతే అలాంటి బలహీన బ్యాంకులను మూసివేసే ఆలోచనను చేపట్టాలి;

**పరిమిత స్థాయిలో స్థానిక బ్యాంకులు** (Small Local Banks) :

భారతదేశం మొత్తం మీద అంతర్జాతీయస్థాయి కలిగిన బ్యాంకులు రెండు లేక మూడు ఉండాలనీ, 8 నుండి 10 జాతీయ స్థాయి బ్యాంకులుండాలని నరసింహం కమిటీ అభిప్రాయపడింది. ఈ జాతీయస్థాయి బ్యాంకులు మధ్య, భారీ తరహా, పరపతి సౌకర్యాలను కలుగజేయును. ఇలా చేసిన తరువాత స్థానిక అవసరాల కొరకు పరిమితస్థాయి కలిగిన స్థానిక బ్యాంకుల నేర్పాటు చేయాలని కమిటీ సలహా ఇచ్చినది. ఈ విధంగా ఉన్న 3 దశల బ్యాంకులమధ్య పటిష్టమైన కమ్యూనికేషన్ వ్యవస్థ ఉండాలని కమిటీ సూచించినది.

**మూలధన సంవృద్ధి నిష్పత్తి** (Capital Adequacy Ratio):

బ్యాంకుల అంతర్గత శక్తిని పటిష్టపరచటానికి, డిపాజిట్లకు, మూలధనానికి మధ్య ఉన్న నిష్పత్తిని గణనీయంగా పెంచాలని నరసింహం కమిటీ సూచించినది. బ్యాంకుల వసూలుకాని బాకీలకు వెసులుబాటు కల్పించటానికి ఆస్తుల పునర్మూల్యాంకన నిధిని (asset reconstruction fund) కమిటీ సూచించినది.

**ప్రజా యాజమాన్యం ద్వారా నిజమైన స్వయం ప్రతిపత్తి -**

బ్యాంకులు సంపూర్ణంగా ప్రభుత్వ యాజమాన్యం క్రింద ఉంటే సంపూర్ణ స్వయం ప్రతిపత్తిని పొందలేవని, ఈ కారణాన బ్యాంకుల నిర్వహణా బోర్డును వాటాదారులకు జవాబుదారీగా ఉండాలని వారు తమ విధి విధానాలను రూపొందించటంలో కార్పొరేట్ భావనను కలిగి ఉండాలిని కమిటీ సలహా ఇచ్చినది. బ్యాంకుల నిర్వహణలో RBI మార్గదర్శిగా మాత్రమే ఉంటూ కొంతదూరాన్ని పాటించాలని కమిటీ అభిప్రాయపడింది;

చివరగా నరసింహం కమిటీ బ్యాంకింగ్ రంగానికి సంబంధించి ఉన్న RBI చట్టము, బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టము, SBI చట్టము, బ్యాంకుల జాతీయాకరణ చట్టాలను సమగ్రంగా విశ్లేషించి మారుతున్న కాలానికనుగుణంగా ఈ చట్టాలలో మార్పులు తేవాలని కమిటీ అభిప్రాయపడింది.

పై సూచనలతోపాటు బ్యాంకులలో కంప్యూటర్లను ప్రవేశపెట్టటాన్ని తీవ్రతరం చేయాలనీ, బ్యాంకుల నిర్వహణా బోర్డులను ఏర్పాటు చేయటంలో రాజకీయాలను చొప్పించరాదనీ, ఉద్యోగాల నియామక విధానాలు, శిక్షణ, జీతాలు, ఇతర ప్రోత్సాహక విధానాలను ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌లో విస్తృతస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించటానికి E.D.I (Electronic Data Interchange) సహాయపడును. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌లో ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిధుల బదలాయింపు, ఖాతాల నిర్వహణ జరుగును. ఈ విధమైన నిర్వహణకు అంతర్గతంగా లింకుచేయబడిన కంప్యూటర్లను ఉపయోగించుట వలన దీనిని కాగితాలు అవసరంలేని కార్యకలాపాల నిర్వహణగా భావించవచ్చును. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను Smart Card, Electronic Data interchange, Electronic House and Office Banking, Electronic Clearance A.T.Ms, Credit card, Debit card ల రూపాలలో చూడవచ్చును.

**ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ ప్రయోజనాలు :**

- ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను ఇంటర్‌నెట్ బ్యాంకింగ్‌గా పరిగణించవచ్చును. ఇందులో వేచి ఉండటముగానీ, బారులు తీరిన క్యూలుగానీ, పరిమితమైన ఆఫీసు గంటలుగానీ ఉండవు;
- ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను తక్కువ ఖర్చు బ్యాంకింగ్ (Low Cost Banking) గా పరగిణించవచ్చును;
- అన్ని రకాల సేవలను రోజులో 24 గంటలు, వారంలో ఏడు రోజులు నిర్వహించే అవకాశముండును.
- ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను Just-in-Time బ్యాంకింగ్‌గా వ్యవహరిస్తారు;
- వసతుల ఏర్పాటును అతి తక్కువ ఖర్చుతో ఏర్పాటు చేయవచ్చును;
- ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ తక్కువ ఖర్చు దృష్ట్యా కార్పొరేట్ రంగానికి ఎక్కువ ఉపయోగకారిగా ఉండును;
- E.B ద్వారా ఆస్తులు, అప్పులను సమర్ధవంతంగా నిర్వహించవచ్చును; దీనిని E.A.L.M (Electronic Asset Liability Management) అని అంటారు.

**ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ పరిమితులు మరియు పరిష్కారాలు :**

ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను అమలు చేసేటప్పుడు క్రింది విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి, సమీక్షించాలని కూడా కమిటీ సలహా ఇచ్చింది.

## 4.3. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ :

వాణిజ్య కార్యకలాపాలలో బ్యాంకింగ్‌కు ఒక ప్రధానమైన పాత్ర ఉన్నది. వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిర్వహించబడుతున్న ఆధునిక కాలములో బ్యాంకింగ్ కార్యకలాపాలు సాధారణ పద్ధతులలో నిర్వహించబడే అవకాశము లేదు. ఈ విధంగా ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌కు మాతృక, ప్రోద్బలము ఎలక్ట్రానిక్ కామర్స్‌గా చెప్పుకోవచ్చును. వస్తుసేవలకు సంబంధించిన కార్యకలాపాల నిర్వహణ ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిర్వహించబడితే దానిని ఎలక్ట్రానిక్ కామర్స్‌గాను అలాకాక ద్రవ్యవ్యవహారాలు ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిర్వహించబడితే దానిని ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌గా పరిగణించవచ్చును. 21 వ శతాబ్దంలో సమాచార కమ్యూనికేషన్ రంగాలలో వచ్చిన సాంకేతిక మార్పులపరంగా బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించటాన్ని ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌గా పరిగణించవచ్చును. బ్యాంకు కార్యకలాపాలను ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిర్వహించే విధానాన్ని 1971 లోనే U.K. లో ప్రవేశపెట్టటము జరిగినది. భారతదేశములో ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను మొట్టమొదటగా ప్రవేశపెట్టిన ఘనత భారతీయ పారిశ్రామిక పరపతి మరియు పెట్టుబడుల కార్పొరేషన్ (Industrial Credit and Investment Corporation of India) కు చెందును. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌లో శక్తివంతమైన సమాచార పంపిణీ, కార్యక్రమాల అమలు, విస్తృత ప్రత్యామ్నాయాలు, శక్తివంతమైన వేగము, సౌకర్యము, ఆర్థిక వెసులుబాటు ఉండును.

ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌లో క్రింది భాగాలుండును.
ఖాతాదారుడు మరియు బ్యాంకుపరంగా ఎలక్ట్రానిక్ బ్యాంకు;
బ్యాంకుకు, బ్యాంకుకు మధ్య ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్;
ఎలక్ట్రానిక్ కేంద్రీయ బ్యాంకింగ్,
బ్యాంకుకు, దాని బ్రాంచీలకు మధ్య ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్;
ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ విధానాన్ని క్రింది చిత్రం ద్వారా సమీక్షించవచ్చును.




ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ ఒకవిధంగా తెర ఆధారిత (screen based) నిర్వహణ. దీనివలన మూడవపార్టీ జోక్యానికి అవకాశముండి, ఈ సౌకర్యాన్ని మోసపూరిత ఉద్దేశ్యంతో ఉపయోగించుకునే అవకాశముండును. ఈ కారణాన పటిష్టమైన పర్యవేక్షక చర్యలు తీసికోవలసి ఉన్నది; ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌లో అనేకరకాలైన రిస్కులకు అవకాశమున్నది. ఇందులో ముఖ్యమైనవి- Counter Play Risk, Settlement Risk మరియు Speculation Risk లు ప్రధానమైనవి.

ఎలక్ట్రానిక్ బ్యాంకు కాగితాలు లేని కార్యకలాపాల నిర్వహణ అగుటవలన అనేక రకాలైన సెక్యూరిటీ రిస్కులకవకాశమున్నది.

ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌ను అమలు చేయటానికి వివిధ బ్యాంకింగ్ చట్టాలలో అవసరమైన సవరణలు చేయవలసిన ఆవశ్యకత కూడా ఉన్నది.

## 4.4. ఆటోమేటిక్ టెల్లర్ మేషీన్ (Automatic Teller Machine ATM) :-

బ్యాంకులో ఖాతా కలిగిన వ్యక్తికి తన ఖాతాలో ఉన్న మొత్తాన్ని నిర్దేశించిన ప్రాంతాలలో నెలకొల్పబడిన ప్రత్యేక యంత్రాలద్వారా నగదును తీసికొనటానికి సహాయపడే కార్డులను ATM కార్డులని అంటారు. ATM కార్డుల సహాయంతో నగదును తీసికొనటంతోపాటు ఖాతాలో నిల్వ ఉన్న మొత్తాన్ని తెలుసుకునే సౌకర్యము, ఖాతాలో నగదును డిపాజిట్ చేసే సౌకర్యాన్ని కల్పించటము జరుగుతుంది. ఈ ATM యంత్రాలద్వారా సంక్షిప్త ఖాతా నివేదికనుకూడా పొందవచ్చు. ATM కార్డులను ప్రత్యేకించబడిన ప్లాస్టిక్‌తో తయారుచేస్తారు. ఇందులో ఖాతాదారుని పేరుతోపాటు ATM యంత్రం గుర్తించటానికి వీలుండే విధంగా ఖాతాదారుని సంతకం కూడా ఉండును. కార్డుపై ఉన్న సంతకము ఆపాటికే Scan చేయబడి ATM లో నిక్షిప్తము చేయబడిన సంతకము సరిపడగానే ATM యంత్రము కార్యకలాపాల నిర్వహణకు అనుమతిస్తుంది. అదనపు భద్రత కొరకు ప్రతి ఖాతాదారునికి ప్రత్యేకించబడిన ఒక కోడ్ నెంబరును కేటాయిస్తారు. ATM ద్వారా 24 గంటలు కార్యకలాపాలను నిర్వహించే అవకాశమున్నప్పటికీ నిర్ణీత మొత్తము మేరకు మాత్రమే ఒక రోజులో నగదు తీసికొనటానికి అనుమతిస్తారు. ATM వ్యవస్థ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్‌లో ఒక భాగముకాగా, చాలా బ్యాంకులు ప్రతి ఖాతాదారుకు ఈ తరహాకార్డులను కేటాయిస్తున్నారు. ఈ సౌకర్యము వలన బ్యాంకులలో రద్దీ తగ్గటమే కాక బ్యాంకునుండి నగదు తీసికొనటానికి గంటల తరబడి క్యూలలో నిలుచునే ఇబ్బంది ఖాతాదారులకు తప్పింది. ఇతర బ్యాంకులతో ముందుగా ఏర్పాటు చేసుకొన్న ఒప్పందాల కారణంగా ఒక బ్యాంకు ATM కార్డుతో మిగిలిన బ్యాంకుల ATM ల ద్వారా నగదును పొందే అవకాశము ఏర్పడుచున్నవి. అయితే ఇలాంటి వ్యవహారాలకు స్వల్ప మొత్తములో ఛార్జీలను వసూలు చేయటము జరుగుతుంది. ATM విధానము వలన అన్నివేళలా నగదును తీసికొనివెళ్ళవలసిన ఇబ్బంది

లేదు. ఈ ATM కార్డులు, Credit Card Debit కార్డుల కారణంగా ప్లాస్టిక్ మనీ అనే భావన వాడుకలోనికి వచ్చినది. నేడు ATM కార్డుల విధానాన్ని అమలుచేయని బ్యాంకంటూ ఏదీలేదన్న సత్యము వీటి ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

## 4.5. క్రెడిట్ కార్డులు (Credit Cards) :-

వాణిజ్య బ్యాంకులందించే అనేకరకాల ఆర్థికసేవలలో నూతనత్వము కల్గినదీ, బహుళ ప్రయోజనకారి అయినదీ క్రెడిట్ కార్డుల విధానము. మొట్టమొదటిసారిగా ఈ క్రెడిట్ కార్డుల విధానాన్ని మెక్నమారా అనే అమెరికన్ వ్యాపారవేత్త ప్రవేశపెట్టినాడు. దీని సమగ్రరూపమే 1950 నుండి ఆచరణలోకి వచ్చిన (Dinars Card) విధానము. బ్యాంకింగ్ రంగంలో బ్రిటన్‌కి చెందిన Barclays బ్యాంకు 1966 లో మొట్టమొదటిసారిగా Credit Card లను ప్రవేశపెట్టినది. వాస్తవానికి పాశ్చాత్యదేశాలలో ఈ విధానము పాతదైనప్పటికీ, భారతదేశములో ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నది. రాబోయే కాలములో ఈ విధానము నగదు అవసరములేని సమాజాన్ని రూపొందించును.

క్రెడిట్ కార్డు అనగా కార్డు కలిగి ఉన్న వ్యక్తికి అరువుకు (నగదు లేకుండా) సరుకులను కొనుగోలు చేసే అవకాశము, ప్రయాణముచేసే అవకాశము లేక ఒక హోటల్‌లో కొంతకాలము నివాసముండే సదుపాయము కలుగజేసేది అని అర్థము. దీనివలన చెల్లింపులను కొంతకాలముపాటు వాయిదా వేయవచ్చును. నగదును తీసుకెళ్ళటంలోని ఇబ్బందులనుండి రక్షించును. భద్రత, సౌకర్యము, గౌరవము మరియు అరువు సదుపాయానికి క్రెడిట్ కార్డును ఒక Passport గా భావించవచ్చును.

### క్రెడిట్ కార్డు రకాలు :

క్రెడిట్ కార్డులుపయోగపడే పద్ధతులనుబట్టి క్రెడిట్ కార్డులను మూడు రకాలుగా విభజించవచ్చును. ఇందులో మొదటిది మామూలు క్రెడిట్ కార్డు - అరువు సౌకర్యమనే పదం సహాయంతో ఉద్భవించిన క్రెడిట్ కార్డు సహాయంతో నిర్ణీత దుకాణాలలో నిర్ణీత మొత్తం వరకు అరువుకు సరుకును కొనుగోలు చేయవచ్చును. ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చును. అవసరమైనపుడు నగదు సదుపాయాన్ని కూడా పొందవచ్చును. ఇలాంటి సదుపాయాన్ని నిర్ణీత కాలానికి మించి ఉపయోగించుకున్నపుడు స్వల్పమొత్తములో వడ్డీని చెల్లించవలసియుండును. ఈ సదుపాయాన్ని ఒక పద్ధతిలో ఉపయోగించుకోవటం ద్వారా వినియోగదారులు బహుళ ప్రయోజనాన్ని పొందగలరు. రెండవ రకానికి చెందిన కార్డులను ఛార్జి కార్డులని అంటారు. ఈ తరహా కార్డుల సదుపాయం సభ్య సంస్థలలో చేసే కొనుగోళ్ళకు మాత్రమే పరిమితమై ఉండును. ఇందులో కొనుగోలుచేసిన ప్రతిసారీ మొత్తాన్ని చెల్లించే బదులుగా ఛార్జి కార్డును ఉపయోగిస్తారు. ఈ విధంగా సంచితమైన మొత్తాన్ని ఏకమొత్తంగా చెల్లించటము జరుగును. ఇందులో పరపతి పరిధులుకానీ, ఛార్జీలు లేక వడ్డీలను వసూలు చేయటం ఉండదు. డైనర్స్ (Dinar's Club) క్లబ్ కార్డును ఈ కోవకు చెందిన కార్డుగా భావించవచ్చును. ఇక మూడవ రకానికి చెందిన క్రెడిట్ కార్డులను స్టోర్ కార్డులని అంటారు. ఎవరైతే ఈ కార్డులను జారీచేస్తారో వారి దుకాణాలలో మాత్రమే ఈ కార్డుల ద్వారా పరపతి సౌకర్యాన్ని పొందవచ్చును. ఇలాంటి పరపతిపై వడ్డీలను కూడా వసూలుచేస్తారు. భారతదేశములో ఇలాంటి కార్డులను పెద్ద పెద్ద స్టార్ హోటళ్ళు, గొలుసు విక్రయశాలలు జారీచేయును.

### ఆధునిక తరహాకు చెందిన క్రెడిట్ కార్డులు :

పైన వివరించిన క్రెడిట్ కార్డులే కాకుండా ఆధునిక కాలములో అనేకరకాలైన క్రొత్త క్రొత్త క్రెడిట్ కార్డుల సదుపాయము ఆచరణలోనికి వచ్చినది. ఇందులో ముఖ్యమైనవి కార్పొరేట్ క్రెడిట్ కార్డులు. వ్యాపారపరమైన కార్డులు, స్మార్ట్ కార్డులు. కార్పొరేట్ కార్డులను ప్రయివేటు మరియు పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలకు, పబ్లిక్ రంగ సంస్థలకు జారీచేయటం జరుగును. ఇలా జారీచేసిన కార్డులను ప్రధాన కార్డులంటారు. ఈ ప్రధాన కార్డులు కేవలము గుర్తింపుకొరకు మాత్రమే ఉపయోగపడును. ఈ ప్రధాన కార్డుకు అనుబంధంగా జారీచేసే కార్డులను Add-On-Cards అని అంటారు. ఆచరణలో ఈ Add-On-Cards ను కంపెనీకి సంబంధించిన వ్యక్తులకు జారీచేయటం జరుగును. ఈ Add-On-Cards లను ఉపయోగిస్తూ చేసిన కొనుగోళ్ళకు సంబంధించిన మొత్తాలన్నీ ప్రధాన కార్డుపేరుతో ఖర్చు వ్రాయటం జరుగును. ఈ విధంగా కార్పొరేట్ సంస్థలు తమ సిబ్బందికీ, ఇతర వ్యక్తులకు ఈ తరహా క్రెడిట్ కార్డు సదుపాయాన్ని కలుగజేయును. రెండవరకానికి చెందిన కార్డులను వ్యాపార కార్డులు (Business Cards) గా వ్యవహరిస్తారు. ఈ తరహా కార్డులను

ఒకేరకానికి చెందిన వివిధ సంస్థలు ఉపయోగిస్తాయి. ఈ తరహా కార్డుల సహాయంతో కొన్ని ప్రత్యేక సదుపాయాలను పొంది తమ వ్యాపారాలను వృద్ధి చేసుకొంటారు. సొంత వ్యాపార సంస్థలు, భాగస్వామ్య సంస్థలు, ఛార్టర్డ్ ఎక్కౌంటెంట్లు మొదలైనవారు ఈ తరహా కార్డులను ఉపయోగిస్తారు. ఇక మూడవ రకానికి చెందిన ఆధునిక కార్డులను Smart Card లని అంటారు. వీటిని క్రొత్తతరం కార్డులుగా పరిగణించవచ్చును. ఇందులో అంతర్గతంగా నిక్షిప్తంచేయబడిన మైక్రోచిప్‌లో కొంత మొత్తాన్ని ముద్రించటము జరుగును. కార్డునుపయోగించిన ప్రతిసారీ ఈ నిల్వ ఆటోమేటిక్‌గా తగ్గిపోవును. ఇందులోని నిల్వ పూర్తిగా అయిపోయిన తరువాత తిరిగి నిల్వను ఛార్జి చేయవలెను. ఈ తరహా కార్డుల ప్రధాన సౌలభ్యము రక్షణ. ఇందులో మోసాలకు, పొరపాట్లకు అవకాశముండదు. Smart Card లను గుర్తింపు కార్డులుగా కూడా ఉపయోగించవచ్చును. Smart Card లను ఎలక్ట్రానిక్ పర్సులుగా వ్యవహరిస్తారు. భారతదేశములో ఈ తరహా కార్డులను మంబైనగరంలో దీనా బ్యాంకు జారీచేసినది.

### క్రెడిట్ కార్డు ప్రయోజనాలు :

క్రెడిట్ కార్డువలన కార్డులు కల్గి ఉన్నవ్యక్తికి నగదు, సరుకుల కొనుగోలుకు సంబంధించి పరపతి సౌకర్యము కలిగించును. కార్డులను జారీచేసిన బ్యాంకులకు ద్రవ్యవ్యవహారాలతోపాటు వ్యాపారవస్తువుల కొనుగోళ్ళు, అమ్మకాలపై కూడా కమీషన్ లభించును. మరియు పరపతిపై వడ్డీ లభించును. అదేవిధంగా క్రెడిట్ కార్డులనాదరించే దుకాణాల సముదాయానికి సంబంధించిన దుకాణదారులకు వ్యాపార పరిమాణం పెరగటంతోపాటు రాని బాకీల బెడద కూడా ఉండదు. ఈ విధంగా క్రెడిట్ కార్డులు బహుముఖ ప్రయోజనాలు కలుగజేయును.

## 4.6. డెబిట్ కార్డులు (Debit Cards) :

అంతర్జాతీయంగా గత దశాబ్దకాలంలో క్రెడిట్ కార్డుల విధానము కాగితపు ద్రవ్యానికి ఖచ్చితమైన ప్రత్యామ్నాయంగా ఎదిగినది. USA లాంటి అభివృద్ధిచెందిన దేశాలు ఒకదశ ముందుకు వెళ్ళి డెబిట్ కార్డుల విధానాన్ని ప్రాచుర్యములోనికి తెచ్చినవి. ఒక్క USA లోనే **1997** మార్చి నాటికి **6.7** కోట్ల డెబిట్ కార్డులు **62.9** బిలియన్ డాలర్ల విలువ కలిగిన వ్యవహారాలను నిర్వహించినవి. క్రెడిట్ కార్డుదారుల మాదిరిగానే డెబిట్ కార్డులు కలిగి ఉన్నవారు కూడా నిర్ణీత దుకాణాలలో సరుకులను కొనుగోలు చేసి కొనుగోలు గుర్తుగా వారి దుకాణాల అమ్మకపు చీటీలపై సంతకం చేయాలి. ఈ మొత్తానికి ఆటోమేటిక్‌గా డెబిట్ కార్డుదారుల బ్యాంకు ఖాతాకు డెబిట్ చేయటం జరుగును. ఇలా డెబిట్ చేయబడిన మొత్తాలకు సంబంధించిన నెలవారీ స్టేట్‌మెంట్‌లను 2 కార్డుల దారులకు పంపించటం జరుగును. వారు వీరి వీలునుబట్టి మొత్తాలను చెల్లిస్తుంటారు. ఈ సదుపాయము ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని పోలి ఉండును. ఒకరకంగా దీనిని దుకాణాల సముదాయాలకు విస్తరించబడిన ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యంగా భావించవచ్చును. వ్యవహారము జరిగిన వెంటనే వ్యవహార మొత్తానికి, వ్యాపారస్తునికి జమకూడా ఇవ్వటము జరుగును. బ్యాంకులో ప్రత్యేకముగా ఖాతా ఉండటము మినహా క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు విధానాలలో పెద్ద తేడా లేదు.

## 4.7. పదకోశము :

A.T.Ms ` Automatic Teller Machines

Credit Cards - నగదు అరువు కొనుగోలు సౌలభ్యాన్ని సమకూర్చే కార్డులు

Debit Cards - ఖాతాదారు చేసిన కొనుగోలు మొత్తానికి ఖాతాదారు ఖాతాను డెబిట్ చేసే విధానము

S.L.R - Statutory Liquidity Ratio

C.R.R. - Cash Reserve Ratio

I.R.D.P. - Integrated Rural Development Programme

B.I.F.R. - Board for Industrial and Finance Reconstruction

R.B.I - Reserve Bank of India

P.L.R. - Prime Lending Rate

మూలధన సంవృద్ధి రేటు - (Capital Adequacy Rate)

W.T.O. - World Trade Organisation

E.A.L.M. - Electronic Asset Liability Management

## 4.8. స్వయం మదింపు ప్రశ్నలు :

**5 మార్కుల ప్రశ్నలు :**

1. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్
2. A.T.Ms
3. Credit Cards
4. Debit Cards
5. నిర్దేశిత పెట్టుబడులు
6. నిర్దేశిత పరపతి పథకాలు

**10 మార్కుల ప్రశ్నలు :**

1. నరసంహం కమిటీ ఏర్పాటు ఆవశక్యత
2. బ్యాంకింగ్ రంగ సంస్కరణలను క్లుప్తంగా వ్రాయుము

**20 మార్కుల ప్రశ్నలు :**

1. బ్యాంకింగ్‌రంగ సంస్కరణలకు సంబంధించి నరసింహం కమిటీ సూచనలు మరియు సూచనల అమలు గురించి వ్రాయుము.
2. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ అనగానేమో తెలియజేసి అందులోని కొన్ని అంతర్భాగాలను వివరించండి

## 4.9. సిఫారసు చేసిన పుస్తకాలు

1. Indian Economy - Ruddar Datt & KPM Sundaram
2. బ్యాంకింగ్ సిద్ధాంతం - ద్రవ్యవ్యవస్థలు
   (Banking Theory and Financial Systems)
   - K. Anjaneyulu,
   - K. Lalitha,
   - M. Prabhakar Reddy
3. Banking and Financial Systems`«
   - Mithani & Gordon

**- Dr. C.V. BRAHMA CHARY**

**పాఠం 5**

# దేశీయ బ్యాంకర్లు


5.0. ఉద్దేశాలు

5.1. విషయ పరిచయము

పాఠ్యాంశ నిర్మాణము

5.2. దేశీయ బ్యాంకర్ల ఆవిర్భావము

5.3. దేశీయ బ్యాంకర్ల స్వభావము

5.4. దేశీయ బ్యాంకర్ల ప్రాముఖ్యత, లోపాలు

5.5. బ్యాంకింగ్ కమీషన్ సూచనలు

5.6. దేశీయ బ్యాంకర్లు మరియు RBI

5.7. దేశీయ బ్యాంకర్ల భవిష్యత్తు

5.8. పదకోశము

5.9. స్వయం మదింపు ప్రశ్నలు

5.10. సిఫారసు చేసిన పుస్తకాలు


## 5.0. ఉద్దేశాలు :

- ఈ పాఠం పూర్తయ్యేసరికి విద్యార్థులకు క్రింది విషయాలు అవగతమగును :
- దేశీయ బ్యాంకర్లు అంటే ఎవరు? వారి వర్గీకరణ, వారి కార్యకలాపాల నిర్వహణ మరియు వారి ప్రాముఖ్యత, లోపాలు;
- దేశీయ బ్యాంకర్ల వ్యవస్థను మెరుగుపరచటానికి బ్యాంకింగ్ కమీషన్ సూచనలు, దేశీయబ్యాంకర్ల విధానానికి సంబంధించి RBI నియంత్రణ; దేశీయ బ్యాంకర్ల భవిష్యత్తు;

## 5.1. విషయ పరిచయము :

ప్రస్తుతము మనము చూస్తున్న వాణిజ్య బ్యాంకింగ్ విధానము పాశ్చాత్యదేశాల భావన. ఆధునిక బ్యాంకులు భారతదేశానికి క్రొత్తగానీ, బ్యాంకింగ్ కార్యకలాపాలు, బ్యాంకింగ్ విధానము క్రొత్తకాదు. బ్యాంకులు నేడు నిర్వహించబడుచున్న పద్ధతిలో కాకుండా ఆనాటి పరిస్థితులకనుగుణంగా నిర్వహించబడేవి. ఇలా నిర్వహించబడిన బ్యాంకులను నేడు దేశీయబ్యాంకర్లుగా వ్యవహరించటము జరుగుచున్నది. ఈ పాఠములో దేశీయ బ్యాంకర్లకు సంబంధించిన వివిధ అంశాలను గురించి విపులముగా చర్చించటము జరుగును.

## పాఠ్యాంశ నిర్మాణము :

## 5.2. దేశీయ బ్యాంకర్ల ఆవిర్భావము :

దేశీయ బ్యాంకర్ల విధానము భారతదేశములో నాగరికతతో పాటు ఆవిర్భవించినది. వర్తక కార్యకలాపాలు, ఎగుమతులు, దిగుమతులు, పరపతి సౌకర్యాలు లాంటి కార్యకలాపాలు చాలాకాలం నుండి భారతదేశంలో నిర్వహించబడుచున్నవి. పశ్చిమాశియా దేశాలకు, సుగంధద్రవ్యాలను, వస్త్రాలను ఎగుమతిచేసి, ఖర్జూరాలను, ఖాద్య తైలాలను అచటినుండి దిగుమతి చేసుకొన్నట్లుగా చరిత్రకారులు

చెప్పటము మనందరకూ తెలిసిన విషయమే. చైనీయులు, పోర్చుగీసువారు, డచ్చి దేశస్థులు, ఇంగ్లీషువారు మనదేశానికి వ్యాపారనిర్వహణ కోసం రావటము రెండు శతాబ్దాల కాలం నాటి చరిత్ర. సముద్రగుప్తుడు నావికా వ్యాపారాన్ని చేయటము మనందరకూ తెలిసిన విషయమే. ఈ అన్ని కాలాలలోను దేశీయ బ్యాంకర్లు తమ పాత్రను చక్కగా పోషించినారు. దీనినిబట్టి దేశీయ బ్యాంకర్లను అత్యంత పురాతన బ్యాంకింగ్ వ్యవస్థగా చెప్పవచ్చును. వీరు ఆయా ప్రాంతాలలో భిన్నమైన పేర్లతో పిలువబడేవారు. తమిళనాడు ప్రాంతంలో వీరిని చెట్టియార్‌లనీ, ఉత్తర భారతదేశంలో షావుకార్లు, మహాజనులు, ఖత్రీలు అనీ, గుజరాత్, మహారాష్ట్రలలో షరాబులు, మార్వాడీలనీ, బెంగాల్‌లో శేఠ్‌లు, బనియాలనీ, పిలిచేవారు. వీరందరినీ అప్పట్లో బ్యాంకింగ్ కులానికి చెందిన వారిగా గుర్తించినారు. ఆధునిక కాలములో బ్యాంకింగ్ వ్యవస్థ విస్తరించినప్పటికీ, వారి ప్రాధాన్యత, ప్రాముఖ్యత అంతగా తగ్గలేదు.

## 5.3. దేశీయ బ్యాంకర్లు స్వభావము :

సెంట్రల్ బ్యాంకింగ్ ఎంక్వయిరీ కమిటీ దేశీయ బ్యాంకర్లను ఈ విధంగా నిర్వచించినారు. "డిపాజిట్లను స్వీకరించటము, హుండీలతో కార్యకలాపాలు నిర్వహించటము, ఋణసౌకర్యాన్ని కల్పించటము లాంటి విధులను చేపట్టే వ్యక్తులు లేదా ప్రయివేటు సంస్థలను దేశీయ బ్యాంకర్లుగా నిర్వచించటము జరుగును."

వ్యవసాయ విత్తానికి సంబంధించిన ఉపకమిటీ 1945 లో సమర్పించిన తన నివేదికలో ఈ విధంగా పేర్కొన్నారు-

" దేశీయ బ్యాంకర్ల ప్రధాన లక్షణము హుండీలను డిస్కౌంట్ చేసుకోవటమే కానీ, డిపాజిట్లను స్వీకరించటముకాదు."

వారు నిర్వహించే విధులను బట్టి దేశీయ బ్యాంకర్లను మూడు రకాలుగా వర్గీకరించవచ్చును.

- బ్యాంకింగ్ కార్యకలాపాలను మాత్రమే నిర్వహించేవారు మొదటి రకానికి చెందుతారు. ముంబాయిలోని ముల్తానీ బ్యాంకర్లు, మద్రాసులోని చెట్టియార్లు ఈ కోవకు చెందుతారు;
- తమ బ్యాంకింగ్ కార్యకలాపాలను వర్తకము మరియు కమీషన్ వ్యాపారముతో కలిపి నిర్వహించేవారు రెండవ కోవకు చెందుతారు. గుజరాత్, రాజస్థాన్‌లలోని మార్వాడీలు, బెంగాల్‌కు చెందిన మహాజనులు ఈ కోవకు చెందుతారు;
- మూడవ రకానికి చెందినవారి ప్రధానవ్యాపకము వర్తకము మరియు కమీషన్ ఏజెన్సీ కాగా వీరు స్వల్పస్థాయిలో బ్యాంకింగ్ వ్యవహారాలను కూడా నిర్వహిస్తారు.

భారతదేశములోని దేశీయ బ్యాంకర్లలో ఎక్కువమంది రెండవ కోవకు చెందుతారు. 1972 లో బ్యాంకింగ్ కమీషన్‌వారు చేసిన అంచనాల ప్రకారము 1971 నాటికి సుమారు 2,500 మంది దేశీయ బ్యాంకర్లు ఉన్నారు. సభ్యత్వ రికార్డులను పరిశీలించినపుడు 400 ముల్తానీషరాఫ్, 350 గుజరాతీ షరాఫ్, 400 ఖత్రీ మరో 50 చెట్టియార్ సంస్థలున్నవి. వీరు దేశం మొత్తం మీద విస్తరించి ఉండటము వలన వీరుచేసే వ్యాపారము లోపాయికారీగా ఉండటము వలన వీరికి సంబంధించిన గణాంక వివరాలు అందుబాటులో లేవు. 1971 జనాభా అంచనాల ప్రకారము భారతదేశము మొత్తం మీద 33,741 మంది వడ్డీ వ్యాపారస్తులు మరియు దేశీయ బ్యాంకర్లు ఉన్నారు. ఇందులో 19,058 మంది పట్టణ ప్రాంతాలకు పరిమితమై ఉన్నారు. వీరి కార్యకలాపాలు వాణిజ్య కేంద్రాలలో ఎక్కువగా ఉండును. వివిధ రకాలైన దేశీయ బ్యాంకర్లలో ముల్తానీ బ్యాంకర్లు కీలకస్థానములో ఉండటమే కాక ఒక్కొక్క ముల్తానీ బ్యాంకర్ ఒకరోజులో కనీసం 300 మందితో కార్యకలాపాలను నిర్వహిస్తారు.

దేశీయ బ్యాంకర్లు క్రింది ప్రత్యేకతలతో ఉంటారు:

- వీరు ప్రజలనుండి డిపాజిట్లను స్వీకరిస్తూ, హుండీలకు సంబంధించిన కార్యకలాపాలను నిర్వహిస్తారు;
- దేశీయ బ్యాంకర్లు ప్రధానంగా తమ కార్యకలాపాలను తమస్వంత పెట్టుబడులతో నిర్వహిస్తారు. ప్రజలనుండి సేకరించిన డిపాజిట్లు తమ నిర్వహణా మూలధనములో అతి తక్కువ స్థాయిలో ఉండును;

- వీరు పరిమితమైన పనివేళలలో కాకుండా అన్నివేళలలో అందుబాటులో ఉంటారు. ఇంతేకాక కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేకించబడిన నియమ నిబంధనలుండవు;
- వీరిది ప్రధానంగా కుటుంబపరమైన వ్యవహార నిర్వహణ. వీరు సామాన్యంగా వర్తకులకు, చిన్నచిన్న పరిశ్రమలకు, కళాకారులకు అప్పులిస్తారేకానీ, వ్యవసాయదారులకు నేరుగా అప్పులివ్వరు;
- వీరికి అనుభవమేకానీ, ప్రత్యేకించబడిన బ్యాంకింగ్ చదువు ఉండదు;
- వీరు తమ ఖాతాలను వారి ప్రాంతీయ భాషలో నిర్వహిస్తారు. వీరు తమ వ్యాపారపు పరువు ప్రతిష్టలను ఎల్లప్పుడు నిలబెట్టుకోవటానికే ప్రయత్నిస్తారు. వీరు బాధ్యతాయుతంగా ఉండటమేకాక లాభ ధ్యేయంతో ఉంటారు. వీరు పొలాలు మరియు ఇండ్ల తాకట్టుపై కూడా ఋణాలను మంజూరు చేస్తారు. వీరు తరచు హుండీలను డిస్కౌంట్ చేసుకొంటారు;

అధికశాతం దేశీయ బ్యాంకర్లు తమ బ్యాంకింగ్ వ్యాపారాన్ని వర్తకము మరియు అంచనా వ్యాపారాలతో కలిపి నిర్వహిస్తారు.

దేశీయబ్యాంకర్లు తమ కార్యకలాపాలను ఆధునిక బ్యాంకులుగా కాక కుటుంబ పద్ధతిలో నిర్వహిస్తారు. సామాన్యంగా వీరు తమ సొంత నిధులతోను, స్వల్పస్థాయిలో ప్రజలనుండి సేకరించిన డిపాజిట్లతోను, కార్యకలాపాలను నిర్వహిస్తారు. అన్నిరకాల సెక్యూరిటీలపై ఋణాలను మంజూరు చేయటము వీరి ప్రత్యేకత. పొలాలు, స్థలాలు, గృహాలు, బంగారము, జ్యువెలరీ మరియు ప్రామిసరీ నోట్లపై అప్పులను మంజూరు చేస్తారు. వీరు వ్యక్తిగత హామీపై కూడా ఋణాలను మంజూరు చేస్తారు. షరాఫ్ కమిటీ అంచనాల ప్రకారం నిర్వహించబడే మొత్తం అంతర్గత వర్తకంలో 75 నుండి 90% వరకు దేశీయ బ్యాంకర్ల పరపతి సౌకర్యంపై ఆధారపడియున్నది.

## 5.4. దేశీయ బ్యాంకర్ల ప్రాముఖ్యత, లోపాలు :

భారతీయ ద్రవ్య వ్యవస్థలో ముఖ్యంగా అసంఘటితంగా ఉన్న ద్రవ్యమార్కెట్లో దేశీయ బ్యాంకర్లకు ఒక కీలకమైన పాత్ర ఉన్నది. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, సంతులిత ఆర్థికాభివృద్ధి దృష్ట్యా దేశీయబ్యాంకర్లు ఒక ప్రధాన భూమికను నిర్వహించవలసి యున్నది. ఆర్థికాభివృద్ధి ఏ స్థాయిలో ఉన్నా సంఘటిత బ్యాంకింగ్ వ్యవస్థ దేశములోని మొత్తం పరపతి అవసరములను తీర్చగలిగే స్థితిలో లేని కారణాన ఆ లోటును దేశీయబ్యాంకర్లు భర్తీచేయవలసి యున్నది. ఈ కారణాల వలన మారుతున్న కాలములో కూడా దేశీయ బ్యాంకర్ల ప్రాధాన్యత తగ్గిన ఆధారాలు లేవు. ఈ అంశాన్ని దేశ ఆర్థిక మార్గ నిర్దేశకులు గుర్తుంచుకొని తమ ఆర్థిక ప్రణాళికలను రూపొందించవలసి ఉన్నది. ఇంతేకాక దేశీయ బ్యాంకర్ల విధానాన్ని కూడా క్రమబద్ధీకరించవలసియున్నది. ఇందుకొరకు ముందుగా దేశీయ బ్యాంకర్ల వ్యవస్థలోని లోపాలు తెలుసుకొనవలెను.

### దేశీయ బ్యాంకర్ల విధానములోని లోపాలు :

దేశీయ బ్యాంకర్లు తమ బ్యాంకింగ్ కార్యకలాపాలతో కమీషన్ ఏజెన్సీని, అంచనా వ్యాపారాన్ని కలపటం వలన బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణలో స్పష్టత, పరిణత ఉండటం లేదు;

దేశీయ బ్యాంకర్లు అధికశాతము ఖాతాల నిర్వహణకు సాంప్రదాయ పద్ధతులను, దేశీయభాషను ఉపయోగిస్తారు. దీనివలన ఋణగ్రస్తులు అధిక వడ్డీని చెల్లించవలసియున్నది. ఉదాహరణకు అంతర్జాతీయంగా నెల అనగా 30 రోజులు కాగా దేశీయ బ్యాంకర్ల దృష్టిలో నెలకు చంద్రమాసం ప్రకారం ఉండే 28 రోజులు మాత్రమే. ఇంతేకాక వారి వ్యాపారం కొరకు ప్రత్యేకించబడిన భాష ప్రజలందరకీ తెలిసే అవకాశము లేదు. వీరు డిపాజిట్ బ్యాంకింగ్‌కు చాలినంత ప్రాధాన్యత ఇవ్వరు. ఈ విధంగా గ్రామీణ పొదుపులను సమీకరించుట జరగదు. వీరు అసంఘటిత వ్యవస్థలో ఉండటం వలన వీరి కార్యకలాపాలకు ఒక పద్ధతి ఉండదు. వీరు స్వల్పకాల ఋణాలు మరియు దీర్ఘకాల ఋణాల మధ్య భేదాన్ని చూపరు.

వీరు ఛార్జి చేసే వడ్డీరేట్లు మామూలు బ్యాంకురేట్లతో పోల్చితే అధికంగా ఉండును. వీరు వ్యాపారపరమైన సంబంధాలకన్నా వ్యాపారేతర సంబంధాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. వీరి కార్యకలాపాలలో అధికశాతము హుండీలతో కాకుండా నగదుతో నిర్వహించబడును.

దేశీయ బ్యాంకర్లలో ఎక్కువమంది విశాల హృదయంతో కాక సంకుచిత స్వభావంతో తమ కార్యకలాపాలను నిర్వహిస్తారు.

దేశీయ బ్యాంకర్ల విధానములో పైన వివరించిన లోపాలున్నప్పటికీ వీరి ప్రాధాన్యతను మాత్రము తక్కువగా అంచనా వేయలేము.

## 5.5. బ్యాంకింగ్ కమీషన్ సూచనలు :

1972 వ సంవత్సరములో ఏర్పరచిన బ్యాంకింగ్ కమీషన్ భారతదేశ ద్రవ్య మార్కెట్లో దేశీయ బ్యాంకర్ల ప్రాధాన్యతను, స్థానాన్ని గుర్తించి వీరి కార్యకలాపాలను క్రమబద్ధీకరించటానికి కొన్ని ప్రధాన సూచనలను చేసినది.

దేశీయ బ్యాంకర్లతో నేరుగా రిజర్వుబ్యాంకుకు ప్రత్యక్ష సంబంధం ఉండే అవకాశము లేదు. ఈ కారణాన దేశీయ బ్యాంకర్ల కార్యకలాపాలను వాణిజ్య బ్యాంకుల ద్వారా రిజర్వుబ్యాంకు నియంత్రణ చేయాలనీ, కమీషన్ అభిప్రాయపడింది. ఇందుకొరకు రిజర్వు బ్యాంకు కొన్ని మార్గదర్శక సూత్రాలను కూడా రూపొందించవలసి యున్నదని సూచించటము జరిగినది. దేశీయ బ్యాంకర్లకు వాణిజ్య బ్యాంకులు రీ డిస్కౌంటింగ్ సౌకర్యాలను కల్పించాలని కూడా సూచించినది.

- ప్రతి దేశీయ బ్యాంకరు తమ బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణ కొరకు కనీసం ఒక లక్షరూపాయల సొంతనిధిని చూపించాలి:
- దేశీయ బ్యాంకర్లు తమ ఇతర కార్యకలాపాలను మానివేసి బ్యాంకింగ్ కార్యకలాపాలను మాత్రమే చెయ్యాలి.
- క్రమబద్ధమైన అక్కౌంటింగ్ విధానములో లెక్కలను నిర్వహించి నిర్ణీత గడువు తేదీలలో వాటిని ఆడిట్ చేయించాలి.

వీరు తమ కార్యకలాపాలకు సంబంధించిన సంక్షిప్త వార్షిక నివేదికను వాణిజ్య బ్యాంకుల ద్వారా రిజర్వు బ్యాంకుకు సమర్పించాలి. ప్రతి దేశీయ బ్యాంకరు కేవలము ఒక బ్యాంకుతోనే తమ కార్యకలాపాలను నిర్వహిస్తూ ఒక బ్యాంకునుండి మాత్రమే ఋణాలను పొందాలి. వీరు అసంఘటిత వ్యవస్థనుండి బయటకు వచ్చి సంఘటితంగా, ఒక సమాఖ్యగా రూపొందాలి. ఋణాలను మంజూరు చేసేటప్పుడు ఋణ ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. వ్యక్తిగత అవసరాలకు, దుబారా ఖర్చులకు ఋణాలను మంజూరు చేయకూడదు.

ఒక క్రమ పద్ధతిలో మాత్రమే వడ్డీరేట్లు అమలు చేయాలి. ఈ వడ్డీరేట్లు సాధ్యమైనంతవరకు బ్యాంకు రేట్లకు దగ్గరగా ఉండాలి.

## 5.6. దేశీయ బ్యాంకర్లు మరియు RBI :

భారతీయ ఆర్థిక వ్యవస్థలో ప్రముఖపాత్ర పోషిస్తున్న దేశీయ బ్యాంకర్లు మొదటనుంచి సంఘటిత వ్యవస్థకు బయటే ఉన్నారు. 1931 లోనే కేంద్ర బ్యాంకింగ్ ఎంక్వయిరీ కమిటీ భారతీయ ద్రవ్యమార్కెట్‌లోని వివిధ రంగాలను RBI తో అనుసంధానము చేయవలెనని సూచించినది. ఇందుకొరకు RBI సముచితమైన చర్యలను చేపట్టవలెనని సూచించినది. ఇదే సందర్భములో దేశీయ బ్యాంకర్లు ఉపయోగిస్తున్న హుండీ విధానాన్ని ఆధునిక బిల్ మార్కెట్‌తో విలీనం చేయాలని కూడా సూచించినది. ఇదే కాలములో దేశీయ బ్యాంకర్ల విధానములో క్రింది మార్పులను చేపట్టాలని RBI సూచించినది.

పై విధంగా వ్యవహరించినప్పుడు ఇతర వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే దేశీయ బ్యాంకర్ల హుండీలను కూడా RBI రీడిస్కౌంట్ చేసుకుంటుందని RBI సూచించినది. అయితే దేశీయ బ్యాంకర్లు అనువంశికంగా వస్తున్న తమ కార్యకలాపాలలో మార్పులు తేవటానికి ఇష్టపడలేదు. RBI సూచించిన మార్పులను చేపట్టటానికి హుండీలను రీడిస్కౌంట్ చేసుకొనటమనే ఒక్క అంశమే నష్ట పరిహారంగా సరిపోదనీ, వీరు వాదించినారు. ఈ కారణాన RBI ప్రతిపాదనలు విఫలమైనట్లుగా భావించటమైనది. RBI ఇంతకుమించిన సదుపాయాలను దేశీయ బ్యాంకర్లకు కలుగజేసే ఉద్దేశ్యముతో లేకపోవటంవలన దేశీయ బ్యాంకర్లు అసంఘటిత వ్యవస్థలోనే ఇంకా కొనసాగుచున్నారు.

## 5.7. దేశీయ బ్యాంకర్ల భవిష్యత్తు :

దేశములో ఉధృతస్థాయిలో విస్తరించిన బ్రాంచి బ్యాంకింగ్ దేశీయ బ్యాంకర్ల ప్రాధాన్యతను తగ్గిస్తుందని అందరూ ఊహించినారు కానీ గ్రామప్రాంతాలలోను, చిన్నచిన్న పట్టణాలలోను దేశీయ బ్యాంకర్లు ఇంకా ప్రముఖ పాత్ర పోషిస్తున్న విషయము అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించినది. ఇందుకు ప్రధానకారణము దేశీయ బ్యాంకర్లు తీసికొనే రిస్కును ఆధునిక కాలములోని బ్యాంకర్లు తీసుకోలేరు. ఆధునిక కాలములో బ్యాంకుల నుండి పరపతి సౌకర్యాన్ని పొందటానికి ఇంకా కొన్ని తీవ్రమైన నిబంధనలను తృప్తిపరచవలసి ఉన్నది. ఇందులో ముఖ్యమైనవి ఋణాల కొరకు కోరే సెక్యూరిటీలు మరియు మార్జిన్లు అధిక సంఖ్యలోని చిన్నతరహా సంస్థలవద్ద హామీ ఇవ్వటానికి చాలినన్ని స్థిరాస్థులు లేని కారణాన వీరు దేశీయ బ్యాంకర్లవైపు మొగ్గుచూపుచున్నారు.

దేశీయ బ్యాంకర్ల వ్యవస్థను రూపుమాపలేని అశక్తత కారణంగా దేశీయ బ్యాంకర్లు తమ వ్యాపారాలలో వైవిధ్యాన్ని చూపాలనీ, ఒక క్రమపద్ధతిని ఏర్పాటుచేయాలనీ, బ్యాంకింగ్ కమీషన్ సూచించినది. దీని ఫలితంగా దేశీయ బ్యాంకర్లందరూ కాలక్రమేణా బ్యాంకేతర ద్రవ్య కంపెనీలుగా (Non Banking Financial Companies) గా రూపొందాలనీ భావించటమైనది. వాస్తవానికి దేశీయ బ్యాంకర్లందరూ మెల్లగా ఇలా మారటాన్ని కూడా మనము చూస్తున్నాము.

## 5.8. పదకోశము :

దేశీయ బ్యాంకర్లు - వంశపారంపర్యంగా బ్యాంకింగ్ వ్యాపారం చేసేవారు
బ్యాంకింగ్ కమీషన్ 1972 - దేశీయ బ్యాంకర్ల విధానాన్ని మెరుగుపరచటానికి అవసరమైన సూచనల కొరకు నియమించబడిన కమీషన్
హుండీలు - ఆధునిక కాలములోని వర్తకపు బిల్లుల్లాంటివి.

## 5.9. స్వయం మదింపు ప్రశ్నలు

**5 మార్కుల ప్రశ్నలు :**

1. దేశీయ బ్యాంకర్ల స్వభావము
2. దేశీయ బ్యాంకర్ల ప్రాముఖ్యత
3. దేశీయ బ్యాంకర్ల భవిష్యత్తు

**10 మార్కుల ప్రశ్నలు :**

1. బ్యాంకింగ్ కమీషన్ సూచనలు
2. దేశీయ బ్యాంకర్లు మరియు RBI

**20 మార్కుల ప్రశ్నలు :**

1. భారతీయ ద్రవ్యమార్కెట్లో దేశీయ బ్యాంకర్ల ప్రాముఖ్యతను వివరించి, అందులోని లోపాలను, బ్యాంకింగ్ కమీషన్ సూచనల గురించి వ్రాయండి.
2. దేశీయ బ్యాంకర్లు అనగానేమో తెలియజేసి, దేశీయబ్యాంకర్లు, RBI కి మధ్య ఉన్న సంబంధాన్ని, దేశీయబ్యాంకర్ల భవిష్యత్తును వివరించుము?

## 5.10. సిఫారసు చేసిన పుస్తకాలు

1. Indian Economy - Ruddar Datt & KPM Sundaram
2. Banking and Financial Services - S.N. Maheswari & R.R. Paul
3. తెలుగు అకాడమీ

**Dr. C.V. BRAHMA CHARY**

**పాఠం - 6**

# సహకార బ్యాంకులు

6.0 ఉద్దేశాలు

6.1 విషయ పరిచయము

పాఠ్యాంశ నిర్మాణము

6.2 సహకార బ్యాంకులు

6.2.0 చరిత్ర - ఆవిర్భావము

6.2.1 సహకార బ్యాంకుల నిర్వచనము

6.2.2 సహకార బ్యాంకుల నిర్మాణము

6.2.3 సహకార సంస్థలు

6.2.3.1 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు

6.2.3.2 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు

6.2.3.3 రాష్ట్ర సహకార బ్యాంకులు

6.2.4 ఆంధ్రప్రదేశ్‌లో సహకార పరపతి వ్యవస్థ - సింగిల్ విండో విధానము

6.2.5 సహకార బ్యాంకుల ప్రయోజనాలు, లోపాలు

6.3 వ్యవసాయ గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు (NABARD)

6.3.1 ఆవిర్భావము

6.3.2 నిధులు - నిర్వహణ

6.3.3 నాబార్డ్ విధులు

6.3.4 నాబార్డ్ పనితీరు

6.3.5 నాబార్డ్ పనితీరుపై విమర్శలు - సలహాలు

6.4 పదకోశము

6.5 స్వయం మదింపు ప్రశ్నలు

6.6 సిఫారసు చేసిన పుస్తకాలు

## 6.0 ఉద్దేశాలు :

ఈ పాఠ్యాంశాన్ని చదివిన తరువాత విద్యార్థులకు క్రింది విషయాలు తెలియును

❄ సహకార సంస్థలు - బ్యాంకులు అంటే ఏమిటి ?

❄ సహకార సంస్థల నిర్మాణము, పనితీరుకు సంబంధించిన అంశాలు

❄ సహకార సంస్థల ప్రయోజనాలు, పరిమితులు

❄ నాబార్డ్ నిర్మాణము, పనితీరు, విమర్శలు

**6.1 విషయ పరిచయము :** మనదేశ జాతీయోత్పత్తిలో సుమారు 30% వరకు వ్యవసాయ రంగంనుండి రావటమేకాక రమారమి 70% ప్రజలు వ్యవసాయ రంగంపైననే ఆధారపడియున్నారు. ఈ కారణాన వ్యవసాయ రంగాన్ని, దానికవసరమైన పరపతి సౌకర్యాలను ప్రాధాన్యతారంగాలలో ఒక అంశంగా భావించటం జరుగుతుంది. వ్యవసాయ పరపతిని ప్రధానంగా వ్యవస్థీకృత రంగంలోని ద్రవ్య సహాయ సంస్థలు, అవ్యవస్థీకృత రంగంలోని వడ్డీ వ్యాపారులు, దేశీయ బ్యాంకర్లు సమకూర్చుచున్నారు. అయితే వీరిచ్చే ఋణాలపై వసూలు చేసే వడ్డీ రేటు అధికంగా ఉండటమే కాకుండా వారు విధించే షరతులు కూడా వ్యవసాయదారులను పీడించే పద్ధతిలో ఉండును. గ్రామీణ ప్రజలను ముఖ్యంగా వ్యవసాయదారులను వీరి కబంధ హస్తాలనుండి రక్షించటము కొరకే సహకార వ్యవస్థ ఉద్భవించినది. ఈ విధంగా సహకార సంస్థలు, సహకార బ్యాంకులు వెలుగులోనికి వచ్చినవి.

**పాఠ్యాంశ నిర్మాణము**

**6.2 సహకార బ్యాంకులు :**

**6.2.1 చరిత్ర - ఆవిర్భావము :** సమానత్వము, పరస్పర సహకారము, ఒకే ఆశయము అనే అంశాల ప్రాతిపదికపై సహకార వ్యవస్థ రూపుదిద్దుకొన్నది. “ఒక్కరి కోసం అందరు, అందరికోసం ప్రతిఒక్కరు” ("All for each, and each for all") అనే నినాదంపై సహకార ఉద్యమాన్ని చేపట్టటము జరిగినది. ఈ ఉద్యమము భారతదేశంలో 1904 లో రూపొందించబడిన సహకార సంఘాల చట్టముతో క్రమబద్ధీకరించబడినది. పరస్పర సహకారము, స్వావలంబనతో అట్టడుగు వర్గాలవారి జీవన స్థితిగతులను మెరుగుపరచటంలో సహకార సంస్థలు ముందున్నాయని D.R. గాడ్గిల్, వైకుంఠలాల్ మెహతా వంటి అర్థశాస్త్రవేత్తలు తెలియజేసినారు. వివిధ దేశాలలో ప్రజాభీష్టము, సహకారోద్యమము ద్వారా సహకార సంస్థలు వర్ధిల్లగా బారతదేశములో మాత్రము ప్రభుత్వ ప్రోత్సాహముతో సహకారోద్యమము అభివృద్ధి చెందినది. దీని పర్యవసానంగానే స్వాతంత్ర్యము రావటానికి ముందే ఐచ్ఛిక ప్రాతిపదికపై ప్రభుత్వ ప్రోత్సాహముతో అనేక సహకార సంస్థలు వెలుగులోనికి వచ్చినవి. ప్రారంభంలో సహకార సంస్థలు కేంద్ర ప్రభుత్వ చట్టం పరిధిలో ఉన్నప్పటికీ, 1919 లో సహకారశాఖను కేంద్ర ప్రభుత్వము రాష్ట్ర శాఖలకు బదిలీ చేసినది. ఈ రకమైన ప్రోత్సాహమున్నప్పటికీ స్వాతంత్ర్యానికి ముందు సహకార పరపతి వితరణ అంతగా అభివృద్ధి చెందలేదు. 1951-52 నాటికి మొత్తం గ్రామీణ పరపతులు సహకార పరపతి కేవలం 3.1% మాత్రమే ఉన్నది. అయితే ఆ తరువాత ప్రారంభించిన పంచవర్ష ప్రణాళికలో సహకారోద్యమము ప్రాధాన్యతను పొంది నిజమైన అభివృద్ధిని సాధించినది.

**6.2.2 సహకార బ్యాంకుల నిర్వచనము :** సహకార బ్యాంకుల నిర్మాణాన్ని పరిశీలించబోయే ముందు సహకార బ్యాంకుల స్వభావము, నిర్వచనాలను గురించి పరిశీలించాలి. సహకార సూత్రాలపై బ్యాంకింగ్ వ్యాపారాన్ని చేసే సంస్థలను సహకార బ్యాంకులని అంటారు. ఈ సంస్థలు కూడా ఇతర వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే ప్రజలనుండి డిపాజిట్లను స్వీకరించి ఋణాలను మంజూరు చేయును. అయితే సహకార బ్యాంకులకు, జాయింట్ స్టాకు బ్యాంకులకు క్రింది మౌలిక తేడాలున్నవి-

a) సహకార బ్యాంకుల సభ్యుల బాధ్యత అపరిమితము కాగా, జాయింట్ స్టాకు బ్యాంకుల వాటాదారుల బాధ్యత పరిమితంగా ఉండును.

b) సహకార బ్యాంకులలో ప్రతి సభ్యునికి వాటాలతో సంబంధము లేకుండా ఒక్క ఓటు మాత్రమే ఉండును. జాయింట్ స్టాకు బ్యాంకులలోని వాటాదారుల ఓటు హక్కులు వారు తీసికొన్న వాటాలపై ఆధారపడి యుండును.

c) సహకార బ్యాంకులు మౌలికంగా గ్రామీణ వ్యవసాయ అవసరాలను తీర్చును. జాయింట్ స్టాకు బ్యాంకులు మాత్రమే వర్తక, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలను తీర్చును.

d) సహకార బ్యాంకులు ఫెడరల్ సమాఖ్య ప్రాతిపదికపై స్థాపించబడి మూడంచెల విధానంగా పనిచేయును. జాయింట్ స్టాకు బ్యాంకులు మాత్రము బ్రాంచి బాంకింగ్ విధానములో పనిచేయును.

e) సహకార బ్యాంకుల నిర్వహణ వికేంద్రీకరణ పద్ధతిపై ఆధారపడి ఉండగా జాయింట్ స్టాకు బ్యాంకులు మాత్రము కేంద్రీకరణ పద్ధతిపై పని చేయును.

ఐచ్ఛిక ప్రాతిపదికపై రూపొందే సహకారసంస్థలు సభ్యులను చేర్చుకొనుటలో ఎలాంటి వివక్షతకు తావులేకుండా వ్యవస్థ నిర్వహణ కూడా ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై ఉండును. వీరి ప్రధానోద్దేశము సభ్యుల ఆర్థిక సామాజిక, నైతికాభివృద్ధి. లాభార్జన వీరి ముఖ్య ఉద్దేశము కాదు. ఈ సంస్థలు సభ్యులను ఆర్థికపరమైన దోపిడీనుండి కాపాడుతూ, సభ్యుల శ్రేయస్సుతోపాటు సమాజ శ్రేయస్సుకు కూడా పాటుపడుచున్నవి.

సహకార సిద్ధాంతాల ప్రాతిపదికపై నిర్వహించబడుచున్న సంస్థలు సహకార సంస్థలు, సహకార బ్యాంకులు అనే పేర్లతో పిలువబడుతున్నప్పటికీ బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టము 1949 ప్రకారము రాష్ట్రసహకార బ్యాంకులు, జిల్లా కేంద్ర సహకారబ్యాంకులు, పట్టణ సహకార బ్యాంకులు మాత్రమే సహకార రంగములో బ్యాంకులుగా పిలువబడే అర్హతను కలిగియున్నవి.

**6.2.2 సహకార బ్యాంకుల నిర్మాణము :** మన దేశములో సహకార పరపతి సంస్థల నిర్మాణము ప్రాథమికంగా రెండు రకాలుగా ఉన్నది. అవి గ్రామీణ పరపతి వ్యవస్థ మరియు పట్టణ పరపతి వ్యవస్థ. గ్రామీణ పరపతి వ్యవస్థను తిరిగి స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక వ్యవస్థలుగా విభజించటము జరిగినది. క్రింది పట్టికను పరిశీలించటము ద్వారా సహకార సంస్థల నిర్మాణ నిర్వహణను కూలంకషముగా పరిశీలించవచ్చును.

## పట్టిక 6.1

**సహకార పరపతి సంస్థల నిర్వహణా నిర్మాణము**




సహకార పరపతి సంస్థల నిర్మాణము పై పట్టికలో చెప్పిన విధముగా ఉండగా కొన్ని రాష్ట్రాలలో స్వల్పకాలిక పరపతిని, దీర్ఘకాలిక పరపతిని అందించటానికి పై పట్టికలో చెప్పిన విధంగా ప్రత్యేక సంస్థలున్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఇలా ప్రత్యేకించబడిన సంస్థలు లేవు. అన్ని రకాల పరపతి సౌకర్యాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలే సమకూరుస్తున్నాయి. ఇలా ఒకే చోట అన్నిరకాల పరపతి సౌకర్యాలను కలుగజేసే పద్ధతిని ఏకగవాక్ష పద్ధతి (Single Window System) అని అంటారు. ఈ కారణాన గతంలో మన రాష్ట్రంలో ఉండే భూమి అభివృద్ధి బ్యాంకుల వ్యవస్థ ఇప్పుడు లేదు.

### 6.2.3 సహకార సంస్థలు

**6.2.3.1 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు :** (Primary Agricultural Credit Societies) (PACS) : భారతదేశంలో సహకార పరపతి మూడంచల పద్ధతిలో నిర్వహించ బడుచున్నది. ఈ మూడంచెలలో మొదటిది, మౌలికమైనది, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘము. ఈ సంఘాలు వ్యవసాయ గ్రామీణ పరపతికి వెన్నెముకలాంటివి. ఈ సంఘాలు గ్రామీణ ప్రజలతో రూపొందించబడి గ్రామ పరపతి వితరణలో ప్రత్యక్షంగా పాల్గొనును. ఈ సంఘాలు వ్యవసాయదారులతో నేరుగా వ్యవహరించటమేగాక వారికవసరమైన స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాలను వితరణ చేయును. ఇంతేకాక మధ్యకాలిక ఋణాలిస్తూ మార్కెటింగ్ విధులను కూడా నిర్వహించును. ఈ విధంగా ఈ సంఘాలు వ్యవసాయోత్పత్తుల పంపిణీకి దోహదపడుచున్నది.

ఇలాంటి సంఘాలను 10 మంది లేక అంతకన్నా ఎక్కువ మంది వ్యక్తులు కొద్దిపాటి వాటా మూలధనంతో ఏర్పాటు చేయవచ్చును. వాటా విలువ చాలా తక్కువ ఉండటంతో పేద రైతులు కూడా ఇందులో సభ్యులు కావచ్చును. ఋణవితరణకు, వాటా విలువకు ఎలాంటి సంబంధము లేదు. సంఘం కార్యకలాపాల నిర్వహణ, సంఘం సభ్యులతో ఏర్పడిన పాలకమండలి నిర్వహించును. ప్రతి సంఘానికి ఒక అధ్యక్షుడు, కార్యదర్శి, ఇతర కార్యవర్గ సభ్యులు ఉంటారు.

ఈ సంఘాలను మౌలికంగా ఋణాల వితరణ కొరకు ఏర్పాటు చేసినప్పటికీ ఈ సంఘాలు సభ్యులనుంచి డిపాజిట్లను వసూలుచేయటం ద్వారా సభ్యులలో పొదుపు అలవాట్లను ప్రోత్సహించును. సభ్యులనుండి వసూలుచేసిన సభ్యత్వ రుసుము సంఘము యొక్క మూలధన నిధిగా ఉండును. ఈ సంఘాలు ఋణవితరణలో రాష్ట్ర సహకార బ్యాంకుకు, జిల్లా సహకార బ్యాంకుకు, వ్యవసాయదారులకు మధ్య మధ్యవర్తిగా పనిచేయును.

**సహకార పరపతి సంఘాల విధులు :**

సభ్యులనుండి డిపాజిట్లను సేకరించటము, సభ్యులకవసరమైన పరపతి అవసరాలను తీర్చటము, వ్యవసాయోత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలను కలుగజేయటము, వ్యవసాయదారులకవసరమైన విత్తనాలు, ఎరువులను సప్లయి చేయటము, సహకార సంఘాల మౌలిక విధులు కాగా 1960 లో భారత ప్రభుత్వము ఏర్పాటుచేసిన సహకార పరపతి కమిటీ, సూచనల ప్రకారము ఈ సంఘాలు క్రింది అదనపు విధులను కూడా నిర్వహిస్తున్నవి.

a) ప్రజలనుండి వాటా మూలధనం రూపంలోనే కాక ఫిక్సెడ్ డిపాజిట్ల రూపంలో కూడా వీలైనంత ఎక్కువ మొత్తాలను సేకరిస్తున్నాయి.

b) వ్యవసాయదారులకు, ఇతర గ్రామ ప్రజలకు చాలినంత స్థాయిలో పరపతి సౌకర్యాలనందిస్తున్నాయి.

c) అందించిన పరపతి వినియోగము సక్రమముగా ఉండేట్లు పర్యవేక్షిస్తున్నాయి.

d) సభ్యులనుండి వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలోనుంచుకొని ఋణాల వసూళ్ళ కార్యక్రమాలను చేపడుతున్నాయి.

e) బ్యాంకులు, ఇతర ద్రవ్యసహాయ సంస్థలనుండి సంపాదించిన ఋణాలను తిరిగి చెల్లిస్తున్నాయి.

f) వ్యవసాయ కార్మికుల, చిన్నకారు రైతుల వినియోగ అవసరాలకవసరమైన రుణాలను కూడా పరిమిత స్థాయిలో మంజూరు చేస్తున్నాయి.

g) వ్యవసాయోత్పత్తి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ వ్యవసాయదారులకవసరమైన వ్యవసాయ పనిముట్లను, ఎరువులను విత్తనాలను, క్రిమిసంహారక మందులను సప్లయ్ చేస్తూ కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగుమందుల బారినుండి వినియోగదారులను కాపాడుతున్నాయి.

h) వ్యవసాయోత్పత్తుల నిల్వలు చేపట్టటమేకాక వ్యవసాయోత్పత్తులకు సంబంధించిన మార్కెటింగ్ కార్యకలాపాలను కూడా చేపడుతున్నాయి.

పై కార్యక్రమాలను చేపట్టటము ద్వారా గ్రామీణ ప్రజల ఆర్థికస్థోమతను పెంచుకొనటానికి సహాయపడుతున్నాయి.

**సహకార సంఘాల పనితీరు :**

గ్రామీణ పరపతి వ్యవస్థలో ప్రముఖపాత్ర పోషిస్తున్న సహకార పరపతి సంఘాల పనితీరును క్రింది పట్టికను పరిశీలించటము ద్వారా తెలుసుకొనవచ్చును.

**పట్టిక 6.2**

| వివరాలు | 1979-80 | 1985-86 | 1989 జూన్ | 37-3-01 |
|---|---|---|---|---|
| 1. పరపతి సంఘాల సంఖ్య | 95,000 | 92,400 | 87,000 | 1,00,000 |
| 2. సభ్యుల సంఖ్య | 5,48,36,000 | 7,02,00,000 | 6,67,00,000 | 10,00,00,000 |
| 3. డిపాజిట్లు (కోట్ల రూ.లలో) | 250 | 572 | - | 13,481 |
| 4. అప్పులు (కోట్ల రూ.లలో) | 2,148 | - | - | 34,522 |

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు సంబంధించి పై పట్టికను పరిశీలించినప్పుడు గత రెండున్నర దశాబ్దాల కాలములో సంఘాల సంఖ్యలో పెద్ద మార్పు లేనప్పటికీ, సభ్యుల సంఖ్య దాదాపు రెట్టింపయినది. డిపాజిట్లు, సంస్థలు చేసిన అప్పుల పరిమాణములో కూడా గణనీయమైన వృద్ధి ఉన్నది. అయితే సంఘాలు మంజూరు చేసిన రుణాలకు సంబంధించిగానీ, వాటి వసూళ్ళకు సంబంధించికానీ అవలంభించిన పద్ధతులు, రుణవసూళ్ళ రేటు నిరాశాజనకంగా ఉన్నది. ఈ విధంగా పెరుగుతున్న బకాయిలు, రుణాల వసూళ్ళ రేటుపై వీటి భవిష్యత్తు ఆధారపడియున్నది.

**ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పనీతీరులోని లోపాలు :**

గ్రామీణ పరపతి రంగంలో ప్రముఖపాత్ర పోషిస్తున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు సంఖ్యాపరంగా గణనీయంగా ఉన్నప్పటికీ వీటి పనితీరులో క్రింది లోపాలున్నవి.

a) ప్రాథమిక పరపతి సంఘాల భౌగోళిక విస్తృతి ఒక క్రమ పద్ధతిలో లేకపోవటమువలన ఈ సంఘాల స్వయం పోషకత్వము బలహీనపడినది. ఈ కారణాన వీటిని పునర్వ్యవస్థీకరించవలసి యున్నదని రిజర్వుబ్యాంకు సూచించినది.

b) సంఘంలోని సభ్యుల సంఖ్యలో గణనీయమైన వృద్ధి ఉన్నప్పటికీ వీరిలో ఎంతమంది నిజమైన సభ్యులో, ఎంతమంది బూటకపు సభ్యులలో తెలిసే అవకాశము లేదు. సన్నకారు రైతుల, ఆర్థిక పరిస్థితులలో అభివృద్ధిని తేవటానికుద్దేశింపబడిన ఈ సహకార సంస్థలు ధనిక వర్గాలకు చెందిన భూస్వాముల స్వప్రయోజనాలను కాపాడటానికి ఉపయోగపడుతున్నవి.

c) డిపాజిట్ల తీరును పరిశీలించినప్పుడు పరపతి సంఘాలు గ్రామీణులలో పొదుపు అలవాట్లను ప్రోత్సహించటంలో అంత ప్రగతిని సాధించలేదని తెలియుచున్నది.

d) సంఘాలు జారీ చేసిన రుణాలు కాలగమనంలో పెరిగినప్పటికీ, రుణాల వసూలు రేట్లు మాత్రము గణనీయంగా తగ్గినది.

e) చాలా సంఘాలు క్రమబద్ధమైన విధానాలను పాటించడం ద్వారా ఆరోగ్యకరంగా ఉన్నప్పటికీ చాలా సంస్థలు అనేక ఒడిదుడుకులనెదుర్కొంటూ మూలధన నిధులలో భారీలోటు ఏర్పడి నిధుల కొరతలను ఎదుర్కొంటున్నది. దీనివలన ఈ సంస్థలు ఇతర సంస్థలపై ఆధారపడవలసివస్తున్నది.

f) పటిష్టమైన అంతర్గతమైన నియంత్రణా విధానము లేకపోవటము, నిర్వహణలో వృత్తిపరమైన నిపుణత లేకపోవటము వలన సంఘాల నిర్వహణ కుంటుపడుతున్నది.

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పనితీరును మెరుగుపరచటానికి అనేక కమిటీలు కొన్ని సూచనలు చేసినవి. ఇందులో ప్రధానమైనవి.

a) బలహీనమైన సంఘాలు పరపతి వ్యవస్థ అభివృద్ధికి అవరోధాలుగా ఉండును. ఈ కారణాన సాధ్యమైన చోట్ల ఇలాంటి బలహీనమైన సంఘాలను విలీనం చేయటం ద్వారా వాటి పరిస్థితులను మెరుగుపరచవచ్చును. ఇంతేకాక సక్రమంగా పనిచేస్తున్న సహకార సంఘాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచవలెను.

b) సంఘాల ఆర్థిక పరిపుష్టికి చట్టబద్ధమైన నిబంధనను పాటించడము ఎంతైనా అవసరము.

c) బహుళ నియంత్రణా విధానాన్ని నియంత్రించవలెను.

పై చర్యలను చేపట్టటము ద్వారా ప్రాథమిక సహకార సంఘాల పనితీరును మెరుగుపరచి గ్రామీణ పరపతి వ్యవస్థను బలోపేతము చేయవచ్చును.

**6.2.3.2 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు :** మూడుస్థాయిల సహకార పరపతి వ్యవస్థలో కేంద్ర స్థానాన్ని ఆక్రమించుకున్న సహకార బ్యాంకులను జిల్లా కేంద్ర సహకార బ్యాంకులని అంటారు. ఒక వైపు రాష్ట్ర సహకార బ్యాంకులకు, మరోవైపు వ్యవసాయ పరపతి సంఘాలకు ఈ బ్యాంకులు సంధాన కర్తలుగా పనిచేస్తున్నవి. ప్రారంభంలో డిపాజిట్లను సేకరించి పొదుపునభివృద్ధి చేసి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఆర్థిక సహకారాన్నందించటానికి ఈ కేంద్ర సహకార బ్యాంకులను స్థాపించటము జరిగినది. సాధారణంగా వీటి పరిధి ఒక జిల్లాకు పరిమితమై ఉండటమువలన ఈ బ్యాంకులను జిల్లా కేంద్ర సహకార బ్యాంకులుగా వ్యవహరించటము జరుగుతుంది. 1935 లో సహకార పరపతిపై నియమించబడిన కేంద్ర కమిటీ సిఫారసుల ప్రకారము కేంద్ర సహకార బ్యాంకులు జిల్లాకుగానీ, తాలూకుగానీ పరిమితమై ఉండాలి. ఇందులో 200 నుండి 250 వరకు ప్రాథమిక సహకార సంఘాలను సభ్యులుగా చేర్చుకొనవచ్చును. ఇలా చేరిన సంఘ సభ్యులతోపాటు వ్యక్తులను కూడా సభ్యులుగా చేర్చుకునేవారు. అయితే ఆ తరువాత నియమించబడిన గ్రామీణ పరపతి పరిశీలనా సంఘం సిఫారసుల ప్రకారము వ్యక్తిగత సభ్యత్వాన్ని నిలిపివేయటం జరిగినది. 1981-82 నాటికి 338 గా ఉన్న కేంద్ర సహకార బ్యాంకులు 1993-94 నాటికి 361 కి పెరిగినవి. అదే సంవత్సరము నాటికి వాటి నిర్వహణా మూలధనము 5,327 కోట్ల రూపాయలనుండి 27,586 కోట్లకు పెరిగినది. ఇదే కాలములో కేంద్ర సహకార బ్యాంకుల డిపాజిట్లు 2,768 కోట్లనుండి 16,251 కోట్లకు పెరిగినవి. దీనిని బట్టి సహకార బ్యాంకులు ఏ విధంగా వృద్ధి చెందినదీ వాటి ప్రాధాన్యత ఏ విధంగా ఉన్నదీ గమనించవచ్చును. 1993-94 నాటికి 17,758 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయబడినవి. మన రాష్ట్రములో 1987 లో సింగిల్ విండో విధానము అమలులోకి వచ్చిన నాటినుండి 23 జిల్లాలలో 22 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు పనిచేస్తున్నాయి. హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలకు ఒకే కేంద్ర సహకార బ్యాంకు ఉన్నది.

**జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల విధులు :**

☆ వీరు ప్రాథమిక పరపతి సంఘాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్నందిస్తారు. ఇలా దేశములోని ద్రవ్యమార్కెట్‌కు, మౌలిక పరపతి సంఘాలకు మధ్య వీరు వారధిలా పనిచేస్తున్నారు.

☆ వీరు ప్రజలనుండి డిపాజిట్లను స్వీకరిస్తారు.

☆ మొదటి తరహా సెక్యూరిటీలు మరియు బంగారం హామీపై ఖాతాదారులకు రుణాలను మంజూరు చేస్తారు.

☆ ప్రాథమిక పరపతి సంఘాలనుండి మిగులు నిధులను స్వీకరించి అవసరమైన చోట్ల ఈ నిధులను వినియోగించటము ద్వారా నిధుల మధ్య సమతౌల్యాన్ని సాధిస్తారు. ప్రాథమిక సహకార సంఘాలకు అవసరమైన సాంకేతిక మరియు పరిపాలనాపరమైన సహాయాన్నందిస్తారు. తమ ఋణగ్రస్తులైన పరపతి సంఘాల పనితీరుపై పర్యవేక్షణ మరియు తనిఖీలనేర్పాటు చేస్తారు. సహకార సమావేశాలను ఏర్పాటుచేసి సహకార సంఘాల అభివృద్ధికవసరమైన కార్యక్రమాలను రూపొందిస్తారు. సహకార సంఘాలలో పనిచేసే సిబ్బందికవసరమైన శిక్షణా సౌకర్యాలనేర్పాటు చేస్తారు.

☆ ఈ బ్యాంకులు తమ నిర్వహణా మూలధనాన్ని తమ సొంత నిధులతోను, డిపాజిట్లతోను, అప్పులు మరియు ఇతర వనరులతోను, సమకూర్చుకుంటారు. బ్యాంకుల నిధులలో ప్రధానమైన భాగము చెల్లించిన మూలధనము. ఈ చెల్లించిన మూలధనములో రాష్ట్ర ప్రభుత్వపు వాటా మరియు సహకార సంఘాల వాటాలు ఉండును. ఈ బ్యాంకులు తమకవసరమైన వనరులకోసం రాష్ట్ర సహకార బ్యాంకునుండి, RBI నుండి కూడా అప్పులను తీసికొనును.

### జిల్లాకేంద్ర సహకార బ్యాంకుల పరపతి సదుపాయాలు :

ఈ బ్యాంకులిచ్చే అప్పులను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చును. ప్రాథమిక సహకార పరపతి సంఘాల సభ్యుల వ్యవసాయ అవసరాల కొరకు సహకార సంఘాలకు స్వల్పకాలిక అప్పులను మంజూరుచేస్తారు. ఇలా మంజూరు చేసిన అప్పులను 15 నెలలలోపే చెల్లించవలసి ఉన్నది. సభ్యులకు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యాన్ని కలుగజేయటం జరుగును. బలహీన వర్గాల సభ్యులకు వ్యక్తిగత హామీపై తక్కువస్థాయిలో వినిమయ పరపతిని మంజూరు చేయటం జరుగును. ఇవికాక వ్యవసాయదారులకు వ్యవసాయ అనుబంధ వృత్తులను చేపట్టుటకు 3 నుండి 5 సం॥ల కాలపరిమితి కలిగిన మధ్యకాలిక అప్పులను మంజూరుచేయటం జరుగును. ఇలాంటి అప్పులను రిజర్వుబ్యాంకు ఆదేశము మేరకు తోటల పెంపకానికి, పాడిపశువుల కొనుగోలుకు, గొర్రెలు, మేకల పెంపకానికీ, ఎద్దులు, బండ్ల కొనుగోలుకు, ఇతర స్వయం ఉపాధి కల్పనకు మంజూరు చేయటము జరుగును. స్వల్పకాలిక మరియు మధ్యకాలిక అప్పులను గాక కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఈ బ్యాంకులు దీర్ఘకాలిక పరపతి సౌకర్యాన్ని కూడా కలుగజేయును. ఈ విధంగా ఈ బ్యాంకులు కాలపరిమితి కలిగిన పరపతి సౌకర్యాలను మంజూరు చేస్తారు. ఇవికాక ప్రాథమిక సహకార సంఘాలకు ఉత్పత్తుల హామీపై Cash Credit సౌకర్యాలను కూడా కలుగజేయటం జరుగును.

### జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల లోపాలు :

జిల్లాకేంద్ర సహకార బ్యాంకులు పరపతి వ్యవస్థలో ఒక ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ వీటి నిర్వహణలో కొన్ని లోపాలున్నవి. అవి :

☆ సహకార సిద్ధాంతాలపై ఏర్పాటు చేయబడిన ఈ బ్యాంకులు వాస్తవములో పనిచేసేటప్పుడు వాణిజ్య బ్యాంకులుగా పనిచేస్తున్నవి.

☆ ప్రాథమిక పరపతి సంఘాల ఆర్థిక పరిస్థితిని అంచనా వేయటానికి ప్రత్యేక నిపుణుల సహాయాన్ని తీసుకోకపోవటం వలన బాకీల వసూళ్ళలో అనేక సమస్యలు తలెత్తుచున్నవి. చాలా బ్యాంకులు తమ రిజర్వు నిధులను కూడా నిర్వహణా మూలధనంగా ఉపయోగిస్తున్నవి. ఇలా ఉపయోగించటము ఏ విధంగా పరిశీలించినప్పటికీ కూడా సరైన పద్ధతికాదు. కొన్ని కేంద్ర సహకార బ్యాంకులు ప్రాథమిక సంఘాల సమాఖ్య విధానాన్ని విస్మరించి పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నవి.

☆ కొన్ని సందర్భాలలో పెరుగుచున్న నిర్వహణా ఖర్చులను భరించటానికి అధిక వడ్డీరేట్లను వసూలు చేయటం జరుగుతుంది.

☆ చాలా కేంద్ర సహకార బ్యాంకులు ఆర్థిక వెసులుబాటులేక బలహీనంగా తయారైనవి. ఇలాంటి బలహీనమైన కేంద్ర సహకార బ్యాంకులు తమ రాని బాకీలను రద్దు చేసుకొనటానికి భారత ప్రభుత్వము 1972 లో ఒక ప్రణాళికను రూపొందించినది. ఈ ప్రణాళిక ప్రకారము ఇలాంటి బ్యాంకులకు అవసరమైన ఆర్థిక సహాయాన్నందించటము జరుగును. అయితే ఈ పథకము ఆశించిన ఫలితాలను రాబట్టకపోగా, ఏ వర్గమువారు ఖాతరు చేయకపోవటం వలన విఫలమైనది. కానీ నాబార్డు ఈ పథకాన్ని కొన్ని మార్పులతో కొనసాగిస్తున్నది.

### 6.2.3.3 రాష్ట్ర సహకార బ్యాంకులు :

మూడంచెల సహకార పరపతి వ్యవస్థలో రాష్ట్ర సహకార బ్యాంకు అగ్రస్థానములో ఉంటుంది. జిల్లా స్థాయిలోని కేంద్ర సహకార బ్యాంకుల సమాఖ్య వ్యవస్థను రాష్ట్ర సహకార బ్యాంకులుగా పరిగణించవచ్చును. ఒక రాష్ట్రంలో సహకార ఉద్యమాన్ని కొనసాగించటంలో ఈ బ్యాంకు నాయకత్వం వహించును.

ఈ బ్యాంకుకు అవసరమైన నిధులు కేంద్ర సహకార బ్యాంకులు చందాకట్టిన వాటా మూలధనంతోను, ప్రజలనుండి సేకరించిన డిపాజిట్లతోను కేంద్ర సహకార బ్యాంకులకు చెందిన రిజర్వు ఫండుతోను, SBI మరియు ఇతర వాణిజ్య బ్యాంకులనుండి తీసుకొన్న రుణాలతోను ఉండును. రాష్ట్ర సహకార బ్యాంకులకవసరమైన నిర్వహణా మూలధనములో అధికశాతం మొత్తాన్ని రిజర్వు బ్యాంకు సమకూర్చును. రాష్ట్ర సహకార బ్యాంకు రాష్ట్రములోని ఇతర సహకార బ్యాంకులకు బ్యాంకరుగా వ్యవహరిస్తూ వారి కార్యకలాపాలను నియంత్రించటమేకాక వారికవసరమైన సహకార సంపత్తులను కూడా సమకూర్చును.

**రాష్ట్ర సహకార బ్యాంకుల విధులు :**

రాష్ట్ర సహకార బ్యాంకు రిజర్వు బ్యాంకుకు, రాష్ట్రంలోని సహకార బ్యాంకులకు మధ్య అనుసంధానకర్తగా ఉంటూ సహకార సంస్థలకు కావలసిన నిధులను రిజర్వు బ్యాంకునుండి సమకూర్చును. ఈ ప్రధాన విధితో పాటు ఈ బ్యాంకు క్రింది ఇతర విధులను కూడా నిర్వహించును.

- వీరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు అవసరమైన విధులను సమకూరుస్తూ, వారిద్వారా ప్రాథమిక సహకార బ్యాంకులకు, సభ్యులకు అవసరమైన పరపతి సౌకర్యాలను కలుగజేయును. వీరిని ద్రవ్యమార్కెట్‌కు, సహకార రంగానికీ మధ్య ఉండే తుది లింకుగా భావించవచ్చును.
- వివిధ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలోని నిధులలోని హెచ్చు తగ్గులను ఒకచోటునుండి మరొక చోటుకు బదలాయించటము ద్వారా వారి మధ్య సమతౌల్యాన్ని నెలకొల్పును.
- జిల్లా స్థాయిలో సహకార బ్యాంకులు లేనిచోట్ల నేరుగా ప్రాథమిక సహకార సంస్థలకు పరపతి సౌకర్యాలను కలుగజేయును.
- సహకారోద్యమానికవసరమైన డిపాజిట్లను సేకరించటానికవసరమైన కార్యక్రమాలను రూపొందించి అమలుచేయును. సహకారోద్యమము అభివృద్ధికి అవసరమైన పథకాలు రూపొందించి అమలుచేయును.
- వివిధ సంఘాలపై తనిఖీలను నిర్వహించి అవసరమైన సలహాలనిచ్చును.

**రాష్ట్ర సహకార బ్యాంకుల లోపాలు :**

కేంద్ర సహకార బ్యాంకులలో మాదిరిగానే ఇందులో కూడా క్రింది లోపాలు కలవు.

- వీరు సహకార బ్యాంకింగ్‌తోపాటు వాణిజ్య బ్యాంకింగ్ కార్యకలాపాలను కూడా మిళితము చేస్తున్నారు.
- వీరివద్ద చాలినంత మూలధన నిధులు లేవు.
- కేంద్ర సహకార బ్యాంకుల మాదిరిగానే వీరు కూడా రిజర్వు ఫండులను నిర్వహణా మూలధనంగా నిర్వహిస్తున్నారు. ఈ వ్యవస్థ పూర్తిగా జిల్లా బ్యాంకుల సమాఖ్యగా కాకుండా వ్యక్తిగత సభ్యులతో మిళితమై ఉంటున్నది.
- ప్రాథమిక పరపతి సంఘాలను, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను నియంత్రించగలిగిన యంత్రాంగము రాష్ట్ర సహకార బ్యాంకులకు లేదు.
- ఈ లోపాల వలన మరియు సహకారోద్యమాన్ని ముందుకు తీసికొని వెళ్ళటంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవటం వలన 50 సం॥ల చరిత్ర కలిగిన సహకారోద్యమము ఆశించినంత ఫలితాలను సాధించలేదు.

## రాష్ట్ర సహకార బ్యాంకుల అభివృద్ధి :

1950-51 లో మనదేశములో 15 రాష్ట్ర సహకార బ్యాంకులు ఉండగా అది 1993-94 నాటికి 28 కి పెరిగినది. ఇదే కాలములో మంజూరుచేసిన అప్పులస్థాయి 42 కోట్ల రూపాయల నుండి 9,803 కోట్ల రూపాయలకు పెరిగినది. డిపాజిట్లు, సభ్యుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగినప్పటికీ, సంస్థాగతమైన లోపాల కారణంగా రాష్ట్ర సహకార బ్యాంకులు ఆశించిన ఫలితాలను సాధించలేదు. ఈ

కారణాన 1986 లో బలహీనమైన 8 రాష్ట్ర సహకార బ్యాంకులను 173 కేంద్ర సహకార బ్యాంకులను పునఃనిర్మించటానికి అవసరమైన కార్యక్రమమును రూపొందించటము జరిగినది. దీనితోపాటు ప్రాథమిక సహకార వ్యవస్థను పటిష్టపరచటానికి అవసరమైన చర్యలను కూడా RBI చేపట్టినది. ఇందులో ముఖ్యమైనవి :

వాణిజ్య బ్యాంకుల పరపతి వితరణలో పాటించే సెక్యూరిటీ విధానాన్ని సహకార బ్యాంకులు కూడా పాటించాలి.

ప్రకృతి వైపరీత్యాల కారణంగా వాస్తవంగా నష్టపోయిన రుణగ్రస్తుల రుణాలను సంస్కరించి అవసరమైన సదుపాయాలను కల్పించినది.

స్వల్పకాల వ్యవసాయ రుణాల మొత్తములో 10% మించని మొత్తాన్ని చెల్లించని సభ్యులకు క్రొత్తగా రుణాలనివ్వాలి. బీహారు, ఒరిస్సా, తూర్పు ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ప్రయోగాత్మకంగా స్వల్పకాలిక వ్యవసాయ రుణాలకు బదులుగా Cash credit ల సదుపాయాన్ని కలుగజేయటం జరిగినది.

పై చర్యలతోపాటు సహకారోద్యమాన్ని ముందుకు తీసుకొని వెళ్ళటానికి చేపట్టిన అనేక చర్యలలో ఒక ముఖ్యమైన చర్య జాతీయ సహకారాభివృద్ధి కార్పొరేషన్‌ను (National Co-operative Development Corporation) ఏర్పాటు చేయటమే. ఈ కార్పొరేషన్ 1995-96 నాటికి అందించిన మొత్తం సహాయక చర్యల విలువ రూ. 36,745 కోట్లు.

పై చర్యలు మరియు ఇతర చర్యల ఫలితంగా సహకారోద్యమము ఇంకా ముందుకు వెళ్ళగలదని ఆశించవచ్చును.

### 6.2.4 ఆంధ్రప్రదేశ్‌లో సహకార పరపతి వ్యవస్థ : సింగిల్ విండో విధానము :

ఆంధ్రప్రదేశ్‌లో సహకార పరపతి వ్యవస్థ నిర్మాణము, పనితీరును రెండు భాగాలుగా విభజించవలెను. అవి సింగిల్ విండో విధానము, అమలులోనికి రాకముందు పరిస్థితి, సింగిల్ విండో విధానము వచ్చిన తరువాత పరిస్థితి.

సింగిల్ విండో విధానము అమలులోనికి రాక పూర్వము అంటే 1987 కు పూర్వము మూడంచెల సహకార పరపతి వ్యవస్థ నిర్వహించబడేది. ఇందులో రాష్ట్రస్థాయిలో రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా స్థాయిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మరియు వినియోగ స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘము ఉండేవి. కొన్నిచోట్ల ఈ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘమే బ్యాంకింగ్ కార్యకలాపాలను కూడా నిర్వహించేది. ఇలాంటి సందర్భాలలో ఈ కార్యకలాపాల నిర్వహణకు ఏర్పడిన సంస్థలను ప్రాథమిక సహకార పరపతి బ్యాంకుగా పిలువబడేది. వీటికి తోడు కొన్నిచోట్ల భూమి తనఖా బ్యాంకులు, ఆ తరువాత రూపాంతరము చెందిన భూమి అభివృద్ధి బ్యాంకులు నిర్వహించబడేవి. ఈ సంస్థలన్నీ ముఖ్యంగా గ్రామ ప్రాంతాలలోని వ్యవసాయదారులకు, చిన్న చిన్న పరిశ్రమలకు, చేతివృత్తుల వారికి, మరియు ఇతర మౌలిక రంగాలకు, పరపతి సౌకర్యాన్ని కలుగజేసేవి. ఈ కార్యక్రమాలన్నీ ఒకరికోసం అందరు, అందరికోసం ఒక్కరు అనే సహకార సిద్ధాంతం ప్రాతిపాదికపైనే నిర్వహించబడేవి. వీటి నిధుల సమీకరణ, నిర్వహణ, పద్ధతులన్నీ దేశములోని మిగిలిన రాష్ట్రాల మాదిరిగానే ఉండేవి. కొన్ని సందర్భాలలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలుగా ఏర్పడిన సంఘాలు, లాభార్జన ఉద్దేశ్యము లేకుండ వ్యవసాయదారుల కవసరమైన అత్యవసర సరుకులు ఎరువులు, ఇతర వ్యవసాయ పనిముట్లను కూడా సమకూర్చేవి. రాష్ట్రములో ఈ వ్యవస్థ అంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార చట్టములోని నిబంధనల ప్రకారము ఉండేది.

**సింగిల్ విండో విధానము అమలులోనికి వచ్చిన తరువాత పరిస్థితి :** సింగిల్ విండో విధానమును ఏక గవాక్ష విధానము అనికూడా అంటారు. రైతులకవసరమైన అన్ని రకాల పరపతి సౌకర్యాలు ఒకేచోట లభించటంవలన రైతులకెదురయ్యే అనేక వ్యయ ప్రయాసలుండవు. ఇంతేకాక రైతులు వ్యవసాయ పనులపైనే తమదృష్టిని కేంద్రీకరించే అవకాశమేర్పడుతుంది. దీనికి సంబంధించి 1975 లో డాక్టర్ హజారీ కమీషన్ చేసిన సూచనలు పాటించతగినవి. ఈ కమీషన్ సహకార వ్యవస్థను పునఃనిర్మించి స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాల పరపతి సౌకర్యాలన్నింటినీ ఒకేచోటనుండి అందించటమువలన రైతాంగానికీ, సహకార సంస్థలకూ అనేక ప్రయోజనాలు చేకూరగలవని సూచించినది. ఈ సిఫారసులను దృష్టిలోనుంచుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సూచనల అమలువల్ల వచ్చే ప్రయోజనాలు, ఎదురయ్యే ఇబ్బందులను విశ్లేషించవలసినదిగా అధికారుల బృందాన్ని కోరింది. ఈ అధ్యయనం ఫలితంగా 1983 జూన్‌లో ఒక పథకాన్ని రూపొందించటము జరిగినది. ఈ పరిస్థితులకు తోడు జాతీయాభివృద్ధి మండలి ఏడవ పంచవర్ష ప్రణాళికకు చెందిన ముసాయిదా

ప్రతిపాదనను ఆమోదించే సందర్భములో సహకార పరపతి విధానాలను ఏకీకృతం చేయాలని సిఫారసు చేయటం జరిగింది. దీనివలన ఆంధ్రప్రదేశ్‌లోని సింగిల్ విండో విధానానికి బలంచేకూరినది. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రతిపాదనను భారత ప్రభుత్వము కొన్ని షరతులతో **1986** లో తన ఆమోదాన్ని తెలియజేసింది. ఇలా ఆమోదించబడిన ప్రతిపాదనల అమలుకు రాష్ట్రప్రభుత్వము **9-1-87** నుంచి అమలులోకి వచ్చే విధంగా ఉత్తర్వులను జారీ చేసినది. ఈ విధానము అమలు మొదటి దశ క్రింది విధంగా ఉండును.

☆ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పునఃవ్యవస్థీకరించాలి.

☆ ప్రతి జిల్లాకు ఒక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉండేటట్లు చూడాలి.

☆ వ్యవసాయాభివృద్ధి బ్యాంకులను రద్దుచేసి వాటి ఆస్థి అప్పులను జిల్లా స్థాయిలోని కేంద్ర సహకార బ్యాంకుకు బదిలీ చేయాలి. రాబోయే కాలములో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలే దీర్ఘకాలిక రుణాలను కూడా మంజూరు చేయును.

☆ సహకార మార్కెటింగ్ విధానాన్ని పునఃవ్యవస్థీకరించే చర్యలలో భాగంగా ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘాలను రద్దుచేసి మూడంచెల సహకార సంస్థలను రెండంచెల సహకార సంస్థలుగా రూపొందించాలి.

పై విధమైన ఆచరణా కార్యక్రమాన్ని పురస్కరించుకొని అప్పటివరకు ఉన్న **6,695** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను **4,564**కు కుదించటమైనది. ఆనాటికున్న **218** వ్యవసాయాభివృద్ధి బ్యాంకులను రద్దుచేసి వాటి ఆస్థి అప్పులను **22** జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో విలీనం చేయటం జరిగినది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల సంఖ్యను కూడా **27** నుండి **22** కు తగ్గించటమైనది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల నిర్వహణ ఒక క్రమ పద్ధతిలో కొనసాగటానికి సహకార సంఘాల వేతన కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణను ఇవ్వటం జరిగినది.

### సింగిల్ విండో విధానము వలన ప్రయోజనాలు :

పునర్ వ్యవస్థీకరించబడిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (Primary Agricultural Credit Societies - PACS) ద్వారా రైతులు అన్ని రకాల పరపతి సౌకర్యాలను అనగా వ్యవసాయ కార్యకలాపాలకవసరమైన స్వల్పకాలిక ఋణాలు, వ్యవసాయ పనిముట్ల కొనుగోలుకవసరమైన మధ్యకాలిక ఋణాలు, భూమి అభివృద్ధి, ట్రాక్టర్ల కొనుగోలు, పంపుసెట్ల ఏర్పాటుకవసరమైన దీర్ఘకాలిక ఋణాలను పొందవచ్చును. గతంలో ఈ మూడు రకాల ఋణాలకు మూడుచోట్లకు వెళ్ళవలసి వచ్చేది.

పరపతి సౌకర్యాలను పొందటంతోపాటు గ్రామీణ ప్రజలలో పొదుపు, బ్యాంకింగ్ అలవాట్లను పెంపొందించటం జరుగుతుంది. ఈ PACS ద్వారా వ్యవసాయానికవసరమైన ఎరువులను పొందటమే కాక వ్యవసాయ ఉత్పత్తులను నిల్వచేసుకునే అవకాశము, విక్రయించుకునే అవకాశము కలుగజేయవచ్చును.

అన్నిరకాల ఋణాలను ఒకే చోటునుండి పొందటంవలన రైతుల మొత్తం ఋణబాధ్యతను తెలుసుకొనవచ్చును, అతను ఏ మేరకు అభివృద్ధిని సాధించినదీ కూడా తెలుసుకొనవచ్చును. దీనివలన రైతులు చేయుపనులలో సలహాలనివ్వటానికీ, సాంకేతిక సహాయాన్నందించటానికీ, అవకాశముండును. ఈ విధంగా సాంకేతిక సలహాలకొరకు ఇతర ప్రాంతాలకెళ్ళవలసిన అవసరమునుండి బయటపడవచ్చును.

మిగులు నిధులను దీర్ఘకాలిక ఋణాల మంజూరుకు ఉపయోగించవచ్చును. వివిధ సంస్థలను విలీనం చేయటంవలన నిర్వహణా ఖర్చుతగ్గి రైతులకు తక్కువ వడ్డీలకు అప్పులిచ్చే అవకాశమేర్పడును.

### సింగిల్ విండో విధానము వలన లోపాలు :

- పునర్వస్థీకరణలో భాగంగా లాభదాయకం కాని సంస్థలను లాభాలతో నడుస్తున్న సంస్థలతో విలీనం చేయటం వలన సక్రమముగా నిర్వహించబడుతున్న సంస్థలు కూడా దెబ్బతినే ప్రమాదమున్నది.

- పునర్‌వ్యవస్థీకరణలో కొన్ని సంఘాలను రద్దుపరచటమంటే కొంతమందికి ఈ సౌకర్యము లేకుండా చేయటమేనని గమనించాలి.
- PAC లు దీర్ఘకాలిక రుణాల మంజూరుకవసరమైన అంచనాలను పరిశీలించే నిపుణత ఉండదు. దీని ఫలితంగా సహకార వ్యవస్థను రైతులు దుర్వినియోగపరచే ప్రమాదముండును.

### 6.2.5 సహకార బ్యాంకుల ప్రయోజనాలు - లోపాలు

మౌలికంగా వ్యవసాయ దేశమైన భారత దేశములో సహకారోద్యమము ఆశించిన ఫలితాలను సాధించకపోయినప్పటికీ ఈ ఉద్యమము మాత్రము భారతదేశము మొత్తము విస్తరించినది. వ్యవసాయధారిత అనేక కార్యకలాపాలు సహకార ప్రాతిపధికపై నిర్వహించబడటమే ఇందుకు నిదర్శనము. సహకార బ్యాంకింగ్ వలన క్రింది ప్రయోజనాలను పొందవచ్చును.

మనదేశములోని వ్యవసాయదారులలో ఎక్కువమంది చిన్న, మార్జినల్ వ్యవసాయదారులు. వీరికి పరపతి అవసరాలుండటమేకాక సాంకేతిక సలహాల ఆవశ్యకత కూడా ఎంతైనా ఉన్నది. ఈ రెండు పనులను సహకార బ్యాంకులు చేయగలవు. ఇంతేకాక సహకార సంఘాలను స్థానికులైన వ్యవసాయదారులే నిర్వహిస్తారు కాబట్టి వీరికి స్థానిక సమస్యలు తేలికగా అవగతమగును.

సహకార బ్యాంకులు వ్యవసాయదారులను సహకార త్రాటిపైకి తీసికొనిరావటానికి వారందరినీ ఒకచోట చేర్చటము వలన వారి నిర్లిప్తతను పోగొట్టి వారిని కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దటము జరుగును. ఈ విధంగా వ్యవసాయదారులను సమిష్టి కృషిఉమ్మడి ప్రయోజనం వైపు మరల్చటం జరుగును.

సహకార బ్యాంకులు సకాలములో రుణాలనందించే అవకాశముండటము వలన వ్యవసాయదారుల ఉత్పాదకత రేటుకూడా పెరుగును. వ్యవసాయ దారులను వడ్డీవ్యాపారస్తులు, ఇతర దేశీయబ్యాంకర్ల బారినుండి తప్పించి తక్కువ వడ్డీ రేట్లకు పరపతి సౌకర్యాన్ని కలుగజేయును. సహకార బ్యాంకులు కేవలము వ్యవసాయ కార్యక్రమాలకే కాక వ్యవసాయానికనుబంధముగానున్న కోళ్ళపెంపకము, గొర్రెల పెంపకము, పాడిపరిశ్రమలకు కూడా పరపతి సౌకర్యాలను కలుగజేయును. సహకార బ్యాంకులు ప్రజలలో పొదుపు అలవాట్లను పెంపొందించి గ్రామప్రాంతాలలోని పొదుపును పెట్టుబడివైపు మరల్చటంలో కృషిచేయును.

వీరు వ్యవసాయ ఉత్పత్తులకు గిడ్డంగి సౌకర్యాలను, మార్కెటింగ్ సౌకర్యాలను కూడా కలుగజేస్తారు.

ఒకరకంగా సహకార బ్యాంకులు గ్రామ ప్రాంతాలను పాడిపంటలు సిరిసంపదలతో తులతూగే ప్రాంతాలుగా మార్చటంలో విశేషకృషి చేయును.

### సహకార బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలు :

సిద్ధాంత పరంగా సహకారోద్యమము, సహకార బ్యాంకింగ్ బహుళ ప్రయోజనకరమైనదైనప్పటికీ, వ్యవస్థలోని కొన్ని లోపాలు కారణంగా ఆచరణ, ఫలితాలు ఆశించినంతగా లేవు. ఇందుకు క్రింది లోపాలను ప్రధానంగా చెప్పుకొనవచ్చును.

మనదేశములోని చాలా PAC లు ఆర్థికంగా, నిర్మాణాత్మకంగా బలహీనంగా ఉండటంవలన గ్రామ ప్రజలకు ఆశించిన స్థాయిలో సేవలను చేయలేకపోతున్నవి. ఇందుకొరకు ఆల్ ఇండియా రూరల్ క్రెడిట్ రివ్యూ కమిటీ (All India Rural Credit Review Committee) PAC లను పునర్‌వ్యవస్థీకరించాలని సూచించినది. పునర్ వ్యవస్థీకరణ జరిగినది కానీ PAC లు మాత్రము బలపడలేదు.

దేశం మొత్తముమీద ఉన్న గ్రామ ప్రాంతాల పరపతి ఆవశ్యకతలో సహకార వ్యవస్థ కేవలము 45% వరకే పరపతినందిస్తున్నవి. ఇంతేకాక అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో సహకారవ్యవస్థ బలంగా ఉంది కానీ, కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా బీహారు, ఒరిస్సా, ఈశాన్య రాష్ట్రాలలో సహకారోద్యమము సక్రమంగా అభివృద్ధి చెందలేదు.

సహకారబ్యాంకుల ప్రధాన సమస్య రుణాల వసూలు. భూమి అభివృద్ధి బ్యాంకుల మొత్తం ఋణాలలో 42% బకాయిలుండగా కేంద్ర సహకార బ్యాంకుల రుణాలలో 38% బకాయిలున్నవి. ఇంతేకాక బకాయిల పరిస్థితి దేశం మొత్తంమీద ఒకే విధంగా లేదు.

బకాయిలకు ప్రధానకారణము రాజకీయ జోక్యము మరియు అసమర్థ నిర్వహణ. 1972 లో ఏర్పడిన బ్యాంకింగ్ కమీషన్ పరపతి వితరణలో నిబంధనను పాటించకపోవటము, బాకీలను వసూలు చేయటంలో కఠినచర్యలు చేపట్టకపోవటము బకాయిలు పేరుకొని పోవటానికి ప్రధాన కారణమని తెలియజేయటం జరిగినది.

మరో ప్రధానలోపము ఆర్థికంగా బలవంతులైనవారే సహకార బ్యాంకులనుండి ఎక్కువ పరపతిని పొందటము. చిన్న వ్యవసాయదారుల కిచ్చిన పరపతి ఎప్పుడూ కూడా 40% నికి మించలేదు. ఇంతే కాక భూమిలేని కూలీలు, ఇతర వర్గాలకు చెందినవారు పొందిన పరపతి మొత్తం పరపతిలో 6.2% గా ఉండటము శోచనీయము. ఇలాంటి పరిస్థితికి కారణము చిన్నవారు సరియైన హామీలను చూపించలేక పోవటము మరియు మార్జిన్ మనీని కట్టలేకపోవటమే.

సహకార బ్యాంకులద్వారా కేవలము పరపతి సౌకార్యలనందించి మిగతా సౌకర్యములను అందించకపోవటము వలన కూడా సహకారోద్యమము దెబ్బతినటానికి దోహదపడింది.

మనదేశ ఆర్థికాభివృద్ధి గ్రామీణాభివృద్ధితో ముడిపడి యుండటము వలన గ్రామీణాభివృద్ధి సహకారోద్యమంతో ముడిపడి ఉండుట వలన సహకారోద్యమాన్ని సంస్కరించి అమలు చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

## 6.3 వ్యవసాయ గ్రామీణాభివృద్ధి జాతీయ బ్యాంకు :

**6.3.1 నాబార్డ్ (NABARD) ఆవిర్భావము :** భారతదేశములో వ్యవసాయ రంగానికున్న ప్రత్యేక ప్రాధాన్యత దృష్ట్యా RBI ఏర్పడినప్పటినుండి గ్రామీణ వ్యవసాయ పరపతికి విశేష కృషిని జరిపినది. RBI వ్యవసాయదారుల కవసరమైన స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాల పరపతి సదుపాయాలను రాష్ట్ర సహకార బ్యాంకులద్వారా అందిస్తున్నది. ఇంతేకాక వ్యవసాయాభివృద్ధి కార్యకలాపాలకు బ్యాంకులు మంజూరు చేసిన ఋణాలకు సంబందించిన మొత్తాన్ని బ్యాంకులకు తిరిగి అందించటానికి ప్రత్యేకించబడిన వ్యవసాయ పునర్ విత్తాభివృద్ధి కార్పొరేషన్‌కు (Agricultural Refinance Development Corporation - ARDC) ఏర్పాటు చేసినది. ఈ సంస్థ బ్యాంకులు మంజూరు చేసిన కాలపరిమితి రుణాలకు పునర్ విత్త సౌకర్యాన్ని కలుగజేస్తుంది. వ్యవసాయాభివృద్ధిని గ్రామీణాభివృద్ధిగా తీర్చిదిద్దటం కొరకు ప్రభుత్వము విస్తరించబడిన ధ్యేయాలతో ఒకే ఉన్నతస్థాయి సంస్థను స్థాపించదలచినది. ఈ సంస్థ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి కార్యకలాపాలను రూపొందించి ఆ కార్యక్రమాల అమలుతీరును పర్యవేక్షిస్తున్నది. ఈ ప్రయత్నంలో భాగంగా పార్లమెంటు చట్టముద్వారా జూలై 1982 లో జాతీయ బ్యాంకుగా నాబార్డును (National Bank for Agriculture and Rural Development - NABARD) స్థాపించడం జరిగినది.

దీనిని క్లుప్తంగా జాతీయబ్యాంకు అని, నాబార్డ్ అనీ వ్యవహరిస్తారు. ఇలా ఏర్పాటు చేసిన నాబార్డ్ అంతవరకు ARDC నిర్వహిస్తున్న విధులను మరియు వ్యవసాయ కార్యకలాపాల పునర్‌విత్తానికి సంబంధించి RBI నిర్వహించిన విధులను చేపట్టినది. ఈ విధంగా వ్యవసాయ కార్యకలాపాలకు ద్రవ్య సహాయాన్నందించటానికి వ్యవసాయరంగం సమీక్షకు జాతీయ స్థాయిలో పటిష్టమైన ఒక సంస్థ రూపొందినది.

**6.3.2 నాబార్డ్ నిర్వహణ మరియు నిధులు :** నాబార్డ్ నిర్వహణకు ప్రత్యేకించబడిన ఒక బోర్డును ఏర్పాటుచేయటం జరిగినది. ఈ బోర్డుకు RBI ఉపగవర్నరు ఛైర్మన్‌గా ఉంటాడు. కేంద్ర ప్రభుత్వము తమ కేంద్ర బోర్డు డైరక్టర్లు ముగ్గురిని నాబార్డు డైరక్టర్లుగా నియమించును. వీరుగాక మరొక పదిమంది డైరక్టర్లు ఉంటారు. వీరందరూ కూడా కేంద్ర ప్రభుత్వము చేత నియమించబడతారు. వీరిలో ఇద్దరు గ్రామీణ అర్థశాస్త్రము, గ్రామీణాభివృద్ధిలో నిపుణులైనవారుంటారు. మరో ఇద్దరు సహకార బ్యాంకులలో పనిచేసిన అనుభవము ఉన్నవారై ఉంటారు. మరో ఇద్దరు డైరక్టర్లను రాష్ట్ర ప్రభుత్వాధికారులనుండి ముగ్గురిని రిజర్వు బ్యాంకునుండి నియమించటము జరుగును. మరొక డైరక్టరును కూడా కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. డైరక్టర్ల బోర్డుకు అధ్యక్షత వహించటానికి వీరిలో ఒకరిని మేనేజింగ్ డైరక్టరుగా నియమించటం జరుగుతుంది.

నాబార్డును ప్రారంభించినప్పుడు దీనికవసరమైన నిధులను సమకూర్చే బాధ్యతను కేంద్రప్రభుత్వము మరియు రిజర్వు బ్యాంకు సమానంగా తీసుకొన్నది. నాబార్ట్ ఆధీకృత మూలధనము రు. 500 కోట్ల రూపాయలు కాగా చెల్లించిన మూలధనము ప్రారంభంలో రు. 100 కోట్లుగా ఉండేది. ఆ తరువాత ఈ చెల్లించిన రు. 100 కోట్లనుండి రు. 500 కోట్లకు, ఆ తరువాత రు. 2000 కోట్లకు 1999 లో పెంచటము జరిగినది. నాబార్డ్ తనకవసరమైన నిధులను కేంద్రప్రభుత్వమునుండి, ప్రపంచ బ్యాంకునుండి, ఇతర ఆధీకృత ఏజెన్సీలనుండి పొందును. ఇంతేకాక అదనపు నిధులను బాండ్లను జారీ చేయటంద్వారా బహిరంగ మార్కెట్‌నుండి కూడా పొందును. మామూలు సందర్భాలలో వ్యవసాయాభివృద్ధి నిధులన్నీ నాబార్డ్‌కు బదిలీ చేయటము జరుగును. ఇటీవలి కాలములో క్రింది అంశాల కారణాన నాబార్డ్ నిధుల స్థితి ఆకర్షణీయంగా ఉన్నది.

వాణిజ్య బ్యాంకుల గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధుల క్రింద (Rural Infrastructure Development Fund) - (RIDF) వసూలు చేసిన డిపాజిట్లన్నింటినీ నాబార్డ్‌కు తరలించినది.

☆ నాబార్డ్ పన్నులేని బాండ్లను జారీచేసినది.

☆ ప్రయివేటు బ్యాంకుల వద్దనున్న ప్రాధన్యతారంగాల డిపాజిట్లను అంగీకరించినది.

పైన వివరించినట్లుగా చెల్లించిన మూలధనాన్ని పెంచుకొన్నది.

ఈ విధంగా సమకూరిన నిధులేకాక గ్రామీణాభివృద్ధి కొరకు విదేశీ సంస్థలనుండి వచ్చిన నిధులను కూడా నాబార్డ్ కార్యకలాపాలకే కేటాయించటము జరుగుతుంది.

**6.3.3 నాబార్డ్ విధులు :** జాతీయ స్థాయి బ్యాంకైన నాబార్డ్ రెండు జంట విధులను నిర్వహించవలసి ఉన్నది. అవి గ్రామీణ వ్యవసాయభివృద్ధికి సంబంధించి ఉన్నతస్థాయి సంస్థగా మరియు పునర్ విత్త సంస్థగా (Refinancing Institution). ఇది తన అత్యున్నత స్థాయి పదవిని RBI నుండి పొందినది. గతంలో వ్యవసాయ పరపతికి సంబంధించి RBI నిర్వహించే విధులన్నిటినీ నాబార్డ్ నిర్వహిస్తుంది. ఇదే సందర్భములో నాబార్డ్ ARDC విధులను కూడా నిర్వహించును. వ్యవసాయ పునర్‌విత్తాభివృద్ధి కార్పొరేషన్ (ARDC) అన్ని బ్యాంకులు ద్రవ్య సహాయసంస్థలు వ్యవసాయము మరియు గ్రామీణాభివృద్ధి కొరకు ఇచ్చిన పరపతి సౌకర్యానికి పునర్ విత్త సౌకర్యాన్ని కలుగజేసేది. నాబార్డ్ నిర్వహించే విధులను క్రింది విధంగా పేర్కొనవచ్చును.

వ్యవసాయ, గ్రామీణ చిన్న తరహా కుటీర పరిశ్రమలు మరియు గ్రామీణ చేతివృత్తుల వారికిచ్చిన ఉత్పాదక మరియు పెట్టుబడి స్వభావము కలిగిన అన్ని రుణాలకు పునర్ విత్త సదుపాయాన్ని కలుగజేయును.

రాష్ట్ర సహకార బ్యాంకులకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు, భూమి అభివృద్ధి బ్యాంకులకు, ఇతర ద్రవ్య సహాయ సంస్థలకు వివిధ కాలపరిమితి గల రుణాలను మంజూరు చేయును.

సహకార పరపతి సంఘాలకు అవసరమైన వాటా మూలధనాన్ని సమకూర్చటానికి రాష్ట్రప్రభుత్వాలకు 20 సం॥ల వరకు కాలపరిమితి గల దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేయును.

వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి సంబంధముండి కేంద్ర ప్రభుత్వముయొక్క గుర్తింపు పొందిన ఏ సంస్థకైనా దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేయును.

చిన్న తరహా పరిశ్రమలు, గ్రామీణ కుటీర పరిశ్రమలు, అసంఘటిత వ్యవస్థలో ఉన్న చిన్న పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్లానింగ్ కమీషన్, ఇతర జాతీయ రాష్ట్రస్థాయి సంస్థలు నిర్వహిస్తున్న కార్యకలాపాలను సమన్వయపరచును.

RBI ల, ప్రాథమిక సహకార బ్యాంకులు కాకుండా ఉన్న ఇతర సహకార బ్యాంకుల పనితీరును పరీక్షించే బాధ్యత నాబార్డ్‌కున్నది.

వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించిన కార్యక్రమాలను రూపొందించటానికీ, ప్రత్యేక పథకాలను రచన చేయటానికి అవసరమైన పరిశోధనాభివృద్ధి నిధిని నిర్వహించును.

**6.3.4 నాబార్డ్ పనితీరు :** వ్యవసాయ గ్రామీణాభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించి అత్యున్నతస్థాయి సంస్థ అయిన నాబార్డ్ ఇందుకవసరమైన విధానాలను, ప్రణాళికలను రూపొందించటంలో గణనీయమైన కృషిని చేసినది. తనకప్పచెప్పిన విధులను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సమర్థవంతంగా నాబార్డ్ నిర్వహిస్తున్నది. దీని పనితీరు ప్రగతిని క్రింది విధంగా పరిశీలించవచ్చును.

1999-2000 ఆర్థిక సంవత్సరములో బ్యాంకు రేటుకన్నా 3% తక్కువ రేటుకు ఋతుగతమైన వ్యవసాయ కార్యకలాపాలకు రు. 8,160 కోట్ల రూపాయల స్వల్పకాలిక పరపతిని మంజూరు చేసినది;

20 అంశాల కార్యక్రమము అమలులో భాగంగా సమాజములోని బలహీన వర్గాలవారికి పరపతి సౌకర్యాలను కలుగజేసినది.

RBI నెలకొల్పిన విధానాల కొనసాగింపుగా 1999-2000 సం॥లో రాష్ట్ర ప్రభుత్వాలకు రు. 200 కోట్ల మధ్యకాలిక మరియు దీర్ఘకాలిక పరపతి సౌకర్యాలను కలుగజేసినది. ఇదే కాలములో 9 రాష్ట్రాలకు రు. 90 కోట్లమేర దీర్ఘకాల పునర్ విత్త సౌకర్యాన్ని కలుగజేసినది.

వివిధ రకాలైన ప్రాధాన్యతా పథకాలకు ఈ జాతీయ బ్యాంకు మంజూరు చేసిన రుణాలతీరును క్రింద పట్టిక ద్వారా పరిశీలించవచ్చును.

ప్రాజెక్టుల వారీగా నాబార్డ్ అందించిన పునర్ విత్త సహాయము (కోట్ల రూపాయలలో)

| | ప్రాజెక్టు వివరాలు | 1992-93 | 1997-98 |
|---|---|---|---|
| 1. | చిన్ననీటి పారుదల ప్రాజెక్టులు | 560 | 520 |
| 2. | కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ (CAD) | 10 | 60 |
| 3. | IRDP | 650 | 610 |
| 4. | క్షేత్ర యాంత్రికీకరణ | 520 | 1,110 |
| 5. | డైరీ అభివృద్ధి | 100 | 350 |
| 6. | హార్టీ కల్చర్ | 100 | 190 |
| 7. | కోళ్ళ పెంపకము, గొర్రెల పెంపకము | | |
| | పందుల మరియు చేపల పెంపకము | 90 | 230 |
| 8. | బయోగ్యాస్, ఫారెస్ట్రీ మొ॥నవి | 330 | 860 |
| | మొత్తము | 2,360 | 3,930 |

సేకరణ : RBI, Report on Currency and Finance (1997 - 98) Vol. I

☆ పై పట్టికను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు చిన్న నీటి పారుదల ప్రాజెక్టులకు, క్షేత్రీయ యాంత్రికీకరణకు, IRDP ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత నివ్వటము జరిగినది. బలహీన వర్గాల వృత్తులైన కోళ్ళ పెంపకము పందుల పెంపకము కూడా నాబార్డ్ ప్రాధాన్యతలో ఉండటము విశేషము.

☆ నాబార్డ్ తన కార్యకలాపాలను కేవలము పునర్విత్తానికి మాత్రమే పరిమితము చేయకుండా గ్రామీణాభివృద్ధి కవసరమయ్యే ఇతర చర్యలను కూడా చేపట్టినది.

☆ సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకము (IRDP) పనితీరును సమీక్షించటానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినది.

☆ ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ఒక సమన్వయ కేంద్రాన్ని అభివృద్ధి చేసినది.

- ☆ సహకార పరపతి పంపిణీలోగల అవరోధాల అధ్యయనానికి ప్రత్యేక బృందాలను నియమించినది.
- ☆ వివిధ రకాల వడ్డీరేట్లను రేషనలైజేషన్ చేసినది.
- ☆ వ్యవసాయేతర యూనిట్ల ఆధునీకీకరణకు, పునర్వ్యవస్థీకరణకు అవసరమైన పథకాలను రూపొందించినది.
- ☆ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల పరపతి పంపిణీలపై ఒక కమిటీని నియమించినది.
- ☆ సహకార బ్యాంకులు మరియు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పనితీరు మెరుగుపరచటానికి మార్గదర్శక సూత్రాలను రూపొందించినది.
- ☆ గ్రామప్రాంతాలలో మౌలిక వనరుల అభివృద్ధికి జరుగుచున్న కృషి ఆశించిన స్థాయిలో లేకపోవటమనేది ప్రభుత్వాన్ని బాధించిన దశలో నాబార్డ్ ఈ బాధ్యతను కూడా చేపట్టి RIDF గ్రామీణ మౌలిక వనరుల అభివృద్ధి నిధిని సక్రమముగా వినియోగించినది.

**6.3.5 నాబార్డ్ పనితీరుపై విమర్శలు - సలహాలు :** నాబార్డును ఏర్పాటు చేసినప్పటినుండి గ్రామీణాభివృద్ధికి నాబార్డ్ గణనీయమైన కృషి చేసినప్పటికీ రాష్ట్ర సహకార బ్యాంకులు, భూమి అభివృద్ధి బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు నిర్వహించే బాధ్యతను నాబార్డ్ తీసికొనటము జరిగినది. ఇలా తీసుకున్న బాధ్యతల పనితీరు సహకార బ్యాంకుల పనితీరును పరిశీలించినప్పుడు సక్రమముగా లేనట్లుగా కనపడుతున్నది. నాబార్డ్ అందజేసే పరపతి సౌకర్యాలను వినియోగించుకోవటంలో సహకార సంస్థలకు కొన్ని సమస్యలు ఎదురగుచున్నవి. ఈ సమస్యలు, వాటి పరిష్కారానికి సూచనలు క్రింది విధంగానున్నవి.

నాబార్డ్ పరపతి సౌకర్యాలను నిర్ణయించుకోవటంలో దూరం ఎక్కువగుచున్న దృష్ట్యా ప్రతి రాష్ట్ర సహకార బ్యాంకులో నాబార్డు యొక్క ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. అదేవిధంగా జిల్లా కేంద్రాలలో కూడా నాబార్డ్ సేవలకు అందుబాటులో ఉంచాలి.

నాబార్డ్ కార్యకలాపాలను అమలుచేసే వారికి గ్రామీణ వాతావరణంతోను, సహకార భావనతోను పరిచయం లేకపోవటంవలన పనిసామర్థ్యము దెబ్బతింటున్నది. ఈ కారణాన వ్యవసాయ శాస్త్రములోగానీ, ఆర్థిక శాస్త్రములోగానీ, సహకార విషయాంశముపై గానీ నిపుణతకల్గిన వారిని కార్యక్రమాల అమలుకు నియమించాలి. ఇలా చేసేటప్పుడు సహకార బ్యాంకులలో పనిచేసేవారికి ప్రాధాన్యత ఇవ్వాలి.

సమీకృత గ్రామీణాభివృద్ధి పథకము, ఇరవై అంశాల కార్యక్రమాన్ని అమలు చేయటానికి వివిధ శాఖలతో సమన్వయాన్ని కొనసాగించటంలో కొన్ని ఇబ్బందులు తలయెత్తుచున్నవి. ఈ ఇబ్బందులను పరిష్కరించటానికి పటిష్టమైన కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటుచేయాలి.

నాబార్డునుంచి అందే రీఫైనాన్స్‌ను రాష్ట్ర సహకార బ్యాంకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, ప్రాథమిక సహకార బ్యాంకుల ద్వారా రైతులకు అందవలసి యున్నది. ఈ పరిస్థితులలో రైతులు అధికశాతం వడ్డీని చెల్లించవలసియున్నది. ఈ సమస్యను పరిష్కరించటానికి నాబార్డ్ ప్రాథమిక సహకార సంఘాలకు నేరుగా నిధులనందించాలి.

పై లోపాలను, సూచనలను దృష్టిలోనుంచుకుంటే నాబార్డ్ పనితీరు ఇంకా మెరుగుపడగలదు.

**6.4 పదకోశము :**

P.A. C.S. - Primary Agricultural Co-operative Societies

D.C.C.B.s - District Central Co-operative Banks

సింగిల్ విండో విధానము - ఒకేచోట అన్ని రకాల పరపతి సౌకర్యాలు లభించే విధానము.

N.C.D.C - National Co-operative Development Corporation

Dr. హజారీ కమీషన్ - సింగిల్ విండో విధానానికి ప్రాతిపదిక

NABARD - National Bank for Agriculture and Rural Development

ARDC - Agriculture Refinance Development Corporation

RIDF - Rural Infrastructure Development Fund

IRDP - Integrated Rural Development Programme

## 6.5 స్వయం మదింపు ప్రశ్నలు

### 5 మార్కుల ప్రశ్నలు

1. సహకారోద్యమము
2. సింగిల్ విండో విధానము
3. R.I.D.F
4. A.R.D.C
5. Dr. హజారీ కమీషన్
6. I.R.D.P

### 10 మార్కుల ప్రశ్నలు

1. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు
2. సింగిల్ విండో విధానము
3. సహకార బ్యాంకుల ప్రయోజనాలు, లోపాలు
4. నాబార్డు విధులు
5. నాబార్డు పనితీరు

### 20 మార్కుల ప్రశ్నలు

1. గ్రామీణ పరపతిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పాత్రను వివరించండి.
2. సహకార సంస్థల అభివృద్దే దేశ ఆర్థికాభివృద్ధి - వివరించండి
3. నాబార్డు ఏర్పాటు, నాబార్డు పనితీరు గురించి వివరించండి.

## 6.6 సిఫారసు చేసిన పుస్తకాలు

1. Indian Economy - Ruddan Datt & KPM Sundaram
2. తెలుగు అకాడమీ
3. Banking and Financial Systems - Mithani & Gordon
4. బాంకింగ్ సిద్ధాంతం, ద్రవ్య వ్యవస్థలు -K. Anjaneyulu, K. Lalitha, M. Prabhakar Reddy

**Dr. C.V. Brahma Chary**

పాఠం - 7

# ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

(Regional Rural Banks)

**లక్ష్యాలు :** ఈ పాఠంలో ఈ దిగువ అంశాలను నేర్చుకుంటాం

* ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆవిర్భావాన్ని తెలుసుకోవటం
* ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల మూలధనం, నిర్వహణ, పరపతి విధానం గూర్చి చర్చించడం
* ఈ బ్యాంకులు సాధించిన ప్రగతిని, సమస్యలను తెలుసుకోవడం
* ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ప్రస్తుత స్థితిని మదింపు చేయడం

**విషయ క్రమం**


7.1 ఆవిర్భావం

7.2 నరసింహం కమిటీ

7.3 ఉద్దేశ్యాలు

7.4 బ్యాంకుల ఏర్పాటు

7.5 మూలధనం, ఇతర వనరులు

7.6 నిర్వహణ

7.7 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు, షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులకు మధ్య గల వ్యత్యాసాలు

7.8 పరపతి విధానం

7.9 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధించిన ప్రగతి

7.10 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల సమస్యలు

7.11 గ్రామీణ బ్యాంకులను పటిష్టం చేయటానికి తీసుకోవలసిన చర్యలు

7.12 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు - ప్రస్తుత పరిస్థితి

7.13 సారాంశం

7.14 స్వీయ మదింపు ప్రశ్నలు

7.15 పదకోశం

7.16 చదువదగిన గ్రంథాలు


## 7.1 ఆవిర్భావం :

మన దేశ ఆర్థిక ప్రగతి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఆధారపడి ఉన్నది. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ముఖ్యంగా వ్యవసాయం, చేతివృత్తులు మొదలైన వాటిపై ఆధారపడి జీవిస్తున్నారు. దేశం ఆర్థికంగా ముందంజ వేయాలంటే, ఈ గ్రామ ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. ఇందుకోసం సహకార బ్యాంకులను ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా బ్యాంకుల జాతీయకరణ తరువాత వాణిజ్య బ్యాంకులు ప్రత్యేకంగా గ్రామీణాభివృద్ధికి కృషి చేయాలని నిర్దేశించడం జరిగింది. ఆ కృషిలో భాగంగానే వ్యవసాయం, తత్సంబంధిత

రంగాలను ప్రాధాన్యత రంగాలుగా గుర్తించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పరపతి అవసరాలను సహకార సంస్థలు, వాణిజ్యబ్యాంకులు, రైతు సేవా సంఘాలు చాలా వరకు తీర్చగలుగుతున్నప్పటికి, గ్రామ ప్రాంతాల్లో పరిశ్రమలు, వృత్తులు అభివృద్ధికి అవసరమయ్యే ఆర్థిక సహాయం ఈ సంస్థల నుండి లభించటం లేదు. గ్రామీణ పరపతి రంగంలో ఏర్పడిన ఈ అగాధాన్ని పూరించటానికి గ్రామీణ పరపతి సంస్థలను అభివృద్ధి చేయటంలో ప్రభుత్వం బహుళ ఏజెన్సీ విధానాన్ని అనుసరించటం ప్రారంభించినది. ఫలితంగానే గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేయటం జరిగింది.

## 7.2 నరసింహం కమిటీ :

గ్రామీణ బ్యాంకుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనను మొట్టమొదటిసారిగా 1972 లో బ్యాంకింగ్ కమీషన్ తన నివేదికలో పేర్కొన్నది. 1975 లో ప్రభుత్వం ప్రకటించిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం క్రింద గ్రామీణబ్యాంకుల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ పరపతి అవసరాలను తీర్చటంలో ప్రభుత్వరంగ బ్యాంకులకు సహాయబ్యాంకులుగా పనిచేసే ఈ గ్రామీణ బ్యాంకుల ఏర్పాటులో ఎదురయ్యే సమస్యలను సమగ్రంగా పరిశీలించటానికై భారత ప్రభుత్వం శ్రీ యం. నరసింహం అధ్యక్షతన గ్రామీణ బ్యాంకులపై వర్కింగ్‌గ్రూపును ఏర్పాటు చేసింది. ఈ వర్కింగ్ గ్రూప్ తన నివేదికను జూలై 30, 1975 నాడు సమర్పించింది.

వర్కింగ్ గ్రూపు సూచనలమేరకు ఆర్డినెన్సు ద్వారా అక్టోబరు 2, 1975 న ప్రథమంగా 5 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను స్థాపించడం జరిగింది. ఆ తరువాత 1976 లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల చట్టాన్ని చేయటం జరిగింది. ప్రథమంగా 5 బ్యాంకులతో స్థాపించబడిన ఈ బ్యాంకుల సంఖ్య మార్చి 30, 1995 నాటికి 196 కి చేరింది. అదే కాలానికి దేశంలోని 417 జిల్లాలలో ఈ బ్యాంకులు 14,536 బ్రాంచీలను కలిగి ఉన్నవి.

## 7.3 ఉద్దేశ్యాలు :

1) గ్రామీణ ప్రజలకు ముఖ్యంగా చిన్న, సన్నకారురైతులు, వ్యవసాయకూలీలు, చేతిపనివారికి సకాలంలో సులభషరతులపై పరపతి, ఇంకాఇతర సౌకర్యాలను సమకూర్చి, సమగ్ర గ్రామీణాభివృద్ధికి తోడ్పడడం.

2) గ్రామీణ ప్రజలను వడ్డీ వ్యాపారస్తుల కబంధ హస్తాల నుండి విడిపించడం

3) ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ప్రజల అభ్యున్నతికి కృషి చేయడం

4) ఉద్యోగావకాశాలను సమకూర్చడం, గ్రామీణ పరిశ్రమల వ్యవస్థాపనను ప్రోత్సహించడం.

5) వ్యవసాయంతోపాటు వాణిజ్యం, పరిశ్రమలు, చేతివృత్తులు మొదలయిన అన్ని రంగాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయటం.

6) సహకార బ్యాంకింగ్ సూత్రాల మేలు కలయికతో ఋణనిర్వహణ వ్యవస్థను తయారుచేయడం.

7) వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌లో వ్యవసాయదారుడికి సహాయాన్ని అందించటం.

8) గ్రామీణ ప్రాంతాలలో గోడౌన్ల నిర్మాణానికి సహాయం చేయటం.

## 7.4 బ్యాంకుల ఏర్పాటు :

ప్రతీ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకును ఒక షెడ్యూల్డ్ వాణిజ్యబ్యాంకు, ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకు ఏర్పాటు చేస్తుంది. బ్యాంకు స్థాపనకు కావలసిన లైసెన్స్‌ను సంపాదించటమే కాకుండా, మూలధనాన్ని, సిబ్బందిని, ఇతర వనరులను వాణిజ్య బ్యాంక్ సమకూరుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే గ్రామీణ బ్యాంకుల స్థాపన బాధ్యత వాణిజ్య బ్యాంకులపై, ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులపై ఉన్నది. ప్రస్తుతం ఉన్న 196 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను 27 వాణిజ్య బ్యాంకులు, 1 రాష్ట్ర సహకార బ్యాంకు ఏర్పాటుచేసినవి.

## 7.5 మూలధనం, ఇతర వనరులు :

గ్రామీణ బ్యాంకుల చట్టాన్ననుసరించి, గ్రామీణ బ్యాంకుల అధీకృత మూలధనం ఒక కోటి రూపాయలు. అందులో 50 శాతం కేంద్ర ప్రభుత్వం, 15 శాతం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, మిగిలిన 35 శాతం వ్యవస్థాపన లేదా ప్రాధికార బ్యాంకు (Sponsoring Bank) సమకూర్చుతుంది. రిజర్వుబ్యాంకు అనుమతితో జారీచేసిన మూలధనాన్ని పెంచుకునే అవకాశం గ్రామీణ బ్యాంకులకు ఉన్నది. గ్రామీణ బ్యాంకులు డిపాజిట్లను స్వీకరించవచ్చును. అవి తాము అందచేసిన ఋణాల వివరాలను సమర్పించి "నాబార్డు" (NABARD) నుండి రీ-ఫైనాన్స్ సౌకర్యం పొందవచ్చును.

## 7.6 నిర్వహణ :

ప్రతీ బ్యాంకు నిర్వహణకు 9 మంది సభ్యులు గల డైరెక్టర్ల బోర్డు ఉంటుంది. ఇందులో 6 గురు కేంద్ర ప్రభుత్వం చేత, ఇద్దరు వ్యవస్థాపిత వాణిజ్య బ్యాంకు చేత, ఒకరు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం చేత నియమింపబడతారు. బోర్డు సభ్యుల సంఖ్యను 15 వరకు పెంచటానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉన్నది. ఈ బోర్డు కేంద్ర ప్రభుత్వ ఆజ్ఞలకు లోబడి, రిజర్వుబ్యాంకు సలహాలతో తమ విధి నిర్వహణ చేయవలసి ఉంటుంది.

## 7.7 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు, షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకులకు మధ్యగల వ్యత్యాసాలు :

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మౌలికంగా, వాణిజ్య బ్యాంకుల లాంటివే. అయినప్పటికి వీటికి వాణిజ్య బ్యాంకులకు ఈ క్రింది తేడాలు వున్నాయి. అవి :

1. ఆదాయపు పన్నుచట్టం 1961 కి సంబంధించిన వరకు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు సహకారం సంఘంగా మాత్రమే గుర్తించబడుతుంది. వాణిజ్య బ్యాంకు బ్యాంకింగ్ కంపెనీగా గుర్తించబడతాయి.
2. గ్రామీణ బ్యాంకుల కార్యకలాపాలు ఒక నిర్దిష్టమైన ప్రాంతానికి, అంటే ఒకటి లేదా రెండు జిల్లాలకు, మాత్రమే పరిమితమవుతాయి. వాణిజ్య బ్యాంకుల కార్యకలాపాలు అన్ని ప్రాంతాలకు విస్తరించి ఉంటాయి.
3. గ్రామీణ బ్యాంకులు కేవలం సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ చేతివృత్తుల పనివారు, చిన్నవర్తకులు వంటి వ్యక్తులకు మాత్రమే ఋణాలు, అడ్వాన్సులను మంజూరు చేస్తాయి. వాణిజ్య బ్యాంకులు వర్తకులు, పారిశ్రామిక వర్గాలకు కూడా పరపతిని అందిస్తాయి.
4. గ్రామీణ బ్యాంకులు వాణిజ్య బ్యాంకుల కన్నా 1/2 శాతం ఎక్కువ వడ్డీని తమ డిపాజిట్‌లపై చెల్లిస్తాయి.
5. గ్రామీణ బ్యాంకులు సంబంధిత రాష్ట్రాలలో సహకార బ్యాంకులు విధించే వడ్డీరేటును అనుసరిస్తాయి. వాణిజ్య బ్యాంకుల వడ్డీరేట్లు, ఇతర బ్యాంకుల వడ్డీరేట్లు, రిజర్వు బ్యాంకు నిబంధనలననుసరించి ఉంటాయి.
6. గ్రామీణ బ్యాంకుల శాఖల సంఖ్య 100 దాటినప్పుడు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతిని పొందాల్సి ఉంటుంది. ఇది వాణిజ్య బ్యాంకులకు అవసరం లేదు.
7. గ్రామీణ బ్యాంకులు కేవలం షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకుల సౌజన్యంతో మాత్రమే పనిచేస్తాయి.

## 7.8 పరపతి విధానం :

గ్రామీణ బ్యాంకుల పరపతి విధానాన్ని సులభతరం చేయటం జరిగింది. అప్పు తీసుకునే వ్యక్తి "నో ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్" ను బ్యాంకుకు సమర్పించవలసిన పనిలేదు. ఆస్తి తాకట్టు పెట్టడానికి, దస్తావేజులను డిపాజిట్ చేయటానికి కూడా లాంఛనాలు తగ్గించినారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న స్టాంపుడ్యూటీ లేదు.

## 7.9 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధించిన ప్రగతి :

1. **శాఖల విస్తరణ :** గ్రామీణ పరపతి వ్యవస్థను పటిష్టవంతం చేయడానికై ప్రారంభించబడిన ఈ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఎంతో ప్రగతిని సాధించాయి. 1975 లో కేవలం 5 బ్యాంకులతో ప్రారంభమైన ఈ వ్యవస్థ ప్రస్తుతం 196 బ్యాంకులతో 23 రాష్ట్రాలకు విస్తరించి ఉంది. మార్చి 31,2002 నాటికి ఈ బ్యాంకులన్నింటికి కలిపి 14,473 శాఖలు ఉన్నవి. ఈ శాఖలు దేశంలోని 417 జిల్లాలలో కలవు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల శాఖలలో దాదాపు 55 శాతం ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి.

2. **డిపాజిట్ల సేకరణ :** గ్రామీణ ప్రాంతాలలో ఈ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులే సంతృప్తికరంగా డిపాజిట్లను సేకరించగలుగుతున్నాయి. నిజానికి గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక సహకార సంఘాలకంటే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులే డిపాజిట్ల సేకరణలో అద్భుత విజయాన్ని సాధించాయి. 1975 లో 5 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల డిపాజిట్లు రూ.20 లక్షలు కాగా, 2002 మార్చి నాటికి ఈ బ్యాంకుల డిపాజిట్లు రూ. 43,220 కోట్లకు చేరుకున్నాయి.

3. **అడ్వాన్సులు :** డిపాజిట్లలో పెరుగుదల కారణంగా ఋణాలలో కూడా గణనీయమైన పెరుగుదల ఉంది. 1975 లో మంజూరు చేసిన అడ్వాన్స్‌లు రూ.10 లక్షలు కాగా 2002 మార్చి నాటికి అవి రూ.18,373 కోట్లకు పెరిగినాయి. ఈ అడ్వాన్సులలో అధికశాతం వ్యవసాయం. వ్యవసాయ అనుబంధ పనులకు, చిన్నపరిశ్రమలు, స్వయంఉపాధి కార్యక్రమాలకు మంజూరు చేయడం జరిగింది.

4. **స్వయం ఉపాధి కల్పనకు ప్రోత్సాహం :** స్వయం ఉపాధికల్పనకు గ్రామీణ బ్యాంకులు విశేషమైన ప్రాధాన్యత ఇస్తున్నాయి. సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం ద్వారా (Integrated Rural Development Programme) లబ్ధిపొందే గ్రామీణ యువతకు ఈ బ్యాంకులు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి.

5. **స్థానికులకు ఉద్యోగావకాశాల కల్పన :** స్థానికంగా ఉద్యోగవకాశాలను పెంపొందించటంలో గ్రామీణ బ్యాంకులు శ్రద్ధ తీసుకుంటున్నాయి. బ్యాంకులో పనిచేసే చాలామంది సిబ్బందిని ఆయా ప్రాంతాలనుండి ఎంపిక చేసుకుంటున్నాయి. ముఖ్యంగా క్రింది స్థాయి ఉద్యోగులు ఆ ప్రాంతాలకు చెందిన వారై ఉండేటట్లు ఏర్పాటు చేయడం వలన గ్రామీణ బ్యాంకులు గ్రామప్రజలకు మరింత చేరువ అవటానికి మార్గం ఏర్పడింది.

6. **వ్యవహారాల ఖర్చులో ఆదర్శం:** నిర్వహణా ఖర్చుల విషయంలో గ్రామీణ బ్యాంకులు మిగిలిన బ్యాంకులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. దేశంలోని వాణిజ్యబ్యాంకులు సాధారణంగా ఒక శాఖను నిర్వహించటానికి దాదాపు ఒక లక్ష రూపాయలు ఖర్చు చేయవలసి ఉండగా, గ్రామీణ బ్యాంకు శాఖను నిర్వహించటానికి అందులో సగం మాత్రమే ఖర్చు అవుతున్నది.

7. **బలహీనవర్గాలపై కేంద్రీకరణ:** బలహీనవర్గాలపై దృష్టిని కేంద్రీకరించడం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధించిన మరొక విజయం. నిజానికి ఈ బ్యాంకులు అందజేసిన అడ్వాన్సులలో 92 శాతం వరకు బలహీన వర్గాలకు, అంగవైకల్యం గల వారికి లభించాయి. అంతేగాక, సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకాల అమలుకోసం గ్రామీణ బ్యాంకులు ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నాయి. వాస్తవంగా గ్రామీణ బ్యాంకులు గ్రామప్రజలకు ఒక వరప్రసాదం వంటివి. ప్రాంతీయ గ్రామీణబ్యాంకులు "చిన్నతరహా బ్యాంకులు"గా వాటి ఉనికిని సార్థకం చేసుకున్నాయి.

## 7.10. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల సమస్యలు:

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ప్రారంభించిన రెండు దశాబ్దాల తరువాత సవాళ్ళతో కూడిన అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఆ సమస్యలను క్రింది విధంగా పేర్కొనవచ్చును.

1. **స్థాపనలో ప్రాంతీయ అసమానత:** చాలా సందర్భాలలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల శాఖలను బ్యాంకింగ్ సదుపాయాలు లేని అభివృద్ధి చెందని ప్రాంతాలకు బదులు, ఇతర ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విధంగా బ్యాంకుల స్థాపనలో సమన్వయం లోపించింది. ఉదా: భారతదేశ ఈశాన్య ప్రాంతంలో అతి తక్కువ గ్రామీణ బ్యాంకులు నెలకొల్పబడగా, దక్షిణాది రాష్ట్రాలలో ఈ బ్యాంకులు మంచి పురోభివృద్ధిని సాధించాయి. ఈ అసమానతలు, అసంతృప్తిని తొలగించటానికి చిత్తశుద్ధితో వ్యవహరించవలసి ఉన్నది.

2. **పెరుగుతున్న నష్టాలు:** గ్రామీణ బ్యాంకులు అనేకవిధాలుగా ఎంతో సంతృప్తికరంగా పనిచేసినా, ఇవి విపరీతమైన నష్టాలలో నడుస్తున్నాయి. ఈ నష్టాలు సంవత్సర సంవత్సరానికి పెరుగుతూనే ఉన్నాయి. ఈ నష్టావ వల్ల గ్రామీణ బ్యాంకుల ఆర్థికస్థోమత దెబ్బతింది.

3. **డిపాజిట్ల సేకరణలో నిరాశనజకంగా ఉన్న ప్రగతి:** ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు పరపతి సౌకార్యాన్ని పేదప్రజలకు మాత్రమే అందించగలుగుతున్నందు వల్ల ఈ బ్యాంకులు ధనికవర్గాలనుండి డిపాజిట్లను సేకరించలేకపోతున్నాయి. అంతేగాక, రాష్ట్రప్రభుత్వాలు, స్థానికసంస్థలు మరియు ఏజెన్సీలు ఈ గ్రామీణ బ్యాంకులలో డిపాజిట్ల నిర్వహణకు సుముఖంగా లేకపోవటం వలన కూడా డిపాజిట్ల సేకరణలో ఆశించినంత ప్రగతిని సాధించలేక పోతున్నాయి.

4. **శిక్షణలేని సిబ్బంది:** గ్రామీణ బ్యాంకులలో పనిచేసే సిబ్బందిలో నైపుణ్యాత, దక్షత లోపిస్తున్నాయి. సిబ్బందిలో చాలామంది పట్టణ ప్రాంతాలకు చెందిన వారై ఉండటం వలన గ్రామీణ వాతావరణంలో పనిచేయటానికి ఇష్టపడటం లేదు. అంతేగాక గ్రామీణ బ్యాంకులలో పనిచేసే సిబ్బంది వేతనాలు, భత్యాలు, వాణిజ్య బ్యాంకులలో పనిచేసే సిబ్బందికన్నా తక్కువ. సిబ్బందికి పదోన్నతి అవకాశాలు చాలా పరిమితం. అందువలన సిబ్బందిలో నిరాశ, నిస్పృహ నెలకొనివున్నాయి. తత్ఫలితంగా నిర్వహణ సామర్థ్యం కుంటుపడింది.

5. **ఋణభారం:** ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో గడువు మీరిన ఋణాలు ఎక్కువగా పేరుకునిపోయాయి. 1999 డిసెంబరు 31 నాటికి దాదాపు రూ.1,580 కోట్ల బకాయిలు ఉన్నది. ఈ బకాయిల వలన గ్రామీణ బ్యాంకులు ఎక్కువగా ఋణాలను మంజూరు చేయలేని స్థితిలోవున్నాయి. క్షేత్ర సిబ్బందిని పెంచి, అదనపు కృషి జరిపినప్పటికి ఋణాల వసూళ్ళు చాలా తక్కువ మొత్తంలో ఉన్నాయి. ఈ సమస్యపట్ల సంబంధిత వాణిజ్య బ్యాంకులు, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకొనక పోయినట్లయితే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ముఖ్యలక్ష్యం దెబ్బతినే అవకాశమున్నది.

6. **ఋణాల మంజూరీలో జాప్యం:** అనేక కారణాల వలన ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల నుండి ఋణాల మంజూరీలో అనవసరమైన కాలయాపన జరుగుచున్నది. ఋణమంజూరీ విధానం సంక్లిష్టంగా ఉందనే అభిప్రాయం గ్రామీణులలో ఉన్నది. అనవసరమైన కాలయాపనను నివారించటం ఋణమంజూరీ విధానాన్ని సరళతరం చేయటం ద్వారా గ్రామీణ బ్యాంకులు మరింత నాణ్యమైన సేవలను అందజేయగలవనటంలో సందేహం లేదు.

## 7.11. గ్రామీణ బ్యాంకులను పటిష్టం చేయటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు:

గ్రామీణ ప్రాంతాల సత్వరాభివృద్ధికి ఏర్పాటు కాబడిన గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టం చేయవలసిన అవసరముంది. 1977 లో నియమించబడిన ఆచార్య ఎం.ఎల్. దంతవాల కమిటీ గ్రామీణ బ్యాంకుల ప్రాధాన్యతను గుర్తించి, అవి ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించటానికి ఎన్నో సూచనలు చేసింది. అదేవిధంగా 1986 లో రిజర్వు బ్యాంక్‌చే నియమించబడిన ఎన్.ఎం. కెల్కార్ కమిటీ గ్రామీణ బ్యాంకుల నిర్వహణా సామర్థ్యాన్ని పెంపొందించటానికి అనేక సూచనలు చేసింది. వీటిలో ముఖ్యమైన వాటిని క్రింది విధంగా పేర్కొనవచ్చును.

1. **శాఖల సర్దుబాటు:** నిర్వహణ సామర్థ్యం పెంపొందించుకోవటానికి గ్రామీణ బ్యాంకులు తమశాఖల విషయంలో శ్రద్ధ వహించాలి. పెద్దశాఖల విషయంలో శ్రద్ధవహించాలి. పెద్దశాఖలను విభజించటం, నిర్వహణకు అనువుగాలేని, నష్టాలతో నడుస్తున్న శాఖలను సంలీనం చేయటం గ్రామీణ బ్యాంకులు చేపట్టాలి.

2. **నష్టాల తగ్గింపుకు చర్యలు:** గ్రామీణ బ్యాంకుల నష్టాలను తగ్గించటానికి కెల్కార్ కమిటీ అనేక సూచనలు చేసింది. ఋణాల మంజూరీ ప్రాధికార బ్యాంకుల (Sponsor Banks) పాత్రను తగ్గించటం, ద్రవ్యత్వపు రిజర్వు నిధులను ఎక్కువ వడ్డీవచ్చే ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టడం, ఎక్కువ లాభాలు వచ్చే విధంగా ఋణాలను సర్దుబాటు చేసుకోవడం మొదలైనవి గ్రామీణ బ్యాంకుల లాభదాయకతను మెరుగుపరచటానికి కమిటీ చేసిన సూచనలు.

3. **బకాయిల వసూలు:** ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ప్రధానంగా పీడిస్తున్న సమస్య గడువుతీరిన ఋణాలు. వీటిని వసూలు చేయటం కోసం సత్వర ప్రయత్నాలు జరగాలి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తన యంత్రాంగం ద్వారా తగిన సహాయాన్ని గ్రామీణ బ్యాంకులకు అందించాలి. బకాయిల వసూలు సక్రమంగాలేని పక్షంలో గ్రామీణ బ్యాంకులు తమ మనుగడను కోల్పోయే అవకాశమున్నది.

4. **సిబ్బంది విషయంలో శ్రద్ధ:** సిబ్బంది నియామకంలో, శిక్షణలో గ్రామీణ బ్యాంకులు తగిన శ్రద్ధ వహించాలి. నిజానికి గ్రామీణ ప్రాంతాలలోని వాతావరణం, వారి సమస్యలు మిగిలిన ప్రాంతాల కంటే భిన్నంగా ఉంటాయి. కాబట్టి ఈ విషయాలపై అవగాహన, పరిజ్ఞానం ఉన్న సుశిక్షితులైన సిబ్బంది అవసరం ఎంతగానో ఉంటుంది. అంతేగాక సిబ్బందిలో చోటు చేసుకున్న నిరాశ, నిస్పృహలను దూరం చేయటానికి వారికి అదే బ్యాంకులోగాని, ప్రాధికార బ్యాంకులోగాని పదోన్నతి అవకాశాలు కల్పించవలెను.

5. **ప్రాధికార బ్యాంకుల పాత్ర:** ప్రతీ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకును ఒక వాణిజ్య బ్యాంకు ఏర్పాటుచేస్తుంది. అందువలన వాటి పనితీరును మెరుగుపరచటంలో, నిర్దేశిత లక్ష్యాలను సాధించటంలో ప్రాధికార బ్యాంకు కీలకపాత్ర వహించవలసి ఉంటుంది. వాణిజ్య బ్యాంకులు ముందుగా నిర్ణయించిన కాలప్రాతిపదికపై ఎప్పటికప్పుడు గ్రామీణ బ్యాంకుల పనితీరును సమీక్షించి, లోపాలను సరిదిద్దటానికి తగిన సూచనలు, సలహాలు అందజేస్తే సమస్యలు చాలావరకు తగ్గిపోతాయి.

6. **కొత్త శాఖల ఏర్పాటులో మినహాయింపులు:** ఏదైనా ఒక ప్రాంతంలో గ్రామీణ బ్యాంకును ఏర్పాటుచేసిన తరువాత, అది తగిన సంఖ్యలో శాఖలను ఏర్పాటు చేసుకొనే అవకాశాన్ని కల్పించవలెను. ఈ విషయంలో రిజర్వు బ్యాంకు గ్రామీణ బ్యాంకులకు కొంత మినహాయింపు ఇవ్వవలెను.

7. ప్రభుత్వం, ప్రభుత్వసంస్థల బాధ్యత: గ్రామీణ బ్యాంకుల సామర్థ్యాన్ని పెంచటంలో కేంద్రప్రభుత్వం, RBI, సంబంధింత రాష్ట్రప్రభుత్వం, నాబార్డ్ (NABARD) తమ వంతు కృషిని నిర్వహించాలి. గ్రామీణ బ్యాంకుల కార్యకలాపాలను సమీక్షించటంలోను, విధాన నిర్ణయాలు చేయడంలోను, వాటిపై ఆంక్షలు విధించటంలోను, రాయితీలు కల్పించడంలోను పై సంస్థలు కీలకపాత్ర వహిస్తాయి. ఈ విధంగా ఎవరివంతు కృషిని వారు నెరవేర్చినపుడు గ్రామీణ బ్యాంకులు అనుకున్న లక్ష్యాలను సాధించి గ్రామప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయగలుగుతాయి.

## 7.12. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు - ప్రస్తుత పరిస్థితి:

ప్రస్తుతం గ్రామీణ బ్యాంకుల స్థితి చాల నిరాశాజనకంగా ఉంది. డిపాజిట్లపై అధిక వడ్డీ, ఋణాలు తక్కువవడ్డీకి ఇవ్వవలసిరావడం వల్ల, గ్రామీణ బ్యాంకుల లాభాల స్థితి ఏమీ బాగోలేదు. ఇచ్చిన ఋణాలు తిరిగి వసూలు చేసుకొనక లేకపోవడం బ్యాంకుల స్థితిని మరింత దిగజారుస్తున్నది. గ్రామీణ బ్యాంకులను స్పాన్సర్ చేసిన వాణిజ్య బ్యాంకులు కూడా వాటిపై ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదు. సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులతో కలిసి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, గ్రామీణ పరపతి రంగంలో బహుళ ఏజెన్సీ (Multi-Agency) విధానానికి ప్రతీకలు. కేంద్ర ఆర్థికశాఖ గ్రామీణ బ్యాంకులను పటిష్టం చేయటానికి పలుచర్యలు చేపట్టినది. బంగ్లాదేశ్‌లోని గ్రామీణ బ్యాంకులవలె బ్యాంకులను ఏర్పాటు చేయవలెనని కూడా ప్రభుత్వం యోచిస్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో గ్రామీణ బ్యాంకులు విరివిగా శాఖలను ప్రారంభించి, నిర్వహణా సామర్థ్యాన్ని పెంపొందించుకుని గ్రామసీమల సౌభాగ్యాన్ని పెంపొందించడానికి సేవలు అందిస్తాయని ఆశించవచ్చు. గ్రామీణ ప్రజలు సహకరించి వీటిని విజయవంతం చేయగలరని ఆశిద్దాము.

### 7.13. సారాంశం (Summary):

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మనదేశ ఆర్థిక ప్రగతికి నిదర్శనము. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక అవసరాలను తీర్చటానికై నెలకొల్పబడిన నూతన పరపతి వ్యవస్థ (Credit Agency) ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు. 1975 లో 5 బ్యాంకులతో ప్రారంభమయిన ఈ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు నేడు దేశంలోని 23 రాష్ట్రాలలో అనేక వేల శాఖల ద్వారా గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. డిపాజిట్ల సేకరణ, ఋణాల మంజూరీ, బలహీనవర్గాల వారికి చేయూత, స్వయంఉపాధి కల్పనావకాశాలకు సహకారం మొ॥ అంశాలలో తమదైన శైలిని ప్రదర్శిస్తూ గ్రామీణ ప్రాంతాలలో సర్వతోముఖాభివృద్ధికి ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు కృషి చేస్తున్నవి. సవాళ్ళతో కూడిన అనేక సమస్యలను అధిగమిస్తూ, గ్రామీణ పరపతిరంగంలో నూతన ఒరవడులను సృష్టిస్తున్న ఈ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ప్రజలకు మరింత చేరువవుతాయని ఆశిద్దాం.

### 7.14. స్వయం మదింపు ప్రశ్నలు

5 మార్కుల ప్రశ్నలు

1. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆవిర్భావం గురించి వ్రాయుము.
2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ధ్యేయాలేమిటి?

10 మార్కుల ప్రశ్నలు

1. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల మూలధన వనరులను తెలియచేయండి.
2. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల గూర్చి కెల్కర్ కమిటీ సూచనలేమిటి?

20 మార్కుల ప్రశ్నలు

1. ప్రాంతీయ గ్రామీణాభివృద్ధి బ్యాంకుల ఆవశ్యకత ఏమిటి? ఇంతవరకు అవి సాధించిన ప్రగతిని వివరిస్తూ వాటి పురోగతికి సూచనలివ్వండి.

### 7.15. పదకోశం (Glossary)

RBI : భారతదేశ కేంద్ర బ్యాంక్, దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దటానికి, పర్యవేక్షించటానికి విస్తృతమైన అధికారము గల అత్యున్నత బ్యాంక్.

NABARD : వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి రంగాలను అభివృద్ధి చేయటానికి కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసిన అత్యున్నత బ్యాంక్.

SPONSOR BANK : గ్రామీణ బ్యాంకును ఏర్పాటుచేసే షెడ్యూల్డు వాణిజ్య బ్యాంకు. మన దేశంలో ఉన్న 196 గ్రామీణ బ్యాంకులకు, 27 వాణిజ్య బ్యాంకులు మరియు ఒక రాష్ట్ర సహకార బ్యాంకు స్పాన్సరింగ్ బ్యాంకులుగా వ్యవహరిస్తున్నాయి.

### 7.16. చదువదగిన గ్రంథాలు :


1. Banking & Financial Systems - Mithani & Gordon
2. Banking & Financial Services - S.N. Maheswari & R.R. Paul
3. కరెన్సీ - బ్యాంకింగ్ - తెలుగు అకాడమీ
4. కరెన్సీ - బ్యాంకింగ్ - డా ॥ కె.వి. రావు
   డా॥ జి. ప్రసాద్.

**పాఠం - 8**

# వినిమయ బ్యాంకులు

**లక్ష్యాలు:** ఈ పాఠంలో ఈ క్రింది అంశాలను తెలుసుకుంటాం.

* వినిమయ బ్యాంకుల అర్థం, చరిత్ర, వాటిలో రకాలు చర్చించడం
* వినిమయ బ్యాంకుల పనితీరు, లోపాలు తెలుసుకోవడం
* విదేశీ వ్యాపారంలో వినిమయ బ్యాంకుల పాత్రను తెలుసుకోవడం
* భారత ఎగుమతి, దిగుమతి బ్యాంకుయొక్క పాత్రను చర్చించడం

**విషయ క్రమం**


8.1 వినిమయ బ్యాంకుల అర్థం

8.2 వినిమయ బ్యాంకుల చరిత్ర

8.3 వినిమయ బ్యాంకుల - భారత బ్యాంకింగ్ చట్టాలు

8.4 వినిమయ బ్యాంకుల రకాలు

8.5 వినిమయ బ్యాంకుల విధులు

8.6 వినిమయ బ్యాంకులు అభివృద్ధి సాధించటానికి కారణాలు

8.7 వినిమయ బ్యాంకులలోని లోపాలు, విమర్శలు

8.8 వినిమయ బ్యాంకుల పనితీరును మెరుగుపరచడానికి సూచనలు

8.9 రిజర్వు బ్యాంకు - వినిమయ బ్యాంకులు

8.10 విదేశీ వ్యాపారానికి నిధులు సమకూర్చడంలో భారతబ్యాంకుల పాత్ర

8.11 భారతీయ ఎగుమతి - దిగుమతి బ్యాంకు

8.12 సారాంశం

8.13 పదకోశం

8.14 స్వీయ మదింపు ప్రశ్నలు

8.15 చదువదగిన గ్రంథాలు


## 8.1. వినిమయ బ్యాంకుల అర్థం :

విదేశీ వ్యాపారానికి ఆర్థిక సహాయం చేసే బ్యాంకులను విదేశీ మారకపు బ్యాంకులు లేదా వినిమయ బ్యాంకులు అందురు. ఈ బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు భారతదేశం వెలుపల ఉండి దేశంలో తమ బ్రాంచీల ద్వారా వ్యాపారాన్ని కొనసాగిస్తాయి. విదేశీమారకపు బ్యాంకులన్నీ విదేశాలలోనే, విదేశీయులచే, విదేశీయుల మూలధనంతోనే స్థాపించబడినవి. అందువలనే వీటిని

"విదేశీ బ్యాంకులు" అని కూడా అంటారు. ఇటీవల కాలం వరకు విదేశీ వర్తకానికి సహాయం అందించటంలో ఈ బ్యాంకులకు గుత్తాధిపత్యం ఉండేది. ఈ బ్యాంకులు ప్రస్తుతం స్వదేశీ వర్తక వ్యాపారాల్లో గూడా పాల్గొంటున్నాయి. ఇవి సాధారణ వాణిజ్యబ్యాంకుల వలెనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నవి.

ది బ్యాంక్ ఆఫ్ టోక్యో, ది చార్టర్డ్ బ్యాంక్, ది ఫస్ట్ నేషనల్ సిటీ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్, గ్రిండ్లేస్ బ్యాంక్, లాయడ్స్ బ్యాంక్ మొదలగునవి భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కొన్ని ప్రముఖ విదేశీ బ్యాంకులు.

## 8.2. వినిమయ బ్యాంకుల చరిత్ర:

భారతీయ బ్యాంకింగ్ చరిత్రను పరిశీలించినట్లయితే విదేశీ మారకపు బ్యాంకులు భారతీయ ద్రవ్యమార్కెట్‌ను చాలా ప్రభావితం చేసినట్లుగా తెలుస్తుంది. 1870 నుంచి మన దేశంలో విదేశీమారకపు బ్యాంకులు పనిచేస్తున్నవి. ఈస్టిండియా కంపెనీవారు ఈ బ్యాంకులకు తగిన సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేసినారు. అప్పటినుండి ఈ బ్యాంకులు విదేశీమారకం సమకూర్చటంలో ప్రముఖపాత్ర వహిస్తున్నాయి. భారత రిజర్వుబ్యాంకు చట్టం 1934 మరియు బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949 విదేశీ బ్యాంకుల పనితీరుపై ఎన్నో ఆంక్షలను విధించాయి. 2002, సెప్టెంబరు 30 నాటికి 40 విదేశీ బ్యాంకులు 203 శాఖల ద్వారా మన దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. ఎగుమతులకు సంబంధించిన వర్తకంలో 70 శాతం, దిగుమతులకు సంబంధించిన వర్తకంలో 60 శాతం ఈ బ్యాంకుల ద్వారా జరుగుతున్నది. విదేశీ వ్యాపారానికి సంబంధించిన ద్రవ్యసహాయ కార్యక్రమాలన్నీ ఈ విదేశీ మారకపు బ్యాంకుల గుత్తాధిపత్యంలోనే ఉన్నాయి. 1947 నుంచి భారతీయ వాణిజ్య బ్యాంకులు కూడా విదేశీ మారక వ్యాపారం ప్రారంభించినాయి. అయినప్పటికీ విదేశీబ్యాంకుల ప్రాధాన్యత ఏ మాత్రం తగ్గలేదు. మన దేశంలో ఈ బ్యాంకుల ఆస్తులు గణనీయంగా పెరిగినవి. ఎక్కువ మారక వ్యాపారం విదేశీ మారకపు బ్యాంకుల చేతుల్లోనే ఉంది.

## 8.3. వినిమయ బ్యాంకులు - భారత బ్యాంకింగ్ చట్టాలు:

మన దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వినిమయ బ్యాంకులు ఈ క్రింది పేర్కొన్న చట్టాల నిబంధనలకు లోబడి పని చేయవలసి ఉంటుంది.

**భారతీయ రిజర్వు బ్యాంకు చట్టం, 1934:** రిజర్వుబ్యాంక్ చట్టం సెక్షన్ 42 (1) ప్రకారం అన్ని షెడ్యూల్డ్ బ్యాంకులు తమ డిపాజిట్లపై నగదు రిజర్వును బ్యాంక్ వద్ద డిపాజిట్ చేయాలి. సాధారణ డిపాజిట్లతో పాటు, నాన్ రెసిడెంట్ ఖాతాలకు, విదేశీ కరెన్సీ ఖాతాలకు వేరే నిబంధన ఉన్నది. విదేశీ బ్యాంకులు ఎక్కువగా ఈ కరెన్సీలలో వ్యాపారాన్ని నిర్వహిస్తూ ఉంటాయి. కాబట్టి ఈ నిబంధన విదేశీ బ్యాంకుల విషయంలో చాలా ముఖ్యమైనది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఈ ఖాతాలపై అన్ని బ్యాంకులు 3 శాతం నగదు రిజర్వు నిష్పత్తిని రిజర్వుబ్యాంకు వద్ద ఉంచవలెను.

**బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం (Banking Regulation Act ), 1949:** స్వదేశీ విదేశీ బ్యాంకుల కార్యకలాపాలకు సంబంధించి ఈ చట్టంలో ఎన్నో ముఖ్యమైన నిబంధనలను చేర్చటం జరిగింది. ప్రతీ విదేశీబ్యాంకు భారతదేశంలో వ్యాపారాన్ని ప్రారంభించటానికి ముందు రిజర్వుబ్యాంక్ అనుమతి పొందవలెను. భారతదేశంలోని శాఖల ద్వారా లభిస్తున్న డిమాండ్ మరియు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మొత్తంలో కనీసం 75 శాతం మొత్తాన్ని భారతదేశంలోనే పెట్టుబడిగా వినియోగించవలెను. వార్షిక లాభాలలో కనీసం 20 శాతాన్ని ఈ విదేశీ మారకపు బ్యాంకులు భారత రిజర్వుబ్యాంక్ వద్ద డిపాజిట్ చేయవలెను. అదేవిధంగా కార్యకలాపాల తనిఖీలోను, బ్రాంచీల విస్తరణలోను, ఋణాలు మరియు అడ్వాన్స్‌ల విధివిధానలను నిర్ణయించటంలోను, బ్యాంకుల నిర్వహణలోను వినిమయ బ్యాంకులు రిజర్వుబ్యాంక్ మార్గదర్శక సూత్రాలను విధిగా పాటించవలెను.

**విదేశీమారక క్రమబద్ధీకరణ చట్టం (Foreign Exchange Regulation Act), 1973:** జనవరి 1, 1974 నుండి అమలులోనికి వచ్చిన ఈ చట్టం ప్రకారం ఏ బ్యాంకైనా విదేశీ కరెన్సీలో తన కార్యకలాపాలను నిర్వహించాలంటే, రిజర్వుబ్యాంక్ నుండి లైసెన్సు తీసుకోవలెను. ఈ లైసెన్సు ఉన్నవారిని విదేశీ కరెన్సీ అధీకృత డీలర్లు (Authorised Dealers in Foreign Exchange) అంటారు. విదేశీ కరెన్సీ అంటే ఒక్క కరెన్సీయే కాకుండా విదేశీ డిపాజిట్లు, ఋణాలు, డ్రాఫ్టులు, ప్రయాణీకుల చెక్కులు, పరపతి లేఖలు వస్తాయి. ఈ లైసెన్సు లేకుండా విదేశీ వర్తకానికిగాను పరపతి లేఖలను జారీ చేయరాదు. విదేశీ ప్రయాణీకుల చెక్కులను నగదు రూపంలోకి మార్చకూడదు. ఈ చట్టంలోని మరొక నిబంధన ప్రకారం ఈ అధీకృత డీలర్లు రెసిడెంట్లకు, నాన్‌రెసిడెంట్లకు సంబంధించిన వ్యవహారాలను పరిష్కరించేటప్పుడు రిజర్వుబ్యాంక్ నిర్దేశించిన పద్ధతి ప్రకారం వసూళ్ళు, చెల్లింపులు చేయవలెను. ఈ చట్టాన్ని కొంతవరకు మార్పుచేసి ప్రస్తుతం దీనిని విదేశీమారక నిర్వహణ చట్టం (Foreign Exchange Management Act) గా పిలుస్తున్నారు. అయితే వినిమయ బ్యాంకులకు సంబంధించిన నిబంధనలలో పెద్ద మార్పు లేదు.

## 8.4. వినిమయ బ్యాంకుల రకాలు (Types of Exchange Banks):

వినిమయ బ్యాంకులను రెండు రకాలుగా వర్గీకరింపవచ్చును. అవి:

1. నూటికి 25 శాతం పైగా ఈ బ్యాంకుల డిపాజిట్లు భారతదేశంలోని ఖాతాదారులకే చెంది ఎక్కువ వ్యాపారాన్ని భారతదేశంలోనే చేసే బ్యాంకులు. ఉదా: చార్టరు బ్యాంక్, మర్కెంటైల్ బ్యాంక్, ఈస్టర్న్ బ్యాంక్, నేషనల్ అండ్ గ్రిండ్లేస్ బ్యాంకు మొదలైనవి ఈ కోవకు చెందినవి.

2. భారతదేశంలోని డిపాజిట్లు, మొత్తం డిపాజిట్లలో 25 శాతానికి తక్కువగా ఉండి, భారతదేశంలో తక్కువ వ్యాపారంచేసే బ్యాంకులు. ఉదాహరణకు హాంగ్‌కాంగ్ అండ్ షాంఘై బ్యాంక్, నేషనల్ సిటీ బ్యాంక్ ఆఫ్ న్యూయార్క్ మొదలైనవి ఈ కోవకు చెందినవి.

## 8.5. వినిమయ బ్యాంకుల విధులు (Functions of Exchange Banks):

భారతీయ విదేశీవర్తకానికి ఆర్థిక సహాయాన్ని అందించటం కోసమే ఈ బ్యాంకులను ముఖ్యంగా స్థాపించారు. అయితే కాలక్రమేణా దేశంలోని ఇతర వాణిజ్య బ్యాంకుల వలె వీటి కార్యకలాపాలను విస్తృతపరచటం జరిగింది. ఇవి స్వదేశీ వర్తకాన్ని చేపట్టడమే కాకుండా, ఖాతాదారుల నుంచి అన్నిరకాల డిపాజిట్లను ఆకర్షించటం, బిల్లులను డిస్కౌంటు చేయటం, వర్తకానికి, పరిశ్రమలకు ఋణాలను ఇవ్వడం మొదలైన విధులను నిర్వహిస్తున్నవి. ఈ బ్యాంకులు నిర్వహించే విధులను స్థూలంగా ఈక్రింది విధంగా పేర్కొనవచ్చును.

I. విదేశీ వ్యాపారానికి సహాయం

II. ఇతర బ్యాంకింగ్ విధులు.

**I. విదేశీ వ్యాపారానికి సహాయం:** వినిమయ బ్యాంకులు ఎగుమతి, దిగుమతి వ్యాపారాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని చేస్తాయి. విదేశీ వ్యాపారంలో అవసరమయ్యే హుండీలు, పరపతి పత్రాలు, అంగీకారాలు మొదలైన వాటిని ఖాతాదారుల తరపున జారీచేస్తాయి.

వినిమియ బ్యాంకులు విదేశీ వర్తకానికి ఈ క్రింది మూడు పద్ధతుల ద్వారా ఖాతాదారులకు సేవలందిస్తాయి.

1. హుండీలు
2. పరపతి పత్రాలు
3. బ్యాంకర్ల అంగీకారాలు

**1. హుండీలు:** వినిమయ బ్యాంకులు హుండీల ద్వారా విదేశీ వ్యాపారానికి ద్రవ్యసహాయం చేస్తాయి. ఎగుమతి, దిగుమతి వ్యాపారాలకు ద్రవ్యసహాయం చేయు పద్ధతి ఈక్రింది విధంగా ఉంటుంది.

**ఎ) ఎగుమతి వ్యాపారానికి ద్రవ్యసహాయం చేసే పద్ధతి:** భారతదేశపు ఎగుమతి వర్తకుడు అమెరికాలోని దిగుమతి వర్తకుడికి సరుకులను అమ్మినప్పుడు, దిగుమతిదారుని మీదగాని అతని బ్యాంకు మీద గాని, 90 రోజుల హుండీని వ్రాస్తాడు. ఆ హుండీకి నౌకా భారపత్రం, ఇన్వాయిస్, భీమాపాలసీ, ఉత్పత్తిస్థాన ధృవపత్రం మొదలైన పత్రాలను జతచేస్తాడు. అలాంటి హుండీని "పత్రసహిత హుండీ" (Documentary Bill) అంటారు. పత్రసహిత హుండీని ఎగుమతిదారుడు భారతదేశంలోని తన వినిమయ బ్యాంకుకు అందజేస్తాడు. ఈ బ్యాంకు హుండీ మీద డిస్కౌంట్‌ను మినహాయించి మిగిలిన ద్రవ్యాన్ని ఎగుమతిదారుని ఖాతాకు జమకడుతుంది. పత్రసహిత హుండీని విదేశీమారకపు బ్యాంకు అమెరికాలోని తన ఆఫీసుకు పంపుతుంది. ఆ బ్యాంకు ఆఫీసు దిగుమతిదారునికిగాని, లేదా దిగుమతిదారుని బ్యాంకుకు గాని ఆ హుండీని, అంగీకారం కోసం పంపుతుంది. ఈ పద్ధతిని అంగీకార సహిత పత్రాలు అంటారు. హుండీని అంగీకరించిన వెంటనే, పత్రాలు దిగుమతిదారుని స్వాధీనమవుతాయి. ఆ పత్రాల సహాయంతో దిగుమతిదారుడు సరుకులను స్వాధీనం చేసుకుంటాడు. సరుకులను అమ్మి గడువు తేదీలోగా హుండీ ధనాన్ని దిగుమతిదారుడు చెల్లిస్తాడు. అమెరికాలోని విదేశీమారకపు బ్యాంకు ఆఫీసు దిగుమతిదారుడు అంగీకరించిన హుండీని న్యూయర్క్‌లోని ద్రవ్యమార్కెట్‌లో డిస్కౌంట్‌చేసి, ఆ సొమ్మును భారతదేశంలోని విదేశీమారకపు బ్యాంకుకు పంపుతుంది.

**బి) దిగుమతి వ్యాపారానికి ద్రవ్య సహాయం చేసే పద్ధతి:** భారతీయ వర్తకుడు అమెరికాలోని విదేశీ వర్తకుని నుంచి సరుకులు కొనుగోలు చేసినప్పుడు, అమెరికా ఎగుమతిదారుడు, భారతీయ దిగుమతిదారునిపై హుండీ వ్రాస్తాడు. హుండీని పత్రసహితంగా అమెరికాలోని తన బ్యాంకుకు ఇచ్చి హుండీని డిస్కౌంటు చేసుకుంటాడు. ఈ పత్రసహిత హుండీని విదేశీబ్యాంకు భారతదేశంలోని దిగుమతిదారుని బ్యాంకుకు సొమ్ము వసూలు కోసం పంపుతుంది. భారతీయ దిగుమతిదారుడు హుండీ సొమ్మును బ్యాంకుకు చెల్లించి పత్రాలను పొందుతాడు. అటువంటి హుండీని "డబ్బు చెల్లింపుకు ఇచ్చే పత్రాలు" (Documents against Payment) అంటారు. ఈ పత్రాల సహాయంతో దిగుమతిదారుడు సరుకులను స్వాధీనం చేసుకుంటాడు. కొన్నికొన్ని సమయాలలో దిగుమతిదారుడు హుండీ సొమ్మును చెల్లించకుండా, బ్యాంకుకు విశ్వాసపత్రాన్ని (Trust Deed) వ్రాసి ఇచ్చిన పిమ్మట, సరుకును స్వాధీనం చేసుకోవటానికి విదేశీమారకపు బ్యాంకు దిగుమతిదారునికి సౌకర్యాన్ని కలుగచేస్తుంది.

సాధారణంగా విదేశీమారకపు బ్యాంకులు D/A (Documents against Acceptance)

షరతులపైన భారతీయ ఎగుమతి వర్తకానికి, D/P (Documents against Payments)

షరతుల పైన భారతీయ దిగుమతి వర్తకానికి ఆర్థికసహాయాన్ని అందించడం జరుగుతుంది.

**2. పరపతి లేఖలు** (Letters of credit): పరపతి లేఖ అంటే ఒకే బ్యాంకు దిగుమతిదారుడు కోరిన మీదట తగిన హామీ పొంది, ఎగుమతిదారుని ఉద్దేశించి, అతను దిగుమతిదారునకు సరుకు రవాణా చేయవచ్చునని, పేర్కొన్న ధరకు ఎగుమతిదారుడు తనమీద హుండీ వ్రాసే దానిని తాను ఆమోదించి నిర్ణీతకాలంలో నగదు చెల్లిస్తానని తెలియచేస్తూ బ్యాంకు వ్రాసే లేఖ. సరుకును ఎగుమతి చేసిన తరువాత ఆ పరపతి పత్రాన్ని మిగిలిన పత్రాలతో కలిపి తన బ్యాంకుకు సమర్పిస్తాడు.

అప్పుడు ఆ బ్యాంకు పరపతి పత్రంలో తెలియచేయబడిన మొత్తాన్ని సూచించబడిన బ్యాంకునుండి వసూలుచేసి పెడుతుంది. ఈ పద్ధతిలో ఎగుమతిదారుడు సరుకు పంపిన వెంటనే తనకు రావలసిన సొమ్మును మన దేశంలో రాబట్టుకొనగలడు.

**3. బ్యాంకర్ల అంగీకారాలు** (Bankers' Acceptances): కొన్ని సమయాలలో హుండీలుగాని, డ్రాఫ్టులుగాని నిర్ణీతకాలం వరకు చెల్లింపబడవు. ఏ బ్యాంకుకైనా అంగీకారం ఉంటే డ్రాఫ్టును డిస్కౌంట్ చేసుకోవచ్చును. అంటే బ్యాంకులు ఖాతాదారుల తరపున చెల్లింపుకు తమ అంగీకారాన్ని తెలియజేస్తాయి. ఈ విధంగా బ్యాంకు అంగీకారం ఉన్న డ్రాఫ్టులను ఎగుతిదారుడు నిర్దేశించిన కాలపరిమితి వరకు ఆగకుండా మధ్యలోనే తన బ్యాంకు ద్వారా డిస్కౌంట్ చేసుకోవచ్చును. ప్రస్తుత అంతర్జాతీయ ద్రవ్యమార్కెట్‌లో ఈ బ్యాంకర్ల అంగీకారాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎగుమతిదారులు వీటిని చాలా ఉత్తమ పరపతి సాధనాలుగా పరిగణిస్తారు. ఇంగ్లండు, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో వాణిజ్య బ్యాంకులేగాక అంగీకార సంస్థలు (Acceptances Houses) ప్రత్యేకంగా ఉన్నాయి.

**II. బ్యాకింగ్ విధులు:** వినిమయ బ్యాంకులు విదేశీ వర్తక కార్యకలాపాలతోపాటు స్వదేశీ వాణిజ్య బ్యాంకులవలె మిగిలిన అన్ని విధులను నిర్వర్తిస్తాయి. అవి:

1. డిపాజిట్లను సేకరించడం
2. ఋణాలు మంజూరు చేయడం
3. వివిధ సేవలను అందించటం

**1. డిపాజిట్లను సేకరించడం:** సాధారణ వాణిజ్యబ్యాంకుల వలె వినిమయ బ్యాంకులు డిపాజిట్లను సేకరిస్తాయి. ఎక్కువగా విదేశీవ్యాపారం నిర్వహించే సంస్థలు ఈ బ్యాంకులలో ఖాతాలు ప్రారంభిస్తుంటారు. బ్యాంకుల వారీగా వివిధ బ్యాంకుల డిపాజిట్లను పరిశీలిస్తే గ్రిండ్లేస్‌బ్యాంక్, హాంగ్‌కాంగ్, షాంగై బ్యాంకింగ్ కార్పొరేషన్, చార్టర్డు బ్యాంకులకు కలిపి అత్యధిక డిపాజిట్లను కైవసం చేసుకున్నాయి.

**2. ఋణాల మంజూరీ:** వినిమయ బ్యాంకులు అన్నిరకాల స్వల్పకాల, మధ్యకాల దీర్ఘకాల ఋణాల్ని స్వదేశీ వ్యాపారానికి మంజూరు చేస్తాయి. స్వదేశీ కరెన్సీలో ఋణాలను మంజూరు చేయటమే కాకుండా, వివిధ దేశాల కరెన్సీలలో కూడా ఈ బ్యాంకులు ఋణాల్ని అందజేస్తున్నవి. ఈవిధమైన ఋణాల్ని యూరో కరెన్సీలని (Euro Currency) అంటారు.

**3. బ్యాంకింగ్ సేవలు:** వినిమయ బ్యాంకులు విదేశీ వ్యాపారానికి, తమ ఖాతాదారులకు అందించే సేవలలో ఈ క్రిందివి ప్రధానమైనవి.

ఎ) **నిధులను బదిలీచేయడం:** విదేశీ బ్యాంకులు అనేక పద్ధతుల ద్వారా వివిధ దేశాలమధ్య నిధుల బదిలీకి తోడ్పడుచున్నవి. డ్రాఫ్టులు, ఫాక్స్ సందేశాలు, ఇంటర్నెట్ మొదలైన పద్ధతుల ద్వారా నిధుల బదిలీ జరుగుతూ ఉంటుంది.

బి) **వసూళ్ళు చేయడం:** బ్యాంకులు అందజేసే మరొక ముఖ్యమైన సేవ ఖాతాదారుల తరపున వసూళ్ళు చేయడం. ఈ బ్యాంకులు విదేశాలలోని తమ బ్రాంచీల ద్వారా లేదా క్లియరింగ్ సౌకర్యాలు ఉండే బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు వసూళ్ళు చేసి పెడతాయి.

సి) **మార్కెటింగ్ సౌకర్యాలు సమకూర్చడం:** వినిమయ బ్యాంకులు నిర్వహించే మరొక ముఖ్యమైన సేవ మార్కెటింగ్ సౌకర్యాలను కలగజేయడం. వివిధ దేశాలలోని మార్కెటింగ్ అవకాశాలపై సర్వే జరిపి వాటి ఫలితాలను తమ

ఖాతాదారులకు అందజేస్తాయి. ఈ సర్వేలు ఎగుమతిదారునకు ఎంతో ఉపయోగపడతాయి. అంతర్జాతీయ వర్తకంలో ప్రస్తుతం ఉన్న తీవ్రమైన పోటీ దృష్ట్యా, బ్యాంకులు కల్పించే ఈ సేవకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది.

డి) **విదేశీ మారక లావాదేవీలపై సలహా ఇవ్వడం:** అంతర్జాతీయ వర్తకంలో ఉండే అనేక అంశాల గురించి, విదేశీ కరెన్సీ మారకపు విలువలను గురించి, అనేక ఇతర విషయాలకు సంబంధించి ఈ బ్యాంకులు ఖాతాదారులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ ఉంటాయి.

ఇ) **మర్చెంట్ బ్యాంకింగ్ సేవలు:** కొన్ని మారకపు బ్యాంకులు మర్చెంట్ బ్యాంకింగ్ సేవలను కూడా చేపట్టాయి 1967లో నేషనల్ గ్రిండ్లేస్ బ్యాంక్ మర్చెంట్ బ్యాంకింగ్ విభాగాన్ని ప్రారంభించింది. 1970 లో నేషనల్ సిటీబ్యాంక్ కూడా ఈ సేవలను ప్రారంభించింది. కొన్ని మారకపు బ్యాంకులు ప్రసుత్త కాలంలో విదేశీ పెట్టుబడిదారులు (Foreign Investors) భారత స్టాక్ ఎక్ఛేంజీలలో కొనుగోలు చేసిన సెక్యూరిటీలకు కస్టోడియన్స్‌గా వ్యవహరిస్తున్నాయి.

## 8.6. వినిమయ బ్యాంకులు అభివృద్ధి సాధించడానికి కారణాలు:

మన దేశంలో విదేశీ మారకపు బ్యాంకులు అభివృద్ధి సాధించడానికి అనేక కారణాలు ఉన్నాయి. అవి:

1. వినిమయ బ్యాంకులు చాలాకాలం నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తూండటం.
2 వినిమయ బ్యాంకులకు అధిక వనరులు ఉండడం.
3. వినిమయ బ్యాంకులు సమర్ధవంతమైన నిర్వహణ పద్ధతులు పాటించడం.
4. విదేశీ వ్యాపారంలో విదేశీ బ్యాంకులకు మంచిపట్టు ఉండటం.
5. దేశంలోని బ్యాంకులకంటే ఎక్కువ లాభాల నార్జించడం.
6. ప్రభుత్వం, భారతీయ రిజర్వు బ్యాంకు ఎక్కువగా ఆంక్షలు విధించకపోవడం.

## 8.7. వినిమయ బ్యాంకులలోని లోపాలు - విమర్శలు:

1. భారతీయ వాణిజ్య బ్యాంకులు చేసిన విమర్శలు
2. భారతీయ ఖాతాదారులు చేసిన విమర్శలు

## 1. భారతీయ వాణిజ్యబ్యాంకులు చేసిన విమర్శలు:

ఎ) **విదేశీవరక్తంపైన గుత్తాధిపత్యం:** విదేశీ మారకపు బ్యాంకులు విదేశీవర్తకం పైన గుత్తాధిపత్యం సాధించి దేశంలోని బ్యాంకులకు తీవ్రమైన పోటీని ఇస్తున్నాయి. విదేశీ మారకపు బ్యాంకులకు ఉన్న ఎక్కువ వనరుల వలన, ప్రపంచంలోని ముఖ్యమైన కేంద్రాలలో వీటికి బ్రాంచీలు వున్నందువల్లనే మన బ్యాంకులు ఈ పోటీకి తట్టుకోలేకపోతున్నవి. స్వదేశీ వర్తకంలో కూడా మన బ్యాంకులకు, విదేశీ మారకపు బ్యాంకులు పోటీగా వస్తున్నాయి. అందువలన మన బ్యాంకులు తగినంత ప్రగతిని సాధించలేకపోతున్నాయి.

బి) **వనరుల వినియోగం సక్రమంగా లేదు:** విదేశీ బ్యాంకులు మన దేశంలో డిపాజిట్ల ద్వారా సేకరించిన వనరులను సక్రమంగా ఉపయోగించటంలేదు. అవి తమ వనరులను పెద్దపెద్ద వ్యాపార సంస్థలలోను, గుత్తాధిపత్యం

ఉన్న కంపెనీలలోను, బహుళజాతి సంస్థలలోను పెట్టుబడి పెట్టి ఎక్కువ వడ్డీని సంపాదించుచున్నవి. ఈ పద్ధతి భారతీయ ఆర్థిక విధానానికి అనుకూలంగా లేదు.

సి) **విరివిగా శాఖల విస్తరణ:** ఖాతాదారుల కోరికపైన బ్యాంకు బ్రాంచీలను నెలకొల్పుతున్నామన్న సాకుతో విదేశీమారకపు బ్యాంకులు దేశంలోని మారుమూల ప్రాంతాలలో కూడా వాటి బ్రాంచీలను స్థాపించి భారతీయ బ్యాంకులతో వ్యాపారంలో పోటీ పడుతున్నాయి.

డి) **ఋణాల మంజూరీలో లోపం:** విదేశీ మారకపు బ్యాంకులు సరుకు రవాణాకు మాత్రమే ఆర్థిక సహాయం చేయకుండా కొన్ని పెద్దపరిశ్రమల అవసరాలను తీర్చడానికి కూడా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి. ఉదా: ఢిల్లీ, అమృతసర్‌లలో చిల్లర సరుకుల వర్తకానికి, కాన్పూర్‌లో లెదర్ వర్తకానికి, పశ్చిమబెంగాల్‌లో జనపనార వర్తకానికి ఈ బ్యాంకులు ఆర్థిక సహాయం అందించటం జరిగింది.

ఇ) **అవాంఛనీయమైన పోటీ:** భారతీయ బ్యాంకుల వనరుల కొరతను ఆధారం చేసుకొని విదేశీ మారకపు బ్యాంకులు భారతదేశంలో తక్కువ వడ్డీరేటుకే ఎన్నో డిపాజిట్లను ఆకర్షించి వాణిజ్యబ్యాంకులతో అవాంఛనీయమైన పోటీకి దిగుతున్నాయి.

ఎఫ్) **విదేశీయుల ప్రయోజనాలను కాపాడటం:** విదేశీమారకపు బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు విదేశాల్లో ఉన్నాయి. వాటి నిర్వహణ విధానాలు విదేశీయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే రూపొందించబడుతున్నాయి. భారతీయ ప్రయోజనాలను వారు పరిగణించటంలేదు.

జి) **లోపభూయిష్టమైన ఉద్యోగ విధానాలు:** విదేశీమారకపు బ్యాంకులు ఆచరిస్తున్న ఉద్యోగ విధానాలు లోపభూయిష్టంగా ఉన్నవి. ఈ బ్యాంకులలో భారతీయులకు ఉద్యోగాల్లో అవకాశాలు సరిగా ఇవ్వటంలేదు. కేవలం క్రిందిస్థాయిలకు మాత్రమే భారతీయులను ఉద్యోగులుగా ఎంపిక చేస్తున్నారు.

## 2. భారతీయ ఖాతాదారులు చేసిన విమర్శలు:

ఎ) **వివక్షత చూపడం:** విదేశీమారకపు బ్యాంకులు భారతీయ వర్తక సంస్థల, విదేశీవర్తక సంస్థల గురించిన సమాచారాన్ని అందించటంలో వివక్షత చూపుతున్నాయి. భారతీయ వర్తకులు, సంస్థల గురించి సరియైన సమాచారాన్ని ఈ బ్యాంకులు విదేశీయులకు అందించటం లేదు.

బి) **మార్జిన్ ద్రవ్యం తీసుకోవడంలో తేడా:** మార్జిన్ ద్రవ్యం విషయంలో కూడా భారతీయ సంస్థలు, విదేశీ సంస్థల మధ్య వ్యత్యాసం చూపుతున్నాయి. భారతీయ సంస్థలనుండి 15 శాతం వరకు మార్జిన్ ద్రవ్యాన్ని విదేశీ మారకపు బ్యాంకులు తీసుకుంటున్నాయి. కాని విదేశీ వ్యాపారులనుండి ఏ మాత్రం మార్జిన్ ద్రవ్యం తీసుకోవడం లేదు.

సి) **వడ్డీ వసూలులో తేడా:** వడ్డీని వసూలు చేయడంలో కూడా విదేశీ దిగుమతిదారులకు, భారతీయ దిగుమతిదారులకు తేడా చూపుతున్నాయి. భారతీయ దిగుమతిదారులనుండి ఎక్కువ వడ్డీని వసూలుచేసి, విదేశీ దిగుమతిదారుల నుండి తక్కువ వడ్డీని వసూలు చేయడం జరుగుతున్నది.

డి) హుండీలను స్టెర్లింగ్ కరెన్సీలో వ్రాయడం: హుండీలను స్టెర్లింగ్ కరెన్సీలో వ్రాయడం వల్ల కరెన్సీరేటులో మార్పువల్ల భారతీయ దిగుమతిదారునకు నష్టం వాటిల్లే అవకాశమున్నది.

ఇ) ఖాతాదారులపై ఆంక్షలు: భారతీయ వర్తకులకు ఆర్థిక సహాయాన్ని అందించటానికి వారు తమ సరుకుల రవాణాకు విదేశీ నౌకాయాన కంపెనీలతో ఒప్పందం చేసుకోవలసినదిగాను, విదేశీ భీమా కంపెనీలతో సరుకు భీమా బప్పందం చేసుకోవలసిందిగా ఒత్తిడి చేస్తున్నాయి. దీనివల్ల దేశంలోని నౌకాయాన కంపెనీలకు, భీమా కంపెనీలకు ప్రోత్సాహం లభించటంలేదు.

## 8.8. వినిమయ బ్యాంకుల పనితీరును మెరుగుపరచటానికి సూచనలు:

వినిమయ బ్యాంకుల పనితీరును పరిశీలించిన కమిటీలు, నిపుణులు వాటిని మెరుగుపరచటానికి, నియంత్రించటానికి ఎన్నో సూచనలు చేసినారు. ఇందులో కేంద్ర బ్యాంకింగ్ కమీషన్ చేసిన సూచనలు ముఖ్యమైనవి. క్రింది సూచనలు విదేశీబ్యాంకుల పనితీరును మెరుగుపరచగలవని భావించవచ్చును.

1. విదేశీమారకపు బ్యాంకులపైన రిజర్వుబ్యాంకుకు పటిష్టమైన నియంత్రణ ఉండవలెను. శాసనాత్మకంగా మారకపు బ్యాంకులు, ఇతర బ్యాంకుల వలెనే రిజర్వుబ్యాంకు పర్యవేక్షణ, నియంత్రణ పరిధిలోకి రావలెను.
2. విదేశీమారకపు బ్యాంకులు సేకరించి ఉపయోగించే డిపాజిట్లపై నిబంధనలు ఉండవలెను.
3. భారతీయ వర్తకులు రూపాయల్లో కూడా బిల్లులు చెల్లించే సౌకర్యాన్ని మారకపు బ్యాంకులు కల్పించవలెను.
4. విదేశీబ్యాంకుల మూలధనం, లాభాలు మన దేశంనుండి తరలిపోవడాన్ని నియంత్రించవలెను.
5. విదేశీబ్యాంకులు తమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు రిజర్వుబ్యాంకుకు నివేదించవలెను.
6. విదేశీమారక వ్యాపారాన్ని చేయటానికి భారతీయ వాణిజ్యబ్యాంకుల సహకారంతో ఒక "భారతీయ మారకపు బ్యాంకు" ను స్థాపించవలెను.
7. భారతీయ రిజర్వు బ్యాంక్ అనుమతి లేనిదే విదేశీబ్యాంకులు సమాఖ్యగా కాని, ఇతర వ్యాపార సమ్మేళనంగా గాని ఏర్పడటానికి అనుమతించరాదు.
8. భారతదేశంలో ట్రస్టీ వ్యాపారం చేయటానికి విదేశీమారకపు బ్యాంకులకు అనుమతి ఇవ్వరాదు.
9. విదేశీమారక బ్యాంకులకు భారతీయ వాణిజ్యబ్యాంకులపైన ఎటువంటి నియంత్రణ ఉండరాదు.

## 8.9. రిజర్వుబ్యాంకు - వినిమియ బ్యాంకులు:

విదేశీమారకపు బ్యాంకులపై గల విమర్శలను దృష్టిలో ఉంచుకుని, వాటిని నియంత్రించటానికి బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం కొన్ని నిబంధనలను విధించడం జరిగింది. ఈ చట్టం రిజర్వుబ్యాంకుకు చాలా అధికారాలను సంక్రమింపచేసింది. బ్యాంకులపై సామాజిక అజమాయిషీ ప్రవేశపెట్టిన తరువాత మరికొన్ని నిబంధనలను విదేశీమారకపు బ్యాంకులపై విధించినారు. ప్రస్తుతం విదేశీమారకపు బ్యాంకులు తమ క్రొత్త బ్రాంచీలను స్థాపించే ముందు రిజర్వుబ్యాంకు అనుమతిని తీసుకోవలసి ఉంటుంది. రిజర్వుబ్యాంకు ఎప్పుడైనా మారకపు బ్యాంకు రికార్డులను తనిఖీ చేయవచ్చును. అలాగే ఆ బ్యాంకుల నిర్వహణకు సంబంధించి సూచనలు, మార్గదర్శక సూత్రాలను కాలానుగుణంగా రూపొందించవచ్చును. ప్రసుత్త చట్టం ప్రకారం విదేశాలలో నమోదుచేసిన బ్యాంకింగ్ కంపెనీలు, భారతదేశంలోని బ్రాంచీల ద్వారా ప్రతీ సంవత్సరం సంపాదించిన లాభాలలో 20 శాతం కంటే తక్కువ కాకుండా రిజర్వుబ్యాంకు దగ్గర డిపాజిట్ చేయవలెను. ప్రతీ మారకపు బ్యాంకు చెల్లించిన మూలధనం, రిజర్వుల నుంచి 15 లక్షల

రూపాయలు రిజర్వు బ్యాంకు దగ్గర ఉంచవలెను. అంతేగాక రిజర్వు బ్యాంకు విదేశీమారకపు బ్యాంకులను నియంత్రించుటకు పలుచర్యలు తీసుకున్నది. అందువలన విదేశీమారకపు బ్యాంకుల పనితీరులో గణనీయమైన మార్పులు వచ్చాయి.

## 8.10. విదేశీ వ్యాపారానికి నిధులు సమకూర్చడంలో భారత బ్యాంకుల పాత్ర:

విదేశీ వ్యాపారమునకు పరపతిని మంజూరు చేయటంలో విదేశీమారకపు బ్యాంకులకు ఇంచుమించు గుత్తాధికారముండేది. భారత బ్యాంకులకు ఈ వ్యాపారం ప్రవేశించుటకు అనేక అడ్డంకులుండేవి. అవి:

1) భారత బ్యాంకుల కన్నా విదేశీబ్యాంకులు ఈ వ్యాపారంలో చాలా ముందుగా ప్రవేశించి సుస్థిరమైన స్థానాన్ని ఆక్రమించినవి.

2) విదేశీమారక వ్యాపారమును నిర్వహించుటకు భారత బ్యాంకులకు శిక్షణ పొందిన సిబ్బంది లేరు.

3) విదేశీమారక వ్యాపారమునకు చాలా మూలధనం కావలెను. భారత బ్యాంకులకు అంత మూలధనం లేదు.

4) విదేశీమారక వ్యాపారం చేయవలెనంటే విదేశాలలోను, ఓడరేవు పట్టణములలోను బ్రాంచీలుండవలెను. భారత బ్యాంకులకు విదేశాలలో బ్రాంచీలు లేవు. తగినంత డిపాజిట్లు రానందున, నష్టభయముచేత విదేశాలలో బ్రాంచీలను భారత బ్యాంకులు నెలకొల్పలేదు.

5) విదేశీ వ్యాపారాని కన్నా దేశీయ వ్యాపారానికి పరపతినివ్వడం వలననే ఎక్కువ లాభాలు వచ్చుచున్నందున భారత బ్యాంకులు విదేశీవ్యాపారంలో శ్రద్ధ చూపలేదు.

6) విదేశీబ్యాంకుల పోటీని భారత బ్యాంకులు తట్టుకొనలేక పోయినవి.

7) గతంలో కొన్ని భారత బ్యాంకులు (అలయన్స్ బ్యాంక్ ఆఫ్ సిమ్లా, టాటా ఇండస్ట్రియల్ బ్యాంక్) విదేశీవ్యాపారంలో ప్రవేశించినప్పుడు నష్టముల పాలయినవి.

పై కారణాల వలన భారత బ్యాంకులు విదేశీ వ్యాపార పరపతినివ్వటంలో ప్రధానపాత్రను నిర్వహించలేదు. కాని ఇటీవల భారత బ్యాంకులు కూడా విదేశీ బ్యాంకులతో పోటీచేయుటకు ముందుకు వచ్చుచున్నవి. ప్రధానమైన విదేశాలలో బ్రాంచీలను నెలకొల్పుచున్నవి. సుమారు 15 దేశాలలో 130 బ్రాంచీలను నెలకొల్పినవి.

## ఎగుమతుల పరపతిలో బ్యాంకుల పాత్ర:

ఎగుమతులను అభివృద్ధి చేయటంలో భారత వాణిజ్యబ్యాంకులు ప్రధాన పాత్ర వహించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. 1970 మార్చి 31 నాటికి ఎగుమతుల రంగమునకు భారత వాణిజ్య బ్యాంకులిచ్చిన పరపతి రూ. 304 కోట్లు. ఇది మొత్తం వ్యాపారం పరపతిలో కేవలం ఒక శాతం కన్నా తక్కువ. భారత ప్రభుత్వం ఏర్పట్లు చేసిన అనేక కమిటీలు ఎగుమతి పరపతి సమస్యలను పరిశీలించి, నివేదికలను సమర్పించినవి. అటువంటి నివేదికల ఆధారంగా ఎగుమతుల అభివృద్ధికి కొన్నిచర్యలు తీసుకొనబడినవి.

1. అర్హత గల వాణిజ్య బ్యాంకులతో కలిసి మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలిచ్చుటకు భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు తోడ్పడుతుంది. ప్రభుత్వం ప్రైవేటురంగ సంస్థలకిచ్చే ఎగుమతి పరపతి వసతులకు పారిశ్రామికాభివృద్ధి గ్యారంటీనిస్తుంది. ఎగుమతులకు ముందు, ఎగుమతులకు తరువాత కావలసిన పరపతిని ఈ పథకంలో ఇవ్వబడుతుంది. (Pre-shipment and Post-shipment credit)

2. దీర్ఘకాల ఎగుమతి కాంట్రాక్టుల విషయంలో విదేశీమారకపు రేటు తరుగుదల వలన వచ్చే నష్టములకు రిజర్వు బ్యాంక్ సహాయపడుతుంది.

3. 180 రోజులకు మించని ఎగుమతి వ్యాపారమునకు వాణిజ్య బ్యాంకులిచ్చే పరపతికి రిజర్వుబ్యాంక్ పరోక్ష పరపతినిస్తుంది.

4. 1951 లో "నష్టభీమా కార్పొరేషన్" నెలకొల్పబడినది. దీని విధులను 1964 నుండి ఎగుమతి పరపతి గ్యారంటీ కార్పొరేషన్ చేయుచున్నది. యుద్ధము, దివాలాతీయుట, బకాయిలు మొదలగు నష్టభయములకు ఈ సంస్థ భీమానిస్తుంది. ఎగుమతిదార్లకు ద్రవ్యరక్షణ ఇస్తుంది. ఈ సంస్థ జారీచేసిన భీమా పాలసీలను సహాయక హామీగా (Collateral security ) బ్యాంకులు అంగీకరించుచున్నవి.

పైన వివరించిన చర్యల ఫలితంగా ఎగుమతి పరపతిలో భారత వాణిజ్యబ్యాంకుల పాత్ర బాగా పెరిగినది. పరపతినివ్వటమేగాక, ఎగుమతులను అభివృద్ధి పరచుటకు, ఇతర బ్యాంకింగ్ సేవలను కూడా అందచేయవలెను. భారత ఎగుమతిదార్లకు, విదేశీ వాణిజ్య సమాచారము, మార్కెట్ సమాచారము అందచేయవలెను. స్టేట్‌బ్యాంక్ 'అంతర్జాతీయ విభాగము' ను నెలకొల్పినది. భారత వాణిజ్య బ్యాంకులకు విదేశాలలో బ్రాంచీలున్నప్పుడే విదేశీమారక వ్యాపారమును సమర్ధవంతంగా నిర్వహించగలుగుతాయి.

## దిగుమతి వ్యాపారానికి ఋణం:

వాణిజ్యబ్యాంకులు ఎగుమతి వ్యాపారానికేగాక, దిగుమతి వ్యాపారానికి కూడా సహాయం అందజేస్తాయి. వాణిజ్యబ్యాంకులు దిగుమతి వ్యాపారానికి చేసే సహాయం ఈ క్రింది విధంగా ఉంటుంది.

1. పరపతి లేఖలు సృష్టించటం.
2. విలంబిత చెల్లింపులకు (Deferred Payments) హామీ ఇవ్వడం.
3. దిగుమతి బిల్లుల వసూలు, చెల్లింపు చేయడం.

1. **పరపతి లేఖలు సృష్టించటం:** దిగుమతిదారుడు పరపతిలేఖ కోసం వాణిజ్య బ్యాంకులను అభ్యర్ధిస్తాడు. వాణిజ్య బ్యాంకులు ఇటువంటి లేఖలను జారీచేసేముందు దిగుమతికి సంబంధించిన లైసెన్సు, రవాణా, చెల్లింపు షరతులు మొదలగు వాటిని సమగ్రంగా పరిశీలిస్తుంది.

2. **విలంబిత చెల్లింపులకు హామీ:** విలంబిత చెల్లింపుల విషయంలో వాణిజ్య బ్యాంకులు ఖాతాదారుల తరపున హామీ ఇస్తాడు. ఇటువంటి హామీలు ఇచ్చేటప్పుడు వాణిజ్య బ్యాంకులు దిగుమతిదారుని లైసెన్సు, దిగుమతి చేసుకోబోయే యంత్రాలు, భారీపరికరాల సాంకేతిక, ఆర్థిక సౌలభ్యతలను (Technical and Economic Viability) పరిశీలిస్తాయి. విలంబిత హామీలు ఇవ్వడానికి ముందు వాణిజ్య బ్యాంకులు తప్పనిసరిగా రిజర్వు బ్యాంకు అనుమతి తీసుకోవలెను.

## దిగుమతి బిల్లుల చెల్లింపు:

దిగుమతి బిల్లులను చెల్లించేటప్పుడు పరపతిలేఖ జారీచేసిన బ్యాంకు అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించి బిల్లులు చెల్లించవలసి ఉంటుంది. దిగుమతిదారుడు విదేశీమారకానికి సమానమైన భారతదేశ కరెన్సీని బ్యాంకుకు చెల్లిస్తాడు.

పైన పేర్కొన్న విధంగా భారతదేశ విదేశీవ్యాపారానికి వాణిజ్యబ్యాంకులు అనేక విధాలుగా కృషిచేస్తున్నవి. ఈ కృషిలో ఒక భాగంగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఎగుమతి దిగుమతి బ్యాంకు (Export Import Bank of India - Exim Bank) అనే ఒక బ్యాంకును స్థాపించింది.

## 8.11. భారతీయ ఎగుమతి - దిగుమతి బ్యాంకు (Export - Import Bank of India):

అమెరికా, జపాన్ దేశాలలోని ఎగుమతి - దిగుమతి బ్యాంకుల తరహాలో భారతదేశంలో ఎగుమతి - దిగుమతి బ్యాంకును ఏర్పాటు చేయవలెనని 'జోషి' కమిటీ సిఫార్సు చేసింది. ప్రభుత్వం ఈ సిఫార్సును అంగీకరించి 1982 జనవరి 1న ఎగుమతి - దిగుమతి బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించింది.

### లక్ష్యాలు:

ఈ బ్యాంకును క్రింది లక్ష్యాల సాధనకోసం ఏర్పాటు చేశారు.

1. ఎగుమతిదారుల సమస్యలను పరిష్కరించడం.
2. కొనుగోలుదారుల పరపతిని, పరపతి మార్గాలను విస్తృతపరచి, అభివృద్ధి పరచడం.
3. ఎగుమతి అభివృద్ధికి, నిర్వహణకు సహాయాన్ని సమకూర్చడం.
4. దేశీయ, విదేశీయ మార్కెట్లను ఎగుమతి రంగపు అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవడం.
5. ఎగుమతుల అభివృద్ధికి సంబంధించిన మార్కెట్, పెటుబడి సర్వేలను, సాంకేతిక ఆర్థిక అధ్యయనాలను చేపట్టి, వారికి తగిన సలహాలను అందించటము.

**మూలధన వనరులు:** ఈ బ్యాంకు అధీకృత చెల్లించిన మూలధనం ప్రస్తుతం (March 2002) రూ. 650 కోట్లు. మొత్తం మూలధనాన్ని కేంద్రప్రభుత్వం సమకూర్చినది. ప్రభుత్వంనుంచి, రిజర్వు బ్యాంక్‌నుంచి ఋణాన్ని తీసుకునే అధికారం ఈ బ్యాంకుకు కల్పించబడినది. బాండ్లను, డిబెంచర్లను జారీచేసి వనరులను సమకూర్చుకునే అధికారము కూడా ఈ బ్యాంకుకు కలదు. విదేశాలనుంచి ఋణాలను తీసుకునే అధికారము కూడా ఈ బ్యాంకుకు కలదు.

**నిర్వహణ:** ఈ బ్యాంకు నిర్వహణ డైరెక్టర్ల బోర్డు చేతిలో ఉంటుంది. డైరెక్టర్ల బోర్డులో 17 మంది డైరెక్టర్లు ఉంటారు. ఈ డైరెక్టర్లను ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు, పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు వాణిజ్య బ్యాంకులు నియమిస్తాయి.

**కార్యకలాపాల సమీక్ష:** ఎగుమతి - దిగుమతి బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగుమతిదారులకు, దిగుమతిదారులకు ప్రయోజనకరమైన సేవలను అందిస్తున్నది. ఈ బ్యాంకు విదేశీ వ్యాపారములో వివిధ పార్టీలకు ధనసహాయాన్ని అందిస్తున్నది. ఈ బ్యాంకు అందించే సహాయాన్ని రెండు రకాలుగా వర్గీకరింపవచ్చును. (ఎ) ద్రవ్యసహాయం (బి) ద్రవ్యేతర సహాయం. ఈ బ్యాంకు పరపతి కార్యక్రమాలను మూడు రకాలుగా వర్గీకరింపవచ్చును.

1. భారతీయ కంపెనీలకు ఋణసౌకర్యాలు: భారతీయ కంపెనీలకు ఈ క్రింది విధంగా సహాయాన్ని అందిస్తున్నది.

ఎ) ఎగుమతిదారులకు ప్రత్యక్షంగా ధనసహాయం చేయడం.

బి) సాంకేతిక - ఆర్థిక విషయాలలో సలహాలను ఇవ్వడం.

సి) ఇతర దేశాలలో సంయుక్తంగా స్థాపించబడిన పరిశ్రమలలో భారతీయ కంపెనీలు పెట్టుబడిలో సహాయపడటం.

డి) మూలధన వస్తువులను ఎగుమతి చేయటంలో నౌకాయాన కంపెనీలను ఏర్పాటుచేయడం.

ఇ) ఎగుమతి సంబంధం ఉన్న సంస్థలకు ధనసహాయం చేయడం.

**2.** విదేశీ కంపెనీలకు, ప్రభుత్వాలకు సహాయం చేయడం: విదేశీ ప్రభుత్వాలకు, కంపెనీలకు, ఆర్థిక సంస్థలకు ఈ క్రింది విధంగా సహాయం చేస్తుంది.

ఎ) విదేశీ కొనుగోలుదారులకు పరపతి పథకం ద్వారా సహాయం చేయడం.

బి) విదేశీ ప్రభుత్వాలకు, పరపతి విధానాలను నిర్ణయించడం.

సి) విదేశీ బ్యాంకులకు రీ - ఫైనాన్స్ సహాయం చేయడం.

**3.** భారతదేశ వాణిజ్య బ్యాంకులకు సహాయం: విదేశీ వ్యాపారంలో పాల్గొనే వాణిజ్య బ్యాంకులకు ఈ క్రింది విధంగా సహాయాన్ని ఈ బ్యాంకు అందిస్తున్నది.

ఎ) ఎగుమతి బిల్లులను రీ డిస్కౌంట్ చేయడం.

బి) ఎగుమతి పరపతికి రీ ఫైనాన్స్ చేయడం.

పై విధంగా భారతీయ ఎగుమతిదారులకు ఎగుమతి - దిగుమతి బ్యాంకు సహాయాన్ని అందిస్తున్నది. బ్యాంకు స్థాపనకాలం నుండి, ఇప్పటివరకు (March 2002) రూ. 28,490 కోట్ల ధన సహాయాన్ని అందించింది. ఆర్థిక సహాయాన్నేగాక, సాంకేతిక సలహాలు, మార్కెట్‌కు సంబంధించిన సలహాలను విదేశీ వ్యాపారంలో పాల్గొనేవారికి అందిస్తున్నది. ఈ విధంగా విదేశీవ్యాపార అభివృద్ధికి ఈ బ్యాంకు విశేషంగా సహాయపడుతున్నది.

## 8.12. సారాంశం (Summary):

అంతర్జాతీయ వర్తకానికి అవసరమయ్యే విదేశీమారకాన్ని సమకూర్చే బ్యాంకులను "విదేశీ మారకపు బ్యాంకులు" అని అంటారు. మన దేశంలోని విదేశీ మారకపు బ్యాంకులలో ఎక్కువభాగం విదేశాల ఆధీనంలోనివే. మన ద్రవ్యమార్కెట్‌లో ఈ బ్యాంకులు కీలకపాత్ర వహిస్తున్నవి. ఎగుమతులకు సంబంధించిన వర్తకంలో 70 శాతం, దిగుమతులకు సంబంధించిన వర్తకంలో 60 శాతం ఈ బ్యాంకుల ద్వారా జరుగుచున్నది. విదేశీ వ్యాపారానికి సంబంధించిన ద్రవ్యసహాయ కార్యక్రమాలన్నీ ఈ విదేశీ మారకపు బ్యాంకుల గుత్తాధిపత్యంలోనే ఉన్నాయి. 1947 నుంచి భారతీయ బ్యాంకులు కూడా విదేశీ మారక వ్యాపారం ప్రారంభించినాయి. ఎగుమతులను ప్రోత్సహించడానికి, దిగుమతి వ్యాపారానికి సహాయసహకారాలు అందించటానికి భారత ప్రభుత్వము 1982 లో ఎగుమతి - దిగుమతి బ్యాంక్‌ను ఏర్పాటు చేసినది. భారత ప్రభుత్వం, రిజర్వుబ్యాంక్ తీసుకున్న అనేక చర్యల వలన విదేశీ మారకపు బ్యాంకుల పనితీరులో ఆశించినంత మార్పులు వచ్చినవి.

## 8.13. పదకోశం (Glossary):

FERA : విదేశీమారక క్రమబద్ధీకరణ చట్టం. ప్రస్తుతం ఈ చట్టాన్ని విదేశీమారక నిర్వహణ చట్టం (FEMA )గా పిలుస్తున్నారు. అంతర్జాతీయ వర్తకంలో విదేశీ కరెన్సీ వ్యవహారాలకు సంబంధించి ఈ చట్టం మార్గదర్శక సూత్రాలను నిర్దేశిస్తుంది.

EXIM BANK : భారత ఎగుమతి - దిగుమతి బ్యాంకు ఎగుమతులను ప్రోత్సహించడంలోనూ, దిగుమతులకు సహాయమందించడంలోనూ కీలకపాత్ర వహిస్తున్నది.

## 8.14. స్వీయ మదింపు ప్రశ్నలు

### 5 మార్కుల ప్రశ్నలు

1. వినిమయ బ్యాంకులు - భారత బ్యాంకింగ్ చట్టాల గురించి క్లుప్తంగా వివరింపుము.
2. వినిమయ బ్యాంకుల విధులను తెలియచేయుము.

### 10 మార్కుల ప్రశ్నలు

1. వినిమయ బ్యాంకుల పనితీరుపై ఉన్న విమర్శలేమిటి?
2. విదేశ వ్యాపారానికి నిధులను సమకూర్చడంలో భారత వాణిజ్య బ్యాంకుల పాత్రను వివరింపుము.
3. భారతీయ ఎగుమతి - దిగుమతి బ్యాంకు గూర్చి వ్రాయుము.

### 20 మార్కుల ప్రశ్నలు

1. "విదేశీమారకపు బ్యాంకులు" అంటే ఏమిటి? వాటి విధులను, లోపాలను సంగ్రహముగా వివరింపుము.

## 8.15. చదువదగిన గ్రంథాలు :

1. Banking & Financial Systems - Mithani & Gordon
2. Banking & Financial Services - S.N. Maheswari & R.R. Paul
3. Banking Theory, Law & Practice- Sundaram & Varshney
4. కరెన్సీ - బ్యాంకింగ్ - తెలుగు అకాడమీ
5. కరెన్సీ - బ్యాంకింగ్ - డా॥ కె.వి. రావు
డా॥ జి. ప్రసాద్

**పాఠం - 9**

# అభివృద్ధి బ్యాంకులు

## 9.0. లక్ష్యం :-

ఈ పాఠంలో ఈ క్రింది వానిగూర్చి తెలుసుకుంటాము.

అభివృద్ధి బ్యాంకు అనగా ఏది?
అభివృద్ధి బ్యాంకుల ఏర్పాటు ఆవశ్యకత
వాటి లక్ష్యాలు, విధులు
భారతదేశంలో అభివృద్ధి బ్యాంకుల ఏర్పాటు, ప్రగతి పనితీరు
ఎంపిక చేసిన కొన్ని అభివృద్ధి బ్యాంకులను గూర్చిన తులనాత్మక పరిశీలన

**9.1** **అభివృద్ధి బ్యాంకుల అర్థం**
**9.2** **అభివృద్ధి బ్యాంకుల ఆవశ్యకత**
**9.3** **అభివృద్ధి బ్యాంకుల లక్ష్యాలు**
**9.4** **అభివృద్ధి బ్యాంకుల విధులు**
**9.5** **భారతదేశంలో అభివృద్ధి బ్యాంకులు - సంక్షిప్త చరిత్ర**
**9.6** **భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు**
**9.7** **భారత చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు**
**9.8** **రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థలు**
**9.9** **సారాంశం**
**9.10** **పదకోశం**
**9.11** **స్వీయం మదింపు ప్రశ్నలు**
**9.12** **చదువదగిన గ్రంథాలు**

## 9.1. అభివృద్ధి బ్యాంకుల అర్థం :

ఒక దేశ ఆర్థికాభివృద్ధి ఆ దేశ పారిశ్రామికాభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. పారిశ్రామికాభివృద్ధికి సహజ వనరులేగాక తగినంత మూలధనం కావాలి. పరిశ్రమలకు కావలసిన మూలధనాన్ని రెండు రకాలుగా వర్గీకరింపవచ్చును. అవి (1) స్థిర మూలధనం, (2) చర మూలధనం. వాణిజ్య బ్యాంకులు పరిశ్రమలకు కావలసిన చర మూలధనాన్ని మాత్రమే సమకూర్చగలుగుతున్నాయి. కాబట్టి పరిశ్రమలకు కావలసిన స్థిర మూలధనాన్ని సమకూర్చడానికి అభివృద్ధి బ్యాంకులను స్థాపించడం జరిగింది.

ప్రొఫెసర్ విలియం డైమండ్ అభివృద్ధి బ్యాంకులను క్రింది విధంగా నిర్వచించినాడు. "ఒక సంస్థ ముఖ్యంగా దీర్ఘకాల ఋణ మూలధనం సమకూర్చడం కోసం కృషిచేస్తే దాన్ని అభివృద్ధి బ్యాంకు అంటారు. ఆర్థిక సహకారాన్ని, ఈక్విటీ మూలధనాన్ని అందించడంతోపాటు ప్రత్యేకంగా కంపెనీల నిర్వహణ, అభివృద్ధి విషయాలలో కృషిచేసే సంస్థను అభివృద్ధి కార్పొరేషన్ అంటారు." అభివృద్ధి బ్యాంకులు పరిశ్రమలకు కావలసిన నిధులను సమకూర్చడమే కాకుండా, ప్రాజెక్టు రిపోర్టులు తయారుచేయడం, సాంకేతిక సలహాలు, నిర్వహణా సేవలను అందించడం మొదలైన విధులను కూడా నిర్వహించి దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయి.

## 9.2. అభివృద్ధి బ్యాంకుల ఆవశ్యకత :

ఆర్థికంగా అభివృద్ధి చెందని, చెందుతున్న దేశాలలో పారిశ్రామికాభివృద్ధి తక్కువగా ఉంటుంది. పరిశ్రమల స్థాపనకు అవసరమైన ఆర్థిక, ఆర్థికేతర సౌకర్యాలను కల్పించకపోవడం దీనికి గల ముఖ్య కారణం. ఈ సౌకర్యాలను కల్పించటానికి అభివృద్ధి బ్యాంకులను స్థాపించవలసిన అవసరం ఏర్పడింది. ప్రపంచములో, ముఖ్యంగా భారతదేశంలో అభివృద్ధి బ్యాంకులను క్రింద పేర్కొన్న కారణాలవల్ల స్థాపించినారు.

1. **మూలధనం కొరత :** అభివృద్ధి చెందుతున్న దేశాలలో ముఖ్యమైన లక్షణం 'మూలధన కొరత'. ఈ దేశాలు మూలధన వనరుల సమీకరణలో వైఫల్యం చెందడం వలన అవకాశాలు ఉన్న వస్తువులను కూడా ఉత్పత్తి చేయలేవు. అంతేగాక ప్రైవేటు వ్యక్తులు 'ఫలనకాలం' (Gestation Period) ఎక్కువగా ఉన్న పెద్దపెద్ద పరిశ్రమలలో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపించారు. అటువంటప్పుడు ఈ దేశాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందవలెనంటే అభివృద్ధి బ్యాంకులను నెలకొల్పవలెను.

2. **తక్కువ మూలధన కల్పన :** అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికం, నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటం వలన పొదుపురేటు తక్కువగా ఉంటుంది. అంతేగాక పొదుపుకు పెట్టుబడికి మధ్య వ్యత్యాసం కూడ ఎక్కువగానే ఉంటుంది. అంటే మూలధనకల్పన రేటు కూడా తక్కువగా ఉంటుంది. పొదుపు, పెట్టుబడికి మధ్య ఉన్న వ్యత్యాసం తగ్గించి, ఆర్థికాభివృద్ధి సాధించడానికి అభివృద్ధి బ్యాంకుల ఏర్పాటు తప్పనిసరిగా ఉండవలెను.

3. **ప్రణాళికా ప్రగతిని సాధించడం :** కేవలం ఆర్థిక వనరులు చేకూర్చడానికో, సాంకేతికపరమైన సలహాలు ఇవ్వడానికో కాకుండా, ఉన్న ఆర్థిక, సాంకేతిక వనరులను, మానవ వనరులను సక్రమంగా వినియోగించి ఫలితాన్ని సాధించే సంస్థల ఆవశ్యకత పెరుగుతున్నది. అభివృద్ధి బ్యాంకులు ఈ విధులను నిర్వహించగలవు.

4. **అభివృద్ధి చెందని మూలధన మార్కెట్ :** మనదేశంలో మూలధనమార్కెట్ ఎక్కువగా అభివృద్ధి చెందలేదు. అభివృద్ధి బ్యాంకులను నెలకొల్పినట్లయితే, అవి పారిశ్రామిక సంస్థలకు ఆర్థిక సహాయం సమకూర్చడమేగాక, వీటి సెక్యూరిటీలను కొనడం, అమ్మడం, చందా పూచీ ఇవ్వడం మొదలైన విధులను నిర్వహించడం ద్వారా మూలధన మార్కెట్ల అభివృద్ధికి తోడ్పడతాయి.

5. **చిన్న పరిశ్రమల అభివృద్ధి :** పారిశ్రామికాభివృద్ధిలో చిన్న పరిశ్రమలు కీలకపాత్ర వహిస్తాయి. కానీ వాటికుండే సమస్యలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటి సమస్యలు పరిష్కరించి ఒడుదుడుకులు లేకుండా సాగిపోవడానికి కావలసిన ఆర్థిక, సాంకేతిక, ఇతర సలహాలు అందించడానికి అభివృద్ధి బ్యాంకుల స్థాపన అత్యంత ఆవశ్యకము.

6. **పరిశ్రమల ఆధునికీకరణ :** పరిశ్రమల ఆధునికీకరణ చేయడానికి, కాలానుగుణంగా వాటిని తీర్చదిద్దడానికి అభివృద్ధి బ్యాంకుల అవసరము ఎంతో ఉన్నది.

7. **ప్రణాళికా ఆర్థికవ్యవస్థ :** రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన తరువాత చాలా దేశాలు వాటి పరిమితమైన వనరులను ఉపయోగించుకోవడానికి, సమాన ప్రాంతీయాభివృద్ధి సాధించడానికి ప్రణాళికాభివృద్ధిపై ఆసక్తి చూపుతున్నాయి. దేశాన్ని పారిశ్రామీకరణ చేయడంలో ప్రత్యేక సంస్థలైన అభివృద్ధి బ్యాంకులు ముఖ్యమైన పాత్ర వహిస్తాయి.

## 9.3. అభివృద్ధి బ్యాంకుల లక్ష్యాలు :

పారిశ్రామికాభివృద్ధి కోసం అవసరమైన ఆర్థిక, ఆర్థికేతర సహాయాలను సమకూర్చడం అభివృద్ధి బ్యాంకుల ప్రధాన లక్ష్యం. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ బ్యాంకుల లక్ష్యాలు క్రింది విధంగా ఉన్నాయి.

1) పరిశ్రమలకు, ముఖ్యంగా ప్రాధాన్యతా రంగాలకు మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలను సమకూర్చడం.

2) చిన్నతరహా పరిశ్రమలకు విత్తం సమకూర్చడం.

3) సమాన ప్రాంతీయ అభివృద్ధి సాధించడం

4) ఎగుమతి పరిశ్రమలను, దిగుమతి ప్రత్యామ్నాయ పరిశ్రమలను ప్రోత్సహించడం.

5) సాంకేతిక పరిజ్ఞానాన్ని అందచేయడం.

6) ఖాయిలా పడ్డ పరిశ్రమలను పర్యవేక్షించడం

## 9.4. అభివృద్ధి బ్యాంకుల విధులు

అభివృద్ధి బ్యాంకులు కేవలం ఆర్థిక వనరులను అందించే ఆర్థిక సంస్థలు మాత్రమే కావు. దేశ పారిశ్రామికాభివృద్ధి కోసం ఎన్నో విధులను నిర్వహిస్తాయి. వీటిలో ఈ క్రిందివి ప్రధానమైనవి.

1. **ఋణాల మంజూరు :** పారిశ్రామిక సంస్థలకు మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలను సమకూర్చడం అభివృద్ధి బ్యాంకుల ప్రధాన విధి. కొన్ని అభివృద్ధి బ్యాంకులు ఋణాలను దేశ, విదేశీ కరెన్సీలలో కూడా ఏర్పాటు చేస్తాయి.

2. **చందా పూచీ :** పారిశ్రామిక సంస్థల వాటాలు, బాండ్లు, డిబెంచర్ల జారీలకు చందా పూచీ కల్పిస్తాయి.

3. **ఋణాలకు హామీ ఇవ్వడం :** పరిశ్రమలు స్థానిక, విదేశీ సంస్థలనుంచి సేకరించిన ఋణాలకు, విదేశీమార్కెట్‌లో కొన్న మూలధన వస్తువులకు చెల్లించవలసిన మొత్తాలకు అభివృద్ధి బ్యాంకులు హామీ ఇస్తాయి.

4. **వాటాలకు, డిబెంచర్లకు చందాకట్టడం :** చందా పూచీతోపాటు అభివృద్ధి బ్యాంకులు పారిశ్రామిక సంస్థల వాటాలను డిబెంచర్లను కొనుగోలు చేస్తాయి.

5. **అభివృద్ధి విధులు :** అభివృద్ధి బ్యాంకుల ఇతర రకాల విధులను అభివృద్ధి విధులు అందురు. కొత్త పరిశ్రమలను ప్రోత్సహించడం, సాంకేతిక నిర్వహణ, పరిపాలనపరమైన సలహాలు ఇవ్వడం, సాంకేతిక, ఆర్థిక మార్కెట్లో పెట్టుబడి పరిశీలనను నిర్వహించడం మొదలైన విధులను అభివృద్ధి బ్యాంకులు నిర్వహిస్తాయి.

ప్రపంచంలో అభివృద్ధి బ్యాంకులు 19 వ శతాబ్దం ప్రారంభంనుండీ ఆవిర్భవించినవి. అంతర్జాతీయ స్థాయిలో ఈ క్రింది బ్యాంకులు బహుళ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

1) అంతర్జాతీయ బ్యాంకు, 2) అంతర్జాతీయ ద్రవ్యనిధి, 3) అంతర్జాతీయ ఆర్థిక సంస్థ, 4) అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ

## 9.5. భారతదేశంలో అభివృద్ధి బ్యాంకులు - సంక్షిప్త చరిత్ర

స్వాతంత్ర్యానికి పూర్వం మనదేశంలో ఏర్పాటుకాబడిన పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ పంజాబ్ (Peopl's Bank of Punjab), హిందూస్థాన్ బ్యాంక్ (Hindustan Bank), ఇండస్ట్రియల్ బ్యాంక్ (Industrial Bank), క్రెడిట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Credit Bank of India) మొదలగు పారిశ్రామిక బ్యాంకులు స్వల్పకాలంలోనే మూతపడ్డాయి. నిజానికి మన దేశంలో ఆధునిక పద్ధతిపై అభివృద్ధి బ్యాంకులు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏర్పడ్డవి. ఏప్రియల్ 1, 1948 న దేశంలో మొదటిసారిగా భారత పారిశ్రామిక ఆర్థిక సహాయ సంస్థ (Industrial Finance Corporation of India) ను స్థాపించడం జరిగింది. పారిశ్రామిక సంస్థలకు కావలసిన విదేశీ మారకద్రవ్య నిధులను సమకూర్చడానికి 1955 లో భారత పారిశ్రామిక పరపతి - పెట్టుబడుల కార్పొరేషన్ (Industrial Credit and Investment Corporation of India) ను ప్రైవేటురంగంలో స్థాపించారు. ఆ తరువాత దేశంలో పారిశ్రామిక, ఆర్థిక సహాయం చేసే సంస్థల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 1964 లో భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకును స్థాపించారు. కాలక్రమేణా యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (Unit Trust of India) (1963), జీవితభీమా సంస్థ (Life Insurance Corporation) (1956), సాధారణ భీమా కార్పొరేషన్ (General Insurance Corporation) (1973), భారత పారిశ్రామిక పునర్నిర్మాణ

బ్యాంక్ (Industrial Reconstruction Bank of India), భారత ఎగుమతి-దిగుమతి బ్యాంక్ (Export-Import Bank of India) (1982) 1951 వ సం॥నుండి ఆర్థిక సంస్థలను (State Finance Corporations) స్థాపించడం జరిగింది. భారతదేశంలోని జాతీయ స్థాయిలో ఉన్న కొన్ని ముఖ్యమైన అభివృద్ధి బ్యాంకుల ప్రగతి పనితీరుల గురించి తెలుసుకొందాం.

## 9.6. భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు (Industrial Development Bank of India) :

సత్వర పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన ద్రవ్యసహాయాన్ని అందించటానికి, స్థాపించబడిన ద్రవ్యసహాయక సంస్థలయొక్క కార్యకలాపాలను సమన్వయపరచి, నిర్వహణ పర్యవేక్షించుటకు భారత ప్రభుత్వము 1964 జులై నెలలో భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకును స్థాపించింది. ఈ బ్యాంకు రిజర్వు బ్యాంకుకు అనుబంధ సంస్థగా స్థాపించబడినది. దీని మూలధనమంతటిని రిజర్వుబ్యాంకు సమకూర్చినది. కాని 1976 నుంచి ఈ బ్యాంకు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా మారినది. రిజర్వు బ్యాంకు ఆధీనంనుంచి విముక్తి పొందినది. ఈ బ్యాంకు మూలధనంలో అధికభాగం ప్రస్తుత కేంద్రప్రభుత్వం యొక్క ఆధీనంలో వున్నది.

పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు ఆశయాలు : ఇది దీర్ఘకాలిక ఋణాలను అందించే సంస్థ. సహాయక సంస్థలన్నింటికీ పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు మకుటాయమైనది. ఈ క్రింద పేర్కొన్న ఆశయాలతో పారిశ్రామికాభివృద్ధి బ్యాంకును స్థాపించినారు.

1. దీర్ఘకాలిక ఋణాలను మంజూరుచేసే వివిధ ద్రవ్యసహాయక సంస్థల కార్యకలాపాలను సమన్వయపరచి, వాటి నిర్వహణను పర్యవేక్షించడం.
2. ఆర్థిక సహాయసంస్థలకు దీర్ఘకాలిక ఋణాలు మంజూరుచేసి, వాటి ప్రయోజకత్వాన్ని విస్తృతం చేయడం.
3. పారిశ్రామిక సంస్థలకు దీర్ఘకాలిక ఋణాలను ఇవ్వడం.
4. కీలక పరిశ్రమల స్థాపనకు, అభివృద్ధికి సహాయపడటం.
5. పారిశ్రామిక సంస్థలకు మార్కెటింగ్ విషయాలలో, సాంకేతిక విషయాలలో ఉచితంగా సలహాలను అందించడం.

**ఆర్థిక వనరులు :** పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు రూ. 50 కోట్ల అధీకృత మూలధనంతో ప్రారంభించబడింది. దీని మూలధనమంతటిని రిజర్వుబ్యాంకు సమకూర్చినది. తరువాత కేంద్రప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. ప్రస్తుతం ఈ బ్యాంకు అధీకృత మూలధనాన్ని రూ. 200 కోట్లకు పెంచడం జరిగింది. జారీచేసిన మూలధనం కూడా పెరిగింది. 1998 లో ప్రజలకు వాటాలను జారీచేసి మూలధనాన్ని సేకరించింది. వాటా మూలధనం కాకుండా ఇతర విధాలుగా కూడా ద్రవ్యవనరులను సేకరించుకున్నది. అవసరమైనప్పుడు కేంద్రప్రభుత్వం నుంచి ఈ బ్యాంకు ఋణాలు తీసుకోవచ్చును. బాండ్లను, డిబెంచర్లను జారీచేసి నిధులను సేకరించే అధికారం ఈ బ్యాంకుకు ఉన్నది. రిజర్వుబ్యాంకు నుంచి స్వల్పకాలిక, దీర్ఘకాలిక ఋణాలు పొందవచ్చును. "జాతీయ పారిశ్రామిక పరపతి నిధి" నుంచి కూడా ఋణాలు తీసుకోవచ్చును. అంతేగాక ప్రజలనుండి డిపాజిట్లు స్వీకరించవచ్చును. విదేశాలలోని ఆర్థిక సంస్థలనుండి విదేశీ కరెన్సీ ఋణాలు తీసుకోవటానికి, విదేశాలనుండి బహుమానాలు, గ్రాంటులు, విరాళాలు తీసుకోవటానికి ఈ బ్యాంకుకు అధికారం ఉన్నది.

**నిర్వహణ :** పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు కార్యకలాపాల నిర్వహణ డైరెక్టర్ల బోర్డు చేతిలో ఉంటుంది. ఈ బ్యాంకు డైరెక్టర్లను కేంద్రప్రభుత్వం, రిజర్వుబ్యాంకు, ఇతర ద్రవ్య సహాయక సంస్థలు, వాటాదారులు నియమిస్తారు. ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్‌తోపాటు 22 మంది డైరెక్టర్లు గల బోర్డు, బ్యాంక్ కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

**విధులు :** దేశంలోని అభివృద్ధి బ్యాంకులలో ఈ బ్యాంకు ఒక శిఖరాగ్ర సంస్థ (Apex Institution). ప్రయివేటు రంగంలోను, పబ్లిక్ రంగంలో ఉన్న అన్ని తరహాల పారిశ్రామిక సంస్థలకు ఈ బ్యాంక్ ద్రవ్యసహాయాన్ని అందచేయవచ్చును. పారిశ్రామిక సంస్థలకు ఋణాలను మంజూరు చేయటంలో ఈ బ్యాంకుకు గరిష్ట, కనిష్ట పరిమితులు లేవు. ఈ బ్యాంకు పరిశ్రమలకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, ప్రత్యేకంగాను సహాయం చేస్తుంది. పారిశ్రామిక సంస్థలకు అభివృద్ధి బ్యాంకు సొంతంగా గాని, ఇతర ద్రవ్య సహాయక సంస్థలతో కలిసిగాని ధనసహాయం చేయవచ్చును. ఈ బ్యాంకు అందించే వివిధ సహాయ కార్యక్రమాలు క్రింది విధంగా ఉంటాయి.

**ఎ) ప్రత్యక్ష సహాయం** (Direct Assistance) : అభివృద్ధి బ్యాంకు పరిశ్రమలకు చేసే ప్రత్యక్ష సహాయం ఈక్రింది విధంగా ఉంటుంది.

1) పారిశ్రామిక సంస్థలకు ఋణాలు ఇవ్వడం ఇటువంటి ఋణాలలో ప్రాజెక్టు ఋణాలు, సాఫ్ట్ ఋణాలు మొదలయినవి ముఖ్య రకాలు.

2) పారిశ్రామిక సంస్థల వాటాలు, డిబెంచర్లు, బాండ్లు కొనడం.

3) పారిశ్రామిక సంస్థలు మార్కెట్‌లో తీసుకున్న ఋణాలు హామీ ఇవ్వడం.

4) పారిశ్రామిక సంస్థలు జారీచేసే వాటాలు, డిబెంచర్లకు చందా పూచీ ఇవ్వడం.

5) పారిశ్రామిక సంస్థల వాణిజ్య బిల్లులను ప్రానోట్లను స్వీకరించడం, డిస్కౌంట్ లేదా రీడిస్కౌంట్ చేయడం.

**బి) పరోక్ష ధనసహాయము** (Indirect Assistance) : అభివృద్ధి బ్యాంకు పారిశ్రామిక సంస్థలకు పరోక్షంగా కూడా సహాయపడుతుంది. పారిశ్రామిక సంస్థలకు ప్రత్యక్షంగా కాకుండా కొన్ని సంస్థల ద్వారా ఈ బ్యాంకు సహాయం అందిస్తుంది. బ్యాంకులు, ఇతర ఆర్థికసంస్థలు పరిశ్రమలకు దీర్ఘకాలిక ఋణాలిచ్చునప్పుడు, ఆ ఋణాలు చాలాకాలం వరకు తిరిగిరావు. కాబట్టి పరిశ్రమలకు సహాయం చేయడానికి ఆ సంస్థలకు తగినంత వనరులుండవు. అభివృద్ధి బ్యాంకు ఆర్థిక సహాయ సంస్థలకు అవి యిచ్చే ఋణాలమీద అప్పులు ఇస్తుంది. ఈ పద్ధతిని "రీ-ఫైనాన్స్ సౌకర్యం" లేదా "పరోక్ష సహాయం" అంటారు. పారిశ్రామిక ఆర్థిక సహాయ సంస్థ, రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థలు పరిశ్రమలకు ఇచ్చే 3 నుండి 25 సంవత్సరాల కాల వ్యవధిగల ఋణాల మీద, అభివృద్ధి బ్యాంకు ఆ సంస్థలకు మళ్ళీ ఋణాలు ఇస్తుంది. అదేవిధంగా షెడ్యూల్డు బ్యాంకులు, రాష్ట్రసహకార బ్యాంకులు ఇచ్చే 3 నుండి 10 సంవత్సరాల కాలవ్యవధి గల ఋణాల మీద అభివృద్ధి బ్యాంకు ఆ సంస్థలకు మళ్ళీ ఋణాలు ఇస్తుంది. అదేవిధంగా షెడ్యూల్డు బ్యాంకులు, రాష్ట్రసహకార బ్యాంకులు ఇచ్చే 6 నెలల నుండి 10 సంవత్సరాల కాలవ్యవధి గల ఎగుమతి పరపతిమీద కూడా అభివృద్ధి బ్యాంకు ఋణాలు ఇస్తుంది. అంతేకాకుండా పారిశ్రామిక ఆర్థిక సహాయ సంస్థ రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలు, ఇతర ఆర్థిక సహాయ సంస్థల వాటాలను, డిబెంచర్లను, బాండ్లను కాని, వాటికి ఆర్థిక వనరులను అభివృద్ధి బ్యాంకు సమకూరుస్తుంది. ఈ విధంగా చేయటం వలన ఆ సంస్థలు పరిశ్రమలకు ఎక్కువగా సహాయం చేయడానికి అవకాశం ఏర్పడుతుంది.

**సి) ప్రత్యేక సహాయం** (Special Assistance) : పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు చట్టం క్రింద "అభివృద్ధి సహాయకనిధి" (Development Assistance Fund) ని ఈ బ్యాంకు ఏర్పాటు చేసింది. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రాముఖ్యం వహించే పరిశ్రమలకు, అవి సాధారణ మార్గాలలో ఋణం పొందలేనిచో వాటికి ప్రత్యేకమైన సహాయం చేయటానికి ఈ నిధిని ఉపయోగిస్తారు. ఇటువంటి ప్రత్యేకమైన సహాయం చేయటానికి కేంద్రప్రభుత్వ అనుమతి ఉండవలెను.

**డి) ఇతర సహాయం** : పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు పరిశ్రమలకు ఆర్థిక సహాయాన్నేగాక, ఇతర విధములైన సహాయాన్ని కూడా అందిస్తుంది.

1) పెట్టుబడి, విక్రయ కార్యకలాపాలకు సంబంధించిన పరిశోధనలు నిర్వహించడం.

2) విదేశీ ద్రవ్యాన్ని సేకరించి పారిశ్రామిక సంస్థలకు అందించడం.

3) సాంకేతిక, ఆర్థిక పరిశీలనలు నిర్వహించే బాధ్యతలను స్వీకరించడం.

4) సాంకేతిక - పరిపాలనా విషయాలలో సలహాలివ్వడం.

5) కొత్త పరిశ్రమలను అభివృద్ధి పరచడంలో ప్రత్యేక శ్రద్ధ చూపడం.

**కార్యకలాపాల సమీక్ష** (Review of the operations of the Bank) : పారిశ్రామిక బ్యాంకు గత 38 సం॥ల నుండి మన దేశ పారిశ్రామికాభివృద్ధికి బహుముఖంగా కృషి చేస్తున్నది. ఈ బ్యాంకు కొత్త పరిశ్రమల స్థాపనకు, పాత పరిశ్రమల విస్తరణలకు, ఆధునికీకరణకు ద్రవ్యసహాయాన్ని అందచేసింది. చిన్నతరహా పరిశ్రమలకు, దేశ రక్షణకు అవసరమైన కీలక పరిశ్రమలకు, ఎగుమతులను పెంపొందించే పరిశ్రమలకు, వ్యవసాయాభివృద్ధికి తోడ్పడే పరిశ్రమలకు, అత్యవసర వినియోగ వస్తువులను తయారుచేసే పరిశ్రమలకు అభివృద్ధి బ్యాంకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నది. యంత్రాలు, లోహాలు, రసాయనిక ఎరువులు, రసాయనాలు, సిమెంట్, విద్యుత్ యంత్రాలు, ఆహార పదార్థాలు, కాగితం తయారుచేసే పరిశ్రమలకు కూడా ఈ బ్యాంకు ధనసహాయాన్ని అందచేసింది. 2000 - 01లోనే పరిశ్రమలకు రూ. 28,710 కోట్ల ధనసహాయాన్ని మంజూరు చేసింది. 1964 నుంచి 2002 మార్చినాటికి రూ.2,30,202 కోట్ల ధనసహాయాన్ని వివిధ విధాలుగా అభివృద్ధి బ్యాంకు మంజూరుచేసింది. మంజూరు చేసిన మొత్తములో రూ.1,64,260 కోట్లను బట్వాడా చేసింది. ఋణసహాయాన్నేగాక పరిశ్రమలకు ఈ క్రింది విధాలుగా సహాయాన్ని అందచేసింది.

I. **నూతన పథకాలు :** పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు ఇటీవల కాలంలో అనేక నూతన పథకాలను ప్రవేశపెట్టినవి. అవి క్రింది విధంగా ఉన్నవి.

ఎ) **అభివృద్ధి సహాయనిధి** (Development Assistance Fund) : అధిక పరిమాణంలో పెట్టుబడి కావలసినవి మరియు దీర్ఘఫలన కాలమున్నవి (Long gestation period), బ్యాంకులు సాధారణ ఋణాలిచ్చుటకు ముందుకురానివి మొదలగు దేశ ఆర్థికవ్యవస్థకు కీలకమయిన పరిశ్రమలకు సహాయం చేయుటకు ఈ నిధిని ఏర్పాటు చేయడమైనది.

బి) **ఆధునీకరణ సమాయపథకం** (Modernisation Assitance Scheme) : పరిశ్రమల ఆధునీకరణకు ఇదివరకు కొన్ని పరిశ్రమలకున్న సరళ ఋణపథకం (Soft Loan Scheme) అన్ని పరిశ్రమలకు వర్తింపచేశారు. అభివృద్ధి బ్యాంకు వస్త్రపరిశ్రమ ఆధునీకరణ నిధిని ప్రత్యేకంగా నెలకొల్పినది.

సి) **విదేశీమారక ద్రవ్యసహాయం మరియు విదేశీమారక ద్రవ్య రిస్క్ పథకం :** మూలధన వస్తువులు, విదేశీ సాంకేతిక పరిజ్ఞానం దిగుమతులకు విదేశీ కరెన్సీ ఋణాలు ఇస్తుంది. విదేశీమారక ద్రవ్య విలువలో మార్పుల పరిహారం కొరకు విదేశీమారక ద్రవ్యపరిహార పథకం ప్రవేశపెట్టారు.

డి) **వెంచర్ కాపిటల్ పథకం** (Venture Capital Scheme) : దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వర్తింపచేయుటకు, విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయ పరిశ్రమల కనుగుణంగా మలచుకొనుటకు పరిశ్రమలకు ప్రత్యేక సహాయం చేయుటకు ఒక నిధిని పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు ఏర్పాటు చేసినది. విదేశీ యంత్రములు, సాంకేతిక పరిజ్ఞానం, సలహాసేవలు మొదలగు వాటి దిగుమతికి కావలసిన విదేశ ద్రవ్యమారకమునకు సమానమైన రూపాయల ఋణాలివ్వడానికి పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు సాంకేతిక అభివృద్ధి నిధి పథకాన్ని కూడా అమలు చేస్తున్నది.

మూలధన వస్తువుల దిగుమతికి ఋణ సహాయాన్ని అందించటమేగాక, పారిశ్రామిక సంస్థలు తమ ఎగుమతులను పెంచుటకు ప్రోత్సాహకచర్యగా వడ్డీ రిబేట్ (Interest Rebate) పథకాన్ని ప్రవేశపెట్టింది.

ఇ) **ప్రాజెక్టు విత్త పథకం** (Project Finance Scheme) : రూ. 5 కోట్లకు మించి వ్యయమగు ప్రాజెక్టులను IDBI ఇతర విత్త సంస్థలతో (IFCF, ICICI, LIC, GIC, UTI) కలసి కన్సోర్టియమ్ (Consortium) ఏర్పాటుచేసి ప్రత్యక్ష ఋణాలు ఇస్తుంది.

ఎఫ్) **సీడ్ కాపిటల్ పథకం** (Seed Capital Scheme) : తగిన సామర్థ్యం, నైపుణ్యం కలిగి, మూల ధనం లేని పారిశ్రామిక వేత్తలు నూతన పరిశ్రమలను నెలకొల్పుటకు సహాయం చేసే నిమిత్తం ఈ పథకాన్ని పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు అమలు చేస్తుంది.

II. **చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు రీఫైనాన్స్ పథకం :** చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు రాష్ట్ర ఆర్థిక సంస్థలు,

వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార సంస్థలు ఇచ్చే ఋణాలకు IDBI రీఫైనాన్స్ ఇస్తుంది. 1988 లో "నేషనల్ ఈక్విటీ ఫండ్"ను ఏర్పాటుచేసి చిన్న పరిశ్రమలకు, టైనీ పరిశ్రమలకు వాణిజ్యబ్యాంకుల ద్వారా ద్రవ్య సహాయాన్ని అందిస్తున్నది. చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకును స్థాపించి, దానిద్వారా చిన్న పరిశ్రమలకు సహాయాన్ని అందిస్తుంది.

III. **వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సహాయం :** వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమల అభివృద్ధికి ఎక్కువగా సహాయం చేయడానికి 1990 లో అభివృద్ధి బ్యాంకు కొత్త విధానాన్ని రూపొందించింది. తక్కువ వడ్డీకి ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీర్చడానికి 15 - 20 సంవత్సరాల గడువు ఇవ్వడం, వాటా మూల ధనంలో ఎక్కువగా పాల్గొనడం మొదలైన అంశాలు ఈ విధానంలో భాగాలు. కేంద్రప్రభుత్వం గుర్తించిన 301 వెనుకబడిన జిల్లాలలో పరిశ్రమల స్థాపనకు సరళ ఋణాలను ఇచ్చుచున్నది.

IV) **ప్రాంతీయ సంతులిత అభివృద్ధికి సహాయం :** ప్రాంతీయ సంతులిత అభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి ఈ రెండు లక్ష్యాలను సాధించటానికి అభివృద్ధి బ్యాంకు, ఇతర ఆర్థిక సంస్థలతో కలిసి దేశమంతటా పారిశ్రామిక పరిశీలన జరిపి 389 పథకాలను రూపొందించింది. వాటిలో రూ. 280 కోట్ల వ్యయంతో 74 పథకాలు ఇప్పటికి అమలుపరచబడ్డాయి. నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే నిమిత్తం వడ్డీలేకుండాగాని, నామమాత్రపు వడ్డీకిగాని వారికి ఋణాలిస్తున్నది.

V) **ఇతర సహాయక సేవలు :** 1) ఆర్థిక సాంకేతిక సర్వేలు చేయడం, 2) సాంకేతిక సలహాసంస్థలు నెలకొల్పడం, 3) ప్రాజెక్టు రిపోర్టులను తయారుచేయడం, 4) పరిశోధన 5) విత్తసంస్థల సిబ్బంది నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ వసతులు కల్పించుట, 6) పారిశ్రామికవేత్తల అభివృద్ధి పథకం అమలు పరచుట, 7) మర్చెంట్ బ్యాంకింగ్ సేవలను అందించటం.

విమర్శలు : పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు దేశ సత్వర పారిశ్రామికీకరణకు గణనీయంగా దోహదం చేసింది. అయినప్పటికి, ఈ బ్యాంకు కార్యకలాపాలపై క్రింద పేర్కొన్న విమర్శలు గలవు.

1. మంజూరుచేసిన ఋణాలను బట్వాడా చేయటంలో అసాధారణ జాప్యం జరుగుచున్నది. దరఖాస్తుల పరిశీలన, తనఖా హామీ ఒప్పందాలు, వివిధ స్థాయిలలో దరఖాస్తు విశ్లేషణ, అధికారిక నిబంధనలు, లాంఛనాలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

2. బిల్లుల రీడిస్కౌంట్‌కు, వివిధ ఆర్థిక పునఃసహాయ పథకాలకు అత్యధిక ప్రాధాన్యమివ్వడం ద్వారా IDBI ప్రత్యక్ష సహాయ పథకాలకు తన నిధులను కేంద్రీకరించలేకపోతున్నది.

3. వివిధ వ్యాపారులు ప్రాజెక్టుల యోగ్యతలను నిర్ణయించుటకు కావలసిన సమీకృత తులనాత్మక వివేచనా పద్ధతిని ప్రవేశపెట్టుటలో IDBI విఫలమైంది. ఫలితంగా వ్యవస్థాపకులు వారి దరఖాస్తులలో తెలియచేసే అంశాలలో ఏకరూపత, సమన్వయము లోపించింది.

4. నిధుల కొరత IDBIS లక్ష్యసాధనకు ఒక పరిమితిగా పరిణమించింది.

5. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు బ్యాంకు అందజేసిన ఆర్థిక సహాయంలో మూడొంతులు పొందాయి. దీనివలన మిగిలిన రాష్ట్రాలను నిర్లక్ష్యం చేసిందనే విమర్శకు బ్యాంకు గురి అయ్యింది.

పైన పేర్కొన్న విమర్శలునప్పటికీ, దేశ పారిశ్రామికీకరణలో IDBI కీలకపాత్ర వహిస్తున్నది. వివిధ రాష్ట్రాలలో సాంకేతిక పరిశీలనలు పూర్తిచేసి, వ్యవస్థాపక, సాంకేతిక నిపుణత్వాన్ని దేశ ప్రయోజనకారిగా రూపొందించటానికి ప్రయత్నం చేస్తున్నది. నిద్రాణమై ఉన్న వనరులకు, శక్తులకు చైతన్యం కలిగించి సత్వర పారిశ్రామికాభివృద్ధికి బ్యాంకు చర్యలు తీసుకుంటున్నది. నరసింహం కమిటీ పారిశ్రామికాభివృద్ధి బ్యాంక్ పరోక్ష ధన సహాయక చర్యలు ఇతోధికంగా తీసుకొనవలెనని సూచించింది. పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు మన దేశ పారిశ్రామికీకరణలో మరింత చురుకైన పాత్ర వహిస్తుందని ఆశించవచ్చును.

ఈ విధంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన బ్యాంకును పునర్వ్యవస్థీకరించడం జరిగింది. 1991-92 సంవత్సరం నుండి దేశంలో అమలు చేయబడుతున్న ఆర్థిక సంస్కరణలకు అనుగుణంగా అభివృద్ధి బ్యాంకులనన్నింటిని, ఒక్కొక్కటిగా, సాధారణ వాణిజ్య

బ్యాంకుల తరహాకు మార్చడం జరుగుతున్నది. ఈ ప్రక్రియలోభాగంగా ICICI, ICICI బ్యాంకుగా రూపాంతరం చెందింది. అదేబాటలో ఈ మధ్య అంటే జులై 2004 లో IDBI ని IDBI Bank గా మార్పు చేసారు. వాణిజ్య బ్యాంకులకు, అభివృద్ధి బ్యాంకులకు సాధారణ కార్యకలాపాలలో ప్రస్ఫుటమైన బేధం లేకపోయినప్పటికి, వాణిజ్య బ్యాంకులు 'రిఫైనాన్స్' విధిని నిర్వర్తించవు. ఈ విధి నిర్వహణే అభివృద్ధి బ్యాంకుల ఉనికికి ఆధారం. మరి IDBI బాంకు ఈ రిఫైనాన్సింగ్ విధిని ఎంతవరకు నిర్వర్తిస్తుందో వేచిచూడవలసిందే.

## 9.7. భారత చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు [(Small Industries Development Bank of India (SIDBI)]:

1990 ఏప్రిల్‌లో ఒక ప్రత్యేక చట్టం ద్వారా భారతప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకును ఏర్పాటు చేసింది. ఈ బ్యాంకు భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు (IDBI) కు అనుబంధ సంస్థ. చిన్నతరహా పరిశ్రమల జాతీయ ఈక్విటీ నిధుల నిర్వహణ బాధ్యతలను పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు, ఈ బ్యాంకుకు కేటాయించినది. చిన్నతరహా పరిశ్రమలకు ద్రవ్యసహాయాన్ని అందచేసే ఆర్థికసంస్థలలో చిన్న తరహా పరిశ్రమల బ్యాంకు అత్యంత ప్రముఖమైనది. ముఖ్యంగా ఈ బ్యాంకు జాతీయస్థాయిలో చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు, అభివృద్ధికి, నిధుల సమీకరణకు తోడ్పడుతుంది.

**ఆర్థిక వనరులు :** ఈ బ్యాంకు అధీకృత మూలధనం రూ.250 కోట్లు. దీనిని రూ. 1000 కోట్లకు పెంచుటకు ఈ బ్యాంకుకు అధికారం వున్నది. ఈ బ్యాంకు మూలధనాన్ని భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు సమకూర్చినది. రిజర్వుబ్యాంకు, పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు మరియు మార్కెట్ నుండి ఋణాలను సేకరించే అధికారం బ్యాంకుకు ఉన్నది. అంతేగాక, చిన్న పరిశ్రమలకు కావలసిన దిగుమతుల నిమిత్తం విదేశీసంస్థల నుండి విదేశీమారక ద్రవ్యాన్ని సేకరించుకునే అధికారం కూడా ఉన్నది.

**నిర్వహణ :** ఈ బ్యాంకు భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు యాజమాన్యంలో ఉన్న అనుబంధత సంస్థ. దీని కేంద్ర కార్యాలయం లక్నోలో కలదు. దీనికి 26 ప్రాంతీయ బ్రాంచి కార్యాలయాలున్నాయి.

**విధులు :** భారత చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిబ్యాంకు ఈ క్రింది విధులను నిర్వహిస్తుంది.

1. ప్రాథమిక పరపతి సంస్థలు చిన్న తరహా పరిశ్రమలకు ఇచ్చే ఋణాలు, అడ్వాన్సులను రీఫైనాన్స్ చేస్తుంది. అంతేగాక ఇతర పరపతి సంస్థలకు, చిన్నతరహా పరిశ్రమలకు ద్రవ్యసహాయం చేసే నిమిత్తం ద్రవ్యాన్ని అందిస్తుంది.
2. చిన్నపరిశ్రమల తయారుచేసిన యంత్రపరికరాల విక్రయానికి సంబంధించిన వ్యాపార బిల్లులను డిస్కౌంట్ చేస్తుంది. చిన్న పరిశ్రమలు కొనుగోలు చేసిన యంత్రపరికరాలకు సంబంధించిన బిల్లులకు డిస్కౌంట్ మరియు రీడిస్కౌంట్ సదుపాయాలను కల్పిస్తుంది.
3. ప్రస్తుతం దేశంలో నెలకొన్న చిన్నపరిశ్రమల సాంకేతికాభివృద్ధి, వాటి ఆధునికీకరణకు చర్యలు చేపడుతుంది.
4. వివిధ ద్రవ్యసహాయక సంస్థలకు కేంద్రబిందువుగా ఉండి, చిన్న పరిశ్రమలకు ద్రవ్య సదుపాయాలను కల్గిస్తుంది.
5. లీజింగ్, ఫాక్టరింగ్ మొదలగు సేవలను చిన్న పరిశ్రమలకు అందిస్తుంది.
6. చిన్నతరహా పరిశ్రమలకు ముడిపదార్థాలను సరఫరా చేసి, వాటి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసే రాష్ట్ర చిన్న పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్లకు ద్రవ్యసహాయాన్ని అందజేస్తుంది.
7. చిన్న పరిశ్రమల రంగంలో ఎగుమతిచేయు పరిశ్రమలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ద్రవ్యసహాయాన్ని ఇస్తుంది.
8. జాతీయ చిన్నపరిశ్రమల కార్పొరేషన్‌కు చిన్నపరిశ్రమలకు లీజింగ్, అద్దె కొనుగోలు పద్ధతి మరియు మార్కెటింగ్ సదుపాయాల నిమిత్తం ద్రవ్యసహాయాన్ని అందిస్తుంది.
9. స్వదేశంలోను, ఇతర దేశాలలోను చిన్న పరిశ్రమల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను విస్తృతపరచటానికి ప్రయత్నిస్తుంది.

**కార్యకలాపాలు** (Operations of the Bank) : చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలను అందించుటకు ఈ బ్యాంకు వివిధ రకాలుగా కృషి చేయుచున్నది. చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికై కొన్ని నూతన పథకాలను ప్రవేశపెట్టినది. అవి:

1. **ఏకగవాక్ష పథకం** (Single Window Scheme) : చిన్న పరిశ్రమలు తమకు కావలసిన వివిధ రకాల ద్రవ్యసహాయం సంఘటితంగా ఒకే సంస్థనుండి పొందుటకు ఈ పథకం రూపొందించబడింది. పెట్టుబడి ఆస్తులకు, నిర్వహణ మూలధనం నిధులు పొందుటకు, స్థిరాస్తుల కొనుగోలుకు ఈ పథకం క్రింద ఋణం పొందవచ్చును.

2. **జాతీయ ఈక్విటీ నిధి పరిధిని విస్తృతం చేయడం :** చిన్నతరహా మరియు టైనీ రంగ పరిశ్రమల సహాయార్థమై జాతీయ ఈక్విటీ నిధిని ఈ బ్యాంకు నిర్వహించుచున్నది. ఈ పథంకం క్రింద నూతన పరిశ్రమల స్థాపనకు, ఖాయిలాపడిన పరిశ్రమల పునరావాసమునకు వాటి ప్రాజెక్టు వ్యయంలో 15 శాతం ఈక్విటీ సహాయం ఇవ్వబడుతుంది.

3. **వెంచర్ క్యాపిటల్ ఫండ్ :** చిన్న పరిశ్రమల వ్యవస్థాపకులకు సహాయాన్ని అందించే నిమిత్తం వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను నెలకొల్పినది.

పైన పేర్కొన్న విధంగా భారత చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు చిన్నపరిశ్రమల, టైనీరంగ పరిశ్రమల సమస్యల పరిష్కారానికి, వాటి అభివృద్ధికి వివిధ చర్యలు, నూతన పథకాలను చేపట్టినది. సాంకేతిక మరియు నైపుణ్యాభివృద్ధి, ఆధునికీకరణ, ఇంధన పొదుపు, మార్కెటింగ్, ఫాక్టరింగ్ సేవలు, లీజింగ్ సేవలు మొదలగు కార్యక్రమాలను అమలు పరచి చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి దోహదపడుచున్నది. దేశంలో చిన్నతరహా పరిశ్రమల బాగోగులు చూడడానికి చిన్నపరిశ్రమల అభివృద్ధి బ్యాంకు శిఖరాగ్ర సంస్థగా తన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తున్నది.

## 9.8 రాష్ట్ర ఆర్థిక సంస్థలు (State Financial corporations)

చిన్న తరహా, మధ్యతరహా పారిశ్రామిక సంస్థల వ్యవస్థాపనకు, విస్తరణకు కావలసిన ఆర్థిక సహాయాన్ని సమకూర్చడానికి, రాష్ట్రస్థాయిలో సంస్థలను ఏర్పాటు చేయవలసిన అవసరం వుందని స్వాతంత్ర్యానంతరం కేంద్రప్రభుత్వం గుర్తించింది. అందువలన 1951 లో పార్లమెంట్ "రాష్ట్ర ఆర్థిక సంస్థల చట్టాన్ని" ఆమోదించింది. ఈ చట్టం 1952 ఆగస్టు 1 నుండి అమలులోనికి వచ్చినది. ఈ చట్టం ద్వారా మనదేశంలో మొట్టమొదటిసారిగా 1953 లో "పంజాబ్ ఆర్థిక సంస్థ" ఏర్పడినది. ఆ తరువాత వివిధ రాష్ట్రాలలో ఈ సంస్థలు ప్రారంభించబడినాయి. ప్రస్తుతం భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో 18 రాష్ట్ర ఆర్థిక సంస్థలు పనిచేస్తున్నాయి. కార్యకలాపాల పరిధిలో తప్ప ఇవి అన్నివిధాల భారత పారిశ్రామిక విత్త సంస్థవలె పనిచేస్తాయి. సాధారణంగా రాష్ట్ర ఆర్థిక సంస్థల కార్యకలాపాలు ఒక రాష్ట్రానికే పరిమితమవుతాయి. కొన్ని సంస్థల కార్యకలాపాలు ప్రత్యేక రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థలు లేని ప్రక్క రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా విస్తరించాయి.

**ధ్యేయాలు** : బ్యాంకుల నుండి ఋణసౌకర్యం పొందలేని చిన్న సంస్థలకు కావలసిన మధ్యకాలిక, దీర్ఘకాలిక ధనసహాయం సమకూర్చడమే రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థల యొక్క ముఖ్య ధ్యేయం. వివిధ వ్యాపారసంస్థల మూలధన అవసరాలకు ఆర్థికసహాయం అందించబడుతుంది.

**వ్యాపార పరిధి** : కొత్త సంస్థల స్థాపనకు, అమలులో ఉన్న సంస్థల ఆధునికీకరణకు, పునరుద్ధరణకు, విస్తరణకు, ఉత్పత్తిలో వైవిధ్యానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని ఈ సంస్థలు అందిస్తాయి. సొంత, భాగస్వామ్య సంస్థలకు, ప్రయివేటు, పబ్లిక్ కంపెనీలకు ఈ సంస్థలు సహాయాన్ని అందిస్తాయి.

**ఆర్థిక సహాయానికి అర్హత ఉన్న సంస్థలు :** రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థల చట్టం 1951 ప్రకారం ఈ క్రింది కార్యకలాపాలలో నిమగ్నమైన ఏ సంస్థ అయినా రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థ నుంచి ఆర్థిక సహాయాన్ని పొందవచ్చును.

ఎ) మైనింగ్

బి) రోడ్డు రవాణా

సి) హోటల్

డి) విద్యుచ్ఛక్తి ఉత్పత్తి - పంపిణీ

ఇ) వస్తువుల ఉత్పత్తి - ప్రాసెసింగ్, నిల్వచేయడం.

ఎఫ్) షిప్పింగ్

జి) పారిశ్రామికవాడగా భూమిని అభివృద్ధి చేయడం.

**విధులు :** రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థ క్రింది విధులను నిర్వహిస్తుంది.

1. రాష్ట్రంలోని పరిశ్రమలకు 20 సంవత్సరాలకు మించకుండా ఋణాలను మంజూరు చేయడం.
2. పారిశ్రామిక సంస్థల డిబెంచర్లకు చందాను సమకూర్చడం.
3. ఆమోదయోగ్యమైన షరతులపై తీసుకున్న 20 సంవత్సరాలలోపు తిరిగి చెల్లించే ఋణాలకు హామీ ఇవ్వడం.
4. భారతదేశంలో కొన్ని పెట్టుబడి ఆస్తుల విలంబిత వాయిదా చెల్లింపులకు హామీ ఇవ్వడం.
5. మార్కెట్‌లో 7 సంవత్సరాలలోపు పరిష్కరించబడే షరతులపై పారిశ్రామిక సంస్థల వాటాలకు, బాండ్లకు, డిబెంచర్లకు చందా పూచీ ఇవ్వడం.
6. వెనుకబడిన ప్రాంతాలలోని చిన్నతరహా సంస్థల ఈక్విటీ మూలధనంలో భాగం పంచుకోవడం.
7. ప్రపంచబ్యాంకు పథకం క్రింద విదేశీకరెన్సీ ఋణాలివ్వడం.
8. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంక్‌కు లేదా ఇతర ఆర్థిక సంస్థలకు అప్పులు, అడ్వాన్స్‌ల మంజూరులో ఏజంట్లగా వ్యవహరించడం.

కార్యకలాపాల సమీక్ష (Review of the operations of the SFCS) : రాష్ట్ర విత్తసహాయ సంస్థలు దేశ సమగ్ర, సత్వర పారిశ్రామికాభివృద్ధికి కృషిచేస్తున్నవి. అవి స్థాపన కాలం (1965-66) నుండి మార్చి 2002 వరకు మంజూరు చేసిన సహాయం రు. 37,466. కోట్లు. ఇదే కాలానికి పంపిణీ చేసినది రు. 30,857 కోట్లు. ఈ సంస్థలు అందించిన ఆర్థిక సహాయంలో సగానికిపైగా వెనుకబడిన ప్రాంతాలలోని ప్రాజెక్టులకు ఇవ్వబడినది. రసాయనాలు, సేవలు, ఆహార ఉత్పత్తులు సంస్థలు ఎక్కువగా ఆర్థిక లబ్ధి పొందినవి. ఆర్థిక సహాయంలో దాదాపు 70 శాతం చిన్నతరహా సంస్థలకు ఇవ్వడం జరిగింది. చిన్నతరహా సంస్థలకు కేటాయించిన ధనసహాయంలో ఎక్కువభాగం చిన్నతరహా రోడ్డు ఆపరేటర్లకు ఇవ్వడం జరిగింది. వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించుటకు "సరళఋణ" పద్ధతిని (Soft Loan Scheme) ప్రవేశపెట్టినది. తక్కువవడ్డీ, తక్కువ మార్జిన్లు, తక్కువ సేవాఛార్జీలు మొదలగు రాయితీలు కల్పించబడుచున్నవి. దీనివలన ప్రాంతీయ అసమానతలు తగ్గుచున్నవి. ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్, తమిళనాడు రాష్ట్రాలలోని విత్తసహాయం సంస్థలు గణనీయమైన ప్రగతిని సాధించాయి. పరిశ్రమలకు మధ్యకాలిక ఋణాలను అందిచటంలో రాష్ట్ర విత్తసంస్థలు ప్రముఖపాత్ర వహిస్తున్నవి.

**విమర్శలు :** రాష్ట్ర విత్తసహాయ సంస్థలపై క్రింద పేర్కొన్న విమర్శలు కలవు.

1. ఋణాలు పొందిన సంస్థలనుండి రావలసిన బకాయిలు మొత్తాలు పెరుగుతున్నాయి. బకాయిలు పెరుగుతున్నందువల్ల రాష్ట్రవిత్త సంస్థలు మరలా నిధులను అందచేయడంలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.
2. రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థలను వేధిస్తున్న మరొక ముఖ్య సమస్య అనుభవజ్ఞులైన సిబ్బంది కొరత. ఆర్థిక, సాంకేతిక, యాజమాన్య, మార్కెటింగ్ రంగాలలో అనుభవజ్ఞులైన సిబ్బంది లేరు. సంస్థలకు తనిఖీ యంత్రాంగం కూడా తగినంతగా లేదు.

3. మంజూరు చేసిన ఋణాలను అందజేయడంలో అనవసరమైన కాలయాపన జరుగుచున్నదనే విమర్శ కూడా కలదు.

4. చాలా సంస్థలు ఋణాల కొరకు సరైన సెక్యూరిటీలను అందజేసే స్థితిలో లేవు. దీనికి కారణం ఆస్తుల యాజమాన్య ధృవీకరణ పత్రాలు (Title Deeds) సరిగా లేకపోవడమే. అంతేగాక ఆస్తుల విలువ సరిగా మదింపు జరగటంలేదు.

పైన పేర్కొన్న సమస్యలను పరిష్కరించినచో, రాష్ట్ర విత్తసంస్థలు రాష్ట్రాలలో పరిశ్రమల స్థాపన, అభివృద్ధికి ఎంతో మెరుగైన సేవలు అందించగలుగుతాయని ఆశించవచ్చును. ఈ సంస్థలకు అవసరమైన మూలధనాన్ని కేంద్రప్రభుత్వం, రిజర్వుబ్యాంకు ప్రత్యక్షంగా సమకూర్చవలెను. అప్పుడే రాష్ట్రంలోని చిన్న తరహా సంస్థలకు ఆర్థిక సహాయం అందజేసి, పారిశ్రామిక వికేంద్రీకరణకు రాష్ట్ర ఆర్థిక సహాయ సంస్థలు దోహదపడగలవు. రాష్ట్ర ఆర్థిక సహాయసంస్థలను ప్రాంతీయ అభివృద్ధి బ్యాంకులు (Regional Development Banks) గా రూపొందించుటకు ప్రయత్నాలు జరుగుచున్నవి. నరసింహం కమిటీ సూచించినట్లు ఈ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల పూర్తి అజమాయిషీలో పనిచేయుటకు తమ స్వయం ప్రతిపత్తిని నిలబెట్టుకొని రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి చురుకుగా కృషి చేస్తాయని ఆశింపవచ్చును.

## 9.9. సారాంశం :

పరిశ్రమల స్థాపనకు, నిర్వహణకు, పునర్నిర్మాణమునకు, ఆధునికీకరణకు దీర్ఘకాల మూలధన వనరులు అత్యంతావశ్యకం. వాణిజ్య బ్యాంకులు పరిశ్రమలకు కావలసిన దీర్ఘకాల వనరులను సమకూర్చలేకపోతున్నాయి. అందువలన దేశ స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం పారిశ్రామిక ఋణాలను అందచేయడం లక్ష్యంగా అనేక ద్రవ్యసహాయక అభివృద్ధి సంస్థలను నెలకొల్పినది. ప్రస్తుతం మన దేశంలో 50 అభివృద్ధి బ్యాంకులు ఉన్నాయి. వీటిలో భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు, రాష్ట్ర ఆర్థికసహాయ సంస్థలు ముఖ్యమైనవి. ద్రవ్యసహాయాన్నేగాక, సాంకేతిక సలహాలను కూడా ఈ సంస్థలు అందజేస్తున్నవి. మార్కెటింగ్, పెట్టుబడి పరిశోధనలు జరపటానికి సాంకేతిక - పరిపాలనా విషయాలలో సూచనలు, సలహాలు ఇస్తూ అభివృద్ధి బ్యాంకులు కృషిచేస్తున్నవి.

## 9.10.పదకోశం (Glossary)

రీ-ఫైనాన్స్ సౌకర్యం : పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు ఆర్థికసహాయ సంస్థలకు, అది యిచ్చే ఋణాల మీద అప్పులు ఇస్తుంది. ఈ పద్ధతిని 'రీ-ఫైనాన్స్ సౌకర్యం' లేదా "పరోక్ష సహాయం" అంటారు.

సీడ్ కాపిటల్ పథకం : తగిన సామర్థ్యం, నైపుణ్యం కలిగి మూలధనం లేని పారిశ్రామిక వేత్తలకు నూతన పరిశ్రమలు నెలకొల్పుటకు చేసే సహాయ పథకం

## 9.11. స్వీయ మదింపు ప్రశ్నలు

**5 మార్కుల ప్రశ్నలు**

1. అభివృద్ధి బ్యాంకుల ఆవశ్యకతను వివరింపుము.
2. అభివృద్ధి బ్యాంకుల లక్ష్యాలను తెలియచేయుము.

**10 మార్కుల ప్రశ్నలు**

1. అభివృద్ధి బ్యాంకుల విధులను వివరింపుము.
2. భారత చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు కార్యకలాపాలను వివరింపుము.

**20 మార్కుల ప్రశ్నలు**

1. భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు కార్యకలాపాలను సంగ్రహంగా వివరించండి.
2. రాష్ట్ర ఆర్థిక సంస్థల కార్యకలాపాలను నిశితంగా వివరింపుము.

## చదువదగిన గ్రంథాలు :


| | | | |
|---|---|---|---|
| 1. | Banking & Financial Systems | - | Mithani & Gordon |
| 2. | Banking & Financial Services | - | S.N. Maheswari & R.R. Paul |
| 3. | Banking Theory, Law & Practice | - | Sundaram & Varshney |
| 4. | కరెన్సీ - బ్యాంకింగ్ | - | తెలుగు అకాడమీ |
| 5. | కరెన్సీ - బ్యాంకింగ్ | - | డా॥ కె.వి.రావు |
| | | | డా॥ జి.ప్రసాద్ |

**పాఠం - 10**

# భారతీయ ద్రవ్య మార్కెట్

**లక్ష్యాలు :** ఈ పాఠం ఈ క్రింది అంశాలను చర్చించడానికి ఉద్దేశించబడింది.

* ద్రవ్య మార్కెట్ అంటే ఏమిటి ? అది ఏ విధంగా పని చేస్తుంది.
* ఏ దేశానికైనా ద్రవ్యమార్కెట్ యొక్క అవసరం ఏమిటి ?
* భారతదేశంలో ద్రవ్యమార్కెట్ స్థితి, అభివృద్ధి, లోపాలు, పనితీరు మెరుగుపర్చడానికి అవసరమైన చర్యలు
* భారతీయ ద్రవ్యమార్కెట్‌లో అసంఘటిత రంగంయొక్క ప్రాబల్యం.

**విషయ క్రమం**


10.1 ద్రవ్యమార్కెట్ - పరిచయం

10.2 ద్రవ్యమార్కెట్ - నిర్వచనం

10.3 ద్రవ్యమార్కెట్ - విధులు

10.4 ద్రవ్యమార్కెట్ - ప్రాముఖ్యం

10.5 ద్రవ్యమార్కెట్‌లో భాగాలు

10.6 ద్రవ్యమార్కెట్‌లోని సంస్థలు

10.7 అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ లక్షణాలు

10.8 భారతదేశంలో ద్రవ్యమార్కెట్

10.9 భారతీయ ద్రవ్యమార్కెట్ - లోపాలు

10.10 భారతీయ ద్రవ్యమార్కెట్ పనితీరును మెరుగుపర్చడానికి తీసుకున్న చర్యలు

10.11 అసంఘటిత రంగం - వడ్డీ వ్యాపారస్తుల పాత్ర

10.12 అసంఘటిత రంగం - దేశీయ బ్యాంకర్ల పాత్ర

10.13 దేశీయ బ్యాంకర్లు - రిజర్వుబ్యాంక్

10.14 సారాంశం

10.15 స్వీయ మదింపు ప్రశ్నలు

10.16 పదకోశం

10.17 చదువదగిన గ్రంథాలు

## 10.1 ద్రవ్యమార్కెట్ పరిచయం :

వాణిజ్యం, వ్యవసాయం మరియు ఇతర రంగాల కార్యకలాపాలు నిర్వహించడానికి రెండురకాల నిధులు అవసరమవుతాయి. ఇవి 1) దీర్ఘకాలిక నిధులు 2) స్వల్పకాలిక నిధులు. దీర్ఘకాల నిధులు లేదా ఋణాలు ఇచ్చిపుచ్చుకునే మార్కెట్‌ను 'మూలధన మార్కెట్' (Capital Market) అంటారు. స్వల్పకాలిక నిధులు లేదా ఋణాలు ఇచ్చిపుచ్చుకునే మార్కెట్‌ను ద్రవ్యమార్కెట్ (Money Market) అంటారు. అందువలన మార్కెట్లు అందించే పరపతియొక్క కాలవ్యవధిని బట్టి పరపతి మార్కెట్లను వర్గీకరిస్తారు. సాధారణంగా ద్రవ్యమార్కెట్ స్వల్పకాలిక పరపతి కలుగచేస్తే, మూలధన మార్కెట్ దీర్ఘకాలిక పరపతి సౌకర్యాన్ని కలుగజేస్తుంది.

## 10.2 ద్రవ్యమార్కెట్ - నిర్వచనం :

స్వల్పకాలిక ఆర్థిక వనరులను సమకూర్చే మార్కెట్‌ను ద్రవ్యమార్కెట్ అంటారు. ద్రవ్యమార్కెట్‌లో వర్తకులు, స్పెక్యులేటర్లు, బ్రోకర్లు, పారిశ్రామికదారులు, ఉత్పత్తిదారులు, సంస్థలు, ప్రభుత్వం, వాణిజ్యబ్యాంకులు, ఆర్థిక కంపెనీలు, భీమాకంపెనీలు, కేంద్రబ్యాంక్ ఉంటారు. ఈ మార్కెట్‌లో వర్తకహుండీలు, ప్రామిసరీనోట్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు మొదలైనవాటిని కొనడం, విక్రయించడం జరుగుతుంది. ఈ పత్రాలన్నింటిని సమీపద్రవ్యం (near money) గా పేర్కొనవచ్చును.

ప్రొ॥ క్రౌధర్ అభిప్రాయంలో "సమీప ద్రవ్యానికి సంబంధించిన వివిధ తరగతులతో వ్యవహరించే వివిధ సంస్థలకు ఇచ్చిన పేరే ద్రవ్యమార్కెట్" ("The Money Market is the collective name given to the various firms and institutions that deal in the various grades of near money:) .

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యమార్కెట్‌ను గురించి వివరిస్తూ "ద్రవ్యమార్కెట్ ముఖ్యంగా స్వల్పకాలిక స్వభావం గల ద్రవ్యపరమైన ఆస్తులతో జరిపే వ్యవహారాలకు కేంద్రమై ఉంటుంది. ఇది అప్పు తీసుకునేవారి స్వల్పకాల ద్రవ్య అవసరాలను తీరుస్తూ ఋణాలు అందించేవారికి ద్రవ్యత్వాన్ని లేదా నగదును సమకూరుస్తుంది" అని పేర్కొన్నది. ("Money Market is the centre for dealings mainly of a short term character in monetary assets; it meets the short term requirements of borrowers and provides liquidity or cash to the lenders").

ద్రవ్యరూపంలో ఉండే ఆస్తులకు, స్వల్పకాలిక సెక్యూరిటీలకు సంబంధించిన వ్యవహారాలు జరిగే ప్రదేశాన్ని ద్రవ్యమార్కెట్ అనవచ్చును.

## 10.3 ద్రవ్యమార్కెట్ విధులు :

ద్రవ్యమార్కెట్లు నిర్వర్తించే విధులు స్థూలంగా క్రింది విధంగా ఉంటాయి.

1) ప్రైవేటు వ్యక్తులకు, ప్రభుత్వానికి కావలసిన స్వల్పకాలిక నిధులను సమకూర్చడం.
2) కేంద్ర బ్యాంకులు పరపతి సృష్టిపై నియంత్రణను చేపట్టడంలో ఉపయోగపడటం.
3) వ్యాపార రంగానికి చెందిన వ్యక్తులకు స్వల్పకాలిక నిధులను సమకూరుస్తూ వారి నిర్వహణ మూలధన అవసరాలను తీర్చడం.
4) వ్యాపార రంగానికి చెందిన వ్యక్తులు, వాణిజ్య బ్యాంకులు తమ వద్ద ఉన్న డబ్బును స్వల్పకాలిక వ్యవధి పెట్టుబడి చేసే అవకాశం కల్పిస్తూ అవసరమైనప్పుడు తిరిగి పొందే సౌలభ్యాన్ని సమకూర్చడం ద్వారా ద్రవ్యత్వాన్ని కల్పించడం.
5) దేశ ఆర్థికవ్యవస్థలో ప్రభుత్వవృద్ధినీ, కరెన్సీ యూనిట్ స్థిరత్వాన్ని సాధించటానికి తోడ్పడటం.

## 10.4 ద్రవ్యమార్కెట్ ప్రాముఖ్యత :

దేశ ఆర్థికాభివృద్ధిలో ద్రవ్యమార్కెట్‌కు విశిష్టమైన ప్రాముఖ్యం ఉన్నది. వాణిజ్య, వ్యవసాయ, ఇతర రంగాలకు అవసరమైన స్వల్పకాలిక ద్రవ్యాన్ని ఇది సమకూరుస్తుంది. ద్రవ్యమార్కెట్ యొక్క ప్రాముఖ్యాన్ని ఈ క్రింది అంశాల ద్వారా గమనింపవచ్చును.

1. **నిర్వహణా మూలధనాన్ని సమకూర్చడం :** ద్రవ్యమార్కెట్ వ్యాపార, పరిశ్రమలకు అవసరమైన నిర్వహణా మూలధనాన్ని సమకూరుస్తుంది. వీటికోసం బిల్లులను డిస్కౌంట్, రీడిస్కౌంట్ చేసుకునే సౌకర్యం కల్పిస్తుంది. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ ఉండటం వల్ల దేశ పారిశ్రామిక ప్రగతి కుంటుపడకుండా సక్రమంగా ముందుకు పోవడానికి వీలుంటుంది.

2. **కేంద్ర బ్యాంకుకు సహాయం :** అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ కేంద్ర బ్యాంకుకు కూడా ఎంతో సహాయపడుతుంది. ద్రవ్యమార్కెట్ అమలులో ఉన్న ఆర్థిక, బ్యాంకింగ్ పరిస్థితులకు దర్పణం లాంటిది. దానిననుసరించి కేంద్రబ్యాంక్ తన విధానాలను రూపొందించుకొనవచ్చును. కేంద్రబ్యాంక్ దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థమీద నియంత్రణను సులభంగా అమలు చేయవచ్చును.

3. **ప్రభుత్వానికి సేవలు :** ద్రవ్యమార్కెట్ ప్రభుత్వానికి అనేక విధాలుగా సహాయపడుతుంది. ప్రభుత్వం ట్రెజరీ బిల్లులను అమ్మడం ద్వారా తనకవసరమైన స్వల్పకాల నిధులను సమకూర్చుకుంటుంది. ద్రవ్యమార్కెట్‌లోని ఇతర సంస్థలనుండి కూడా ప్రభుత్వం నిధులను పొందవచ్చును. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ ఉన్నప్పుడు విదేశీ ప్రభుత్వాలు కూడా తమకు కావలసిన స్వల్పకాలిక నిధులను ద్రవ్యమార్కెట్ల నుండి సమకూర్చుకోవచ్చును.

4. **సమర్థవంతమైన నిధుల పంపిణీ :** వాణిజ్య బ్యాంకులు, ఇతర సంస్థలవద్ద ఉన్న స్వల్పకాలిక నిధులను లాభదాయకంగా వినియోగించడంలో ద్రవ్యమార్కెట్ ఉపయోగపడుతుంది. పిలుపు ద్రవ్యమార్కెట్‌కు, బిల్లుమార్కెట్‌కు ఇచ్చే అప్పుకు భద్రత, లిక్విడిటీ ఉంటుంది. అందుచేత వాణిజ్య బ్యాంకులు తమ వద్ద ఉన్న మిగులు నిధులను తేలికగా నగదులోనికి మార్చుకొనదగిన ఆస్తులపై పెట్టుబడి పెట్టే అవకాశమున్నది.

5. **నిధుల బదిలీ :** క్రమబద్ధమైన, అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ ఒక ప్రదేశంనుండి మరొక ప్రదేశానికి సత్వరం నిధులను మళ్ళించడం ద్వారా ప్రాంతీయంగా ఉన్న నిధుల సరఫరాలోని ఎక్కువ, తక్కువలను నివారిస్తుంది. స్వల్పకాలిక మిగులు నిధులకు లాభదాయకమైన పెట్టుబడిని ఏర్పాటు చేయడం ద్వారా వ్యక్తులు, ఆర్థికసంస్థలు ఆర్జించే లాభాల పెరుగుదలకు సహాయపడుతుంది. సమర్థవంతమైన నిధుల బదిలీ ద్వారా వడ్డీ రేట్లలోని వ్యత్యాసాలను తగ్గిస్తుంది.

## 10.5. ద్రవ్యమార్కెట్‌లో భాగాలు :

ద్రవ్యమార్కెట్ వివిధ ఉపమార్కెట్లుగా విభజింపబడి ఉంటుంది. ప్రతి ఒక ఉపమార్కెట్ ఒక విధమైన స్వల్పకాలిక పరపతిని అందిస్తుంది. ద్రవ్యమార్కెట్‌లో సాధారణంగా ఈ క్రింది ఉపభాగాలు ఉంటాయి.

**ద్రవ్యమార్కెట్**

- పిలుపు ద్రవ్యమార్కెట్
- అనుషంగిక ఋణాల మార్కెట్
- స్వీకృతి మార్కెట్
- బిల్లు మార్కెట్

1. **పిలుపు ద్రవ్యమార్కెట్ :** (Call Money Market): పిలుపు మార్కెట్ ద్రవ్యమార్కెట్‌లో అతి ముఖ్యమైన అంతర్భాగం. ఈ మార్కెట్ స్వల్పకాలిక ఋణాలకోసం ఉద్దేశించబడింది. బిల్లు బ్రోకర్లకు, స్టాక్ ఎక్స్ఛేంజి డీలర్లకు స్వల్పకాలిక ఆర్థిక

సర్దుబాట్లు అవసరమవుతాయి. సాధారణంగా ఈ ఋణాలను ఏడు రోజుల వ్యవధిలో చెల్లించవలసి ఉంటుంది. ఇచ్చిన ఋణం అదేరోజు వెనుకకు తీసుకొనే అవకాశం కూడా ఉంటుంది. అందుకే వాటిని "కోరగానే తక్కువ వ్యవధిలో వసూలయ్యే ఋణాలు" (Money at call and short notice) అని కూడా పిలుస్తారు. ఈ ఋణాలను బ్యాంకులో నగదు తరువాత నగదు వంటివిగా భావిస్తారు. వాణిజ్య బ్యాంకులు పిలుపు ద్రవ్యాన్ని సప్లయి చేయగా స్టాక్ ఎక్ఛేంజి బ్రోకర్లు, డీలర్లు ఈ ద్రవ్యాన్ని ఋణాలుగా తీసుకుంటారు.

2. **అనుషంగిక ఋణాల మార్కెట్** (Collateral Loan Market) : ఈ రకమైన మార్కెట్‌లో స్వల్పకాలిక ఋణాలు బాండ్లు, స్టాక్‌లు, సెక్యూరిటీల ఆధారంగా మంజూరు చేయబడతాయి. ఋణగ్రహీత ఋణాన్ని చెల్లించకపోతే ఋణదాత సెక్యూరిటీలను స్వాధీనం చేసుకుంటాడు. సాధారణంగా బ్రోకర్లు, డీలర్లు ఇటువంటి ఋణాలను వాణిజ్యబ్యాంకుల నుండి పొందుతారు.

3. **స్వీకృతి మార్కెట్** (Acceptance Market): స్వదేశీ, విదేశీ వ్యాపార లావాదేవీలలో సరుకు అమ్మిన వ్యక్తి కొనుగోలు చేసిన వ్యక్తిపై హుండీ వ్రాయడం జరుగుతంది. అయితే కొన్ని సందర్భాలలో కొనుగోలుదారుని తరపున బ్యాంకులుగాని ఇతర ద్రవ్యసంస్థలుగాని హుండీలను అంగీకరిస్తాయి. కాబట్టి దేశ విదేశీ వ్యాపారానికి చెందిన వాణిజ్య బ్యాంకుల అంగీకారాలకు సంబంధించిన మార్కెట్‌ను 'స్వీకృతి మార్కెట్' అంటారు.

అంతర్జాతీయ వర్తకంలో ఆర్థిక సహాయం అందించటానికి బ్యాంకర్లు స్వీకృతులను ప్రధానంగా వాడతారు. లండన్ ద్రవ్యమార్కెట్‌లో బిల్లులు స్వీకృతి విషయంలో ప్రత్యేక సంస్థలున్నాయి. వాటిని 'స్వీకృతి గృహాలు' (Acceptance Houses) అని పిలుస్తారు. స్వీకృతి గృహాల విధులు చాలా దేశాలలో వాణిజ్య బ్యాంకులే నిర్వహిస్తున్నాయి.

4. **బిల్లు మార్కెట్** (Bill Market): దీనినే డిస్కౌంట్ మార్కెట్ అని కూడా అంటారు. ఈ మార్కెట్ వివిధ రకాలైన వ్యాపార బిల్లులను కొనుగోలు, అమ్మకం చేస్తుంది. బిల్ మార్కెట్‌లో రెండురకాల బిల్లులుంటాయి. అవి (1) వినిమయ బిల్లులు, (2) ట్రెజరీ బిల్లులు. ఖాతాదారులకు నిధులు సమకూర్చడం కోసం వాణిజ్య బ్యాంకులు వినిమయ బిల్లులను డిస్కౌంట్ చేసుకుంటాయి. వాణిజ్య బ్యాంకులు తమకు కావలసిన నిధుల కోసం ఈ బిల్లులను కేంద్రబ్యాంక్ వద్ద రీ డిస్కౌంట్ చేసుకొనవచ్చును.

ట్రెజరీ బిల్లులను ప్రభుత్వ బిల్లులుగా భావిస్తారు. వీటిని కేంద్ర బ్యాంక్ జారీచేస్తుంది. సాధారణంగా 3 నెలల వ్యవధిలో ఉంటాయి. ప్రభుత్వ సెక్యూరిటీ ఉంటుంది కాబట్టి బిల్లులు విశ్వసించదగినవిగా ఉంటాయి.

## 10.6. ద్రవ్యమార్కెట్‌లోని సంస్థలు:

స్వల్పకాలిక నిధులను ఇచ్చి పుచ్చుకునే వివిధ సంస్థల ఆధారంగా కూడా ద్రవ్యమార్కెట్‌ను విశ్లేషించవచ్చును. ఈ సంస్థల స్వభావం ఒక్కొక్క దేశంలో ఒక్కో విధంగా ఉంటుంది. సాధారణంగా క్రింద పేర్కొన్న సంస్థలు ద్రవ్యమార్కెట్‌లో నిధులను సప్లయి చేయడం, డిమాండ్ చేయడం జరుగుతుంది.

**నిధులను సప్లయిచేసే సంస్థలు:**

1) కేంద్ర బ్యాంక్, 2) వాణిజ్య బ్యాంకులు, 3) నాన్ - బ్యాంకింగ్ ద్రవ్యసహాయసంస్థలు, 4) ప్రైవేటు వ్యక్తులు, భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు.

**నిధులను డిమాండు చేసే వ్యక్తులు, సంస్థలు:**

1) బిల్లు బ్రోకర్లు, 2) స్టాకు ఎక్ఛేంజి బ్రోకర్లు, డీలర్లు, 3) కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు, 4) ప్రభుత్వాలు.

## 10.7. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ లక్షణాలు:

ప్రతీ దేశంలోను వివిధ రంగాలకు అవసరమైన స్వల్పకాల నిధులను సమకూర్చడం కోసం ఒక ద్రవ్యమార్కెట్ ఉంటుంది. దేశాభివృద్ధికి, ద్రవ్యమార్కెట్ అభివృద్ధికి చాలా దగ్గర సంబంధం ఉన్నది. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ లక్షణాలు క్రింది విధంగా ఉన్నవి.

1. బ్యాంకింగ్ వ్యవస్థ సమీకృతంగా అభివృద్ధి చెందినదై ఉంటుంది. బ్యాంకులు ఇతర ద్రవ్యసహాయక సంస్థలు మంచి సమన్వయంతో ఉంటాయి.
2. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్‌లో కేంద్ర బ్యాంకు అగ్రస్థానంలో ఉంటుంది. ఇది చాలా శక్తివంతంగా ఉండి ద్రవ్యమార్కెట్‌లోని అన్ని విభాగాలను సమర్థవంతంగా నియంత్రించగలుగుతుంది.
3. వడ్డీరేట్లు ఆర్థికవ్యవస్థలో సమన్వయం చేయబడి ఉంటాయి. బ్యాంకు రేటులో ఏమాత్రం మార్పువచ్చినా దాని ప్రభావం వడ్డీరేట్లపై ఉంటుంది. అందువలన కేంద్ర బ్యాంక్ డిస్కౌంట్‌రేటు లేదా బ్యాంకురేటు అనే విధానం ద్వారా పరపతి నియంత్రణ చేయగలుగుతుంది.
4. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్‌లో జాతీయ, అంతర్జాతీయంగా వచ్చే మార్పులకు ద్రవ్యవ్యవస్థలు వెంటనే ప్రభావితమవుతాయి.
5. ఇటువంటి ద్రవ్యమార్కెట్‌లో ప్రామిసరీనోట్లు, బిల్లులు, ట్రెజరీ బిల్లులు, ప్రభుత్వబాండ్లు వంటి ద్రవ్యసాధనాలు విరివిగా ఉపయోగించబడుతూ ఉంటాయి.
6. నిధులను ఒక ప్రాంతంనుండి మరొక ప్రాంతానికి శీఘ్రంగా, సులభంగా తరలింపవచ్చును.
7. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్‌లో బిల్లుమార్కెట్ అభివృద్ధికి దారితీసే అధిక పరిమాణంలో జరిగే అంతర్జాతీయ వర్తక లావాదేవీలు ఉంటాయి.
8. ఇటువంటి ద్రవ్యమార్కెట్‌లో స్టాక్‌మార్కెట్ అవతరణకు దారిచూపే పారిశ్రామికాభివృద్ధి ఉంటుంది.
9. స్థిరమైన రాజకీయ పరిస్థితులు, విదేశీ సంస్థల పట్ల విచక్షణ చూపకపోవడం మొదలగు లక్షణాలను కూడా అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ కలిగి ఉంటుంది.

## 10.8. భారతదేశంలో ద్రవ్యమార్కెట్:

అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ ఉండడం దేశ ఆర్థికాభివృద్ధికి ఒక వరం లాంటిది. పటిష్టమైన కేంద్ర బ్యాంకు, అభివృద్ధి చెందిన వాణిజ్య బ్యాంకింగ్ వ్యవస్థ, చాలినంతగా నిధుల సరఫరా, తగినన్ని సెక్యూరిటీల లభ్యత, అనేక ఉపమార్కెట్లు ఉండడం మొదలైనవి ద్రవ్యమార్కెట్ అభివృద్ధికి దోహదం చేస్తాయి. అయితే భారతదేశ ద్రవ్యమార్కెట్‌లో ఈ లక్షణాలు చాలావరకు లోపించినట్లుగా తెలుస్తుంది. భారతదేశ ద్రవ్యమార్కెట్‌ను మధ్యతరహాగా అభివృద్ధి చెందిన మార్కెట్‌గా పేర్కొనవచ్చును.

**ద్రవ్యమార్కెట్ వర్గీకరణ:** భారతీయ ద్రవ్యమారెట్ వ్యవస్థాపరంగా రెండురకాలుగా వర్గీకరింపవచ్చును. అవి.

1. సంఘటిత ద్రవ్యమార్కెట్ (Organised Money Market)
2. అసంఘటిత ద్రవ్యమార్కెట్ (Unorganised Money Market)

**భారతదేశ ద్రవ్యమార్కెట్ సమగ్రరూపం**




**సంఘటిత ద్రవ్యమార్కెట్:** సంఘటిత ద్రవ్యమార్కెట్‌లోని అతి ముఖ్యమైన భాగం రిజర్వుబ్యాంకు. ఇది దేశంలోని బ్యాంకింగ్ సంస్థలలో అత్యున్నతమైనది (Apex Bank). ఇది మన దేశానికి కేంద్రబ్యాంకు. ద్రవ్యసుస్థిరత, సమాజశ్రేయస్సు, ఆర్థిక పురోభివృద్ధి సాధించడం ఈ బ్యాంక్ విధులు. సంఘటిత ద్రవ్యమార్కెట్‌లో రిజర్వుబ్యాంక్‌తో పాటు భారతీయ స్టేట్‌బ్యాంకు, దాని 7 అనుబంధ బ్యాంకులు, జాతీయం చేయబడిన 20 బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, సహకార బ్యాంకులు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. క్వాసీ గవర్నమెంట్ (Quasi-Government) సంస్థలైన జీవితభీమా సంస్థ, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు, యూనిట్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా, పారిశ్రామిక ద్రవ్యసహాయసంస్థ, రాష్ట్రద్రవ్యసంస్థలు, జాయింట్ స్టాక్ కంపెనీలు కూడా ఋణాలను మంజూరుచేసే సంస్థలుగా ద్రవ్యమార్కెట్ కార్యకలాపాలలో పాల్గొంటాయి. ఈ సంస్థలకు అదనంగా విత్త మధ్యవర్తులైన 'కాల్ లోన్ బ్రోకర్స్' (Call Loan Brokers), సాధారణ స్టాల్‌బ్రోకర్లు, చందా పూచీదారులు కూడా ఈ మార్కెట్‌లో ఉన్నారు.

**అసంఘటిత ద్రవ్యమార్కెట్:** దేశీయబ్యాంకర్లు, వడ్డీవ్యాపారస్తులు, చిట్‌ఫండ్ సంస్థలు, షావుకార్లు, మహాజన్‌లు, చెట్టియార్లు వంటి వ్యక్తులు అసంఘటిత రంగానికి చెందినవారు. ఈ అసంఘటిత విభాగం సజాతీయంగా (Homogenerous) గా ఉండదు. వీరు దీర్ఘకాలిక ఋణాలకు, స్వల్పకాలిక ఋణాలకు ఏమాత్రం తేడా చూపరు. రిజర్వుబ్యాంకుతో వీరికి అభిలషణీయమైన సంబంధం ఉండదు.

## 10.9. భారతీయ ద్రవ్యమార్కెట్ - లోపాలు:

మన దేశంలోని ద్రవ్యమార్కెట్ సక్రమంగా అభివృద్ధి చెందలేదు. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్లతో పోలిస్తే మన ద్రవ్యమార్కెట్ అనేక విషయాలలో వెనుకబడి ఉన్నది. భారతీయ ద్రవ్యమార్కెట్ అభివృద్ధి చెందుతున్న దేశంలోని ద్రవ్యమార్కెట్‌కు ఒక ఉదాహరణ. దీనిలో క్రింద పేర్కొన్న లోపాలు గలవు.

1. **పరస్పర సంబంధంలేని విభాగాలు:** మన ద్రవ్యమార్కెట్‌లో సంఘటిత, అసంఘటిత, విభాగాలుఉన్నవి. స్టేట్‌బ్యాంక్, వాటి అనుబంధ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు, విదేశీమారకపు బ్యాంకులు, సహకార బ్యాంకులు మొదలైనవన్నీ సంఘటిత విభాగానికి చెందినవి. దేశీయ బ్యాంకర్లు, వడ్డీ వ్యాపారులు, చిట్‌ఫండ్ సంస్థలు మొదలైనవి అసంఘటిత విభాగానికి చెందినవి. ఈ రెండింటి మధ్య సమన్వయం లేదు. ఒక భాగంలోని కార్యకలాపాలు రెండో విభాగాన్ని ప్రభావితం చేయవు. సంఘటిత విభాగంలోని సభ్యులకు లభించే ప్రభుత్వ ఆర్థిక సహాయం, అసంఘటిత విభాగంలోని సభ్యులకు లభించదు.

2. **ద్రవ్యమార్కెట్టులో అసంఘటిత విభాగం ఉనికి:** క్రమబద్ధంకాని అసంఘటిత విభాగం వుండటం మనద్రవ్యమార్కెట్టులో ఒక ముఖ్యమైన లోపం. ఈ విభాగంలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక ఋణాలకు తేడా పాటించదు. అంతేకాక ఈ విభాగంలో సభ్యులకు బయటినుంచి ఋణాలతో అవసరం కూడా లేదు. వ్యవసాయానికి, చిన్నపరిశ్రమలకు పెద్ద ఎత్తున ద్రవ్యసహాయం చేస్తున్న వీటిపై రిజర్వుబ్యాంకు అదుపు లేనేలేదు. దేశీయ బ్యాంకర్లు కూడా సంఘటిత విభాగంలోకి వచ్చేవరకు రిజర్వు బ్యాంకుకు ద్రవ్యమార్కెట్టుపై సంపూర్ణ నియంత్రణ లభించదు.

3. **వడ్డీ రేట్లలో తేడాలు:** మన దేశంలో వివిధరకాల వడ్డీరేట్లు ఉన్నాయి. అవి: ఎ) ప్రభుత్వఋణవడ్డీరేటు, బి) వాణిజ్య బ్యాంకుల డిపాజిట్లపై ఇచ్చే వడ్డీరేటు, ఋణాలపై తీసుకునే వడ్డీరేటు, సి) సహకార బ్యాంకుల వడ్డీరేట్లు. ఇటీవల కాలంలో ఈ వివిధ వడ్డీరేట్లకు బ్యాంకు రేటుకు సంబంధాన్ని తెగలిగినారు. అంతేగాక మన దేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ వడ్డీరేట్లున్నాయి. ఒక ద్రవ్యమార్కెట్టు నుండి మరొక ద్రవ్యమార్కెట్‌కుబదిలీ కావటంలో అవరోధాలు ఉన్నందున వివిధ వడ్డీరేట్లు ఉండటానికి అవకాశ మేర్పడింది. అంతేగాక సంఘటిత విభాగంలో వడ్డీరేట్లు తక్కువగాను, అసంఘటిత విభాగంలో వడ్డీరేట్లు ఎక్కువగానూ ఉన్నాయి. వివిధ వడ్డీరేట్లు ఉండటం వల్ల రిజర్వు బ్యాంకుకు ద్రవ్య వ్యవహారాలపై పూర్తి అదుపులేకుండా పోయింది. ప్రస్తుతం గతంలో ఉన్నంత తేడాలు లేకపోయినా అభివృద్ధి చెందిన దేశాలలోని ద్రవ్యమార్కెట్లలో వడ్డీరేట్ల సమానత భారతీయ ద్రవ్యమార్కెట్‌లో కనిపించదు.

4. **అభివృద్ధి చెందిన హుండీ మార్కెట్ లేకపోవడం:** మన ద్రవ్యమార్కెట్‌లో హుండీ లేదా బిల్లు మార్కెట్ లేకపోవడం తీరని లోపం. అందువల్ల పరపతి సృష్టి తగినంతగా జరగటం లేదు. అనేక కారణాల వల్ల హుండీల మార్కెట్ మన దేశంలో అభివృద్ధి చెందలేదు. అందుచేత హుండీల వాడకం తక్కువగా ఉండి ద్రవ్యమార్కెట్‌కు ద్రవ్యత (liquidity) తక్కువగా ఉంది.

5. **కాలాలవారీగా నిధుల కొరత:** మనది వ్యవసాయక దేశం. వ్యవసాయం ఋతుసంబంధమైన కార్యకలాపం. వ్యవసాయం కొన్ని కాలాల్లో జరిగే వృత్తి. వ్యవసాయ కార్యకలాపాలు ఆయా ఋతువులలో ముమ్మరంగా సాగుతాయి. ఆ సమయంలో పరపతికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ద్రవ్యమార్కెట్‌లో నిధులకు కొరత ఏర్పడి వడ్డీరేట్లు పెరుగుతాయి. అదే

పంటలు వచ్చిన కాలంలో వడ్డీరేట్లు తక్కువగా ఉంటాయి. మందకొడి కాలంలో నిధులు నిరుపయోగంగా ఉంటాయి. మందకొడి కాలంలో వడ్డీరేట్లు 10 శాతం నుండి 15 శాతం వరకూ మారుతూ ఉంటాయి.

6. **నిధుల అవ్యాకోచత్వం:** మన ద్రవ్యమార్కెట్‌లో సంఘటిత విభాగంలోని సంస్థలకు నిధులను సేకరించేశక్తి తక్కువ. అందువలన నిధులు కూడా తక్కువగానే ఉంటాయి. డిమాండ్‌ను బట్టి నిధులు పెరిగే అవకాశం లేదు. అంతేగాక ద్రవ్యనిధులు ఒక ప్రాంతంనుండి మరొక ప్రాంతానికి తరలిపోవు. ఒక ప్రాంతంలో నిధుల కొరత ఉంటుంది. మరియొక ప్రాంతంలో నిధుల మిగులు ఉంటుంది. వడ్డీరేట్లలో వ్యత్యాసం ఉండుటకు ఇది ఒక కారణం.

7. **బ్యాంకింగ్ వ్యవస్థ అభివృద్ధి చెందకపోవటం:** మన దేశ విస్తీర్ణానికి, జనాభాకు తగినంతగా బ్యాంకింగ్ సౌకర్యాలు అభివృద్ధి చెందలేదు. బ్యాంకులు పెద్ద పట్టణాలలోనే ఎక్కువ కేంద్రీకృతమై ఉన్నాయి. గ్రామ ప్రాంతాలకు అంతగా విస్తరించలేదు. దానివల్ల గ్రామాలలోని పొదుపు సమీకరించబడలేదు. ఈ పొదుపు మూలధనం పెరుగుదలకు ఉపయోగపడక వృధా అవుతున్నది. 1969 లో బ్యాంకుల జాతీయకరణ తర్వాత బ్యాంకుశాఖలు గ్రామాలకు వేగంగా విస్తరిస్తున్నాయి. అయినప్పటికి చాలా ప్రాంతాలు బ్యాంకులు లేకుండా వున్నాయి

8. **ఉపమార్కెట్లు లేకపోవడం:** అభివృద్ధి చెందిన దేశాలలోని ద్రవ్య మార్కెట్లలో వున్నటువంటి ఉపమార్కెట్లు మన ద్రవ్యమార్కెట్‌లో లేవు. ఉదాహరణకు, లండన్ ద్రవ్యమార్కెట్‌లో వున్న "స్వీకృతి గృహాలు" మన దేశ ద్రవ్యమార్కెట్‌లో లేవు. దాని వలన విదేశాలనుంచి నిధులను ఆకర్షించలేకపోతున్నది.

9. **పరపతి వ్యవస్థలో దేశీయ బ్యాంకర్ల ప్రాముఖ్యత:** మనదేశ ద్రవ్యమార్కెట్‌ల దేశీయబ్యాంకర్లు అపరిమితమైన సంఖ్యాలో ఉన్నాయి. వీటిపై నియంత్రణ లేకపోవటం వల్ల ద్రవ్యవ్యవస్థ బలహీనమౌతుంది. మన పరపతి అవసరాలలో 60 శాతం వరకూ దేశీయ బ్యాంకర్లు, వడ్డీ వ్యాపారులు అందిస్తున్నారు. వీరిచ్చే పరపతి ఎక్కువగా గ్రామాలలో అనుత్పాదక కార్యకలాపాలకు వినియోగింపబడుతున్నది. వీరు వసూలు చేసే వడ్డీ వడ్డీరేటు కూడా ఎక్కువ. ఈ పరపతి ఉత్పత్తికి దోహదం చేయకపోగా గ్రామీణ ఋణగ్రస్తతకు దారితీస్తున్నది.

10. **విదేశమారక నిధులను ఆకర్షించలేకపోవుట:** మన బ్యాంకులకు విదేశీమారక కార్యకలాపాలను భారీ ఎత్తున నిర్వహించగల శక్తిసామర్థ్యాలు లేవు. ఫలితంగా మన ద్రవ్యమార్కెట్ విదేశీమారక నిధులను తగినంతగా ఆకర్షించలేకపోతున్నది.

## 10.10. భారతీయ ద్రవ్యమార్కెట్ పనితీరును మెరుగుపర్చడానికి తీసుకున్న చర్యలు (Measures taken to improve Indian Money Market ):

భారతదేశ ద్రవ్యమార్కెట్‌లో అనేక లోపాలు ఉన్నందువల్ల ద్రవ్యవిధానాల అమలును, పరపతి నియంత్రణ చర్యలను రిజర్వుబ్యాంకు సమర్ధవంతంగా చేపట్టలేకపోయింది. ఈ లోపాల నివారణకై ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు రిజర్వుబ్యాంకు ఎన్నో చర్యలను తీసుకోవడం జరిగింది. ఈ చర్యలలో కొన్ని ముఖ్యమైనవి క్రింద పేర్కొనబడినాయి:

1. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాన్ని 1949 లో ప్రవేశపెట్టడం మూలంగా రిజర్వుబ్యాంకు, బ్యాంకింగ్ సంస్థల పరపతి విధానాలపై విస్తృత అధికారాన్ని పొందింది. దీని ద్వారా దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను క్రమబద్ధీకరించటానికి రిజర్వుబ్యాంక్‌కు అవకాశం కలిగింది.

2. దేశీయ బ్యాంకర్లు, వడ్డీవ్యాపారస్తులకు ప్రత్యామ్నాయంగా పనిచేయడానికై దేశవ్యాప్తంగా సహకార పరపతి సంఘాల్ని ప్రభుత్వం ప్రోత్సహించింది.

3. కేంద్ర సహకార బ్యాంకులు తాను సేకరించే డిపాజిట్ మొత్తాల్ని బట్టి రిజర్వుబ్యాంకునుంచి అప్పు పొందడమనే పథకాన్ని రిజర్వుబ్యాంకులోని వ్యవసాయ పరపతి విభాగం ప్రవేశపెట్టింది.

4. వ్యవసాయదారుల పరపతి అవసరాల్ని సక్రమంగా తీర్చడానికై 1982 లో భారతీయ వ్యవసాయం మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంక్‌ను (NABARD) ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

5. బలహీనంగా ఉన్న ప్రాథమిక పరపతి సంఘాల స్థానంలో గ్రామీణబ్యాంకుల ఏర్పాటు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏర్పాటు వంటి చర్యల్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వాణిజ్యబ్యాంకుల ద్వారా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల విత్తసేకరణ గావించుకునే ఏర్పాటుకు సంబంధించిన పథకాన్ని కూడా ప్రభుత్వం 1970 లో ప్రవేపెట్టింది.

6. సహకార బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రజలలో విశ్వాసాన్ని పెంచాలన్న ఉద్దేశ్యంతో సహకరబ్యాంకులకు రిజర్వుబ్యాంకు ఇటీవల "పరపతి గ్యారంటీ పథకాన్ని" వర్తింపచేయడం జరిగింది.

7. దేశీయ బ్యాంకర్లు, వాణిజ్య బ్యాంకులకు మధ్య స్నేహపూరిత సంబంధాలను నెలకొల్పడానికి చర్యలను తీసుకున్నది. బిల్లు మార్కెట్ అభివృద్ధి పరచే ఉద్దేశ్యంతో 1952 లోనూ, 1970 లోనూ రిజర్వుబ్యాంక్ బిల్లు మార్కెట్ పథకాన్ని ప్రవేశపెట్టింది.

8. బ్యాంకుల జాతీయీకరణను 1969 లో ప్రభుత్వం చేపట్టింది. దీనివల్ల బ్యాంకులు జాతి ప్రయోజనాలకు తగినట్లు పనిచేయడానికి వీలవుతుంది.

9. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కొరతల్ని తెలుసుకోవడానికి వీలుగా 1967లో ప్రభుత్వం "లీడ్ బ్యాంక్ పథకాన్ని" (Lead Bank Scheme) ప్రవేశపెట్టింది. ఈ పథకం ప్రకారం వాణిజ్య బ్యాంక్‌లకు వృద్ధి కేంద్రాలను కనుక్కోవడం, వడిపాజిట్ సామర్థ్యాన్ని అంచనా వేయడం, పరపతి వ్యత్యాసాలను అన్వేషించడం, జిల్లా అభివృద్ధి నిమిత్తం సమన్వయ పూరితమైన ధోరణి కలిగియున్న ప్రణాళికను రూపొందించడం వంటి విషయాలలో అధికారాలు, బాధ్యత ఇవ్వబడ్డాయి.

10. చిట్‌ఫండ్లు మరియు నిధులపై నియంత్రణ సాధించే నిమిత్తం "నిధులు - చిట్‌ఫండ్ల చట్టాన్ని" కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది.

11. శ్రీ ఎస్.వాఘుల్ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన "ద్రవ్యమార్కెట్ పనితీరు సంఘం" 1987లో సమర్పించి నివేదికలోని సిఫార్సు మేరకు భారత రిజర్వుబ్యాంకు ఇతర పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల సహకారంతో 1980 ఏప్రిల్‌లో "భారతీయ డిస్కాంటు మరియు విత్తకేంద్రం" (Discount and Finance House of India) పేరున స్థాపించింది. దీనిని స్థాపించుటలో ముఖ్యోద్దేశం వివిధ స్వల్పకాలిక పరపతి పత్రాలకు ద్రవ్యత్వం సమకూర్చడమే. ఈ సంఘం ద్రవ్యమార్కెట్ పనితీరును సమగ్రంగా పరిశీలించి, దాని పనితీరును మెరుగుపర్చటానికి చేసిన వివిధ సూచనలను రిజర్వుబ్యాంకు అమలు చేయుచున్నది.

12. భిన్నకాలాల్లో, భిన్నప్రాంతాలలో అమలులో వున్న వడ్డీరేట్లలోని వ్యత్యాసాలను తగ్గించుటకు రిజర్వుబ్యాంకు పలుచర్యలు తీసుకున్నది. కొంతవరకు విజయం సాధించింది.

13. చక్రవర్తి కమిటీ, నరసింహం కమిటీ సిఫార్సుల మేరకు ద్రవ్యమార్కెట్‌ను అభివృద్ధి పరచుటకు రిజర్వు బ్యాంకు పలు చర్యలను తీసుకొన్నది. వడ్డీరేట్లకు సంబంధించిన నిబంధనలను సడలించింది. కొత్త ద్రవ్యపత్రాలను మార్కెట్‌లో

ప్రవేశపెట్టింది. 182 రోజుల ట్రెజరీ బిల్లులు, డిపాజిట్ సర్టిఫికెట్లు, వాణిజ్య పేపర్లు మొదలగువాటిని ద్రవ్యమార్కెట్‌లో ప్రవేశపెట్టింది.

పైన పేర్కొన్న చర్యలను ఎన్నింటినో ప్రభుత్వం, మరియు రిజర్వు బ్యాంకు చేపడుతున్నప్పటికీ, భారతీయ ద్రవ్యమార్కెట్‌లోని సంఘటిత, అసంఘటిత రంగాల మధ్య సమైక్యతా సాధన ఇంకా పూర్తికాకుండానే మిగిలిపోయింది. ఈ రెండు రంగాలమధ్య నెలకొన్న అగాధం పూరించబడే వరకు ద్రవ్య విధానాలకు, పరపతి నియంత్రణ చర్యలను రిజర్వు బ్యాంకు సమర్ధవంతంగా నిర్వహించడం వీలుకాదు.

**ద్రవ్యమార్కెట్‌లోని లోపాలను తొలగించుటకు తీసుకోవాల్సిన చర్యలు:** ద్రవ్యమార్కెట్‌లోని లోపాలను సవరించుటకై ఈక్రింది సలహాలు పాటిస్తే ఇంకా కొంతవరకు ద్రవ్యమార్కెట్ యొక్క పనితీరు మెరుగుపడే అవకాశముంది.

1. దేశీయ బ్యాంకర్లయొక్క వ్యాపార లావాదేవీలు పూర్తిగా రిజర్వు బ్యాంకు నియంత్రణలోకి తేవడం.
2. ద్రవ్యమార్కెట్‌లో చలామణి అయ్యే హుండీలను ప్రమాణీకరణ చేసి దేశమంతా ఒకే త్రాటిపై లావాదేవీలు జరిపేందుకు "ఆల్ ఇండియా ద్రవ్యమార్కెట్" ను ఏర్పాటు చేయడం.
3. బ్యాంకింగ్ సేవలు లభ్యంకాని రంగాల్లో మరియు నిర్లక్ష్యం చేయబడిన రంగాల్లో బ్యాంకింగ్ సేవలను విస్తరించడం.
4. దేశంలో 'బిల్‌మార్కెట్' అభివృద్ధి చేయుటకు డిస్కౌంటింగ్ మరియు రీ - డిస్కౌంటింగ్ సౌకర్యాలను అభివృద్ధి పరచవలెను.
5. ద్రవ్యమార్కెట్ యొక్క పనితీరు సామర్ధ్యాన్ని పెంచుటకు క్లియరింగ్ హౌస్‌ల సంఖ్యను పెంచవలెను.
6. మూలధన చలనవేగం పెంచుటకై తక్కువ వ్యయంతో కూడిన బ్యాంకింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయవలెను.
7. వడ్డీరేట్లలో తేడాలను ఇంకా తగ్గించుటకు ప్రయత్నించవలెను.
8. కాలాలవారీగా ఏర్పడే నిధులకొరతను తీర్చుటకు వాణిజ్యబ్యాంకులు ఎక్కువగా ఋణాలు మంజూరు చేయవలెను.
9. ద్రవ్యమార్కెట్‌లోని వివిధ సభ్యుల కార్యకలాపాలను రిజర్వుబ్యాంక్ సమన్వయం చేయవలెను. మార్కెట్‌లోని వివిధ సభ్యుల మధ్య సమావేశాలను తరచుగా జరిపించి ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలకు పరపతిని కల్పించుటకు పథకాలను తయారుచేయవలెను.

## 10. 11 . అసంఘటిత రంగం - వడ్డీవ్యాపారస్తుల పాత్ర:

భారతీయ ద్రవ్యమార్కెట్‌లోని అసంఘటిత రంగంలో ప్రాతినిధ్యం వహించిన దేశీయ ఆర్థిక సంస్థలకు చెందినవారే ఈ వడ్డీ వ్యాపారస్తులు. వడ్డీవ్యాపారం చేయడమే వీరి ప్రధాన వ్యాపారం. అయితే వడ్డీవ్యాపారంతో బాటు వీరు ఇతర వ్యాపారాలు కూడా చేస్తారు. దేశీయ బ్యాంకర్లకు వడ్డీ వ్యాపారస్తులకు క్రింది తేడాలున్నాయి.

1. వడ్డీవ్యాపారం అనేది వడ్డీ వ్యాపారస్తుల ప్రధాన వృత్తి కాగా దేశీయ బ్యాంకర్లు బ్యాంకింగ్ వ్యాపారాన్ని ప్రధానవ్యాపారంగా చేపడ్తారు. దేశీయ బ్యాంకర్లు డిపాజిట్లు స్వీకరించటం, హుండీలతో వ్యవహరించటం వంటివి చేపడ్తారు. దేశీయ బ్యాంకర్లు డిపాజిట్లు స్వీకరించటం, హుండీలతో వ్యవహరించటం వంటి కార్యకలాపాలు కూడా నిర్వహిస్తారు.
2. వడ్డీవ్యాపారస్తులు సాధారణంగా వినియోగపు ఋణాలను మంజూరుచేయగా దేశీయ బ్యాంకర్లు ఉత్పత్తి రుణాల్ని కూడా అందిస్తారు.

3. వడ్డీ వ్యాపారులు తాము మంజూరు చేసిన ఋణాల వినియోగాన్ని గురించి పట్టించుకోరు. కాని దేశీయ బ్యాంకర్లు అలా కాకుండా ఋణ ధ్యేయాలు, వినియోగాన్ని గురించి శ్రద్ధ వహిస్తారు.

4. వడ్డీవ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని సాధారణంగా నగదు ప్రాతిపదికపై గాని లేదా ప్రామిసరీ నోట్ల రూపంలో గాని నిర్వహిస్తారు. దేశీయబ్యాంకర్లు హుండీల వంటి స్వల్పకాలిక సాధనాల ద్వారా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తారు.

5. వడ్డీ వ్యాపారస్తులు పరిమిత ప్రదేశాలకు తమ కార్యకలాపాలన్ని పరిమితం చేయగా దేశీయ బ్యాంకర్ల కార్యకలాపాలు భౌగోళికంగా ఎక్కువగా విస్తరించి ఉంటాయి.

వడ్డీవ్యాపారస్తులను ప్రధానంగా వృత్తిపరమైన వడ్డీ వ్యాపారస్తులు అని వృతిపరంకాని వడ్డీవ్యాపారస్తులనీ రెండురకాలుగా వర్గీకరిస్తారు. వృత్తిపరమైన వడ్డీవ్యాపారస్తులు లైసెన్స్‌ను పొందడం ద్వారా వడ్డీవ్యాపారాన్ని ప్రధానంగా చేపడ్తారు. కాని రెండో రకానికి చెందిన వడ్డీవ్యాపారస్తులు, అలాకాక ప్రధానంగా ఇతర కార్యకలాపాలన్నీ చేపడుతూ తాము చేపట్టే వ్యాపారంలో వచ్చే మిగులును మాత్రం తమకు పరిచయమున్న వ్యక్తులకు ఋణాలుగా ఇస్తారు. భూస్వాములు, వర్తకులు, పెన్షనర్లు వంటి, అనేక వ్యక్తులు ఈ వర్గానికి చెందుతారు. వడ్డీ వ్యాపారస్తులను గ్రామీణ వడ్డీ వ్యాపారస్తులని, పట్టణ వడ్డీవ్యాపారులని కూడా వర్గీకరిస్తారు. గ్రామీణ వడ్డీవ్యాపారస్తులు వ్యవసాయదారులు, గ్రామీణ చేతివృత్తుల పనివారలకు ఋణసౌకర్యం అందించగా, పట్టణ వడ్డీవ్యాపారస్తులు పేదకార్మికులు, ఫ్యాక్టరీ పనివారలు వంటి వ్యక్తులకు ఋణసౌకర్యాన్ని కల్పిస్తారు.

## వడ్డీవ్యాపారస్తుల కార్యకలాపాలు:

భారతదేశంలో వడ్డీవ్యాపారస్తుల కార్యకలాపాలను గూర్చి అఖిలభారత గ్రామీణపరపతి సర్వే నివేదికలో ఈ క్రింది అంశాలు పొందుపరచబడినాయి.

1. అప్పు తీసుకునే వ్యక్తి స్థితిగతులను గురించి ఖచ్చితమైన అవగాహన ఉన్నందున వడ్డీ వ్యాపారస్తులకు నష్టభయం కనీస స్థాయిలో ఉంటుంది.

2. వడ్డీవ్యాపారస్థులు సాధారణంగా వారి ఖాతాదారుల వ్యక్తిగత హామీ ప్రాతిపదికపై ఋణాలు ఇస్తారు.

3. సాధారణంగా వడ్డీవ్యాపారస్తులు వినియోగపు ఋణాలను ఇస్తారు.

4. వడ్డీవ్యాపారస్తులు తమ ఖాతాదారులతో వ్యక్తిగత సంబంధాల్ని పెట్టుకుంటారు.

5. వడ్డీవ్యాపారస్తులు వడ్డీరేటు విధానంలో ఏకరూపతను పాటించరు.

6. వడ్డీవ్యాపారస్తులు అనేక అవాంఛనీయ విధానాలకు పాల్పడ్తారు. వాటిని క్రింద పేర్కొనటం జరిగింది.
   ఎ) వడ్డీని ముందుగానే చెల్లించమని డిమాండ్ చేయడం.
   బి) బహుమతులను డిమాండ్ చేయడం.
   సి) విరాళాలు డిమాండ్ చేయడం.
   డి) లెక్కలను తారుమారు చేయడం.
   ఇ) ఋణగ్రస్తులనుంచి ఉచితసేవల్ని ఆర్జించడం.
   ఎఫ్) ఋణాల వసూళ్ళను వస్తురూపంలో చేపట్టడం.
   జి) ఋణాల మంజూరీని వాయిదాలలో చేయడం.

సహకార సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల వంటి వ్యవస్థాగత పరపతి సంస్థల అభివృద్ధి ద్వారా వడ్డీవ్యాపారస్తుల ప్రాబల్యం తగ్గించటానికి ప్రయత్నాలు జరుగుచున్నవి.

### 10.12. అసంఘటిత రంగం - దేశీయ బ్యాంకర్ల పాత్ర (Unorganized Sector - Role of Indigeneous Bankers):

మన దేశ ద్రవ్యమార్కెట్‌లోని అసంఘటిత రంగంలో దేశీయ బ్యాంకర్లు ప్రధానపాత్ర వహిస్తున్నారు. భారతీయ కేంద్ర బ్యాంకింగ్ విచారణ కమిటీ ప్రకారం "డిపాజిట్లను స్వీకరించడం, హుండీలతో వ్యవహరించడం లేదా ద్రవ్యాన్ని అప్పుగా ఇవ్వడం చేపట్టే వ్యక్తుల లేదా ప్రైవేటు సంస్థలనే దేశీయ బ్యాంకర్లు అంటారు". (Indigeneous Banker is defined as any individual or private firm receiving deposits and dealing in Hundies or lending money). కానీ వ్యవసాయ విత్తంపై ఏర్పడిన సబ్‌కమిటీ 1945 లో సమర్పించిన నివేదిక ప్రకారం దేశీయ బ్యాంకర్లు డిపాజిట్ల స్వీకరణలకు బదులు హుండీల డిస్కౌంటింగ్‌ను ప్రధాన కార్యకలాపంగా చేపడుతుందని పేర్కొన్నది.

మనదేశంలో ఖత్రాలు (Khatris), జైనులు (Jains), మార్వాడీలు (Marwaris) చెట్టీలు (Chettis) మొదలగు కుటుంబాలు దేశీయ బ్యాంకింగ్‌ను నిర్వహిస్తున్నారు.

**చరిత్ర:** దేశీయ బ్యాంకర్ల మనుగడ వేదకాలంనుండి ఉన్నట్లు చరిత్ర పేర్కొంటున్నది. ఆనాడే దేశ - విదేశీ వ్యాపారస్తులకు అప్పులిచ్చేవారు. కౌటిల్యుని అర్థశాస్త్రంలో కూడా వివిధరకాలైన అప్పులు, వాటిపై విధించే వివిధ వడ్డీరేట్లు మొదలైన లావాదేవీలను గురించి చర్చించడం జరిగింది. దేశీయ బ్యాంకర్ల యొక్క ప్రధాన కార్యకలాపమైన హుండీల వ్యాపారం 12 వ శతాబ్దం నుండే వెలుగులోనికి వచ్చినది. మొగలు సామ్రాజ్యపతనం, 1835 లో ప్రవేశపెట్టబడిన ఒకే విధమైన కరెన్సీ విధానం, పాశ్చాత్య పద్ధతులలో సంఘటిత వ్యవస్థలో వాణిజ్య బ్యాంకుల స్థాపన వలన దేశీయ బ్యాంకర్ల ప్రాధాన్యం క్రమంగా తగ్గింది.

**దేశీయ బ్యాంకర్ల విధులు:** ద్రవ్యమార్కెట్ లో దేశీయ బ్యాంకర్లు ఈ క్రింది విధులు చేపడ్తారు.

1. డిపాజిట్లను స్వీకరించడం.
2. నిధుల చెల్లింపుకై హుండీల క్రయ విక్రయాల్ని చేపట్టడం.
3. ఖాతాదారులకు సంబంధించిన విలువైన వస్తువులకు భద్రత కల్పించడం.
4. స్వదేశీ వర్తకాన్ని చేపట్టడానికి ద్రవ్యసహాయం చేయడం.
5. అనుషంగిక సెక్యూరిటీలను లేదా వ్యక్తిగత సెక్యూరిటీల ప్రాతిపదికపై చేతివృత్తుల పనివారు, పట్టణ చిన్న వర్తకులకు ద్రవ్యసహాయం చేయడం.
6. చిన్న పారిశ్రామిక వేత్తలకు నిర్వహణ మూలధనాన్ని అందించడం.

**దేశీయ బ్యాంకర్ల లక్షణాలు:** దేశీయ బ్యాంకర్ల లక్షణాలు క్రింద పేర్కొనబడినవి.

1. దేశీయ బ్యాంకర్లు డిపాజిట్లను స్వీకరించడం, హుండీలతో వ్యవహరించడం వంటి పనులు నిర్వహిస్తారు.
2. దేశీయ బ్యాంకర్లు తమ బాకీ కార్యకలాపాలను (lending operations) చేపట్టడానికి స్వంత మూలధనాన్ని వినియోగిస్తారు.
3. దేశీయ బ్యాంకర్లు అప్పుల మంజూరీలో ఎలాంటి లాంఛనాలను పాటించరు.
4. దేశీయ బ్యాంకర్లు వర్తకులు, చేతివృత్తులు పనివారు, చిన్న పారిశ్రామికవేత్తలకు రుణసహాయం చేస్తారు. వారు వ్యవసాయదారులకు మాత్రమే ప్రత్యేక ఋణాలు ఇవ్వరు.

5. దేశీయ బ్యాంకర్లు తమ వ్యక్తిగత అనుభవాన్ని వాడుకుంటూ వ్యాపారం నడిపిస్తారే తప్ప ఆధునిక బ్యాంకింగ్ నిర్వహణ సూత్రాలను విధానాలను పాటించరు.
6. దేశీయ బ్యాంకర్లు వారి ఖాతాలను ఆచారంగా వాడుకలో ఉన్న పద్ధతిలో వ్రాస్తారు.
7. దేశీయ బ్యాంకర్లు తమ ఖాతాదారుల కుటుంబ చరిత్రను పూర్తిగా తెలుసుకొని ఉంటారు.
8. దేశీయ బ్యాంకర్లు అప్పు తీసుకున్న వ్యక్తుల కార్యకలాపాలపై దృష్టిని ఉంచుతారు.
9. దేశీయ బ్యాంకర్లు భూగృహాల తనఖా స్వీకరించి ఋణాలు అందిస్తారు.
10. చాలామంది దేశీయ బ్యాంకర్లు బ్యాంకింగ్ వ్యాపారాన్ని, వర్తకం, స్పెక్యులేటివ్ కార్యకలాపాలతో కలిపి నిర్వహిస్తున్నారు.

**ద్రవ్యమార్కెట్‌లో దేశీయ బ్యాంకర్ల పాత్ర:** భారతదేశ ద్రవ్యమార్కెట్‌లోని అసంఘటిత రంగంలో దేశీయ బ్యాంకర్లు కీలక పాత్ర వహిస్తున్నారు. ప్రజల డిపాజిట్లతో ప్రమేయం లేకుండా స్వంత వనరులతో పనిచేసే ఈ బ్యాంకర్లు వాణిజ్య బ్యాంకులకన్నా కొన్ని విషయాలలో అత్యంత ఉపయోగకరంగా ఉంటారు . అన్నిరకాల సెక్యూరిటీలపై ఋణాలను మంజూరీ చేస్తూ వాణిజ్య బ్యాంకులకన్నా ఈ బ్యాంకర్లు తమ ప్రత్యేకతను నిలుపుకుంటున్నారు. అంతేగాకుండా గ్రామప్రాంతాలనుండి మండీ కేంద్రాలు (Mandi Centres), ఓడరేవులు, వ్యవసాయోత్పత్తుల గమనంలో (Movement of Agricultural Produce) కూడా ఈ దేశీయ బ్యాంకర్లు ఎంతగానో సహాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పండించబడే వ్యవసాయోత్పత్తులను కూడా దేశీయ బ్యాంకర్లు కొనుగోలు చేస్తున్నారు. ఈ విధంగా దేశీయ బ్యాంకర్లు మనదేశ ద్రవ్య మార్కెట్లో మిగతా సంఘటిత రంగంలోని సంస్థలకన్నా ఎక్కువ సేవలను గ్రామీణ ప్రజలకు అందిస్తున్నారు. అయినప్పటికి పారిశ్రామిక, వర్తక, వాణిజ్య రంగాలలో వస్తూవున్న మార్పుల దృష్ట్యా భౌగోళిక విస్తృతిని సాధిస్తున్న వాణిజ్య బ్యాంకింగ్ విధానం మూలంగానూ ఈ దేశీయ బ్యాంకర్ల ప్రాధాన్యత తగ్గుతున్నది.

**దేశీయ బ్యాంకర్ల లోపాలు:** దేశీయ బ్యాంకర్లు మనదేశ ద్రవ్యమార్కెట్‌లో ప్రధానమైన పాత్ర వహిస్తున్నప్పటికి ఈ వ్యవస్థలో కొన్ని లోపాలున్నాయి.
1. బ్యాంకింగ్ వ్యాపారంతో పాటు స్పెక్యులేటివ్ వ్యాపారం ఇతర వ్యాపారాల్ని దేశీయ బ్యాంకర్లు చేపడ్తున్నారు.
2. దేశీయ బ్యాంకర్లు ఖాతాలను వ్రాయుటంలో ఇప్పటికి సాంప్రదాయ పద్ధతుల్ని అనుసరిస్తున్నారు.
3. డిపాజిట్ బ్యాంకింగ్ అభివృద్ధిపై అవసరమైనంత దృష్టిని దేశీయ బ్యాంకర్లు మళ్లించడం లేదు.
4. దేశీయ బ్యాంకర్లు తాము అందించే ఋణాలపై విపరీతమైన వడ్డీలను విధిస్తూ గ్రామీణ ఋణగ్రస్థతను మరింత తీవ్రతరం చేస్తున్నారు.
5. దేశీయ బ్యాంకర్లు మూలధన కొరతను (Shortage of Capital) ఎదుర్కొంటున్నారు.

## 10.13. దేశీయబ్యాంకర్లు - రిజర్వ్‌బ్యాంక్:

పూర్వకాలం నుండి దేశ ఆర్థికవ్యవస్థలో ఎంతో ప్రముఖపాత్ర వహించినప్పటికీ, దేశీయ బ్యాంకర్లు సంఘటిత వ్యవస్థకు దూరంగానే ఉన్నారు. వీరిని సంఘటిత వ్యవస్థ పరిధిలోనికి తీసుకు రావటానికి రిజర్వుబ్యాంకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 1937లో భారత రిజర్వు బ్యాంకు దేశీయ బ్యాంకర్లకు సంబంధించి ఒక ముసాయిదా పథకాన్ని తయారుచేసింది. ఆ పథకంలోని ముఖ్యాంశాలు క్రింది విధంగా ఉన్నాయి.
1. దేశీయ బ్యాంకర్లు బ్యాంకింగ్ వ్యాపారానికే పరిమితం కావలెను. ఇతర వ్యాపారాలు ఏవైనా నిర్వహిస్తూ ఉంటే, నిర్ణీత సమయంలోగా వాటిని విడిచిపెట్టవలెను.

2. ఖాతాపుస్తకాలను పద్ధతి ప్రకారం వ్రాయవలెను. క్రమపద్ధతిలో ఆడిట్ చేయించవలెను. రిజర్వు బ్యాంక్ తనిఖీకి అభ్యంతరాలు తెలియచేయరాదు.

3. షెడ్యూల్ బ్యాంకులవలె నిర్ణీత కాలవ్యవధిలో పంపే అన్ని నివేదికలు రిజర్వు బ్యాంక్‌కు పంపవలెను.

4. నిర్వహణ మూలధనం కనీసం ఒక లక్ష రూపాయలుండవలెను. అది క్రమేపి ఆరు లక్షల రూపాయల వరకు పెంచవలెను.

5. బ్యాంకర్ల కార్యకలాపాలను బ్యాంకింగ్ సూత్రాల ప్రకారం రిజర్వుబ్యాంకుకు నియంత్రణ చేసే అధికారం ఉండవలెను.

6. దేశీయ బ్యాంకర్లు డిస్కౌంటింగ్ హౌస్‌ల పాత్రను నిర్వహించవలెను.

7. దేశీయ బ్యాంకర్లు తమ బ్యాంకింగ్ వ్యాపారాన్ని డిపాజిట్ల సేకరణవైపు కూడా మళ్ళించవలెను.

ఈ పథకాలకు దేశీయ బ్యాంకర్లు ఎంత మాత్రం ప్రతిస్పందించటం లేదు. రిజర్వుబ్యాంక్ కూడా జాయింట్‌స్టాక్ బ్యాంకులకు కలుగుజేసిన సౌకర్యాన్ని ఈ బ్యాంకులకు కలుగజేయడం సాధ్యంకాదని పేర్కొంది. ఏది ఏమైనప్పటికీ దేశీయబ్యాంకర్లను సంఘటిత బ్యాంకింగ్ వ్యవస్థతో సంధానపరచాలనే ప్రయత్నం ఇప్పటికీ జరుగుతున్నది.

## 10.14. సారాంశం (Summary)

స్వల్పకాలిక నిధులు లేదా ఋణాలు ఇచ్చిపుచ్చుకునే మార్కెట్‌ను ద్రవ్యమార్కెట్ అంటారు. ద్రవ్యమార్కెట్‌లో కేంద్రబ్యాంక్ వాణిజ్యబ్యాంకులు ఆర్థిక కంపెనీలు, భీమా కంపెనీలు, పారిశ్రామికదారులు, ఉత్పత్తిదారులు, సంస్థలు సభ్యులుగా ఉంటారు. ప్రతీ దేశ ఆర్థికాభివృద్ధిలో ద్రవ్యమార్కెట్‌కు విశిష్టమైన ప్రాముఖ్యత ఉన్నది. భారతదేశ ద్రవ్యమార్కెట్ అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ కాదు. పరస్పర సంబంధం లేని సంఘటిత, అసంఘటిత రంగాలు, వడ్డీరేట్లలో తేడాలు, కాలాలవారీగా నిధుల కొరత మొదలగునవి మన ద్రవ్యమార్కెట్‌లోని ముఖ్యమైన లోపాలు. అసంఘటిత రంగంలోని దేశీయ బ్యాంకర్లు, వడ్డీవ్యాపారస్తులు ద్రవ్యమార్కెట్‌లో ఇప్పటికీ కీలకపాత్ర వహిస్తున్నారు. భారతీయ రిజర్వుబ్యాంక్ ద్రవ్యమార్కెట్‌లోని లోపాలను తొలగించడానికి అనేక చర్యలు చేపట్టినది. అసంఘటిత రంగంలోని సంస్థలను సంఘటిత రంగంలోని సంస్థలతో అనుసంధానించటానికి ప్రయత్నాలు ప్రారంభించినది. ఈ ప్రయత్నాలు విజయవంతమై ద్రవ్యమార్కెట్ అభివృద్ధి చెందుతుందని ఆశిద్దాము.

## 10.15. స్వీయ మదింపు ప్రశ్నలు

**5 మార్కుల ప్రశ్నలు**

1. ద్రవ్యమార్కెట్ విధులేమిటి?
2. ద్రవ్యమార్కెట్ ప్రాముఖ్యతను వివరింపుము.
3. అభివృద్ధి చెందిన ద్రవ్యమార్కెట్ లక్షణాలను పేర్కొనుము.
4. ద్రవ్యమార్కెట్‌లోని భాగాలేమిటి?

**10 మార్కుల ప్రశ్నలు**

1. భారతీయ ద్రవ్యమార్కెట్‌లోని లోపాలను వివరింపుము.
2. భారతీయ ద్రవ్యమార్కెట్‌లోని వివిధ భాగాలను పేర్కొనుము.

**20 మార్కుల ప్రశ్నలు**

1. భారతీయ ద్రవ్యమార్కెట్ అంటే ఏమిటి? దాని లోపాలను, నివారణ చర్యలను సంగ్రహంగా వివరించండి.

2. భారతీయ ద్రవ్యమార్కెట్‌లో దేశీయ బ్యాంకర్ల పాత్రను, లోపాలను వివరిరంచండి? దేశీయ బ్యాంకర్లపై రిజర్వుబ్యాంక్ నియంత్రణ ఎంతవరకు ఫలించింది.

## 10.16. పదకోశం (Glossary):

| | | | |
|---|---|---|---|
| 1. | సమీపద్రవ్యం (Near Money) | : | వర్తకపు బిల్లులు, ప్రామిసరీనోట్లు, ప్రభుత్వ పత్రాలు మొదలైనవి. ఇవి అత్యంత ప్రజాదరణ పొందినవి. వీటిని 'సమీప ద్రవ్యంగా' పరిగణిస్తారు. |
| 2. | 'వాఘల్ వర్కింగ్‌గ్రూప్ | : | 1986 లో భారత రిజర్వుబ్యాంక్‌చే నియమింపబడిన శ్రీ ఎస్. వాఘల్ అధ్యక్షతన ఏర్పడిన వర్కింగ్‌గ్రూప్ ద్రవ్యమార్కెట్ అభివృద్ధికి అనేక సూచనలు చేసింది. |

## 10.17. చదువదగిన గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Banking & Financial Systems | - | Mithani & Gordon |
| 2. | Banking & Financial Services | - | S.N.Maheswari & R.R. Paul |
| 3. | Banking Theory, Law & Practice | - | Sundaram & Varshney |
| 4. | కరెన్సీ - బ్యాంకింగ్ | - | తెలుగు అకాడమీ |
| 5. | కరెన్సీ - బ్యాంకింగ్ | - | డా॥ కె.వి.రావు<br>డా॥ జి. ప్రసాద్ |

**పాఠం - 11**

## Indian Capital Market

## పదకోశము (Glossary)

1. SEBI : సెక్యూరిటీస్ ఎక్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా - 1988 లో స్థాపించారు. 1992 జనవరిలో చట్టబద్దత కల్పించారు. స్టాక్ ఎక్ఛేంజీల నిర్వహణను క్రమబద్దం చేయటానికి, సెక్యూరిటీల కాంట్రక్టు చట్టం 1956 నిబంధనలను సమర్ధవంతంగా అమలు చేయడం ముఖ్య లక్ష్యాలు.

2. **CRISIL** : క్రెడిట్ రేటింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీసస్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ - 1988 లో స్థాపించారు. ఫిక్సిడ్ డిపాజిట్ పథకాలు, కన్వర్టబుల్ మరియు నాన్ కన్వర్ట్‌బుల్ డిబెంచర్లు మరియు కంపెనీల పరపతి సామర్థ్యాన్ని సమీక్షించి అంచనా వేయటం ప్రధానమైన విధులు.

3. **వెంచర్ క్యాపిటల్ ఫండ్ (Venture Capital Fund) :** ప్రభుత్వరంగంలోని ఒక బాంకు మరియు ఒక మారకపు బాంకు వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ప్రవేశపెట్టాయి. స్వదేశీ మరియు దిగుమతి చేసుకున్న విదేశీ టెక్నాలజీలను ఉపయోగించే పైలట్ ప్లాంట్‌లకు ఈక్విటీ మూలధనాన్ని భారత ప్రభుత్వ మార్గదర్శక సూత్రాల ప్రకారం అందచేస్తారు.

**నరహరి కుమార్**

**పాఠం: 11**

# భారతీయ మూలధన మార్కెట్

11.1 మూలధన మార్కెట్ అర్ధం

11.2 మూలధన మార్కెట్ సమగ్రరూపం

11.3 మూలధన మార్కెట్ విభజన

11.4 మూలధన మార్కెట్ విధులు

11.5 మూలధన మార్కెట్ కు, ద్రవ్యమార్కెట్ కు తేడాలు

11.6 మూలధన మార్కెట్ అభివృద్ధి పట్టిక

11.7 మూలధన మార్కెట్ అభివృద్ధికి కారణాలు

11.8 మూలధన మార్కెట్లోని లోపాలు

11.9 మూలధన మార్కెట్ లోపాలను సరిదిద్దటానికి నివారణచర్యలు

11.10 స్టాక్ ఎక్ఛేంజీలు లేదా స్టాక్ మార్కెట్లు

11.11 స్టాక్ మార్కెట్లలో వ్యాపార ప్రక్రియ

11.12 స్పెక్యులేషన్

11.13 స్టాక్ బ్రోకర్ల రకాలు

11.14 స్టాక్ ఎక్ఛేంజీల లోపాలు

11.15 స్టాక్ ఎక్ఛేంజీల లోపాలను తొలగించుటకు తీసుకున్న చర్యలు

11.16 సెక్యూరిటీస్ ఎక్ఛేంజి బోర్డు ఆఫ్ ఇండియా (SEBI)

11.17 సెబి విధులు

11.18 ప్రాథమిక మార్కెట్‌కు సంబంధించిన సంస్కరణలు

11.19 సెకండరీ మార్కెట్‌కు సంబంధించిన సంస్కరణలు

11.20 సారాంశం

11.21 స్వయం మదింపు ప్రశ్నలు

11.22 సిఫారసు చేయబడిన పుస్తకాలు

వాణిజ్యం, వ్యవసాయం, పరిశ్రమలు మొదలగు కార్యకలాపాలు నిర్వహించడానికి రెండు రకాల నిధులు అవసరమౌతాయి. అది 1) స్వల్పకాలిక నిధులు 2) దీర్ఘకాలిక నిధులు, స్వల్పకాలిక నిధులు లేదా రుణాలు ఇచ్చిపుచ్చుకునే మార్కెట్‌ను "ద్రవ్య మార్కెట్" అంటారు. దీర్ఘకాలిక నిధులు లేదా రుణాలు ఇచ్చి పుచ్చుకునే మార్కెట్‌ను "మూల ధన మార్కెట్ " అంటారు. దీర్ఘకాలిక మధ్యకాలిక ఋణాలను సమకూర్చే సంస్థలు, సదుపాయాలు, పత్రాలు ఈ మూలధన మార్కెట్‌లో ఉంటాయి. మూలధన అవసరాలను తీర్చడానికి ఋణసదుపాయాలను కలుగచేయడం ఈ మార్కెట్ ముఖ్య విధి.

**దీర్ఘకాలిక నిధులకు డిమాండ్** : దీర్ఘకాలిక లేదా పెట్టుబడి నిధులకు క్రింది పేర్కొన్న సంస్థల నుండి డిమాండే ఏర్పడుతుంది.

1) ప్రయివేటు రంగంలో ఉన్న ఉత్పాదక సంస్థలు

2) వ్యవసాయరంగం, వ్యవసాయ అనుబంధ రంగాలు

3) ప్రభుత్వం - రవాణా, విద్యుత్, నీటి పారుదల మొదలైన సౌకర్యాలను మెరుగు పరచడానికి, ప్రభుత్వరంగంలో ఉండే ప్రాతిపదిక, కీలక పరిశ్రమలకు, వినియోగ వస్తువులను ఉత్పత్తి చేసే పరిశ్రమలకు నిధులు సమకూర్చడానికి దీర్ఘకాలిక నిధులు అవసరమౌతాయి.

**దీర్ఘకాలిక నిధుల సప్లయ్:** క్రింది పేర్కొన్న సంస్థల నుండి దీర్ఘకాలిక నిధుల సప్లయి జరుగుతుంది.

1) ప్రయివేటు వ్యక్తులు చేసిన పొదుపు, కార్పోరేటు రంగం చేసిన పొదుపు.

2) వాణిజ్యబ్యాంకులు-సాధారణంగా ప్రభుత్వ సెక్యూరిటీలలో ఎక్కువగాను, కంపెనీ డిబెంచర్లలో స్వల్పంగాను పెట్టుబడి పెడతాయి.

3) జీవిత భీమా, సాధారణ భీమా సంస్థలు

4) ప్రావిడెంట్ ఫండ్లు - ఎక్కువగా ప్రభుత్వ ఋణాలలో పెట్టుబడి పెడతాయి.

5) స్వాతంత్రం తరువాత స్థాపించిన అభివృద్ధి బ్యాంకులు. IFCI, ICICI, IDBI,SFCS UTI, MUTUAL FUNDS

6) పెట్టుబడిని అందించే విదేశీ సంస్థలు.

**11.2 మూలధన మార్కెట్ సమగ్రరూపం**

**మూలధన మర్కెట్**

**11.3 మూలధన మార్కెట్ విభజన**

మూలధన మార్కుట్ ను రెండు విభాలుగా విభజింపవచ్చును, అది. 1) ప్రభుత్వ సెక్యూరిటీల మార్కెట్. 2) పారిశ్రామిక సంస్థలు జారీచేసే సెక్యూరిటీలు-వాటాలు, బాండ్లు, డిబెంచర్ల మార్కెట్.

ప్రభుత్వ సెక్యూరిటీల మార్కెట్‌లో ప్రభుత్వ సంస్థల వాటాలకు సంబంధించిన వ్యవహారాలు జరుగుతాయి. కేంద్ర, రాష్ట్రాల సెక్యూరిటీలు, ప్రభుత్వం లేదా రిజర్వుబ్యాంకు వడ్డీ, మూలధనం చెల్లింపులు, ప్రభుత్వరంగ సంస్థలు జారీచేసే బండ్లు ఈ మార్కెట్‌లో చేరి ఉంటాయి. వీటి విలువ స్థిరంగా ఉండటం వలన వాణిజ్యబ్యాంకులు, ఇతర సంస్థలు ఈ సెక్యూరిటీల పట్ల ఆసక్తి కనపరుస్తాయి.

పారిశ్రామిక సంస్థలు మార్కెట్‌లో కంపెనీల వాటాలు, బాండ్లు, డిబెంచర్లు జారీచేస్తాయి. ICICI, IDBI, వివిధ రకాలైన బాండ్లను జారీ చేస్తున్నవి. మూలధన మార్కెట్‌ను ప్రాథమిక మార్కెట్ (Primary Market) ద్వితీయ మార్కెట్ (secondary Market) గా విభజించవచ్చును. ప్రాథమిక మార్కెట్‌లో ప్రయివేటు సంస్థలు కొత్తగా జారీ చేసిన ఈక్విటీ వాటాలు (Equity shares) ఆధిక్యపు వాటాలు (Preference shares), డిబెంచర్లు, ప్రభుత్వ కంపెనీలు కొత్తగా సేకరించిన మూలధనం, ప్రభుత్వ రంగ సంస్థలు జారీచేసిన బాండ్లు చేరి ఉంటాయి. దీనిని కొత్త పత్రాల జారీ (New Issues) మార్కెట్ అని అంటారు.

ద్వితీయ మార్కెట్‌లో గతంలో జారీ అయిన వాటాలు, బాండ్లు, డిబెంచర్లు అమ్మకాలు, కొనుగోళ్ళు జరుగుతాయి. దీనినే షేర్ మార్కెట్ అంటారు. పాత వాటాలు, బాండ్లు అమ్మదలచినవారు, కొనదలచినవారు స్టాక్ బ్రోకర్ల ద్వారా తమ వ్యాపార వ్యవహారాలను నిర్వహిస్తారు.

## 11.4 మూలధన మార్కెట్ విధులు (FUNCTIONS OF CAPITAL MARKET )

మూలధన మార్కెట్ క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

**1. పొదుపును సమీకరించి, మూలధన కల్పనకు తోడ్పడటం :**

మూలధన మార్కెట్‌లో జారీ అయ్యే వివిధ పత్రాల ద్వారా దేశంలోని పొదుపును పారిశ్రామిక సంస్థలు సమీకరించి, వాటిని పెట్టుబడిగా ఉపయోగించి మూలధన కల్పనకు తోడ్పడతాయి. వివిధ రకాల పత్రాల లాభదాయకత, ద్రవ్యత్వంలో తేడాలు ఉంటాయి. వ్యక్తుల, సంస్థల ఆదర్శాలు, అవసరాలను బట్టి వివిధ రకాల పత్రాలను ఎంపిక చేసుకుంటారు. అవసరమయినప్పుడు స్టాక్ మార్కెట్‌లో వీటిని అమ్మటానికి అవకాశం ఉన్నందువలన, వీటికి ద్రవ్యత్వం ఉంటుంది. అయితే వాటి ధరలు మార్కెట్ పరిస్థితులను బట్టి హెచ్చు, తగ్గులకు గురి అవుతాయి.

**2) పారిశ్రామికాభివృద్ధికి తోడ్పాటు:**

వాటాలు, బాండ్లు విరివిగా అభించటం వలన, వాటిని ద్వితీయ మార్కెట్‌లో అమ్మడానికి అవకాశం ఉండటం వలన ప్రజలు పొదుపు ప్రవృత్తి పెరుగుతుంది. నిరుపయోగంగా ఉన్న పొదుపునిల్వలు చైతన్య వంతమైన పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేస్తాయి.

**3) దీర్ఘకాలిక మూలధన సేకరణ:**

పారిశ్రామిక సంస్థల దీర్ఘకాలిక మూలధన అవసరాలను మూలధన మార్కెట్ తీరుస్తుంది. అభివృద్ధి బ్యాంకుల నుండి దీర్ఘకాలిక ఋణాలను పొదవచ్చును.

**4) వివిధ రకాల సేవల లభ్యత:**

అభివృద్ధి బ్యాంకులు, దీర్ఘకాలిక ఋణ సహాయ సంస్థలు అనేక రకాలైన సేవలను పారిశ్రామిక సంస్థలకు అందిస్తున్నది. పారిశ్రామిక సంస్థలను స్థాపించటానికి, అభివృద్ధి పరచటానికి, ఆధునీకరించటానికి మధ్యకాలిక, దీర్ఘకాలిక ఋణాలను ద్రవ్య సహాయ సంస్థలు అందిస్తున్నది. ఈ సంస్థలు క్రింది సేవలను కూడా అందిస్తున్నది.

a ) చందా పూచీదార్లుగా వ్యవహరించటం,

b) నూతన కంపెనీల స్థాపనకు సహాయం చేయడం,

c) ఈక్విటీ మూలధనాన్ని కొనుగోలు చేయడం.

d) నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఆర్థిక, సాంకేతిక, నిర్వహణ సలహాలను ఇవ్వడం.

ఒక దేశ పారిశ్రామికాభివృద్ధి ఆదేశంలోని మూలధన మార్కెట్ నిర్మాణాము, అభివృద్ధి పై ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందిన మూలధన మార్కెట్ నిధుల కొరతను తీర్చటమేగాక పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేస్తుంది.

మూలధన మార్కెట్‌కు ద్రవ్య మార్కెట్‌కు తేడాలు (Differences between Capital Market and Money Market)

**11.5 మూలధన మార్కెట్‌కు, ద్రవ్య మార్కెట్‌కు క్రింది పేర్కొన్న తేడాలు గలవు.**

1. స్వల్పకాలిక ద్రవ్యనిధులను డిమాండ్, సప్లయి చేసే సంస్థల సముదాయాన్ని ద్రవ్య మార్కెట్ అంటారు. దీర్ఘకాలిక ద్రవ్యనిధులను డిమాండ్ సప్లయి చేసే సంస్థల సముదాయాన్ని మూలధన మార్కెట్ అంటారు.
2. ద్రవ్య మార్కెట్‌లో పిలుపు ద్రవ్యమార్కెట్, అనుషంగిక ఋణాల మార్కెట్, బిల్లు మార్కెట్, స్వీకృతి మార్కెట్ అంతర్భాగాలుగా ఉంటాయి. మూలధన మార్కెట్‌లో ప్రభుత్వ సెక్యూరిటీల మార్కెట్, అభివృద్ధి బ్యాంకులు, విత్త సంస్థలు అంతర్భాగాలుగా ఉంటాయి.
3. ద్రవ్య మార్కెట్ నియంత్రణ కేంద్రబ్యాంక్ చేతిలో ఉంటుంది. మూలధన మార్కెట్‌ను కేంద్రబ్యాంక్ మరియు సెక్యూరిటీస్ ఎక్ఛేంజి బోర్డు ఆఫ్ ఇండియా నియంత్రణ చేస్తాయి.

**11.6 మూలధన మార్కెట్ అభివృద్ధి పట్టిక (Table showing Growth of Capital Market)**

భారత మూలధన మార్కెట్ క్రమక్రమంగా అభివృద్ధి చెందుతుంది. క్రింది పట్టిక ఈ మార్కెట్ పెరుగుదలను విశదీకరిస్తుంది.

| 31 డిశంబరు నాటికి | 1975-76 | 1985-86 | 1994-95 | 1995-96 | 1997-98 | |
|---|---|---|---|---|---|---|
| స్టాక్ ఎక్సేంజీల సంఖ్య | 8 | 14 | 22 | 22 | 22 | |
| లిస్టెడ్ కంపెనీల సంఖ్య | 1852 | 4344 | 7811 | 9100 | 9,833 | |
| మూలధన మార్కెట్ విలువ (కోట్ల రూ॥లలో) | 3273 | 25,302 | 3,82,510 | 507272 | 5,60,235 | |
| మూలధన పత్రాల జారీ (కోట్ల రూ॥లలో) | 98 | 1745 | 49, 220 | 32,252 | 40,655 | |
| సంస్థల పొదుపులోమూలధన సేకరణ (శాతం) | | 0.7 | 3.4 | 20.7 | 11.4 | 10.5 |

1991 జూలై నుండి భారత ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాన్ని అమలు పరచినది ఫలితంగా 1992 మే నుండి “కంట్రోలర్ ఆఫ్

కాపిటల్ ఇష్యూస్"(Controller of Capital Issues) అనే సంస్థను రద్దు చేసారు. దీని వలన మూలధన మార్కెట్ అభివృద్ధి చెందసాగింది. 1990-91 నాటికి నూతన జారీల సంఖ్య 1678కి పెరిగింది. ఈ జారీల ద్వారా సేకరించిన మూలధనం రూ. 4312 కోట్ల నుండి రూ. 26,412 కోట్ల కు పెరిగింది. 1997-98 నుండి మార్కెట్ ఆర్థిక ఒడిదుడుకులకు గురి అగుతున్నది.

**11.7 మూలధన మార్కెట్ అభివృద్ధికి కారణాలు:** భారతదేశంలోని మూలధన మార్కెట్ 150 సంవత్సరాల చరిత్ర కలిగినది. స్వాతంత్ర్యానికి పూర్వం మూలధన మార్కెట్ సక్రమంగా అభివృద్ధి చెందలేదు. స్వాతంత్ర్యానంతరం, ముఖ్యంగా, 1991 సరళీకృత ఆర్థిక విధానం అమలు చేసినప్పటినుండి మూలధన మార్కెట్ గణనీయంగా అభివృద్ధి చెందుతున్నది. మూలధన మార్కెట్ అభివృద్ధికి కారణాలను క్రింది విధంగా పేర్కొనవచ్చును.

**1. అభివృద్ధి బ్యాంకుల స్థాపన - ప్రభుత్వరంగ విత్త సంస్థల విస్తరణ.**

దీర్ఘకాలిక ఋణాలను సమకూర్చి వాటాలు, డిచెంచర్లులో పెట్టుబడి పెట్టి నూతన పారిశ్రామిక సంస్థలకు ప్రోత్సహించీ ద్రవ్య సహాయసంస్థలు మూలధన మార్కెట్ అభివృద్ధికి దోహదం చేసాయి. ఈ సంస్థలు IFC, ICICI, IDBI, SIDBI, SFCS ) వీటితో పాటు జాతీయంకాబడిన భీమాసంస్థలు (LIC, GIC ), వాణిజ్యబ్యాంకులు మూలధన మార్కెట్‌లో కీలక పాత్ర వహిస్తున్నది. సుమారు 90 శాతం బ్యాంకింగ్ వ్యాపారాన్ని ప్రభుత్వ రంగంలోని బ్యాంకులే నిర్వహిస్తున్నది. పారిశ్రామిక విత్తంలో అభివృద్ధి బ్యాంకులు, భీమా సంస్థలు, జాతీయ బ్యాంకులు ప్రధానపాత్ర వహించుచున్నది. పారిశ్రామికాభివృద్ధికి సులభమైన షరతులతో పరపతిని అందించి మూలధన కొరతను చాలావరకు నివారించగలుగుచున్నది.

**2. చందా పూచీ విధానాన్ని పెంపొందించటం:** కంపెనీల వాటా మూలధనం జారీకి హామీ నిచ్చి చందా పూచీ (Under writting) విధానం అభివృద్ధి చెందినది. ప్రభుత్వరంగ విత్తకార్పోరేషన్లు, వాణిజ్య బ్యాంకులు వాటాల జారీకి హామీ నిచ్చుచున్నది. స్టాక్ ఎక్స్ఛేంజి (బ్రోకర్లు కూడా ఈ విధానాన్ని ఎక్కువగా చేపట్టినారు. కంపెనీలు జారీచేసిన వాటా మూలధనంలో ఎక్కువ శాతం అండర్ రైట్ చేయబడుచున్నది. అందువలన మూలధన సేకరణలో రిస్కుతగ్గినది.

**3) బ్యాంకింగేతర కార్యకలాపాలు నిర్వహించే సంస్థల పెరుగుదల:** బ్యాంకింగ్ వ్యాపారం చేయని విత్త సంస్థలు (Non - banking Finanical Institutions )అనేకం స్థాపించబడినాయి. ఈ సంస్థలు బాగా అభివృద్ధిచెంది మూలధన కొరతను తగ్గించుచున్నవి. ఈ క్రింది పేర్కొన్నవి కొన్ని ముఖ్యమైన సంస్థలు

**a) మర్చెంట్ బ్యాంకింగ్ (Merchant Banking ):** ఈ సంస్థలు వివిధ రకాలసేవలు అందిస్తున్నది. వాటాల జారీ అండర్ రైట్ చేయడం, పరపతి సిండికేషన్ (Syndication of credit) చేయడం, విత్తవనరుల సేకరణ, సలహాలు అందించడం మొదలగు సేవలు చేస్తున్నాయి.

**b) మ్యూచువల్ ఫండ్స్ (Mutual Funds)** : మూలధన మార్కెట్‌లో మ్యూచువల్ ఫండ్స్ ముఖ్య పాత్ర నిర్వహించుచున్నది. 1995లో వీటిపెట్టుబడి నిధులు రూ. 3790 కోట్లు. చాలా ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు ద్రవ్యసహాయక సంస్థలు మ్యూచువల్ పండ్స్‌ను నెలకొల్పినాయి.

**c) లీజింగ్ మరియు అద్దె-కొనుగోలు కంపెనీలు: (Leasing Hire-purchase companies)** యంత్రాలు, యంత్రపరికరాల సేకరణకు ఈ కంపెనీలు సహాయపడుచున్నది.

**d) వెంచర్ మూలధన కంపెనీలు (venture capital companies)** నూతన ఔత్సాహిక ఉద్యమదారులకు, నూతన అధునాతన సాంకేతిక పరిజ్ఞానము ప్రవేశ పెట్టుటకు, నూతన భావములకు రూపమిచ్చుటకు, నష్టభయముతో కూడిన పెట్టుబడులు పెట్టుటకు ఈ కంపెనీలు సహాయపడుచున్నవి.

**4) నూతన విత్తపత్రముల అభివృద్ధి పరివర్తన డిబెంచర్లు (convertible Debentures) :** వాణిజ్య పత్రములు (commercial papers ), 182 రోజుల ట్రెజరీ బిల్లులు మొదలగు నూతన విత్తపత్రములు అభివృద్ధి చెందినవి.

**5) చట్టబద్ధ చర్యలు** మూలధన మార్కెట్‌లో అవాంఛనీయమైన, అనుచితమైన ధోరణులను నివారించేందుకు చట్టపరమైన చర్యలు చేపట్టబడినాయి. అవి. 1. కంపెనీలచట్టం. 2. సెక్యూరిటీల కాంట్రాక్టు (నియంత్రణ) చట్టం. 3) మూలధన జారీ నియంత్రణ చట్టం, సెక్యూరిటీస్ ఎక్స్చేంజి బోర్డు ఆఫ్ ఇండియా (1992) పెట్టుబడిదారులకు రక్షణ కల్పిస్తుంది. సెక్యూరిటీల మార్కెట్ క్రమబద్ధంగా పని చేసేటట్లు నియంత్రణ చేస్తుంది. స్టాక్ బ్రోకర్లు, మర్చెంట్ బ్యాంకర్లు, ఏజంట్ల కార్యకలాపాలను నియంత్రణ చేస్తుంది.

**6) ప్రజల అవగాహన, ఆసక్తి పెరగటం** పారిశ్రామిక సంస్థల పనితీరులో అవగాహన పెరగడం, వాటిని గురించిన సమాచారం అభివృద్ధి చెందటం వలన ప్రజలలో కంపెనీవాటాలు, డిబెంచర్లలో పెట్టుబడి పెట్టే ఆసక్తి పెరిగింది. స్టాక్ మార్కెట్ల అభివృద్ధితో ఈ పెట్టుబడి పత్రాలను సులభంగా నగదులోనికి మార్చుకొనే అవకాశం ఏర్పడింది. ఈ పరిస్థితులన్నీ మూలధన మార్కెట్ అభివృద్ధికి తోడ్పడినాయి.

**7) మూలధన మార్కెట్‌లో ఇటీవల ఏర్పడిన ధోరణులు:**

ఆర్థిక సంస్కరణల అమలు ఫలితంగా మూలధన మార్కెట్‌లో ఎన్నో సంస్థలు ఆర్థిక మధ్యవర్తులుగా ప్రారంభించబడినవి, అవి.

a) రిస్క్‌కాపిటల్ మరియు సహాయాన్ని అందచేయుటకు "రిస్క్‌కాపిటల్ అండ్ టెక్నాలజీ కార్పోరేషన్ లిమిటెడ్" (RCTCL) ప్రారంభించబడినది.

b) నూతన సాంకేతిక విజ్ఞానంతో ప్రారంభించబడే వ్యాపారాలకు ప్రాజెక్టు ఫైనాన్స్ అందచేయుటకు "టెక్నాలజీ అభివృద్ధి మరియు సమాచార కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్" (TDICIL) ప్రారంభించబడింది.

c) ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధికి మరియు ఎక్విప్‌మెంట్ లీజింగ్‌కు "ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్సిషల్ సర్వీసెస్ లిమిటెడ్" (ILFSL) ప్రారంభించబడింది.

d) ఫిక్సిడ్ డిపాజిట్ పథకాలు, కన్వర్టబుల్ మరియు నాన్ కన్వర్టబుల్ డిబెంచరు మరియు కంపెనీ విదానాలను సమీక్షించుటకు "ది క్రెడిట్ రేటింగ్ ఇన్ఫర్ మేషన్ సర్వీసెస్ ఆఫ్ ఇండియా లిమిటెడ్" (CRISIL) ప్రారండించబడింది.

e) వాటాల బదిలీలలో ఉన్న విపరీతమైన జాప్యాన్ని నివారించుటకు ఏడు కేంద్ర ద్రవ్య సహాయసంస్థలు స్పాన్సర్ చేసి స్టాక్ హోల్డింగ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా" (SHCIL)ను స్థాపించాయి. వాటాలు, సెక్యూరిటీల బదిలీకి ప్రస్తుత విధానానికి బదులుగా పుస్తకాలలో నమోదు (Book Entry) ట్రాన్సఫర్ పద్ధతిని (de Mat) ప్రవేశపెట్టింది .

f ) ప్రపంచ మార్కెట్‌లో వాటాలను అమ్మటానికి "గోబల్ డిపాజిటరీ రిసీట్సు" (GDR ) పథకాన్ని ప్రారంభించారు.

g) విదేశీ పెట్టుబడి సంస్థలు (Foreign Institutional Investors) కు మన కంపెనీల వాటాలను కొనేందుకు అనుమతి అభించినది.

h) SEBI స్టాక్ ఎక్స్చేంజీలను, పరస్పర నిధులను (Mutual Funds ) నియంత్రణ చేయడానికి మార్గదర్శక సూత్రాలను రూపొందించటం జరిగింది.

i) ప్రాథమిక మరియు సెకండరీ మార్కెట్లలో పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడటానికి (SEBI) సలహా కమిటీలను నియమించింది.

## 11.8 మూలధన మార్కెట్లోని లోపాలు

మనదేశంలో మూలధన మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ, ఆ అభివృద్ధి దేశంలోని పారిశ్రామికాభివృద్ధికి తగినంతగా లేదు, దానికి వివిధ కారణాలు కలవు.

1. మనదేశంలో మంచి పెట్టుబడి ప్రతిపాదనలు లేకపోవటం మూలధన మార్కెట్ ఎదుర్కొంటున్న సమస్యలలో ఒకటి. ఈక్విటీ వాటాల పట్ల ప్రజలు అంతగా ఆసక్తి చూపటం లేదు.
2. ప్రభుత్వ విధానాలలో అనిశ్చిత, ప్రయివేటు రంగం యొక్క పాత్ర. వివిధ పరిశ్రమలకు కేటాయింపులో సంధిగ్ధత మొదలగు అంశాల వలన మూలధన మార్కెట్ ఒడుదుడుకులకు లోనవుతున్నది.
3. వాటాల కేటాయింపుల అసాధారణ జాప్యం, కేటాయింపు జరగని వారికి డబ్బు వాపసు చేయడంలో జాప్యం కారణంగా మూలధన మార్కెట్ అంతగా అభివృద్ధి చెందలేదు.
4. స్టాక్ ఎక్చేంజీలలోని బ్రోకర్లు వివిధ రకాల మోసాలకు పాల్పడటం వలన సామాన్య పెట్టుబడి దారులకు మూలధన మార్కెట్ పట్ల విముఖత ఏర్పడినది.
5. కొన్ని సంస్థల అసత్య ప్రకటనలతో, వాటాదారులను వచించటం వలన వాటాదారులలో తమ డబ్బుకు భద్రత లేదనే అభిప్రాయం బలపడుతుంది.

## 11.9 మూలధన మార్కెట్ లోపాలను సరిదిద్దటానికి నివారణ చర్యలు

ఇటీవల కాలంలో ప్రభుత్వం (SEBI)ద్వారా చేపట్టిన చర్యలవలన మూలధన మార్కెట్లో అభివృద్ధి ధోరణులు పెరిగినవి, నరసింహం కమిటీ సూచనల మేరకు మూలదన మార్కెట్‌ను పటిష్టం చేయుటకు, క్రమబద్ధీకరణ చేయుటకు (SEBI)కు విస్తృతమైన అధికారాలు ఇవ్వడం జరిగింది. మర్చెంటు బ్యాంకింగ్ (SEBI ) ఆధ్వర్యం క్రిందికి శాసనాత్మకంగా తీసుకురాబడింది. నాన్ రెసిడెంట్ ఇండియన్ల పెట్టుబడి నిబంధనలకు రిజర్వుబ్యాంకు మరింత సరళీకృతం చేసింది. (SEBI ) ఆమోదం పొందిన విదేశీ పెట్టుబడి సంస్థలకు ప్రభుత్వం భారత మూలధన మార్కెట్లో ప్రవేశించటానికి అనుమతి ఇస్తున్నది. ప్రభుత్వ విధానాలకు, శాసనాలకు లోబడి మూలధన మార్కెట్ ప్రస్తుత పారిశ్రామిక స్వేచ్ఛా విధానానికి, సామాన్య పెట్టుబడిదారుల రక్షణ విధానానికి స్పందించి అతివేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశించవచ్చును.

## 11.10 స్టాక్ ఎక్చేంజీలు (Stock Exchange)

కంపెనీ వాటాలు, ఇతర సెక్యూరిటీలను కొనటానికి, అమ్మడానికి ఏర్పాటైన మార్కెట్‌ను "స్టాక్ ఎక్చేంజి" అంటారు. దీనినే 'స్టాక్ మార్కెట్" అని కూడా అంటారు. స్టాక్ ఎక్చేంజి చాలా ముఖ్యమైన ఆర్థిక సంస్థ. ఇది మూలధన మార్కెట్‌కు కంచుకోట, ప్రజల పొదుపు మొత్తాలు స్టాక్ ఎక్చేంజిల ద్వారా పరిశ్రమ, వాణిజ్యరంగాలకు ప్రవహిస్తూ ఉంటాయి. కంపెనీ వ్యవస్థ అభివృద్ధికి స్టాక్ ఎక్చేంజీలు అత్యంతావశ్యకము. స్టాక్ ఎక్చేంజీలలోని వ్యవహారాలు సక్రమమైన పద్ధతిలో, ఆరోగ్య కరంగా జరిగినపుడు పారిశ్రామిక వ్యవస్థ పటిష్టత చెంది జాతీయాభ్యుదయం జరుగుతుంది.

మనదేశంలో మొట్టమొదటి స్టాక్ ఎక్చేంజిని ముంబాయిలో ప్రారంభించారు. ఆతర్వాత అహ్మదాబాద్, కలకత్తాలో ఈ మార్కెట్లు ప్రారంభం అయినాయి. 1939 లో వీటిసంఖ్య 7 మాత్రమే. 1945 నాటికి 21కి పెరిగింది. 1994-95 నుండి దేశంలో 22స్టాక్ ఎక్చేంజిలు పని చేస్తున్నాయి. ఇవికాక అసంఘటితో విభాగంలో కెర్బ్( (kerb) మార్కెట్లుగా వ్యవహరించబడే మార్కెట్లు చాలా ఉన్నాయి. సాంప్రదాయాలకు అనుగుణంగా పని చేసే వీటికి చట్టబద్ధత లేదు. సెక్యూరిటీస్ కాంట్రాక్ట్ (రెగ్యులేషన్) చట్టం 1956 కింద ప్రభుత్వం 23 స్టాక్ మార్కెట్లకు గుర్తింపు యిచ్చింది.

## 11.11 స్టాక్ మార్కెట్‌లో వ్యాపార ప్రక్రియ:

స్టాక్ మార్కెట్‌లో వ్యాపారం బ్రోకర్లద్వారా జరుగుతుంది. సభ్యులైన వారు సెక్యూరిటీల అమ్మకాలు, కొనుగోళ్ళు చేయవచ్చును. స్టాక్ మార్కెట్ సభ్యులు కాని వారు సభ్యత్వం ఉన్న బ్రోకర్ల ద్వారా వ్యవహారలను జరపవచ్చును, ఈ మార్కెట్‌ల ఒక వ్యాపార వ్యవహారం 4 దశలలో జరుగుతుంది. అవి:

1) బ్రోకరుకు ఆర్డరు ఇవ్వడం

2) ఖాతాదారుని ఆర్డరు అమలు చేయడం

3) ఖాతాదారునికి వ్యాపార వ్యవహారం తెలియచేయడం

4) వ్యవహారాన్ని పరిష్కరించడం.

వీటిని సంక్షిప్తంగా పరిశీలిద్దాం

### 1) బ్రోకరుకు ఆర్డరు ఇవ్వడం:

ఖాతాదారుడు నిర్ణీత ధరకు లేదా మంచి ధరకు సెక్యూరిటీని(వాటాలు,బాండ్లు) అమ్మమనిగాని, కొనమనిగాని బ్రోకరుకు ఆర్డరు ఇవ్వవచ్చును. ఈ ఆర్డర్లు రకరకాలుగా ఉంటాయి. ఫిక్స్‌డ్ ఆర్డర్లు, లిమిట్ ఆర్డర్లు, తక్షణం లేదా కౌన్సిల్ ఆర్డర్లు, నష్టాన్ని నివారించే ఆర్డర్లు మొదలగునవి. ప్రతీ ఆర్డరుకు ప్రత్యేక అర్థం, సంకేతం ఉంటాయి. ఫిక్సడ్ ఆర్డరులో ఖాతాదారుడు నిర్ణయించిన లేదా అంతకంటె ఎక్కువ ధరకు సెక్యూరిటీని కొనడం లేదా అమ్మటం బ్రోకరు చేయవచ్చును. లిమిటెడ్ ఆర్డరులో ఖాతాదారుడు ధరకు సరిహద్దులు నిర్ణయిస్తాడు.

### 2) ఖాతాదారుని ఆర్డరుని అమలు చేయడం

ఖాతాదారుడి నుండి ఆర్డరు వచ్చిన వెంటనే అతని కోరిక మేరకు అవసరమైన వాటాలభించే ప్రదేశానికి బ్రోకర్ వెళతాడు. అమ్మేవాడిని ధర తెలియచేయమని అడగవచ్చును లేదా తనే ధరను సూచింపవచ్చును. వ్యాపార వ్యవహారం నోటి మాటలతో పరిష్కారమవుతుంది. చిన్న నోటు పుస్తకంలో పెన్సిల్‌తో ఖాతాదారుని పేరును, వాటా వివరాలు, వాటాల సంఖ్య మొదలగు వివరాలను నమోదు చేస్తాడు. స్టాక్ ఎక్స్ఛేంజీ రోజు వారీ అధికార లిస్టులో ఈ వ్యవహారం నమోదు అయి ప్రయటించబడుతుంది.

### 3) ఖాతాదారునికి వ్యాపార వ్యవహారం తెలియచేయడం

ఒక వ్యవహారం నిర్ణయమవగానే, దాని వివరాలను బ్రోకరు తన పుస్తకంలో నమోదు చేస్తాడు. తరువాత కాంట్రాక్ట్ నోట్‌ను తయారు చేసి ఖాతాదారునికి పంపిస్తాడు. ఈనోటులో సెక్యూరిటీ వివరాలు, ధర బ్రోకర్ కమీషన్ రెవిన్యూ స్టాంప్ ఖరీదు పరిష్కార తీది పేర్కొనబడి ఉంటాయి.

### 4) వ్యవహారాన్న పరిష్కరించడం

వ్యవహారాన్ని రెండు పద్దతుల ద్వారా పరిష్కారం చేయవచ్చును. అవి (a) వెంటనే ఆర్డర్లను పరిష్కరంచడం (b)భవిష్యత్‌లో ఆర్డర్లను పరిష్కరించటం వెంటనే ఆర్డర్లును పరిష్కరించడాన్ని "వెంటనే బట్వాడా చేసే కాంట్రాక్టులు" లేదా "నగదు వ్యవహారాలు" అని కూడా అంటారు. సెక్యూరిటీల కొనుగోలు అమ్మకాలకు కాంట్రాక్టులు రాసుకున్న రోజున లేదా వారం రోజుల లోపల నగదు చెల్లింపు, సెక్యూరిటీల బట్వాడా జరుగుతాయి. వీటి పరిష్కారం వాయిదా వెయ్యడానికి వీలులేదు కాంట్రాక్టులు రాసుకున్న రోజు లేదా మరుసటి రోజు పరిష్కారమైతే, వాటిని 'స్పాట్ కాంట్రాక్టులు'' (ëspot contracts) అంటారు. మనదేశంలోని అన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలలో "క్లియరింగ్ హౌస్'' ద్వారా ఈ వ్యవహారాలు జరుగుతూ ఉంటాయి.

భవిష్యత్‌లో ఆర్డర్లను పరిష్కరించడాన్ని "అకౌంటు వ్యాపార వ్యవహారాలు'' అని, "వాయిదా బట్వాడా కాంట్రాక్టులు'' అని "ఫార్వర్డ్ వ్యాపారం'' (Forward Trading) అని కూడా అంటారు. ఈ కాంట్రాక్టులకు సంబంధించిన వ్యవహారాలను నెలకొకసారి నిర్ణయించిన పరిష్కార దినాలలో పరిష్కరించుకోవచ్చును లేదా ఇరు పార్టీలు అంగీకరించినచో మరుసటి నెలకు వాయిదా వేయవచ్చును. ఈ వాయిదా వేయడాన్ని "కేరీ ఓవర్'' (carry over) లేదా 'బద్లా' అంటారు. ఫార్వర్డ్ డెలివరీ కాంట్రాక్టులు "వాయిదా జాబితా'' లో చేర్చిన సెక్యూరిటీలకు మాత్రమే పరిమితం.

## 11.12 స్పెక్యులేషన్

స్టాక్ ఎక్స్ఛేంజిలోని జాబితాలలో చేర్చబడిన సెక్యూరిటీలలో మాత్రమే వ్యాపారం జరుగుతుంది. వ్యాపారం రెండు రకాలు. 1) పెట్టుబడి వ్యాపారం 2) స్పెక్యులేషన్ వ్యాపారం. భవిష్యత్ కాలంలో సంభవించే ధరల మార్పుల వలన లాభం గడించాలనే ఉద్దేశంతో సెక్యూరిటీలు క్రయ విక్రయ వ్యవహాలను నిర్వహించడాన్ని "స్పెక్యులేషన్'' (Speculation) అంటారు. స్పెక్యులేషన్ వ్యాపారం చేసే సభ్యులను "స్పెక్యులేటర్లు'' అంటారు. వీరి ఊహలకు, అంచనాలకు అనుగుణంగా ధరలలో మార్పులు సంభవిస్తే లాభం గడిస్తారు. ఒక వేళ ధరల మార్పులు ప్రతికూలమైతే, నష్టం భరించాల్సి ఉంటుంది. అందువలన స్పెక్యులేషన్‌ను ఒక సాహసోపేతమైన వ్యాపార కార్యకలాపంగా పేర్కొనవచ్చును.

### స్పెక్యులేషన్ వ్యాపారం వ్యవహార పద్ధతులు:

స్టాక్ ఎక్స్ఛేంజిలలో స్పెక్యులేషన్ వ్యవహారాలు ఈ క్రింది పద్ధతులలో జరుగుతుంటాయి.

1. మార్జిన్ పద్ధతి
2. ఆప్షన్ వ్యవహారాలు
3. కార్నర్
4. ఆర్బిట్రేషన్
5. షార్ట్ సెల్లింగ్

స్పెక్యులేషన్ వ్యవహారాలు లేకుండా ఉంటే స్టాక్ మార్కెట్లు అచేతనంగా ఉంటాయి. సెక్యురిటీలకు లిక్విడిటి ఉండదు. సెక్యురిటీల డిమాండ్ సప్లయ్ అనుసంధానం కావు. అయితే స్పెక్యులేషన్ జూదంగా మారితే అవాంఛనీయ పరిణామాలు ఏర్పడవచ్చును. ఆర్థిక వ్యవస్థ, మూలధన మార్కెట్ తీవ్ర ఒడుదుడుకులకు గురి అవుతుంది.

**11.13 స్టాక్ బ్రోకర్ల రకాలు:** స్టాక్ ఎక్స్ఛేంజిలోని బ్రోకర్లలో కొంత మంది స్పెక్యులేషన్ వ్యాపారం చేయుచుందురు. వారిని మూడు రకాలుగా విభజింపవచ్చును. వారు బుల్స్, బేర్స్ మరియు స్టాగ్స్. వీరి గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**(a) బుల్స్ (Bulls)** భవిష్యత్‌లో సెక్యూరిటీల ధరలు పెరగ గలవనే ఆశతో వాటిని ప్రస్తుతపు ధరకు కొనుటకు ఒప్పందం చేసుకొనే స్పెక్యులేటర్లను 'బుల్స్' అంటారు వీరు అశావాదులు. కంపెనీ ఆర్థికంగా పటిష్టపడి మంచిలాభాలు సంపాదించునని, అందుచేత వాటి వాటాల ధరలు పెరుగునని వారి వ్యాపారానుభవం వల్ల ఊహించుదురు. అందువలన వీరిని 'తేజీవాలాలు'' అని కూడా అందురు. ఈ స్పెక్యులేటర్లు అంచనాలు నిజమై ఊహించిన విధంగా ధరలలో పెరుగుదల సంభవించినప్పుడు వీరికి లాభం వచ్చును. ఆవిధంగా కాకుండా అంచనాలు తారుమారై ధరలు తగ్గినచో వీరికి నష్టం వచ్చును. మార్కెట్‌లో ఎక్కువమంది బుల్స్ ఉన్నచో సెక్యూరిటీల ధరలు పెరుగును.

**(b) బేర్స్ (Bears):** భవిష్యత్‌లో సెక్యూరిటీల ధరలు తగ్గువచ్చుననే అంచనాతో వాటిని ప్రస్తుత ధరకు అమ్మటానికి ఒప్పందాలు చేసుకొను స్పెక్యులేటర్లను "బేర్స్'' అందురు వీరు నిరాశావాదులు. కంపెనీలకు ఆర్థికంగా చెడ్డరోజులు వచ్చినవని,

అందుచేత ఆ కంపెనీల వాటాలు ధరలు తగ్గునని వారి వ్యాపారానుభవం వలన ఊహించుదురు. అందుచే వీరిని "మండీవాలాలు" అందురు. ఈ స్పెక్యులేటర్ల అంచనాలు నిజమై, ఊహించిన విధంగా ధరలు తగ్గినచో వీరికి లాభం వచ్చును. ఆ విధంగా కాకుండా, అంచనాలు తారుమారై ధరలు పెరిగినచో వీరికి నష్టము వచ్చును. మార్కెట్లో ఎక్కువ మంది "బేర్స్" ఉన్నచో సెక్యూరిటీల ధరలు తగ్గును.

**c) స్టాగ్స్ (stags) :** కొత్తగా స్థాపించబడిన కంపెనీ వాటాల ధరలు భవిష్యత్‌లో పెరుగవచ్చుననే ఉద్దేశ్యంతో వాటాలను కొనే స్పెక్యులేటర్లను "స్టాగ్స్" అందురు. ఈ రకమైన స్పెక్యులేటరు కొత్తగా స్థాపించబడిన కంపెనీ వాటాలను కొని తరువాత వాటిని తిరిగి ప్రేమియంకు విక్రయిస్తారు. ఈ విధంగా వీరు లాభాలను సంపాదిస్తారు. కాని వాటాలధరలు వీరి అంచనా ప్రకారం పెరగనప్పుడు వీరికి నష్టం వచ్చును. మార్కెట్లో స్టాగ్స్ ఎక్కువ మంది ఉన్నప్పుడు కొత్త కంపెనీల వాటాలకు కొరత ఏర్పడి ఆసక్తి ఉన్నా పెట్టుబడిదారులకు ముద్రిత దర (parvalue)కు వాటాలు లభించుట కష్టము కాబట్టి వీరి చర్యలను ప్రభుత్వం ప్రోత్సహించదు. కంపెనీల చట్టం ప్రకారము కొత్త కంపెనీలు జారీ చేయు వాటాలలో కనీసము 49 శాతము వరకు వ్యాపార ప్రకటనల ద్వారా ప్రజలకు అమ్మవలసి ఉంటుంది.

## 11.14 స్టాక్ ఎక్స్ఛేంజ్ లోపాలు:

అఖిల భారత స్థాయిలో సెక్యూరిటీల కాంట్రాక్టు చట్టం, 1956 అమలులోనికి రాకపూర్వం స్టాక్ ఎక్స్ఛేంజీలలో క్రింది లోపాలు ఉండేవి.

1. స్టాక్ ఎక్ఛేంజిల నియంత్రణకు కేంద్రవ్యవస్థ లేనందు వలన, వివిధ స్టార్ ఎక్ఛేంజీలు పనిచేసే విధనాం, వాటి నిబంధనలు ఒకే విధంగా ఉండేవికావు.

2. స్టాక్ ఎక్ఛేంజీలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వలన ఎవరైనా తమ ఇష్టానుసారంగా స్పెక్యులేషన్ వ్యాపారం నిర్వహించేవారు. ఆర్థిక స్థోమత, నిర్వహణానుభవం లేనటు వంటి వ్యక్తులు స్పెక్యులేషన్ వ్యాపారాన్ని ఎక్కువగా చేపట్టడం వలన తరచుగా దివాలా తీస్తూ ఉండేవారు.

3. స్టాక్ ఎక్స్ఛేంజీలు 'కెర్బ్‌ట్రేడింగ్'' నిరాటంకంగా నిర్వహించడం వలన స్పెక్యులేషన్‌కు ప్రోత్సాహం లభించేది. ఖాళీ బదిలీలపై ఎటువంటి నియంత్రణ లేకపోవటం వలన స్పెక్యులేషన్ వ్యాపారానికి అవకాశాలు ఎక్కువగా ఉండేది.

4. స్టాక్ ఎక్స్ఛేంజీ సభ్యత్వానికి సంబంధించి ఎటువంటి నియమాలు లేకపోడంవలన అవాంఛనీయమైన, అవినీతిపరులైన వ్యక్తులు ఎందరో సభ్యత్వం సంపాదిస్తూ ఉండేవారు. వారు ఖాతాదారుల తరపున చేపట్టే వ్యవహారాలలో రహస్య లాభాలను ఆర్జిస్తుండేవారు.

5. సెక్యూరిటీలను స్టాక్ ఎక్స్ఛేంజి జాబితాలో చేర్చడానికి నిబంధనలు, నియమాలు ఉండేవి కావు. అందువలన ఆర్థికస్తోమతలేని కంపెనీల సెక్యూరిటీలలో కూడా వ్యాపారం జరుగుతూ ఉండేవి.

6. ఒక ప్రాంతంలో ఉండే స్టాక్ ఎక్స్ఛేంజిల సంఖ్యపై పరిమితి లేనందువలన ఆర్థిక కేంద్రాలైన ముంబాయి, కలకత్తా, అహ్మదాబాద్ వంటి నగరాలలో ఒకటి కండె ఎక్కువ స్టాక్ ఎక్స్ఛేంజిలు ఉండేవి. అందువలన స్పెక్యులేషన్ విపరీతంగా జరుగుతూ ఉండేది.

## 11.15. లోపాలను తొలగించుటకు తీసుకున్న చర్యలు:

స్టాక్ ఎక్స్ఛేంజిలలో ఉన్న వివిధ లోపాలను తొలగించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నది. స్టాక్ ఎక్స్ఛేంజిలో జూదపు వ్యవహారాలను అరికట్టడానికి, స్పెక్యులేషన్ క్రమబద్ధం చేయడానికి ప్రభుత్వం 1956 లో సెక్యూరిటీ కాంట్రాక్టు (క్రమబద్ధం) చట్టం చేసింది.

ఈ చట్టంలోని ముఖ్యాంశాలు క్రింది విధంగా ఉన్నవి.

1. ప్రభుత్వం గుర్తింపు పొందిన స్టాక్ మార్కెట్లలో మాత్రమే సెక్యూరిటీల వ్యవహారాలను జరపవలెను. ఒక నగరంలో ఒకటికంటె ఎక్కువ స్టాక్ మార్కెట్లు పని చేయరాదు. వాటి పని తీరుకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వం కోరవచ్చును.

2. స్టాక్ మార్కెట్ నిర్వహణకు అనేక నిబంధనలు ఉన్నాయి. అందులో ముఖ్యమైన అంశాలు :

   1) క్రమబద్ధమైన వ్యాపార వేళలు
   2) క్లియరింగ్ హౌస్ నిర్వహణ
   3) బ్రోకర్ల రిజిస్ట్రేషను
   4) బ్రోకరేజి, మార్జిన్లు, పెనాల్టీల నిర్ణయం
   5) పార్టీలు కాంట్రాక్టులు రాసుకునే పద్ధతి
   6) బ్లాంకు ట్రాన్సుఫర్లు, బదిలీలను క్రమబద్ధం చేయడం లేదా నిషేధించడం.

3.) స్పెక్యులేషన్‌పై ఆంక్షలు విధించారు. ఆక్షన్ వ్యవహారాలను చట్ట విరుద్ధంగా ప్రకటించారు. ఖాళీ బదిలీల (Blank Transfers) కాల వ్యవధి రెండు నెలలుగా నిర్ణయించారు.

4) స్టాక్ ఎక్స్ఛేంజిల నిర్వహణను క్రమబద్ధం చేయడానికి, సెక్యూరిటీల కాంట్రాక్టు చట్టంలో ఉన్న నిబంధనలను సమర్ధవంతంగా అమలు చేయడానికి భారత ప్రభుత్వం 1959 లో "స్టాక్ ఎక్స్ఛేంజి డైరక్టరేట్"ను స్థాపించింది. దాని ప్రధాన కార్యాలయం బొంబాయిలో ఉన్నది. కలకత్తా, ఢిల్లీ నగరాలలో బ్రాంచీలు ఉన్నాయి.

5) స్టాక్ మార్కెట్‌లోని లోపాలను సరిదిద్దడానికి, నియంత్రణ చేయటానికి 1988 లో (Securities Exchange Board of India అనే సంస్థను ప్రభుత్వం స్థాపించింది. మూలధన మార్కెట్‌లోని సంస్థల పనితీరును నియంత్రణ చేసే అధికారం ఈ సంస్థకు ఉన్నది. 1992 జనవరిలో ఈ సంస్థ చట్టబద్ద సంస్థగా రూపొందింది.

## 11.16. సెక్యూరిటీస్ ఎక్ఛేంజి బోర్డు ఆఫ్ ఇండియా (Securities Exchange Board of India - SEBI)

సెక్యూరిటీల మార్కెట్‌ను క్రమబద్ధీకరించడానికి, పెట్టుబడిదారులకు సరైన భద్రత, రక్షణ కల్పించడానికి ప్రభుత్వం 1988 లో "సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజి బోర్డు ఆఫ్ ఇండియా" అనే సంస్థను నెలకొల్పింది. ప్రారంభంలో ఈ సంస్థ చట్టబద్ధం కాని (non sratutory body ) సంస్థగా స్థాపించబడింది, కాని 1992 జనవరిలో చట్టబద్ధ సంస్థగా మార్పు చేయటం జరిగింది.

సెక్యూరిటీల జారీకి సంబంధించిన మర్చెంట్ బాంకింగు వ్యవహారాలను, పరస్పర నిధుల స్థాపనకు మార్గదర్శక సూత్రాలను రూపొందించటం తనిఖీచేయటం, నియంత్రణ చేయటంకు సంబందించిన బాధ్యతను ఈ సంస్థ నెరవేరుస్తుంది. స్టాక్ ఎక్స్ఛేంజిలలో జరగే వ్యాపార వ్యవహారాలను క్రమబద్ధీకరణ చేయడం, బ్రోకర్లపై అదుపు ఈ సంస్థ విధులలో ఒకటి. పెట్టుబడి మార్కెట్ పనితీరు మెరుగు పరచడానికి చేపట్టవలసిన చర్యలను ఈ సంస్థ ప్రభుత్వానికి సూచిస్తుంది. మూలధన వ్యవహారాల సక్రమ నిర్వహణకు మార్గదర్శక సూత్రాలను రూపొందించే అధికారం ఈ సంస్థకు ఉంది.

## 11.17 'సెబి' విధులు : (Functions of SEBI)

సెబి ఈ క్రింద పేర్కొన్న విధులను నిర్వహిస్తుంది.

1. సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టేవారికి రక్షణ కల్పించడం, సెక్యూరిటీల మార్కెట్ పనితీరును క్రమబద్ధం చేయటం
2. స్టాక్ ఎక్స్ఛేంజిలలో జరిగే వ్యాపార వ్యవహారాలను క్రమబద్ధం చేయటం, నియంత్రణ చేయటం
3. స్టాక్‌బ్రోకర్లు, సబ్ బ్రోకర్లు, మర్చెంట్ బాంకర్లు, పోర్టు ఫోలియో మేనేజర్లు, పెట్టుబడి సలహాదార్లను గుర్తించటం, నియంత్రించడం,

వారి కార్యకలాపాలను క్రమబద్ధం చేయటం.

4. పరస్పర నిధులను స్థాపించడానికి నిర్వహించడానికి, నిబంధనలు, సూత్రాలను రూపొందించటం ఈ సంస్థ విధి. దీని కోసం 1993 లో మ్యూచువల్ ఫండ్స్ రెగ్యులేషన్ నిబంధనలను రూపొందించింది.

5. సెల్ఫ్ రెగ్యులేటరీ సంస్థలను ప్రోత్సహించటం, క్రమబద్ధం చేయటం.

6. (Insider Trading ) ను నిలిపివేయడం.

7. స్టాక్ ఎక్స్ఛేంజీలలో అక్రమ కార్యకలాపాలు జరగకుండా నిరోధించటం

8. పెట్టుబడిదార్లకు సంపూర్ణ సమాచారం అందేటట్లుగా చూడటం

9. సెక్యూరిటీల మార్కెట్‌పైన, ఇతర అంశాలపైన పరిశోధన చేయటం.

10. కంట్రోలర్ ఆఫ్ కాపిటల్ ఇష్యూస్ రద్దు తరువాత, కొత్త ఇష్యూల జారీ మార్కెట్‌ను, స్టాక్ మార్కెట్‌ను SEBI నియంత్రణ చేస్తుంది.

మూలధన మార్కెట్‌ను క్రమబద్ధం చేయటానికి, పెట్టుబడిదార్ల ప్రయోజనాలను కాపాడటానికి, సంస్థల పనితీరును మెరుగుపరచడానికి బ్రోకర్ల అక్రమ వ్యాపార వ్యవహారాలను నిరోధించడానికి సెబి అనేక చర్యలను గత 10 సంవత్సరాల కాలంలో చేపట్టింది.

## 11.18. ప్రాథమిక మార్కెట్‌కు సంబంధించిన సంస్కరణలు (Primary Market Reforms) :

మూలధన జారీలను క్రమబద్ధం చేయటానికి 'సెబి' అనేక మార్గదర్శక సూత్రాలను రూపొందించింది.

1. నూతనంగా వాటాలను జారీచేసే కంపెనీలు వాస్తవాలు, సత్యాలు మాత్రమే పరిచయ పత్రంలో తెలియచేయవలెను. ప్రధాన విషయాలు, రిస్కుకు సంబంధించిన విషయాలను స్పష్టంగా తెలియచేయవలెను, వాటాల జారీకి సంబంధించిన ప్రకటనలో కొన్ని నియమాలు పాటించవలెను.

2. వాటాల జారీ ఖర్చు తగ్గించే ఉద్దేశంతో చందాపూచీ ఐచ్ఛికం చేసింది.

3. మదుపు దారులు కనీసం 500 వాటాలకు దరఖాస్తు చేయవలెను.

4. మర్చెంట్ బాంకర్లను సెబి అధికార పరిధిలోనికి తీసుకునిరావటం జరిగింది. సెబి ఆమోదం లేని కార్యకలాపాలు మర్చంట్ బాంకర్లు నిర్వహించరాదు.

5. ëBankers to the Issueí ని కూడా సెబి పరిధిలోనికి తీసుకునిరావడం జరిగింది.

6. స్టాక్ ఎక్స్ఛేంజిలలో సెక్యూరిటీల లిస్టింగ్ నియమాలను సవరణ చేయవలసిందిగా స్టాక్ ఎక్స్ఛేంజిలను ఆదేశించటం జరిగింది.

7. ప్రయివేటు మ్యూచువల్ ఫండ్స్‌ను స్థాపించుటకు సెబి అంగీకరించింది. వీటికొరకు మార్గదర్శక సూత్రాలను జారీ చేయడం జరిగింది.

8. ఒక కంపెనీ మరొక కంపెనీ వాటాలను కొనడానికి, లేదా దానిని Take చేయడానికి సెబి నిబంధనలను రూపొందించింది.

## 11.19 సెకండరీ మార్కెట్‌కు సంబంధించిన సంస్కరణలు (Secondary Market Reforms)

1. స్టాక్‌బ్రోకర్లు, సబ్-బ్రోకర్లు, సెక్యూరిటీ ఎక్ఛేంజి బోర్డు చట్టం 1992 నిబంధనలను అనుసరించి, రిజిస్ట్రేషన్ చేసుకోవలసిందని ఆదేశించింది. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నిబంధనలను రూపొందించింది.

2. Insider Trading ని నియంత్రించుటకు, అరికట్టుటకు నియమ నిబంధనలను రూపొందించింది. మార్గదర్శక సూత్రాలను జారీ చేయడం జరిగింది.

3. స్టాక్ ఎక్ఛేంజిలలో వ్యాపార వ్యవహారాలను తరుచుగా సమీక్షిస్తున్నది. వ్యవహారాలలో పారదర్శకత్వం లేదా స్వచ్ఛతను, దాపరికాలు లేని స్థితిని సాధించుట కొరకు వ్యవహారాల పద్ధతిలో మార్పు తీసుకుని వచ్చుటకు పటిష్టమైన, సార్థకమైన చర్యలు తీసుకొనడం జరిగింది.

4. "B Group" సెక్యూరిటీలలో 'Renewal system' ని నిషేధించింది ఈ సెక్యూరిటీలకు సంబంధించిన వ్యవహారాలను 7రోజులలోపు పరిష్కరించవలెనని ఆదేశించింది.

5. స్టాక్ ఎక్స్ఛేంజీల పాలక వర్గం ఏర్పాటుకు మార్గదర్శక సూత్రాలను జారీ చేయడం, జరిగింది. 1994-95 లో స్టాక్ ఎక్స్ఛేంజీల గవర్నింగ్ బాడీలను పునర్ వ్యవస్థీకరించింది.

6. విదేశీ పెన్షన్ ఫండ్స్, మ్యూచువల్ ఫండ్స్, పెట్టుబడి ట్రస్టులు, పోర్టు ఫోలియో మేనేజ్‌మెంట్ కంపెనీలు భారత మూలధన మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడానికి సెబి వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవలెను.

7. స్టాక్ ఎక్ఛేంజీల నిర్వహణలో మార్పులను ప్రవేశపెట్టి, వాటి క్రమబద్ధీకరణకు అనేక చర్యలు తీసుకుంటున్నది.

ప్రైమరీ మార్కెట్‌లోను, సెకండరీ మార్కెట్‌లోను సార్థకమైన మార్పులు తీసుకొనిరావడంలో 'సెబీ' చాలావరకు విజయవంతమైనది. మూలధన మార్కెట్‌లో ఉన్న అన్ని మ్యూచువల్ ఫండ్స్, మర్చంటు బ్యాంకర్లు, బ్రోకర్లు, ఆర్థిక సంస్థలు 'సెబి' ఉనికిని గుర్తించడం వలన స్టాక్ మార్కెట్ వ్యవహారాలు నియమ నిబంధనల ప్రకారం జరుగుతున్నాయి. పారిశ్రామిక వ్యవస్థ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి సెక్యూరిటీల మార్కెట్ సక్రమంగా పనిచేయడం ఎంతో అవసరం. సెక్యూరిటీలల మార్కెట్ క్రమబద్ధీకరణకు, పెట్టుబడిదారుల రక్షణకు 'సెబీ' మరింత చురుకుగా పని చేస్తుందని ఆశించవచ్చును.

### 11.20. సారంశం (Summary)

ఉత్పాదక, వాణిజ్యసంస్థల దీర్ఘకాలిక పరపతి అవసరాలను తీర్చే మార్కెట్‌ను మూలధన మార్కెట్ అంటారు. దీర్ఘకాలిక, మధ్యకాలిక ఋణాలను సమకూర్చే సంస్థలు, సదుపాయాలు, పత్రాలు ఈ మార్కెట్‌లో ఉంటాయి. మూలధన మార్కెట్‌ను ప్రాథమిక మార్కెట్, మరియు ద్వితీయ మార్కెట్‌గా విభజించవచ్చును. స్వాతంత్ర్యానంతరం అభివృద్ధి బ్యాంకుల స్థాపన బ్యాంకింగేతర కార్యకలాపాలు నిర్వహించే సంస్థల పెరుగుదల, ప్రభుత్వం తీసుకున్న కొన్ని చట్టబద్ధమైన చర్యలు మూలధన మార్కెట్ అభివృద్ధికి తోడ్పడినవి. మూలధన మార్కెట్లో స్టాక్ ఎక్ఛేంజీలు కీలక పాత్ర వహిస్తున్నవి. స్టాక్ ఎక్స్ఛేంజీల క్రమబద్ధీకరణకు, స్పెక్యులేషన్ కార్యకలాపాలను అరికట్టడానికి ప్రభుత్వం 'సెబి' సంస్థ ద్వారా చర్యలు చేపట్టింది. మూలధన మార్కెట్‌ను పటిష్టం చేసి, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయటానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

### 10.21. స్వయం మదింపు ప్రశ్నలు

### 5 మార్కుల ప్రశ్నలు

1. మూలధన మార్కెట్ అంటే ఏమిటి? దానిలోని భాగాలు ఏమిటి?
2. మూలధన మార్కెట్ విధులను వ్రాయుము
3. బుల్, బేర్స్ గరించి వ్రాయుము
4. ద్రవ్య మార్కెట్‌కు, మూలధన మార్కెట్ గల తేడాలు ఏమిటి?

**10 మార్కుల ప్రశ్నలు**

1. సెబి విధులను వివరించండి
2. స్టాక్ ఎక్స్ఛేంజి అంటే ఏమిటి? దాని విధులేమిటి?
3. స్పెక్యులేషన్ అంటే ఏమిటి?

**20 మార్కుల ప్రశ్నలు**

1. భారత దేశ మూలధన మార్కెట్ వృద్ధిని సంగ్రహముగా వివరించండి.
2. భారతీయ మూలధన మార్కెట్‌లో 'సెబి' కార్యకలాపాలను వివరింపుము
3. మూలధన మార్కెట్ సంస్కరణలను గూర్చి వ్రాయండి
4. స్టాక్ ఎక్స్ఛేంజీల పనితీరును నిశితంగా వివరించండి.

**11.22 సిఫారసు చేయబడిన పుస్తకాలు**

| | | |
|---|---|---|
| 1. | Banking & Financial services | SN Maheswari<br>R Paul |
| 2. | Banking Theory, Law Practice | Sundharam&<br>Varshney |
| 3. | Indian Economy | Ruddar datt<br>KPM Sundharam |

**నరహరి కుమార్**

**పాఠం - 12**

# విత్త సేవలు (Financial Services)


12.0 ఉద్దేశాలు

12.1 విషయ పరిచయం, పాఠ్యాంశ నిర్మాణం

12.2.0 విత్తసేవల భావన

12.2.1 విత్త సేవల స్వభావము

12.3 మర్చంట్ బ్యాంకింగ్

12.4 లీజింగ్

12.5 అద్దె - కొనుగోలు (Hire Purchasing)

12.6 ఫాక్టరింగ్

12.7 డిస్కౌంటింగ్

12.8 ఇతర విత్త సేవలు

12.9 బ్యాంకేతర విత్త కంపెనీల పనితీరు (Working of Non-Banking Financial Companies)

12.10 పదకోశము

12.11 స్వయం మదింపు ప్రశ్నలు

12.12 సిఫారసు చేయబడిన పుస్తకాలు


## 12.0 ఉద్దేశాలు :

ఈ పాఠం పూర్తయ్యేసరికి విద్యార్థులకు క్రింది విషయాలు అవగతమగును.

- విత్తసేవల స్వభావము, పరిధి,
- విత్త సేవలనందించటంలో వివిధ సంస్థలు పనిచేసే విధానము, ముఖ్యంగా మర్చంట్ బ్యాంకులు, లీజింగ్ సంస్థలు, అద్దె కొనుగోలు పద్ధతి, ఫాక్టరింగ్ మరియు డిస్కౌంటింగ్‌ల గురించి ఒక అవగాహన ఏర్పడును.
- ఇతర విత్త సేవల స్వభావము గురించి కూడా అవగతమగును. బ్యాంకేతర విత్త కంపెనీలు అనగానేమి, వాటి పనితీరును గురించిన సమగ్ర అవగాహనకలుగును.

## 12.1 విషయ పరిచయము :

పొదుపును పెట్టుబడిగా మార్చటానికి సహాయపడే సంస్థలను, వారు చేసే సేవలను విత్తసేవలని అనవచ్చును. పారిశ్రామికీకరణతో విత్తసేవల స్వభావంలో ఒక రకమైన మార్పు వచ్చినప్పటికీ ఆ తరువాత ఆవిర్భవించిన పోటీయుగంలో విత్తసేవల ప్రాధాన్యత ఇనుమడించినది. మానవుని జీవనానికి రక్తప్రసరణ ఎంత అవసరమో, పరిశ్రమల నిర్వహణకు, పారిశ్రామికాభివృద్ధికీ దేశ ఆర్థికాభివృద్ధికీ విత్తసేవలు కూడా అంతే అవసరము. రూపాంతరాలు చెందుచున్న విత్త మార్కెట్ విత్తసేవల సంస్థలతో ఒక పద్ధతిని సంతరించుకొనును. గతంలో వాణిజ్య బ్యాంకులు, దేశీయ బ్యాంకర్లు, వడ్డీ వ్యాపారస్తులు, ఇతర ద్రవ్య సహాయ సంస్థలు మాత్రమే పరిమిత స్థాయిలో విత్తసేవలనందించేవారు. అయితే మారుతున్న కాలానికి వీరి సేవలలోని వైవిధ్యత సరిపోని కారణాన ప్రత్యేకించబడిన విత్త సేవాసంస్థలు వెలుగులోనికి వచ్చినవి. ఆ సంస్థల పనితీరే ఈ పాఠ్య సారాంశము.

## 12.2 విత్తసేవల భావన :

గతించిన 70 వ మరియు 80 వ దశకంలో విత్తసేవల భావన కేవలము పరపతి సౌకర్యాల కల్పనకు మాత్రమే పరిమితమై ఉండేది. ఆ కాలములో ఇలాంటి సేవలను వాణిజ్య బ్యాంకులు, ఇతర ద్రవ్య సహాయసంస్థలు మాత్రమే సమకూర్చేవి. ఈ రెండు రకాల సంస్థలకు విత్త సేవలనందించే సంస్థలలో ముఖ్యమైనది స్టాక్ ఎక్స్చేంజ్ మాత్రమే. స్టాక్ ఎక్స్చేంజ్‌లు కూడా పరిమిత స్థాయిలో మాత్రమే విత్తసేవలనందించేవారు. 1990 నుండి అమలులోనికి వచ్చిన ఆర్థిక సంస్కరణలు విత్తసేవల భావనలో కూడా పెద్దమార్పును తెచ్చినవి. ఈ కాలములో ప్రతిరోజు ఒక క్రొత్త తరహాకు చెందిన విత్త సదుపాయాలు, సేవలు లభ్యమవుతున్నవి. గతంలో విత్తసేవలంటే పరపతి సౌకర్యాలను సమకూర్చటంగానే ఉండేది. కానీ నేడది పొదుపులలో కదలికలను తీసికొని వచ్చి పొదుపును ప్రోగుచేసే యంత్రాంగంగాను, ఇలాంటి పొదుపును పెట్టుబడులుగా మార్చే చర్యగాను భావించటం జరుగుతుంది. ఇలాంటి మార్పు కారణంగానే దేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెంది అంతర్జాతీయ స్థాయిలోని పోటీని తట్టుకొనగలుగుతున్నది.

**12.2.1 విత్తసేవల స్వభావము :** విత్తసేవల స్వభావములో ప్రధానంగా రెండు భాగాలుండును. అవి మూలధన మార్కెటుకు సంబంధించిన మాధ్యమాలు మరియు ద్రవ్య మార్కెట్‌కు సంబంధించిన మాధ్యమాలు. మూలధన మార్కెట్ మాధ్యమాలు కాలపరిమితి కలిగిన, ముఖ్యంగా దీర్ఘకాల నిధుల సౌకర్యాన్ని కలుగజేయును, ఇందుకొరకు ప్రత్యేకించబడిన అనేక సంస్థలు పనిచేస్తున్నవి. ఇక రెండవ భాగం క్రింద ద్రవ్యమార్కెట్ మాధ్యమాలుండును. వీరు ప్రధానంగా స్వల్పకాల పరిమితులు కలిగిన నిధులను మాత్రమే సమకూర్చుతారు. ఇందులో వాణిజ్య బ్యాంకులు, సహకార బ్యాంకులు ఇతర ఏజెన్సీలు ఉండును. ఈ రెండు మాధ్యమాలను కలిపి విత్త సేవల పరిశ్రమగా చెప్పవచ్చును. దీనిని బట్టి విత్తసేవల పరిశ్రమలో విత్తుల మరియు కార్పొరేషన్ సంస్థల దీర్ఘకాలిక మరియు స్వల్పకాలిక ద్రవ్య సహాయాన్నందించే సంస్థలుండునని చెప్పవచ్చును.

**విత్తసేవల పరిధి :** విత్తసేవా పరిశ్రమ పారిశ్రామిక రంగానికి వైవిధ్యం కలిగిన అనేక సేవలనందించును. ఇలా వీరందించే సేవలను రెండు రకాలుగా వర్గీకరించటం జరుగును. అవి

i. సంప్రదాయ సేవా కార్యక్రమాలు

ii. ఆధునిక సేవా కార్యక్రమాలు

**i) సంప్రదాయ సేవా కార్యక్రమాలు :-** పారిశ్రామిక విధానము అమలులోనికి వచ్చినప్పటినుండి విత్త మాధ్యమ సంస్థలు (Financial Intermediaries) మూలధన ద్రవ్యమార్కెట్ పరంగా అనేక రకాలైన సేవలనందిస్తున్నది. ఇలా వీరందించే సంప్రదాయ సేవలను నిధుల ఆధారిత కార్యకలాపాలుగాను, నిధులు అవసరములేని కార్యకలాపాలుగాను ఉండును. నిధి ఆధారిత కార్యకలాపాలలో ప్రధానమైనవి వాటాలు, డిబెంచర్లు, బాండ్ల జారీకి చందా పూచీదారులుగా వ్యవహరించటము. ఇలా వ్యవహరించటాన్ని ప్రాథమిక మార్కెట్ కార్యకలాపాలుగా భావిస్తారు. వీటికి తోడు ద్వితీయ మార్కెట్ కార్యకలాపాల ద్వారా కూడా పరిశ్రమలకవసరమైన నిధులను సమకూర్చటం జరుగును. వాణిజ్య పేపర్లు, డిపాజిట్ సర్టిఫికెట్లు, ట్రెజరీ బిల్లులు మరియు ఇతర బిల్లులను డిస్కౌంట్ చేసుకుంటారు, లీజింగ్, అద్దె కొనుగోలు, వెంచర్ కాపిటల్, సీడ్ కాపిటల్‌లను సమకూర్చుతూ విదేశీ మారక ద్రవ్యానికి సంబంధించిన కార్యకలాపాలను నిర్వహిస్తారు. ఇక నిధులు అవసరములేని సేవలను ఫీజు ఆధారిత కార్యకలాపాలని అంటారు. నిర్ణీతమైన ఫీజును తీసుకొంటూ విత్త మాధ్యమ సంస్థలు నిధులతో సంబంధము లేని కొన్ని సేవలనందిస్తారు. ఇందులో ముఖ్యమైనవి వాటాల జారీకవసరమైన కార్యకలాపాలు నిర్వహించటము, వాటాల జారీ తరువాత చేయవలసిన సేవలను చేయటము, ప్రాజెక్టు నివేదికలను తయారు చేయటము, ప్రభుత్వము నుండి నిర్ణీత అనుమతులను సంపాదించి పెట్టటము.

**ii) ఆధునిక సేవా కార్యకలాపాలు :-** విత్త మాధ్యమ సంస్థలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలతో పాటు ఆధునిక కాలములో కొన్ని నవీకృత సేవలను కూడా అందించటము జరుగుతుంది. ఇందులో కొన్ని సంస్థల సంయోగము మరియు సంలీనము ప్రక్రియలో సహాయపడటము, మూలధన పునఃనిర్మాణానికి సహకరించటము, ఉమ్మడి వ్యాపార సదుపాయాన్ని కలుగజేయటము, నిర్వహణలో

అవసరమైన మార్పులను చేపట్టటము, ఖాయిలాపడ్డ పరిశ్రమల పునరావాసానికి సహాయము చేయటము, డిబెంచరుదారుల ట్రస్టీగా వ్యవహరించటము.

**విత్తసేవల స్వభావము - ఆవశ్యకత :**

విత్తసేవల స్వభావము ఈ విధంగా ఉండగా అనేక పరిస్థితుల కారణంగా విత్తసేవల ఆవశ్యకత ఏర్పడుతున్నది. అవి

i. క్షీణిస్తున్న లాభదాయకత;

ii. పెచ్చుపెరిగిపోతున్న పోటీ;

iii. సరళీకృత ఆర్థిక విధానాలు;

iv. కమ్యూనికేషన్ రంగంలో అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానము;

v. ఖాతాదారులకు ప్రత్యేక సేవలనందించవలసిన అవసరము;

vi. అంతర్జాతీయంగా వస్తున్న మార్పుల స్వభావము;

vii. పెట్టుబడిదారులలో వస్తున్న పరిణితి;

పై కారణాల వలన విత్తసేవల ఆవశ్యకత ఏర్పడుచున్నది. ఈ ఆవశ్యకతలు వాటికారణంగా ఏర్పడుతున్న పరిస్థితుల నిర్వహణను విత్త ఇంజనీరింగ్ (Financial Engineering) గా వ్యవహరించటము జరుగుతుంది. ఇందులో చూపిస్తున్న పరిష్కారాలను విత్తవైద్యంగా (Financial Medicine) పరిగణిస్తున్నారు.

## 12.3 మర్చంట్ బ్యాంకింగ్ (Merchant Banking) :

ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశములో మర్చంట్ బ్యాంకింగ్ సేవలకు చాలా తక్కువ చరిత్ర ఉన్నట్లుగా చెప్పవచ్చును. సంప్రదాయబద్ధమైన సేవలనందిస్తూ వస్తున్న భారతీయ బ్యాంకులు చేపట్టిన వినూత్నమైన మొదటి చర్యను మర్చంట్ బ్యాంకింగ్‌గా పరిగణించవచ్చును. భారతదేశములో మర్చంట్ బ్యాంకింగ్ సేవల ఆవశ్యకతను బ్యాంకింగ్ కమీషన్ (1972) కూడా గుర్తించినది.

నిర్వచనము : బ్యాంకింగ్ కమీషన్‌వారు రూపొందించిన పారిభాషిక పదజాలము ప్రకారము మర్చంట్ బ్యాంకింగ్ అనగా "సిండికేషన్ పద్ధతి ద్వారా విత్త సదుపాయాలను సమకూర్చటము, ప్రాజెక్టుల అభివృద్ధి, పెట్టుబడి నిర్వహణ, చిన్న, మధ్యతరహా పొదుపుదారులకు సలహాలనివ్వటము, అనేక రకాలైన నిధులను నిర్వహించటము, ట్రస్టు సేవలనందించటము, లాంటి సేవలు మర్చంట్ బ్యాంకింగ్‌లో ఉండును. ఈ సేవలను విస్తృత ప్రాతిపదికమీద అందించటమే."

పై నిర్వచనాన్ని విపులీకరించినప్పుడు మర్చంట్ బ్యాంకర్లు క్రింది సేవలనందిస్తారని స్పష్టమగుచున్నది.

i. సిండికేషన్ పద్ధతిద్వారా రుణాలనందించటము;

ii. విత్త మరియు నిర్వహణా పరమైన సలహాలనివ్వటము;

iii. ప్రాజెక్టు నిర్వహణకవసరమైన సలహాల నివ్వటము;

iv. పోర్టు ఫోలియో నిర్వహణ;

v. పరిశ్రమల పునరావాస పథకాలను రూపొందించటము మరియు నిర్వహించటము;

vi. విదేశీ వర్తకానికవసరమైన విదేశీమారక ద్రవ్యాన్ని సమకూర్చుకోవటంలో సలహాలనివ్వటము;

vii. ప్రవాస భారతీయులు మనదేశములో పెట్టుబడి పెట్టటానికి మార్గదర్శిగా వ్యవహరించటము;

**భారతదేశములో మర్చంట్ బ్యాంకింగ్ :** మనదేశములో మర్చంట్ బ్యాంకింగ్ వ్యాపారాన్ని చేయటానికి RBI 1967 లోనే నేషనల్ గ్రిండ్‌లేస్ అనే విదేశీ బ్యాంకుకు లైసెన్సునిచ్చినది. ఆ తరువాత 1970 లో First National City Bank లాంటి విదేశీ బ్యాంకులను కూడా మర్చంట్ బ్యాంకింగ్ వ్యాపారాన్ని ప్రారంభించటానికి అనుమతించినది. భారతీయ స్టేట్‌బ్యాంకు 1972 లోను, భారత పారిశ్రామిక పరపతి పెట్టుబడుల సంస్థ 1974 నుండి, కెనరాబ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా లాంటి బ్యాంకులు 1980 లో ఈ వ్యాపారములో ప్రవేశించినవి. 1990 లో యూకో బ్యాంకు (UCO Bank) IOB, Andhra Bank లాంటి మరికొన్ని బ్యాంకులు కూడా ఈ రంగములో ప్రవేశించినవి. బ్యాంకింగ్ వ్యాపారాలు లేని బ్యాంక్ ఆఫ్ అమెరికా, మరియు అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకులు కూడా ఈ వ్యాపారాన్ని ప్రారంభించినవి. ఈ విధంగా కార్పొరేట్ పెట్టుబడులను చేజిక్కించుకునే ఉద్దేశముతో వివిధ బ్యాంకులు తీవ్రంగా పోటీ పడుచున్నవి. మర్చంట్ బ్యాంకింగ్ ఆవశ్యకతను బ్యాంకింగ్ సంస్కరణలకు సంబంధించి 1991 లో నియమించబడిన నరసింహం కమిటీ కూడా మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాల ఆవశ్యకతను గుర్తించినది. ఈ కమిటీ అసంఘటిత పారిశ్రామిక వ్యవస్థలో పటిష్టమైన మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాల ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని అభిప్రాయపడింది. అంతర్జాతీయంగా పేరుపొందిన మర్చంట్ బ్యాంకర్లు మరియు భారతదేశములోని పెట్టుబడి బ్యాంకర్ల మధ్య పటిష్టమైన ఉమ్మడి వ్యాపారాన్ని నెలకొల్పవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని నరసింహం కమిటీ ప్రభుత్వానికి సూచించినది. విదేశాలలో మాదిరిగా భారతీయ మర్చంట్ బ్యాంకర్లు సాధారణ బ్యాంకింగ్ వ్యాపారాన్ని నిర్వహించరు. మనదేశములో విదేశీ సంస్థలతో ప్రయివేటు రంగములో కూడా కొన్ని మర్చంటు బ్యాంకులు ఏర్పడినవి.

**మర్చంట్ బ్యాంకింగ్ విధులు :**

ప్రయివేటు రంగములో ఉన్న లేదా పబ్లిక్ రంగములో ఉన్న మర్చంట్ బ్యాంకర్లు క్రింది విధులను నిర్వహిస్తారు.

i. పారిశ్రామిక ప్రాజెక్టులను తయారుచేసి పరిశ్రమలను ప్రారంభించటానికి అవసరమైన సహాయ సంపత్తులనందిస్తారు. ప్రభుత్వమునుండి, ఇతర ప్రభుత్వ శాఖలనుండి అవసరమైన అనుమతులను, లైసెన్సులను సంపాదించటములో సహాయపడును.

ii. ఆర్థికపరమైన, సాంకేతిక పరమైన, విత్తపరమైన ప్రణాళికలను రూపొందిస్తారు.

iii. మూలధన జారీలు, ఫిక్సెడ్ డిపాజిట్లను నిర్వహించుట, వాటాలు; డిబెంచర్ల జారీకి చందాపూచీ ఇవ్వటము.

iv. IFCI, SFC, IDBI, ICICI, SIDC లాంటి ద్రవ్యసహాయ సంస్థలనుండి ద్రవ్య సహాయాన్ని పొందటానికి సహాయపడతారు.

v. సంస్థల కార్యకలాపాల స్థాయిని, అందుకవసరమైన సాంకేతిక విధానాన్ని నిర్ణయించటములో సహాయపడతారు.

vi. యంత్రాలు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకొనటానికి విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చుకొనటంలోను, ఇతర విషయాలలోను సహాయపడును.

vii. అవాంఛనీయ పోటీని తొలగించి కంపెనీలమధ్య సంయోగము మరియు సంలీనాల ద్వారా పునర్ వ్యవస్థీకరించటానికి అవసరమైన చర్యలను చేపడతారు.

viii. పారిశ్రామిక పరిశోధన మరియు అభివృద్ధికి సంబంధించిన సూచనలిస్తారు.

పై విధులను నిర్వహించటానికి దేశములోని జాతీయము చేయబడిన అన్ని బ్యాంకులు ప్రత్యేక మర్చంట్ బ్యాంకింగ్ శాఖను ఏర్పాటు చేసినారు.

మర్చంట్ బ్యాంకింగ్ రెండు సంస్థల ద్వారా నియంత్రించబడుతుంది. అవి SEBI మరియు RBI.

a) మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలను SEBI (Securities and Exchange Board of India) పర్యవేక్షణా నియంత్రణ పరిధిలోనికి ఒక చట్టము ద్వారా తీసికొని రావటము జరిగినది. ఈ కారణాన మర్చంట్ బ్యాంకర్లందరూ SEBI రూపొందించిన మార్గదర్శక సూత్రాలను పాటించవలసియున్నది. మూలధన సంవృద్ధికి సంబంధించిన నిబంధనలను కూడా మర్చంట్ బ్యాంకర్లు

పాటించాలి. ఆయా కంపెనీలు పరిచయపత్రము ద్వారా ప్రజలనుండి మూలధనాన్ని సేకరించేటప్పుడు ఆ కంపెనీకి సంబంధించిన అన్ని విషయాలను వెల్లడి చేయటంలో మర్చంటు బ్యాంకర్ల పాత్ర ఎక్కువగా ఉన్నది.

b) వివిధ బ్యాంకులకు, అనుబంధంగా ఉన్న మర్చంట్ బ్యాంకర్ల కార్యకలాపాలను RBI పర్యవేక్షిస్తున్నది. మర్చంట్ బ్యాంకర్లు డిపాజిట్లను సమకూర్చుకునే ప్రతి సందర్భములో RBI మార్గదర్శక సూత్రాలను పాటించవలసియున్నది.

ఆధునిక కాలములో పారిశ్రామిక రంగములో విస్తృతంగా వస్తున్న మార్పుల కారణంగా మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలను ఇంకా మెరుగుపరచవలసిన ఆవశ్యకత ఉన్నదని గమనించాలి.

## 12.4 లీజింగ్ (Leasing) or (Lease Financing) :

సాధారణంగా పారిశ్రామిక సంస్థలు తమకవసరమైన ఆస్తులను తమ స్వంత నిధులతో సమకూర్చుకుంటారు. అయితే నిధులు ఎల్లప్పుడూ పరమితంగానే ఉంటాయి. స్థిరాస్థులు కొనుగోలు కొరకు నిధులను ఉపయోగించటం వలన వ్యాపార టర్నోవర్ తగ్గటమేకాక నిధులు సద్వినియోగము కాలేదని చెప్పవచ్చును. ఆధునిక కాలములో ఎవ్వరూకూడా ఆస్తులను కొనాలని కోరుకోరు. దీనికి బదులుగా ఆస్తులను అద్దెకు తీసుకుంటారు. ఇలా ఆస్తులను అద్దెకు తీసికోవటం ద్వారా ఉపయోగించటాన్ని 'లీజింగ్' అంటారు. Fools build houses where as wise men live in it అనే సామెత మనందరికీ తెలిసిందే. పెద్ద పెద్ద పారిశ్రామిక సంస్థలకు చెందిన యజమానులు అద్దె ఇండ్లలో ఉండటము మనందరికీ తెలిసినదే.

ఆధునిక వ్యాపార ప్రపంచములో అనిశ్చిత ఎక్కువ, సంస్థలు తీవ్రమైన పోటీని ఎదుర్కొనవలసియున్నది. ఈ కారణాల వలన ఏది దీర్ఘకాల ప్రయోజనాన్ని ఇస్తుందన్న విషయాన్ని గట్టిగా నిర్ణయించలేము. అలాంటి పరిస్థితులలో స్థిరాస్తుల పెట్టుబడికి అవసరమైన నగదును సంప్రదాయ వనరులద్వారా కాకుండా క్రొత్తవనరుల ద్వారా సంతృప్తి పరచుకొనవలెను. దీనికి తోడు పెరుగుచున్న ద్రవ్యోల్బణము, వ్యయాలు, పన్నురేట్లు మొదలైన అంశాల కారణంగా అంతర్గత నిధుల విలువ గణనీయంగా పడిపోతున్నది.

ఈ అంశాల కారణంగా ఏర్పడిన ప్రత్యామ్నాయ వనరులలో లీజ్-ఫైనాన్సింగ్ ఒకటి.

**లీజింగ్ జరిగే పద్ధతి :** లీజ్ ఒప్పందాన్ని ఒక రకమైన అద్దె ఒప్పందంగా భావించవచ్చును. లీజింగ్‌లో ఇద్దరు పార్టీలుంటారు. వీరు స్థిరాస్థులను లీజ్‌కిచ్చేవారు, వీరిని (Lesser) లెస్సార్ అనీ, లీజుకు తీసుకున్నవారిని లెస్సీ (Lessee) అనీ, అంటారు. లెస్సార్ భారీ యంత్రపరికరాలను కొనుగోలు చేసి వాటిని నిర్ణీతకాలానికి లెస్సీకి లీజ్ ఒప్పందంపై ఇచ్చును. లెస్సీ (Lessee) అనగా అద్దెదారు ముందుగా నిర్ణయించిన అద్దెను నిర్ణీత కాలవ్యవదిలో చెల్లిస్తూ ఉంటారు. లీజింగ్ పద్ధతిద్వారా భారీ యంత్రపరికరాలను, ఖనిజాల గనులను, కొండల త్రవ్వకానికి హక్కును, మట్టిని తీసుకొని వెళ్ళటానికి హక్కును, సినిమా హాళ్ళను, ఖాళీస్థలాలను, పెద్దపెద్ద బంగళాలను అద్దెకివ్వటము జరుగును.

**లీజ్‌లలోని రకాలు :** వివిధ ఆస్థులను ఉపయోగించే పద్ధతిని బట్టి లీజింగ్‌ను క్రింది విధంగా విభజించవచ్చును.

**1. ఆర్థిక లీజు :** ఈ పద్ధతిలో అద్దెదారు తనకవసరమైన పరికరాన్ని మార్కెట్లో ఎంపిక చేసుకొని దాని ధరను, అమ్మకపు నిబంధనలను నిర్ధారించి తనకు లీజ్‌కు ఇచ్చే ఉద్దేశ్యముతో లీజింగ్ సంస్థ కొనుగోలు చేయటానికి అన్ని ఏర్పాట్లను చేస్తాడు. విక్రేతకు చెల్లించవలసిన మొత్తానికి లీజింగ్ సంస్థ బాధ్యత వహిస్తుంది. అద్దెదారు లీజింగ్ సంస్థనుండి ఉపసంహరణకు వీలులేని విధంగా ఎంపిక చేసిన ఆస్థికి సంబంధించి లీజ్ ఒప్పందాన్ని తీసుకుంటాడు. ఈ విధంగా దానిని వినియోగించుకోవటానికి అవసరమైన అన్ని హక్కులను సంపాదించుకుంటాడు. వీటితోపాటు ఆస్థిని భీమా చేయించటము, విక్రయానంతర సేవలను పొందటము, అమ్మకంతోపాటు వచ్చే పూచీని ఉపయోగించుకోవటానికి సంబంధించిన హక్కులను కూడా పొందుతాడు. ఇందుకు ప్రతిఫలంగా లీజింగ్ కంపెనీకి నిర్ణీత కాలవ్యవధిలో లీజ్ మొత్తాన్ని చెల్లిస్తూ ఉంటాడు. చాలా సందర్భాలలో లీజ్ ఒప్పందం కాలము ముగిసిన తరువాత ఆస్థిపై యాజమాన్యపు హక్కు అద్దెదారుకు బదిలీ అగును.

**2. నిర్వహణాలీజు :** దీనిని సర్వీసు లీజుగా కూడా వ్యవహరిస్తారు. దీని కాలపరిమితి తక్కువగా ఉండటము వలన దీనిని స్వల్పకాలిక లీజు అనికూడా అంటారు. ఇందులో లెస్సారు, లెస్సీ పరస్పరము నోటీసులను జారీ చేసుకొనటం ద్వారా లీజు ఒప్పందాన్ని ఉపసంహరించుకుంటారు. ఆర్థిక లీజుతో పోలిస్తే ఇందులో చెల్లించవలసిన అద్దె ఎక్కువగా ఉండును. ఆస్థి వాడకంలో లేనప్పుడు కలిగే కష్టనష్టాలకు, ఆస్థి నిర్వహణా వ్యయాన్ని లెస్సారే భరించాలి. సాధారణ ఖర్చులను లెస్సీ భరిస్తాడు.

**3. మూలధన లీజు :** పెద్ద పెద్ద మొత్తాలలో పెట్టుబడులకవసరమయ్యే ఆస్తులు ఇతర పరికరాలకు ఈ తరహా లీజు ఉపయోగపడును. ఇలా లీజుకిచ్చే ఆస్థుల విలువ కోట్ల రూపాయలలో ఉండి లీజ్‌కాలము 10 సం॥ల వరకు విస్తరించబడి యుండును. ఇలాంటి సందర్భాలలో లెస్సార్ ఆస్థి కొనుగోలు విలువలో సగము మొత్తానికి తగ్గకుండా విక్రేతకు చెల్లిస్తాడు. మిగిలిన మొత్తం చెల్లింపునకు కొంత గడువివ్వటం జరుగును. ఇంతేకాక ఆస్తి కొనుగోలుదారు, లేక లెస్సార్‌కు అద్దెదారునుండి అద్దెను వసూలు చేసుకునే హక్కు లభించును. కొన్ని సందర్భాలలో అద్దెదారు కోనుగోలు విలువలో చెల్లించవలసిన మిగిలిన భాగాన్ని తాను చెల్లించవలసిన లీజ్ మేరకు విక్రేతకు చెల్లించటము జరుగును. ఈ లీజు విషయంలో సాధారణ నిర్వహణా ఖర్చులు, భీమా మరియు పన్నులను లెస్సీ చెల్లిస్తాడు. ఈ తరహా లీజులను రైల్వే కంపెనీలు, బొగ్గుగనులలో వాడే యంత్ర పరికరాలు, విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసే యంత్రాలు, నౌకలకు సంబంధించిన కార్యకలాపాలలో ఉపయోగిస్తారు.

**4. అమ్మకము మరియు తిరిగి లీజుకు తీసికోవటము :** ఈ తరహా లీజులో ఆస్థిని పూర్తిగా లెస్సార్‌కు విక్రయించటము జరుగును. కొన్ని సంధర్భాలలో లెస్సార్‌కు ఆస్థిని సమకూర్చి పెట్టటము జరుగుతుంది. ఇలా సమకూర్చిన ఆస్థిని సమకూర్చిన వారే లెస్సార్‌నుండి లీజ్ ఒప్పందంపై నిర్ణీత మొత్తములో లీజ్‌ను చెల్లించే పద్దతిపై లీజ్‌కు తీసికోవటం జరుగును. ఆస్థి నిర్వహణా ఖర్చు, పన్నులు, భీమా ఖర్చులను అద్దెదారు భరిస్తాడు. కార్యాలయ భవనాలు, పారిశ్రామిక భవనాలు, షాపింగ్ కేంద్రాలలో ఈ తరహా లీజు అమలులో ఉండును.

**5. సీమాంతర లీజు :** లెస్సార్ మరియు లెస్సీలు రెండు దేశాలలో ఉన్నప్పుడు వారిమధ్య ఏర్పడిన లీజును సీమాంతర లీజు అని అంటారు. ఈ తరహా లీజు భారతదేశములో అంతగా అమలులో లేదు.

**లీజింగ్ వల్ల ప్రయోజనాలు :**

i. పెద్ద పెద్ద మొత్తాలకు సంబంధించిన ఆస్తుల కొనుగోలులో నిధులు నిరుపయోగంగా పడిఉండకుండా లీజింగ్ సహాయపడును.

ii. లీజింగ్ పద్ధతిలో శీఘ్రగతిని పరపతిని సంపాదించవచ్చును.

iii. మారుతున్న అవసరాలకనుగుణంగా అవసరమైన ఆస్థులను మాత్రమే లీజుకు తీసుకునే అవకాశమేర్పడును.

iv. ఆస్థులు వృధాపడి ఉండటం వలన వచ్చే నష్టమునుండి పరిహారాన్ని పొందవచ్చును.

v. అభివృద్ధి చెందుతున్న సంస్థలకు భారీ పెట్టుబడుల ఇబ్బంది లేకుండా చేయును.

vi. ఆస్థి కొనుగోలులో వచ్చే ఇబ్బందులనుంచి, మోసాలనుండి బయటపడవచ్చును.

**లీజింగ్‌లోని సమస్యలు :**

i. భవిష్యత్తులో ఉపయోగములోకి వచ్చే ప్రాజెక్టుల విషయంలో లీజింగ్ ద్వారా విత్త సౌకర్యాన్ని పొందటము సాధ్యపడదు. దీనికి కారణము ప్రాజెక్టుల వలన వెంటనే ఆదాయము రాదు కాబట్టి అద్దె చెల్లించటము సాధ్యపడదు.

ii. ఆస్థుల కొనుగోలులో లభించే రాయితీలు లభించవు.

iii. లీజ్ కాలములో స్థిరాస్థుల విలువలో వచ్చిన పెరుగుదల వలన సంక్రమించే మూలధన లాభాలను పొందలేము.

iv. పరపతి విత్త సౌకర్యముతో పోలిస్తే లీజ్ విత్త సౌకర్యము యొక్క వ్యయము అధికముగా ఉండును.

v. ఒప్పందాన్ని మధ్యలో రద్దుపరచుకొంటే అద్దెదారు పెద్ద మొత్తములో నష్టపరిహారాన్ని చెల్లించవలసి యుండును.

vi. లెస్సీ లీజును సక్రమంగా చెల్లించకపోతే లెస్సార్ నష్టపోతాడు.

vii. లీజ్ ఒప్పందాలను నియంత్రించటానికి ప్రత్యేక చట్టాలు లేకపోవటం వలన లెస్సార్, లెస్సీలమధ్య వచ్చే సమస్యలను పరిష్కరించటము కష్టమవుతుంది.

భారతదేశములో ఇప్పుడిప్పుడే లీజింగ్ వ్యాపారము అభివృద్ధి చెందుతుంది. అయితే వ్యాపారంపట్ల సరైన అవగాహన, చాలినంత ఆర్థికస్థోమత లేకపోవటంవలన లీజింగ్ కంపెనీలు కొన్ని అవాంఛనీయమైన చర్యలను చేపడుతున్నారు. ఇందులో ముఖ్యమైనవి వాస్తవ లీజు కాలపరిమితికి, ఒప్పందంలో ఉన్న లీజుకాల పరిమితికి మధ్య తేడాలుండటము, తక్కువ విలువకుగానీ, ఎక్కువ విలువకుగానీ లీజు ఒప్పందాన్ని ఏర్పాటు చేసుకొనటము. ఇలాంటి చర్యలు లీజింగ్ ఫైనాన్స్‌కు చెడ్డ పేరును తెస్తున్నవి. నరసింహం కమిటీ కూడా లీజు ఫైనాన్స్ ప్రాధాన్యతను గుర్తించి ఈ విధానాన్ని క్రింది చర్యల ద్వారా క్రమబద్ధీకరించి అభివృద్ధి పరచవలెనని సూచించినది.

a) వీరికి కనీస మూలధనావశ్యకతను నిర్దేశించాలి.

b) లీజింగ్ వ్యాపారాన్ని నిర్వహించేటప్పుడు స్పష్టమైన పద్ధతులను పాటించాలి.

c) ఏకీకృతమైన ఒక పర్యవేక్షణ అధారిటీకి నిర్ణీత కాలవ్యవధిలో వ్యవహార నివేదికలను పంపించాలి.

### 12.5 అద్దె - కొనుగోలు పద్ధతి (Hire - Purchasing) :

పారిశ్రామిక సంస్థలకు, ఇతర వ్యాపార సంస్థలకు దీర్ఘకాల విత్త సౌకర్యాన్ని కలుగజేయటంలో అందుబాటులో ఉన్న మరొక పద్ధతి అద్దె - కొనుగోలు పద్ధతి. ఈ పద్ధతిలో భారీ యంత్ర పరికరాలను, అద్దె కొనుగోలు వాయిదాల పద్ధతిలో కొనుగోలు ధరను చెల్లించే ప్రాతిపదికపై సమకూర్చుకునే అవకాశాన్ని కలుగజేయటం జరుగును. ఈ పద్ధతిలో విక్రేత వస్తువుల ఉపయోగితా స్వాధీనాన్ని కొనుగోలుదారుకు బదిలీ చేస్తాడు. ఇలాంటి చర్యవలన కొనుగోలుదారుకు ఆస్థిని ఉపయోగించుకునే అవకాశము కలుగును. ఆస్థి విలువ, దానిపై వడ్డీని నిర్ణీత వాయిదాలలో చెల్లించే విధంగా విస్తరించటము జరుగును. చివరి వాయిదా చెల్లించిన తరువాత మాత్రమే ఆస్థి యాజమాన్యము కొనుగోలుదారుకు బదిలీ అగును. అలా చివరి వాయిదావరకు ఆస్థి యాజమాన్యము విక్రేత వద్దనే ఉండును. ఏదైనా కారణాల వలన కొన్ని వాయిదాలు చెల్లించిన తరువాత కొనుగోలుదారు మిగిలిన వాయిదాలను చెల్లించకపోతే అంతవరకు చెల్లించిన వాయిదా మొత్తాలను ఆస్థిని ఉపయోగించుకొన్నందుకు అద్దెగా భావిస్తాడు. విక్రేత ఆస్తిని తిరిగి స్వాధీనపరచుకొంటాడు. ఈ విధంగా ఆవ్యవహారము అయితే కొనుగోలు వ్యవహారంగా ముగుస్తుంది, లేకపోతే అద్దె ఒప్పందంగా పరిణమిస్తుంది. ఈ కారణాన ఈ వ్యవహారాన్ని అద్దె - కొనుగోలు వ్యవహారంగా భావిస్తారు. ఈ ఒప్పందంలోని కొనుగోలుదారు పన్ను బాధ్యతలను నిర్ణయించేటప్పుడు ఆస్థిపై తరుగుదలను, వాయిదాలలో చెల్లించిన వడ్డీ మొత్తాన్ని తగ్గింపుగా చూపించుకొనవచ్చును. ఇదే లీజింగ్ ఒప్పందములో తరుగుదలను లెస్సార్ క్లెయిమ్ చేస్తాడు. లీజ్ మొత్తాన్ని లెస్సీ ఖర్చులుగా క్లైమ్ చేస్తాడు. అద్దె కొనుగోలు ఒప్పందంలో వాయిదాకాలం పూర్తయిన తరువాత ఆస్థి ఖాతాలో నిలువ ఉన్న విలువ కొనుగోలుదారుకు చెందును. ఇలా ఉన్న విలువను ఆదాయంగా భావించడం జరుగును.

అద్దె కొనుగోలు పద్ధతి అనే విత్తసేవల కారణంగా అతి తక్కువ వాయిదా మొత్తముతో, కొన్నిసార్లు కొంత తక్షణ చెల్లింపు మొత్తముతో ఆస్థిని సముపార్జించుకునే అవకాశము ఏర్పడును. అతి తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించే చిన్న చిన్న వ్యాపారస్తులకు ఈ పద్ధతి మిక్కిలి ప్రయోజనకారిగా ఉండును. అయితే వాయిదా కాలాలు పూర్తయ్యేవరకు వ్యవహారము సాఫీగా కొనసాగితే ఎలాంటి యిబ్బంది ఉండదు కానీ మధ్యలో ఒప్పందాన్ని రద్దు పరచవలసివస్తే అనేక యిబ్బందులు తలయెత్తును. అద్దె - కొనుగోలు వ్యవహారాలను క్రమబద్ధీకరించటానికి ప్రత్యేకించబడిన చట్టాలు లేకపోయినప్పటికీ, ఈ వ్యవహారాలు సాధారణ కాంట్రాక్టు చట్టము పరిధిలోనికి వచ్చును.

### 12.6 ఫాక్టరింగ్ (Factoring) :

వ్యాపారపు టర్నోవరులో అధికశాతము అరువు - వ్యవహారాలుండును. అరువు వ్యవహారాలకు సంబంధించిన బాకీలను వసూలు చేసుకొనటము చిన్న, మధ్య తరహా సంస్థలకు ఒక పెద్ద సమస్యగా తయారగుచున్నవి. బాకీలు వసూలు కాకపోవటం వలన వ్యాపారపు

టర్నోవరు తగ్గును. చాలా సందర్భాలలో భారీ సంస్థలు తమ కవసరమైన సరకులను చిన్న తరహా సంస్థలనుండి కొనుగోలు చేయును. ఇలాంటి కొనుగోళ్ళకు సంబంధించిన మొత్తాలను చెల్లించటములో పెద్ద సంస్థలు ఆలస్యం చేస్తే దాని ప్రభావము చిన్న సంస్థల లాభాలపై ఉండును. ఇలాంటి పరిస్థితి కొంతకాలానికి పారిశ్రామిక రుగ్మతకు దారితీయును. ఇలాంటి పరిస్థితి రాకుండా చూసే సంస్థలను ఫాక్టరింగ్ సంస్థలుగా చెప్పవచ్చును.

ఫాక్టర్ అనే మాటకు ఏజెంటు అని అర్థమున్నది. వివిధ సంస్థలకు రావలసిన బాకీల వసూలు బాధ్యతను చేపట్టేవారిని లేక రావలసిన బాకీలను కొనుగోలు చేసే వారిని ఫాక్టర్లుగా పరిగణిస్తారు. సాధారణంగా భీమాకంపెనీలు, ద్రవ్యసహాయ సంస్థలు, వాణిజ్య బ్యాంకులు ఫాక్టరింగ్ వ్యాపారాన్ని నిర్వహించును. ఇలా ఫాక్టరింగ్ వ్యాపారాన్ని చేసే సంస్థలు వ్యాపార సంస్థల రావలసిన బాకీలను కొనుగోలు చేసి అందులో **80%** మొత్తాన్ని వెంటనే, మిగిలిన **20%** మొత్తాన్ని ఋణాలు వసూలైన తరువాత చెల్లించటము జరుగును. ఇలా బాకీలను వసూలు చేసి పెట్టినందుకు ఫాక్టర్లు కొంత ఫీజును వసూలు చేస్తారు. ఫాక్టర్లు రావలసిన బాకీలను కొనుగోలు చేసేటప్పుడు ఆ బాకీలకనుబంధంగా ఉన్న అన్ని పరపతి రిస్కులను స్వీకరించును. ఫాక్టర్లను ఒక రకంగా డెల్‌క్రేడర్ ఏజెంట్లుగా వ్యవహరించవచ్చును. ఫాక్టరింగ్ అనే వ్యవస్థ మొట్టమొదటగా వస్త్ర పరిశ్రమతో ప్రారంభించబడినది.

**ఫాక్టరింగ్ ఒప్పందములోని షరతులు :**

i. సంస్థ మొత్తం బాకీలలో తనకు ఆమోదయోగ్యమైన బాకీలను ఫాక్టర్లు ఎన్నుకొంటారు.

ii. రావలసిన బాకీలు వసూలు కానప్పుడు ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారన్నది ఒప్పందంలో స్పష్టం చేయవలెను.

iii. ఫాక్టర్లు తమ ఖాతాదారుల పేరిట ప్రత్యేకమైన ఖాతాలను ఏర్పాటుచేస్తారు. ఒక ఖాతాదారుకు సంబంధించిన బాకీలు వసూలు కాగానే ఆ ఖాతాలో జమ చేయటం జరుగును. ఇలా జమ చేసిన మొత్తాలను ఆ ఖాతాదారుడు ఎప్పుడైనా తీసికొనవచ్చును. ఆ ఖాతాలోని నిల్వపై నిర్ణీత రేటు ప్రకారము వడ్డీని కూడా ఆర్జించవచ్చును.

iv. ఫాక్టరింగ్ బాధ్యతను నిర్ణీతకాలపరిమితికి మాత్రమే తీసికొనటం జరుగును. ఈ కాలపరిమితి ముగిసే లోపల సంస్థకు చెల్లించవలసిన మొత్తాన్ని ఫాక్టర్ చెల్లించాలి.

v. ఇంకా వసూలుకాని బాకీలుండి కాలపరిమితి పూర్తయినపుడు ఆ రావలసిన బాకీల కొరకు ఫాక్టరు సంస్థకు ఋణాలను మంజూరు చేస్తాడు. ఇలా మంజూరు చేసిన ఋణాలపై ఫాక్టరు కొంత వడ్డీని కూడా వసూలు చేయును.

vi. ఫాక్టరుకు చెల్లించవలసిన ఫీజు లేక కమీషన్‌ను ముందుగా నిర్ణయించవలసి యున్నది.

**ఫాక్టర్ విధులు :** ఫాక్టర్ విధులు కాంట్రాక్టు పూర్వకమైనప్పటికీ, సర్వసాధారణంగా ఫాక్టర్ క్రింది విధులను నిర్వహిస్తుంటాడు;

i. ఋణాలను వసూలు చేసి పెట్టటము లేక ఋణాలను కొనుగోలు చేయటము

ii. వ్యాపారస్థునికి చెందిన అమ్మకాల లెడ్జరును నిర్వహిస్తాడు

iii. వ్యాపారస్థుని పరపతికి సంబంధించిన నష్టభయాన్ని భరిస్తాడు.

iv. వసూలు కావలసిన బాకీల హామీపై ఋణ సహాయాన్నందజేస్తాడు.

v. వ్యాపార విషయాలు మరియు సంస్థ నిర్వహణకు సంబంధించిన అనేక విషయాలపై సలహాలనిస్తాడు.

**ఫాక్టరింగ్ - రకాలు :**

ఫాక్టర్లు నిర్వహించే బాధ్యతా స్వభావాన్నిబట్టి ఫాక్టర్లను వర్గీకరించవచ్చును. పూర్తి ఫాక్టరింగ్ - దీనిని పర్యవసాన నిరాదరణ లేని ఫాక్టరింగ్ అనికూడా అంటారు. అనగా కాలపరిమితి పూర్తయిన తరువాత కూడా బాకీలు వసూలు కాకపోతే వాటివలన వచ్చిన నష్టాన్ని ఫాక్టర్లే భరించాలి.

**పర్యవసాన నిరాదరణ ఉన్న ఫాక్టరింగ్ -** ఈ పద్ధతిలో నిర్ణీత కాల పరిమితి లోపల బాకీలు వసూలు కాకపోతే అలాంటి బాకీలు తిరిగి సంస్థకే బదిలీ అగును. అలాకాక వీటి బాధ్యతను కూడా ఫాక్టర్ తీసుకోవాలంటే అదనపు చార్జీలను చెల్లించవలసి యుండును.

**పరిమిత ఫాక్టరింగ్ -** ఈ పద్ధతిలో ఫాక్టర్, సంస్థకు చెందిన కొన్ని బాకీలను మాత్రమే వసూలు చేయటానికి ఒప్పుకుంటాడు. ఈ బాకీలకు సంబంధించిన మొత్తాన్ని వెంటనే సంస్థకు చెల్లిస్తాడు.

**కాలపరిమితి కలిగిన ఫాక్టరింగ్ -** ఈ పద్ధతిలో బాకీలు వసూలు అయినప్పుడు మాత్రమే సంస్థకు మొత్తాన్ని చెల్లించటము జరుగును. దీనిని వసూలు ఫాక్టరింగ్ అనికూడా అంటారు.

**నోటిఫైడ్ ఫాక్టరింగ్ -** సంస్థ ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేనప్పుడు ఫాక్టరింగ్ సంస్థ కేవలము ఋణాల వసూలు బాధ్యతను మాత్రమే స్వీకరించును. ఋణాలకు సంబంధించిన నష్టభయాన్ని ఫాక్టర్ భరించడు.

**ఏజెన్సీ ఫాక్టరింగ్ -** ఈ పద్ధతిలో సంస్థ, ఫాక్టర్లు కార్యకలాపాలను తమమధ్య విభజించుకొంటారు. అమ్మకాల లెడ్జర్ల నిర్వహణ, రుణాల వసూలు సంస్థ బాధ్యతలుగాను, సంస్థకవసరమైన ఆర్థిక సహాయాన్ని చేయటము నష్టభయాన్ని అంగీకరించటమనేవి ఫాక్టర్ల బాధ్యతగా ఉండును.

**ఫాక్టరింగ్ వలన ప్రయోజనాలు :**

i. సంస్థ ఫాక్టరింగ్ కారణంగా రావలసిన ఖాతాలపై శ్రద్ధ చూపకుండా ఉత్పత్తి కార్యకలాపాలపై తమ శక్తి సామర్థ్యాలను వినియోగించుకొనవచ్చును. బాకీలకు సంబంధించిన మొత్తాన్ని ఫాక్టర్లు చెల్లిస్తారు. కాబట్టి సంస్థ టర్నోవరుపై దృష్టిని నిలుపవచ్చును.

ii. ఫాక్టర్లు బాకీలను విశ్లేషించి బాకీల స్వభావాన్ని వివరిస్తారు. దీనివలన తమ సంస్థ తన అరువు వ్యవహారాలను క్రమబద్ధం చేసుకొనవచ్చును.

iii. ఫాక్టర్లు అమ్మకాల లెడ్జర్లు కూడా నిర్వహిస్తారు.

iv. ఫాక్టరింగ్ సంస్థల సంఖ్య పెరిగిన కారణంగా ఫాక్టరు వ్యయం తక్కువగా ఉండే అవకాశమున్నది.

**ఫాక్టరింగ్ లోపాలు :**

i. ఫాక్టరింగ్ వ్యయము సంస్థ బలహీనతకు చిహ్నము

ii. హామీలేని రుణాలను వసూలు చేయటానికయ్యే ఖర్చు కన్న ఫాక్టరింగ్ ఖర్చు అధికముగానుండును.

iii. బాకీలను ఫాక్టరింగ్ చేయటమంటే సంస్థ భవిష్యత్తును తాకట్టు పెట్టటములాంటిదేనని కొంతమంది అభిప్రాయము.

**భారతదేశములో ఫాక్టరింగ్ :**

భారత ప్రభుత్వము ఫాక్టరింగ్ అవసరాన్ని గుర్తించి ఫాక్టరింగ్‌కు సంబంధించిన సమగ్ర నివేదికను అందించవలసినదిగా 1985 లో SBI మాజీ డైరెక్టరైన C.S. కల్యాణ సుందరం అధ్యక్షతన ఒక కంపెనీని ఏర్పాటుచేయటం జరిగినది. ఈ కమిటీ సూచనల మేరకు 1990 లో బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టాన్ని సవరించటము జరిగినది. భారతదేశములో మొదటి ఫాక్టరింగ్ సంస్థను చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (Small Industries Development Bank of India - SIDBI), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ సౌరాష్ట్ర, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండోర్‌లతో కలసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1991లో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫాక్టరింగ్ అండ్ కమర్షియల్ సర్వీసెస్‌ను 25 కోట్ల రూపాయల మూలధనంతో ప్రారంభించటం జరిగినది. ఫాక్టరింగ్ సేవల ప్రాధాన్యత దృష్ట్యా ఇంకా అనేక సంస్థలు ఫాక్టరింగ్ సేవలను చేపట్టటానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

## 12.7 డిస్కౌంటింగ్ (Discounting ) :

వ్యాపారస్తులకు సంబంధించిన వర్తకపు బిల్లులను డిస్కౌంట్ చేసుకొని ఆ మొత్తాన్ని ఖాతాదారుని ఖాతాకు క్రెడిట్ చేయటాన్ని డిస్కౌంటింగ్‌గా పరిగణిస్తారు. బ్యాంకులందించే అనేక రకాలైన విత్తసేవలలో బిల్లులను డిస్కౌంట్ చేసుకొనటమనేది ఒకటి. వ్యాపారస్తులు తమ అరువు వ్యవహారాల పరిష్కారంలో భాగంగా ఋణగ్రస్తునిపై వ్రాసే బిల్లులను తమ టర్నోవరుకవసరమైన నగదును పొందటానికి బ్యాంకులవద్ద డిస్కౌంట్ చేస్తారు. ఇలాంటి బిల్లులు రెండు రకాలుగా ఉండవచ్చును. అవి కోరగానే మొత్తాన్ని చెల్లించే బిల్లులను డిమాండు బిల్లులనీ, నిర్ణీత కాలవ్యవధి తరువాత మొత్తాన్ని చెల్లించే బిల్లులను కాలపరిమితి గల బిల్లులనీ అంటారు. ఇలాంటి బిల్లులను బ్యాంకులు ఏక మొత్తంగా కొనుగోలు చేయటంగాని, డిస్కౌంట్ చేయటం గానీ చేస్తారు. తక్షణ చెల్లింపు పొందే బిల్లులకు సంబంధించి బ్యాంకు మొత్తాన్ని ఖాతాదారు ఖాతాకు క్రెడిట్ చేయటాన్ని బిల్లుల కొనుగోలుగాను, నిర్ణీత కాలపరిమితి గల బిల్లులను తీసికొనటాన్ని బిల్లుల డిస్కౌంటింగ్ అనీ అంటారు. బిల్లుల డిస్కౌంటింగ్‌లో కొనుగోలులో కన్నా ఎక్కువ వడ్డీని డిస్కౌంట్‌గా వసూలు చేయటం జరుగును.

డిస్కౌంట్ చేసుకున్న బిల్లులకు సంబంధించి బ్యాంకరు ఆ బిల్లులకు సంబంధించిన యజమాని అవుతాడా, కాడా అన్న విషయానికి సంబంధించి మధ్యప్రదేశ్ హై కోర్టు ఇచ్చిన తీర్పును ప్రామాణికంగా తీసుకోవాలి. ఒక ఖాతాదారునుండి ఎండార్స్‌మెంట్ పొంది దానికి సంబంధించిన మొత్తానికి బ్యాంకరు పూర్తి క్రెడిట్ ఇచ్చి ఉంటే బ్యాంకరును కాలక్రమ హోల్డరుగా భావించాలి.

బిల్లును డిస్కౌంట్ చేసికొనటమువలన వచ్చు ప్రయోజనాలు :

i. ఋణాలు, అడ్వాన్సులను మంజూరు చేయటంకన్నా బిల్లులను డిస్కౌంట్ చేసుకొనటమనే ప్రక్రియను లాభదాయకమైన ప్రక్రియగా భావించవచ్చును.

ii. బ్యాంకు నిధులకు సంపూర్ణ భద్రత ఉండును

iii. నిర్ణీత కాలానంతరము బిల్లుల మొత్తము తప్పనిసరిగా వసూలు అవుతుంది. కాబట్టి నిల్వ ఉన్న బిల్లులను నగదుతో సమానంగా భావించవచ్చును.

iv. డిస్కౌంట్ చేసుకున్న బిల్లులకొరకు చెల్లించిన మొత్తాన్ని అవసరమైతే ఈ బిల్లులను RBI వద్ద రీ డిస్కౌంట్ చేసుకొనటం ద్వారా పొందవచ్చును.

v. బిల్లుల విలువ స్థిరంగా ఉండును - స్థిర చరాస్థుల విలువలో హెచ్చుతగ్గులు రావచ్చును గానీ బిల్లుల విలువలో అలాంటి అవకాశము లేదు.

vi. బిల్ డిస్కౌంటింగ్ వలన బ్యాంకుల లాభదాయకత కూడా గణనీయంగా పెరుగును.

**డిస్కౌంటింగ్‌లో లోపాలు :**

i. కొన్ని రకాల బిల్లులను డిస్కౌంట్ చేసుకునేటప్పుడు బ్యాంకర్లు కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొనవలెను. ముఖ్యంగా మోటారు ట్రాన్స్‌పోర్టు సర్టిఫికెట్లపై అప్పులిచ్చేటప్పుడు ఎక్కువ జాగ్రత్తలు తీసికొనవలెను.

ii. అన్ని రకాల బిల్లులకు రీ డిస్కౌంటింగ్ సౌకర్యముండదు.

iii. బిల్ డిస్కౌంటింగ్‌లో ముఖ్యంగా పరిశీలించవలసినది. హుండీ కర్త మరియు హుండీ స్వీకర్త యొక్క పరపతిని.

**భారత దేశములో బిల్ డిస్కౌంటింగ్ :**

విదేశాలలో మాదిరిగా భారతదేశంలో బిల్ డిస్కౌంటింగ్ విత్తసేవ సంపూర్ణ స్థాయిలో అభివృద్ధి చెందలేదు. దీనికి అనేక కారణాలున్నవి. అందులో ముఖ్యమైనవి ఖాతాదారులు బిల్ డిస్కౌంటింగ్ పద్ధతికన్నా క్యాష్ క్రెడిట్ పద్ధతిపై మొగ్గుచూపటము.

అధిక రేటులో ఉన్న స్టాంపు డ్యూటీ కూడా బిల్ మార్కెట్ పెరుగుదలకు ఒక అవరోధంగా పరిణమించినది.

బిల్ డిస్కౌంటింగ్‌లో ఉండే ప్రత్యేక ప్రయోజనాల దృష్ట్యా దహేజా స్టడీ గ్రూపు కూడా బిల్ మార్కెట్‌ను అభివృద్ధి చేయవలసినదిగా సిఫారసు చేసినది. ఇందుకవసరమైన సంస్థలు, యంత్రాంగాన్ని కూడా రూపొందించవలసిన అవసరాన్ని కూడా ఉద్ఘాటించినది.

## 12.8 ఇతర విత్తసేవలు (Other Financing Services) :

పైన వివరించిన విత్తసేవలు కాకుండా పారిశ్రామిక సంస్థల విత్త సౌకర్యకల్పనకు అనేక పద్ధతులు అమలులో ఉన్నవి. ఇందులో కొన్ని పద్ధతులు క్రింది విధముగానుండును.

**వెంచర్ కాపిటల్** (Venture Capital) : పారిశ్రామిక సాంకేతిక రంగములో వస్తున్న మార్పుల ఫలితంగా క్రొత్త క్రొత్త ప్రాజెక్టులు వెలుగులోనికి వస్తున్నవి. ఇలాంటి క్రొత్త ప్రాజెక్టులకు విత్త సౌకర్యాన్ని కలిగించే విధానాన్నే వెంచర్ కాపిటల్ అని అంటారు. సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టులను మార్కెట్లో ప్రవేశపెట్టటంలో కొన్ని యిబ్బందులున్నప్పటికీ ఇలాంటి కార్యకలాపాలలో లాభాల మార్జిన్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ లాభాలకాశపడి తమశక్తి సామర్థ్యాన్ని తెలివితేటలను పరీక్షించుకొనటానికి వ్యక్తులు ఇలాంటి ప్రాజెక్టులను చేపడతారు.

**వెంచర్, కాపిటల్ ఒప్పందంలోని ముఖ్యాంశాలు :**

i. వెంచర్ కాపిటల్ సాధారణ కాలపరిమితి 3 నుండి 5 సం॥లుగా ఉంది. ప్రాజెక్టుదారులు కూడా తమ ప్రాజెక్టును ఈ కాలములో పూర్తయ్యే విధంగా రూపొందిస్తారు.

ii. వెంచర్ కాపిటల్ సంస్థలు అధికరేటులో ఆదాయాన్ని సంపాదించవచ్చనే ఆశతో ఎక్కువ రిస్కును తీసికొనటానికి ఇష్టపడతారు.

iii. వెంచర్ కాపిటల్ సమకూర్చే సంస్థలు విత్త సహాయంతో పాటు మార్గదర్శిక సేవలను కూడా అందించును.

iv. సహాయము పొందిన సంస్థల ఆర్థిక భారము మొదటి రెండు సంవత్సరాలలో ఎక్కువగాను, ఆ తరువాత తక్కువగాను ఉండును.

v. వెంచర్ కాపిటల్‌లో సాధారణంగా సాంకేతిక పరిజ్ఞానం అమలుకు ఎక్కువ ప్రాధాన్యత ఉండి స్థిరాస్తుల ఉపయోగానికి తక్కువ ప్రాధాన్యత ఉన్నది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకించబడిన తమ శాఖలద్వారా వెంచర్ కాపిటల్ ప్రాజెక్టుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నవి. మన రాష్ట్రములో కూడా ABIDC (Andhra Pradesh Industrial Development Corporation) నేతృత్వంలో వెంచర్ కాపిటల్ ప్రాజెక్టులకు విత్త సహాయాన్నందించటం జరుగుతుంది.

ii. **ఫర్ఫేటింగ్** (Forfeiting) : ఫాక్టరింగ్‌లో ఖాతాబాకీల వసూళ్ళ బాధ్యతను చేపట్టటం జరుగును. అదే ఎగుమతి కార్యకలాపాలకు సంబంధించిన ఎగుమతి బిల్లులపై విత్త సౌకర్యాన్ని కలుగజేస్తే దానిని ఫర్ ఫీటింగ్‌గా భావించవచ్చును. ఎగుమతి వర్తకంలో ఎగుమతుల బిల్లు మొత్తాన్ని పొందే హక్కు ఉన్న ఎగుమతిదారుడు బిల్లుపై తనకున్న హక్కును ఫర్ఫేటింగ్ సంస్థ పేరుకు బదిలీ చేస్తూ వదులుకుంటాడు. ఇలా తన హక్కును వదులుకోవటంవలన దానిని ఫర్ఫేటింగ్ అని అనడం జరుగుతుంది. ఎగుమతిదారుకవసరమైన ద్రవ్యసహాయాన్ని ఫర్ఫేటింగ్ సంస్థలందించును. గడువు తేదీన బిల్లుమొత్తాలను వసూలు చేసే బాధ్యత ఫర్ఫేటర్‌దే, అనగా ఎగుమతిదారుకు ఫర్ఫేటింగ్ సంస్థ ఏ విధమైన పర్యవసానం లేకుండా నిర్వహించటం జరుగును. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఫర్ఫేటింగ్ కార్యకలాపాలను చేపట్టుచున్నవి.

**ఫర్ఫేటింగ్ వలన ప్రయోజనాలు :**

i. ఎగుమతిదారులకు అవసరమైన నిర్వహణా మూలధనం లభించటమేగాక వారి పెట్టుబడులకు ద్రవ్యతకూడా లభించును.

ii. ఈ పద్ధతిని నిర్వహించటము చాలా తేలికైన పని. స్వల్ప మార్పులో కూడా అవకాశముండును.

iii. ఎగుమతిదారు నష్టభయాన్ని ఫర్‌ఫేటరుకు బదిలీ చేయటంవలన ఎక్కువ విశ్వాసంతో ఎగుమతి కార్యకలాపాలను చేయగలడు. వీరు ఎగుమతి భీమాను కూడా చేయవలసిన పనిలేదు.

iv. ఫర్ ఫేటింగ్ సేవలు అన్ని రకాల ఎగుమతి కార్యకలాపాలకు ఉపయోగపడును.

v. ఎగుమతి మొత్తములో కొంతభాగాన్ని కాకుండా పూర్తి వ్యవహారానికి విత్త సౌకర్యము లభించును.

విదేశాలలో ఫర్ ఫేటింగ్ కార్యకలాపాలు విస్తృతంగా నిర్వహించబడుతున్నప్పటికీ, భారతదేశములో ఇంకా ఇవి ప్రారంభదశలోనే ఉన్నాయని చెప్పవచ్చును. మన దేశములో 1994 నుండి ఎక్స్‌పోర్టు - ఇంపోర్టు బ్యాంకు (EXIM BANK) ఫర్‌ఫేటింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. వీరు నిర్వహించే కనీస వ్యవహారం విలువ రు. 5 లక్షలు. ఫర్‌ఫేటింగ్ వ్యవహారాల కొరకు ప్రత్యేకించబడిన ప్రోనోటును ఉపయోగించవలసి ఉన్నది. ఎగుమతులను పెంచవలసిన ఆవశ్యకత ఉన్న భారతదేశములో ఫర్ ఫేటింగ్ వ్యాపారాన్ని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

iii. **వాణిజ్య పత్రాలు** (Commercial Papers) : వాణిజ్య పత్రాలను ఒక రకంగా తక్కువ కాలపరిమితి కలిగిన ప్రామిసరీ నోటుగా భావించవచ్చును. సాధారణంగా దీని కాల పరిమితి 3 నుండి 6 నెలలుగా ఉండును. డిస్కౌంట్ చేసుకునే వీలుకలిగే విధంగా పెద్ద పెద్ద వాణిజ్య సంస్థలు ఇలాంటి వాణిజ్య పత్రాలను జారీచేస్తారు. ఈ పత్రాల జారీలో స్థిరమైన మొత్తాన్ని భవిష్యత్తులో చెల్లించే వాగ్దానముండును. ఈ విధంగా పెద్ద సంస్థలు ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు విత్త సౌకర్యాన్ని పొందే అవకాశము ఉండును.

**వాణిజ్య పత్రాల స్వభావము :**

i. ఈ ప్రతాల గడువుకాలము 3 నుండి 270 రోజుల మధ్య ఉండును.

ii. ఈ పత్రాలను దాని ముఖ విలువకన్నా తగ్గింపు విలువకు జారీ చేసి ముఖవిలువను చెల్లించటం జరుగును.

iii. ఈ పత్రాలను నేరుగాగానీ, ఆధీకృత డీలర్ల ద్వారా కానీ పెట్టుబడిదారులకు విక్రయించటము జరుగును.

iv. ఈ తరహా పెట్టుబడిదారులు వీటిని చివరివరకు ఉంచుకోవాలనే ఉద్దేశ్యముతో కొంటారు. అవసరమైనప్పుడు వీటిని బ్యాంకులలో డిస్కౌంట్ చేయటంద్వారా మొత్తాన్ని పొందవచ్చును. ఈ పత్రాలు భారీ సంస్థలు నేరుగా ప్రజలనుండి మొత్తాలను సేకరించే విధంగా ఉండటంవలన మామూలు విత్త సహాయ సంస్థలపై పరపతి భారం తగ్గును.

v. సాధారణ మదుపుదారులకు పెట్టుబడి పెట్టటానికి ఒక మంచి అవకాశమేర్పడటమేకాక ద్రవ్యోల్బణ తీవ్రతను కూడా తగ్గించవచ్చును.

IV. **డిపాజిట్ పత్రాలు** (Deposit Certificates) : మన దేశంలోని కంపెనీలు విత్త అవసరాలను సమీకరించటంలో అందుబాటులో ఉన్న మరొక నూతన పద్ధతి డిపాజిట్ పత్రాలను విడుదల చేయటము. మొట్టమొదటిసారిగా ప్రపంచ వ్యాప్తంగా 1961 లో ఈ డిపాజిట్ పత్రాలను ప్రవేశపెట్టటము జరిగినది. వడ్డీరేట్లలో వచ్చే పెరుగుదల ప్రభావము లేకుండ ఒక స్థిరమైన వడ్డీకి ఎక్కువ మొత్తములో విత్త సౌకర్యాన్ని సమీకరించటంలో ఇలాంటి డిపాజిట్ పత్రాలను జారీ చేయటము జరుగును. ఇలాంటి డిపాజిట్ పత్రాలను నిర్ణీత తేదీన రద్దుపరచుకొనటం ద్వారా నగదును పొందవచ్చును. ఇలాంటి డిపాజిట్ పత్రాలు అన్యాక్రాంత పత్రాల చట్టము 1872 క్రింద గుర్తింపు పొంది ఉండటమువలన వీటిని స్వేచ్ఛగా బదిలీ చేసుకునే అవకాశమున్నది. ఇలాంటి పత్రాలను వ్యక్తులు మాత్రమే కాక మిగులు ధనమున్న సంస్థలు కూడా కొనుగోలు చేయును. ఇలాంటి డిపాజిట్ పత్రాలకు లిక్విడిటీ కూడా ఎక్కువగానే ఉండును. డిపాజిట్ పత్రాల భవిష్యత్తు పత్రాలను విడుదల చేసిన కంపెనీయొక్క ఆర్థిక స్థోమతపై ఆధారపడియుండును. చాలా కంపెనీలు అధిక వడ్డీ రేటు కలిగిన మెచ్యూరిటీ విలువతో డిపాజిట్ పత్రాలను విడుదల చేసి మెచ్యూరిటీ తేదీ వచ్చేనాటికి బోర్డులను త్రిప్పివేయటం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితులలో ఎంత వచ్చినా సంతోషమేనన్న ఆలోచనతో డిపాజిట్‌దారులు ఎంత మొత్తానికైనా పత్రాలపై హక్కులను వదులుకోవటానికి సిద్ధపడుతున్నారు. టేకు చెట్ల పెంపకము, గొఱ్ఱెల పెంపకము, డబ్బును వృద్ధి చేసి అధిక మొత్తాన్ని చెల్లిస్తామని డిపాజిట్ పత్రాలను జారీచేసిన సంస్థలు ఎన్నో ఉన్నవి. వీటివలన విత్త సదుపాయంపైనేనే అనుమానాలేర్పడుచున్నవి.

ఇవికాక ఆధునిక కాలములో అనేక రకాలైన స్వల్పకాలిక, దీర్ఘకాలిక విత్త సౌకర్యాలు వెలుగులోనికి వచ్చుచున్నవి. ఇందులో ముఖ్యమైనవి క్రెడిట్ కార్డుల సదుపాయము, పాలుపంచుకునే పత్రాలు.

## 12.9 బ్యాంకేతర విత్త కంపెనీల పనితీరు :

ఇటీవలి కాలములో విత్త కార్పొరేషన్లు, పరపతి కంపెనీలు లేక విత్త కంపెనీలుగా పిలువబడుతున్న బ్యాంకేతర ద్రవ్యకంపెనీల సంఖ్య బాగా పెరిగినది. తమదైన మూలధనము అతి తక్కువ స్థాయిలో ఉన్నప్పటికీ (కొన్నిసార్లు లక్షకన్నా తక్కువ) అధిక వడ్డీ రేట్లు, ఇతర ప్రోత్సాహకాలను ఎరగా చూపుతూ ప్రజలనుండి డిపాజిట్ల రూపములో డిపాజిట్లను స్వీకరిస్తున్నవి. వీరు తాము సేకరించిన డిపాజిట్లను చిల్లర వర్తకులకు, చిన్న తరహా పరిశ్రమలకు, స్వంత, వృత్తి లేదా వ్యాపారాన్ని నిర్వహించే వారికి అప్పుల రూపంలో ఇస్తారు. వాస్తవానికి వీరిలో చాలామంది అనేక కారణాల కొద్దీ బ్యాంకులనుండి అప్పులను పొందలేరు. ఈ కారణాన బ్యాంకేతర ద్రవ్య కంపెనీలు (Non Banking Financial Companies - NBFCs) గా పరిగణించబడే వీరు సంవత్సరానికి 24 నుండి 36% వరకు వడ్డీని వసూలుచేస్తారు. ఈ సంస్థలు వడ్డీ వ్యాపారంతో పాటు చిట్‌ఫండ్ కార్యకలాపాలను నిర్వహించటము, హుండీలను కొనుగోలు చేయటము లేక డిస్కౌంట్ చేయటము, మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించటము, పరస్పర నిధులను, అద్దె కొనుగోలు పద్ధతిని, లీజింగ్ కార్యకలాపాలను నిర్వహించటము కూడా చేస్తారు.

ఇలాంటి సంస్థలు ప్రజలనుండి డిపాజిట్లను వసూలు చేసి ప్రజలకు అప్పులివ్వటమనే బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. కాబట్టి మౌలికంగా వీరిని బ్యాంకులని వ్యవహరించవలసినదే, అయితే వాస్తవానికి వీరిని బ్యాంకింగ్ కంపెనీలుగా గుర్తించలేదు. ఇలా బ్యాంకులుగా గుర్తించబడని కారణాన వీరు శాసనాత్మక లిక్విడిటీ నిష్పత్తినిగానీ, నగదు రిజర్వు నిష్పత్తిని గానీ, మూలధన సంవృద్ధి నిష్పత్తిని గానీ నిర్వహించవలసిన పనిలేదు. ఇలాంటి శాసనాత్మక నిబంధనలను పాటించకపోవటంవలన వీరివద్ద డిపాజిట్ చేసిన డిపాజిట్‌దారులు అనేక కష్టనష్టాలను ఎదుర్కొనే ప్రమాదమున్నది. వీరి డిపాజిట్లకు రక్షణ ఉండదు. ఈ విషయాన్ని క్రింది అంశాల కారణంగా ధృవీకరించవచ్చును.

i. అధిక వడ్డీ రేట్లను వసూలు చేయగలందులకు ఎక్కువ రిస్కు కలిగి హామీ లేని రుణాల రూపంలోనే వీరు అప్పులను మంజూరు చేస్తారు.

ii. ప్రారంభంలో వీటిని స్వల్పకాలిక రుణాలుగా మంజూరు చేసినప్పటికీ వాటిని దీర్ఘకాలిక రుణాలుగా పొడిగించటం జరుగును.

iii. వివిధ కంపెనీల మధ్య సరైన అవగాహన లేకపోవటమువలన ఒకే వ్యక్తి అనేక కంపెనీలనుండి అప్పులను తీసుకునే అవకాశమున్నది.

iv. వీరు సేకరించిన డిపాజిట్లు, డిపాజిట్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ పరిధిలోనికి రావు. వివిధ రకాల విత్త వ్యాపారాలు చేసే తరహా సంస్థలను క్రింది విధంగా వర్గీకరించవచ్చునని RBI తెలియజేసింది.

NBFC లు గా పరిగణించబడే సంస్థల వర్గీకరణ

- బ్యాంకేతర విత్త కంపెనీలు (Non Banking Financial Company)
  - భీమా వ్యాపారం, స్టాక్ బ్రోకింగ్, లీజ్ విత్త సంస్థలు (Insurance, Stock broking, Lease financing)
  - పరికరాల లీజింగ్, అద్దె, కొనుగోలు కంపెనీలు, పరస్పరనిధి పెట్టుబడి కంపెనీలు చిట్‌ఫండ్ కంపెనీలు మొదలైనవి.
- బ్యాంకేతర మిగులు విత్త సహాయ సంస్థలు (Residuary Non Banking Financial Company)
- బ్యాంకేతర, విత్తేతర కంపెనీలు (Non Banking, Non Financial Companies)

i. బ్యాంకేతర విత్త కంపెనీలు - ఈ కంపెనీల ప్రధాన వ్యాపారము మామూలు వాణిజ్య బ్యాంకుల మాదిరిగా ప్రజలనుండి డిపాజిట్లను అంగీకరించి ప్రజలకు ఋణాలనివ్వటము; ఈ తరహా సంస్థల క్రింద మనము చూస్తున్న అన్ని రకాల విత్త సహాయ సంస్థలుండును. సౌకర్యము కొరకు వీటిని రెండు రకాలుగా విభజించటాన్ని పై పట్టికలో పరిశీలించవచ్చును.

ii. బ్యాంకేతర మిగులు విత్త కంపెనీలు - వీరు కూడా ప్రజలనుండి డిపాజిట్ల రూపంలో మొత్తాలను వసూలు చేస్తారు కానీ, వీరు మొదటి రకానికి చెందిన ఏ తరహా వ్యాపారానికీ చెందరు.

iii. బ్యాంకేతర విత్తేతర కంపెనీలు - ఈ తరహా కంపెనీలను IDBI చట్టము 1964 లో ఈ విధంగా నిర్వచించటము జరిగినది. వ్యవసాయము, మరియు వర్తకమే మౌలిక కార్యకలాపంగా కల్గిన వీరు నిర్వహించే కార్యకలాపాలను విత్త కార్యకలాపాలుగా పరిగణించే వీలులేదు.

**NBFC ల పనితీరు :** మౌలికంగా NBFC లుగా పరిగణించబడే ఈ సంస్థలకు సంబంధించిన గణాంక వివరాలు అందుబాటులో లేకపోయినప్పటికీ RBI అంచనాల ప్రకారము మన దేశములో సుమారు 40,000 NBFC లున్నవి. ఈ సంఖ్య ప్రతి సంవత్సరము 4,000 చొప్పున పెరుగుచున్నది. వీరి ఆర్థిక పరిస్థితికి సంబంధించిన స్పష్టమైన అంచనాలు లేకపోయినప్పటికీ, RBI 1997 - 98 లో ప్రచురించిన నివేదిక ప్రకారము 1996-97 నాటికి 13,970 సంస్థల వద్ద ఉన్న డిపాజిట్ల విలువ రు. 3,57,150 కోట్లు. ఇదే సంస్థల వద్ద గత సంవత్సరములో అనగా 1995-96 లో రు. 2,95,340 కోట్లు మాత్రమే. అనగా ఒక సంవత్సర కాలములో వీరి డిపాజిట్ల విలువ దాదాపు 20% పెరిగినది.

ఈ డిపాజిట్ల సేకరణ కూడా ఒకే విధంగా లేదు. మొత్తం మీద 2,376 పెద్ద కంపెనీల వద్ద 63% డిపాజిట్లు ఉండగా మిగిలిన వారివద్ద మిగిలిన 37% డిపాజిట్లు ఉన్నవి. ఆ తరువాత సంవత్సరాలకు సంబంధించిన అంచనాలను RBI తయారు చేయకపోవటము ఆశ్చర్యకరమైన అంశము.

**బ్యాంకేతర విత్తకంపెనీలకు చెందిన ద్రవ్యస్థితి (కోట్ల రూపాయలలో)**

| | మార్చి 1998 | | మార్చి 1999 | |
|---|---|---|---|---|
| | NBFCs (1,430) | RNBFCs (9) | NBFCs (1,536) | RNBFCs (11) |
| మొత్తం ఆస్తులు | 34,790 | 10,720 | 35,970 | 11,080 |
| పబ్లిక్ డిపాజిట్లు | 13,570 | 10,250 | 9,780 | 10,640 |

సేకరణ : RBI రిపోర్టు 1999-2000

పై పట్టికను పరిశీలించినప్పుడు 1998 లోని ఆస్తుల విలువ రు. 45,000 కోట్లు కాగా, 99 నాటికి ఇది రు. 47,000 కోట్లకు పెరుగగా డిపాజిట్లు మాత్రము రు. 23,820 కోట్లనుండి రు. 20,420 కోట్లకు తగ్గినవి. మార్చి 2000 ల నాటికి 20 కోట్లనుండి రుపాయలు లేక అంతకన్నా ఎక్కువ డిపాజిట్లు ఉన్న NBFC ల ఆస్తుల విలువ రు. 36,500 కోట్లుగా ఉన్నది. ఈ విధంగా భారతీయ విత్త వ్యవస్థలో NBFC ల పాత్ర గణనీయంగా ఉన్నదని స్పష్టమగుచున్నది.

**NBFC లకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు మరియు నియంత్రణ :**

బ్యాంకేతర విత్త సంస్థలను క్రమబద్ధీకరించటానికి ప్రత్యేకించబడిన చట్టాలుకానీ, శాసనాత్మక సంస్థలుగానీ లేవు. ఈ కారణాన వీటి కార్యకలాపాలలో నియంత్రణ లేకుండా పోయినది. NBFC ల వివిధ కార్యకలాపాలు క్రింది విధంగా నియంత్రించబడుచున్నవి-

i. ఈ కంపెనీలను పరిమిత ఋణబాధ్యత కలిగిన కంపెనీలుగా ఏర్పాటు చేయటంవలన ఈ కంపెనీలు భారత కంపెనీల చట్టము 1956 పరిధిలోనికి వచ్చును. అయితే కంపెనీల చట్టములో కనీసము విత్త కంపెనీలు అనే మాటను కూడా వివరించటము జరుగలేదు. ఇంతేకాక ఇవి కంపెనీల చట్టములోని వివిధ నిబంధనలను అపహాస్యము చేయటమే గానీ అమలు చేసిన దాఖలాలు లేవు.

ii. NBFC లు డిపాజిట్లను సేకరించటానికి సంబంధించి రిజర్వు బ్యాంకువారు 1997 లో NBFC లకు ప్రత్యేకంగా నిర్ధేశించిన ఆదేశాలే వర్తించును.

iii. మర్చంట్ బ్యాంకింగ్ మరియు పోర్ట్ ఫోలియో మేనేజ్మెంట్ కార్యకలాపాలను నిర్వహించేవారి సేవలు SEBI నియంత్రణలో ఉండును.

NBFC లు చేసే మోసాలను అరికట్టటానికి RBI కూడా కంపెనీల చట్టములోని నిబంధనల ప్రకారమే వ్యవహరించవలసి యున్నది. ఈ విధంగా NBFC లను నియంత్రించటానికి సంబంధించిన వ్యవస్థ అస్తవ్యస్తముగానున్నది. ఈ పరిస్థితులలో RBI డాక్టరు A.C. షా నేతృత్వంలో 1992 లో NBFC ల పనితీరును సమీక్షించి అవసరమైన సూచనలను చేయటానికి ఒక సంఘాన్ని ఏర్పాటుచేసినది. ఈ సంఘము క్రింది సూచనలను చేసింది.

a) 50 లక్షల రూపాయలకు మించిన నికర నిధులు కలిగిన సంస్థల నియంత్రణకు ప్రత్యేకమైన నిబంధనను రూపొందించాలి.

b) కొత్తగా NBFC వ్యాపారము చేపట్టబోయే సంస్థలకవసరమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించాలి.

c) మూలధన సంవృద్ధి ప్రమాణాలను ఏర్పాటు చేయాలి.

d) NBFC ల ఆదాయాన్ని గణనచేయటంలోను, రాని, సంశయాత్మక బాకీల కొరకు కొంత రిజర్వునేర్పాటు చేయటంలోను, కొన్ని నిబంధనలను పాటించాలి.

A.C. షా సంఘము చేసిన సూచనలను RBI యధాతథంగా అంగీకరించి వాటిని దశలవారీగా అమలు చేసే ప్రయత్నము చేసినది. ఇందులో భాగంగా క్రింది చర్యలను చేపట్టటమైనది-

a) 1997 మే లో RBI, 50 లక్షల రూపాయల నిధులను దాటిన NBFC లన్నీ తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని ఆదేశించినది.

b) జూన్ 1993 లో రిజిస్టర్డు కంపెనీలు ఏ విధంగా వ్యవహరించాలో దానికి సంబంధించిన ఆదేశాలను జారీ చేయటం జరిగినది.

c) 31 మార్చి 94 లోపు 6%, 31 మార్చి 95 లోపు 8% మూలధన సంవృద్ధిరేటును సాధించాలని కోరినది.

d) గుర్తింపు పొందిన క్రెడిట్ రేటింగ్ సంస్థలద్వారా కనీస రేటింగ్‌ను పొందాలని కూడా ఆదేశించినది.

RBI పైన వివరించినట్లుగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ, దేశములోని NBFC లు తమకొరకు ఒక సమగ్రమైన చట్టాన్ని రూపొందించమని ప్రభుత్వాన్ని కోరినారు. NBFC లు ప్రత్యేకమైన చట్టాన్ని కోరినప్పటికీ, భారత ప్రభుత్వమ మాత్రము RBI చట్టములో కొన్ని సవరణలను 1997 లో చేసినది.

ఈ చట్టములోని సవరణల ప్రకారము NBFC లు క్రింది నిబంధనలకు లోబడి వ్యాపారమును ప్రారంభించవచ్చును మరియు కొనసాగించవచ్చును.

a) RBI నుండి వ్యాపారనమోదు పత్రాన్ని తప్పనిసరిగా పొందాలి.

b) ఈ నిబంధన 50 లక్షలు మరియు రెండు కోట్ల రూపాయల మధ్య నిధులు కలిగిన సంస్థల విషయములో తప్పనిసరి.

పై నిబంధనలోనికి వచ్చే ఈ పాటికే NBFC కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు 6 నెలలలోపు తప్పనిసరిగా తమ సంస్థలను

నమోదు చేయించుకోవాలి. ఇలా నమోదైన సంస్థలు తమ నికర లాభాలలో 20% రిజర్వు ఫండుగా ఏర్పాటు చేయాలి. 50 లక్షల కన్నా తక్కువ స్వంత నిధులు కలిగిన NBFC లు 3 సం॥ల లోపు 50 లక్షల రూపాయల సొంతనిధిని ఏర్పాటు చేసుకోవాలి.

పై సవరణల ఫలితంగా RBI కి క్రింది అధికారాలను దత్తం చేయటం జరిగినది.

a) నిర్ణీత కాలవ్యవధిలో RBI, NBFC లు గుర్తింపు పొందిన సెక్యూరిటీలలో కనీసం పెట్టుబడి పెట్టవలసిన మొత్తాన్ని నిర్దేశించును.

b) NBFC ల మూలధన సంవృద్ధికి సంబంధించి ఇతర ఏర్పాట్లకు సంబంధించిన చట్టపరమైన నిబంధనను నిర్దేశించును.

c) ఆస్థి అప్పుల పట్టిక, లాభనష్టాల ఖాతాను తయారుచేసి, అప్పులకు సంబంధించిన వివరాలను వెల్లడిచేయవలసినదిగా ఆదేశించును.

d) చట్టపరమైన నిబంధనలను పాటించకపోవటానికి సంబంధించిన జరిమానాలను విధించటమేకాక నమోదును కూడా రద్దు చేయును.

e) ప్రజలనుండి NBFC లు డిపాజిట్లను సేకరించకుండాను, ఆస్థులను అన్యాక్రాంతము చేయకుండా నిరోధించును.

f) RBI ఆదేశాలను పాటించని సంస్థల విషయములో రద్దుకొరకు దరఖాస్తును దాఖలు చేయును.

మారుతున్న మార్కెట్ పరిస్తితి దృష్ట్యా NBFC ల ఆవశ్యకత రోజు రోజుకు పెరగటమే కాక భారతీయ విత్త విధానములో ఒక ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించుకొంటున్నవి. ఈ కారణాన ఈ వ్యవస్థ ఒక క్రమ పద్ధతిలో కొనసాగాలని, RBI మరియు ప్రభుత్వము కూడా అభిలషిస్తున్నవి. అయితే 1997 మే లో CRB Capital అనే సంస్థ 1200 కోట్ల రూపాయల మేరకు ప్రజలవద్ద నుండి సేకరించిన డిపాజిట్లను ఎగవేసిన విధానాన్ని పరిశీలించినప్పుడు NBFC లను క్రమబద్దీకరించవలసిన ఆవశ్యకత ఎంత ఉన్నదో స్పష్టమగుచున్నది.

## 12.10 పదకోశము :

| | | |
|---|---|---|
| విత్తసేవలు | - | ఆర్థిక సేవలు లేక Financial Services |
| విత్త మాధ్యమ సంస్థలు | - | విత్త సహాయాన్నందించటంలో గల మధ్యవర్తులు |
| IFCI | - | Industrial Financial Corporation of India |
| SFC | - | State Financial corporation |
| IDBI | - | Industrial Development Bank of India |
| ICICI | - | Industrial Credit and Investment Corporation of India |
| SIDC | - | Small Industries Development Corporation |
| SEBI | - | Securities Exchange Board of India |
| SIDBI | - | Small Industries Development Bank of India. |
| APIDC | - | Andhra Pradesh Industrial Development Corporation |

## 12.11 స్వయం మదింపు ప్రశ్నలు

**5 మార్కుల ప్రశ్నలు :**

1. విత్తసేవల భావన
2. సంప్రదాయ విత్తసేవా కార్యకలాపాలు
3. అద్దె - కొనుగోలు పద్ధతి
4. డిస్కౌంటింగ్
5. వెంచర్ కాపిటల్
6. ఫర్ ఫీటింగ్

7. వాణిజ్య పత్రాలు

**10 మార్కుల ప్రశ్నలు :**

1. మర్చంట్ బ్యాంకింగ్
2. లీజింగ్
3. ఫాక్టరింగ్

**20 మార్కుల ప్రశ్నలు**

1. విత్తసేవలనగానేమో తెలియజేసి, విత్తసేవల భావనా స్వభావాన్ని వివరించి, ఆధునిక విత్తసేవల గురించి క్లుప్తంగా వ్రాయుము.
2. భారతదేశములో బ్యాంకేతర కంపెనీల పనితీరు, ఇతర శాసనాత్మక నిబంధనల గురించి వ్రాయండి.

## 12.12 సిఫారసు చేయబడిన పుస్తకాలు


1. బ్యాంకింగ్ సిద్ధాంతం - ద్రవ్యవ్యవస్థలు

   by K. ఆంజనేయులు
   K. లలిత
   M. ప్రభాకరరెడ్డి

2. Indian Economy - Ruddar Datt
   KPM. Sundharam

3. Banking and Financial Systems
   - Mithani, Gordon


**Dr. C.V. Brahma Chary**

**పాఠము - 13**

# బాంకరు - ఖాతాదారు


13.1 బాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టము 1949

13.2 బాంకరు - నిర్వచనములు

13.3 ఖాతాదారు - నిర్వచనములు

13.4 ఖాతాదారు - ఖాతాదార్ల సంబంధము

13.4.1 సాధారణ సంబంధము

13.4.2 ప్రత్యేక సంబంధము

13.5 బాంకరు యొక్క ప్రత్యేకతర హోఖాతాలు

13.5.1 మైనర్లు

13.5.2 వివాహిత స్త్రీలు

13.5.3 భాగస్వామ్య సంస్థలు

13.5.4 జాయింట్ స్టాక్ కంపనీలు

13.5.5 ట్రస్టులు

13.5.6 వర్తకేతర సంస్థలు

13.5.7 సమిష్టి హిందు కుటుంబము

13.5.8 ఖాతాదారుల యొక్క అటార్నీలు

13.5.9 నిర్వాహకుల / పరిపాలకుల ఖాతాలు

13.5.10 ఉమ్మడి ఖాతాలు

13.6 ఖాతాదారుల డిపాజిట్ ఖాతాలు

13.6.1 ఫిక్సెడ్ డిపాజిట్ ఖాతాలు

13.6.2 సేవింగ్స్ బాంకు డిపాజిట్ ఖాతాలు

13.6.3 రికరింగ్ డిపాజిట్ ఖాతాలు

13.6.4 కరెంటు ఖాతాలు

13.7 నిద్రించు ఖాతాలు

13.8 బాంకు డిపాజిట్లను భీమా చేయుట


**13.1 బాంకింగ్ క్రమ బద్ధీకరణ చట్టము, 1949 :** ఇతర వ్యాపారాలు, వర్తకాలతో పోలిస్తే బాంకింగ్ వ్యాపారము తనదైన ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటుంది. బాంకింగ్ వ్యాపారము అనేక మంది ఖాతాదారుల డబ్బుతో వ్యవహరిస్తుంది. అయితే వీరెవరికి ఆ బాంకింగ్ వ్యాపారాల వ్యవహారాల నిర్వహణపై ఏవిధమైన అధికారము ఉండదు. కాబట్టి వాటాదారులతో పాటుగ డిపాజిట్ దారుల

ఆసక్తిని సంరక్షించవలసిన బాధ్యత ప్రభుత్వానికి వున్నది. బాంకింగ్ వ్యాపారము ప్రత్యేక లక్షణాలు కలిగి వున్నదున సముచితమైన చట్టాలను రూపొందించవలసిన అవరసము ఏర్పడినది. భారతదేశములో బాంకింగ్ వ్యాపారానికి సంబంధించిన ప్రత్యేక నిబంధనలను తెలియపరిచే చట్టాలతో ముఖ్యమైనది. బాంకింగ్ క్రమబద్దీకరణ చట్టం 1949 బాంకింగ్ క్రమబద్దీకరణ చట్టము బాంకింగ్ చేపట్ట కూడని పనులను మరియు బాంకులు పూర్తి చేయవలసిన కొన్ని లాంచనాలను రూపొందించినది.

**13.2 బాంకరు - నిర్వచనము :** బాంకరు మరియు ఖాతాదారునికి మధ్యగల సంబందాన్ని పరిశీలించే ముందు బాంకరు మరియు ఖాతాదారుడు అనే పదాల అర్ధాన్ని తెలుసుకోవాలి.

బాంకరు అనే పదము ఇటాలియన్ పదాలైన బాంకు లేదా బాంకస్ అనేవాటినుండి వచ్చినది. ఆ భాషలో వీటికి బెంచ్ అని అర్థము పూర్వకాలములో యూదులు మార్కెట్టులో బెంచ్‌లపై తమ కార్య కలాపాలను కొనసాగించెడివారు. మరికొందరి అభిప్రాయం ప్రకారము బాంకు అనేపదము బాక్ అనే జర్మన్ పదమునుండి వచ్చినది. జర్మన్ భాషలో ఈ పదానికి జాయింట్ స్టాక్ ఫండు అని అర్థము.

**13.2.1 డాక్టరు హెర్‌బర్ట్. యల్. హార్ట్ :** ప్రసిద్దిచెందిన లా ఆఫ్ బాంకింగ్ పుస్తక రచయిత అయిన డా. హెర్‌బర్ట్. యన్. హార్ట్ ప్రకారము "దైనందిన వ్యాపారములో తమ కరెంటు ఖాతాల ద్వార డబ్బు తీసుకొన్న వ్యక్తుల చెక్కులను ఆదరించే వ్యక్తి బాంకరు''.

**13.2.2 సర్‌జాన్‌పేజెట్ అనే న్యాయశాస్త్ర నిపుణుని ఉద్దేశ్యం :** ఇతని ప్రకారము ఎవరైతే తమ ఖాతాదారుల కొరకు i) డిపాజిట్ ఖాతాలను తీసికోవడము ii) కరెంటు ఖాతాలను తీసుకోవడము iii) చెక్కుల జారీ, చెల్లింపులను చేయడము iv) క్రాస్ చేసిన లేదా చేయని చెక్కులను వసూలు చేయడాన్ని చేపట్టడో ఆ వ్యక్తి లేదా సంస్థను బాంకరు అనరు''

**13.2.3. హిల్టన్ యంగ్ కమీషన్ :** హిల్టన్ యంగ్ కమీషన్ వారు బాంకు లేదా బాంకరును ఈ క్రింద పేర్కొన్న విధముగా భావించాలని సిఫారసు చేసినారు "చెక్కు, డ్రాఫ్టు లేదా ఆర్డరు ద్వార తిరిగి తీసికొనే పద్దతిపై నగదు డిపాజిట్లను అంగీకరించే ప్రతివ్యక్తి. సంస్థ లేదా కంపెని.''

**13.2.4 బాంకింగ్ క్రమబద్దీకరణ చట్టము 1949 :** 'భారత దేశములో బాంకింగ్ కార్యకలాపాలు నిర్వర్తించే కంపెని బాంకింగ్ కంపెనీ అని అడిగిన తక్షణమే కాని, ఇంకే ఇతర విధానం ద్వారా కాని, చెక్కు, డ్రాఫ్టు లేదా ఆర్డరు ద్వారాకాని, ఇంకే ఇతర విధానము ద్వారాకాని, తిరిగి తీసుకొనే పద్ధతిపై ప్రజల డబ్బును అప్పులివ్వడానికి గాని, పెట్టుబడి పెట్టడానికి గాని తీసుకోవడము బాంకింగ్ అని నిర్వచించినది.

పై నిర్వచనాల సారాంశాన్ని పరిశీలించిన తరువాత బాంకరును ఈ క్రింది విధముగా అర్థము చేసుకోవచ్చును.

బాంకింగ్ అనేది ఒక వ్యాపారము. వర్తకులు సరుకులను కొని తిరిగి ఎక్కువ ధరకు అమ్మి లాభాలు సంపాదించినట్లే, బాంకులు గూడ ప్రజలనుండి ద్రవ్యమును డిపాజిట్ల రూపములో తీసికొని, అవసరమున్న వ్యక్తులకి, సంస్థలకి ఎక్కువ వడ్డీకి అప్పులిచ్చి లాభాలను సంపాదిస్తాయి. బాంకింగ్ వ్యాపారములోని రెండు ప్రధాన విధులు ఏవనగా 1) డిపాజిట్లు స్వీకరించము మరియు 2) ఋణాలను మంజూరు చేయడము బాంకింగ్ క్రమబద్దీకచట్టము 1949 సెక్షన్ 5 (బి) సెక్షన్ 6 ల ప్రకారము బాంకింగ్ కంపెనీలు ఈ క్రింది విధులను కూడ నిర్వర్తించవచ్చును.

i. ఖాతాదారుల కొరకు వారి తరపున చెక్కులు బిల్లులు మొదలూన వాటిని వసూలు చేయడము, చెల్లించడము లాంటి సేవలను అందించవచ్చును.

ii. వ్యాపార సంస్థలు జారీచేసి సెక్యూరిటిలను, వాటాలను కొనడము, అమ్మడము, అదే విధముగా ప్రభుత్వము జారీ చేసే సెక్యూరిటీలను కొనడము, అమ్మడం చేయవచ్చును.

iii. ఖాతాదారుల డబ్బును ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి పంపే ఏర్పాటు చేయవచ్చును

iv. ఖాతాదారులు తమ వస్తువులను భద్రంగా దాచుకోవడానికి బాంకులో లాకర్ల సౌకర్యము కలుగ జేయవచ్చును.

గతకొద్ది సంవత్సరాలలో బాంకింగ్ రంగము అందించే సేవలలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చినవి. ప్రస్తుత ప్రభుత్వ సరళీకృత ఆర్థిక విదానము వలన ప్రైవేటు రంగ బాంకుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నవి. బాంకులు అందించే సేవలు కూడ అన్ని బాంకులలో ఒకే విధముగా లేవు. ఏది ఏమైనప్పటికి డిపాజిట్లు స్వీకరించడము, రుణాలివ్వడము అనే రెండు మేళక విధులను ప్రతిబాంకు తప్పకుండా పాటించాలి.

మనము గుర్తుంచుకొవలసిన మరొక విషయం ఏమనగా బాంకును, బాంకరును పర్యాపదాలుగా ఉపయోగిస్తాము. బాంకు అంటె బాంకింగ్ వ్యాపారము నిర్వహించే సంస్థ అని బాంకరు అంటె ఆ వ్యాపారమును నిర్వహిస్తున్న వ్యక్తి అని గుర్తుంచుకోవాలి.

**13.3 ఖాతాదారుడు :** ఖాతాదారుడు అనే పదానికి భారత న్యాయశాస్త్రంలోగాని, దీనికి ఆధారమైన బ్రిటిష్ న్యాయశాస్త్రములోగాని నిర్వచనము లేదు. సాదారణముగ ఏ వ్యక్తికి అయిన ఒక బాంకులో ఖాతా వుంటె అతన్ని ఆ బాంకు ఖాతాదారునిగా పరిగణిస్తారు. పూర్వకాలపు బాంకింగ్ నిపుణులు ఒక వ్యక్తి బాంకులో ఎంతకాలము ఖాతాను నిర్వహించేవాడు అనే అంశానికి ఎక్కువ ప్రధాన్యతను ఇచ్చినారు.

### 13.3.1 సర్‌జాన్ పేజెట్ అభిప్రాయము ప్రకారము ఖాతాదారుడు అనగా

1. ఒక వ్యక్తిని బాంకు ఖాతాదారునిగా పిలవాలంటె అతనికి, బాంకరుకు మధ్య కొంతకాలముగా బాంకింగ్ కార్యకలపాలు జరుగుతూ ఉండాలి. బాంకరుతో ఒకే వ్యవహారము జరిపిన వ్యక్తిని ఖాతాదారుడు అనడానికి వీలులేదు. ఉదాహరణకు వర్తకులు కూడ తమ వద్ద తరుచుగా సరుకులు కొనే వ్యక్తికి ఒకేసారి సరుకులు కొనే వ్యక్తికి వ్యత్యాసాన్ని జూపిస్తాడు.

2. బ్యాంకుకు ఆ వ్యక్తికి మధ్య జరిగే వ్యవహారాలు బాంకింగ్ వ్యవహారాలై వుండవలెను. ముఖ్యమైన బాంకింగ్ విధులు రెండు a) డిపాజిట్లు స్వీకరించుట b) రుణాలు మంజూరు చేయుట. ఈ రెండు విధులుగాకుండ ఇతర వ్యవహారాలు జరిపిన వ్యక్తిని ఖాతాదారుడు అనరు.

ఒక వ్యక్తికి బాంకుకు మధ్య బాంకింగ్ వ్యవహారాలు కొంతకాలముగ నిరవధికంగా జరుగుతున్నప్పుడు మాత్రమే అతడు ఖాతాదారుడవుతాడనే వాదనను న్యాయస్థానాలు అంగీకరించుటలేదు. ఒక వ్యక్తి బాంకులో ఖాతా ప్రారంబించడానికి డబ్బు చెల్లించడము. ఆ డబ్బును బాంకు అంగీకరించము జరగగానే ఆ వ్యక్తి బాంకు ఖాతాదారుడవుతాడని కమీషనర్ ఆఫ్ టాక్సేషన్ వియన్. ఇంగ్లీషు స్కాటిష్ అండ్ అస్ట్రియన్ బాంకుకేసులో న్యాయస్థానము తన అభిప్రాయమును వెలిబుచ్చింది. అయితే ఒక వ్యక్తి బాంకులో ఖాతా ప్రారంబించిన తరువాత సాదారణముగ బాంకుతో బాంకింగ్ వ్యవహారాలు కొనసాగిస్తాడని మనుము భావించవలెను.

ఖాతా ప్రారంబించే ముందు బాంకు తన అవసరము దృష్ట్యా ఖాతా ప్రారంబించే వ్యక్తి యొక్క చరిత్రను పరిశీలిస్తుంది. మరియు ఇదివరకే బాంకులో ఖాతాదారుడైన మరొక వ్యక్తి ఈ వ్యక్తిని పరిచయము చేయవలెనని నిబంధన కూడ వున్నది. ఈ నిబంధన ముఖ్యంగా సేవింగ్స్ బాంకు మరియు కరెంటు ఖాతాలకే వర్తిస్తుంది.

ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాల విషయములో పైన పేర్కొనిన నిబంధనలను పాటించనవసరములేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాల విషయములో బాంకుకు ఖాతాదారునికి మధ్య బాంకింగ్ వ్యవహారాలు నిరంతరము జరిగే అవకాశము లేదు. అందువలన ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే వ్యక్తులను బాంకు ఖాతా దారులనకూడదని కొందరి అభిప్రాయము అయితే దీనికి సంబంధించి న్యాయశాస్త్రములోకాని, కోర్టు తీర్పులలోకాని నిర్థిష్టంగా పేర్కొనలేదు.

**13.4 బాంకరు - ఖాతాదార్ల సంబందము :** ఒక వ్యక్తి బాంకలో ఖాతా ప్రారంభించగానే అతనికి బాంకుకు బాంకరు - ఖాతాదారు సంబంధము ఏర్పడుతుంది. ఈ సంబందము రెండు విధములు ఎ) బాంకరు - ఖాతాదారు సాదారణ సంబంధము బి) బాంకరు - ఖాతాదారు ప్రత్యేక సంబంధము

**13.4.1 బాంకరు - ఖాతాదారు సాదారణ సంబంధము**

A) రుణగ్రస్తుడు - రుణదాత సంబంధము

B) ధర్మకర్త - లబ్దిదారు సంబంధము

C) యజమాని - ఏజెంటు సంబంధము

D) బెయిలర్ - బెయిలి సంబందము

E) తనఖీదారు - తనఖీరుణగ్రస్తుని సంబంధము

A) **రుణగ్రస్తుడు - రుణదాతగా సంబంధము :** బాంకరుకు ఖాతాదారునికి మధ్యగల సంబంధమునకు మూలము రుణానికి చెందిన ఒప్పందమే. ఒక వ్యక్తి పేరు మీద ఖాతా తెరవడానికిఇ బాంకరు కొంత నగదును అంగీకరించక వెంటనే బాంకరు రుణగ్రస్తుడుగాను, ఖాతా దారు రుణదాతగా మారుతాడు. బాంకు ఈ సొమ్మును ఏ విధముగా వినియోగిస్తున్నది. ఖాతాదారుకు సంబంధము లేదు. కాని ఈ సొమ్మను ఖాతాదారు డిమాండ్ చేయగానే చెల్లించవలసిన భాద్యత బాంకుకు ఉంటుంది.

కొన్ని సందర్భాలలో ఈ ఖాతా డెబిట్ నిల్వను జూపితే బాంకరు రుణదాత ఖాతాదారు రుణగ్రస్తుడు అవుతాడు. రుణం మొత్తము పూర్తిగా చెల్లింపబడేవరకు ఈ సంబంధమే కొనసాగుతుంది.

సాదారణ రుణదాత - రుణగ్రస్తుల సంబంధానకి, బాంకు - ఖాతాదారులమధ్య ఉండే రుణదాత - రుణ గ్రస్తుల సంబంధానికి కొన్ని తేడాలు గలవు. అవి ఏవనగా

1) మామూలు రుణాల విషయములో రుణదాత అడిగినా, అడగకపోయిన, గడువు తేదీనకాని, అంతకులోపుగాని రుణ దాతకు అసొమ్మును చెల్లిచవలసిన భాద్యత రుణగ్రస్తునికి వుంటుంది. కాని బాంకు డిపాజిట్ల విషయములో ఖాతాదారుడు తన డిపాజిట్ సొమ్మును చెల్లించమని బాంకును కోరినప్పుడు మాత్రమే బాంకు ఆ సొమ్ము చెల్లిస్తుంది.

2) ప్రతి బాంకుకు చాలా బ్రాంచీలు వుంటాయి. ఖాతాదారుడు ఏ బ్రాంచిలోనయితే డబ్బును డిపాజిట్ చేశాడో, ఆ బ్రాంచినుండి మాత్రమే తన సొమ్మును చెల్లించమని ఖాతాదారున ఆదేశించవచ్చును. వేరొక బ్రాంచినుండి తీసుకొనుటకు అవకాశములేదు. కాని ప్రస్తుతం ఆన్‌లైన్ పద్దతి అమలులోకి వచ్చిన తరువాత ఏ బ్రాంచి నుంచైనా తన డబ్బును తీసికొనవచ్చును.

3) తన సొమ్మును ఖాతాదారుడు బాంకు పని వేళలలో మాత్రమే బాంకు నిర్దేశించిన రీతిలో అనగా చెక్కు, డ్రాఫ్టు, అర్డర్ మొదలైన సాధనాల ద్వార తీసికొనవచ్చును.

4) మాములు రుణాల విషయంలో ఆ రుణాలను మూడు సంవత్సరాల తరువాత కాలదోషం పడుతుంది. అంటె ఆ కాలపరిమితి దాటిన తరువాత రుణదాత ఆ సొమ్మును రుణగ్రస్తుని నుండి రాబట్టకొనలేడు. అయినా బాంకు డిపాజిట్లు విషయములో మాత్రము ఈ నియమము వర్తించదు బాంకు డిపాజిట్ల విషయములో ఈ కాలపరిమితి లెక్కింపు ఖాతాదారు డిమాండ్ చేసిన నాటినుండి మొదలవుతుంది. ఖాతాదారుని యొక్క డిపాజిట్ బాంకరు వద్ద ఎంతకాలమైన ఉండవచ్చును.

B) **ధర్మకర్త - లబ్దిదారు సంబంధము :** ఖాతాదార్ల సొమ్ముకు బాంకర్లు ధర్మకర్తలు కారు. వేరొకరి ప్రయోజనం కోసము ఆస్తులను నిర్వహించే వారిని ధర్మకర్తలు అని, ఎవరి ప్రయోజనము కోసము అవి నిర్వర్తించబడుతున్నాయో అతన్ని లబ్దిదారు అని అంటారు. ఆ ఆస్తుల మీద వచ్చె లాభాలన్ని లబ్ది దారులకే చెందుతాయి. ఉదాహరణకు ఖాతాదారు బాంకును తన సెక్యూరిటీలను

సేఫ్ కస్టడీలో ఉంచమని కోరినప్పుడు బాంకు ఖాతాదారునికి ధర్మకర్త అగును. ఆ సెక్యూరిటీలను ఖాతాదారుడు కోరినవిధముగా మాత్రమే బాంకు ఉపయోగించాలి గాని తన ఇష్టమొచ్చినట్లు వినియోగించకూడదు.

C) **యజమాని - ఏజంటు సంబంధము :** కాంట్రాక్టు చట్టము 1872 లోని సెక్షను 182 ప్రకారము "వేరొకరి తరపున ఏ పనైన చేయడానికి వినియోగింపబడిన వ్యక్తి లేదా మూడో వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు వేరొకరి ప్రాతినిధ్యము వహించే వ్యక్తిని ఏజంటు అంటారు''. బాంకరు తన ఖాతాదాఉకు ఏజంటుగా వ్యవహరిస్తూ, అతని సౌకర్యార్థము అనేక ఏజన్సీ సేవలను అందిస్తుంటాడు. అవి ఏవనగా

a) ఖాతాదారుల తరుపున బిల్లులు, ఎవిడెంట్లు, చెక్కులు, ప్రామిసరినోట్లు మొదలగు వాటిని వసూలు చేయుట

b) ఖాతాదారుల తరుపున వాటాలు, సెక్యూరిటీలు మొదలగువాటిని కొనుట, అమ్ముట

c) ఖాతాదారు తరుపున చెల్లించవలసిన టెలిఫోను బిల్లులు, భీమా ప్రీమియం పన్నులు, రుణాలపై వడ్డీ చెల్లించుట.

D) **బెయిలర్ - బెయిలి సంబంధము :** నగదు, విలువైన వస్తువులు, సెక్యూరిటీలు మొదలైన వాటిని భద్రత కొరకు బాంకరు వద్ద డిపాజిట్ చేసినప్పుడు డిపాజిట్ బారు బెయిలరు, బాంకరు బెయిలీ అవుతారు. వీటిని భద్రపరచుటకు బాంకరు చెల్లించిన ఖర్చులన్నింటిని ఖాతాదారునుండి వసూలు చేసుకుంటాడు. మరియు వీటికి భద్రత కల్పించడము కోసము బాంకరు తగినన్ని జాగ్రత్తలు తీసికోవాలి. బాంకరు యొక్క నిర్లక్ష్యం వలన లేదా అజాగ్రత్తవలన లేదా వారి ఏకారణము వలనైన ఆస్తికి నష్టము సంభవిస్తే, ఆ నష్టానికి బాంకరు బాధ్యత వహించవలెను. ఖాతాదారు అడిగిన వేంటనే ఆ ఆస్తులను అతనికి అప్పగించవలసిన బాధ్యతకూడ బాంకరుకు వున్నది.

E) **సలహాదారు :** కొన్ని బాంకులు ఖాతాదారులకు వాటాలు, ఇతర సెక్యూరిటీల కొనుగోలు వంటి విషయములో లాభము కలిగే రీతిలో సలహాలిస్తాయి. దీని కొరకు ఖాతాదారులనుండి కొంత రుసుము వసూలు చేస్తారు. ఈ విధమైన సలహాలిచ్చేటప్పుడు బాంకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పుదోవపట్టించే సలహాలు ఇచ్చిన, ఖాతాదారులు జరిగే నష్టానికి బాంకుకు బాధ్యత ఉంటుంది. (వుడ్స్ మార్టిన్ లిమిటెడ్)

**13.4.2 బాంకరు - ఖాతాదార్ల ప్రత్యేక సంబంధము :** బాంకరు - ఖాతాదార్లమధ్యగల రుణగ్రస్తుడు, రుణదాత సంబంధములో కొన్ని ప్రత్యేక అంశములు ఇమిడివున్నవి. అవి ఏవనగా

A. చెక్కులను ఆదలించవలసిన భాద్యత

B. రహస్యాలను కాపాడవలసిన బాద్యత

C. లీను హక్కు

D. ఖాతాను కలిపివేయడానికి బాంకరుకు గల హక్కు

E. చెల్లింపుల వినియోగానికి సంబంధించి బాంకరుకు హక్కులు

F. మంజూరు చేసిన రుణాలపై వడ్డీ, తత్సంబంధ ఖర్చులను ఖాతాదారుకు విధించే హక్కు

G. బాంకు డిపాజిట్లకు లిమిటేషన్ చట్టము

A) **చెక్కులను ఆదరించవలసిన భాద్యత :** ఖాతాదారు తన మీద రాసే చెక్కులన్నిటిని బాంకరు ఈ దిగువ నిబంధనలను పాటిస్తూ ఆదరించవలెను.

a) బాంకులో ఖాతాదారుని ఖాతాలోనిల్వ సరిపడినంత ఉన్నంతవరకు

b) ఖాతాదారు బాంకును ముందుగా కోరిన విధముగా

c) ఖాతాదారుడు జారీ చేసిన చెక్కులు, జారీ చేసిన రోజునుండి 6 నెలలలోపు చెల్లింపుకు బాంకు దాఖలు అయితే

d) ఏ కోర్టు కూడ ఖాతాదారుయొక్క ఖాతాలోని నిల్వను స్థంబింపచేయునంతవరకు అయితే న్యాయాధికారాలు కల ఏ సంస్థ అయినా గార్నిషీ ఆర్డరు లేదా అటాచ్‌మెంటు జప్తు ఆర్డరు జారీ చేసినట్లయితే బాంకరు ఖాతాదారుని చెక్కులను అనాదరించవచ్చును. తగిన కారణము లేకుండ బాంకు ఖాతాదారులోని చెక్కును అనాదరణ చేసినట్లయితే ఆ అనాదరణకు బాంకు ఖాతాదారుని నష్టపరిహారము చెల్లించవలెను.

**B) రహస్యాలను కాపాడవలసిన భాధ్యత** : ఖాతాదారుల ఖాతాల పరిస్థితి గురించి బాంకరు బయటకు వెల్లడిస్తే ఒక్కొక్కసారి ఆ ఖాతాదారు యొక్క వ్యాపారం, పరపతి దెబ్బతినవచ్చును. అందువలన తగిన కారణము ఉంటెతప్ప బాంకరు ఖాతాదారుని ఖాతాకు సంబంధించిన వివరములు ఎవరికి చెప్పకూడదు. ఖాతాదారుడు బాంకులో ఖాతాను ముగించిన తరువాత కూడా ఖాతా రహస్యాలను బాంకరు కాపాడాలి (టూరియర్ $V_s$ నేషనల్ ప్రవిన్సియన్ బాంకు) క్రింది పరిస్థితులలో తన ఖాతాదారు ఖాతా యొక్క స్థితిగతులను బాంకర్ వెల్లడించవచ్చును. అవి ఏవనగా a) చట్టప్రకారం తప్పని సరైనప్పుడు b) బాంకర్ సొంత ప్రయోజనాల దృష్ట్యా c) ఖాతాదారుడు అంగీకరించినప్పుడు d) ప్రజాసంక్షేమ విషయాలలో e) వేరొక బాంకరు సమాచారము అడిగినప్పుడు

**C) లీను హక్కు** : బాంకరు ఖాతాదారుకు మద్య వున్న మరొక ముఖ్య సంబందము లీన్. తనకు రావలసిన బాకి పరిష్కారమయ్యేదాక తన దగ్గర వున్న బాకీదారుని వస్తువులను ఉంచుకోవడానికి రుణదాతకు ఉన్న హక్కును లీన్ అంటారు.

ఉదాహరణకు X కు Y రు.1000 లు బాకి వున్నాడు Y తాలుకు ఆస్తులు X దగ్గరవుండి తన బాకీ తీరెదాకా X వాటిని Y కి తిరిగి ఇచ్చివేయకుండ తన దగ్గర ఉంచుకోవచ్చును. X కు వున్న హక్కును లీన్ అంటారు.

1. సాదారణ లీను : బాంకరుకు తన వద్ద ఖాతాదారు ఒక బాకి నిమిత్తము సెక్యూరిటిగా పెట్టిన వస్తువులపై ఖాతాదారు నుండి తనకు రావలసిన అన్ని బాకీలు తీరెంతవరకు లీన్ వుంటుంది. ఇటువంటి లీనును సాదారణ లీను అంటారు.

2. ప్రత్యేక లీను : ఏ బాకి కొరకై వస్తువులను లేదా ఆస్తులను సెక్యూరిటీగా పెట్టారో ఆ బాకీ తీరెంతవరకు ఆ వస్తువులను లేదా ఆస్తులను రుణదాత తన వద్ద ఉంచుకొనె హక్కును ప్రత్యేక లీన్ అంటారు. ఒక బాకికి హామిగ ఉంచిన వస్తువులను మరొక బాకికి ముడిపెట్టకూడదు.

**D) ఖాతాదారుల ఖాతాను కలిపివేయటానికి బాంకరుకు గల హక్కు** : ఖాతాదారు ఒకే హోదాలో ఒకటికన్నా ఎక్కువ ఖాతాలను నిర్వహిస్తున్నట్లయితే వాటిని సర్దుబాటు చేసే హక్కు బాంకరుకు వుంటుంది. ఒక ఖాతాలో గల డెబిట్ విలువను మీరొక ఖాతాలో గల క్రెడిట్ విలువలతో అతడు సర్దుబాటు చేయవచ్చు అని గార్నెట్ $V_s$ మాకెర్నన్, 1972 కేసులో తీర్పు చెప్పినారు. కాని గ్రీన్ హల్ష్ $V_s$ యూనియన్ బాంక్ ఆఫ్ మాంఛెస్టర్ అనే కేసులో ఖాతాదారుల ఖాతాలను కలిపివేయటానికి బాంకరుకు హక్కు లేదని తీర్పు ఇచ్చినారు.

క్రింది షరతులకు లోబడి బాంకరు ఖాతాదారు ఖాతాలను కలపటానికి గల హక్కులను ఉపయోగించుకోవచ్చును.

1. దీనికి వ్యతిరేకంగా ఏ ఒప్పందం వుండరాదు
2. ఖాతాదారు అన్ని ఖాతాలను ఒకే హోదాలలో నిర్వహిస్తున్నట్లుగా భావించబడతాయి
3. ఖాతాలను సర్దుబాటు చేయటం గురించి బాంకరు ఉద్దేశ్యం. ఖాతాదారుకు లాంచన ప్రాయమైన నోటీసుద్వారా తెలియచేయ్యబడాలి.
4. ఖాతాదారుకు భవిష్యత్తులలో బాకీ ఏర్పడటానికి అవకాశం వున్న ఖాతాకు మరొక ఖాతానుంచి అతనికి వున్న నిల్వలను మళ్ళించరాదు.
5. ఏది ఏమైనప్పటికి ఖాతాదారుకు సంబంధించిన ఖాతాను కలుపటానికి ముందు బాంకరు ఖాతాదారుకు తెలియపరచడం మంచిది. అందువలన ఖాతాలను కలిపివేయడానికి అధికారం ఖాతాదారునుండి పొందడం చాలామంచి పద్దతి.

**E) చెల్లింపుల వినియోగానికి సంబంధించిన బాంకరుకు గల హక్కులు** : బాకీదారు రుణదాతకు రెండుగాని అంతకు మించిగాని రుణాలు చెల్లించవలసి వుంటే బాకీ దారులు చేసిన చెల్లింపుల వినియోగానికి సంబందించిన సూత్రాలు కాంట్రాక్టు చట్టంలో వున్నాయి.

అవి ఏవనగా :

1. రుణగ్రస్థుడు, రుణదాతకు సొమ్ము చెల్లించేటప్పుడు ఆ సొమ్ము ఫలాని బాకీ తీర్చడానికి ఉపయోగించాలని రుణదాతకు ఆదేశం పంపవచ్చు.
2. రుణగ్రస్థుడు నిర్దేశించకపోతే, అతడు చేసిన చెల్లింపును రుణదాత తన ఇష్టం వచ్చిన బాకీకి కాలదోషం పట్టిన బాకీలతో సహావినియోగించవచ్చు.
3. రుణగ్రస్థుడు కానీ, రుణదాతకానీ, చెల్లింపును, వినియోగించకపోతే, అట్టి చెల్లింపు బాకీలకు, వాటి తేదీలను బట్టి వరుసగా వినియోగించడం జరుగుతుంది. కాలదోషం పట్టిన బాకీలతో సహా, దీనినే క్లేటన్స్ కేసులోని మాత్రం అంటారు.

క్లేటన్స్ కేసులోని సూత్రమేమిటంటే, మొదటి చెల్లింపు మొదటి బాకీకి వినియోగించాలి. కరెంటు ఖాతాలలో క్రెడిట్‌వైపు వున్న మొదటి సొమ్ము, డెబిట్ వైపు వున్న మొదటి బాకీకి వినియోగించాలి. కాని, బాకీదారుడు సొమ్ము చెల్లించేటప్పుడు ఫలానా విధంగా ఆ సొమ్మును ఉపయోగించాలని బాంకును ఆదేశిస్తే క్లేటన్స్ కేసులోని తీర్పు వర్తించదు.

**F. మంజూరు చేసిన, రుణాలపై వడ్డీ తత్సంబంధ ఖర్చులను ఖాతాదారునకు బాంకరు విధించే హక్కు :** రుణదాత బాంకరుకు, ఖాతాదారుకు ఇచ్చే రుణాలపై వడ్డీ విధించే హక్కు ప్రచ్ఛన్నంగా వుంది. బాంకరు సాదారణంగా ఖాతాదారునుంచి రావలసిన వడ్డీని, ఖాతాదారుని ఖాతాకు 3 నెలల కొకసారి డెబిట్ చేస్తారు. ఖాతాదారుకు, బాంకరుకు మధ్యవున్న అగ్రిమెంట్ ప్రకారం బాంకరు ఖాతాదారుని రుణంపై చక్రవడ్డీని కూడా విధించవచ్చు. బాంకులు కరెంటు ఖాతాకు సంబంధించి తత్సంబంధ ఖర్చులను డెబిట్ చేసే అధికారం కూడా వుంది.

**G. బాంక్ డిపాజిట్లకు లిమిటేషన్ చట్టం :** బాకీ ఏర్పడిన మూడు సంవత్సరాల లోపుగా వసూలుకాకపోతే దానికి లిమిటేషన్ పడుతుంది. అంటే ఆ బాకీ వసూల మొత్తం కోర్టులో దావా వేయటానికి వీలుపడదు. లిమిటేషన్ చట్టంలోని ఈ సూత్రం ఖాతాదారు బాంకులో సొమ్ము జమచేసినప్పుడు ఏర్పడే బాంకి విషయంలో ఇది వర్తించదు. బాంకిలో వేసిన సొమ్ముకు సంబంధించిన బాకీ ఖాతాదారు సొమ్మును తిరిగి యివ్వమని కోరినప్పటినుంచి 3 సంవత్సరముల లెక్క ప్రారంభం అవుతుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల విషయంలో ఆ డిపాజిట్ల కాలం పూర్తి అయిన తేదీనుంచి కాలదోషం ప్రారంభమవుతుందా, లేకపోతే ఆ డిపాజిట్ తిరిగి ఇవ్వమన్న తేదీనుంచి ప్రారంభమవుతుందా అనే విషయం నిర్ధారణగా చట్టంలోకాని, కోర్టు తీర్పులలో కానీలేదు. అయితే, సొమ్ము చెల్లించడానికి డిపాజిట్ రసీదు దాఖలు చెయ్యడం షరతు అయి వుంటే, కాలదోషం తేదీ ఆ డిపాజిట్ రసీదు దాఖలుచేసిన తేదీనుంచి ప్రారంభమౌతుంది.

ఖాతాదారుకు బాంకు ఇచ్చిన అప్పులు, ఓవర్ డ్రాఫ్టులకు కాలదోషం వాటిని ఇచ్చిన తేదీనుంచి ప్రారంభమవుతుంది. అందుచేత బాకీ ఇచ్చిన మూడు సంవత్సరాలలోగా వాటి వసూలుకోసం బాంకరు చర్యలు తీసుకోవలసి వుంటుంది.

**13.5 బాంకరు యొక్క ప్రత్యేక తరహా ఖాతాలు :** బాంకులలో వివిధ రకాల ఖాతాదారులు తమ ఖాతాలను ప్రారంభించి వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఇట్టి వివిధరకాలు ఖాతాదారుల ఖాతాలను ప్రారంభించేటప్పుడు బాంకరు అనేక జాగ్రత్తలను తీసుకోవలసి వుంటుంది. లేనియెడల బాంకరు నష్టపోయే ప్రమాదం వున్నది. బాంకరు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆయా ఖాతాదారుల న్యాయాత్మక సామర్థ్యాలపై ఆధారపడి వుంటుంది.

**13.5.1 మైనర్లు** : భారతదేశంలో వున్న చట్టం ప్రకారం 18 సంవత్సరములు నిండని వ్యక్తిని మైనరు అంటారు. మైనరు తరపున వ్యవహరించటానికి గార్డియన్ కోర్టు నియమిస్తే 21 సంవత్సరములు నిండనిదే మైనారిటీ తీరదు. ఇంగ్లాండులో 21 సంవత్సరములు నిండిన వ్యక్తులను ఇన్‌ఫెంట్స్ అంటారు. ఇండియన్ కాంట్రాక్టు చట్టం ప్రకారం మైనరుకు కాంట్రాక్టు చేసుకొనే అర్హత వుండదు. మైనర్లు చేసుకొనే కాంట్రాక్టులు చెల్లని అగ్రిమెంట్లుగాని తన అవసరాలకు కానీ, తనలాభం కోసంకాని, మైనర్లు చేసుకొనే అగ్రిమెంట్లు సంక్రమమైన అగ్రిమెంట్లు మైనరు బాంకు ఖాతా ఏర్పాటు చేసేకోదలచుకొంటే బాంకరుకు ఏటువంటి అభ్యంతరం వుండదు. కాని

మైనరు బాంకుకు బాకీపడితే ఆ బాకీని బాంకరు వసూలు చేసుకోజాలడు కాబట్టి మైనరుకు ఓవర్ డ్రాఫ్టును అనుమతించరాదు. కాబట్టి మైనరు తరపున వ్యవహరించే గార్డియన్ పేరిట బాంకు ఖాతా ఉండడం మంచిది. దీనివల్ల మైనరు సొమ్ము నిల్వకు మించి డ్రా చేస్తే ఆ మొత్తాన్ని గార్డియన్ నుండి వసూలు చేసుకోవచ్చును.

మైనరు చేసిన ఋణాలు బాంకరు అతని వద్దనుండి వసూలు చేయలేదు. మైనరు ఏవైనా సెక్యూరిటీలు హామిగ వుంచి బాంకీనుండి అప్పుతీసుకొని తిరిగి చెల్లించకపోతే బాంకరు సెక్యూరిటీలను అమ్మటానికి వీలులేదు. ఆ సెక్యూరిటీలను తిరిగి మైనరుకు వాపస్ చేయవలసి వుంటుంది. అంతేకాక మైనారిటీ కాలంలో చేసిన ఋణాలకు ఆ తర్వాత చెక్కులు, హుండీలు ఇవ్వడం జరిగితే ఆ చెక్కులను హుండీలను వసూలు చేసుకోవడానికి కూడా వీలులేదు.

మైనరుకు సంబంధించి బాంకరు తీసుకోవలసిన ముఖ్య జాగ్రత్తలు ఏవనగా :

1. బాంకరు మైనరుపేరిట సేవింగ్స్ ఖాతా మాత్రమే ప్రారంభించుటకు వీలుకల్పించడం
2. మైనరు యొక్క పుట్టిన తేదీని అధికారిక రికార్డుల ద్వారా సంపాదించుట
3. మైనరు మరణిస్తే అతని ఖాతాలోని నిల్వ మొత్తాన్ని అతని సంరక్షకునికి (గార్డియన్) చెల్లించాలి.
4. మైనరును లాభాలలో మాత్రమే భాగస్వామిగా చేర్చుకోవాలి. ఒకవేళ ఆ సంస్థ నష్టాలకు అతనికి భాద్యత వుండదు.
5. మైనరు ఏజెంట్గా వ్యవహరించినప్పుడు యజమాని కూడా అతని చర్యలకు బాధ్యుడౌతాడు.

**13.5.2 వివాహిత స్త్రీలు :** భారతీయ న్యాయశాస్త్రం ప్రకారం వివాహిత స్త్రీలు పురుషులతో సమానంగా ఆస్తులు, సొంతంగా కొనటానికి, అమ్మటానికి, అప్పులు ఇవ్వటానికి పుచ్చుకోవటానికి మరియు ఒప్పందాలు చేసుకోవటానికి హక్కు మరియు అర్హత కలిగియున్నారు. అందువలన వివాహిత స్త్రీలు బాంకులో ఖాతా ఏర్పాటు చేసుకోవటానికి ఏటువంటి అభ్యంతరం లేదు. స్త్రీ చెక్కులు జారీ చేయవచ్చును. బిల్లులు రాయవచ్చును. అంగీకరించవచ్చును బాంకు నుండి అప్పును తీసుకొనవచ్చును.

వివాహిత స్త్రీకి ఓవర్ డ్రాఫ్టు గానీ, లేదా అప్పుగానీ, ఇచ్చేటప్పుడు బాంకరు ఈ క్రింది విషయాలను గుర్తుంచుకోవలెను

1. భార్య (వివాహిత స్త్రీ) చేసే అప్పులు గృహ అవసరాలకు సంబంధించినవైతేను, భర్తకు వాటిని చెల్లించే బాధ్యత వుంటుంది. గృహ అవసరాలకు సంబంధించనివైతే బాధ్యత వుండదు.
2. ఆమెకు సొంత ఆస్తిలేని పక్షంలో బాంకు ఇచ్చిన ఓవర్ డ్రాఫ్టుకు తగిన హామీ ఉండదు. ఆమెనుంచి బాకీ వసూలు చేయడం కష్టం కావచ్చు.
3. భార్యకు సొంత ఆస్తి (స్త్రీ ధనం) వుందా లేదా గమనించి, ఉంటే దానిపై ఆమెకు కేవలం జీవితకాలం అనుభవించే హక్కు ఉందా లేక అమ్ముకోవడానికి కూడా సర్వహక్కులు ఉన్నాయోమో గమనించవలెను.
4. వివాహిత స్త్రీ అనుచిత ప్రభావానికి లొంగి ఋణం తీసుకుంటున్నదెమో కూడా గమనించవలె.
5. భార్య భర్తల పేరిట జాయింట్ ఖాతా ఉండి, అందులో ఒకరు మరణిస్తే బాంకు నిల్వ రెండోవారికి చెందాలనే ఆదేశం ఉంటే, బాంకరుకు ఎలాంటి ప్రమాదం ఉండదు.

**13.5.3 భాగస్వామ్య సంస్థలు :** అందరూగానీ అందరి తరపున కొందరు గానీ నిర్వహించే వ్యాపారంలోని లాభాలు తమలో తాము పంచుకోవడానికి అంగీకరించిన వ్యక్తుల మధ్య వుండే సంబంధాన్ని భాగస్వామ్యం అంటారు. భాగస్వామ్యంలో ఒక్కరుగాని అంతకంటే ఎక్కువమంది కలిసిగాని, భాగస్వాముందరి తరపున వ్యవహరించవచ్చును. భాగస్వామ్య సంస్థ తరపున భాగస్వామి ఏ ఒప్పందము చేసి కొన్నా, ఏ వ్యవహారము చేసిన దానికి భాగస్వాములంతా కట్టుబడి వుండవలెను.

భాగస్వామ్య ఖాతాను ఏర్పాటు చేసేటప్పుడు బాంకరు గమనించవలసిన అంశములు ఏవనగా

a) భాగస్వామ్య ఒప్పందమును బాంకరు నిశితముగ పరిశీలించవలెను. భాగస్వామ్య చట్టం ప్రకారం బాంకింగ్ వ్యాపారం అయితే 10 మంది. ఇతర వ్యాపారులైతే 20 మంది వ్యక్తులు మించకుండ వుండవలెను. ఆ సంఖ్య మించితే చట్ట విరుద్ధమైన సంస్థ అటువంటి చట్ట విరుద్ధమైన సంస్థల పేరుతో బాంకు ఖాతాను ఏర్పాటు చేయకూడదు.

b) భాగస్థులలో ఎవరైన మైనర్లు వున్నారేమో గమనించాలి మైనర్లు సంస్థలోని లాభాలను పంచుకుంటారు. కాని సంస్థ అప్పులకు బాధ్యులు కారు.

c) బాంకరు భాగస్వామ్య సంస్థ పేరుతోనే ఖాతాను ప్రారంభించాలి వ్యక్తిగత భాగస్వామి కదా భాగస్వాముల పేర్ల పై ఖాతాలను ప్రారంభించకూడదు.

d) భాగస్వామ్య సంస్థ పేరుతో ఖాతాను ప్రారంబించినప్పుడు ధరఖాస్తు పత్రముపై అందరు భాగస్వాముల సంతకాలను తీసుకోవాలి.

e) సంస్థ పేరుతో ఖాతాను ప్రారంభిస్తున్నప్పుడు బాంకరు సంస్థపేరు వ్యాపారస్థలము, సంస్థ వ్యాపారం, భాగస్తులపేర్లు వారి చిరునామాలు స్వీకరించవలెను

f) సంస్థకు సంబంధించిన చెక్కులను భాగస్థుల వ్యక్తిగత ఖాతాకు క్రెడిట్ చేయరాదు.

g) సంస్థ తరపున అప్పుచేసే అధికారము భాగస్తునికి వున్నప్పటికి, సాదారణముగ బాంకరు సంస్థకు అప్పు ఇచ్చేటప్పుడు రుణ పత్రాలపై సంస్థ భ్యాగస్థులందరి సంతకాలను తీసుకొనవలెను. ఇండెమ్నిటి పత్రం లేదా గ్యారంటి పత్రాలపై కూడ భాగస్థులందరి సంతకాలను తీసికొనవలెను.

h) భాగస్థులలో ఏ ఒక్కరు మరణించినా, విరమించిన, దీవాలా తీసినా, నూతన భాగస్తున్ని చేర్చుకొన్న పాత భాగస్వామ్య స్థానములో కొత్త భాగస్వామ్య సంస్థ అమలులోనికి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో బాంకరు పాతసంస్థ ఖాతా రద్దుచేసి కొత్త సంస్థ ఖాతాను ప్రారంభించాలి లేనియెడల కేటన్స్ కేసులోని సూత్రము వర్తించే ప్రమాదమున్నది.

**13.5.4 జాయింట్ స్టాక్ కంపెనీలు :** భారత కంపెనీల చట్టం 1956 ప్రకారం కంపెనీ చట్టం ద్వార సృష్టించబడిన కల్పితవ్యక్తి కంపెనీకి ప్రత్యేకమైన వ్యక్తిత్వం వున్నది. అందువలన అది తన పేరుతో ఒప్పందాలు ఏర్పాటు చేసుకోవచ్చును. కంపెని పేరుతో బాంకులో ఖాతాను ప్రారంబించవచ్చును కంపెని పేరిట ఆస్తులను కొనుట అమ్ముట, అప్పులుచేయుట, ఇతరులపై దావావేయుట, ఇతరులు కంపెనీపై దావా వేయుట చట్టము అనుమతిస్తుంది. కంపెనీ వ్యాపారములో వాటాదారుల ఋణ బాధ్యత పరిమితము. వాటాదారులు వారు తీసికొన్న కంపెనీకి బాంకరు ఋణం మంజూరు చేస్తే, ఆ ఋణంను కంపెనీ నుండే రాబట్టుకోవాలి. కంపెని పేరుమీద ఖాతాను ప్రారంబించబోయేముందు బాంకరు ఈ క్రింది జాగ్రత్తలు తీసికోనవలెను.

**ఎ) పత్రాలను పరిశీలిచుట :** సంస్థాపన పత్రము నియమావళిలో తెలిపిన అంశాల ప్రకారమే కంపెని పనిచేస్తుంది. ఈ రెండు పత్రాలు చాల ముఖ్యమైనవి. బాంకరు సంస్థాపన పత్రము నియమావళి ధృవీకరింపబడిన కళ్లను తీసికొని తన వద్ద భద్రపరచుకోవాలి.

కంపెని వ్యవస్థాపకులు కంపెనీని నమోదు చేసేటప్పుడు సంస్థాపన పత్రాన్ని కంపెనీ రిజిస్ట్రార్‌కు దాఖలు చేయవలెను అందులో కంపెనీపేరు, స్థలము, లక్ష్యాలు, మూలధనము, వాటాదారుల బాధ్యతలు వుంటాయి. బాంకరు ఆ పత్రాన్ని పరిశీలిస్తే పై విషయములు అవగాహన అగును.

కంపెని నియమావళిలో కంపెని అంతర్గత నిర్వహణకు సంబంధించిన నిబంధనలు వుంటాయి. ఇందులో డైరక్టర్లకు గల హక్కులు, సభ్యుల హక్కులు, వాటాల బదిలి, మీటింగ్‌ల నిర్వహణ డైరెక్టర్ల నియమాకలము, ఓటింగ్ విధానము వంటి అంశాలన్ని నిర్ణయింపబడతాయి. కంపెని రిజిస్ట్రార్ జారీచేసిన కంపెని నమోదు పత్రాన్ని వ్యాపార ప్రారంభ ధ్రువపత్రాలను కూడ బాంకరు అడిగి

తీసికోవాలి. కంపెని చట్టము 1956 ప్రకారం నమోదు పత్రము పొందిన వెంటనే ప్రైవేటు కంపెని వ్యాపారాన్ని ప్రారంభించవచ్చును. పబ్లిక్ కంపెని అయితే వ్యాపార ప్రారంబ ధృవపత్రము పొందిన తరువాతనే ప్రారంబించవలెను.

**బి) బోర్డు తీర్మానము :** ఖాతా ప్రారంభానికై దరఖాస్తు ఫారంతోబాటు, అలాంటికంపెని తనను బాంకరుగా నియమిస్తున్న బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తీర్మానపు ధృవీకరింపబడిన పత్రాన్ని నకలును బాంకరు తీసికోవాలి. కంపెనీ తాలూకు బాంకు వ్యవహారాలు చెయ్యడానికి, చెక్కుమీద సంతకాలు చెయ్యడానికి బిల్లు వ్యవహారాలు చెయ్యడానకి, సెక్యూరిటిలు, తదితర వస్తువుల భద్రత కోసము బాంకుకు అప్పగించడానికి తీసికోవడానికి ఎవరికి అధికారమున్నదో నిర్ధారణగా తెలుసుకోవాలి.

**సి) లాబానష్టాల ఖాతా మరియు ఆస్తి అప్పుల పట్టీల పరిశీలన :** కొంతకాలముగ పనిచేస్తూ ఉన్న పాత కంపెనీలకు ఖాతాను ఏర్పాటు చేయ్యవలసినప్పుడు, ఆ కంపెనీ తాలూకు గత 2 లేదా 3 సంవత్సరముల ఆస్థి అప్పుల పట్టీలను లాభ నష్టాల ఖాతాలను పరిశీలించవలెను. ఈ పత్రాల పరిశీలన ముఖ్యముగా బాంకు ఓవర్ డ్రాఫ్టు సౌకర్యాన్ని కంపెనీకి కల్పించదలచిన్నట్లైతే అవసరముంటుంది.

**డి) కంపెనీలకు బాంకు అప్పులివ్వడం :** కంపెనీకి అప్పు ఇవ్వవలసినదిగా బాంకుకు దరఖాస్తు వచ్చినప్పుడు బాంకు కంపెనీ తాలూకు సంస్థాపన పత్రము, నియమావళి పత్రాలను పరిశీలించి, అప్పుతీసుకోవడానికి కంపెనీ హక్కు ఉన్నదా, ఉంటే ఎవరు తీసికోవలె, అప్పుతీసుకోవడానికి ఏవైన హద్దులున్నాయా అనే విషయాలను గురించి తెలుసుకోవలెను.

వ్యాపారం చేసే కంపెనీలకు అప్పు తీసుకోవడానికి అధికారమున్నదని వేరే ఎక్కడ ఉండనక్కర్లేదు. అలాంటి అధికారము వాటికి ఉన్న ప్రచ్ఛన్నమైన అధికారము. వ్యాపారంచేయని ఇతర సంస్థలు అప్పుజెయ్యవచ్చునని సంస్థాపన పత్రంలోకాని, నియమావళిలోగాని ఉండవలెను.

**ఇ) డైరక్టర్స్ వ్యక్తిగత ఖాతాలు :** కంపెనీ, కంపెనీ డైరెక్టర్ల వ్యక్తిగత ఖాతాలు ఒకే బాంకులో ఉన్నట్లయితే కంపెనీకి సంబంధించిన అప్పులు నగదు కంపెనీ కాతాలోనే జమచేయాలి. కంపెనీ పేరట ఇచ్చిన చెక్కులు డైరెక్టర్లు లేదా ఉద్యోగస్థులు వ్యక్తిగత ఖాతాలకు జమ చేయవలసినదిగా బాంకరును కోరితే బాంకరు చాల జాగ్రత్తగా వ్యవహరించాలి. అటువంటి వ్యవహారాలు గురించి తగిన విచారణ జరిపి. కంపెనీకి తెలియజేసి అన్ని విధాల సంతృప్తి చెందిన తరువాతనే వారి వ్యక్తిగత ఖాతాలలో జమ చేయవలెను. ఈ విషయములో బాంకరు ఎటువంటి అశ్రద్ధ చేసిన ఆ మొత్తమును తిరిగి కంపెనీకి చెల్లించవలసిన బాధ్యత బాంకరుకు వున్నది.

**యఫ్) ప్రైవేటు కంపెనీల ఖాతాలు :** సొంత వ్యాపారస్థుడు తన వ్యాపారసంస్థను ప్రైవేటు కంపెనీగా మార్చి, కంపెనీ ఆస్తుల హమితో బాంకునుండి అప్పు తీసుకోవచ్చును. కొన్ని సందర్భాలలో రుణదాతలను మోసపుచ్చే ఉద్దేశ్యంతో సొంత వ్యాపారమును ప్రైవేటు కంపెనీగా మార్చవచ్చును.

కాబట్టి ఇటువంటి కంపెనీల విషయములో బాంకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పాత వ్యాపారం తాలూక అప్పులన్ని చెల్లించడం జరిగింది. లేనిది నిర్ధారణ జేసుకోవాలి. లేని పక్షంలో బాంకు కంపెనీ ఆస్తులపై హమీతో ఇచ్చిన రుణం వసూలు కష్టమవుతుంది.

**13.5.5 ట్రస్టులు :** ఒక వ్యక్తి (ట్రస్టీ) కొంత ఆస్తిని ఇంకొకరి లాభము కోసం కాని, నాయసమ్మతమైన మరో ప్రయోజనము కొసంగాని, న్యాయపరమైన హక్కుతోగాని లేదా ఈ క్విటబుల్ హక్కులోగాని తన స్వాధీనంలో ఉంచుకోవలసి వచ్చినప్పుడు ఏర్పడే సంబందమును ట్రస్టు అంటారు. ట్రస్టును నిర్వహించే వ్యక్తులను ట్రస్టీలు అని, ఎవరి ప్రయోజనాల కోసము ట్రస్టు ఆస్తులను నిర్వహనజేస్తారో వారిని బెనిఫిషరీలు అని అంటారు. ట్రస్టుకు ఆస్తిని బదలీజేసి, ట్రస్టీపై విశ్వాసంను వ్యక్తపరచే వ్యక్తిని ధర్మకర్త అంటారు. సాదారణముగా దస్తాకాజు ద్వారా ట్రస్టును ఏర్పాటు జేస్తారు.

ట్రస్టీలతో వ్యాపార లావాదేవీలు నిర్వహించేటప్పుడు బాంకరు ఈ దిగువ జాగ్రత్తలు తీసుకోవలెను.

1. ట్రస్ట్ ఏర్పడడానికి మూలాధారము ట్రస్టు ఒప్పందము. అందుచేత ట్రస్టీ పేర ఖాతాను ఏర్పాటు జేసేటప్పుడు బాంకరు ట్రస్టు

ఒప్పందమును జాగ్రత్తగా గమనించవలెను. అందులో ట్రస్టులపేర్లు, ట్రస్టీ ఆస్తిని నిర్వహణకు సంబంధించిన వారికిగల హక్కులు మొదలైన అంశాలు వుంటాయి.

2. ఒకవేళ ట్రస్టీలు ఇద్దరు అంతకంటో ఎక్కువమంది వుంటె, వారిలో ఖాతాను ఎవరు నిర్వహిస్తారో బాంకరు స్పష్టంగా తెలుసుకోవాలి. అటువంటి ఆదేశాలు ఏమిలేనప్పుడు, అందరు ట్రస్టీలచేత సంతకం జేయబడిన చెక్కులను మాత్రమే బాంకరు ఆదరించాలి.

3. ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది చనిపోయిన, విరమించినా, ఇతర ట్రస్టీలకు ఉండే అధికారము ట్రస్ట్ ఒప్పందము నిర్ణయిస్తుంది. అందరూ చనిపోతే కొత్త ట్రస్టీలను కోర్టు నియమిస్తుంది.

4. ట్రస్టీలలో ఎవరైనా దివాలా తీస్తే దానివలన ట్రస్టు ఆస్తి ఏమి దెబ్బతినదు. ఆ ట్రస్టు రుణదాతలు తమ రుణాలను ఈ ఆస్తి నుండి రాబట్టుకోలేరు.

5. బాంకరు బెనిఫిషియరు ప్రయోజనాలకు రక్షణ కల్పించలి. ఆవిధముగా వ్యవహరించకపోతే ట్రస్టీ బెనిఫియరీకి మోసముచేసిన సందర్భంలో బాంకరు బాధ్యత వహించవలసి ఉంటుంది.

6. ట్రస్టీ ట్రస్టు ఆస్తుల తనిఖీపై అప్పులు తీసుకోదతిస్తే, అట్టె చర్యకు ట్రస్టు ఒప్పందము అనుమతిస్తుందో లేదో గమనించాలి. అంధముగా ఇచ్చిన విధులు ట్రస్ట్ ప్రయోజనాలకు వెచ్చింపబడ్డాయో లేదో అనే సంగతిని బాంకు పరిశీలించాలి.

7. ఎటువంటి పరిస్థితిలోను ట్రస్టు నిధులను ట్రస్టీల వ్యక్తిగట ఖాతాలకు మళ్ళించరాదు. ట్రస్టీ వ్యక్తిగతఖాతా ఒకవర్‌డ్రాఫ్టు నిల్వ ఉన్నప్పుడు ఇలాంటి చర్య ప్రమాదాలకు దారితీస్తుంది.

8. చారిటబుల్ ట్రస్టుల యొక్క బాంకు ఖాతా నిర్వహణలో, బాంకరు పబ్లిక్ ట్రస్ట్ చట్టం నియమాలననుసరించి, చారిటీల కమీషనర్ లేదా తత్సమానమైన ఇతర అధికారి జారీజేసిన ధృవీకరణ పత్రాన్ని పరిశీలించి దానిలోని అంశాల ప్రకారమే ఖాతానిర్వహణకు వీలు కల్పించాలి.

**13.5.6 వర్తకేతర సంస్థలు :** క్లబ్బులు, సొసైటీలు కళాశాలలు, పాఠశాలలు, మతధార్మిక సంస్థలు. గ్రంథాలయాలు, క్రీడలు, ఆరోగ్యం. సంస్కృతి మొదలైన సంస్థలను వ్యాపారేతర సంస్థలు అంటారు. నీతి ప్రధాన ఉద్దేశ్యం లాభార్జన కాదు. వివిధ వర్గాలలోని వ్యక్తులకు సే సేయడము. ఈ సంస్థల నిర్వహణ కొరకు కార్యనిర్వహక వర్గం ఉంటుంది. బాంకరు ఈ ఖాతాల వ్యవహారాలలో కార్యనిర్వాహణ వర్గం ద్వారా చేస్తాడు.

వ్యాపారేతర సంస్థల పేరిట ఖాతాను ఏర్పాటుజేసేటప్పుడు బాంకరు గమనించవలసిన విషయములు:

1. ఈ సంస్థలు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టము 1860 ప్రకారం నమోదు కాబడివుండాలి. కొన్ని కంపెనీల చట్టం లేదా కోఆపరేటివ్ చట్టము ప్రకారం కూడా ఏర్పడి వుండవచ్చును. పైన చెప్పిన చట్టం ప్రకారం నమోదు కాబడిన సంస్థలకు ప్రత్యేక ఆస్థిత్వము కలిగి వుండి సక్రమమైన కాంట్రాక్టులను చేసుకోవడానికి అర్హత ఉంటుంది. కాబట్టి నమోదు అయిన సంస్థల ఖాతాలనే బాంకరు ఏర్పాటు చేయాలి.

2. ఈ సంస్థఅ రాజ్యాంగము, నియమ నిబంధనలను, ఆబాంకును తమ బాంకరుగా నియమిస్తూ సంస్థ ఆమోదించిన తీర్మాణము, చెక్కులపై సంతకం జేయడానికి అవసరమైన ఆదేశాలు, మొదలైన అవసరమైన సమాచారం నీ కళ్ళకు బాంకరు తీసుకోవాలి.

3. వాటికి రుణాలను మంజూరు చేసేటపుడు అసలు వీటికి రుణాలను పొందే అధికారము ఉన్నదా, ఉంటె దానిమీద ఏమైన పరిమితులు ఉన్నాయో అనే విషయాలను బాంకరు జాగ్రత్తగా గమనించాలి.

4. బాంకు ఖాతాను ఎవరు నిర్వహిస్తారో, హుండీలు అంగీకరించడము గాని బదలాయింపు చేయడంగాని రాయడం గాని ఎవరు జేస్తారో వారి నమూనా సంతకాలు మొదలైన విషయాలు తెలియజేస్తూవున్న అధికారిక ఆదేశాన్ని పొందాలి.

5. కార్య నిర్వాహక సభ్యుల పేర్ల జాబితాను బాంకరు తీసుకోవాలి. అందులో జరిగే మార్పులను బాంకరు గమనిస్తూ ఉండాలి. పాలవర్గ సభ్యలలో అధికారాలలో మార్పులు జరిగితే అవికూడ బాంకరు తెలుసుకుంటూ ఉండాలి.

6. సంస్థనిధులు దాని ఖాతాను నిర్వహిస్తున్న వ్యక్తుల ఖాతాకు మళ్ళించబడినట్లుగ బాంకరు ఏదైన అనుమానం వస్తే, దాన్ని గురించి బాంకరు వెంటనే విచారణ జరిపి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

7. ఖాతాను నిర్వహించే వ్యక్తి ఆ పదవికి రాజీనామా జేసినా, మరణించినా ఆ పదవిలో మరొకరిని నియమింపబడేంతవరకు బాంకరు ఆ ఖాతా కార్యకాలాపాలన్నింటిని నిలిపివేయాలి.

**13.5.7 సమిష్టి హిందూ కుటుంబము :** హిందూ కోడ్‌ననుసరించి సమిష్టి కుటుంబములోని సభ్యులను సహభాదస్వాములా అంటారు. జన్మత కుటుంబములోని పురుషులందరికి ఉమ్మడి కుటుంబ వ్యాపారంలో, ఆస్తిలో వాటా లభిస్తుంది. కుటుంబములోని కార్యకలాపాన్నిటిని అందరికన్న పెద్ద వాడైన పురుషు సభ్యుడు నిర్వహిస్తాడు. ఇతనినే కర్త అంటారు. వ్యాపార నిర్వహణ నిమిత్తము బాంకులో ఖాతాను తెరచి నిర్వహించువలసిన అవసరము ఏర్పడవచ్చును. సమిష్టి హిందూ కుటుంబములో వ్యవహరించేటపుడు బాంకరు ఈ దిగువ జాగ్రత్తలు తీసుకోవాలి.

1. ఖాతను ప్రారంభించేటపుడు దరఖాస్తు ఫారము మీద కుటుంబములోని స్త్రీ సభ్యులతో సహా అందరు పెద్దవాళ్ళు సంతకాలను తీసుకోనవలెను.

2. కుటుంబము తరపున ఒప్పందాలు చేసుకొనే అధికారము, కర్తకు మాత్రము వుంటుంది. కాబట్టి ఖాతా వ్యవహారాలను అన్నింటిని అతడే నిర్వహించేటట్లు జాగ్రత్తపడాలి.

3. కర్తకు కుటుంబ వ్యాపారం తరుపున వ్యాపారం నిర్వహణజేయడానికి అప్పుతీసుకోవడానికి ఆస్తులను తాకట్టుపెట్టడానికి అధికారము వుంటుంది. ఈ రుణాలు కేవలం కుటుంబ ప్రయోజనాలుకోసమే తీసుకొన్నాడు. బాంకరు నిర్ధారించుకోవాలి. కుటుంబ ప్రయోజనాలకు కాకుండా ఇతర పనులకోసం రుణాలజేస్తే వాటిని తీర్చేందుకు సహబాగస్థులుకారు.

4. సమిష్టి హిందూ కుటుంబమునకు రుణాలను ఇచ్చేటపుడు అ ఒప్పందము మీద కుటుంబములో అందరు వయోజన పురుష సభ్యుల సంతకాలను బాంకరు తీసుకోవాలి. ఇందువలన ఆ రుణం చెల్లింపుకు వారందరు వ్యక్తి గతముగా భాద్యలవుతారు.

5. తనంతట తానుగా కుటుంబముతో గల సంబంధాలను తెంచుకొన్న ఏ సహబాగస్థునికి ఆ కుటుంబానికి గతంలో వచ్చిన లాభనష్టాలు లెక్కల గురించి అడిగే వుండదు.

### 13.5.8 ఖాతాదారిని యొక్క అటార్నీలు (ఏజెంట్లు)

బాంకరు యొక్క ఏ ఖాతా దారుడైనా ఇంకొక వ్యక్తిని నామమాత్రముగాగాని లేదా వ్రాత పూర్వకంగాగాని మూడవ వ్యక్తిలో తన తరుపున లావాదేవలు జరుపడానికి నియమిస్తే అలాంటి వ్యక్తిని ఖాతా దారుడు తరుపున అటార్ని లేదా ఏజెంటు అంటారు అంటార్నిక్ సాధారణ అధికారాలుగా ప్రత్యేకముగా నిర్దిష్ట అధికారాలుగాని ఇవ్వవచ్చు ఇటువంటి అధికార బదిలిని పవర్ ఆఫ్ అటార్ని అంటారు. పవర్ అటార్ని పొందిన వ్యక్తి ఖాతాదారు వ్యాపార నిర్వహణకు అవసరమైన అన్ని కార్యకలాపాలను నిర్వహించే అధికారన్ని కలిగి వుంటాడు. ఖాతాదారు అటార్నిక్ నియమంచిడము ద్వార ఖాతా నిర్వహణ జేయదలచినట్లయితే బాంకరు ఈ క్రింది విషయాలకు ప్రాధాన్యత ఇవ్వవలెను. అవి ఏమనగా

1. బాంకరు అటార్నితో లావాదేవీలు జరిపేటప్పుడు అటార్నీ ధృవ పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించవలెను. బాంకరు ఈ పత్రము యొక్క నగలును తన దగ్గఉర వుంచుకోవాలి.

2. అటార్నీ అధికారాలలో భాగంగా అప్పుతీసికొనే అధికారము లేకపోయినట్లయితే బాంకరు అతనికి ఓవర్ డ్రాఫ్టు మంజూరు

చేయకూడదు. ఒకవేళ రుణం మంజూరుచేస్తే వసూలు జేసుకోవడము సమస్య కావచ్చును.

3. ఖాతాదారుడు కొన్నిసార్లు పబ్లిక్ నోటీసు ఇచ్చి తన అటార్నీ యొక్క అధాకరులను వెనక్కి తీసుకోవచ్చును. అదే విధముగా భాదత కాంట్రాక్టు చట్టము 1872 సెక్షను 201 ప్రకారము ఖాతా దారుయొక&క మరణము, దావాలా తీయుట మరియు మతిభ్రమించుట వలన అటార్నీ యొక్క అధికారాలు వాటంతట అవే రద్దు అగును.

4. ఖాతా ప్రారంబించేటపుడు అటార్నీని సరిగ్గా గుర్తించవలెను. ఖాతాను యజమాని తరుపున ఏజెంటు (అటార్నీ) అన్న శీర్షికలో ప్రరంభించవలెను.

5. పవర్ ఆఫ్ అటార్నీచే షరతుగా వున్నది లేనిది కానిది బాంకరు నిర్ధారించుకోవాలి. ఒకవేళ అది షరతులతో కూడి వుండి, ఆ షరతులను పాటించకపోతే, ఖాతా నిర్వహించడానికి బాంకరు నిరాకరించవలెను.

**13.5.9 నిర్వహకుల పరిపాలనకుల ఖాతాలు :** వీలునామా రాసిన వ్యక్తి చనిపోయిన తరువాత, అందులో వ్రాసిన ప్రకారము అప్పులను తీసి, ఆస్తులను పంచి పెట్టడానికి అతడు నియమించిన వ్యక్తిని నిర్వాహకుడు అంటారు. చనిపోయిన వ్యక్తి వీలునామా వ్రాయకపోతే అతని ఆస్తిని వారసులకు పంచి పెట్టే నిమిత్తము కోర్టు నియమించిన వ్యక్తిని పరిపాలకుడు అంటారు. నిర్వహకులు తమ విధులను వీలునామా ప్రకారము నిర్వర్తిస్తారు అయితే పరిపాలకులు చట్టం ప్రకారం నిర్వర్తిస్తారు.

నిర్వాహకుల / పరిపాలకుల ఖాతాలను నిర్వహించేటప్పుడు బాంకరు క్రింది జాగ్రత్తలు తీసికోవలెను.

1. ఖాతాదారుడు మరణించిన వార్త తెలియగానే బాంకరు ఖాతా తాలూకు చెల్లింపులు నిలుపు చేస్తాడు. నిర్వాహకుని నియామక పత్రము. వీలునామాలను బాంకరు జాగ్రత్తగా పరిశీలించాలి.

2. ఒకరికంటే ఎక్కువమంది నిర్వాహకులను / పరిపాలకులను నియమించినట్లయితే వారిలో ఎవరు ఖాతాను నిర్వహిస్తారో తెలుసుకోవాలి.

3. ఖాతాదారుడు మరణానంతరము బాంకు నిర్వాహకులు / పరిపాలకులు పేర్లు మీద క్రింది విధముగా ఖాతాను ప్రారంబించాలి. "మరణించిన × ఆస్తి నిర్వహకులు అయిన ( )" ఖాతా

4. నిర్వాహకులు / పరిపాలకులు ఖాతాలు నిర్వహించేటప్పుడు మరణించిన వ్యక్తి నిధులను దుర్వినియోగం చేయకుండా జాగ్రత్త వహించాలి.

5. నిర్వాహకుడు/పరిపాలకుడు మతిభ్రమించినప్పుడు మాత్రమే ఖాతా ముగుస్తుంది. అతడు వ్రాసిన చెక్కులను ఇతర ప్రతినిధుల అనుమతి లేకుండ బాంకరు చెల్లించకూడదు.

6. బాంకరుకు నిర్వాహకుల / పరిపాలకుల వ్యక్తిగత ఖాతాలతో, మరణించిన వ్యక్తి ఖాతాలను కలపడానికిగానీ, ఖాతాలను సర్దుబాటు చేయడానకికి గాని హక్కు ఉండదు.

7. నిర్వాహకులు / పరిపాలకులు దివాలా తీసినా, మరణించినా వారి అధికారాలు మిగిలిన నిర్వహకులకు / పరిపాలకులకు సంక్రమించును. ఈ విషయములో సందేహములు ఉన్నట్లయితే కోర్టు వివరణను సంపాదించడముగాని, కొత్త పరిపాలన పత్రాలను సంపాదించడముగాని జేయవలెను.

**13.5.10 ఉమ్మడి ఖాతాలు :** భాగస్వామ్య సంస్థలో బాగస్వాములుకాని, ఇద్దరు లేదా అంతకంటె ఎక్కువమంది అయిన ఖాతాదారుల పేరిట బాంకు ఖాతా ఏర్పాటు చేస్తే, అట్లాంటి ఖాతాను ఉమ్మడి ఖాతా అంటారు.

**ఉమ్మడి ఖాతాను ఏర్పాటు చేసేటప్పుడు బాంకరు తీసికొనవలసిన జాగ్రత్తలు :**

1. ఉమ్మడి ఖాతాలను ప్రారంభించాలనుకునే అందరు వ్యక్తులు అందుకు సంబందించిన దరఖాస్తు ఫారముమీద సంతకం చేయాలి.
2. చెక్కులు జారీ చేసేటప్పుడు ఖాతాదారులందరి సంతకాలు ఉండవలెనా లేదా ఒకరి లేదా కొందరి సంతకాలు సరిపోతాయా అనే విషయము గురించి బాంకరుకు ఆదేశము స్పష్టముగా తెలియచేయవలెను. అటువంటి ఆదేశాలు ఏమి లేనప్పుడు ఉమ్మడి ఖాతాను ప్రారంభించిన అందరు ఖాతాదారుల సంతకము చేసిన చెక్కులను మాత్రమే బాంకరు ఆదరించవలెను.
3. జాయింట్ ఖాతాదారులలో ఒకరు మరణిస్తే ఆ ఖాతాలో మిగిలి ఉన్న నిల్వను ఎవరికి చెల్లించాలో కూడ ఆదేశంలో స్పష్టముగా తెలుపవలెను.
4. ఉమ్మడి ఖాతా దారులందరూ కలిసి మాత్రమే అటార్నీని నియమించవచ్చును.
5. జారీ చేసిన చెక్కుల చెల్లింపు నిలిపి వేసే అధికారము ఖాతాదారులందరికి ఉంటుంది.
6. చెక్కుపై సంతకం చేసిన వ్యక్తి మాత్రమే చెక్కుపై జేసిన మార్పులను ధృవీకరించవలెను. మిగిలిన ఖాతా దారులు చేస్తే చెల్లదు.
7. ఉమ్మడి ఖాతాలపై ఓవర్ డ్రాఫ్టు ఇచ్చేటప్పుడు బాంకరు, ఉమ్మడి ఖాతాదారుల వ్యక్తిగత రుణ బాధ్యతను, సమిష్టి రుణబాధ్యతను నిర్ధారించుకోవాలి. అప్పుడే బాంకరుకు చెల్లించవలసిన సొమ్మును వారివద్దనుంచి ఉమ్మడిగా గాని, వ్యక్తిగతముగా గాని వసూలు చేసుకొనే అవకాశము లభిస్తుంది.
8. ఉమ్మడి ఖాతాదారులలో ఒకరుగాని అంతకంటె ఎక్కువ మందిగాని దివాలా తీస్తే బాంకరు వెంటనే ఖాతాను మూసివేయవలెను. ఉమ్మడి ఖాతాదారులు చేసిన ఆదేశం చెల్లదు. ఖాతాలో వ్యవహారాలు నిలిపివేసి, దివాలా తీసిన వ్యక్తి రుణబాధ్యతను నిర్ధారించాలి.

**13.6 ఖాతాదారుల డిపాజిట్ ఖాతాలు :** వాణిజ్య బాంకుల ప్రాధమిక విధులలో ప్రధానమైనది ప్రజలనుండి వివిధరకాల డిపాజిట్లను సేకరించుట. బాంకులు వివిధరకాల ఖాతాదారులకోసము వివిధ రకాల ఖాతాలను మరియు డిపాజిట్ పథకాలను ప్రవేశపెట్టినవి. బాంక్ ఆఫ్ ఇండియాకు డిపాజిట్లపై వడ్డీరేటు నిర్ణయించే అధికారము ఉంటుంది. ఇందుకు భారతీయ రిజర్వుబాంకు అవసరమైన మార్గదర్శక సూత్రాలను కాలానుగుణంగా జారీ చేస్తుంది. రిజర్వుబాంకు ప్రకటించిన వడ్డీరేట్లకంటె ఏ బాంకు కూడ ఎక్కువగా చెల్లించడానికి వీలులేదు. అయితే చిన్న బాంకులు మాత్రం కొద్దిగా ఎక్కువ వడ్డీ చెల్లించే అవకాశమున్నది.

వివిధ రకాలైన డిపాజిట్ ఖాతాలు : ఈ ఖాతాలను 4 రకములుగా విభజించవచ్చును. 1. ఫిక్సడ్ డిపాజిట్ ఖాతాలు 2. సేవింగ్స్ బాంకు డిపాజిట్ ఖాతాలు 3. రికరింగ్ డిపాజిట్ ఖాతాలు 4. కరెంటు డిపాజిట్ ఖాతాలు

**13.6.1 ఫిక్సడ్ డిపాజిట్ ఖాతాలు :** వీటినే స్థిర డిపాజిట్ ఖాతాలని మరియు నియమిత కాల పరిమితి డిపాజిట్లు అని కూడ అంటారు. ఈ డిపాజిట్లను నిర్ణీత కాలము అయ్యేవరకు డిపాజిట్ దారుడు బాంకునుంచి తిరిగి తీసుకోవడానికి వీలులేదు. ఇటువంటి డిపాజిట్లు మీద బాంకు ఎక్కువ వడ్డీ చెల్లిస్తుంది. మరియు వడ్డీ రేటు డిపాజిట్ కాలమును బట్టి మారుతూ వుంటుంది. బాంకు ఈ రకమైన డిపాజిట్లకోసము నగదును నిల్వ చేయవలసిన అవసరము లేదు. బాంకు దగ్గరున్న డిపాజిట్లలో సగభాగం కంటె ఎక్కువ ఈ డిపాజిట్లే వుంటాయి. ఫిక్సడ్ డిపాజిట్ ఖాతాను తెరచుట : ఫిక్సడ్ డిపాజిట్ ఖాతాను తెరిచేటప్పుడు ఒక ధరఖాస్తు ఫారమును దరఖాస్తు దారుడు బాంకరుకు ఇవ్వవలెను. అందులో దరఖాస్తు దారుని పూర్తిపేరు. చిరునామ, డిపాజిట్ చేసే మొత్తము, కాలపరిమితి, నామిని పేరు మొదలైన వివరాలు వుంటాయి. ఒక వేళ ఉమ్మడి పేర్లతో డిపాజిట్ చేస్తే గడువు తేదీన డిపాజిట్ చేసిన సొమ్మును తిరిగి పొందే అధికారము గల వ్యక్తి వివరాలు తెలియచేయాలి. డిపాజిట్ దారుల నమూనా సంతకాలను కూడ బాంకరు డిపాజిట్ దారునికి ఫిక్సడ్ డిపాజిట్ రశీదును జారీ చేస్తుంది. ఇందులో డిపాజిట్ మొత్తము కాలపరిమితి వడ్డీరేటు మొదలగు వివరములు ఉంటాయి.

వడ్డీ చెల్లించుట : ఈ డిపాజిట్లపై వడ్డీని గడువు తేది తరువాత మాత్రమే చెల్లిస్తారు. అయితే కొన్ని సందర్భాలలో 3 నెలలకు లేదా 6 నెలలకు ఒకసారి ఖాతాదారులకు వడ్డీ చెల్లించడము జరుగుతుంది. ఈ రోజులలో బాంకులు వడ్డీ కుదింపు చేయుటకు చక్రవడ్డీ పద్ధతిని ప్రవేశపెట్టినవి.

**కాలపరిమితి డిపాజిట్ రశీదును గడువుకు ముందే చెల్లింపుకు దాఖలు చేయుట :** నిర్ణీత గడువు తేదీకి ముందు బాంకరును ఖాతాదారుడు డిపాజిట్ మొత్తమును చెల్లింపు చేయుమని కోరితే బాంకరు తప్పనిసరిగా డబ్బు చెల్లించవలెననే నియమము ఏమిలేదు. అయితే బాంకరు ఖాతా దారుని కోరికను మన్నించి డిపాజిట్‌పై వడ్డీ 1% నుండి 2% వరకు తగ్గించి చెల్లిస్తారు.

**ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రుణాలు :** ఫిక్స్‌డ్ డిపాజిట్ రశీదును హామిగ ఉంచుకొని డిపాజిట్ మొత్తముపై 75% వరకు రుణమును మంజూరు చేయవచ్చును. ఇటువంటి రుణంపై వడ్డీ డిపాజిట్ల పై చెల్లించే వడ్డీకన్నా 2% ఎక్కువ ఉంటుంది.

**డిపాజిట్ రశీదు అన్యాక్రాంత పత్రము కాదు :** డిపాజిట్ రశీదుపై 'బదలాయింపుకు వీలులేదు' అని రాసి వుంటుంది. కాబట్టి దీనిని ఇతరులకు అన్యాక్రాంతము చేయలేము. కాబట్టి అట్లాంటి రశీదు ట్రాన్స్‌ఫర్ పొందిన వ్యక్తికి ట్రాన్స్‌ఫర్ చేసిన వ్యక్తికి ఉన్న హక్కుకంటె మించిన హక్కు వుండదు. డిపాజిట్ దారునికి కాకుండ డిపాజిట్ రశీదు దాఖలు చేసిన వ్యక్తికి బాంకరు సొమ్ము చెల్లిస్తే బాంకరు ప్రమాదములో పడే అవకాశము ఉన్నది. (ఫియర్స్ క్రెస్పిక్ 1843 కేసు) అయితే డిపాజిట్ రశీదుతోపాటు ఒక ధృవపత్రము రాసి దానిలో ఆ రశీదుకు సంబంధించిన క్లెయిమ్ మొత్తాన్ని ధారా దత్తము చేస్తే డిపాజిట్ రశీదును ఇతరులకు బదలాయించవచ్చును.

**ఉమ్మడి పేర్లపై డిపాజిట్లు :** ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇద్దరు లేదా ముగ్గురి పేరిట ఉమ్మడిగా వుండవచ్చును. మన దేశములోని చట్టము ప్రకారము సొమ్ము వాపసు చేసేటప్పుడు డిపాజిట్ దారులందరు డిపాజిట్ రశీదుపై సంతకము చేయాలి. ఉమ్మడి డిపాజిట్ దారులలో ఒకరు మరణిస్తే, అతని వారసుని సంతకము తప్పనిసరిగా వుండాలి.

**డిపాజిట్ రశీదుపై ఖాతాదారుల పేర్లు మార్చుట :** ఉమ్మడి డిపాజిట్ రశీదు పై నున్న పేర్లనుండి కొన్నింటిని తొలగించాలన్న, లేదా కలపాలన్న ప్రస్తుతం ఉన్న అందరి డిపాజిటర్ల సమ్మతితోనే జరగాలి.

**13.6.2 సేవింగ్స్ బాంకు డిపాజిట్ ఖాతాలు :** మధ్యస్థాయి, దిగువస్థాయి ప్రజలు తమ ప్రస్తుత ఆదాయము నుండి భవిష్యత్తు అవసరాలకు పొదుపు చేసుకోవడానికి వీలుగా బాంకులు సేవింగ్స్ డిపాజిట్ ఖాతాలను ప్రారంభించే సదుపాయమును కలుగ చేసినవి. మొదట్లో ఈ సేవింగ్స్ ఖాతాలను తపాలా ఆఫీసులలో తెరిచేవారు. సేవింగ్స్ ఖాతాల ద్వార ఎక్కువ వ్యాపారం చేయవచ్చని గ్రహించిన వాణిజ్య బాంకులు ఈ ఖాతాల ఏర్పటుకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వడం జరిగినది. ఈ ఖాతాలద్వార దేశములో ఎక్కువ మొత్తమును పొదుపు చేయడానికి అవకాశము ఏర్పడినది. ఇట్టి ఖాతాలలోని నిల్వలు తరచుగా తీయుటకు బాంకులు సమ్మతించవు. ఈ ఖాతాలపై వడ్డీని నెలల వారిగా లెక్కిస్తారు. ఆరు నెలలకొకసారి లెక్కకట్టి ఖాతాకు జమ చేస్తారు. ఈ డిపాజిట్ల పై చెల్లించే వడ్డీరేటు తక్కువగా వుంటుంది. కనీసపు నిల్వ రు.500 ఉంచితే చెక్కు పుస్తకము సౌకర్యముంటుంది. ఈ ఖాతాలో డిపాజిట్ చేసే గరిష్ట సొమ్ముపై ఏ రకమైన పరిమితి లేదు.

**13.6.3 రికరింగ్ డిపాజిట్ ఖాతాలు :** వీటినే సంచిత డిపాజిట్ ఖాతాలు అనికూడ అంటారు. ఇటీవల కాలములో రికరింగ్ డిపాజిట్ల ప్రాముఖ్యత ఎక్కువగా పెరిగినది. వీటి ప్రధాన ఉద్దేశ్యము ఖాతాదారులలో పొదుపు అలవాటును క్రమముగా పెంచుటయే. వడ్డీరేటు లెక్కింపు కూడ కాల పరిమితిపై ఆదారపడి వుంటుంది. సాదారణముగ ఈ పథకము కింద 12 నెలలనుండి 120 నెలల వరకు సొమ్మును పొదుపు చేయవచ్చును వీటిపై వడ్డీ దాదాపు ఫిక్స్‌డ్ డిపాజిట్ పై చెల్లించే వడ్డీరేటుతో సమానముగ వుంటుంది.

డిపాజిట్ కాలము పూర్తి అయిన తరువాత ఈ ఖాతాలో జమ చేసిన సొమ్ముకు వడ్డీ కలిపి బాంకు ఖాతాదారునికి చెల్లిస్తుంది. అవసరమైతే డిపాజిట్ చేసిన సొమ్ముతో 75% రుణసౌకర్యమును కూడ బాంకునుండి పొందవచ్చును. ఒకవేళ నెలసరి వాయిదాలు చెల్లించలేక, ఖాతాను మధ్యలో ఆపివేసినట్లయితే అంతవరకు చెల్లించిన మొత్తాన్ని తక్కువ వడ్డీతో బాంకు చెల్లిస్తుంది.

ఈ ఖాతాను ప్రారంభించినప్పుడు డిపాజిట్ దారునికి ఒక పాస్ పుస్తకము ఇస్తుంది. అందులో ఖాతాదారుని పేరు. అడ్రసు, నెలవారి చెల్లించే వాయిదా సొమ్ము, కాలపరిమితి ఉంటాయి. కాల పరిమితి పూర్తి అయిన తరువాత పాస్ పుస్తకములో రెవిన్యూ స్టాంపును అతికించి, సంతకం జేసి బాంకుకు ఇస్తే నమూనా సంతకముతో సరిపోల్చి, సరిగ్గా ఉంటే బాంకరు అతనికి పైకము చెల్లిస్తుంది.

**13.6.4 కరెంటు ఖాతాలు :** వ్యాపార సంస్థలు, వ్యాపారేతర సంస్థల సౌలభ్యం కొఱకు బాంకులు కరెంటు ఖాతా సౌకర్యమును కల్పిస్తున్నవి. ఖాతాదారుడు యిలాంటి ఖాతాలలో ఎన్ని సార్లయినా వేయవచ్చును, అలాగే ఎన్ని సార్లయినా తీయవచ్చును.

**కరెంటు ఖాతాల లక్షణములు :**

1. పెద్ద పెద్ద ఖాతాదారులైన పెద్ద వ్యాపారస్తులకు, జాయింట్ స్టాకు కంపెనీలకు, ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలకు సేవ చేయుట ఈ కరెంటు ఖాతాల ప్రధాన ఉద్దేశ్యము.
2. కరెంటు డిపాజిట్లు కోరగానే చెల్లించేవి. కాబట్టి ఈ ఖాతా నిల్వపై బాంకులు వడ్డీని చెల్లించవు.
3. కరెంటు ఖాతాదారులకు బాకులు సేవలందించినందుకుగాను సర్వీసుచార్జీలు వసూలు చేస్తారు. సంవత్సరమునకు ఒకసారి ఈ చార్జీలను ఖాతాదారుల ఖాతాకు డెబిట్ చేస్తుంది.
4. ఖాతాదారులకు బాంకులు కొన్ని సదుపాయాలను కలుగచేస్తుంది. అవి ఏవనగా ఎ) తగినంత హామితో ఓవర్ డ్రాఫ్టు సౌకర్యమును కలుగ చేస్తుంది. బి) బాంకులు రుణాలను, అడ్వాన్సులను అనుమతిస్తాయి. ఈ మొత్తమును నగదుగా చెల్లించకుండ, ఖాతాదారుల ఖాతాకు జమ చేస్తాయి. సి) కరెంటు డిపాజిట్ ఖాతాదారుల తరుపున మూడవ పార్టీ చెక్కులను, ఎండార్స్‌మెంట్లు చేయబడిన చెక్కులను కూడ వసూలు చేస్తాయి.

**13.6.5 సేవింగ్స్ ఖాతాలు, కరెంటు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్ల ఖాతాలను ప్రారంబించే విధానము :**

1. బాంకులు సప్లయిచేసే దరఖాస్తు పత్రాన్ని పూర్తి చేయ్యడం ద్వార దరఖాస్తు చేయవలసి వుంటుంది.
2. కాబోయే ఖాతాదారుని యోగ్యతను గురించి తెలుసుకొనుటకు బాంకులో ఖాతా కల్గియున్న ఒకరు లేదా ఇద్దరు వ్యక్తుల చేత పరిచయ సంతకము చేయించవలెను.
3. కాబోయే ఖాతాదారుని నమూనా సంతకాలను బాంకుకు పంపవలెను.
4. బాంకు ఖాతాదారుని నుండి 3 పాస్‌పోర్టు సైజు ఫోటోలను తీసుకుంటుంది. ఒకటి ఖాతాదారునికి సంబందించిన లెడ్జరు పేజిలో రెండవది ఖాతాదారునికి సంబందించిన కార్డుపై మూడవది ఖాతాదారునికి ఇచ్చే పాస్‌బుక్‌లోపల అతికిస్తారు.

మొట్టమొదటి దరఖాస్తు దారుడు కొంతనగదు బాంకులో జమచేయడం ద్వార బాంకుకు ఖాతా దారుడు అవుతాడు. కరెంటు ఖాతా ఏర్పాటు చేసిన తరువాత బాంకరు ఖాతాదారునికి పాస్‌బుక్, చెక్కు పుస్తకము మరియు జమచేసే చీటీల పుస్తకము అందజేస్తాడు. సొమ్ము బాంకులో చెల్లించుటకు జమచేస్తే పోటీల పుస్తకము ను ఉపయోగించవలెను. ఖాతాదారుడు బాంకు నుండి డబ్బు తీసికొనుటకు చెక్కు పుస్తకమును ఉపయోగించవలెను. ఎప్పటికప్పుడు ఖాతాలోని నిల్వలను, వ్యవహారాలతో సమన్వయము చేసికొనుటకు పాస్‌బుక్ ఉపయోగపడుతుంది.

**13.7 నిద్రించు ఖాతాలు :** చాలకాలముగ లావాదేవీలు నిర్వహించకుండ ఉన్న ఖాతాను నిద్రించు ఖాతాలంటారు. చట్ట ప్రకారం ఇటువంటి ఖాతాలకు ఏ కాలపరిమితి లేనప్పటికి ప్రతిబాంకు తన సొంత విదానమును రూపకల్పన చేసికొన్నది. ఒక ఖాతా నిద్రించు ఖాతా కావడమునకు చాల కారణములు గలవు.

1. డిపాజిట్ దారుడు బాంకుకు తన అడ్రసు మార్పును తెలియజేయకుండ ఒక ప్రదేశమునుండి మరియొక ప్రదేశమునకు వెళ్లినట్లయితే
2. డిపాజిట్ దారుడు తన దగ్గరవున్న పాస్‌బుక్‌ను పోగొట్టుకొనుట లేదా ఫలానా బాంకులో తన ఖాతా ఉన్నదనే విషయమును మరచిపోవుట
3. కొన్ని సందర్భములలో డిపాజిట్ దారుడు చనిపోయిన సంగతి బాంకరుకు తెలియకపోవుట.

నిద్రించు ఖాతాలపై ఎటువంటి నియంత్రణ లేదు. ఇటువంటి ఖాతాలను సులభముగ మోసము చేయవచ్చును నిద్రించు ఖాతాలలో జరిగే మోసాలను నియంత్రణ చేయుటకు అటువంటి అన్ని నిద్రించు ఖాతాలను ఒకే అవ లోకి మార్చాలి. ఈ అవర్జాలో ఆ బాంకులో వుండే ఇటువంటి డిపాజిటర్ల పేర్లు మరియు వారి నిల్వ మొత్తముకు చూపుతూ ఒక లిష్టు తయారుచేయాలి. ఫైలునుండి వారు సంతకం చేసిన కార్డులను తీసి మరియొక ఫైలునూ వుంచాలి. ఆ ఫైలును ఇరువురి నియంత్రికుల పర్యవేక్షణలో ఒక లాకరులో వుంచాలి. చాలకాలము తరువాత ఇలాంటి ఖాతాలను తిరిగి ఖాతాదారుడు నిర్వహిస్తానంటె మొదటి నిద్రించు ఖాతాలు చూసే నియంత్రికుని అనుమతితో మాత్రమే ఇట్టి ఖాతాలను పునఃనిర్వహించేందుకు వీలుంది.

**13.8 బాంకు డిపాజిట్లను భీమా చేయుట :** పార్లమెంటులో చట్టం ద్వార బాంకు డిపాజిట్లను భీమా చేసే పథకము జనవరి 1, 1962 నుండి డిపాజిట్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను స్థాపించడముతో ఆరంభమైంది. ప్రస్తుతము దీనిని 15 జూలై 1978 నుండి డిపాజిట్ మరియు క్రెడిట్ గ్యారంటి కార్పొరేషన్‌గ పిలుస్తున్నారు. ప్రస్తుతం ఈ కార్పొరేషన్ డిపాజిట్లు ఇన్సూరెన్సు మరియు క్రెడిట్ గ్యారంటి పథకములను నిర్వహిస్తున్నది దక్షిణ భారత దేశములోని పాలమ్ సెంట్రల్ బాంకు అనే ఒక షెడ్యూలు బాంకు దివాలా తీయడముతో డిపాజిట్ ఇన్సూరెన్సు ఆవశ్యకత ఏర్పడినది.

**ఈ పథకము యొక్క లక్షణములు :**

1. ఈ పథకములో అన్ని షెడ్యూల్డు బాంకులు, నాన్ - షెడ్యూలు బాంకులు మరియు ఇన్‌సూర్డ్ బాంకులు చేర్చబడినవి.
2. ఈ పథకము ప్రకారం ప్రతి డిపాజిట్ దారుడు రు.30,000/- వరకు బాంకు దివాలా తీసినను వాపసు పొందుతాడు. 1-1-1980 వరకు ఈ మొత్తము రు.20,000/- గా వుండేది. అనగా 1-1-80 నుండి రు. 20,000/- నుండి రు. 30,000/- ల వరకు పెంచినారు.
3. కేంద్ర, ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వ, అంతర్జాతీయ ప్రభుత్వాలు మరియు వాణిజ్య బాంకులు మినహా ఇన్‌స్యూర్డు బాంకులలోని డిపాజిటు దారులకు వర్తిస్తుంది.
4. భీమా జేసిన బాంకి దివాలా తీస్తే, డిపాజిట్‌దారుడు డిపాజిట్ మరియు క్రెడిట్ గ్యారంటి కార్పొరేషన్ ద్వార వాపసు పొందవచ్చును.
5. బాంకులు ఇట్టి భీమాపై ప్రతి రు. 100/- ల డిపాజిట్‌పై సంవత్సరానికి నాలుగు పైసలు భీమా ప్రీమియం చెల్లించాలి. డిపాజిట్ దారుడు ఏమి చెల్లించనవసరము లేదు.

**13.9 బాంకు పాస్ బుక్ :** ఒక వ్యక్తి బాంకులో ఖాతా ప్రారంభించిన తరువాత అతనికి బాంకరు పాస్ బుక్ ఇస్తాడు ఈ పుస్తకములో బాంకరు ఖాతాదారుని మధ్య జరిగిన వ్యవహారములను బాంకరు నమోదు జేస్తాడు. అప్పుడప్పుడు ఖాతాదారుడు పాస్ బుక్‌ను బాంక్‌కు పంపిస్తే, అప్పటి వరకు జరిగిన వ్యవహారాలను బాంకరు పాస్‌బుక్‌లో నమోదు చేసి ఖాతాదారునికి వాపసు పంపుతాడు. ఈ బుక్ బాంకరు ఖాతాదారు మధ్య తరుచుగా తిరుగుతుంది కాబట్టి దీనిని పాస్‌బుక్ అని పేరు వచ్చినది.

వ్యాపార సంస్థలలో బాంకరు మరియు ఖాతాదారు వ్యవహారాలు ఎక్కువగా వున్నట్లయితే నగదు పుస్తకము పాస్‌బుక్ నిల్వను సరిజూచుటకు బాంకు నిల్వల సమన్వయ పట్టికను తయారు చేస్తారు. పాస్‌బుక్‌లో ఖాతా వ్యవహారాలను రెండు రకాలుగా రాయవచ్చును. మొదటి పద్ధతిలో బాంకు పుస్తకాలలో ఖాతాదారుని ఖాతా ఏ విధముగా ఉంటుందో ఆ విధముగానే రాస్తారు. ఇది పురాతన పద్ధతి. రెండవ పద్ధతిలో ఖాతాదారుడు డిపాజిట్ చేసిన మొత్తాలు డిబెట్‌వైపున, వాపసు తీసుకొన్న మొత్తాలు క్రెడిట్ వైపున రాయడం జరుగుతుంది. ఈ విధముగా రాయడం వలన ఖాతాదారు తన బాంకు ఖాతాలో పాస్‌బుక్‌ను సరిపోల్చి చూసుకొనుటకు వీలుగా వుంటుంది. ఈ మధ్య కాలములో విడికాగితాల అవర్జాలు, అకౌటింగ్ యంత్రాలు బాంకులలో ఎక్కువగా ఉపయోగించడం చేత ఖాతాదారు ఖాతాల నికళ్ళను విడికాగితాల మీద రాసి వారికి పంపిస్తున్నారు. బాంకు పుస్తకాలలో ఉన్న ఖాతాలను ఫోటోగ్రాఫ్‌లు తీసి ఖాతాదారుకు పంపడం మరొక ఆధునిక పద్ధతి. ఏ పద్ధతి అనుసరించిన ఒక్కటె.

పాస్‌బుక్ నమూన

| తేది | వివరాలు | డిపాజిట్ జేసిన మొత్తము | తీసుకొన మొత్తము | కె.ఆర్. డి.ఆర్. | నిల్వ | సంతకము |
|---|---|---|---|---|---|---|
| 2003 | నిల్వ | | | సి.ఆర్. | 8000 | |
| మే24 | వికాస్ టెండర్స్ చెక్కునెం.437662 | | 2500 | సి.ఆర్ | 5500 | |
| జూన్ 2 | ఆనంద చెక్కు నెం. 437664 | | 1400 | సి.ఆర్ | 4100 | |
| జూన్ 26 | కాస్ | 3400 | | సి.ఆర్ | 7500 | |

**పాస్‌బుక్ అంగీకరించిన కాతా అవుతుందా ?**

పాస్‌బుక్‌ను బాంకరు ఖాతాదుకు పంపినప్పుడు ఆ ఖాతాలో ఉన్న నిల్వను ఇరుపార్టీలు అంగీకరించినట్లా ? కాదా అనే ప్రశ్న ఉదయించవచ్చును. సర్ జాన్ పేజెట్ ప్రకారము "పాస్‌బుక్‌లో రాసిన బాంకుకు ఖాతాదారుడికి మధ్య జరిగిన వ్యవహారాలు నిర్వివాదమైనవని ప్రశ్నించడానికి వీలులేని రికార్డు. పాస్‌బుక్ ఖాతాదారునికి పంపినప్పుడు అందులో రాసిన వ్యవహారాలను చూడడానికి ఖాతాదారునికి అవకాశం కలుగుతుంది. అట్లా చూసిన తరువాత ఏ అభ్యంతరము తెలియజేయకపోతే ఆ వ్యవహారాల గురించి తరువాత ప్రశ్నించడానికి ఖాతాదారునికి హక్కువుండదు. కాని ఈ అభిప్రాయముతో కోర్టు తీర్పులు ఏకీభవించలేదు.

కెప్టిగెల్లారబ్బర్ ఎస్టేట్‌కంపెని వియస్ నేషనల్ బాంకు ఆఫ్ ఇండియాలో ఖాతాదారునికి బాంకు పాస్‌బుక్ పంపిన తరువాత ఏ విధమైన అభ్యంతరము బాంకుకు తెలియజేయకుండ వున్నంత మాత్రాన అందులో రాసిన వ్యవహారాలను అంగీకరించినట్లుగాని, అందులోని వ్యవహారాలకు ఆ తర్వాత అభ్యంతరము తెలియజేయడానికి హక్కు వదులుకున్నట్లు గాని అర్థంకాదని తీర్పు చెప్పారు.

పాస్‌బుక్‌లో తప్పుగా వ్రాసిన పద్దులను రెండు రకాలుగా పరిశీలించవచ్చును.

1. ఖాతాదారునికి అనుకూలముగా రాసిన పద్దులు

2. బాంకరుకు అనుకూలముగా రాసిన పద్దులు

**1. ఖాతాదారునికి అనుకూలముగా రాసిన పద్దులు :**

పాస్‌బుక్‌లో జూపిన నిల్వ సరియైనదనే నమ్మకముతో ఖాతాదారుడు చెక్కులను రాస్తే ఆ చెక్కులను బాంకరు చెల్లించవలసి వుంటుంది. కాని బాంకరు తెలియపరచిన నిల్వ సరియైనదని నమ్మి ఖాతాదారు చెక్కురాసేలోపుగ బాంకరు తప్పును తెలిసికొని అసలు నిల్వను ఖాతాదారునికి తెలియబరచి తప్పును సవరించుకొనవచ్చును. కాని ఈ తప్పును ఖాతాదారు రాసిన చెక్కులను పాస్‌బుక్‌లో ఉన్న నిల్వ మేరకు బాంకరు చెల్లించాలి. ఖాతాదారు ఖాతాలో పొరపాటున సొమ్ము జమకట్టడం జరిగితే ఆ విషయము తెలిసిన వెంటనే బాంకరు ఖాతాదారుకు తెలియబరచి తప్పును సవరించుకొవాలి. ఆలస్యమైనకొంది బాంకరుకు నష్టము ఏర్పడుతుంది.

**2. బాంకరుకు అనుకూలముగా రాసిన పద్దులు :**

ఖాతాదారుఖాతాకు జమచేయవలసిన సొమ్ము జమచేయడము బాంకరు మరచిపోతే సాదారణముగా ఆ పొరపాటును సవరించడానికి బాంకరు నిరాకరించడము జరుగదు. ఆ పొరపాటును ఖాతాదారుడు బాంకరు దృష్టికి తీసుకరాక పోయినంతమాత్రాన ఖాతాదారు హక్కుకు భంగం కలగదు. కాని వరుసగా కొన్ని చెక్కుల మీద ఫోర్జరీ జరిగినప్పుడు, అట్టిసొమ్ము ఖాతాదారు ఖాతాకు

ఖర్చురాయడం జరిగినప్పుడు, పాస్‌బుక్‌లో రాసిన ఖర్చుపద్దుల విషయములో ఖాతాదారు ఎన్నడూ ఎట్లాంటి అభ్యంతరము తెలియచేయకుండా వుంటె, ఆ నష్టాన్ని ఖాతాదారు భరించవలెనా లేదా బాంకరు భరించవలెనా అనే ప్రశ్నకు సమాదానము కోర్టు తీర్పులను బట్టి చెప్పడం కష్టము. ఈ విషయములో చట్టము అనిశ్చితంగా వున్నది. బాంకరు పంపిన పాస్‌బుక్ నిల్వను అంగీకరించిన ఖాతాగా పరిగణించడానికి రుజువైతే అందులో వున్న పద్దుల విషయములో ఖాతాదారుడు అలక్ష్యంతో ప్రవర్తించినా లేదా అట్టి ప్రవర్తనను బట్టి బాంకరు తప్పుదారిపట్టినప్పుడు కూడా ఖాతాదారుడు ఆ పద్దులకు అభ్యంతరము పెట్టడానికి వీలులేదు. ఏఏ సందర్భాలలో ఖాతాదారుడు అలక్ష్యంగా వ్యవహరించాడు అనేది ఆయా పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. చాటర్టన్ వియస్. లండన్ కౌంటి బాంకు కేసులో పాస్‌బుక్‌లో రాసిన పద్దుల విషయములో అభ్యంతరము చెప్పకపోవడముగాని, ఆ పద్దులను పరిశీలించకపోవడముగాని ఖాతాదారుని అలక్ష్యముగా పరిగణించరాదని తీర్పుఇచ్చినది.

కొన్ని సందర్భాలలో కోర్టు తీర్పులు బాంకరుకు సుముఖముగా వున్నవి. బాలక్రిష్ణ ప్రామాణిక వియస్. భవానిపూర్ బాంకింగ్ కార్పోరేషన్ కేసులో ఖాతాదారు పాస్‌బుక్‌లోని పద్దులను అతి శ్రద్ధగా పరిశీలించే వాడని రుజువైనప్పుడు అతడు అభ్యంతరం చెప్పకపోవడము వలన బాంకు చక్రవడ్డీని వసూలు చేయడానికి అతను అంగీకరించాడని కోర్టు అభిప్రాయపడింది.

పైన పేర్కొన్న విషయాలను బట్టి పాస్‌బుక్‌లో రాసిన పద్దులను ఖాతాదారుడు అభ్యంతరము చెప్పకపోతే అతని బాధ్యతవున్నదో లేదో నిర్ధారణగా చెప్పడానికి వీలులేదు. కాబట్టి బాంకరు పాస్‌బుక్ తన దగ్గరకు రాగానే అందులోని పద్దులన్నీ రాసి ఖాతాదారుకి పంపించి అందులో వ్యత్యాసము వుంటె తెలియపరచమని ఖాతాదారుని అడగడము మంచిది. పొరపాట్లు ఉంటె బాంకరు ఖాతాదారుని తెలియపరచి సవరణలను చేయాలి. ఈ మధ్య బాంకులు పాస్‌బుక్ ద్వార కాకుండ నివేదికలను ఖాతాదారులకు పంపిస్తూ, అట్టి నివేదికలలో ఖాతా వ్యవహారాలు సక్రమముగా ఉన్నాయనే సర్టిఫికేట్‌ను ఖాతాదారు నుండి తీసికొంటున్నాయి.

## 13.10 స్వయం మదింపు ప్రశ్నలు

### 5 మార్కుల ప్రశ్నలు

1. బాంకరు
2. ఖాతాదారు
3. సాదారణ లీను
4. డార్మంట్ ఖాతాలు  లేదా నిద్రించే ఖాతాలు
5. ప్రత్యేక లీను
6. వివిధ ఖాతాలను కలుపుట

### 10 మార్కుల ప్రశ్నలు

1. బాంకరుకు ఖాతాదారుకు గల సాదారణ సంబంధము
2. బాంకరుకు ఖాతాదారుకు గల ప్రత్యేక సంబంధము
3. బాంకరు - ఖాతాదారుని మధ్యగల సంబంధము రుణగ్రస్తుడు రుణదాతకు మధ్యగల సంబంధము వంటిది విశ్లేషించండి.

### 20 మార్కుల ప్రశ్నలు

1. బాంకరు మరియు ఖాతాదారును నిర్వచింపుము ? ఖాతాదారుకు మరియు బాంకరుకు మధ్యగల సంబందాన్ని వివరించండి?
2. బాంకరుకు అతని ఖాతాదారుకు మధ్యగల సాదారణ ప్రత్యేక సంబంధాలను వివరింపుము ?

3. ప్రత్యేక తరగతికి చెందిన ఖాతాదారులనగా ఎవరు ? వివాహిత స్త్రీలకు సంబందించి ఏదైన ఖాతా తెరచు సందర్భములో పాటించవలసిన పద్దతిని వివరింపుము ?

4. మైనరు, ప్రయివేటు కంపెనీల పేర ఖాతాలను ప్రారంబించునప్పుడు బాంకరు తీసికొవలసిన జాగ్రత్తలు ఏవి ?

5. ఈ క్రింది ఖాతాపేర్ల మీద ఖాతాలు తెరచునప్పుడు బాంకరు తీసికొనవలసిన జాగ్రత్తలు ఏవి ?

ఎ) భాగస్వామ్య సంస్థలు బి) సమిష్టి హిందూ కుటుంబము
సి) అటార్నలు డి) పరిపాలకులు

6. బాంకరు లీన్‌ను వివరించి దానిని ఏ సందర్భాలలో చెలాయించవచ్చును.

7. ఇటీవలకాలములో డిపాజిట్ల సేకరణలో వచ్చిన కొత్తపోకడలను వివరించుము.

8. సేవింగ్స్ ఖాతా అనగానేమి ? మైనరు యొక్క సేవింగ్స్ ఖాతా తెరచుటలో బాంకరు అవలంబిచవలసిన ముఖ్యాంశాములెవ్వి?

9. బాంకు డిపాజట్లను భీమా చేయుటలో ఇమిడి వున్న పద్దతిని సవివరముగ పరిశీలించండి.

10. పాసు పుస్తకములోని పద్దులు బాంకరును, ఖాతాదారును ఎంతవరకు బద్దులుగా చేయగలవో చర్చించుము.

**సిఫారసు చేయబడిన పుస్తకాలు :**


1. బాంకింగ్ సిద్ధాంతము-ఆచరణ : ఆచార్య కె.వి.రావు, డా॥ వై.యస్. కిరణ్మయి

2. బాంకింగ్ విత్త వ్యవస్థలు : తెలుగు అకాడమి

3. బాంకింగ్ విత్త వ్యవస్థలు : కళ్యాణి పబ్లిషర్స్

4. బాంకింగ్ విత్త వ్యవస్థలు : జై భారత్ పబ్లిషర్స్

5. బాంకింగ్ లా అండ్ ప్రాక్టిసు : యస్.యన్. మహేశ్వరి

6. Law and practiceni India Tannan's Banking

7. Banking law and practice. B.M. Lall Nigam


- Dr. D. Ramuzu

**పాఠము - 14**

# అన్యాక్రాంత యోగ్యతాపత్రాలు

## (Negotiable Instruments)

14.1 ఉపోద్ఘాతము

14.2 నిర్వచనాలు

14.3 ముఖ్య లక్షణాలు

14.4 రకాలు

14.5 చెక్కు

14.6 వినిమయ బిల్లు

14.7 ప్రామిసరినోటు

14.8 వినిమయ బిల్లు - చెక్కుకు తేడాలు

14.9 వినిమయ బిల్లు - ప్రామిసరి నోటుకు తేడాలు

14.10 ప్రామిసరినోటు - చెక్కుకు తేడాలు

14.11 క్రాసింగ్

14.12 ఎండార్స్‌మెంట్

14.13 ఎండార్స్‌మెంట్ - బాంకర్ బాధ్యత.

**14.1. ఉపోద్ఘాతము :** వాణిజ్య కార్యకలాపాలలోను, ద్రవ్యసంబంధమైన లావాదేవీలలోను అన్యాక్రాంత యోగ్యతా పత్రాలను చాలా తరచుగా ఉపయోగిస్తున్నారు. అన్యాక్రమణ అనగా 'ఒక వ్యక్తినుండి వేరొకరికి కొంత ప్రతిఫలమునకు బదిలీ చెయ్యదగినదని' పత్రము అనగా ఒక వ్యక్తికి అనుకూలముగా ఒక హక్కులను సృష్టించగల లిఖితపూర్వక పత్రము'' అని అర్థము. ఈ అన్యాక్రాంత పత్రము ఎవరికైతే బదలి చేయబడినదో అతనికి ఆ సొమ్మును స్వీకరించే అధికారము మరియు ఆ పత్రాన్ని మళ్ళీ బదిలి చేసే హక్కు సంక్రమిస్తాయి. అన్యాక్రాంత యోగ్యతా పత్రాలలో ప్రముఖముగా జెప్పుకోదగినవి ఏవనగా చెక్కులు, ప్రామిసరినోట్లు, బిల్లులు మొదలైనవి.

**14.2. నిర్వచనాలు :** నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టము 1981. సెక్షను 13 (1) ప్రకారము అన్యాక్రాంత యోగ్యతా పత్రము అంటే ఆదేశము ప్రకారము లేదా బేరర్‌కు చెల్లించదగిన ఒక ప్రామిసరినోటు, బిల్లు లేదా చెక్కు.

ఈ నిర్వచనము ప్రకారము అన్యాక్రాంత పత్రము అంటే ఏమిటో తెలియజేసింది కాని వాటిలో ఏవేవి ఇమిడి ఉంటాయో తెలియజెయ్యలేదు. కాబట్టి అన్యాక్రమణకు సంబంధించిన షరతులను తృప్తిపరచిన ఏ పత్రాలనైనా సెక్షను 13 లో ఇచ్చిన అన్యాక్రమణ పత్రాల జాబితాకు కలుపవచ్చును.

## 14.3. అన్యాక్రాంత పత్రాలు - ముఖ్య లక్షణాలు :

1. **రాతపూర్వకముగా ఉండవలెను:** ఈ పత్రము రాత పూర్వకముగా వుండాలి. నోటిమాట పూర్వకముగా వుండకూడదు. చదవడానికి వీలుగా ఉండాలి.

2. **సంతకము :** పత్రాన్ని తయారు చేసే వ్యక్తియొక్క సంతకము దానిపై వుండాలి. చదువురాని వారైతే వేలిముద్ర వేయాల్సి వుంటుంది. సంస్థలైతే అధికారం పొందిన వ్యక్తి సంతకం చెయ్యాల్సి వుంటుంది. అంతేగాక సంతకాన్ని ధృవీకరిస్తూ అధికార ముద్ర కూడా వేయాల్సి వుంటుంది.

3. **కర్త మరియు స్వీకర్తల పేర్లు :** పత్రముపై తప్పనిసరిగా కర్త మరియు స్వీకర్తల పేర్లు ఉండాలి.

4. **బదిలీ :** ఈ పత్రాలను ఇతరులకు తేలికగా బదిలి చేయవచ్చును. అవి బేరర్ పత్రాలైతే బదలి చేయదలచుకొన్న వ్యక్తికి అందిస్తే సరిపోతుంది. ఆర్డరు పత్రాలైతే, ఎండార్సుచేసి, బదిలి చేయాల్సి ఉంటుంది. స్థిరాస్థుల బదిలీలలో వలె బదిలి పత్రము ఇక్కడ అవసరము కాదు.

5. **వసూలు:** బిల్లును ఎవరు కల్గి వుంటె వారు స్వీకర్తపై కోర్టులో వసూలుకై కేసు వేయవచ్చును.

**14.4. అన్యాక్రమణ పత్రాలలో రకాలు:** అన్యాక్రమణ పత్రాల చట్టము సెక్షను 13 ప్రకారం కేవలం వినిమయ బిల్లులు, చెక్కులు, ప్రామిసరి నోట్లును మాత్రమే అన్యాక్రమణ పత్రాలుగా పేర్కొన్నది. ఈ చట్టము ప్రకారం. అన్యాక్రాంత పత్రమునకు ఉండవలసిన లక్షణాలను సూచించినప్పటికి సాంప్రదాయ సిద్ధముగా, బదిలి యోగ్యతను కలిగి ఉంటే ఈ క్రింద పేర్కొన్న పరపతి పత్రాలను అన్యాక్రాంత పత్రాలంటారు.

1. వినిమయ బిల్లులు.
2. ప్రామిసరి నోట్లు.
3. చెక్కులు.
4. హుండీలు.
5. బాంకు డ్రాఫ్టులు.
6. ప్రయాణీకుల చెక్కులు.
7. ప్రభత్వ సెక్యూరిటీలు.
8. డివిడెండు వారంట్లు.
9. వాటా వారెంట్లు.
10. సర్క్యులర్ నోట్లు.
11. బేరర్ డిబెంచర్లు.

అన్యాక్రాంత పత్రాలను ఈ దిగువ రెండు విధాలుగా విభజన జేయవచ్చును.

1) **చట్టపూర్వక అన్యాక్రాంత పత్రాలు :** వినిమయ పత్రాలు, ప్రామిసరినోట్లను అన్యాక్రాంత పత్రాలుగ అన్యాక్రాంత పత్రాల చట్టము 1881 లో పేర్కొనడంచేత వాటిని చట్టపూర్వక అన్యాక్రాంత పత్రాలు అని పిలవడం జరుగుతుంది.

2) **సాంప్రదాయ పూర్వక అన్యాక్రాంత పత్రాలు:** వ్యాపార సాంప్రదాయాలు లేదా విస్తృత వినియోగం మూలముగా నెగోషియబులిటి లక్షణాన్ని సంతరించుకొన్న పత్రాలను సాంప్రదాయపూర్వక అన్యాక్రాంత పత్రాలు అంటారు. భారత ప్రభుత్వ ప్రామిసరినోట్లు, షాజోగ హుండీలు, డెలివరీ ఆర్డర్లు, రైల్వే రశీదులను సాంప్రదాయ పూర్వక నెగోషియబుల్ పత్రాలుగా పేర్కొనవచ్చును.

**14.5. చెక్కు :** నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టము సెక్షన్ 6 ప్రకారం అడిగిన తక్షణమే డబ్బును చెల్లించవలసినదిగా ఒక నిర్దిష్టమైన బాంకరును ఆజ్ఞాపించే వినిమయ పత్రమును చెక్కు అంటారు.

**14.5.1. చెక్కులోని ముఖ్యాంశాలు:**

1. ఇది కూడ వినిమయ పత్రమే.
2. ఇందులో డ్రాయి మాత్రం నిర్దిష్టమైన బాంకరు అయివుండాలి.
3. అడిగిన తక్షణము డబ్బును ఇవ్వవలసినదిగా ఆజ్ఞవుండాలి.

దీనిని బట్టి అన్ని చెక్కులు వినిమయ పత్రాలేకాని అన్ని వినిమయ పత్రాలు చెక్కులు కాజాలవని తెలుస్తుంది.

**14.5.2. చెక్కు నమూనా**

State Bank of India
Nagarjuna Nagar.

..........2004.

No. 567892

Pay to ........................................

........................................ or Bearer

Rupees ........................................

Rs..........

Savings Bank Account No.

**14.5.3. చెక్కు యొక్క ముఖ్య లక్షణములు :**

1. చెక్కు లిఖిత పూర్వక పత్రముగా ఉండాలి.
2. చెక్కును జారీ చేసేవ్యక్తి బాంకరును చెల్లింపు కోసము ఆదేశించడము జరుగుతుంది.

3. చెక్కులోని ఆదేశముచే షరతుగా ఉండవలెను. ఎటువంటి షరతులకు లోబడి వుండకూడదు.

4. చెక్కును నిర్ధిష్టమైన బాంకరు మీద మాత్రమే జారీ చేయాల్సి వుంటుంది.

5. చెక్కుమీద నిర్ధిష్టమైన సొమ్మును పేర్కొనాలి. అవి అంకెలలోను అక్షరాలలోను ఒకే విధముగా వుండాలి.

6. చెక్కు అడిగిన వెంటనే సొమ్ము చెల్లించడానికి ఆదేశము

7. చెక్కుపై గ్రహీత పేరు నిర్ధిష్టముగా వుండవలెను. చెక్కుమొత్తాన్ని పొందే వ్యక్తిని గ్రహీత అంటారు.

**14.6. వినిమయ బిల్లులు :** నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటు చట్టములోని సెక్షన్ 5 ప్రకారం “నిర్ధిష్టమైన వ్యక్తికిగాని అతని ఆర్డరు పొందిన వానికి లేదా ఆ పత్రము కలిగివున్నవానికిగాని నిర్ధిష్టమైన సొమ్ముమొత్తాన్ని చెల్లించాల్సిందిగా ఆదేశిస్తూ బిల్లుకర్త సంతకం చేసిన రాతపూర్వకమైన బే షరతుపత్రమే వినిమయ బిల్లు.”

ప్రతి బిల్లుకు సహజముగా ముగ్గురు పార్టీలు వుంటారు.

1. బిల్లు కర్త. 2. బిల్లు స్వీకర్త. 3. బిల్లు గ్రహీత.

**1. బిల్లుకర్త:** బిల్లును వ్రాసే వ్యక్తిని బిల్లుకర్త అంటారు.

**2. బిల్లు స్వీకర్త:** బిల్లు ఎవరిమీద అయితే వ్రాయబడుతుందో అతనిని బిల్లు స్వీకర్త అంటారు. ఇతడు బిల్లుపై సంతకం జేసి తన స్వకృతిని తెలియజేస్తాడు.

**3. బిల్లు గ్రహీత:** గడువు తేదీన సొమ్ము ఎవరికైతే చెల్లింపబడుతుందో అతనిని బిల్లు గ్రహీత అంటారు. ఎక్కువ సందర్భాలలో బిల్లుకర్త బిల్లు గ్రహీత అవుతాడు.

**14.6.1 వినిమయబిల్లు - లక్షణాలు :**

వినిమయ బిల్లులు ఈ క్రింది లక్షణములను కలిగి వుండవలెను.

1. బిల్లు రాత పూర్వకముగా వుండవలెను.
2. బిల్లుపై బిల్లుకర్త సంతకము తప్పనిసరిగా వుండవలెను.
3. ప్రతిబిల్లులో మూడు పార్టీలు వుంటాయి. వీరు కర్త. స్వీకర్త. మరియు గ్రహిత. ఈ ముగ్గురిని స్పష్టముగా గుర్తించే విధముగా ఉండవలెను.
4. బిల్లులో చెల్లించాల్సిన మొత్తము స్పష్టముగా, నిర్ధష్టముగా పేర్కొనాలి.
5. చట్టము ప్రకారం బిల్లుపై తగినన్ని రెవెన్యూ స్టాంపులను అతికించాలి.
6. బిల్లుయొక్క గడువు తేదీన బే షరతుగా సొమ్మును నగదు రూపములో చెల్లిస్తాననే వాగ్దానము వుండవలెను.

**14.6.2. బిల్లుయొక్క నమూనా :**

రూ. 10,000 నాగార్జున నగర్

.............2004.

శ్రీ రాజశేఖర్ గారికి గాని వారిచే అనుమతి పొందిన వ్యక్తిగాని నాకు ముందుగా ముట్టిన ప్రతిఫలానికి అక్షరాల పదివేలరూపాయలు. 3 మాసాల తరువాత చెల్లించగలనని ఇందు మూలముగా వాగ్దానము జేయుచున్నాను.

రాజశేఖర్ కర్నూలు చక్రధర్.

## 14.7. ప్రామిసరినోటు :

**14.7.1. నిర్వచనము:** నెగోషియన్‌బుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం సెక్షన్ 4 ప్రకారం "ఒకవ్యక్తి ఇంకొక వ్యక్తికిగాని అతని ఆర్డరు పొందిన వానికి గాని ఆ పత్రము స్వాధీనములో ఉన్నవానికి గాని అడిగిన తక్షణము బే షరతుగా నిర్దుష్టమైన సొమ్మును చెల్లిస్తానని సంతకం చేసిన పత్రమును ప్రామిసరినోటు అంటారు.

**14.7.2. లక్షణాలు:**

1. ఇది రాత పూర్వకముగా వుండాలి.
2. సొమ్ముచెల్లిస్తానని స్పష్టమైన వాగ్దానము లేదా బాధ్యతను వ్యక్తీకరించాలి.
3. ఇలాంటి వాగ్దానము బే షరతుగా వుండాలి. షరతులతో కూడిన పత్రము ప్రామిసరినోటు కాజాలదు.
4. ప్రామిసరినోటుపై అప్పు తీసుకొన్న వ్యక్తి సంతకం చేయాలి. చదువు రానివారైతే వేలిముద్ర వేయవలసివుంటుంది.
5. పత్రకర్త నిశ్చితమైన వ్యక్తి అయివుండవలెను.
6. సొమ్ము పొందేవ్యక్తి (Payee) ఖచ్చితముగా వుండాలి. అనగా ప్రామిసరినోటు మొత్తాన్ని ఎవరికి చెల్లించాల్సి ఉందో పత్రములో స్పష్టంగా పేర్కొనాలి.
7. నోటుపై వాగ్దానము సొమ్ము చెల్లింపునకు మాత్రమే పరిమితం కావాలి.
8. చెల్లిస్తానని మొత్తాన్ని స్పష్టంగా ప్రామిసరినోటుపై పేర్కొనాలి.
9. ప్రామిసరినోటు మీద తగినన్ని రెవెన్యూ స్టాంపులు మాత్రం అతికించాలి.

### 14.7.3. ప్రామిసరినోటు నమూనా

10,000 = 00 గుంటూరు,

తేది................

గురవయ్య అనే నేను ప్రవీణ్ అనే నీకు గుంటూరు అనే గ్రామములో రాసి ఇచ్చిన ప్రామిసరినోటు.

నా కుటుంబ ఖర్చుల నిమిత్తంగాను మీరు పై తేదీన నాకు ఇచ్చిన రు 10,000 - 00 అక్షరాల పదివేల రూపాయలు ముట్టినవి. ఈ పైకం నెల 1కి 100కి రు 1-00 ప్రకారం వడ్డీతో సహా మీకుగాని, మీ ఆర్డరు పొందినవారికి గాని అడిగిన తక్షణం చెల్లించగలవాడను.

సాక్షులు

1.

2.

స్టాంపు

గురవయ్య సంతకము.

## 14.8. వినిమయ బిల్లుకు చెక్కుకుగల తేడాలు :

| వినిమయబిల్లు | చెక్కు |
|---|---|
| 1. స్వీకర్త : బిల్లులో స్వీకర్త, బాంకరుతో సహా ఎవరైన కావచ్చును. | చెక్కులు బాంకరు మీదనే రాయాలి. చెక్కు విషయంలో స్వీకర్త ఎప్పుడూ బాంకరే అవుతాడు. |
| 2. స్వీకర్త అంగీకారము : స్వీకర్త అంగీకరాం పొందాలి. | అంగీకారము అవసరము లేదు. |
| 3. చెల్లింపు : బిల్లు డిమాండు మీదగాని లేదా కొంతకాలం తరువాతగాని చెల్లించ బడుతుంది. | చెక్కు ఎప్పుడూ డిమాండ్ మీదనే చెల్లింపబడుతుంది. |
| 4. ధృవీకరణ : బిల్లు అనాదరింప బడినప్పుడు దానిని ధృవీకరణ జేసుకోవడము మంచిది. | అనాదరణను ధృవీకరించుకోవలసిన పనిలేదు. |
| 5. అనుగ్రహ దినాలు : బిల్లును అడిగిన తక్షణం ఇవ్వమన్నా అనుగ్రహ దినాలు ఉంటాయి. అనగా 3 రోజులు గడువు ఎక్కువగా వస్తుంది. | అనుగ్రహ దినాలు అనుమతించబడవు. |

| | |
|---|---|
| 6. రెవిన్యూ స్టాంపు : స్టాంపు చట్టము ప్రకారం రెవిన్యూ స్టాంపులను అంటించాలి. | రెవిన్యూ స్టాంపులను అంటించ నవసరము లేదు. |
| 7. అనాదరణ నోటీసు : వినిమయ బిల్లులో అనాదరణ నోటీసు ఇవ్వడం తప్పనిసరి. | చెక్కుల విషయములో అనాదరణ నోటీసు ప్రసక్తి లేదు. |
| 8. క్రాసింగ్ : వినిమయ బిల్లులకు క్రాసింగ్ అనుమతించబడదు. | చెక్కులను క్రాస్ చేయవచ్చును. |
| 9. చెల్లింపు విడుదల : బిల్లు చెల్లింపును నిలుపుదల లేదా రద్దు చేయడానికి వీలు లేదు. | చెక్కు ఇచ్చిన తరువాత అది చెల్లించబడక ముందు దానిని రద్దు చేయవచ్చును |

## 14.9. వినిమయ బిల్లుకు ప్రామిసరినోటుకు తేడాలు:

| వినిమయ బిల్లు | ప్రామిసరినోటు |
|---|---|
| 1. వినిమయ బిల్లులో ముగ్గురు పార్టీలు వుంటారు. (a) హుండీ కర్త (b) హుండీ స్వీకర్త (c) హుండీ గ్రహీత. | ప్రామిసరినోటులో ఇరువురు పార్టీలు వుంటారు (a) అప్పు తీసుకొన్న వ్యక్తి (b) అప్పు ఇచ్చిన వ్యక్తి |
| 2. సొమ్ము చెల్లింపుకు సంబంధించినచే షరతు ఉత్తీర్వును కలిగి ఉంటుంది. | సొమ్ము చెల్లించడానికిచే షరతు వాగ్దానాన్ని కలిగి వుంటుంది. |
| 3. వినిమయ బిల్లులో హుండీకర్తకు అప్రధానమైన బాధ్యత ఉంటుంది. స్వీకర్త చెల్లించకపోతే హుండీకర్త భాధ్యత ఏర్పడును | ప్రామిసరినోటులో నోటు వ్రాసే వ్యక్తికి ప్రధానమైన బాధ్యత వుంటుంది. |
| 4. వినిమయ బిల్లు కర్తకు, బిల్లు స్వీకర్తకు సన్నిహిత సంబంధం ఉంటుంది. | ప్రామిసరినోటులో నోటు కర్తకు డబ్బు పుచ్చుకోవలసిన వానికి దగ్గర సంబంధం ఉంటుంది. |
| 5. బిల్లులో స్వీకర్త రుణ గ్రస్తుడు. ఇక్కడ రుణ దాత సొమ్మును ఎవరికి చెల్లించాలో కర్త సూచిస్తాడు. | ప్రామిసరి నోటులో కర్తే రుణ గ్రస్థుడు అతడే సొమ్మును చెల్లిస్తాడు. |
| 6. కొన్ని సందర్భాలలో కర్త, గ్రహీత ఒకే వ్యక్తి కావచ్చును. | కర్త, గ్రహీత ఒకే వ్యక్తి కాలేరు. |
| 7. విదేశీ బిల్లులో అయితే అనాదరణ పొందినట్లు ధృవీకరించడము తప్పనిసరి. | నోటు అనాదరణ పొందితే ధృవీకరణ తప్పనిసరికాదు. |
| 8. బాధ్యతగల వ్యక్తులందరికి తప్పనిసరిగా అనాదరణ నోటీసును ఇవ్వాలి. | తయారీ చారుకు అనాదరణ నోటీసును ఇవ్వవలసిన అవసరము లేదు. |

### 14.10 ప్రామిసరినోటు, చెక్కుకు మధ్య తేడాలు:

| ప్రామిసరినోటు | చెక్కు |
|---|---|
| 1. ప్రామిసరినోటులో కర్త, గ్రహీత అనే రెండు పార్టీలు ఉంటాయి. | కర్త. స్వీకర్త గ్రహీత అని మూడు పార్టీలుంటాయి. |
| 2. ప్రామిసరినోటు చెల్లింపుకు సంబంధించిన ఒక బే షరతు వాగ్దానము. | సొమ్ము చెల్లింపునకు సంబంధించిన బే షరతుల ఆదేశము. |
| 3. దీనిని డిమాండ్ మీదగాని, కొంతకాలం తర్వాతగాని చెల్లించ వచ్చును. | దీనిని ఎప్పుడు డిమాండ్ మీదనే చెల్లించాలి. |
| 4. ప్రామిసరినోటు క్రాస్‌చేసే అధికారము లేదు. | చెక్కును భద్రత కోసము సాధారణముగా క్రాస్ జేస్తూవుంటారు |
| 5. నోటును ఎవరిమీదనైన వ్రాయవచ్చును. | చెక్కును ఒక బాంకర్ మీదనే రాయాలి. |
| 6. దీనిపై తప్పనిసరిగ రెవెన్యూ స్టాంపును అంటించాలి. | రెవెన్యూ స్టాంపును అంటించవలసినవసరము లేదు. |
| 7. తయారి దారుడు రుణ గ్రస్థుడు. | తయారి దారుడు రుణదాత, ఋణగ్రస్తుడు ఎవరైనను కావచ్చును. |
| 8. అవసరమైతే దీనిని బాంకుకి డిస్కౌంటు జేయుటకు వీలులేదు. | దీనిని బాంకుకు డెస్కౌంటు జేసుకోవచ్చును. |
| 9. రుణమును తీసుకోవడము కోసం ఇది ఎక్కువగా ఉపయోగ పడుతుంది. | రుణం చెల్లింపుకోసము ఇది ఎక్కువగా ఉపయోగపడుతుంది. |

**14.11.1. క్రాసింగ్**

కౌంటర్ వద్ద దాఖలు చేసిన వ్యక్తికి చెక్కులను నేరుగా చెల్లించకుండ బాంకరు ద్వార పైకము చెల్లించవలసినదిగా చెల్లింపు బాంకరుకు ఇవ్వబడే ఆదేశమే క్రాసింగ్. డ్రాయరు బాంకరునుద్దేశించి చెక్కు ఎడమభాగముపై చివరలో రెండు సమాంతర రేఖలు అడ్డంగా గీయడము. అలాంటి సమాంతర రేఖలలో చెక్కుపై కొన్ని మాటలు రాయటాన్ని క్రాస్‌జేయడం అంటారు.

**14.11.2. క్రాసింగ్ మూడు రకాలు:**

1. సాధారణ క్రాసింగ్
2. ప్రత్యేక క్రాసింగ్
3. పరిమితి క్రాసింగ్

**1. సాదారణ క్రాసింగ్:** సెక్షన్ 123 ప్రకారము చెక్కుపై రెండు సమాంతర రేఖలు అడ్డుగా గీసినా లేకపోతే అలాగీచిన రేఖల మధ్య 'అండ్ కంపెనీ' అనిగాని 'అండ్ కో' అనిగాని, అటువంటి మాటలను సంక్షిప్తంగా రాసిన లేదా ఆ గీతల మధ్య

'నాట్ నెగోషియబుల్' అని రాసినా ఆ చెక్కును సాధారణముగ క్రాసింగ్ చేసినట్టు భావించవలెను. ఈ విధముగా క్రాస్ చేసిన చెక్కు సొమ్మును కౌంటర్ పై చెల్లించరాదు. బాంకుద్వారానే చెల్లింపు జరుగుతుంది అని సెక్షన్ 126 తెలుపుతుంది.

సాధారణ క్రాసింగ్ నమూనాలు: సాధారణ క్రాసింగ్ ఈ క్రింది రూపాలలో యుండవచ్చును.

1) 

2) 


3) 


4) 


5) 


పైన తెల్పినట్లుగా రెండు సమాంతర రేఖలు మాత్రము అవసరము.

**2) ప్రత్యేక క్రాసింగ్:** సాధారణ క్రాసింగ్‌లో వలె ప్రత్యేక క్రాసింగ్‌లో చెక్కుపై రెండు సమాంతర రేఖలు గీయడం అవసరములేదు. అయితే చెక్కుమీద ఏ బాంకుకు చెల్లించవలెనో ఆ బాంకు పేరు మాత్రమే తప్పనిసరిగా రాయాలి. సెక్షన్ 124 ప్రకారం 'ఒక చెక్కు రాసి, దానిమీద నిర్దిష్ట బాంకరు పేరు రాసి 'ట్' నెగోషియబుల్' అనే మాటలతో గాని, ఆ మాటలు లేకుండాగాని రాస్తే, అటువంటి దానిని ప్రత్యేక క్రాసింగ్ అని, ఆ బాంకరు పేరున క్రాస్ చేయబడిందని భావించాల్సి వుంటుంది.

ప్రత్యేక క్రాసింగ్ నమూనాలు:

1) 


2) 


3) 

ఇటువంటి క్రాసింగ్‌లో తెలిపిన బ్యాంకు ఖాతాకు మాత్రమే చెక్కు సొమ్మును చెల్లిస్తారు.

**3) పరిమితి క్రాసింగ్ :** చట్ట బద్ధంగా పైన తెల్పిన రెండు రకాల సాధారణ మరియు ప్రత్యేక క్రాసింగ్ మాత్రమే గాక, ఇటీవల కాలంలో బ్యాంకింగ్ వాడకం ద్వారా అభివృద్ధి అయిన మరొక క్రాసింగ్ అమలులోనికి వచ్చినది. దానినే పరిమితి క్రాసింగ్ అంటారు. ఈ క్రాసింగ్ ద్వార ఖాతాదారు బ్యాంకరుకు 'అకౌంటు పేయీ' అనే ఆదేశము పంపుతాడు. అనగా చెక్కు తెచ్చిన వ్యక్తికి నగదు కౌంటరుపై గాకుండ నేరుగా అతని ఖాతాలోనికి క్రెడిట్ చేయాల్సిందిగా కోరతాడు. ఒకవేళ పొరపాటున బ్యాంకరు ఇంకొకరి ఖాతాలోకి సొమ్ము చెల్లిస్తే, అట్టి చర్యకు బ్యాంకరే బాధ్యత వహించాల్సి వుంటుంది.

పరిమితి క్రాసింగ్ నమూనాలు:

1) 


2) 


**14.11.3. చెక్కులను క్రాస్ చేయగలిగిన వ్యక్తులు:**

చెల్లింపు బ్యాంకరు ఇచ్చే ఆదేశమే క్రాసింగ్ అంటారు. సెక్షన్ 125 ప్రకారం దిగువ పేర్కొన్న వ్యక్తులను చెక్కులను క్రాసింగ్ జేయడానికి అనుమతిస్తుంది.

1. కర్త లేదా డ్రాయరు: చెక్కును జారీచేసే వ్యక్తి (డ్రాయరు) క్రాసింగ్ జేసే అధికారం కలిగివుంటాడు. అది సాధారణ క్రాసింగ్, ప్రత్యేక క్రాసింగ్ లేదా పరిమితి క్రాసింగ్ కావచ్చును.

2. చెక్కు కల్గియున్న వ్యక్తి : క్రాస్ చేయని చెక్కుపై, చెక్కు కల్గియున్న వ్యక్తి సాధారణముగా గాని, ప్రత్యేకంగా గాని, క్రాస్ చేయవచ్చును. ఇంతకు పూర్వము చెక్కు సాధారణ క్రాసింగ్ జరిగివుంటే, చెక్కు కల్గియున్న వ్యక్తి దానిని తిరిగి ప్రత్యేక క్రాసింగ్ చేయవచ్చును. ఇంతకు పూర్వము చెక్కును సాధారణ లేదా ప్రత్యేక క్రాసింగ్ జేసినను దానిపై 'నాట్ నెగోషియబుల్' అనే పదాలను రాయవచ్చును.

3. బ్యాంకరు: సెక్షన్ 125 ప్రకారం ఖాతాదారుడు ప్రత్యేక క్రాసింగ్ జేసినను, తిరిగి దానిని బ్యాంకర్, ఖాతాదారుని తరుపున ఏజెంటుగా రెండవసారి కూడ ప్రత్యేక క్రాసింగ్ జేసి సొమ్ము వసూలుకై పంపవచ్చును. దీనినే ద్వంద్వ లేదా డబుల్ క్రాసింగ్ అంటారు.

**14.11.4. అకౌంటు పేయీ క్రాసింగ్ :** దీనిని పరిమిత క్రాసింగ్ అని కూడ పిలుస్తారు. ఈ క్రాసింగ్‌లో "అకౌంటు పేయీ" లేదా "అకౌంటు పేయీ మాత్రమే" అనే మాటలు అత్యంత ప్రాధాన్యతను కలిగి వుంటాయి. ఈ మాటల ఉద్దేశం చెక్కుకు ఎక్కువ భద్రత కల్పించుట. అకౌంట్ పేయీ క్రాసింగ్ అంటే చెక్కులోని సొమ్ము పేయీ ఖాతాలో మాత్రమే జమ అవుతుంది. మరొక ఖాతాలో జమ చేయకూడదు.

**14.11.5. ద్వంద్వ క్రాసింగ్ లేదా డబుల్ క్రాసింగ్ :** చెక్కులో సాధారణముగ ఒక క్రాసింగ్ మాత్రమే చేయాలి. కాని ప్రత్యేక క్రాసింగ్ వున్న చెక్కుల విషయములో మాత్రము ఆ క్రాసింగ్‌లో ఉదాహరించిన బాంకు తన ఏజెంటుకు చెక్కువసూలుకై మరొక క్రాసింగ్ చేయవచ్చును. అంతేకాని మరో బాంకుకు రెండవ ప్రత్యేక క్రాసింగ్ పనికి రాదు. ఈ విషయములో సెక్షన్ 127 ప్రకారము ఎవరికోసము చెక్కులను ప్రత్యేకముగా క్రాసు చేయడం జరిగిందో, అట్టి బాంకరు, చెల్లింపు బాంకరు ఉండే ప్రదేశంలో బ్రాంచ్ కలిగి వుండకపోతే, లేక ఇంకో విధముగా అవసరమని భావిస్తే, చెక్కులను వసూలు చేసేందుకు తన ఏజెంటుగా వ్యవహరించే మరో బాంకరు పేరున మరల ప్రత్యేకముగా క్రాసింగ్ చేయవచ్చును. అలాంటి సందర్భంలో, ఏ బాంకరు పేరుమీద రెండవసారి ప్రత్యేక క్రాసింగ్ జరిగిందో, ఆ బాంకరు చెక్కు వసూలు నిమిత్తము మొదటి బాంకరుకు ఏజెంటుగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టముగా పేర్కొనాలి.

ద్వంద్వ లేదా డబుల్ క్రాసింగ్ నమూనా :

ఇంగ్ వైశ్యబాంకు లిమిటెడ్
to
ఆంధ్రబాంకు వసూలుకై
ఏజంటుగా

ఇందులో వసూలుకి ఏజెంటుగా' అనే పదాలను ప్రత్యేకముగా క్రాసింగ్‌నందు పేర్కొనవలెను.

**14.11.6. చెరిపివేయబడిన క్రాసింగ్ :** సెక్షన్ 89 ప్రకారము ఒక్కొక్కసారి చెక్కుపై క్రాసింగ్‌ను ఎవరైనా అవినీతి పరులు స్వలాభాపేక్షతో ఎంతో తెలివిగా, చాక చక్యముగా చెరిపివేసినప్పుడు, అది సరిగా గుర్తు పట్టలేకుండా ఉంటే దానిపై బాంకరు సొమ్ము చెల్లిస్తే, అట్టి మొత్తానికి బాంకరు బాధ్యత లేకుండ రక్షణ కలిగిస్తుంది. బాంకరు చర్యను సెక్షను 10 ప్రకారము కూడా సమర్థిస్తుంది.

**14.11.7. క్రాసింగ్‌ను రద్దుచేయుట :** చెక్కుమీద ఉన్న క్రాసింగ్‌ను రద్దుచేయడం జరిగితే దానిని క్రాసింగ్ రద్దుచేయుట అంటారు. క్రాసింగ్ రద్దును చెక్కుకర్త (డ్రాయరు) మాత్రమే జేయగలడు. క్రాస్ చేసిన చెక్కును ఖాతాదారుడు క్రాసింగ్ సమాంతర రేఖలవద్ద ఒక సంతకం చేసి, దానిపై “నగదు చెల్లించండి'' అని రాసి అక్కడ రెండవ సంతకం చేస్తే క్రాసింగ్ రద్దు అయినట్లుగ భావించబడుతుంది. ఈ విధముగా రెండు సంతకాలు జేసిన తరువాత చెక్కును నేరుగా బాంకు కౌంటరు వద్ద చెల్లింపుకు దాఖలు చేసుకొనే వీలు కలుగుతుంది. పేయీకి బాంకులో ఖాతా లేనప్పుడు క్రాసింగ్‌ను రద్దు జేయడం జరుగుతుంది.

**14.12.1. ఎండార్స్‌మెంటు :**

అన్యాక్రమణ పత్రాల చట్టం 1881 సెక్షన్ 15 పక్రారము అన్యాక్రమణ పత్రము అనగా ప్రామిసరినోటు, వినిమయ బిల్లు లేదా చెక్కు రాసిన వ్యక్తి గాని, అటువంటి పత్రము వున్న వ్యక్తిగాని, డ్రాయరు హోదాలో కాకుండా ఇతరులకు బదిలీ చేసే నిమిత్తము ఆ పత్రం మీద కాని, వెనుక గాని, దానిని జతపరచిన వేరొక పేపరుమీద గాని సంతకం జేస్తే దానిని ఎండార్స్ చేసినారంటారు. అలా చేసిన వ్యక్తిని ఎండార్సర్ అంటారు. బదలాయింపు పొందిని వ్యక్తిని ఎండార్స్ అంటారు.

పత్రాల వెనుక ఎండార్స్‌మెంటుకోసం అదనంగా కాగితం అందించే దానిని అనుబంధ చీటి అంటారు. పత్రం హోల్డరు పత్రం కర్త, పత్రాలు రాయించుకున్న వ్యక్తి వీరందరు ఎండార్సుమెంటు చేయవచ్చును. ఎండార్స్‌మెంటు చేయడము వలన పత్రమునకు సంబంధించిన అన్ని హక్కులు ఎండార్సర్ నుండి ఎండార్స్‌కి సంక్రమిస్తాయి.

**14.12.2. ఎండార్స్‌మెంటు లక్షణాలు :**

1. సంతకము : ఎండార్స్‌మెంటు ఫలానా విధముగా ఉండాలని చట్టంలో లేదు. పత్రంపై ఎండార్స్‌ర్ సంతకం తప్పనిసరిగా జేయాలి. సంతకం చేసి పత్రాన్ని ఎండార్సికి బదిలి చేసినప్పుడు మాత్రమే ఎండార్సుమెంటు పూర్తి అవుతుంది. అందువలన ఎండార్సుమెంటుకు ఎండార్సర్ సంతకం తప్పనిసరి.

2. ఎండార్స్‌మెంటు చేయు వ్యక్తులు : నెగోషియబుల్ పత్రం వ్రాసిన వ్యక్తిగాని (డ్రాయరు) అది తన దగ్గర వున్న వ్యక్తిగాని, ఎండార్సుమెంటు చేయవచ్చును. దానితో సంబంధము లేని వ్యక్తులు ఎండార్సుమెంటు చెయ్యకూడదు.

3. ఎండార్సుమెంటు జేసే స్థలము : ఎండార్సుమెంటుకు పత్రముపై ఎక్కడైన సంతకం చేయవచ్చును. కాని సహజముగా పత్రం వెనుక సంతకం జేస్తూ వుంటారు. ఎండార్సుమెంటు ఎక్కువగా జరిగి, వెనుక సంతకం జేయడానికి స్థలము లేకపోతే, పత్రానికి కాగితము అతికించి ఆ కాగితంపై సంతకం చేసి ఎండార్సు జేయవచ్చును. అటువంటి కాగితము అనుబంధచీటి అంటారు.

4. పత్రాన్ని అప్పగించుట : ఎండార్సుమెంటు పూర్తి కావాలంటె, ఎండార్సుమెంటు జరిగిన పత్రాన్ని ఎండార్సర్ ఎండార్సీకి అప్పగించవలెను.

5. పూర్తి సొమ్ము బదలి : ఎండార్సుమెంటు వలన నెగోషియబుల్ పత్రంలో ఉన్న సొమ్మునంతా పూర్తిగా బదిలి చేయాలి. అంతేకాని అందులో కొంత భాగమును బదిలి చేయడానికి వీలుపడదు.

**14.12.3. ఎండార్సుమెంటు - రకాలు:**

ఎండార్స్‌మెంట్లను ఈ దిగువ విధముగా వర్గీకరించారు.

1. సాధారణ లేదా ఖాళీ ఎండార్స్‌మెంట్లు
2. ప్రత్యేక లేదా పూర్తి లేదా సంపూర్ణ ఎండార్సుమెంట్లు
3. అంశిక లేదా పాక్షిక ఎండార్సుమెంట్లు
4. షరతులతో కూడిన ఎండార్సుమెంట్లు
5. పరిమిత ఎండార్సుమెంట్లు

1. **సాధారణ లేదా ఖాళీ ఎండార్స్‌మెంట్లు** : సెక్షను 16 ప్రకారము పత్రం హోల్డరు ఎండార్స్ చేసేటప్పుడు పత్రంపై ఏమి రాయకుండా తనపేరును మాత్రమే సంతకము చేస్తే దానిని ఖాళీ లేదా సాధారణ ఎండార్స్‌మెంటు అంటారు. ఎండార్సిపేరును అందులో ఎండార్సర్ నిర్ధిష్టముగా తెలపడు. కాబట్టి ఆ పత్రం ఎవరి స్వాధీనములో ఉంటే వారికే సొమ్ము చెల్లిస్తారు.

ఉదా : పత్రము రాజశేఖర్‌కు గాని అతని ఆర్డరు పొందిన వారికి గాని చెల్లించే షరతులతో ఉంటే, ఆ పత్రం వెనుక రాజశేఖర్ సంతకం జేస్తే అది ఖాళీ ఎండార్సుమెంటు అవుతుంది.

2. **ప్రత్యేక లేదా పూర్తి లేదా సంపూర్ణ ఎండార్స్‌మెంట్లు** : ఎండార్సర్ పత్రము వెనుక సంతకం జేస్తూ దాని తాలూకు సొమ్మును ఒక నిర్దిష్టమైన వ్యక్తికి గాని, అతని అనుమతి పొందిన వ్యక్తికి గాని చెల్లించవలసినదిగా ఆదేశిస్తూ దానిని సంపూర్ణంగా ఎండార్స్‌మెంటు అంటారు. ఉదా : చక్రధర్‌కు గాని అతని ఆర్డరు పొందిన వారికి గాని చెల్లించవలెను సంతకము రాజశేఖర్.

3. **అంశిక లేదా పాక్షిక ఎండార్సుమెంట్లు** : పత్రములో తనకున్న హక్కులో కొంత మాత్రమే మార్పిడి అయ్యేటట్లు హోల్డరు ఎండార్సు జేసి, సంతకం పెడితే అటువంటి ప్రక్రియను అంశిక లేదా పాక్షిక ఎండార్స్‌మెంట్లు అంటారు. అయితే ఇటువంటి ఎండార్సుమెంట్లు చెల్లవు.

4. షరతులతో కూడిన ఎండార్స్‌మెంట్లు : సెక్షన్ 52 ప్రకారము ఏదైన సంఘటన జరిగితేనే అమలులోకి వచ్చే విధముగా చేసే ఎండార్సుమెంటును షరతులతో కూడిన ఎండార్స్‌మెంట్లు అంటారు.

ఉదా : కిరణ్ కాలేజీలో చేరితే సొమ్ము చెల్లించండి. అని రాసి ఎండార్సు జేస్తే దాన్ని షరతులతో కూడిన ఎండార్స్‌మెంటు అంటారు. షరతులతో కూడిన ఎండార్సుమెంట్లను మరల దిగువ విధముగా విభజించినారు.

a) పూచీలేని ఎండార్సుమెంట్లు (Endorsement Sans Recourse) : ఎండార్సర్ ఎండార్స్‌మెంటులోనే ఆ ఎండార్సిగాని ఆ తరువాత హోల్డరు కాని పత్రం తాలూకు పైకం వసూలు కాకపోతే తనను భాద్యునిగా జేయకూడదు అని రాస్తాడు. ఇలాంటి ఎండార్స్‌మెంట్లను సాధారణముగ యాజమాని తరపున ప్రతినిధులు చేస్తుంటారు.

ఉదా : ప్రవీణ్‌కుగాని అతని అనుమతి పొందిన వారికి గాని చెల్లించవలె. పూచీలేదు (సంతకం) మోహనరావు.

b) ఐచ్ఛిక ఎండార్సుమెంట్లు (Faculative Endorsement ): ఎండార్స్‌మెంటు వలన ఏర్పడిన బాధ్యతను ఎక్కువ జేసికోవడానికి ఇష్టపడి రాసిన ఎండార్స్‌మెంటును ఐచ్ఛిక ఎండార్స్‌మెంటు అంటారు.

ఉదా : అనీలుకుగాని అతని అనుమతి పొందిన వారికిగాని చెల్లించవలెను. అనాదరణ నోటీసు వదులు కోవడమైనది. సంతకము కిషోర్ బాబు . ఈ పత్రము అనాదరణ పొందితే కిషోర్ బాబుకు అనాదరణ నోటీసు అందిన అందకపోయిన ఆ పత్రం తాలూకు బాధ్యత అతనికి వుంటుంది.

c) వ్యయ స్వీకార ఎండార్స్‌మెంటు (Sans Frais Endorsement) ఎండార్సిగాని మరి ఏ ఇతర హోల్డరుగాని తన తరుపున ఏ ఖర్చు భరించనక్కర్లేదని రాసిన ఎండార్స్‌మెంటును వ్యయస్వీకార ఎండార్సుమెంటు అంటారు.

ఉదా : సుబ్బారావుకు గాని తన తరుపున అతని అనుమతి పొందినవారికి గాని చెల్లించవలె. సంబంధిత ఖర్చులను భరించనవసరము లేదు. (సంతకము) రాధాకృష్ణ.

5. **పరిమిత ఎండార్స్‌మెంటు** : భవిష్యత్తులో పత్రంతాలూకా బదలాయింపు జరుగకుండ ఎండార్సీవరకే పరిమితం చేసిన ఎండార్స్‌మెంటును పరిమిత ఎండార్స్‌మెంటు అంటారు. ఇందులో పత్రం మరెవ్వరికి బదలాయింపు చేయకూడదని స్పష్టముగా కాని లేదా నిగూఢముగా గాని చెప్పడము జరుగుతుంది.

ఉదా : 1. పత్రం సొమ్మును శ్రీరత్నంకు మాత్రమే చెల్లించవలె (సంతకము) రామయ్య

2. నా లాభంకోసమే శ్రీరత్నంకు చెల్లించవలె (సంతకము) రామయ్య

3. చలవయ్య నిమిత్తము శ్రీరత్నంకు చెల్లించవలె (సంతకము) రామయ్య

**14.13. ఎండార్స్‌మెంట్లు - బాంకరు బాధ్యత :**

బాంకరు చెక్కులను చెల్లింపు జేసేటపుడు వాటిపై ఉన్నా ఎండార్స్‌మెంట్లు సక్రమముగా ఉన్నవా లేవా అనే విషయమును గమనించాలి. ఎండార్స్‌ర్‌గా సంతకం జేసిన వ్యక్తిని బాంకరు గుర్తించనవసరము లేదు. ఎండార్స్‌మెంటు సక్రమముగా లేని యెడల సెక్షను 85 ప్రకారము వచ్చే శాసనాత్మక రక్షణను అతడు కోరలేడు. కాబట్టి బాంకరు ఈ క్రింది అంశములను గమనించవలెను.

1. ఎండార్స్‌ర్ పెద్దఅక్షరములతో సంతకం చేయరాదు. ఒకవేళ సంతకంచేస్తే అవి సక్రమమైన ఎండార్స్‌మెంటు కాదు.

2. పత్రములో పేయీ పేరు లేదా ఎండార్సీపేరు ఏ విధముగా రాస్తే ఆ విధముగానే పత్రము వెనుక పేయీ లేదా ఎండార్సీ సంతకం జేయాలి.

3. గౌరవార్థముగ పేరుకు ముందుగాని లేదా చివరగాని రాసే పదాలు ఎండార్స్ సంతకం చేసేటప్పుడు రాయరాదు.

ఉదా : ప్రొఫెసర్ రామక్రిష్ణ అని పేరు ఉంటే వెనుకవైపు రామక్రిష్ణ అని సంతకం చేయవలెను.

4. ఎండార్సర్‌కు సంతకం చేయడం రాకపోయినట్లయితే పత్రం వెనుకవైపు అతడు నిశానిని వేయాలి. ఆ నిశానికి సాక్షి సంతకము అవసరము. మురియు ఆ సాక్షిపేరు, అడ్రుసు వివరముగా రాయాలి.

5. ప్రతినిధిగ ఒక వ్యక్తి ఎండార్స్ చేస్తున్నప్పుడు 'For' లేదా "on beself of" లేదా per pro అనే పదాలను ఉపయోగించవలెను.

ఉదా : 1) For Gopal for manager

2) బాగస్వామ్య సంస్థ : For.....Firm partner.

**స్వయం మథింపు ప్రశ్నలు**

**5 మార్కుల ప్రశ్నలు**

1. చెక్కు యొక్క లక్షణాలు

2. చెక్కుల క్రాసింగ్

3. చెక్కులలో మేలన్ మార్పులు

4. ముందు తేది వేయబడిన చెక్కులు

5. సాధారణ క్రాసింగ్

6. ప్రత్యేక క్రాసింగ్

7. అసంబద్ధ బదలి (Forged Endorsement)

8. పొరపాటున చెక్కు నిరాదరణ యొక్క చర్యలేవి ?

**10 మార్కుల ప్రశ్నలు**

1. చెక్కును నిర్వచించి, హుండికి, చెక్కుకుగల తేడాలను తెలపండి .
2. హుండీ, ప్రామిసరినోటులను నిర్వచించి వాటి మద్యగల తేడాలను తెలియజేయండి.
3. చెక్కు, ప్రామిసరినోటు మధ్యగల తేడాలను తెలియజేయండి ?

**20 మార్కుల ప్రశ్నలు**

1. క్రాసింగ్ అనగా నేమి ? క్రాసింగ్ రకాలేవి ? వాటి ప్రాదాన్యతను విడివిడిగా తెలియజేయండి ?
2. చెక్కులు ఎందుకు క్రాస్ చేయబడుతాయి ? వివిధ రకాల క్రాసింగ్‌లను వివరిస్తూ వాటి న్యాయాత్మక ప్రాముఖ్యతను తెలియజేయుము.
3. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటు అనగానేమి ? దాని ప్రత్యేక లక్షణాలేవి ?
4. చెక్కు నిరాదరణ అనగానేమి ? పొరపాటున చెక్కు నిరాదరణకు సంబందించి ఉత్పన్నమగు సమస్యలేవి ?
5. చెక్కుపై డబ్బు చెల్లించేటప్పుడు బాంకరు తీసుకొనవలసిన జాగ్రత్తలు ఏవి ?
6. ఎండార్సుమెంటు అనగానేమి ? వివిధ రకాల ఎండార్స్ మెంట్లను గూర్చి వివరింపుము.

**సిఫారసు చేయబడిన పుస్తకాలు :**

1. బాంకింగ్ విత్త వ్యవస్థలు జై భారత్ పబ్లిషర్స్
2. బాంకింగ్ విత్త వ్యవస్థలు తెలుగు అకాడమి
3. బాంకింగ్ విత్త వ్యవస్థలు కళ్యాణి పబ్లిషర్స్
4. Banking law and Practice - S.N. Maheswari
5. Law and Practice in India Tannan's Banking

- Dr. D.Ramulu

**పాఠము 15.**

# చెల్లింపు బాంకరు మరియు వసూలు బాంకరు విధులు (payment and collection of cheqnues)

## విషయ క్రమము


15. చెల్లింపు బాంకరు

15.1 చెక్కు చెల్లింపుకు వచ్చినపుడు బాంకరు గమనించవలసిన విషయములు

15.2 ఖాతాదారుని చెక్కులను బాంకరు అనాదరణ జేయవలసిన పరిస్థితులు

15.3 చెక్కులను అనుచిత అనాదరణ వలన కలిగే పరిణామాలు

15.4 చెల్లింపు బాంకరుకు శాసనాత్మక రక్షణ

15.5 వసూలు బాంకరు - అతని విధులు

15.6 వసూలు బాంకరుకు శాసనాత్మక రక్షణ


## 15. చెల్లింపు బాంకరు

నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటు చట్టములోని సెక్షన్ 31 ప్రకారము బాంకరు వద్ద ఖాతాదారుని నిల్వయుండి, చెక్కులో లోపము ఏది లేనట్లయితే ఆ చెక్కుపై సొమ్మును తప్పనిసరిగా చెల్లించవలెను. ఖాతాదారుని చెక్కులను బాంకరు చెల్లింపు జేసేటప్పుడు అతనిని చెల్లింపు బాంకరు అని అంటారు. బాంకరు అకారణముగా చెక్కును అనాదరిస్తే, దానివలన ఖాతాదారుకు కలిగే నష్టానికి భాధ్యత వహించాల్సి వుంటుంది. ఒకవేళ ఖాతాదారుని చెక్కులను నిర్లక్ష్యంగా ఆదరిస్తే ఆ చెక్కు తాలూకు సొమ్ముకు బాంకరు బాధ్యత వహించవలసి వుంటుంది. బాంకరు చెక్కును ఆదరించడమో, అనాదరించడమో తక్షణం జేయవలసి వుంటుంది. కాబట్టి చెక్కును ఆదరించేటప్పుడు మరియు అనాదరించేటప్పుడు బాంకరు చాల జాగ్రత్తగా వ్యవహరించవలెను.

## 15.1. చెక్కు చెల్లింపుకు వచ్చినపుడు బాంకరు గమనించవలసిన అంశాలు:

ఖాతాదారుని ప్రయోజనాలను, తన ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఖాతాదారుని చెక్కులను ఆదరించేటప్పుడు బాంకరు ఈ దిగువ జాగ్రత్తలు తీసికొనవలెను.

1. **చెక్కు రూపము :** చెక్కు స్వరూపము సరైన ఆకారములో వుండాలి. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటు చట్టం చెక్కు ఏ విధముగా వుండాలో స్పష్టముగా పేర్కొనలేదు. కాబట్టి ప్రతి బాంకు చెక్కులను రూపొందించుకొని, తామే వాటిని ముద్రించి ఖాతాదారులకు అందజేస్తాయి. ముద్రిత చెక్కులను వాడడం వలన చెక్కులు రాయడము ఖాతాదారులకు సులభముగా వుంటుంది.

2. **చెక్కుపై తేది :** చెక్కును రాసే వ్యక్తి దానిపై దానిని జారీ జేసే తేది వేయాలి. తేది, నెల, సంవత్సరము చెక్కుపై స్పష్టముగా రాయాలి. చెక్కుపై తేది లేకపోతే, చెల్లింపు బాంకరు దానిని తిరస్కరించవచ్చును. డ్రాయరు చెక్కుపై తేదీని వేయడం మరచిపోతే, పేయీకాని, తర్వాత ఏర్పడే హోల్డరు కాని చెక్కుపై తేదిని వేయవచ్చును.

చెక్కు జారీ చేసిన తరువాత 6 నెలల లోపుగ అది చెల్లింపుకు బాంకరుకు ఇచ్చి డబ్బు పొందాలి. అలా 6 నెలల లోపుగ బాంకుకు సమర్పించకపోతే దానిని కాలదోషం పట్టిన చెక్కు అంటారు. అటువంటి చెక్కులకు చెల్లింపు చేయడం జరగదు.

భవిష్యత్ కాలానికి చెందిన తేదీలను చెక్కులమీద వేస్తే ఆ చెక్కులను భవిష్యత్ తేదీ చెక్కులు అంటారు. ఆ తేది వచ్చేవరకు ఆ చెక్కులను చెల్లింపుకు దాఖలు జేసే అవకాశము లేదు. ఒకవేళ భవిష్యత్ తేది చెక్కులను జేస్తే బాంకరు ఈ దిగువ విధముగా భాద్యత వహించవలెను.

(a) భవిష్యత్ తేదీ చెక్కులను నిలుపదల జేయమని ఖాతాదారుడు బాంకరును కోరవచ్చును. ఈ లోపుగ బాంకరు పైకం చెల్లించివుంటె, చెక్కుపై వేసిన తేది వరకు బాంకరు, ఖాతాదారుని ఖాతాకు డెబిట్ చేయకూడదు.

(b) భవిష్యత్ తేదీ చెక్కును చెల్లించడం వలన ఖాతాదారుని ఖాతాలో సొమ్ము సరిపోక ఇతర చెక్కులు అనాదరింపబడితే బాంకరును బాధ్యునిగ జేయవచ్చును.

(c) భవిష్యత్ తేదీలోపుగ ఖాతాదారుడు మరణిస్తే, అతని మరణ వార్త తెలియగానే, చెక్కులపై సొమ్ము చెల్లించడము నిలిపివేయాలి.

**3. చెక్కుపై వ్రాయబడిన సొమ్ము:** చెక్కు సొమ్ము అంకెలలోను, అక్షరాలలోను ఒకే విధముగా రాయడం జరగాలి. రెండింటి మధ్య వ్యత్యాసము వుంటె నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటు చట్టము సెక్షను 18 ప్రకారం అక్షరాలలో రాసిన విధముగా బాంకరు చెల్లించాలి. కాని సాదారణముగ బాంకరు ఇలాంటి చెక్కులను ఆదరించక ఖాతాదారులకు త్రిప్పి పంపి తగిన విధముగా సవరణ జేయమని బాంకరు కోరవచ్చును. చెక్కు మొత్తమును అంకెలు వేయకుండ అక్షరాలతో రాసిన బాంకరు ఆదరించవలెను. కాని అంకెలు మాత్రమే వేసిన చెక్కులను బాంకరు ఆదరించకూడదు.

**4. ఖాతాదారుని ఖాతాలో చాలినంత సొమ్ము నిల్వ:** ఖాతాదారుని ఖాతాలో నిల్వ ఉంటేనే చెక్కు చెల్లింపబడుతుంది. ఓవర్ డ్రాఫ్టు ఏర్పాటు జేసికొంటె చెక్కు చెల్లింపువల్ల ఓవర్ డ్రాఫ్టు పరిమితి మించకుండ ఉండాలి. చెక్కుపై సొమ్మును పూర్తిగా ఒకేసారి చెల్లించాలి గాని వాయిదాలలో చెల్లించకూడదు.

**5. చెక్కులో ముఖ్యమైన మార్పులు:** చెక్కులో ముఖ్యమైన మార్పులు జరిగినప్పుడు డ్రాయరు వాటిని ధృవీకరిచినప్పుడు మాత్రమే బాంకరు వాటిని ఆదరించవలెను. నెగోషియన్ పత్రాలలో జేసిన మార్పు దాని మేటీ స్వరూపాన్నిగాని, దానికి సంబంధించిన వ్యక్తుల బాధ్యతనుగాని మార్చేదయితే అట్లాంటి మార్పును ముఖ్యమైన మార్పు అంటారు. అవి ఏమనగా 1) చెక్కుపై తేదీని మార్చడం, 2) చెల్లింపు ప్రదేశాన్ని మార్చడం, 3) చెక్కుపై సొమ్మును మార్చడం మొదలగునవి.

**6. ఖాతాదారుని నమూనా సంతకము:** చెక్కును ఆదరించే ముందు చెక్కుపై ఖాతాదారుని సంతకము సక్రమముగా ఉన్నది లేనిది బాంకరు గమనించాలి. ఖాతాదారుని నమూనా సంతకంతో సరిపోల్చి చూడాలి. సంతకములో తేడా వున్నట్లయితే చెక్కుపై సొమ్మును చెల్లించకూడదు. ఒకవేళ ఆ చెక్కులను చెల్లిస్తే ఫోర్జరీ జరిగిన చెక్కును ఆదరించనట్లవుతుంది. దాని వలన ఏర్పడే బాధ్యతను బాంకరే భరించాలి.

**7. చిరిగిన లేదా నలిగిన చెక్కులు:** చిరిగిన లేదా నలిగిన చెక్కును బాంకరు చాల జాగ్రత్తగా పరిశీలించవలెను. చెక్కును రద్దుజేసే ఉద్దేశ్యంతో ఖాతాదారుడు దానిని చింపి వేసినట్లు కనిపిస్తే బాంకరు ఆ చెక్కును ఆదరించరాదు. పొరపాటున దానిని చింపితే, ఖాతాదారుని ధృవీకరణ పొందడము బాంకరుకు మంచిది. సమాచారమును భంగపరచని విధముగ చెక్కు చిరిగినప్పుడు బాంకరు చెక్కును ఆదరించవచ్చును.

**8. బాంకు పని వేళలు:** ఖాతాదారుడు జారీ జేసిన చెక్కులను బాంకు వ్యాపార పనివేళలలో దాఖలు జేస్తేనే చెల్లింపు జరుగుతుంది. స్థానిక పరిస్థితులను బట్టి బాంకు పని గంటలను నిర్ణయిస్తారు. పని గంటలలో కాకుండ మిగితా సమయములో దాఖలైన చెక్కులను చెల్లిస్తే, చెల్లింపు బాంకరు చాల చిక్కుల్లో పడవచ్చును.

**9. చెక్కుల క్రాసింగ్:** క్రాస్ చేయని చెక్కును సొమ్ము బాంకరు కౌంటరు వద్దనే నగదు చెల్లించవచ్చును. కాని సాదారణ క్రాసింగ్ ఉన్న చెక్కు అయితే దాఖలు జేసిన వ్యక్తి ఖాతాను క్రెడిట్ జేసి, ఆ తర్వాత ఆ మొత్తాన్ని అతడు వాడుకోవడానికి అనుమతించాలి. ఒకవేళ అతనికి ఖాతా లేకపోతే ఖాతాను ప్రారంబించాలి. చెక్కు పై ప్రత్యేక క్రాసింగ్ వుంటే అలాంటి క్రాసింగ్‌లో ఉదహరించిన బాంకరుకు గాని, అతడు వసూలునిమిత్తము నియమించిన మరొక బాంకరుకుగాని సొమ్ము చెల్లించాలి. చెక్కు క్రాసింగ్‌లో 'అకౌంట్ పేయీ' 'నాట్ నెగోషియబుల్' అనే పదాలు ఉన్నప్పుడు చెక్కు డ్రాయరు ఆదేశానుసారంగా చెక్కులను చెల్లింపుజేయాలి.

**10. ఖాతా ఉన్న బ్రాంచి:** ఖాతాదారుడు ఏర్పాటు జేసికొన్న బాంకు బ్రాంచి మీదనే చెక్కును జారీచేయాలి. వేరొక బ్రాంచి మీద రాసిన చెక్కులను ఆదరించవలసిన బాధ్యత బాంకరుకు లేదు.

**11. చెక్కుపై ఎండార్స్‌మెంట్లు:** చెల్లింపుకు వచ్చిన చెక్కులమీద ఎండార్స్‌మెంట్లు సక్రమముగా ఉన్నది లేనిది బాకరు పరిశీలించాలి. సక్రమముగా లేని ఎండార్స్‌మెంటు గల చెక్కును చెల్లిస్తే బాంకరుకు శాసనాత్మక రక్షణ ఉండదు.

## 15.2 ఖాతాదారుని చెక్కులను బాంకర్ అనాదరణ జేయవలసిన పరిస్థితులు:

ఈదిగువ పరిస్థితులలో బాంకరు ఖాతాదారుని చెక్కులను బాంకరు అనాదరించవవచ్చు.

1. ఖాతాదారుని ఖాతాలో చెక్కుపై చెల్లించడానికి తగిన సొమ్ము బాంకువద్ద లేనప్పుడు.
2. చెక్కుకు చట్టములో నిర్దేశించిన లక్షణాలు లేనప్పుడు.
3. చెక్కుమీద ఉన్న తేదికి 6 నెలల తరువాత చెక్కు దాఖలు అయినప్పుడు
4. చెక్కుమీద ఉన్న తేది కంటె ముందుగా చెక్కు దాఖలు అయినప్పుడు
5. బాంకులు పనిజేసే గంటలు దాటిన తరువాత చెక్కు దాఖలు అయినప్పుడు
6. ఖాతాదారుడు చెక్కుమీద చెల్లింపును నిలువుదల జేస్తూ ఆదేశించినప్పుడు
7. ఖాతాదారుడు మరణించిన విషయం బాంకుకు నోటీసు అందినప్పుడు
8. ఖాతాదారుడుగాని, అతనికి ప్రతికూలముగ మరొకరుగాని దివాలా అర్జీ దాఖలు పరచినట్లు బాంకరు దృష్టికి వచ్చినప్పుడు
9. ఖాతాదారుడు మతిస్థిమితం కోల్పోయి పిచ్చివాడుకాగా, అతని పిచ్చి విషయమై బాంకరుకు నోటీసు అందినప్పుడు
10. ఒక ఖాతాదారుని బాంకు నిల్వను జప్తు జేస్తూ కోర్టువారు గార్నిషీ ఆర్డరు జారీజేసినప్పుడు
11. ట్రస్ట్ సొమ్ము ట్రస్ట్ నిబంధనలకు వ్యతిరేకముగా వినియోగమవుతున్నదని బాంకుకు తెలిసినప్పుడు
12. చెక్కులో ముఖ్య విషయాలు మార్పులు జరిగినప్పుడు
13. చెక్కుమీద సంతకానికి, ఖాతాదారుని నమూనా సంతకానికి తేడా వున్నప్పుడు
14. ఎండార్స్ మెంటు సక్రమముగా కానప్పుడు
15. ఖాతా దారుని ఖాతా ఒక బ్రాంచిలో వుంటె మరొక బ్రాంచిలో చెక్కు దాఖలు అయినప్పుడు
16. బాంకరుకు ఖాతాదారుని పేరు మీద ఉన్న నిల్వ మీద 'లీన్' వుండి, ఆ అధికారము చెలాయించిన కారణముగా దాఖలయిన చెక్కు చెల్లించడానికి తగిన నిల్వలేనప్పుడు బాంకరు చెక్కులను అనాదరించవచ్చును.

## 15.3. చెక్కుల అనుచిత అనాదరణ వలన కలిగే పరిణామాలు:

నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటు చట్టము 1881 సెక్షన్ 31 ప్రకారము ఖాతాదారుని చెక్కులను ఆదరించడము బాంకరు బాధ్యత. ఖాతాదారుని ఖాతాలో తగినంత నిల్వ వుండి, జారీ జేసిన చెక్కు చెల్లింపుకు సక్రమముగా వుంటె, అలాంటి చెక్కులను బాంకరు తప్పనిసరిగా ఆదరించవలెను. కాని బాంకరు ఖాతాదారుని చెక్కుకు సరైన కారణము లేకుండ అనుచితముగా అనాదరిస్తే ఖాతాదారుకు జరిగిన పరపతి భంగానికి అతను పొందిన ఇతర నష్టాలకు బాంకరు పరిహారము చెల్లించవలసి వుంటుంది.

అనుచిత అనాదరణ జేసిన బాంకరు చెక్కు రాసిన ఖాతాదారునికే నష్టపరిహారము చెల్లించవలెను. అంతేకాని చెక్కు హోల్డరుకు, పేయీకి గాని నష్ట పరిహారము చెల్లించనవసరములేదు.

ఖాతాదారుకు అతని చెక్కును అనుచితముగా అనాదరణజేసిన సందర్భములో చెల్లించవలసిన నష్టపరిహారము ఖాతాదారునికి కలిగిన వాస్తవ డబ్బు సంబంధమైన నష్టము వరకే పరిమితంగాకుండ అతని పేరు ప్రతిష్టలకు గౌరవ మర్యాదలకు కలిగిన నష్టాన్ని కూడ పరిగణనలోకి తీసికోవాలి.

వర్తకుని చెక్కును అకారణముగ బాంకరు అనాదరణ చేస్తే అతని పరువు ప్రతిష్టలకు, వ్యాపారానికి ఎక్కువ నష్టము కలుగుతుంది. కాబట్టి వ్యాపారేతర ఖాతాదారుల కంటె ఎక్కువ మొత్తములో నష్టపరిహారము చెల్లించవలసివుంటుంది.

డేవిడ్ సన్స్ $V_s$ బార్క్లేస్ బాంకు లిమిటెడ్ 1940 కేసులో 12-15-89 కి వ్యాపారస్థుడు రాసిన చెక్కు అనాదరణ జరిగినప్పుడు, అతడు వ్యాపారస్థుడు కాబట్టి బాంకరు E 250 నష్టపరిహారము ఆ వ్యాపారస్థునికి ఇవ్వాలని తీర్పు ఇచ్చినది.

వర్తకుడు కాని ఖాతాదారు విషయములో సముచితమైన నష్టపరిహారమును మాత్రమే ఇస్తారని గిబ్స్ $V_s$ వెస్ట్ మినిస్టరు బాంకు లిమిటెడ్ 1939 కేసులో స్పష్టమైనది. ఈ కేసులో శ్రీమతి మార్గరెట్ గిబ్స్ అనే ఆవిడ అద్దెతాలూకు E9-16-0 చెక్కును తన ఇంటి మజమానికి ఇచ్చినది ఆ చెక్కును బాంకు పొరపాటున అనాదరణ జేసినది. క్రమవిరుద్ధంగా తన చెక్కును అనాదరణ జేయడము జరిగినది. ఆమె వేసిన దావాలో ఆమె వ్యాపారస్థురాలు కాదుకాబట్టి ఆమెకు E 2 మాత్రమే నష్టపరిహారము మాత్రమే చెల్లించాలని కోర్టు తీర్పు ఇచ్చింది.

అనాదరింపబడిన చెక్కు ఎంతచిన్న మొత్తము అయితే అతని పరపతికి ఎక్కువ భంగం వాటిల్లుతుంది. కాబట్టి తక్కువ మొత్తముగల చెక్కును అక్రమముగా అనాదరణజేస్తే ఎక్కువ మొత్తములో బాంకరు నష్టపరిహారము చెల్లించవలసి వుంటుంది.

## 15.4. చెల్లింపు బాంకరుకు శాతనాత్మక రక్షణ:

బాంకరు చెక్కులను చెల్లించేటప్పుడు హక్కుదారునికి కాకుండ మరొక అనుచిత వ్యక్తికి సొమ్ము చెల్లింపు జేస్తే నష్టాన్ని భరించవలసిన బాధ్యత బాంకరుదే. ఖాతాదారు సంతకం దొంగసంతకము అయినప్పుడు నమూనా సంతకం బాంకరు వద్ద ఉంటుంది. కాబట్టి బాంకరును బాధ్యునిగా చేయవచ్చును. కాని ఎండార్సి, పేయీల సంతకాలు బాంకరు వద్దవుండవు. కాబట్టి అట్టి సంతకాలు ఫోర్జరీ జరిగినప్పుడు చెక్కు చెల్లించిన బాంకరుకు నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంటు చట్టము కొన్ని పరిస్థితులలో రక్షణ కల్పించినది. ఆ పరిస్థితులు ఏమనగా :

**1. ఆర్డరు చెక్కుల విషయములో శాసనాత్మక రక్షణ:** నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంతు చట్టము 8 సెక్షన్ 85 (1) ప్రకారము ఆర్డరు చెక్కులో పేయీ సంతకముగాని, పేయీ తరుపున సంతకంగాని చిరిగినట్లనిపిస్తే చెక్కులు ఎవరిమీద రాయడం జరిగిందో అతడు ( గా బాంకరు) సక్రమమైన చెల్లింపు జేస్తే బాధ్యతనుండి విముక్తుడౌతాడు. ఫోర్జరీతో ఎండార్సుమెంట్లు జరిగినా, ఎండార్సుమెంట్లు సక్రమముగా వుండి, సక్రమముగా చెల్లింపు జరిగితే చెల్లింపు బాంకరుకు రక్షణ వుంటుంది. ఒక చెక్కులో వున్న పేయీ సంతకముగాని, ఎండార్సర్ సంతకముగాని దొంగ సంతకమైన ఎండార్సుమెంటు సక్రమముగా వుండి ఆ సంతకము క్రమవిరుద్ధమైనదనే అనుమానము కలగని పరిస్థితులలో బాంకరు సొమ్ము చెల్లిస్తే చెల్లింపు బాంకరుకు శాసనాత్మక రక్షణ లభిస్తుంది. అయితే చెక్కు కర్త సంతకం ఫోర్జరీ అయితే ఆ రక్షణ లభించదు.

**2. బేరర్ చెక్కుల విషయములో శాసనాత్మక రక్షణ:**

సెక్షన్ 85 (2) ప్రకారం "చెక్కు మొదట బేరర్ చెక్కు అయితే ఆ చెక్కు సొమ్ము సక్రమముగా చెల్లించడము జరిగితే అటువంటి చెక్కుపై ఎటువంటి ఎండార్స్‌మెంట్లు ఉన్నా, ఆ ఎండార్స్‌మెంట్లు ఇతరులకు బదిలీ చేయడాన్ని నిషేదించినప్పటికి బాంకరు సక్రమముగా చెల్లింపు జేసినట్లు అవుతుంది". ఈ సెక్షన్ ప్రకారము ఒకసారి బేరర్ పత్రము అయితే అది ఎల్లప్పుడు బేరర్ పత్రమే

అవుతుంది. అందుచేత సంపూర్ణ ఎండార్స్‌మెంట్లు అయినాసరే, బేరర్ పత్రాలపై ఎండార్స్‌మెంట్లు సక్రమతకు బాంకరు తనిఖీ చేయవలసిన అవసరము లేదు. అలాంటి చెక్కు దొంగలింపబడగా ఆ విషయము తెలియని బాంకరు దానిని చెల్లిస్తే ఈ సెక్షను ప్రకారం బాంకరుకు బాధ్యత వుండదు.

**3. క్రాస్ చేయబడిన చెక్కుల విషయములో బాంకరుకుగల శాసనాత్మక రక్షణ:**

డ్రాయర్ ఆదేశం మేరకు క్రాస్ జేసి చెక్కులు చెల్లించాల్సిన బాధ్యత చెల్లింపు బాంకరుకు వున్నది. ఈ విధముగా జేస్తే అతనికి సెక్షన్ 128 క్రింద రక్షణ లభిస్తుంది. అయితే క్రింది రెండు అంశాలను నెరవేర్చిన తరువాతనే అలాంటి చెక్కులను చెల్లించాల్సి వుంటుంది.

(a) సక్రమచెల్లింపును జేసివుండాలి. (సెక్షన్ 10)

(b) క్రాసింగ్ సూత్రాల కనుగుణముగా చెల్లింపు జరిగి వుండాలి (సెక్షన్ 126) సెక్షన్ 126 ప్రకారము "చెక్కును సాధారణ క్రాసింగ్ జరిగినట్లైతే, చెల్లింపు చేయవలసిన బాంకరు చెక్కుసొమ్మును మరొక బాంకరుకు మాత్రమే చెల్లించాలి. చెక్కుకు ప్రత్యేక క్రాసింగ్ జరిగినట్లైతే చెల్లింపు చేయవలసిన బాంకరు చెక్కు సొమ్మును ప్రత్యేక క్రాసింగ్‌లో ఉదహరించిన బాంకరుకుగాని, అతడు వసూలు నిమిత్తం నియమించిన మరొక బాంకరుకు మాత్రమే చెల్లించాలి".

చెల్లింపు బాంకరు సక్రమముగాలేని ఎండార్సుమెంటుతోగాని, ప్రధానమైన మార్పుతోగాని, డ్రాయరు సంతకం ఫోర్జరీతో గాని ఉన్న క్రాస్ జేసిన చెక్కును చెల్లిస్తే, అతను జేసిన అవకతవకలకు ఈ చట్టము క్రింద అతనికి శాసనాత్మక రక్షణ ఉండదు.

## 15.5. వసూలు బాంకరు, అతని విధులు:

ఖాతాదారు తరపున చెక్కులను వసూలు జేయడం బాంకరు నిర్వర్తించే అనుషంగిక విధులలో ముఖ్యమైనది. ఈ విధిని నిర్వర్తించేటప్పుడు బాంకరు వసూలు బాంకరుగా వ్యవహరిస్తారు. ఈ బాధ్యతను నిర్వర్తించేటప్పుడు బాంకరు చాల జాగ్రత్తగా మెలగవలసివుంటుంది. లేనియెడల అతడు చాల ఇబ్బందులలో పడే అవకాశము వున్నది.

వసూలు బాంకరు ఖాతాదారుల చెక్కులపై డబ్బు వసూలు జేసేటప్పుడు కొన్ని సందర్భాలలో విలువ నిమిత్తము పత్రాలు పొందినవానిగ, మరికొన్ని సందర్భంలలో ఖాతాదారు ఏజెంటుగ వ్యవహరిస్తాడు. ఖాతాదారు ఏజెంటుగా వ్యవహరించేటప్పుడు బాంకరుకు చట్టబద్ధమైన రక్షణ లభిస్తుంది. కాని విలువ నిమిత్తం పత్రము పొందిన వానిగా వ్యవహరించేటప్పుడు చట్టబద్ధమైన రక్షణ లభించదు.

**i) విలువనిమిత్తము పత్రం పొందినవానిగ (బిల్లుదారుగా) వసూలు బాంకరు:**

చెక్కుల వసూలుకు కొంత సమయం పడుతుంది. డ్రాయీ బాంకరునుండి చెక్కు వాస్తవముగా వసూలు కాకపూర్వమే వసూలు బాంకరు ఆ చెక్కు మొత్తాన్ని ఖాతాదారునికి చెల్లించడముకాని, లేదా ఆ మొత్తాన్ని అతని ఖాతాకు క్రెడిట్ జేసి వాడుకోవడానికి గాని అనుమతించడం జరిగితే వసూలు బాంకరుకు విలువనిమిత్తము పత్రం పొందిన వానిగా భావించవచ్చును. క్రింద జెప్పిన పరిస్థితులలో బాంకరు విలువ నిమిత్తం పత్రం (బిల్లుదారుడు) పొందినవాడవుతాడు.

(a) వసూలుకు పంపిన చెక్కు ఆసరాగా మరింత అప్పుగా ఇచ్చినప్పుడు

(b) వసూలుకు పంపిన చెక్కు వసూలు కాకుండానే చెక్కు మొత్తాన్ని చెల్లించినప్పుడు లేదా కొంత సొమ్మును ఖాతాలో జమజేసి కొంత సొమ్మును నగదులో చెల్లించినప్పుడు

(c) చెక్కు డబ్బు వసూలుకాక పూర్వమే వెంటనేగాని లేదా తరువాతగాని ఖాతాదారు అట్టి డబ్బును తీసికోవచ్చని బాంకరు అంగీకరించినప్పుడు

(d) వసూలు నిమిత్తము చెక్కును కౌంటర్‌వద్ద డిపాజిట్ చేయగానే నగదుకు ఇచ్చివేయడం ద్వార

(e) ప్రస్తుతమున్న ఓవర్ డ్రాఫ్టును తగ్గించడానికి చెక్కులను ఆమోదించడం ద్వారా

**(ii) వసూలు బాంకరు ఖాతాదారుని ప్రతినిధిగా వ్యవహరించుట:**

ఖాతాదారుని తరపున బాంకరు ప్రతినిధిగా వ్యవహరించినప్పుడు డ్రాయీ బాంకరునుండి చెక్కు పైకము వసూలైన తరువాత ఖాతాదారుని ఖాతాకు జమచేయడం జరుగుతుంది. తరువాత ఖాతాదారుడు ఆ పైకమును తీసికొనవచ్చును. ఇటువంటి సందర్భములలో బాంకరు ఖాతాదారునికి ఏజంటుగా వ్యవహరిస్తాడు. అట్లాంటప్పుడు చెక్కులమీద ఖాతాదారునికే హక్కులేనప్పుడు బాంకరుకు కూడ వుండదు. ఖాతాదారుని హక్కు దోషభూయిష్టమైతే, బాంకరుకు రిస్కు ఏర్పడుతుంది. దానిని వసూలు జేసినట్లయితే, యదార్థ సొంతదారునికి చెల్లింపు బాధ్యత వహించవలసి వుంటుంది. వసూలు జేసిన చెక్కు తన ఖాతాదారునికి చెందకపోతే ద్రవ్యమార్పిడి (Conversion of money) కి బాంకరు బాధ్యత వహించాల్సివుంటుంది.

**(iii) వసూలు బాంకరుచే మార్పిడి:**

అసలు హక్కుదారు స్వాధీనపు హక్కుకు భంగం కలిగించే విధముగా, ఇంకొకరి ఆస్తిలో జోక్యం కలుగజేసుకోవడము మార్పిడి అంటారు. అనగా ఎవరైన న్యాయవిరుద్ధంగా ఇతరుల వస్తువులను తీసికోవడము, వాడకోవడము, అమ్ముకోవడము, పాడుజేయడము మొదలైన పనుల ద్వార అసలు హక్కుదారుని హక్కులకు భంగం కలిగిస్తే, అసలు హక్కుదారు ఆ పనులకు బాధ్యుడైన వ్యక్తిమీద మార్పిడి అనే నేరానికి దావావేయవచ్చును. ఒకరి వస్తువులను తీసికొని, వాటిని ఇతరుల ప్రయోజనము కోసము కాని, స్వంత ప్రయోజనము కోసంగాని ఉపయోగిస్తే, ఎలాంటి సదుద్దేశముతో ఆ పనిని జేసినప్పటికి మార్పిడి జేసినందుకు అసలు హక్కుదారుకు బాధ్యుడవుతాడు. మార్పిడి సూత్రము వస్తువుల విషయములోనే కాకుండ చెక్కు, ప్రామిసరి నోటు బిల్లుల విషయములోకూడా వర్తిస్తుందని తీర్పు ఇవ్వడం జరిగినది. ఖాతాదారుని తరపున చెక్కులను వసూలు జేసేటప్పుడు వాటిపై ఖాతాదారునికి సరైన హక్కులేకపోతే బాంకరు మార్పిడి నేరానికి గురికావలసి వుంటుంది. ఇలాంటి ప్రమాదమునుంచి బాంకరును తప్పించడం కోసము చట్టము శాసనాత్మక రక్షణను కల్పించింది.

## 15.6. వసూలు బాంకరుకు శాసనాత్మక రక్షణ:

ఖాతాదారుని ఏజంటుగా మార్పిడిలో ఇమిడివున్న నష్టభయాన్ని నివారిచేందుకు వసూలు బాంకరు తగిన జాగ్రత్తలు తీసికోవలసి వుంటుంది. కాని ఖాతాదారుని హక్కు బిల్లుచాటును, అందునా రోజువారీ వ్యాపార సరళిలో ఎన్నో చెక్కులను వసూలు జేయాల్సి ఉన్నప్పుడు, ప్రతి వ్యవహారమును క్షుణ్ణంగా పరిశీలించడము వసూలు బాంకరుకు చాల కష్టమైనపని.

నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంటు చట్టములోని సెక్షన్ 131 ప్రకారము "సాధారణ క్రాసింగ్ గాని, తనపేర స్పెషల్ క్రాసింగ్ కాని ఉన్న చెక్కును సంపూర్ణ విశ్వాసముతోను అలక్ష్యం లేకుండాను వసూలు జేసిన బాంకరుకు, అలాంటి చెక్కుకు సంబంధించిన హక్కులో లోపము వుంటె, ఆ చెక్కు మొత్తం వసూలు జేసిన కారణముగా చెక్కు అసలు హక్కుదారునకు ఎలాంటి చెల్లింపు బాధ్యతను వహించనక్కరలేదు".

పైన తెల్పిన ప్రకారం బాంకరు శాసనాత్మక రక్షణను పొందాలంటె క్రింది షరతులను పాటించాలి.

**1. చెక్కుకు క్రాసింగ్ జరిగివుండాలి:** వసూలు బాంకరు పేరున సాధారణంగాగాని, ప్రత్యేకంగాగాని చెక్కులను క్రాస్ జేసి ఉన్నప్పుడే శాసనాత్మక రక్షణ లభిస్తుంది. క్రాస్ జేయని చెక్కుల విషయములో రక్షణ లభించదు. వసూలు బాంకరుకు వచ్చినప్పుడే చెక్కుపై క్రాసింగ్ వుండాలి. బాంకరు క్రాసింగ్ జేస్తే ఇలాంటి రక్షణ వుండదు.

**2. ఖాతాదారుని కొరకు చెల్లింపు మొత్తాన్ని పొంది వుండాలి :** బాంకరు ఖాతాదారు తరుపున వసూలు జేసే చెక్కులకు మాత్రమే అనగా ఖాతాదారుని ఏజెంటుగా వ్యవహరిస్తున్నప్పుడు మాత్రమే ఇలాంటి రక్షణ వుంటుంది. సాధారణ లేక ప్రత్యేక క్రాసింగ్ జరిగిన చెక్కును మంచి ఉద్దేశ్యంలో ఏ మాత్రం అజాగ్రత్త లేకుండ బాంకరు వసూలు జేసినప్పుడు ఆ చెక్కు లోపభూయిష్టమైనదని తరువాత తెలిసినప్పటికి బాంకరుకు రక్షణ లభిస్తుంది. వసూలు జేసి ఆ తువాత సొమ్మును ఖాతాలో క్రెడిట్ జేసినా, లేదా సొమ్మును ఖాతాలో క్రెడిట్ జేసి తరువాత వసూలు జేసినా పై పరిస్థితిలో ఏ మార్పు ఉండదు.

**3. చెల్లింపు మొత్తం మంచి ఉద్దేశ్యంతో, అలక్ష్యంలేకుండా వచ్చి వుండాలి:** బాంకరు సదుద్దేశంతోను, అలక్ష్యం లేకుండాను వ్యవహరించాలి. బాంకరు అలక్ష్యం జేశాడా లేదా అనేది ఆయా పరిస్థితులపై ఆధారపడివుంటుంది. అలక్ష్యము అనగా చేయవలసిన పనిని చేయక పోవడము. చేయకూడని పనిని జేయడం.

క్రింది సందర్భాలలో అలక్ష్యం మూలముగా వసూలు బాంకరు శాసనాత్మక రక్షణ కోల్పోతాడు.

**1. సరైన విచారణ లేకుండా వ్యక్తి ఖాతాను ఏర్పాటు జేయుట :** సరైన, సంతృప్తికరమైన వ్యక్తి పరిచయంలేకుండానే అనుచితమైన వ్యక్తి పేరున ఖాతాను బాంకరు తెరిస్తే బాంకరు అలక్ష్యం ప్రదర్శించినట్లు అవుతుంది. కాబట్టి కొత్తగా ఖాతాను ప్రారంభించే వ్యక్తిని, అంతకు పూర్వమే బాంకు వద్ద ఖాతాలు కలిగిన రెఫరెన్సులను ఇవ్వవలసినదిగా బాంకరు కోరాలి. అలాంటి 'రెఫరీ' బాంకరుకు బాగుగా తెలిసివుండాలి. లేకపోతే రెఫరి గురించి బాంకరు విచారించాలి. లేకపోతే బాంకరు అలక్ష్యంగా వ్యవహరించినట్లవుతుంది.

**2. చెక్కుపై ఎండార్స్‌మెంట్లు పరిశీలన:** చెక్కులపైన ఎండార్స్‌మెంట్లు సక్రమముగా ఉన్నాయో లేదో పరిశీలింపకపోవడాన్ని అలక్ష్యంగా పరిగణించవచ్చును.

**3. కంపెనీల పేరిట రాసిన చెక్కులను సొంత ఖాతాలో జమకట్టుట:** కంపెనీల పేరిట రాసిన చెక్కులను ఆ కంపెనీ ఉద్యోగస్థులు లేదా డైరెక్టర్లు తమ సొంత ఖాతాలో జమజేయమని బాంకరును కోరినప్పుడు, సరియైన విచారణ జేయనిదే వసూలు బాంకరు అ విధముగా జమజేయకూడదు.

అండర్‌వుడ్ Vs బాంక్ ఆఫ్ లివర్‌పూల్ అను కేసులో కంపెనీ చెక్కులను వ్యక్తి సొంత ఖాతాలో జమచేయడం అలక్ష్యం అని కోర్టు తీర్పుజెప్పినది.

**4. భాగస్వామ్య సంస్థ తాలూకు చెక్కులను భాగస్తుని సొంతఖాతాకు జమజేయుట:**

భాగస్వామ్య సంస్థ పేరున రాసిన చెక్కు ఒక భాగస్థుని సొంత ఖాతాకు జమజేస్తే బాంకరు అలక్ష్యంలో వ్యవహరించినాడని జెప్పవచ్చును.

**5. చెక్కుమీద ఉన్న క్రాసింగ్ పరిశీలన:** చెక్కుమీద వున్న క్రాసింగ్ ద్వారా బాంకుకు ఇచ్చిన ఆదేశాన్ని పాటించకపోతే బాంకరు నిర్లక్ష్యం జేశాడని పరిగణించవచ్చును. అకౌంటు పేయీ క్రాసింగ్‌వున్నప్పుడు వసూలు బాంకరు పేయీ ఖాతాలో గాకుండ ఇంకొక వ్యక్తిఖాతలో జమకట్టవలసివస్తే దర్యాప్తు జేయకపోతే బాంకరు అలక్ష్యం జేశాడని భావించవలెను.

**6. ఖాతాదారుని ఖాతా స్థితి :** ఖాతాదారుని ఖాతా స్థితిని కూడ వసూలు బాంకరు దర్యాప్తు జేయవలసిన అవసరము వుంటుంది. సాధారణముగ చిన్న మొత్తం నిల్వ వుండి, పెద్ద మొత్తానికి ఒక చెక్కు వసూలు నిమిత్తం దాఖలైతే బాంకరు దర్యాప్తు జేయకుండ వ్యవహరిస్తే అలక్ష్యం జేశాడని నిర్ణయిస్తారు.

## స్వయం మధింపు ప్రశ్నలు (Sealf Assessed quetions)

### 5 మార్కులు

1. వసూలు బాంకరు బాధ్యతలు
2. చెల్లింపు బాంకరు బాధ్యతలు

### 10 మార్కులు

1. భారతదేశములో వసూలు బాంకరుకు కల్పించబడిన చట్టబద్ధమైన భద్రత గురించి క్లుప్తముగా చర్చించండి.

**20 మార్కులు:**

1. వసూలు బాంకరు అనగా ఎవరు? వసూలు బాంకరు యొక్క విధులు మరియు బాధ్యతలను క్లుప్తముగా చర్చించండి?
2. అలక్ష్యము వలన వసూలు బాంకరు ఏ ఏ సందర్భాలలో శాసనాత్మక రక్షణ కోల్పోతాడు ?
3. ఒక చెక్కుపై చెల్లింపును బాంకరు ఎప్పుడు నిరాకరించవచ్చును ?
4. చెల్లింపు బాంకరు అనగా నేమి? చెల్లింపు బాంకరు యొక్క విధులు మరియు బాధ్యతలను గురించి చర్చించండి.
5. చెల్లింపు బాంకరు హక్కులు మరియు విధులు తెల్పుము?

**సిఫారసు చేయబడిన పుస్తకాలు:**


1. బాంకింగ్ సిద్ధాంతము - ఆదరణ — ఆచార్య K.V. రావు, డా. Y.S.కిరణ్మయి, డా. వి. సి. రాయుడు
2. బాంకింగ్ విత్తవ్యవస్థలు — కళ్యాణి పబ్లిషర్స్
3. బాంకింగ్ విత్తవ్యవస్థలు — తెలుగు అకాడమి
4. బాంకింగ్ విత్తవ్యవస్థలు — జైభారత్ పబ్లిషర్స్


Dr. D. Ramulu